తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ముద్రించబడిన గ్రంథం

హిందూ వివాహం మరియు జీవన విధానాల జీవిత విశిష్టతల విజ్ఞాన సర్వస్వం

వివాహవేదం



సింహప్రసాద్

అంకితం



నా అర్ధాంగి

శ్రీమతి చెలంకూరి శ్రీహరి కుసుమాంబ కు

ప్రేమతో

— ప్రసాద్

వివాహవేదం

సింహప్రసాద్



శ్రీశ్రీ ప్రచురణలు

401, మయూరి ఎస్టేట్స్, MIG-II-650,
టెంపుల్ బస్టాండు దగ్గర, కె.పి.హెచ్.బి.కాలనీ,
హైదరాబాద్ – 500 072
ఫోన్ : 23157608, 98490 61668

VIVAHAVEDAM
By Simha Prasad
Email : Simhaprasad@yahoo.com

© గ్రంథకర్త

ముద్రణ:
జూన్ : 2009

ప్రతులు : 1000

వెల: **రు. 200/-**

డి.టి.పి:
బొబ్బిలి రత్నకుమారి
కొమ్మి జ్యోతి
బండి రాజేంద్రప్రసాద్

ముఖచిత్రం : **దివ్య, సుభాష్ చంద్ర**


కవర్ డిజైన్ & ప్రింటర్స్
అనుస్వర క్రియేషన్స్
7-1-304/ఇ/11
సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్.
ఫోన్ : 9701114399

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
మరియు
సింహప్రసాద్
401, మయూరి ఎస్టేట్స్.
MIG-II-650, KPHB,
హైదరాబాద్ - 500 072
సెల్ : 98490 61668

విజ్ఞప్తి

ఈ గ్రంథం మీద వచ్చే విమర్శలకు చట్టరీత్యా తీసుకునే చర్యలకు పూర్తి బాధ్యత నాదేననీ ఈ విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారికి ఎలాంటి బాధ్యతాలేదని ఇందుమూలముగా తెలియజేస్తున్నాను.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో ముద్రించబడినది



ఎందరో మహానుభావులు...

వేదాలు ఉపనిషత్తులు శ్రుతులు ఋషిప్రోక్తాలు పురాణాలు ఇతిహాసాలు శాస్త్రాలు ధార్మికగ్రంథాలు వివిధ వ్యాఖ్యానాలు టీకాతాత్పర్యాలు ప్రముఖుల వ్యాసాలు ఉపన్యాసాలు చర్చలు పండితుల ఆలోచనలు అభిప్రాయాలు... ఎన్నో ఎన్నెన్నో!

వాటి

అ

మృ

త

ధా

ర

ను

నా చిన్ని దోసిలితో పట్టి ఈ గ్రంథానికి ప్రాణప్రతిష్ఠ చేయడం జరిగింది. ఈ గ్రంథపు ఘనతంతా వారిదే. ఆ మహర్షులదే. ఆ దార్శనికులదే. ఆ మహామహులదే.

వారందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను.

ఈ గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహాయం అందించిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికీ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ కె.వి.రమణాచారి, **I.A.S** గారికీ ప్రధాన సంపాదకులు శ్రీ సి. శైలకుమార్ గారికీ, సంపాదకులు శ్రీ ధారా సుబ్రహమణ్యం గారికీ, సెలక్షన్ కమిటీ వారికీ, ఇతర సిబ్బందికీ నా కృతజ్ఞతాభివందనాలు.

తొలి పలుకులు రాసిన ప్రఖ్యాత సాహితీ వేత్తలు డా. పోరంకి దక్షిణామూర్తి, డా. వేదగిరి రాంబాబు, గార్లకు హృదయ పూర్వక కృతజ్ఞతాంజలి.

ఈ గ్రంథ రచనాయజ్ఞంలో తోడ్పడిన వారూ ప్రోత్సహించినవారూ ఎందరో ఎందరెందరో !

. . . అందరికీ వందనాలు !

– గ్రంథకర్త

ఇందులో ....

'వివాహవేదం' గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీ పురస్కారం (2010)ి స్వీకరిస్తున్న రచయిత



నూరేళ్ళ పంట

'యదేత్ హృదయం తవ తదస్తు హృదయం మమ

యదిదం హృదయం మమ తదస్తు హృదయం తవ'

వివాహమంత్రాల్లో గొప్ప మంత్రమిది. వివాహకాండలోని ఒక ఘట్టంలో, పెళ్లికొడుకు, పెళ్లికూతురి ఎదురు రొమ్మును తాకేలా చెయ్యిపెట్టి ఈ మంత్రం అంటాడు. "ఆ నీ హృదయం, నా హృదయం కావాలి. ఈ నా హృదయం నీ హృదయం కావాలి," అన్నది దీనికి అర్థం. వధూవరుల్లో ప్రతి ఒక్కరూ ఆకాంక్షించే విషయాన్నే మంత్రరూపంలో నిక్షిప్తంచేశారు మహర్షులు. ఏ ఒక్కటి ఉంటే అన్నీ ఉన్నట్లవుతుందో – అన్నీ అమరి ఉంటాయో – ఆ ఒక్కటి లేకపోతే తక్కినవేవీ ఉండవు గదా! అందువల్ల మనిషి జీవితంలో హృదయానికంత ప్రాముఖ్యం ఉంది. జీవితపు బండికి అదే ఇరుసు. మహర్షులకు అది తెలుసు.

అంతకు ముందు 'నీ–నా' లుగా చెప్పుకొన్న హృదయాలు ఇప్పుడు వెనకటి చోట్ల ఉండవు. 'నీ–నా' అవుతుంది; 'నా–నీ' అవుతుంది. నూరేళ్ళ 'నిత్తెపంట' కోసం ఈ గుండెమార్పిడి అవసరమన్నమాట! అటుమీదట జరిగేది ఏమిటి? 'నీ–నా' లు మిగలవు; పాలల్లో పంచదార అయిపోతాయి. అదుగో–అందుకూ పెళ్ళి! ఈ మంత్రంలో అంత గొప్ప రహస్యముంది. గుప్తమయిన శుభాకాంక్ష ఉంది. అంతకంటె కావలసినదేముంది?

ఇటువంటి అద్భుతమయిన మంత్రాలతో జరిగే పెళ్ళికి ఎంతో విశిష్టత ఉంది. మంత్రాలతో బాటు పురోహితుడు కొన్ని 'తంతులు' కూడా జరిపిస్తాడు. మంత్రంలేని తంత్రానికి విలువలేదు. మంత్రం ఋషిప్రోక్తం. దానిలో కొన్ని కొన్ని బీజాక్షరాలు నిక్షిప్తమయి ఉంటాయి. బీజాక్షరాలకు శబ్దస్పందనం ఉంటుంది. శబ్దం ఆకాశగుణకం. శబ్ద ప్రసారణం దేవతలకు ఆహ్వానం పలుకుతుంది. వాళ్ళచేత దీవనలు కురిపిస్తుంది. వివాహవేదిక పరిసరాలను ప్రసన్న మధురం చేస్తుంది.

పెళ్లిమంత్రాల్లో కొన్నిటిని, పురోహితుడు పెళ్ళికొడుకు చేత చెప్పిస్తాడు. వాటిని సరిగా పలకాలి; తప్పు పలికితే హాని జరగవచ్చు; అర్థంమారి పోవచ్చు. కాబట్టి కొందరి పెళ్ళిళ్ళలో కొన్ని మంత్రాలను విడిచిపెడతారు, పురోహితులు. తంతు మాత్రం బాగా జరిపిస్తారు. మంత్రప్రాముఖ్యం తెలియనివాళ్ళు అందరూ తంతుతోనే తృప్తిపడతారు. అయినా మంత్రాలకూ తంత్రాలకూ ఉన్న అంతరార్థాలను తెలుసుకోగలిగితే ఎంతో ఆనందం కలుగుంతుంది; వివాహసంస్కారం విలువ తెలుస్తుంది.

మిత్రులు సింహప్రసాద్‌గారు భారతీయ వివాహసంస్కారం విలువ బాగా తెలిసినవారు; దీన్ని పదిమందికీ తెలియజెప్పాలన్న సత్సంకల్పం ఉన్నవారు. కాబట్టి **'వివాహవేదం'** గ్రంథరచనకు పూనుకొన్నారు. వివాహ విషయపరంగా ఇంతవరకు ఎవరూ రాయనంత పెద్ద గ్రంథం (526 పుటలు) రచించడం ప్రశంసనీయమయిన విషయం.

ఇందులో 'శ్రీకారం' మొదలు ముగింపు వరకు 73 అధ్యాయాలున్నాయి. కేవలం వివాహకాండ మట్టుకే అయితే ఇంత గ్రంథం రాయడం సాధ్యమయేది కాదు. మానవసమాజంలో వైయక్తిక, సాముదాయిక అవసరాలనూ అనుబంధాలనూ, ఏర్పరుచుకొనే సంబంధాలనూ దృష్టిలో పెట్టుకుని వివాహం చుట్టూ అల్లుకొని ఉన్న అనేక అంశాలను విడబరిచి చూపిస్తూ, ఒక్కొక్క విషయాన్ని స్పష్టంగా వివరిస్తూ మానవజీవితానికి సంబంధించిన సమస్తాంశాలనూ పొందుపరచిన గ్రంథమిది. మన కళ్యాణ సంస్కృతికి సంబంధించినది, దీనిలో చేరనిది ఏదీ లేదు. మంత్ర తంత్రాలతో ప్రమేయం లేకుండా లౌకికమయిన గుర్తింపుకోసం జరిగే పెళ్ళిళ్ళ విధానాలను గురించి కూడా ఇందులో చెప్పారు. రకరకాల ఆనవాయితీలు, పెళ్ళిళ్ళ ఖర్చులు, నవదంపతుల విహారయాత్రలు, దాంపత్యజీవితం, పిల్లల పెంపకం, వృద్ధాప్యం మొదలయిన అంశాలన్నిటినీ సవిస్తరంగా చర్చించారు రచయిత.

వివాహం చేసుకోబోయే యువతీయువకులే కాక, ఎప్పుడో చేసుకొని పిల్లల్ని కన్నవాళ్ళు కూడా చదివి తెలుసుకోవలసిన సంగతులు ఈ గ్రంథంలో ఎన్నో ఉన్నాయి.

అందరికీ ఉపయోగపడే విధంగా ఇంత చక్కని గ్రంథం రచించినందుకు సింహప్రసాద్ గారిని అభినందిస్తున్నాను.

మంగళం మహత్

శ్రీ శ్రీ శ్రీ

02.05.09. **డా. పోరంకి దక్షిణామూర్తి**

వివాహితులకేకాదు బ్రహ్మచారులకూ మార్గదర్శి 'వివాహవేదం'

'పెళ్ళి – దాని పుట్టుపూర్వోత్తరాలు' ఇంతకు ముందు తాపీ ధర్మారావు గారి పరిశోధనా గ్రంథం వచ్చింది. ఇప్పుడు సింహప్రసాద్‌గారి **'వివాహవేదం'** వస్తోంది. సమాచారాన్నందించడంలో రెండింటిలోనూ తేడా ఉంది. అందుకే ఈ గ్రంథాన్ని కూడా మనం ఆహ్వానించాలి.

పెళ్ళనేది రెండక్షరాల మాటే అయినా రెండు జీవితాల్ని ఒకటిగా చేసేది. మరికొన్ని జీవితాల పుట్టుకకు కారణభూతమైంది. కొన్ని కోరికలకు పరిమితులు విధించేది. సమాజాన్ని ఒక కట్టుబాటులో ఉంచేది. ఆనంద సమాజంతో పాటు ఆరోగ్యకర సమాజానికి కావలసింది. కొన్ని బాధ్యతల్ని వ్యక్తులకాపాదించేది. ముందు తర భద్రతకి కావలసింది.

ఇంతటికి కారణమైన ఆ పెళ్ళి గురించి ఎంత ఎక్కువగా తెలుసుకుంటే అంత మంచిదనే ఉద్దేశంతో సింహప్రసాద్ గారు పెళ్లి గురించిన భిన్నకోణాల్ని మన ముందుంచారు ఈ గ్రంథం ద్వారా. స్వతహాగా మంచి వచన రచయిత కావడంతో తాము చెప్పదల్చుకున్న విషయాల్ని ఒక క్రమం ప్రకారం, ఆసక్తిగా చదివే విధంగా మలిచారు. అందరూ చదువుకుని, అన్ని విషయాల్ని తెలుసుకోవాలనేదే ఆయన ఆశ, ఆశయం కూడా అనిపిస్తుంది.

పెళ్ళంటే ఏమిటనే విషయంతో ప్రారంభించి వివాహం గురించిన వివిధ విషయాల్ని చెప్పడంతో పాటు, ఆతర్వాత కూడా పెళ్ళికి సంబంధించిన దాంపత్యం కుటుంబ కలహాలు, విడాకులు, మాతృత్వం, పిల్లల పెంపకం, సంతాన కర్తవ్యంలాంటి విషయాల్ని చర్చించారు కాబట్టి వివాహితులు, బ్రహ్మచారులు, పిల్లలు – అందరూ తెలుసుకోవలసిన 73 అధ్యాయాలతో సింహప్రసాద్‌గారు ఈ వివాహవేదాన్ని చెప్పారు.

సామాజిక బాధ్యతగా సింహప్రసాద్‌గారు ఈ గ్రంధాన్ని తీసుకురావడం హర్షణీయం. ఆయన అభినందనీయులు.

'శ్రీశ్రీ ప్రచురణలు' అని పెట్టి శ్రీశ్రీ శతజయంతి సంవత్సరంలో ఈ గ్రంథాన్ని తీసుకురావడం బాగుంది.

శుభం!

04.05.09 **డా. వేదగిరి రాంబాబు**

ఒక నివేదన

జీవిత పరమావధికి పెళ్లి ముఖ్యం. అవశ్యం.

జీవితానికి అర్థం జీవనానికి పరమార్థం వెరశి బతుక్కి భాష్యం చెప్పి దిశా నిర్దేశం చేసేది పెళ్లే!

పెళ్లంటే బాజాలూ భజంత్రీలూ కాదు.

అదొక మహాసంగమం. మహోన్నత సంకల్పం. ఒక జీవనయజ్ఞం!

పెళ్లంటే మూడు ముళ్ళు ఏడు అడుగులు వెరశి 'పది'కాలాల పచ్చని జీవితం!

మనిషి జీవితం పెళ్లితో సంపూర్ణత్వాన్ని సంతరించుకుంటుంది. అనంత జీవన యానానికి ఒక తోడు, ఒక నీడ, ఒక బలం, ఒక విమర్శ, ఒక జలం, ఒక జీవం, ఒక స్ఫూర్తి, ఒక లక్ష్యం, ఒక సుఖం, ఒక దుఃఖం, ఒక సంతోషం, ఒక విచారం అన్నీ ఇస్తుంది. నడిపిస్తుంది. నవ్విస్తుంది. ఏడిపిస్తుంది. నియంత్రిస్తుంది. బాధ్యతల కొలిమిలో కాలుస్తుంది. మోక్షగామిని చేస్తుంది.

కామికానిదే మోక్షగామి కాలేడు. భోగి కానిదే యోగి కాలేడు. అందుకే పెళ్లి ఒక భోగం. ఒక యోగం. ఒక జీవన సంస్కారం!

అనుభవించాలి. అగ్నిలో కాలాలి. అప్పుడే అసలు బంగారం నిగ్గు తేలుతుంది. కావాల్సిన రూపాన్ని సంతరించుకుంటుంది. వన్నె కెక్కుతుంది.

పెళ్లంటే బాధ్యతల సమ్మేళనం. సంతానాన్ని పెంచి ఉత్తములుగా తీర్చిదిద్ది సమాజానికి సమర్పించడం. సమాజ వికాసానికి లోకకళ్యాణానికి తోడ్పడటం. అర్థకామాలను సాధిస్తూనే ధర్మబద్ధ జీవితం గడపడం. జీవితం పొద్దువాలేసరికి ఆధ్యాత్మిక సంపద కూడ బెట్టుకుని మరణానంతర మోక్షానికి మార్గం సుగమం చేసుకోవడం!

మనిషి పుట్టుకనుంచి మరణం వరకూ సమస్తమూ పెళ్లితోనే ముడివడ్డాయి. పెళ్లి గురించి చెప్పడమంటే మనిషి జీవితాన్ని ఆవిష్కరించడమే!

అలాటి పెళ్లి యొక్క విశ్వరూపాన్ని మనిషి వివిధ దశల మీద దాని ప్రభావాన్ని దాని మూలంగా సంక్రమించే బంధాలను అనుబంధాలను బరువుల్ని బాధ్యతల్ని వివరించడమే ఈ రచన ఉద్దేశం.

హిందూ వివాహకాండ, వివాహ లక్ష్యం, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, గృహస్థధర్మం, కుటుంబ వ్యవస్థ, జీవన విధానం, జీవిత దృక్పథం, వానప్రస్థం – మొదలైన వాటి మూలాలను ముఖ్య భావనలను ఆధునిక దృష్టితో ఈనాటి తరానికి పరిచయం చెయ్యాలన్న దృఢ సంకల్పంతో రెండేళ్ళు కృషి చేసి దీనిని రచించడం జరిగింది.

ఒక్క మాటలో చెప్పాలంటే Encyclopedia of Hindu marriage and life గా ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దటానికి ప్రయత్నించడం జరిగింది.

వివాహం మహా సంస్కారం. స్త్రీ పురుషుల దాంపత్య ధర్మాచరణకు ప్రార్థనా గీతం!

సమాజ వికాసానికి గృహస్థాశ్రమం కీలకమైంది.

ధర్మ నిర్వహణకు స్త్రీ పురుషుల్ని సంఘటితం చేసేది వివాహవ్యవస్థ. ప్రేమ సూత్రంతో ఒక్కటై జీవిస్తారు. సుఖదుఃఖాలను పంచుకుంటూ జీవితపు ఆటుపోట్లను కలిసి ఎదుర్కొంటారు. అతిథి బంధువులను ఆదరిస్తారు. సంతానాన్ని ఉత్తములుగా తీర్చిదిద్దుతారు. తద్వారా మానవ కళ్యాణానికి తోడ్పడతారు.

వివాహ కాండలోని ప్రతి క్రియకూ అంశానికీ ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రాముఖ్యత ఉంది. ముందు చూపు ఉంది. మేలుకొలుపు ఉంది. ఆకాంక్షలేకాదు ఆంక్షలూ ఉన్నాయి.

వాటిని సామాన్యులకు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉంది. అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉంది.

దేవభాష సంస్కృతంలో ఉన్న మంత్రార్థాలు తెలిసినప్పుడే 'మంత్రమహత్తు' బోధపడుతుంది. వివాహకాండ గొప్పతనం అర్థమవుతుంది. మహర్షులూ మహాత్ములూ వేదవిద్యావేత్తలూ అందించిన విజ్ఞానం మంత్రాల ద్వారా ఈ తరానికి వారి ద్వారా తర్వాతి తరానికి అందుతుంది. సంస్కృతి జీవనదియై ప్రవహిస్తూ ప్రవహించినంత మేరా జీవితాన్ని సుసంపన్నం సస్యశ్యామలం చేస్తుంది.

ప్రపంచంలో ఎన్నో జాతులున్నాయి. ఎన్నో రకాల వివాహాలున్నాయి. కాని హిందూ వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థతో పోటీ పడగలవి ఎక్కడాలేవు. మనది యుగయుగాలుగా రాటుదేలిన సుదృఢ వ్యవస్థ. పాశ్చాత్యుల్ని ఆకర్షించి అనుసరించ డానికి ప్రేరేపిస్తోన్న ఉత్కృష్ట సంస్కృతి. ఇది ప్రతి హిందువూ గర్వించాల్సిన విషయం.

వివాహ శ్లోకాలు, వివాహ సమయంలో పాటించాల్సిన విధులు, వివాహ విధానం, సంసార జీవనం, కుటుంబ బాధ్యతలు, భార్యాభర్తలు అనుబంధం, సంతాన బాధ్యతలు, ధర్మార్థ కామమోక్షాలు, వయస్సు లక్షణాలు, ఆధ్యాత్మిక చింతన, మరణానికి సన్నద్ధత – వగైరాల గురించి వేదాల్లో ఉపనిషత్తుల్లో ధర్మాశాస్త్రాల్లో పురాణాల్లో ఎన్నెన్నో రత్నమాణిక్యాలున్నాయి. సుభాషితాలున్నాయి. వ్యాఖ్యానాలున్నాయి.

వాటన్నిటినీ సేకరించి క్రోడీకరించి నేటికాలమాన పరిస్థితులకు తగ్గట్టు నవీన దృక్పథాన్ని జోడించి రచించిన మహాగ్రంథం 'వివాహవేదం'.

ప్రతివారికీ అర్థమయ్యేలా సులభశైలిలో ప్రతి అంశం గురించీ విభిన్న అభిప్రాయాలను పొందుపరుస్తూ హిందూసంస్కృతి యొక్క త్రివిక్రమస్వరూపాన్ని ఆవిష్కరించడం – సూక్ష్మంగానే అయినా – జరిగింది.

వివాహం చర్య అయితే సంతానం, కుటుంబం ప్రతిచర్య.

సంతానం, కుటుంబం చర్య అయితే నైతికవర్తనం, ఉన్నతజీవనం ప్రతిచర్య.

జీవితం చర్య అయితే మోక్షం ప్రతిచర్య

జననానికీ మరణానికీ మధ్యగల అనంత జీవనయాత్రలో ఎన్నోబంధాలు బాధ్యతలు ఆకర్షణలు సంఘర్షణలు ఆటుపోట్లు విషసంస్కృతులు!

వాటిని తట్టుకోవాలి. ఎదుర్కోవాలి. స్థిత ప్రజ్ఞులు కావాలి. హిందూ సంస్కృతిని పరిరక్షించుకోవాలి. అందులోనే మనిషికి రక్షణ ఉంది. శాంతి ఉంది. తృప్తి ఉంది. సార్థకత ఉంది. మోక్షం ఉంది.

అందుకనే వివాహం వైభవంతో పాటు వివాహానంతరం జీవితం గురించీ ఇందులో చర్చించడం జరిగింది. వ్యష్ఠి క్షేమం మీదే సమిష్ఠి శ్రేయస్సు ఆధారపడివుంది కదా!

సంసారం, కుటుంబ వ్యవస్థ, సంతానం, వారి పోషణ, చదువు సంధ్యలు, ధన సంపాదన, పొదుపు, బంధుత్వాలు, బంధాలు, సమాజం యందు గల బాధ్యతలు, నడివయస్సు, వృద్ధాప్యం, వానప్రస్థం, షష్ఠిపూర్తి – మొదలైనవన్నీ కూలంకషంగా వివరించడం జరిగింది.

ప్రతి హిందువూ ధర్మబద్ధమైన సుఖప్రదమైన ఫలవంతమైన జీవితాన్ని జీవించడానికి కావాల్సిన సమస్త విషయాలనీ చర్చించడం జరిగింది.

నిజం చెప్పాలంటే మన సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యాన్ని తెలుసుకోవాల్సిన ఆవశ్యకత, ప్రచారం చెయ్యాల్సిన అవసరం ఇది వరక్కన్నా ఇప్పుడెక్కువగా ఉంది.

ప్రపంచం ఒక కుగ్రామంగా మారిన నేటి కాలంలో ఎన్నెన్నో సంస్కృతుల విభిన్న విషప్రభావాల ప్రభావం అధికంగా ఉంటోంది.

భౌతిక సుఖలాలస తన ఉచ్చులోకి బరబరా లాగేస్తోంది. కళ్ళకు పొరలు కమ్మించి మాయాలోకంలోకి తోస్తోంది. జాతి వ్రేళ్ళను మూలాలను మరపింపజేస్తోంది. మత్తెక్కించి పాశ్చాత్య వ్యామోహప్రవాహంలోపడి కొట్టుకుపోయేలా చేస్తోంది!

విదేశీ పోకడల కారణంగా భిన్న సంస్కృతుల కారణంగా హిందూ వివాహ వ్యవస్థ మీద పెడధోరణుల ప్రభావం పడుతోంది. భార్యా భర్తల బంధాన్ని ఆర్థికబంధంగా మారుస్తోంది. కుటుంబ వ్యవస్థలో చీలికలు తెస్తోంది. పిల్లల్ని పాశ్చాత్య సంస్కృతి లోబరుచుకొంటోంది.

ఈ ధోరణిని అరికట్టాల్సిన అవసరం, మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియ జేయడం ఎంతో అవసరం.

ఉన్నత విలువలు, ఉత్తమ జీవన పద్ధతులు, సత్సంతాన పెంపకం, సమాజాన్ని ఆవరించిన క్షీణ విలువలు - ఇవన్నీ ఇప్పటితరమేగాక ముస్ముందరి తరాలూ తెలుసుకోవడం, సరిదిద్దుకోవడం, సక్రమమార్గాన పయనించడం ఎంతో అవసరం. ఈ దిశగా చేసిని చిరు ప్రయత్నమే ఈ గ్రంథం.

అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు తమ పిల్లల పెళ్లిళ్ళు వేదోక్తంగా మంత్రయుక్తంగా హిందూ ఆచారానుసారం పురోహితుల్ని తీసుకెళ్ళి మరీ చేస్తున్నారు. ఎంచేత? వారి మీద గల సంస్కృతీ ప్రభావం! వారి నరనరంలో ప్రతి రక్తపు బొట్టులో జీర్ణించుకున్న నమ్మకం! సుఖభవిష్యత్తుకు భద్రత భరోసా లభిస్తాయన్న అచంచల విశ్వాసం!

దాన్ని మరింత పెంచి పోషించాలి. యావత్ ప్రపంచంలోనే భారతీయ సంస్కృతి సర్వోత్కృష్టమైందని ప్రపంచం గ్రహించేలా చెయ్యాలి!

హిందూ వేదాంతం భౌతిక సుఖాలకు పెద్దపీట వెయ్యదు. నిధికన్నా రాముని సన్నిధి సుఖమంటుంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక్క కుదుపు కుదిపేసరికి కుదేలై పరుగులు తీస్తోంది పాశ్చాత్య దేశాల జనత. కోట్లు పోయాయని గుండెలు బాదుకుంటోంది. ఎంచేత? ధనం, అవి తెచ్చే సుఖాలే సత్యమని వారి సంస్కృతి వారికి నేర్పిన పాఠం గనుక!

దేశంలోని వారికేగాక ప్రపంచ నలుమూలలకూ విస్తరిస్తోన్న భారతీయులందరికీ హిందూ వివాహం, హిందూ ఆలోచనాధోరణి, హిందూ జీవనాల విశిష్టత తెలియాలి.

వారి జీవితాలూ దృక్పథాలూ గాడి తప్పకూడదు. డబ్బే డాలర్లే ప్రధానం కాదు. కాకూడదు. సత్వగుణ సంపన్నులై ధర్మాచరణతో జీవితాన్ని పండించుకోవాలి.

'బహుజన హితాయ బహుజన సుఖాయ' దిశగా నడచుకోవడంలోనే సార్థకత ఉంది.

ఆ దిశగా ఆలోచించడానికి ఆచరించడానికి ప్రేరేపించడమే ఈ **'వివాహవేదం'** లక్ష్యం.

అందుకే జననం నుంచి మరణం దాకా ప్రతి అంశాన్నీ ప్రతి అడుగునూ స్పృశించడం జరిగింది. ఏది మంచో ఏది చెడో విశ్లేషించడం జరిగింది.

'ఇదీ మహర్షులు వేసిన బాట' 'ఇదీ మన హిందూ సంస్కృతి' – అని తేటతెల్లంగా సగర్వంగా చెప్పడం జరిగింది.

దీనిని పాఠకులు ఆదర్శిస్తారనీ పండితులు ఆశీర్వదిస్తారనీ ఆశిస్తూ ఈ గ్రంథాన్ని మరింత ఉన్నతంగా తీర్చి దిద్దటానికి సలహాలూ సూచనలూ ఇవ్వాల్సిందిగా పాఠకుల్నీ పండితుల్నీ విమర్శకుల్నీ అర్థిస్తూ, ప్రార్థిస్తూ –

– గ్రంథకర్త

‘వివాహవేదం’ గ్రంథ ఆవిష్కరణ



తేది	: 09-08-2009
వేదిక	: సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్
అధ్యక్షులు	: డా. పోరంకి దక్షిణామూర్తి ప్రముఖ రచయిత, విమర్శకులు నిఘంటు నిర్మాత, పూర్వ కన్వీనర్ సాహిత్య అకాడమి తెలుగు సలహా సంఘం
ముఖ్య అతిథి , గ్రంథ ఆవిష్కంర్త	: శ్రీ మునిపల్లె రాజు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
ప్రత్యేక ఆహ్వానితులు	: శ్రీ ఎమ్. గోపాలకృష్ణ రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ డా. వేదగిరి రాంబాబు ప్రముఖ కథానికా రచయిత
నిర్వహణ	: పట్లోళ్ళ భాస్కర్ రెడ్డి, ఎడిటర్, హిందూ వరల్డ్, హైదరాబాద్

'వివాహవేదం' గ్రంథం మీద పత్రికలు కురిపించిన అభినందన వర్షం

పెళ్లి 'చదివి' చూడు!

పెళ్లికి సంబంధించి ఇంతవరకు తెలుగులో వచ్చిన పుస్తకాలు బహుస్వల్పం వచ్చిన కొద్ది పుస్తకాల్లో సమగ్ర సమాచారమున్న పుస్తకంగా దీన్ని చెప్పుకోవచ్చు.

విలువైన వివాహ వ్యవస్థ గొప్పతనాన్ని అందరికీ అర్థమయ్యేంత సులువుగా రచయిత సింహప్రసాద్ 'వివాహవేదం'లో వివరించారు.

73 అధ్యాయాల సుదీర్ఘ గ్రంథాన్ని ఆసాంతం పాఠకుడికి విసుగు లేకుండా చదివించడంలో రచయిత సఫలమయ్యారు. ఒక్క పెళ్లి ప్రస్తావనకు సబంధించిన వివరాలను జొప్పిస్తే దీనికి అంత సమగ్రత వచ్చేది కాదు. మానవ జీవితానికి సంబంధించిన అన్ని అంశాలను సింహప్రసాద్ అత్యంత హృద్యంగా స్పృశించారు.

పుస్తకాన్ని చదవడం ప్రారంభిస్తే ఆపకుండా ఏకబిగిన కొనసాగించేంత సరళంగా ఉంది. దీని శైలి. అంశాల ఎంపిక కూడా ఆలోచించేదిగా ఉంది. జీవిత పరమావధికి పెళ్లి ముఖ్యమైనా అది నూరేళ్ల 'నిత్తె పంట' గా మనడానికి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో ఈ పుస్తకం చక్కగా తెలియజేస్తుంది.

పెళ్లి ఎందుకు చేసుకోవాలి? దానికి అంత ప్రాధాన్యం ఎందుకివ్వాలి? పెళ్లికి సబంధించి ప్రాచుర్యంలో ఉన్న సామెతలు, సూక్తులు లాంటి ఎన్నో అంశాలు ఉ న్నాయి. ఉత్తమ భార్యాభర్తల సమాగమంతోనే పండంటి కాపురంలో వసంతం వెల్లివిరుస్తుంది. దీనికిగాను వారు ఎంతటి సులక్షణ సమన్వితులు కావాలో అర్థవంతమైన వివరణ ఉంది.

నూరేళ్ల జీవితం సాఫీగా ఆనందంగా సాగేందుకు ఎన్నో అంశాలు తోడవుతాయి. ఆరోగ్యం సహకరించాలి. కుటుంబంలో కలహాల ఆనవాళ్లు కనిపించకుండా ఉండాలి. మాతృత్వంలోని మాధుర్యాన్ని అనుభవించాలి (ఆడవాళ్లయితే). మంచి సంతానం కనాలి. పిల్లల చదువు సంధ్యలు గురించి ఫట్టించుకోవాలి. తల్లిదండ్రులుగా బాధ్యతలు ఆనందంగా స్వీకరించాలి. సంతానం

కూడా తల్లిదండ్రుల పట్ల కొన్ని కర్తవ్యాలు నిర్వహించాలి.

వయసు చేసే అల్లర్లు, ధనం దాచుకునే మార్గాలు, వృద్ధాప్యం, వానప్రస్థం, జీవన యాత్ర, చివరిగా మహాభినిష్క్రమణతో.... జీవుడు ఇహలోకం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయే వరకు గల అన్ని దశల్ని రచయిత చక్కగా వివరించారు.

– సాక్షి 10.1.10

పెళ్లి పుస్తకం
ఈ పుస్తకం వివాహ విజ్ఞాన సర్వస్వం

వివాహ వ్యవస్థ ఎలా పుట్టింది, అసలు పెళ్లెందుకు, పెళ్లిళ్లలో ఎన్ని రకాలున్నాయి, వధూవరుల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆ తర్వాత నిశ్చితార్థం,పెళ్లి ఏర్పాట్లు, వివాహతంతు ప్రతి దశనీ సంక్షిప్తంగానే అయినా, సవివరంగా చెప్పారు రచయిత.

భార్యాభర్తల బంధాన్నీ శృంగార ప్రాధాన్యాన్నీ చక్కగా వివరించారు. సముద్రానికి ఆటుపోట్లెంత సహజమో వైవాహిక జీవితంలో ఒడిదుడుకులూ అంతే సహజమని కొత్త దంపతులకు సలహా ఇచ్చారు.

– ఈనాడు 6.9.09

అందరూ అధ్యయనం చేయాల్సిన 'వివాహవేదం'

హిందూ సంస్కృతిలో చాలా గొప్ప సంస్కారం వివాహం. ఆ వివాహాన్ని ఒక వేదంగా మన ముందుంచారు సింహప్రసాద్‌గారు **'వివాహవేదం'** గ్రంథం ద్వారా.

524 పుటలలో విస్తరించిన సమాచారం వివాహం, కుటుంబ జీవనానికి సంబంధించిన 73 విశేషాలీ గ్రంథంలో ఉన్నాయి.

పెళ్ళంటే ఏమిటో చెప్పడంతో ప్రారంభించి పెళ్లెందుకు? పెళ్లి ప్రాముఖ్యం ఏమిటి? పెళ్ళికి సంబంధించిన సామెతలు, పెళ్ళిళ్ళలో రకాలు, వివాహ యోగ్యతలు, వివాహ నిర్ణయం, వధూవరుల ఎంపిక, పెళ్లిచూపులు, నిశ్చితార్థం, శుభలగ్నం,పెళ్ళిపిలుపులు,

 పెళ్ళి ఏర్పాట్లు, వివాహ కార్యక్రమం, పెళ్ళిళ్ళ రిజిస్ట్రేషన్ లాంటి విషయాలన్నింటిని చాలాచక్కగా వివరించారు రచయిత.

కన్యాదానం, నాతిచరామి, జీలకర్ర –బెల్లం, సప్తపది, అగ్నిసాక్షి ప్రమాణాలు, మంగళ సూత్రధారణ, హెూమం, అప్పగింతలు, బహుమతులు, గృహప్రవేశం ప్రాముఖ్యతల్ని చక్కగా వివరించారు సింహప్రసాద్.

పెళ్ళిళ్ళలో ఈ తంతులన్నింటినీ చూస్తుంటాం. మన పెళ్ళిలో మనం చేసుంటాం. కానీ వీటి వెనుక వున్న సత్యాలు చాలామందికి తెలీదు. తెలుసుకోరు. తెలుసుకోవాలనుకునే వాళ్ళకు చక్కటి గ్రంథం **'వివాహ వేదం'.**

వివాహంతో విషయాల్ని విడిచిపెట్టకుండా అవసరమైన కుటుంబ జీవితాన్ని సరిగ్గా పండించుకోవడానికి అవసరమైన విషయాలెన్నో కూడా ఈ గ్రంథంలో ఉన్నాయి.

బ్రహ్మచర్యంతో బాటు గృహస్థాశ్రమం గురించి చెప్పారు. భార్యాభర్తల అనుబంధమెలా ఉండాలో వాళ్ళ బాధ్యతలేమిటో కూడా చక్కగా విడమరిచి చెప్పారు. శృంగారం గురించి సంసారం గురించి చెబుతూ ఆరోగ్యం గురించి, అవయవదానం గురించీ చెప్పారు.

ఒక్క వాక్యంలో చెప్పాలంటే గర్భం ధరించడం దగ్గర నుంచి జనన మరణాల గురించి – అన్ని విషయాల్ని చర్చించారు సింహప్రసాద్ 'జీవన వేదం'లో. రచయిత పెళ్ళి, పరిణామాలు క్షుణ్ణంగా అందరికీ అర్థమయ్యేలా చెప్పడంలో రచయిత కృతకృత్యులయ్యారు. అందరూ చదివి తెలుసుకోవలసిన వేదం ఇది.

–ఆంధ్రప్రభ 30.08.09

వివాహ విజ్ఞాన సర్వస్వం

ప్రపంచంలోనే అత్యంత ఉదాత్తమైన ఉత్కృష్టమైన భారతీయ వైవాహిక వ్యవస్థలోని సమస్త సారాన్ని వెల్లడించే గ్రంథం **'వివాహవేదం'** .

శాస్త్రోక్తమైన, సంప్రదాయసిద్ధమైన పెళ్లి విధి విధానాలలోని పరమార్థాల్ని, ఆ సందర్భంలోని మంత్రతంత్రాల అర్థ తాత్పర్యాల్ని వివరిస్తూ తెలుగులో ఇప్పటికే కొన్ని పుస్తకాలు రాకపోలేదు. కానీ ఈ పుస్తకానికి వాటికి ఎంతో తేడా కనిపిస్తుంది.

సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా చాలా సరళమైన శైలిలో రచయిత విషయ జ్ఞానాన్ని అందించారు. సవిస్తారమైన భారతీయ వైవాహిక వ్యవస్థపై ఎన్ని పుస్తకాలు వచ్చినా నేటి ప్రజలకు బోధ పడవలసిన జీవన సూత్రాలు మరెన్నో ప్రాచీన ధార్మిక గ్రంథాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నది జగద్విదితం.

సంస్కృత బద్ధమైన ఆ వైజ్ఞానిక సంపదను ఇటువంటి విషయ పరిజ్ఞానం గల రచయితలు పుస్తక రూపంలోకి తేవడం ద్వారా ఎంతో మేలు చేసిన వారవుతారు. హైందవ ధర్మశాస్త్రాలపై ప్రజలు విస్తృత అవగాహనకు రావలసిన అవసరమూ ఎంతో ఉంది. **వివాహ విషయపరంగా ఇంతవరకూ రాయనంత పెద్ద గ్రంథంగా ప్రముఖులు దీనిని పేర్కొంటున్నారు/**

'526 + 14 పేజీలతో వెలువడిన ఈ విలువైన పుస్తకానికి రచయిత సింహప్రసాద్. ఇందులో మొత్తం 73 అధ్యాయాలు ఉండగా, మొదటిదైన 'శ్రీకారం' నుండి 'గర్భాదానం' దాకా మొత్తం 34 వివాహ అధ్యాయాలు చోటుచేసుకున్నాయి. భారతీయ సమాజంలోని కుటుంబ వ్యవస్థ, ప్రజారోగ్యం, మానవజన్మలోని సార్ధకత వంటివన్నీ కలిపి సమస్త జీవన విజ్ఞాన సర్వస్వంగా దీనిని రచయిత రూపొందించారు. బ్రహ్మచారులతో సహావివాహితులకు ఒక మంచి మార్గదర్శిగా ఇది ఉపయోగపడుతుంది.

'పెళ్లి ఒక భోగం, ఒక యోగం, ఒక జీవన సంస్కారం' అంటూ వైవాహిక వ్యవస్థ విశ్వరూపాన్ని తెలుగు పాఠకులకు రచయిత చక్కగా దర్శింపచేశారు.

మన వివాహవ్యవస్థకు శ్వేతకేతువు అనే ఒక సంస్కర్త రూపకల్పన చేశాడని, ఋగ్వేద కాలానికే ఇది ఏర్పడిందని, ప్రపంచంలో మూడో అతిపెద్ద మతం హిందూ మతమేనని – ఇలా రచయిత చెప్పుకొచ్చిన విషయాలు చదువరులకు తప్పక ఆసక్తి కలిగిస్తాయి. మన దేశంలోని పిల్లలు, పెద్దలపై పాశ్చాత్య సంస్కృతి పోకడలు తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఇందులోని విషయాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆశించవచ్చు. మనిషికి డబ్బే సర్వస్వం కాకూడదని, సత్వగుణ సంపన్నతతో ధర్మాచరణకు ప్రతి మనిషి లోబడితే జీవితం సాఫల్యమవుతుందని రచయిత అన్న మాటలు అక్షరసత్యాలు.

ఈతరం యువత తప్పక చదవాల్సిన పుస్తకం.

– వార్త 14.12.10

వివాహవేదం

పెళ్ళనేది రెండక్షరాల మాటే అయినా రెండు జీవితాల్ని ఒకటిగా చేసేది.

ఈ గ్రంథంలో 'శ్రీకారం' మొదలు ముగింపు వరకు 73 అధ్యాయాలున్నాయి. కేవలం వివాహకాండ మట్టుకే కాక మానవ సమాజంలో వైయక్తిక, సాముదాయిక అవసరాలనూ, అనుబంధాలనూ ఏర్పరుచుకునే సంబంధాలనూ, దృష్టిలో పెట్టుకుని వివాహం చుట్టూ అల్లుకుని ఉన్న అనేక అంశాలను విడమరిచి చూపిస్తూ, ఒక్కొక్క విషయాన్ని స్పష్టంగా వివరిస్తూ మానవ జీవితానికి సంబంధించిన సమస్తాంశాలనూ పొందుపరచిన గ్రంథమిది.

లౌకికమయిన గుర్తింపుకోసం జరిగే పెళ్ళిళ్ళ విధానాలను గురించి కూడా ఇందులో చెప్పారు. రకరకాల ఆనవాయితీలు, పెళ్ళిళ్ళ ఖర్చులు, నవదంపతుల విహారయాత్రలు, దాంపత్యజీవితం, పిల్లల పెంపకం, వృద్ధాప్యం మొదలయిన అంశాలన్నింటినీ సవిస్తరంగా చర్చించారు రచయిత.

పెళ్ళంటే ఏమిటనే విషయంతో ప్రారంభించి వివాహం గురించిన వివిధ విషయాల్ని చెప్పడంతో పాటు, ఆ తర్వాత కూడా పెళ్ళికి సంబంధించిన దాంపత్యం, కుటుంబ సలహాలు, విడాకులు, మాతృత్వం, పిల్లల పెంపకం, సంతాన కర్తవ్యంలాంటి విషయాల్ని చర్చించారు కాబట్టి వివాహితులు, బ్రహ్మచారులు, పిల్లలు – అందరూ తెలుసుకోవలసిన గ్రంథం.

పెళ్ళి గురించిన భిన్నకోణాల్ని మన ముందుచారు ఈ గ్రంథం ద్వారా స్వతహాగా మంచి వచన రచయిత కావడంతో తాము చెప్పదల్చుకున్న విషయాల్ని ఒక క్రమం ప్రకారం, ఆసక్తిగా చదివే విధంగా మలిచారు. ఈ గ్రంథ ముద్రణను తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్థిక సహాయం అందిచండం ముదావహం.

– చిత్ర మాసపత్రిక అక్టోబరు 2009

సింహప్రసాద్ చెప్పిన వివాహ వేదం

'హిందూ సంస్కృతికి నిలువెత్తు భాష్యం – పెళ్ళి' అంటూ ప్రారంభించి సింహప్రసాద్ గారు 'మహాభినిష్క్రమణ' వరకు 73 అధ్యాయాలలో విశదీకరించారు

'వివాహ వేదాన్ని'

వివాహాన్ని వేదంగా చెప్పడమే ఆ క్రతువు పట్ల రచయితకున్న గౌరవాన్ని చెబుతోంది. కేవలం రచయిత తనకి గౌరవమున్న విషయాన్నే ఈ గ్రంథం ద్వారా చెప్పాడా? మనందరం గౌరవించాల్సిన సంస్కారం గురించి చెప్పాడు.

ఎక్కువ మందితో శారీరక సంబంధం ఉంటే రకరకాల జబ్బులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. తల్లిదండ్రులకు భారమైన వాడు సమాజానికీ భారమవుతాడని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక పురుషుడు, ఒక స్త్రీ కలిస్తేనే పరిపూర్ణత కలుగుతుందని మన పురాణాలు చెబుతున్నాయి. యవ్వనంలోనే కాదు, ముఖ్యంగా జీవిత చరమాంకంలో కూడా జీవిత భాగస్వాముల ప్రాధాన్యత ఎంతో ఉంటుందంటున్నారు విజ్ఞులు. వీటన్నింటితో వివాహమనే రెండు మనసుల కలయిక ప్రాధాన్యత ఏమిటో తెలుస్తోంది.

పెళ్ళంటే ఏమిటి? పెళ్ళెందుకు? పెళ్ళి ప్రాముఖ్యమేమిటి? వివాహ యోగ్యతలేమిటి? వధూవరుల ఎంపిక ఎలా జరగాలి? ఇలాంటి పెళ్లికి సబంధించిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఈ గ్రంథంలో లభిస్తుంది.

పెళ్ళి చూపుల నుంచి పెళ్ళికి ముందు తంతులు, పెళ్ళిలో ముచ్చట్లు, పెళ్ళి తర్వాత బాధ్యతలు కూడా చక్కగా చెప్పారు రచయిత సింహప్రసాద్. అన్యోన్య దాంపత్యం కుటుంబం, ఆరోగ్యం, ఆనందం, గర్భం, మాతృత్వం, పిల్లలు, పెంపకం, సంతాన కర్తవ్యం, వృద్ధాప్యం, వానప్రస్థం, మహాభినిష్క్రమణ వరకూ అన్ని విషయాలు చర్చించడంతో ఈ గ్రంథానికి పరిపూర్ణత వచ్చింది.

అధ్యాయాలన్నీ చిన్న చిన్నవి. చటుక్కున చదివేయవచ్చు. రచయిత అనుభవజ్ఞుడు కావడంతో చదివించే శక్తి ఈ గ్రంథానికుంది. అందరికీ తేలియల్సిన విశేషాలు కాబట్టి అందరూ తప్పక చదవాల్సిన గ్రంథం

– ఆంధ్ర ప్రదేశ్ పత్రిక డిసెంబర్ 2009

అభినందన

'వివాహవేదం' సింహప్రసాద్‌గారి కలం నుండి జాలువారిన ముత్యాల సరళి. విజ్ఞానాన్ని అందించిన ఓ అపూర్వ రవళి.

'వివాహవేదం'లో శ్రీకారం నుండి మరణమృదంగం వరకూ ఆద్యంతమూ ఆసక్తిదాయకంగా ఎన్నో తెలియని విషయాల్ని సైతం సంస్కృతశ్లోకాలతో, వాటి తాత్పర్యాలతో క్షణ్ణంగా విశదీకరించిన రచయిత నిజంగా అభినందనీయం.

'భరించేవాడు భర్త', 'భరింపదగినది భార్య!'.

వాళ్ళ, వాళ్ళ కర్తవ్యమేమిటీ? పిల్లల పెంపకంలో నైపుణ్యం, సమయస్ఫూర్తి ప్రదర్శిస్తూ వారిని భావి భారత పౌరులుగా ఎలా తీర్చిదిద్దాలి? అనే విషయాన్ని సింహప్రసాద్‌గారు చక్కగా విపులంగా ప్రబోధించారు.

యువతకు, వృద్ధులకు ఒకేసారి కనువిప్పు, జ్ఞానోదయం నిశితంగా ఆత్మావలోకనం చేసుకునే పరిజ్ఞానం అన్నీ ఒక్కసారిగా అందించగల నవలారాజం – ఈ అపురూప 'వివాహ వేదం'.

ఇన్నేళ్ళకు, ఇన్నాళ్లకు ఇంతటి మంచి వాస్తవాల్ని క్షుణ్ణంగా మెదడులో దాచుకున్నందుకు గర్విస్తూ, సంతోషిస్తూ రచయితగారి కలం నుండి ఇలాంటి పరిజ్ఞానంతో కూడిన రచనలు మరిన్నిరావాలని ఆశిస్తూ. ఆకాంక్షిస్తూ మరోసారి మనఃస్ఫూర్తిగా నా అభినందనల్ని తెలియజేస్తూ–

శ్రీమతి వనజారావ్

యం.డి., వనజారావు క్విక్ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్

మా సాయి –అక్టోబరు 2009

వర్తమాన భవిష్యత్తరాల వారికి మన వివాహ వ్యవస్థ ఔన్నత్యాన్ని తెలిపే విధంగా **'వివాహవేదం'** గ్రంథ రచన సాగింది. భారతీయ వివాహ వ్యవస్థ విలువ ను ఈ గ్రంథంలో ప్రస్ఫుటింపజేశారు. వివాహం చేసుకోబోయే వారే కాక పిల్లలున్న తల్లిదండ్రులు కూడా ఈ గ్రంథాన్ని చదివి అనేక విషయాలు తెలుసుకోవచ్చు.

–డా. పోరంకి దక్షిణామూర్తి (గ్రంథావిష్కరణ సభలో)

నేటి యువతకు ఈ **'వివాహవేదం'** గ్రంథం ఆదర్శప్రాయమైనది. మనిషి జీవిత పరిపూర్ణతకు వివాహ బంధం ముఖ్యం. హిందూ సంస్కృతిలో ఉన్న చాలా చక్కటి సంస్కారం వివాహం. ఈ సంస్కారాల ప్రభావంతో ఏర్పడినదే మన సంస్కృతి. మనం మన సంస్కృతికి దూరం కాకూడదు.

– శ్రీ మునిపల్లె రాజు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
(గ్రంథావిష్కరణ సభలో)

సామాజిక బాధ్యతగా సింహప్రసాద్ ఈ **'వివాహవేదం'** గ్రంథాన్ని తీసుకు వచ్చారు.వివాహ ఫలితం సంతానమని, పుట్టుక నుంచి మరణం వరకు కుటుంబ జీవితం గురించిన విశేషాల్ని అన్నింటికీ సింహప్రసాద్ వివాహ వేదంలో సంపుటీక రించారు.

అర్ధనారీశ్వర సత్యాన్ని ప్రతిబింబించే విధంగా భార్యాభర్తలు వేర్వేరు కాదు అనేలా భార్యాభర్తలను కలిపి సభ వేదికకు ఆహ్వానించడం బావుంది.

–డా. వేదగిరి రాంబాబు (గ్రంథావిష్కరణ సభలో)

ప్రపంచంలోనే మన దేశ వివాహవ్యవస్థ సమోన్నతం. పెళ్లి అనే రెండక్షరాలు రెండు మనసులను జీవితాలను ఒకటి చేస్తుంది. కుటుంబ కలహాలు, మాతృత్వం, పిల్లల పెంపకం, సంతాన కర్తవ్యం తదితర విషయాలను రచయిత 'వివాహ వేదం' గ్రంథంలో చక్కగా విశదీకరించారు.

–శ్రీ ఎమ్. గోపాల కృష్ణ
రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్
(గ్రంథావిష్కరణ సభలో)

1

శ్రీకారం



పెళ్లి!

రెండక్షరాల ఈ మాట వింటే చాలు తలచుకుంటే చాలు కళ్ళముందు ఓ మనోజ్ఞ దృశ్యం ఆవిష్కృతమవుతుంది.

పచ్చని గడపలు, మామిడాకుల తోరణాలు, కళకళలాడే కళ్యాణ మండపాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, వధూవరుల సిగ్గులూ స్వప్నాలూ, పట్టుచీరల ఆర్భాటాలు, పిల్లల కేరింతలు, పెద్దల ఆశీస్సులు, షడ్రసోపేతమైన భోజనాలు!

భారతీయతకు అద్దం పడుతుంది పెళ్ళి!

హిందూ సంస్కృతికి నిలువెత్తు భాష్యం పెళ్లి కార్యక్రమం!!

పెళ్లంటే...

పెళ్లంటే మూడు ముళ్ళు. ఏడు అడుగులు. వెరసి నూరేళ్ళ జీవితం.

పెళ్లంటే ఒక వేడుక. ఒక ముచ్చట. ఒక ఆనందం. ఒక ఆర్భాటం. ఒక సంయోగం. ఒక సందేశం. ఒక అపూర్వ అనిర్వచనీయమైన అనుభూతి. జీవిత ధర్మాన్నీ లక్ష్యాన్నీ నిర్దేశించే మహత్తర ఘటన!

జీవకణానికి న్యూక్లియస్ ఎంత 'ప్రాణా'వసరమో జీవితానికి పెళ్లీ అంతే.

జీవితానికి ప్రధానమైంది పెళ్లి. జీవితాన్ని మలుపు తిప్పేది పెళ్లి. జీవితానికి అర్థం చెప్పేది పెళ్లి. జీవిత పరమార్థాన్ని వివరించేది పెళ్లి. జీవితానికి ధన్యత చేకూర్చేది పెళ్లి!

జననం నుంచి మరణం వరకూ సమస్తమూ పెళ్లితోనే ముడిపడ్డాయి. పెళ్లి చుట్టూనే తిరుగుతాయి!

ఆదిమ దశ

ఒకానొకప్పుడు మనిషి జంతువులా జీవించాడు! జంతువులా ప్రవర్తించాడు. తల్లి తండ్రి అన్న తమ్ముడు అక్క చెల్లి – లాంటి వావి వరసల్లేకుండా అచ్చం జంతువు లానే బ్రతికాడు.

ఆకలేస్తే తినడం, దాహమేస్తే త్రాగటం, వాంఛ కలిగితే తీర్చుకోవడం – జంతువు లానే చేశాడు.

సంతానోత్పత్తినీ చేశాడు.

కాని ఎవరు ఎవరికి ఎవరెవరికి పుట్టారో తెలీదు. తెలుసుకోవాలన్న జిజ్ఞాసా లేదు. ఎలాంటి అనుబంధమూ పెంచుకోనూలేదు.

ఆనాటి సమాజంలోని స్త్రీ పురుషులంతా ఉమ్మడి వ్యవస్థలోని భాగస్తులు. ఉమ్మడి సెక్స్ పార్టనర్స్. వారికి పుట్టిన పిల్లలు సమాజపు సంతానం.

ఆహారం, ఆస్తి, ఆయుధాలు – అన్నీ కూడా సమాజానివి.

జతకట్టడం

జతకూడడం లేక జతకట్టడం అనేది ప్రకృతిలోనే వుంది. పశుపక్ష్యాదులు సైతం జతకడతాయి.

కొన్ని పక్షిజాతుల్లో ఈ జతబంధం అపూర్వం అని చెప్పాలి.

జతకట్టడంలో వున్న ఆనందాన్ని ఏ జీవీ ఎన్నడూ దాచుకోలేదు. తమకిష్టమైన జోడుని ఎంచుకుని వారితో మానసిక శారీరక ఆనందం పొందుతారు.

లైంగికావసరం దృష్ట్యా కావచ్చు సంతానార్థం కావచ్చు ఆడ, మగ కలవడం అనివార్యం.

కాలక్రమేణా కాలమాన పరిస్థితుల దృష్ట్యా ఈ జతకట్టడమే పెళ్లిగా రూపాంతరం చెందింది. ఆ బంధం శాశ్వతం చెయ్యడానికి కొన్ని నియమాలు నిబంధనలూ విధించుకుంది. అవసరాల దృష్ట్యా మారిన పరిస్థితుల దృష్ట్యా మార్పు చేర్పులకులోనై నేటి వివాహ వ్యవస్థగా రూపుదిద్దుకుంది.

పరిణామక్రమంలో

మనిషి గుహల్లో చెట్లక్రిందా బ్రతికాడు. జంతుబలం లేకపోయినా సహకారం, సంఘటితం అతడ్ని ప్రబలశక్తిగా మార్చింది.

జంతుజాలం మీద ఆధిక్యత సాధించి తన జాతిని రక్షించుకోవడమే గాక వృద్ధి చేసుకుంటూ వచ్చాడు మనిషి.

ఎక్కడ ఆహారం లభిస్తే అక్కడికి గుంపులుగా 'సంచారం' సాగించాడు. మెల్లగా పశుపాలన మొదలైంది. స్వయంగా విత్తనాలు నాటి మొక్కల్ని పెంచటం తెలిసింది.

వ్యవసాయం మనిషి దిశను మార్చేసింది. నదీతీర ప్రాంతాల్లో స్థిరనివాసం మొదలైంది.

'స్వంత ఆస్తి' ప్రవేశించింది. 'ఉమ్మడి' కాస్తా 'నాది'గా విడిపోయింది. నేను, నాది, నా సంతానం అన్న భావన వేరూనింది.

అయినప్పటికీ బహు భార్యత్వం, బహుభర్తృత్వం కొనసాగింది.

ఎవరు ఎవరికి చెందినవారో గుర్తింపబడటం అవసరం, అనివార్యం అయింది. జతకట్టడం మొదలైంది. ఆ బంధానికో సుస్థిర రూపం ఇవ్వాల్సి వచ్చింది.

ఫలితంగా 'పెళ్లి' పురుడు పోసుకుంది!

సమాజపు నీతి నియమాలని రక్షిస్తూ ఏర్పాటు చేసిన ఒక కట్టుబాటు పెళ్లి.

ఒక స్త్రీ – ఒక పురుషుడు అనే భావనకు మూలం సామాజిక ధర్మమే.

పెళ్లి వ్యక్తిగతమైంది కాదు సమాజపరమైన ఒక వ్యవస్థ!

వివాహవ్యవస్థ

శ్వేతకేతువు అనే సంస్కర్త వివాహ వ్యవస్థకి రూపకల్పన చేసినట్టు మహాభారతంలోని ఒక ప్రస్థావన బట్టి తెలుస్తోంది.

నాటి కాలంలో మగాడు ఎలావోలా ప్రలోభపెట్టి తన కోరిక తీర్చుకొనేవాడు.

ఈ దశలోనే ఉద్ధాలకుడనే ముని ఇంటికి వచ్చిన అతిథి ముని భార్యతో పొందు కోరాడు. సాధ్వియైన తన తల్లిని అలా పరాయివాడు కామించడం కొడుకు శ్వేతకేతువుకి దుర్భరంగా తోచింది.

గొప్ప తపశ్శాలియైన శ్వేతకేతువు ఉగ్రుడయ్యాడు. "ఇది మొదలుగా వివాహితులను పరులు కోరడానికి వీల్లేదు. మానవజాతికి ఈ రకమైన కట్టడిని నేను ఏర్పాటు

చేస్తున్నాను" అని తీవ్ర స్వరంతో ప్రకటించడాన్ని భారతంలోని ఆది పర్వం వివరించింది.

సామాజికమైన నైతికమైన కట్టుబాట్లు విధించి వివాహవ్యవస్థకి రూపం కల్పించాడు శ్వేతకేతువు. పరస్త్రీ అపహరణ, వ్యభిచారం వగైరాలు పాపమని బోధించాడు. ఏ స్త్రీయందైనను సంతానోత్పత్తి చేయుట దురాచారమన్నాడు. పురుషుడు నిజభార్యయందే గాని పరస్త్రీలయందు బిడ్డలను కనరాదని శాసించాడు. పవిత్రమైన వివాహబంధాన్ని సామాజిక ధర్మంగా నిర్దేశించాడు.

అది నేపథ్యంగా భారతీయ వివాహ వ్యవస్థలో ఒక స్పష్టత చోటు చేసుకుంది. కామ విషయంలో క్రమశిక్షణ మొదలైంది.

వేదకాలం నాటికే వివాహ వ్యవస్థ బలంగా వేళ్ళూనుకొంది. ఋగ్వేదంలో వివాహ సూక్తం ప్రత్యేకంగా ఉంది.

సుమారు 3500 సంవత్సరాలకన్నా ముందే వేదకాలంలో మొదలైన వివాహవ్యవస్థ నేటికీ కొనసాగుతోంది. రేపూ కొనసాగబోతోంది.

వివాహ పద్ధతుల్లో కర్మకాండల్లో ఆచార వ్యవహారాల్లో మార్పు వచ్చి ఉండవచ్చు. భార్యాభర్తల భూమికల్లో పెనుమార్పులే వచ్చి ఉండొచ్చు.

కాని ఆ వ్యవస్థ మాత్రం చెక్కు చెదరలేదు.

ఆ సుదృఢత వివాహవ్యవస్థ ఔన్నత్యంలోనే ఉంది!

వేదాలలో వివాహం



ఋగ్వేద కాలానికే వివాహ వ్యవస్థ ఏర్పడింది.

ఋగ్వేదంలో పదవ మండలంలోని 85వ సూక్తంలోనూ, అథర్వవేదం పద్నాలుగవ కాండంలోని మొదటి, రెండవ అనువాకంలోనూ వివాహం గురించి భార్యభర్తల అనుబంధం గురించి వివరించబడింది.

ఋగ్వేదం 10-85-9లో 'సూర్య మనసున పతిని కోరింది. సూర్యుడు తన పుత్రి సూర్యను ప్రదానము చేయునప్పుడు సోముడు ఆమెను పెళ్లాడదలిచినాడు. కాని అశ్వినులనే వరులుగా స్వీకరించుట జరిగినది'

అథర్వవేదంలో సవితాపుత్రి 'సూర్య' వివాహపు కథ చెప్పబడింది. వివాహ కార్యక్రమమూ పేర్కొనబడింది.

'వివాహము కన్య తండ్రి ఇంటజరుగును' తో ఆరంభమై కన్యాదానము, లాజహోమము, అగ్నిప్రదక్షిణ, ఏడు గీతలు గీయించి కన్యను దాటించుట, గృహప్రవేశం వగైరాలతో సాగి 'యజమాని తన కుటుంబ సహితముగా మధురాన్న ములను భక్షించునది' తో ముగుస్తుంది.

'కొన్ని పక్షిజాతులలో దాంపత్యము అపూర్వము. జతబాసిన క్రౌంచపు విషాదమే రామాయణ మహాకావ్య నిర్మాణమునకు ఆధారముకదా! మనిషి పశు పక్ష్యాదుల నుండి నేర్చినాడో అవసరమే అట్లు చేసినదో విడిపోని జంటను గురించి ఆలోచించినాడు. ఇరువురిని కలుపుటకు వివాహమును పవిత్రబంధమును ఏర్పరచినాడు. 'అనన్యాఘవేణాహం' అని వాల్మీకి సీతతో అనిపించినను, 'వాగార్థావివ సంప్రక్తౌ' అని కాళిదాసు ప్రార్థించినను ఈ వివాహ బంధమును నిలుపుటకే. సాహిత్యమున ముప్పావు మువ్వీసము ఇందుకే అంకితమగుచున్నది. ఇది నాటి మాట. నేటి మాట. రేపటి మాట' అంటారు 'అక్షరవాచస్పతి' డాక్టర్ దాశరథి రంగాచార్య.

వేదవాక్కులు

ఋగ్వేద అథర్వవేదాలలోని వివాహానికి సంబంధించిన కొన్ని మంత్రాలకు అర్థాలు:

'ఈమెను పితృవంశము నుంచి విడదీయుచున్నాను. భర్త వంశము నుండి కాదు. భర్తతో ఆమెను సంబద్ధను చేయుచున్నాను'

'మామలకు సామ్రాజ్ఞివగుము. బావలకు సామ్రాజ్ఞి వగుము. మరదులకు సామ్రాజ్ఞి వగుము. అత్తలకు సామ్రాజ్ఞి వగుము'

'నీవు నాకు ధర్మపత్నివి. నేను నీకు గృహపతిని అగుచున్నాను'

'నీవు సుమంగళివి. గృహిణివి. పతికి శుభము, మామకు ముదము, అత్తకు సుఖము కలిగించుటకు గృహమున ప్రవేశించుము'

'అత్తమామలకు, పతికి గృహములకు, వారలందరకు సుఖదాయినివై వారికి పుష్టి కలిగించుము!'

'మీరు తల్లిదండ్రులగుటకు ఋతు కాలమున సంగమించండి. మీరు వీర్యము వలన తల్లిదండ్రులు కండి. అందరివలెనే పురుషుడు స్త్రీని ఆరోహించుగాక. సంతానము కలిగించి ధనమును పెంచండి'

'వివాహమున పాణిగ్రహణమప్పటిది. నీ సౌభాగ్యము కొరకు నేను నీ పాణిగ్రహము చేయుచున్నాను. నన్ను పతిగా పరిగ్రహించి వృద్ధావస్థ వరకు నడుపుము. ఇదే నా ప్రార్థన. భగ, ఆర్యమ, పూష దేవతలు గార్హపత్యము కొరకు నిన్ను నాకు ఇచ్చినారు'

'మీరు కలిసి ఉండండి. విడిగా ఉండవద్దు. ఎంతో కాలము జీవించండి. పుత్ర పౌత్రులతో ఆడుకొనుచు ఆనందించుచు మీ గృహమున ఉండండి'

ప్రపంచ వ్యాప్తంగా పెళ్లి

ప్రపంచంలోని అన్ని జాతుల్లోనూ వివాహవ్యవస్థ ఉంది.

ఆయా ప్రాంతాల దేశాల అవసరాలు, విశ్వాసాలు, కాలమాన పరిస్థితుల్ని బట్టి పెళ్లి యొక్క స్వరూప స్వభావాల్లో భేదాలున్నాయి.

అయినప్పటికీ స్థూలంగా ఒకే రకపు చట్రం కలిగిఉంది.

వధూవరుల ఎన్నిక, ఒక కర్మకాండ లేక తంతు లేక వేడుక ద్వారా స్త్రీ పురుషుల్ని పెళ్లితో కలిపి భార్యభర్తల్ని చెయ్యడం ప్రతిచోటా ఉంది.

కేవలం పెళ్లి చేసి చేతులు దులుపుకోరు. కొత్తజంట తమ కుటుంబాన్ని ఏర్పరచుకోడానికి తోడ్పడతారు. ఆహార పదార్థాలు, వంట సామాగ్రి, గృహోపకరణాలు, దుస్తులు, వాహనాలు సమకూరుస్తారు.

ఈ రకంగా కుటుంబ వ్యవస్థ వర్ధిల్లడానికి దోహదపడుతున్నారు.

తద్వారా సమాజ కళ్యాణంలో మరి ఇద్దర్ని భాగస్తుల్ని చేస్తున్నారు.

విభిన్నమైనది హిందూ సంస్కృతి

ఏ జాతి సంస్కృతి ఆ జాతికి గర్వకారణం. అయినప్పటికీ మిగతా సంస్కృతులకన్నా హిందూ సంస్కృతి మహోత్కృష్టమైంది.

పుట్టుక నుంచి గిట్టే వరకూ సమస్త దశల్లోనూ దిశా నిర్దేశం చేస్తుంది. ధర్మబద్ధ జీవితానికి అడుగడుగునా మార్గదర్శకం చేస్తుంది.

వివాహం నుంచి గర్భాధానం నుంచి మృత్యుపర్యంతం అన్ని కర్మల్నీ క్రియల్నీ ఆచార వ్యవహారాలతో శాస్త్రోక్తంగా నిర్వహింపజేయిస్తుంది.

మానవ జీవితాన్ని సుఖమయం, శాంతిమయం చెయ్యడానికి అహరహం తపిస్తుంది.

మానవుడ్ని పరిపూర్ణుడిగా మహనీయుడిగా తీర్చిదిద్దటమే హిందూ సంస్కృతి లక్ష్యం. సర్వేజనా సుఖినోభవంతు – దాని ధ్యేయం!

హిందూ ధర్మం

ప్రపంచంలో మూడో పెద్ద మతం హిందూ మతం. భారతదేశంలో 6000 సంవత్సరాలకి పూర్వం హిందూయిజం ఏర్పడిందని చెబుతారు.

భారతదేశంలోనేగాక ఇండోనేషియా, థాయ్‌లాండ్, మలేషియా, అనేక ఇతర దేశాల్లోనూ హిందువులు విస్తరించారు.

ఆచారాలు, భాష వేరైనప్పటికీ హిందువుల మౌలిక విశ్వాసాలు మాత్రం మారలేదు.

వేదాలు, ఉపనిషత్తులు మొదలైన పవిత్ర గ్రంథాల బోధనానుసారం వుంటుంది హిందూ ధర్మం.

ప్రపంచ ఉనికికి మూలమైన పంచభూతాలని – భూమి నీరు నిప్పు గాలి ఆకాశం – అర్చిస్తారు. వేదమంత్రాలు పఠిస్తారు. అడుగడుగునా మత ధర్మాలు పాటిస్తారు. బొట్టు మొదలైన మత చిహ్నాలు ధరిస్తారు.

ధర్మార్థకామమోక్ష సాధనే హిందువు లక్ష్యం!

ఆచార సంప్రదాయాలు

సంస్కృతి, ధర్మం, విజ్ఞానం – పరంపరాప్రాప్తాలు. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే సంపద.

సమ్యక్‌ప్రదానం – ఒక తరం నుంచి మరొక తరానికి చక్కగా గొప్పగా ఇచ్చేదే సంప్రదాయం.

పెద్దలు సంతానానికి ఆస్తిపాస్తుల్ని వారసత్వంగా ఇస్తే సరిపోదు. ఆచారాలనీ సంప్రదాయాలనీ విద్యనీ విజ్ఞానాన్నీ ధర్మ పరంపరనీ ఇవ్వాలి. అదే సాంస్కృతిక వారసత్వం. మనిషి మహోన్నతుడిగా రూపుదిద్దుకోడానికి వీలుకల్పించే అపూర్వ సంపద!

పూర్వ సంప్రదాయాల్ని తూలనాడటం గొప్పగా భావిస్తూంటారు కొందరు. అది సరికాదు. వాటి వెనుకనున్న అర్థాన్నీ పరమార్థాన్నీ గ్రహించాలి.

మన కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థ, యోగ, ఆయుర్వేదం, ధ్యానం – మొదలైన వాటి వంక పాశ్చాత్యులు ఆశగా ఆరాధనగా చూస్తున్నారంటే ఆ గొప్పతనం హిందూ సంస్కృతిదే!

భగీరథ ఉవాచ

గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహాత్ముడు భగీరథుడు.

ఆ సందర్భంలో బ్రహ్మ వచ్చి. "శభాష్ భగీరథా! నీ పెద్దలైన అంశుమంతుడూ దిలీపుడూ సాధించలేనిది నువ్వు సాధించావు. నీవు మహోన్నతుడివి" అని ప్రశంసించాడు.

దానికి భగీరథుడు ఇచ్చిన సమాధానమేమిటో చూడండి.

"స్వామీ! మీరు చెప్పింది పూర్తి సత్యం కాదు. ఈ మహత్కార్యం నా ఒక్కడి వల్ల నెరవేరలేదు. నా పూర్వులు చేసిన కృషి, తపస్సుల వల్లే ఇది సాధ్యమైంది. అవి నా వద్దకు వచ్చాక ఫలించడం జరిగిందంతే. నా పెద్దలు ఆ కార్యాన్ని ప్రారంభించకుండా ఉండి ఉంటే, ఆ తపస్సు నాతోనే మొదలైవుంటే అది ఫలించడానికి ఇంకో రెండు తరాలు పట్టేవి. మా పూర్వీకులు నా వరకు తీసుకువచ్చిన తపోరూప సూత్రాన్ని నేను అందుకుని సాధించగలిగానంతే"

నాలుగు దశలు

మానవుడి జీవనాన్ని వ్యక్తిగత జీవనవికాసం ఆధారంగా నాలుగు భాగాలుగా – అంటే ఆశ్రమాలుగా విభజించారు.

1. బ్రహ్మచర్యము	(25 సం. వరకు)
2. గృహస్థము (గార్హస్థ్యం)	(25 సం. నుండి 50 సం. వరకు)
3. వాన ప్రస్థము	(50 నుండి 75 సం. వరకు)
4. సన్న్యాసము	(75 సం. నుండి మరణ పర్యంతం)

గృహస్థాశ్రమమే మిగతా మూడింటికీ ఆధారం. అంటే అవి గృహస్థు నాశ్రయించి ఉంటాయి.

మానవ కళ్యాణానికి గృహస్థాశ్రమమే అత్యంత శ్రేయస్కరమైనది. సమస్త ప్రాణులకు ఆధారమైనది.

వాల్మీకి రామాయణంలో **'చతుర్ణామాశ్రమణాంచ గార్హస్థ్యం శ్రేష్ఠ ముత్తమమ్'** అన్నారు. అంటే నాలుగు ఆశ్రమాలలో గృహస్థాశ్రమం సర్వశ్రేష్ఠమైనది.

ఆశ్రమ ధర్మాలు

బ్రహ్మచర్యంలో స్నానాద్యనుష్ఠానాలు నిర్వహించాలి. భక్తి శ్రద్ధలతో విద్యని అభ్యసించాలి. విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. ఆ జ్ఞానమే అతడి జీవనానికి పునాది అవుతుంది.

గృహస్థాశ్రమంలో ప్రవేశించడమంటే వివాహం చేసుకోవడమే. 'గృహస్థుడు' అంటే ఇల్లు కలవాడనికాదు 'భార్య' కలవాడని అర్థం.

'ఇహైః వస్తం మా వియౌష్టం
విశ్వమా యుూర్ వ్యశ్నుతుమ్
క్రీడన్తౌ పుత్రైర్నప్తృభిః
మోదమా నౌ స్వస్త కౌ'

భార్యా భర్తల గురించి అథర్వ వేదంలో చెప్పిన శ్లోకమిది.

గృహస్థాశ్రమంలోకి వధూవరులిద్దరూ సంతోషంగా ప్రవేశించి ఒకరికోసం ఒకరు జీవించాలి. భార్యాభర్తలిద్దరూ ఒకర్ని విడిచి ఒకరు దూరంగా ఉండకూడదు. గృహస్థధర్మమనే రథానికి రెండు చక్రాలుగా కొడుకులు కూతుళ్ళు మనమళ్ళు మనవరాళ్ళతో ఆనందంగా గడపాలి.

బ్రహ్మచారులు, సాధు సన్యాసులు, దీనులు, ఆర్తులు - గృహస్థు నాశ్రయించి జీవిస్తారు గనుక గృహస్థాశ్రమం ఉత్తమమైనదిగా కొనియాడబడింది.

వాన ప్రస్థంలో బాధ్యతల్ని పిల్లల కప్పగించి వైరాగ్య భావనతో ఆధ్యాత్మిక జీవనం గడపాలి.

రాగద్వేషాలూ మోహావేశాలూ వదలి నివృత్తి మార్గంలో ప్రయాణించడమే సన్యాసాశ్రమ ధర్మం.

షోడశ సంస్కారాల్లో మొదటిది

సమాజ వికాసం కోసం ఋషులు ఏర్పరచిన కొన్ని సంప్రదాయాలే సంస్కారాలుగా చెబుతారు. క్రమ వికాసం పొందించడమే వీటి లక్ష్యం.

సంస్కారమనగా సంకల్పం. చక్కజేయుట. సిద్ధపరచుట.

వివాహం, గర్భాధానం, పుంసవనం, సీమంతం, జాతకర్మ, నామకరణం, అన్నప్రాశనం, చూడాకర్మ, నిష్క్రమణం, ఉపనయనం, వానప్రస్థం, సమావర్తనం, కేశాంతం, కర్ణవేధ, వేదారంభం, అంత్యేష్ఠి – ఈ పదహారూ సంస్కారాలుగా భావించారు.

అంత్యేష్ఠి తప్ప మిగిలిన 15 కర్మల ద్వారా జీవుడు సంస్కరణ పొందుతాడు.

ఈ సంస్కారాల ఆచరణ వివాహంతో మొదలవుతుంది.

వివాహవ్యవస్థే సామాజిక స్వస్థతకు వ్యక్తి పురోగతికి పునాది విశృంఖలతను నివారించి నియమ బద్ధతను పవిత్ర జీవనాన్ని నేర్పుతుంది.

తల్లి గర్భంలో ఏర్పడే పిండం పవిత్రంగా ఏర్పడాలనేదే దీని ఉద్దేశం.

సంస్కారాల ప్రధానోద్దేశం జీవుల క్షేమమే! ఉన్నతే!!

భారతవాసి షోడశసంస్కార సంస్కృతుడు!

ఋణత్రయం

ప్రతి మనిషీ మూడు ఋణాలు తీర్చుకోవాలి.

అవి – దేవ ఋణం, మాతాపితృ ఋణం, ఋషి ఋణం

వంశాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించడానికి, పితృదేవతలకు తర్పణాది క్రియలు నిర్వహించడానికి సత్సంతానాన్ని కనాలి. ఆ రకంగానే పితృ ఋణం తీరుతుంది. ఈ పితృయజ్ఞం పితాపుత్ర పరంపరగా నిరంతరం నిరంతరాయంగా జరుగుతూండాలి.

అంతేగాక కనిపెంచి పెద్దచేసి జీవన మార్గం చూపిన తల్లిదండ్రుల్ని వార్ధక్యంలో ఆదరించాలి. సుఖపెట్టాలి. తద్వారానే మాతాపితృ ఋణం తీరుతుంది.

పైన పేర్కొన్న మూడు ఋణాల్నీ తీర్చుకోకపోతే మోక్షం సిద్ధించదని చెబుతారు.

మాతాపితృ ఋణం తీర్చుకోడానికి వివాహం తప్పనిసరి!

పురుషార్థ సాధన

పురుషార్థాలు నాలుగు.

ధర్మం, అర్థం, కామం, మోక్షం.

ప్రతీవారూ వీటిని సాధించాలి.

మోక్షం పరలోకానికి సంబంధించినది. మిగతా మూడూ ఇహానికి చెందినవి.

ధర్మార్థకామాలు మూడూ సాధించడానికి అనువైన వ్యవస్థ – వివాహం!

వాటిని సాధిస్తూ – అదీ ధర్మ సహితంగా – మనిషి మనీషిగా రూపొందాలి. పశుత్వం విడిచి మానవత్వం దాటి దైవత్వం వైపు అడుగులేయాలి.

ఒక యజ్ఞం

ప్రాచీనులు వివాహాన్ని ఒక యజ్ఞంగా పరమ పవిత్ర కృత్యంగా భావించారు.

వివాహం చేసుకుని గృహస్థ జీవనంలో ప్రవేశించని వానిని అయజ్ఞియ లేక యజ్ఞహీనుడని పేర్కొన్నారు.

ఏకాకిగా వున్న పురుషుడు అపూర్ణుడు. అతడు చేసిన యజ్ఞము వలన దేవతలు తృప్తిని ప్రీతిని పొందరు. భార్యాసహితుడై పూజించినపుడే తృప్తిని పొందుతారని వేదాలలో చెప్పబడింది.

పెళ్లితోనే పరిపూర్ణత

స్త్రీ పురుషులు రెండు సగాలు. ఇద్దరూ కలిస్తేనే సంపూర్ణత్వం.

మనిషి జీవితానికి సార్థకత, సంతృప్తి, పరిపూర్ణత లభించడానికి పెళ్లి తప్ప మరో మార్గంలేదు. పూర్వులు సంస్కారాలన్నింటిలో వివాహానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది ఇందుకే!

హైందవ ధర్మం ప్రకారం వివాహం ధార్మికమే కాదు ఆధ్యాత్మికం కూడా.

'వ్యక్తి గృహస్థాశ్రమంలో ప్రవేశించి యజ్ఞాలు చేస్తూ పుత్రులను పొందాలి' – ఋగ్వేదం.

'వంశం నిలవాలన్నా స్వర్గం లభించాలన్నా స్త్రీ తోడుగా ఉండే వివాహం వల్లే సాధ్యం' – యాజ్ఞవల్క్య స్మృతి.

'వివాహం చేసుకుని భార్యా పిల్లలతో కలిసి ఎవరైతే ధార్మిక కర్మలను చేస్తాడో వాడే పరిపూర్ణమైన మనిషి' – మనుధర్మశాస్త్రం.

స్త్రీ పురుషుల దాంపత్య ధర్మాచరణకు వివాహమే నాంది.

స్త్రీ పురుషుల జీవితాలను కలిపి ముడివేయడానికి పెళ్లికి మించిన సాధనం లేదు. ప్రత్యామ్నాయమూ లేదు.

పెళ్లి మనిషి జీవితంలో పెద్ద పీట వేస్తుక్కూర్చుంది!

౨

పెళ్లంటే...?

పెళ్లి అనేది ఇద్దరు – ఒక స్త్రీ ఒక పురుషుడు – కలిసి ఉండే సాంఘిక వ్యవస్థారూపం.

వారిలో ఒకరు యజమాని. మరొకరు యజమానురాలు.

ఇద్దరూ సేవకులు.

మళ్ళీ అంతా కలిసి ఇద్దరే.

స్వయం ప్రభు స్వయం సేవకః

అదే వివాహ వ్యవస్థలోని చమత్కారం!

పొందించేది వివాహం

వివాహమనేది సంస్కృత పదం. 'వహ్' అనే ధాతువుకు ప్రాపణమని అర్థం. ప్రాపణమంటే పొందించడం కాబట్టి వివాహం అంటే విశిష్టంగా పొందించేది అని భావం.

దేనిని లేదా వేటిని పొందిస్తుంది?

వరుడికి వంశాభివృద్ధినీ తద్వారా పితౄణ విముక్తినీ పొందిస్తుంది.

కన్యాదాతకు బ్రహ్మలోకాన్ని పొందిస్తుంది.

వధూవరులిద్దరికీ ధర్మార్థ కామాలను పొందించి మోక్షానికి మార్గం సుగమం చేస్తుంది.

సమాజానికి గృహస్థ సేవలను పొందిస్తుంది.

సృష్టిధర్మం

స్త్రీ పురుషులు ఏకమై దాంపత్య జీవనం గడపడం సృష్టిధర్మం.

పురుషార్థ సాధనకు వారు చేసే సహజీవనమే పెళ్లికి పరమావధి.

వారిని వివాహం బంధం సంపూర్ణులని చేస్తుంది. ఒకరినొకరికి తోడునీడ చేస్తుంది.

సర్వసమ్మతమైన సంతానానికి జన్మనివ్వడానికి కారణమవుతుంది.

సృష్టికార్యానికి ఒక అర్థాన్ని ఒక పరమార్థాన్ని కలిగించి గృహస్థ జీవనానికి ధన్యత చేకూర్చేది పెళ్లే!

మహాకార్యం

హిందూ వివాహం ఒక పవిత్రమైన ధర్మ సంస్కారం.

ఒక మహాయజ్ఞం.

అందులో ఆహుతివ్వాల్సింది స్వార్థమే. సంశయమే. అవిశ్వాసమే!

త్యాగం ద్వారా ప్రేమ యొక్క పవిత్రతను సంరక్షించాలి. ప్రేమను ఉన్నతోన్నత స్థితికి తీసుకుని వెళ్ళటమే పెళ్లి యొక్క పరమోద్దేశం.

ప్రేమ, స్నేహం, ఆదరభావం, అనురాగం, కరుణ, ఆనందం, ఆహ్లాదం, ఉత్సాహం లాంటి మధుర భావనలే మానవజీవితానికి ఆవశ్యకమైన సంపదలు.

త్యాగం, క్షమ, సేవ, సహిష్ణుత, ధైర్యం వంటి సద్గుణాల ద్వారా ఆ సంపదల్ని పరిరక్షించుకోవాలి. వృద్ధి చేసుకోవాలి.

పెళ్లి మానవజాతి అభివృద్ధికి ఎంతో దోహద పడింది. పరిధి విస్తృత పరచుకోడానికీ కొత్త రంగాలకు విస్తరించడానికీ సాయపడింది.

అందుకనే భారతీయ తాత్వికులు పెళ్లిని ఒక యజ్ఞంగా ఒక శాశ్వత అనుబంధంగా జన్మజన్మల బంధంగా సమాజ శ్రేయోభిలాషిగా అభివర్ణించారు.

నూరేళ్ళ పంట

పెళ్లి రెండుగంటల తంతో ఐదురోజుల వ్యవహారమో కాదు.

జీవితాంతం కలిసుండమని కలిసి శ్వాసించమని చెప్పే గొప్ప ప్రక్రియ.

వివాహకాండలో మార్పు వచ్చింది. భార్యాభర్తల పాత్రల్లో మార్పు వచ్చింది. కాని పెళ్లిలో మార్పురాలేదు. అది మనిషి జీవితంలో తీసుకువచ్చే మార్పులూ మారలేదు.

రెండు జీవితాలని కాదు ఇద్దరి ప్రపంచాలని ఒకటి చేస్తుంది పెళ్లి.

భార్యాభర్తలు తమ తమ భిన్న వ్యక్తిత్వాలని సమన్వయ పరచుకుని సంఘటితంగా సౌహార్ద్రంతో జీవితాంతం సాగిపోవాలి.

పరస్పరాభివృద్ధి, సంతానాభివృద్ధి, సంఘశ్రేయస్సు లక్ష్యం చేసుకోమంటుంది పెళ్లి.

అంతేకాదు. ఇంద్రియ తృప్తి, భోగసాధన ముఖ్యమనుకుంటే దాంపత్య జీవితం దుఃఖ మయం అవుతుందని హెచ్చరిస్తుంది.

గృహస్థాశ్రమ రథానికి భార్యాభర్తలిద్దరూ రెండు చక్రాలు. రథ గమనానికి ఈ చక్రాలే ఆధారం. ఒక చక్రం యొక్క అవగుణం రథగతికి అవరోధమవుతుంది. రెండు చక్రాలూ పాడైపోతే రథచలనమే ఆగిపోతుంది. నూరేళ్ళపయనం అర్ధాంతరంగా ముగిసిపోతుంది!

జీవనరథప్రయాణం భార్యాభర్తలిద్దరి మీదా సమానంగా ఆధారపడి ఉంది!

ప్రకృతి - పురుషుడు

స్త్రీ పురుషుల్లో ఒకరి యెడల ఒకరికి చిత్రమైన ఆకర్షణ కల్పించింది ప్రకృతి.

'ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్'

ఇవి గీతా వాక్యాలు.

ప్రకృతి శక్తి. పురుషుడు శక్తిమంతుడు. శక్తి లేనిదే శక్తిమంతునకు స్థానంలేదు. శక్తిమంతుడు లేకుండా శక్తి ఉండదు. వారిది ఒకరి మీద ఒకరు ఆధారపడే అవినాభావ సంబంధం.

ఇదే స్త్రీ పురుషుల సంబంధానికి మూలతత్త్వం!

నరుడు పురుషునకు, నారి ప్రకృతికి ప్రతీకలు.

ఒకరు వినా మరొకరు పరిపూర్ణులు కాలేరు.

ఇద్దరి కర్తవ్యాలూ కర్మక్షేత్రాలూ వేరు వేరైనా వారు ఒకే శరీరానికి కుడి ఎడమ అవయవాల వలె పరిపూరకులు.

ఒకే శరీరస్థితి, సమృద్ధి, సువ్యవస్థ, పుష్టి, తుష్టి మొదలైన వాటికి కారకులు.

ఒకరు లేక మరొకరికి పని జరగదు.

వారి బంధానికి అనుబంధానికి మరో పేరే పెళ్లి!

భిన్నత్వంలో ఏకత్వం

స్త్రీ పురుషునకు భార్య అయినప్పటికీ పురుషుడామెకు స్నేహితుడు, సేవకుడు, యజమాని.

పురుషుడు స్త్రీకి భర్త అయినప్పటికీ అతడికామె స్నేహితురాలు, సేవిక, స్వామిని.

లజ్జ, వినయం, సౌశీల్యం, నిస్వార్థసేవ, సరళప్రేమ - స్త్రీకి ఆభరణాలు.

సంయమనం, సదాచారం, సమవర్తన, మిత్రభావం, నిస్వార్థ ప్రేమ - పురుషునికి ఆభూషణాలు.

ఇద్దరి కార్యక్షేత్రాలూ మార్గాలూ వేర్వేరు.

ఆమె గృహిణి. ఇంటికి రాణి. ఇల్లు ఆమె రాజ్యం. భర్త, పిల్లలు, ఇల్లు – ఆమె అనుబంధాలు.

అతడు గృహస్థుడు. సంపాదనాపరుడు. పనిచేసే ప్రదేశమే అతడి క్షేత్రం. భార్య, సంతానం, గృహం – అతడి బంధాలు.

సమాజంతో వారిది సమిష్టి బంధం.

వారి పాత్రల రూపురేఖలు మారవచ్చు. కార్యక్షేత్రాలూ కార్యాలూ కర్తవ్యాలూ భిన్నమైనవిగా మారి వుండొచ్చు.

అయినా ఇద్దర్నీ కలిపి వుంచే మానసికబంధం వివాహం!

ఒకేలా ఆలోచించడం గాకుండా కలిసికట్టుగా జతగా ఆలోచించడం వివాహలక్ష్యం!

ఆత్మార్పణ ప్రధానం

పెళ్లి తర్వాత ఎదుటి వారి నుంచి ఏం పొందగలం అన్న ఆలోచన పెళ్లికి ఆధారంగా కాకూడదు.

పెళ్లి రెండు జీవచైతన్యాలు ఒకదాన్ని మరొకటి అర్థం చేసుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకునే చక్కని అవకాశం!

త్రివేణీ సంగమంలో గంగ, యమున కలుస్తాయి.

సరస్వతి అదృశ్య నది గనుక కన్పించదు.

కలయికకు ముందు గంగ ఒకరకంగా యమున మరో రకంగా ఉంటాయి. అవి రెండూ కలిశాక ఏది గంగో ఏది యమునో చెప్పలేం. రెండూ విడదీయలేనంతగా గుర్తు పట్టలేనంతగా కలిసిపోతాయి.

పెళ్లి ద్వారా వధూవరులలా కలిసిపోవాలి.

అందుకు తొలిమెట్టు ఆత్మార్పణ.

ఒకరి నొకరికి అర్పించుకోవాలి. ఇద్దరూ ఒకటవ్వాలి. మానసికంగా జతపడాలి.

రెండు 'నేను' లు ఒక 'మేము' అవ్వాలి. అవసరమైతే కొన్ని త్యాగాలు చెయ్యాలి. వ్యక్తుల కోసం కాదు వారి బంధం కోసం మాత్రమే.

అప్పుడిహ వారి బంధం నిత్యం. వారి సంబంధం అభేద్యం.

వివాహం ఆత్మార్పణ ప్రేమల యొక్క సజీవ స్వరూపం!

రెండు కుటుంబాల మధ్య వారధి

పెళ్లి ఆడ మగ – ఇద్దరు వ్యక్తుల్ని మాత్రమే కలపదు.

రెండు కుటుంబాలని కలుపుతుంది.

వధూవరుల కుటుంబాల మధ్య వారిధియై నిలుస్తుంది.

తద్వారా వారి బంధుమిత్రుల్నీ దగ్గర చేస్తుంది. బాంధవ్యం వారి మధ్య సంబంధాలని ముడివేస్తుంది.

వారంతా నూతన దంపతులకు అండగా నిలుస్తారు.

కొత్తగా ఏర్పడిన వారి కుటుంబం రాబోయే కుటుంబాలకు మూల విరాట్టుగా నిలవడానికి చేదోడు వాదోడుగా నిలుస్తారు.

సమాజాభివృద్ధికీ కుటుంబ అభివృద్ధికీ తమ వంతు కర్తవ్యం నిర్వహిస్తారు.

రెండు హృదయాలు కలిస్తే ప్రేమ. రెండు కుటుంబాలు కలిస్తేనే పెళ్లి – అంటారందుకే.

అందువల్లే కళ్యాణం లోక కళ్యాణానికి మార్గమవుతుంది!

ఒక ఒప్పందం కాదు

పెళ్లి ఒక ఒప్పందంగా ఒక అవగాహనగా ఒక ఒడంబడికగా కొన్ని జాతుల వారు భావించవచ్చు.

కాని హిందూ ధర్మానుసారం పెళ్లి ఒక ఒప్పందం కానేకాదు.

అది ఒక పవిత్ర సంస్కారం.

వధూవరులు నిష్కల్మష హృదయులై స్వీకరించే ఆజన్మ దీక్ష!

మనశ్శరీరాలను మమేకం చేసే అపూర్వ సంగమం!

అతడామెకు విష్ణువు.

ఆమె అతడికి లక్ష్మీదేవి.

ఒకరికి ఒకరుగా, ఒకరికి తోడు ఒకరుగా, ఒకరికి నీడగా ఒకరుగా, చేయీ చేయీ పట్టుకుని సాగించే సహజీవన యాత్ర!

కష్ట సుఖాలు కలబోసుకుంటూ ఆనంద విషాదాలు పంచుకుంటూ జన్మజన్మలకీ ఈ ప్రేమానుబంధం నిలిచిపోవాలని మనసావాచా కర్మణా కోరుకుంటారు.

అదే అదే పెళ్లంటే!

ఒక పవిత్ర కాండ

పాశ్చాత్య దేశాల్లో పెళ్లి రెండుగంటల్లో ముగిసిపోతుంది.

ఈ కర్మభూమి మీద అలా జరగదు.

ఇక్కడ గంటలు కాదు రోజులు కావాలి.

ఎన్నో దశలున్నాయి. ఎన్నో ఆశలున్నాయి. ఎన్నెన్నో ఆకాంక్షలున్నాయి.

ఆదేశాలూ ఉన్నాయి. అనుభూతులున్నాయి. అనుభవాల సారమూ ఉంది. ఉద్వేగాలూ ఉన్నాయి.

నిండు జీవితాలు పండటానిక్కావలసిన ముందు చూపు ఉంది. వేద విజ్ఞానం ఉంది. పెద్దల ఆశీస్సుల బలమూ ఉంది.

అంతేకాదు.

మనిషి మనుగడకు కారణమైన పంచభూతాలను పూజించడమూ ఉంది.

గణపతి మొదలు సమస్త దేవుళ్ళూ దేవతలూ కళ్యాణ మంటపానికి తరలి వస్తారు.

ముక్కోటి దేవతలూ ఆశీర్వాదించే పవిత్రకార్యం – పెళ్లి!

దిక్సూచి పెళ్లి

యువతి యువకుడు ఇంతదాకా బాదరా బందీ లేకుండా గడిపారు.

విభిన్న వాతావరణంలో పెరిగారు.

భిన్న అభిరుచులు! అలవాట్లు! ప్రవర్తనలు! ఆచారాలు! ఆశలు! ఆశయాలు!

అలాటి ఇద్దరు ఒకటి కాబోతున్నారు. బాధ్యతల బరువుల్ని తలకెత్తుకోబోతున్నారు.

వారి వారి భవిష్యత్తుకే కాదు అటు వారి పెద్దల భవితకు, ఇటు వారి సంతానపు భవిష్యత్తుకూ నిర్దేశకులు కాబోతున్నారు.

వారికి దిశానిర్దేశం చెయ్యాలి.

ఆ బాధ్యత హిందూ వివాహం నిర్వర్తిస్తుంది.

నూతన వధూవరులకు గృహస్థ ధర్మాలను బోధిస్తుంది. వారెలా మెలగాలో ఎలా నడవాలో వివరిస్తుంది. వ్యక్తికీ సమాజానికీ ఉన్న సంబంధాన్ని చెబుతుంది. సాంఘిక మర్యాదలను సూచిస్తుంది. బంధుజనంతో పరివారంతో గల విభిన్న బంధాల విలువను తెలియజెబుతుంది.

పంచభూతాల ప్రాముఖ్యాన్ని వివరిస్తూనే ఆధ్యాత్మిక విలువల గురించి విడమరచి చెబుతుంది.

అండ పిండ బ్రహ్మాండంలో మనిషి స్థానమెంతో భగవంతుని స్వరూపమేమిటో వివరిస్తూనే కర్తవ్య బోధ చేస్తుంది.

వివాహం ఒక సంస్కారం! ఒక సందేశం!! దిక్సూచి!!!

పర్యాయపదాలు

వివాహ సమయంలో జరిగే క్రియలను దృష్టిలో పెట్టుకుని పెళ్లికి ఎన్నో పర్యాయపదాలొచ్చాయి.

అవి – పెళ్లి, పెండ్లి, పెండిలి, వివాహం, మనువు, పరిణయం, ఉద్వాహం, కల్యాణం, పాణిగ్రహణం, పాణిబంధం, దారోప సంగ్రహణం, పాణిపీడనం, దార పరిగ్రహణం, దారకర్మ, దారక్రియ మొదలైనవి.

పెళ్లే జీవితం

ప్రస్తుత కాలంలో పెళ్లికన్నా ఉద్యోగానికీ కెరీర్‌కీ అధిక ప్రాముఖ్యత ఇస్తున్నట్టు కన్పించవచ్చు. అన్పించవచ్చు.

కానది నిజం కాదు.

వయసొచ్చినప్పట్నుంచి వయసుడిగే వరకూ మనిషి జీవితం యావత్తూ పెళ్లి దానికి సంబంధించిన బరువు బాధ్యతలు, సంతోషాలు సమస్యలు – సమస్తమూ పెళ్లితోనే ముడివడి ఉన్నాయి.

వివాహం ద్వారా విడదీయలేని దాంపత్య బంధం ఏర్పడి దంపతులిద్దరూ ధార్మికమైన భోగాలననుభవిస్తూ కుటుంబపరంగా సమాజపరంగా తమ బాధ్యతల్ని కూడా కలిసి మెలసి నిర్వహిస్తారు.

సృష్టిక్రమాన్ని నిరంతరంగా కొనసాగించడమే గాక ఇద్దర్ని ఒకరిగా చేసే సహజీవనం చేయించే పవిత్ర ప్రక్రియ పెళ్లి!

మనిషి జీవితానికి కీలకమైన వివాహం గురించీ దానికి సంబంధించిన సమస్త విషయాల గురించీ తెలుసుకోవడం అవసరం.

తమ తమ జీవితాలని శుభప్రదం సుఖప్రదం చేసుకోడానికి పెళ్లి గురించిన పూర్తి అవగాహన అత్యవసరం!

అటు వ్యక్తులకీ ఇటు సమాజానికీ పెళ్లి ఒక రక్షా కవచం!

3

పెళ్లెందుకు?

యువతీ యువకుల్ని 'పెళ్లి అయిందా' అని అడుగుతాం గాని 'పెళ్లి చేసుకుంటావా' అని అడగం.

పెళ్లి చేసుకోకపోవడం విడ్డూరం గాని పెళ్లి చేసుకోవడం విశేషం కాదు గనుక!

ఎంచేతంటే వయసొచ్చిన ప్రతివారూ పెళ్లి చేసుకోవాలని తహతహలాడతారు. వారి తల్లిదండ్రులు వారికి పెళ్లి చేసి తమ బాధ్యత తీర్చుకోవాలని ఆరాటపడతారు.

పెళ్లి ఒకానొక వయస్సులో చేసుకోవాల్సిన వేడుక! తప్పని సరియైన సామాజిక ప్రక్రియ!

పెళ్లెందుకు చేసుకుంటున్నావని అడిగితే రకరకాల కారణాలూ వాదనలూ విన్పించవచ్చు. అన్నిట్లోనూ కొంతైనా సత్యం ఉండటమే వివాహపు విశేషం!

వివాహ వ్యవస్థ సమగ్రమైన సంపూర్ణమైన సంక్లిష్టమైన సమున్నతమైన మానవ వికాస తరంగిణి!

పెళ్ళే లేకపోతే?

మనిషి జంతువువవుతాడు. అనాగరిక కాలం మళ్ళీ వస్తుంది. సమాజం అస్తవ్యస్తమై పోతుంది.

వికృత సంబంధాలూ స్త్రీకోసం కొట్లాటలూ స్త్రీల మీద అత్యాచారాలూ జులయిగా మారే పిల్లలూ ఒంటరి పేరెంట్స్ అనాథలైన పిల్లలూ నిరాదరణకు గురయ్యే వృద్ధులూ ఎవరూ పట్టించుకోని రోగిష్ఠులూ... ఆ సమాజపు ఊహే భయానకం!

లైంగిక విశృంఖలత్వానికి సంకెళ్ళు వెయ్యాలి. మనిషినీ మనస్సునీ నియంత్రించాలి. నియమ నిబంధనల చట్రంలో ఇమిడి ఉండేలా చెయ్యాలి. సామాజిక బాధ్యతల్ని స్వీకరింపజెయ్యాలి.

అప్పుడే సమాజం సహజీవన కేంద్రం అవుతుంది.

అందుకు పెళ్లి తప్పని సరి!

పెళ్లికి ముందు గాని తర్వాత గాని వివాహేతర లైంగిక సంబంధాలని భారతీయ సంస్కృతి హర్షించదు. వాటివల్ల జన్మించిన సంతానానికి గుర్తింపు ఉండదు. ఆస్తిలో భాగముండదు. సమాజంలో గౌరవముండదు.

అలాటి సంతానమున్న జాతికీ గౌరవమర్యాదలుండవు.

మానవజాతి అలా పతనం కాకూడదని ఏర్పాటు చేసిన కఠినకట్టుబాటే పెళ్లి!

తోడు కావాలి

మనిషి ఒంటరిగా వేరుగా జీవించలేడు. పశు పక్ష్యాదులు కూడా తోడు కోరతాయి.

జీవితంలో ఎక్కువ కాలం కలిసివుండటానికి మగకు ఆడ, ఆడకు మగతోడు అవసరం.

ఒకరికొకరు ఆసరాగా నిలిచినపుడే కుటుంబ బాధ్యతలను జీవితకార్యాలను సక్రమంగా నిర్వర్తించగలరు. మనస్సూ శరీరం రెండూ సంపూర్ణంగా సహకరిస్తేనే అది సాధ్యం.

స్త్రీ పురుషులిద్దరికీ కొన్ని కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. కొన్ని బలాలుంటాయి. కొన్ని బలహీనతలూ వుంటాయి. పెళ్లిద్వారా ఆ లోటుపాట్లు తీరి ఒక సంపూర్ణ శక్తిగా మారతారు. ఇందుకే పెళ్లి అవసరం.

జీవనరథానికి ఇద్దరూ రెండు చక్రాలుగా మారతారు. అప్పుడు దాని గమనం హాయిగా సాగిపోతుంది. భౌతికంగానే కాదు మానసికంగా ఆధ్యాత్మికంగా ఒకరు రెండోవారికి 'చేదోడు' అవుతారు.

జాతి సంరక్షణ

ప్రతి జీవీ ప్రతి జాతీ పారంపర్యాభివృద్ధి చెందుతూ ఎప్పటికీ కొనసాగుతూండాలి. అదే ప్రకృతిలోని ఆత్మసంరక్షణ లేదా జాతి సంరక్షణ.

చెట్టు పెరగటం పువ్వు పూయడానికి. పువ్వు పూయటం పండు కావటానికి. పండు విత్తనం మవటం మళ్ళీ చెట్టు పుట్టించడానికే.

ఇది ప్రకృతి తీసుకున్న జాగ్రత్త!

కదలని చెట్లూ చేమలూ కదిలే సమస్త జీవజంతుజాలమూ పుడుతూ ఉండటానికి ఆ ప్రక్రియ నిరంతరం కొనసాగటానికి కొన్ని ఉపాయాలు చూపించింది.

అదే ఆడా మగా కలయిక!

ఆకలి నిద్ర ఎంత సహజమో యుక్తవయస్సు వచ్చేసరికి మైథున కాంక్ష కూడా అంతే సహజం.

అదొక ఉద్రేకం. బలమైన కోరిక. గొప్ప ఆకర్షణ!

దాన్నుంచి ఎవరూ తప్పించుకోలేరు.

అది ప్రకృతికార్యం. అనివార్య సంభోగం!

ప్రకృతి నుంచి పెళ్లి

ఎదకొచ్చిన జంతుజాలం జతకడుతుంది.

కేవలం సంతానంకోసం తమ జాతిని వృద్ధి చేసుకోవడం కోసం క్రీడిస్తాయి.

జతకట్టడం నిర్ణీత ఋతువులో చేసే ఒక ప్రకృతి చర్య.

ఆ తర్వాత ఎవరికి వారే.

పాలు ఇవ్వడం పెంచడం రక్షణగా నిలవడం ఆడతెగ పని.

బిడ్డకోసం కట్టుబడి ఉండే కట్టుబాటు బిడ్డ పెరిగేంతవరకే ఉంటుంది.

గుడ్లనో శిశవునో కాపాడుకోడానికి తల్లి హోరాహోరీ పోరాడుతుంది. స్వసుఖాన్ని సైతం మరచిపోతుంది.

అది ప్రకృతి విధించిన నిబంధన. జాతి రక్షణ కోసం ఏర్పడ్డ విధి!

ఆదిమ కాలంలో మనుషులూ పశువుల్లానే ప్రవర్తించారు.

విచ్చలవిడిగా విహరించడం జతగూడటం జరిగేది. వావి వరుస నిషేధం ఆంక్ష ఇలాంటివేమీ లేవు. ఎంచుకోవటం అనేదీ లేదు.

కామతృష్ణ కలిగినప్పుడు జతకూడటమే సహజకార్యం.

రెంటికీ తేడా ఏమిటంటే జంతువులకు ఋతువులున్నాయి. మనిషికి లేవు!

అంటే స్త్రీ పురుష సంబంధం ప్రకృతిలోనే ఉంది.

పెళ్లి లేకపోయినా ఈ సంబంధం ఉంటుంది. ప్రకృతి సాగుతుంది. అంటే ప్రకృతి గమనానికి పెళ్లి అప్రధానం. పెళ్లి లేకున్నా సృష్టి కెలాంటి లోటూ నష్టమూ లేవు.

స్త్రీ పురుషులిద్దరికీ ప్రకృతిలో ఉన్న సంబంధాన్ని కొంత నిరోధించేదే పెళ్లి – అంటారు తాపీ ధర్మారావు.

పరిణామ క్రమంలో పెళ్లి

తొలినాళ్ళల్లో తెగ అంతా ఒకటే వంశం. గుంపు అంతా ఒకటే కుటుంబం. సంతానం ఎవరికి పుట్టినా వంశాభివృద్ధే.

అందరికీ అందుబాటులో ఉండే ఒక ఆడదానిని ఒక్కడికో ఒక్క గుంపుకో మాత్రం అందుబాటులో ఉండేటట్టు నిరోధించింది పెళ్లి.

ఆడవాళ్ళందరికీ ఉపయోగకరంగా ఉండే ఒక మగవాడిని ఒక్క స్త్రీకో ఒక్క జట్టుకో పరిమితం చేసింది పెళ్లి.

అంటే స్త్రీ పురుషుల మధ్యగల సంబంధాన్ని పెళ్లి నియంత్రించింది. నిర్బంధించింది. నియమాలు చట్రంలో బిగించింది.

మారిన సామాజిక పరిస్థితుల దృష్ట్యా అది అనివార్యమైంది.

వేట – పశువుల పెంపకం – వ్యవసాయం –

ఈ పరిణామంలో మనిషికి మరొకరి తోడు, సాయం అవసరమైంది.

పనీపాటల్లో సాయపడటానికి, వేటాడి తెచ్చింది వండటానికి, ఆహారం జాగ్రత్త పరచటానికి ఆడతోడు కావాల్సి వచ్చింది.

గర్భం ధరించినప్పుడు ఆహారభద్రతలు సమకూర్చడానికీ పిల్లల్ని పెంచడానికీ స్త్రీకి మగతోడు అవసరమైంది.

ఒకరు ఒకర్తోనే ఉండటం, ఒకర్నే అంటి పెట్టుకునుండటం మొదలైంది. విచ్చలవిడి విహారానికి ఆంక్షలు ఏర్పడ్డాయి.

స్వంత ఆయుధాలు, స్వంత ఆస్తి ఏర్పడేసరికి ఆ బంధం మరింత బలీయమైంది. పెళ్లిగా రూపుదిద్దుకుంది. ఆస్తిపాస్తుల్నీ అధికారాన్నీ తను కన్న సంతానానికే దక్కాలన్న కోరిక 'ఏక పతి' నిబంధనకి మూలమైంది.

పెళ్లి మొదలయ్యాక జాతులలో కొత్త కొత్త నియమాలూ నిబంధనలూ చోటు చేసుకున్నాయి. వ్యక్తి, సమాజ వికాసాల కనుగుణంగా మార్పులొచ్చాయి.

ఆదిలో సహాయ సహకారాలకోసం అనగా అవసరం కోసం ఏర్పడింది పెళ్లి.

శ్రమ విభజనతో ఒకరు ఇంటికీ మరొకరు సంపాదనకూ కేంద్రమయ్యారు!

ప్లేటో ఆదర్శరాజ్యం

ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త ప్లేటో ఒక 'ఆదర్శరాజ్యా'న్ని ఊహించారు.

అందులో సొంత ఆస్తులూ సొంత కుటుంబాలూ ఉండకూడదు. అవి స్వార్థాన్ని పెంచుతాయి. స్త్రీ పురుషులు ఎవరు ఎవరితోనైనా శారీరక వాంఛలు తీర్చుకోవచ్చు. పుట్టిన పిల్లలకు రాజ్యవ్యవస్థచే నడుపబడే శిశు సంరక్షణాలయాల్లో చేర్చుతారు.

వారిని పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే. తండ్రి ఉండడు. తల్లి బాధ్యతా పరిమితంగానే ఉంటుంది.

స్త్రీలు సమాజశ్రేయస్సు కోసం పాటు పడేందుకు పురుషులతో బాటు వారికీ శిక్షణ ఇస్తారు.

కుటుంబ వ్యవస్థ స్త్రీల స్వాతంత్ర్యాన్ని హరిస్తోందని ప్లేటో తన 'ది రిపబ్లిక్' గ్రంథంలో అభిప్రాయపడ్డారు.

చిత్రమేమిటంటే తదనంతరం ప్లేటో ఈ అభిప్రాయాన్ని మార్చుకున్నారు.

'THE LAWS' లో ఏమన్నారంటే –

"ఎవరూ మరణించాలని కోరుకోరు. తమ సంతానం ద్వారా ఈ లోకంలో కలకాలం జీవిస్తూ అమరత్వాన్ని సాధించాలని కోరుకుంటారు"

వివాహ, కుటుంబ వ్యవస్థల ఆవశ్యకతను గుర్తించడమేగాక ప్రతివారూ విధిగా వివాహం చేసుకోవాలంటారు ప్లేటో. అంతటితో ఆగకుండా ఒకడుగు ముందుకేసి 35 సం. వచ్చినా వివాహం చేసుకోని పురుషుడ్ని శిక్షించాలంటారు!

అరిస్టాటిల్ దార్శనికత

ప్లేటో శిష్యుడు, ప్రాచీన గ్రీకు దార్శనికుడు, అసాధారణ మేధావి అయిన అరిస్టాటిల్ ఏమంటున్నారో చూడండి.

"ప్లేటో ఆదర్శరాజ్యంలో ప్రతివాడికీ వందలమంది బిడ్డలుంటారు. కాని తనబిడ్డ ఎవరో తెలియదు. అలాగే ప్రతిబిడ్డకీ వందలమంది తండ్రులుంటారు. కాని తన తండ్రి ఎవరో తెలీదు. ఇలా ఎవరూ ఎవరికీ చెందని వ్యవస్థ చాలా హానికరమైంది.

సామాన్య ప్రజలకే కాదు పాలకులకు కూడా సొంత కుటుంబాలుండటం అవసరమే. కుటుంబ జీవనంలోని అనురాగం, వాత్సల్యం వారి అనుభవంలోకి రావాలి.

పిల్లలు కొంత వయస్సు వచ్చేవరకూ తల్లిదండ్రుల పెంపకంలో ఉండటం అవసరం. పిల్లలు పుట్టుకతోనే ఆరోగ్యవంతులుగా ఉండాలంటే శారీరక మానసిక పరిపక్వత వచ్చిన తర్వాతనే వివాహాలు జరగాలి."

మనిషి సంఘజీవి

నేను వేరు సంఘం వేరు అని అనుకోలేరు.

వ్యక్తుల కలయికే సంఘం. వ్యక్తులు కలిస్తేనే వ్యష్టి సమిష్టి అవుతుంది.

పుట్టినప్పట్నుంచి గిట్టే వరకూ మనిషి ఒంటిగా ఉండలేడు. ఒంటరిగా బతకలేడు.

అతడి శారీరక మానసిక అవసరాలు తీర్చుకోడానికి సమాజంలోని ఇతర వ్యక్తులెంతో అవసరం. ముఖ్యంగా సుఖదుఃఖాలలో శరీరం అస్వస్థత చెందినప్పుడు, ముసలితనంలో జవసత్త్వాలు ఉడిగినప్పుడు ప్రతి మనిషికీ ఇంకో మనిషి తోడు అవసరం. తన భావాలు అనుభవాలు అనుభూతులు ఇతరులతో పంచుకోవాలి. అప్పుడే అతడి జీవనం తృప్తిగా ఆనందంగా గడుస్తుంది.

ఆహార సాధనకి అంటే వృత్తి ఉద్యోగాలకి, విహార వినోదాలకి, ఆత్మరక్షణకి, ఆస్తి రక్షణకి, పిల్లల చదువులకి సంరక్షణకి, ఆరోగ్యానికి మనశ్శాంతికి – అన్నిటికి కూడా – అంటే మనుగడకి – మనిషి ఇతరుల మీద – అంటే సమాజం మీద ఆధారపడక తప్పదు.

ఆ సంఘంలో ఒకరిగా కలిసిపోడానికి గాను పెళ్లి విషయంలో సైతం సమాజ నియమాలను ఆమోదించాలి. ఆచరించాలి.

అప్పుడే అందర్లో తను. అందరితో తను. అందరికోసం తను. తనకోసం అందరూ – అవుతారు!

పెళ్లి బాధ్యతలతో కూడిన దైనందిన జీవనయాత్ర.

ఆ యాత్రా సఫలత సమాజం మీద సామాజిక సంబంధాల మీద ఆధారపడి ఉంటుంది!

పెళ్లి సామాజిక ప్రక్రియ

ఆడమగ పెళ్లి చేసుకోవటమనేది వ్యక్తిగతమే అయినా వారికి భార్యాభర్తలుగా గుర్తింపు కోసం వారి పిల్లలకో గుర్తింపు కోసం పెళ్లి సామాజిక అంశమైంది. సమాజ ఆమోద ఆశీస్సులు అవసరమయ్యాయి!

మతపరమైనది గాకపోయినా ఏదో రకమైన పెళ్లి కార్యక్రమం అనివార్యమైంది.

అప్పుడే స్త్రీ పురుషుల సంబంధానికి సమాజపు ఆమోదం లభిస్తుంది. చట్టబద్ధత చేకూరుతుంది.

ఈ సంఘ నియమం పాటించడం వల్ల ఆస్తి, వారసత్వం, పిల్లల పోషణ, స్త్రీ పోషణ వగైరాలు సమస్యాత్మకం కాకుండా పోతోంది.

అనగా పెళ్లి కార్యక్రమం స్త్రీ పురుషుల్ని భార్యాభర్తలుగా కలుపుతోంది. బంధుమిత్రులతో సంతోషాన్ని పంచుకునేట్టు చేస్తోంది. సమాజంలో వారికీ వారి పిల్లలకీ గౌరవస్థానం కల్పిస్తోంది. చట్టబద్ధమైన హక్కుల్ని ఇస్తోంది. సాంఘిక ప్రకటనగా ఉపయోగిస్తోంది.

పెళ్లి సామాజిక భద్రతనూ కల్పిస్తోంది!

పెళ్లి కామం కోసమే

'వివాహం చట్టబద్ధమైన వ్యభిచారం' అన్నారు పాశ్చాత్యులు.

వారి దృష్టిలో పెళ్లి సెక్స్ కోసమే.

వివాహానికి పూర్వమే లైంగిక సంబంధాలు కలిగివుండటం తప్పుకాదన్నది వారి దృక్పథం.

వారు పెళ్లిని కామదృష్టితోనే చూస్తారు. ప్రేమ ఉండదని కాదు. ఉంటుంది. కానది ఒక ఆవేశంలాంటిది. పాలపొంగులాంటిది. ఒక గంట ఉండొచ్చు. ఒకరోజు ఉండొచ్చు ఒక ఏడాది ఉండొచ్చు.

జీవిత భాగస్వామి పట్ల ప్రేమ లేదా ఆకర్షణ తగ్గిన మరుక్షణం పెళ్లిని రద్దు చేసుకుంటారు. విడాకులు పుచ్చుకుని విడిపోతారు. వేరే వేరే వివాహాలు చేసుకుని 'సుఖాల' వెంట పరుగులు తీస్తారు.

సంతానంతోనూ వారి అనుబంధం పరిమితమే. వారికి రెక్కలు వచ్చే వరకే ఉ ంటుంది. వయస్సు రాగానే పిల్లలు సైతం తమ జీవితాల్ని లేదా సుఖాల్ని వెదుక్కుంటూ వెళ్ళిపోతారు.

వారిది 'నా సుఖం' 'నా సంతోషం' చుట్టూ తిరిగే వ్యక్తిగత లాలస! భౌతిక సుఖాల వెంట వెంపర్లాట!

ఆ సూత్రమే వారి పెళ్లిళ్ళకీ వర్తిస్తుంది!

సవాలక్ష కారణాలు

పెళ్లెందుకని ప్రశ్నిస్తే ఎన్నో జవాబులు ఎన్నో రకాలవి వస్తాయి.

ఒకరు తోడుకోసం అంటారు. ఒకరు వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూట్టాని కంటారు.

మరొకరు ఇంట్లో దక్షత లేదని అంటే ఇంకొకరు ప్రేమకోసమంటారు.

ఒకరు కామం కోసమంటే మరొకరు పిల్లలు కోసమంటారు.

ఒంటరితనం జయించడానికని ఒకరంటే సామాజిక గుర్తింపు కోసమంటారింకొకరు.

ఒకరు సాంఘిక గౌరవానికీ చట్ట గుర్తింపుకీ అంటే ఒకరు ఆర్థికభద్రత కోసం అంటారు.

అన్నీ సత్యాలే.

ఎంచేతంటే వివాహం ఒక అద్భుత ప్రక్రియ!

ఆడ మగ ఇద్దరు కొత్త వ్యక్తుల్ని కలుపుతుంది. రెండు జీవితాలను పెనవేస్తుంది. ఒకరికోసం ఒకరు అన్న భావన పెంచుతుంది. ఒక కమ్మని ఆత్మీయభావం అనురాగం పొంగిపొరలేలా చేస్తుంది. విచిత్రమైన అనుభూతికి లోను చేస్తూనే సాంఘిక బాధ్యతలు నెరవేర్చడానికి దోహదపడుతుంది.

స్త్రీ పురుషుల సమాగమం స్త్రీ పురుష కణాల కలయికకీ పిండోత్పత్తికీ మాత్రమే పరిమితం కాలేదు. వారి భౌతిక మానసిక ఆధ్యాత్మిక సమైక్యానికి తోడ్పడుతుంది.

ఈ సమైక్యతలో సుఖానుభూతిలో సహజీవనంలో భార్యాభర్తల ప్రేమానుబంధం సుస్థిరత చేకూర్చుకుంది!

హిందూ దృక్పథం

జీవితం గృహమైతే పెళ్లి జీవిత పరిపూర్ణత అనే ద్వారం.

జీవితం పురుషార్థాల నిర్వహణ కోసం అంటుంది భారతీయ సంస్కృతి.

ఇహపరాలు రెండూ ముఖ్యమంటుంది.

ధర్మార్థ కామ మోక్షాలు మానవుడికి అనుసరణీయం అమరత్వ సాధనకు మార్గం అంటారు మహర్షులు.

వివాహం ఒక సంస్కారమనీ ఋణత్రయం తీర్చుకోడానికి ముఖ్యమంటాయి వేదాలు.

గృహస్థాశ్రమ ధర్మమే ఉన్నతమైందంటుంది మనుస్మృతి.

భార్యా సమేతుడై చేస్తేనే యజ్ఞయాగాలు వ్రత పూజలూ క్షేత్ర దర్శనాలూ నదీ స్నానాలూ పూర్తి ఫలితాన్నిస్తాయంటాయి ఇతిహాసాలు.

దాంపత్య జీవనం మన సమాజానికి ప్రాకారంలాంటిది. దాంపత్య ధర్మంలోని దృఢత్వానికి దుర్భేద్యానికి సీతారాములు నిలువెత్తు నిదర్శనం!

కుటుంబ వ్యవస్థ ద్వారా నైతిక విలువలు కాపాడుతూ సామాజిక ఆదరణనీ గౌరవాన్నీ భద్రతనీ పొందాలంటారు పెద్దలు.

జీవితానికి సార్థకతా సంతృప్తీ పరిపూర్ణతా సిద్ధించాలంటే పెళ్లి అవసరమని వేదాలు ఇతిహాసాలు ధర్మశాస్త్రాలు పురాణాలు స్మృతులు ఘోషిస్తున్నాయి!

వ్యక్తి క్షేమానికీ కుటుంబ వ్యవస్థ రక్షణకీ సామాజిక శ్రేయస్సుకీ జాతి ఉన్నతికీ పెళ్లి తప్పనిసరి!

4

పెళ్లి ప్రాముఖ్యత

పెళ్లి అంటే రెండు మనసుల కలియక. రెండు శరీరాల సంగమం.

ఆ కలయిక గురించి ఇద్దరికీ ఎన్నో ఊహలుంటాయి. కలలుంటాయి. ఆశ లుంటాయి. ఆకాంక్షలుంటాయి.

అవన్నీ తీరాలన్న దురాశ ఎవరికీ ఉండదు.

కానీ ఇద్దరి మధ్యా ఒక సంతృప్తి ఒక సహకారం ఒక అవగాహన ఒక ఆత్మీయత – కొన్ని కలలైనా నెరవేర్చుకోవాలన్న ఆశ తపన తప్పనిసరి.

భారతీయ సంస్కృతిలో వివాహానికి సమున్నతమైన సముదాత్తమైన పవిత్ర స్థానం ఉంది. ప్రాచీనులైన మన ఋషి పుంగవులు మానవజీవితంలో వివాహాన్ని మహత్తరమైన సంస్కారంగా రూపొందించారు.

ప్రాచీన ఆర్ష సంప్రదాయంలో వివాహమనేది భౌతికమైన క్రియాకలాపం కాదు. వేద విహితమైన శిష్టాచారం!

వివాహ పరమార్థం

మానవ జీవితానికి ప్రధానమైన ధర్మార్థ కామాలను ధర్మ బద్ధంగా రూపొందించు కొనడమే వివాహ వ్యవస్థ యొక్క పరమార్థం.

దానివల్ల మోక్షం కరతలామలకమవుతుంది.

స్త్రీ పురుషుల సంబంధాన్ని బలోపేతం చేసే వ్యవస్థ మాత్రమే కాలగతిలో నిలబడుతుంది. ఆ సంబంధాన్ని బలహీనం చేసే ఏ వ్యవస్థా కాల పరీక్షకు నిలబడదు.

వేదకాలంలో మొదలైనా ఇప్పటికీ చెక్కు చెదరని మహత్తర వ్యవస్థ వివాహ వ్యవస్థ.

దాన్ని రక్షించు కోవడంలోనే మానవజాతికి రక్షణ ఉంది! శాంతి సౌఖ్యాలున్నాయి!

రామకళ్యాణం లోక కళ్యాణం

భరతభూమిలో రామాలయం లేని ఊరుగాని సీతారామకళ్యాణం చెయ్యని ప్రాంతంగాని లేవని చెప్పాలి.

రామచరిత్ర ఈ కర్మభూమితో మమైకమయింది. దేశంలోని ఏ ప్రాంతానికెళ్ళినా ఇదిగో ఇక్కడ రామయ్య తిరిగాడు అదిగో ఆ కొలనులో సీతమ్మ స్నానమాడిందని చెప్పి మురిసి పోతారు జనం.

సీతారాములు ఆదర్శ దంపతులు. ఏకపతీ వ్రతానికీ ఏకపత్నీ వ్రతానికీ వారే ఆద్యం. ఆదర్శం. ఒకరికొకరు దూరమైనా తెగని పలుచబడని అనురాగబంధం వారిది. వారి గాథ సదా స్మరణీయం.

అందుకనే ఊరురా ఏటేటా సీతారాముల కల్యాణాన్ని సంబరంగా జరుపుతారు.

సీతారామ కళ్యాణాన్ని లోకకళ్యాణంగా సర్వశుభాలకూ సుఖసంతోషాలకూ కారణమైందిగా భావిస్తారు! ఆశిస్తారు!

అంతా సీతారాముల అడుగుజాడల్లో నడిస్తే జరిగేది లోక కళ్యాణమే కదా!

ఇది ప్రారంభం మాత్రమే

పెళ్లిలోని మధురానందాన్ని జుర్రుకోడానికి యువతీ యువకులు ఉవ్విళ్ళూరు తూంటారు. ప్రేమలో మునిగితేలాలని కలలు కంటూ ఉంటారు.

పెళ్లి చేసుకుంటే చాలు అంతా అయిపోయినట్టే అమృతభాండం చేజిక్కినట్టేనని భావిస్తారు.

నిజానికి పెళ్లి అంతంకాదు ఆరంభం మాత్రమే.

జీవితం నిజంగా మొదలయ్యేది పెళ్లినుంచే.

పెళ్లి కనిపించని గుమ్మానికి ద్వారాలు తెరుస్తుంది.

అంతులేని ఆనందానుభూతులకు తివాసీ పరుస్తుంది.

బంధనాలనిపించే బంధాల మధ్య చిక్కిస్తుంది.

కృషి పట్టుదల ఓర్పు నేర్పు ధైర్యం సాహసం నిస్వార్థత పరశ్రేయాకాంక్షలతో సాగర మథనం చేస్తే జీవితాన్ని స్వర్గతుల్యం చేసే ప్రేమామృతాన్ని లభింపజేస్తుంది పెళ్లి!

పెళ్లి ఒక బాధ్యత

శృంగార కోర్కెలు తీర్చే ఒక సాధనంగా పెళ్లిని భావించడం సరికాదు.

పెళ్లి ఒక ఎమోషనల్ ఎటాచ్‌మెంట్. మానసిక బంధం.

పెళ్లి ఒక ఆడ ఒక మగని ఒకటి చేస్తుంది. ఒకటిగా భావించుమంటుంది. ఒకటిగా సాగమంటుంది.

ఇద్దరూ విడిగా అర్ధానుస్వారాలేననీ ఇద్దరూ కలిస్తేనే సంపూర్ణత సిద్ధిస్తుందని చెబుతుంది.

పెళ్లి కొత్త స్నేహానికి మార్గం వేస్తుంది. వధూవరుల జీవితాన్ని అనూహ్యంగా మార్చేస్తుంది. చిత్రంగా ప్రాధాన్యతలూ మారిపోతాయి. దృక్పథమూ మారిపోతుంది!

వివాహం యొక్క ప్రధానోద్దేశమైన సత్సంతానాన్ని పొందాలంటుంది. తమతమ స్వార్థాలని ప్రక్కనబెట్టి కుటుంబ సభ్యుల సుఖశాంతులకై కృషి చెయ్యమంటుంది.

తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలవటమేగాక పిల్లల పాలన పోషణ విద్య ఆరోగ్యాది సంస్కారాల మీద దృష్టి పెట్టాలంటుంది. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దటానికి అహరాహం శ్రమించమంటుంది.

పాశ్చాత్యదేశాల్లో స్వసుఖం ముఖ్యమని భావిస్తారు.

తమవారి సుఖం తద్వారా సంఘ దేశ సౌభాగ్యం కోరుతుంది భారతీయ సంస్కృతి!

మనసున మనసైన తోడు

పెళ్లి తప్పని సరే కాదు ఒక అవసరం కూడా – తోడుకోసం జీవన సహచరి కోసం ప్రేమాభిమానాలకోసం!

తల్లిదండ్రులు కొంతవరకే ఉంటారు. పిల్లలూ కొంతకాలమే కలిసుంటారు. కడదాకా కలిసుండేది ఇద్దరే. ఆజన్మ సహచరులైన భార్యాభర్తలు!

'నా వారు' అని గర్వపడటానికి, నా కోసం ఒకరున్నారని తృప్తి పడటానికి, నాకు అండగా మరొకరున్నారని భరోసా చిక్కించుకోడానికి 'తోడు' అవసరం. అది పెళ్లి మాత్రమే ఇవ్వగలదు.

ప్రేమించడానికి ప్రేమించబడటానికి, గౌరవించడానికి గౌరవించబడటానికి, పంచుకోడానికి కలబోసుకోడానికి, సాంఘిక ధర్మాలు నిర్వర్తించడానికి తోడు కావాల్సిందే.

ఒంటరిగా జీవితాంతం ప్రయాణించాల్సిన దుస్థితి లేకుండా ఒక తోడు ఒక నీడ కావాలి. ఒక నేస్తం కావాలి. సంతోషం వస్తే గెంతటానికి బాధవస్తే భుజం మీద ఆని ఓదార్పు పొందటానికి బాధ్యతల్ని పంచుకోడానికి ఒక బంధం తప్పనిసరి.

మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గమూ!

అది ఒక సాలెగూడు కాదు

మగవాడికి సెక్స్ కావాలి. స్త్రీకి సెక్యూరిటీ కావాలి. ఈ పంపిణీ మీదే వివాహవ్యవస్థ ఆధారపడి ఉందంటారు కొందరు.

ఆనందమకరందాన్ని రెండు చేతులా జుర్రుకోడానికి ఏకైక మార్గం పెళ్లి అని ఇంకొందరు భావిస్తారు.

రెండు అభిప్రాయాలూ సరికాదు.

పెళ్లి జీవితాన్ని నడిపించడమే కాదు శాసిస్తుంది కూడా.

ఆనందాలు అమృత క్షణాలు అపూర్వ భావనలు అద్భుత అనుభూతులు ఉంటాయి.

కష్టాలు కన్నీళ్ళు ఏడ్పులు ఆవేశాలు కోపాలు సైతం ఉంటాయి.

ఓర్పుతో నేర్పుతో వ్యవహరిస్తే చిత్తశుద్ధితో నిస్వార్థ చింతనతో ప్రవర్తిస్తే అధిక అల్ప భావనలు రానీకుంటే ఇవ్వటంలో ఉన్న తృప్తిని గ్రోలితే వివాహంలోని ఆనందామృతాన్ని చేజిక్కించుకోవచ్చు.

సహనం సానుభూతి అవగాహన అనుకంప ఉంటే బ్రతుకును సుఖమయం చేసుకోవచ్చు.

పెళ్లి సాలెగూడో బంగారు సంకెలో కాదు.

ధన్యత చేకూర్చే ఒక అవకాశం. ఒక మోక్షసాధనం. పదుగురి శ్రేయస్సు కోసం తనని తాను నైవేద్యంగా అర్పించుకునే మహా సంకల్పం!

విశాలమైనది వివాహ వ్యవస్థ

వివాహ వ్యవస్థకి నాలుగు ముఖాలు.

ఒకటి స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా ఉండటం.

రెండు వారిద్దరూ ఒక కుటుంబంగా కలిసి ఉండటం.

మూడు సంతానానికి వారు తల్లిదండ్రులుగా ఉండటం.

నాలుగు వృద్ధులైన తమ తల్లిదండ్రులకు సంరక్షకులుగా వ్యవహరించడం.

వీటిలో ఏ భాగం అలక్ష్యానికి గురైనా అది సమాజశ్రేయస్సుకి విఘాతం కల్గిస్తుంది.

పాశ్చాత్యులీ రోజున హిందూ వివాహకాండ వైపు ఆకర్షితులవుతున్నారు. మన వివాహ వ్యవస్థ వంక ఆరాధనగా చూస్తున్నారు. మన తాత్త్విక చింతనవైపు మొగ్గ చూపుతున్నారు. మన సంస్కృతిని ప్రశంసల్తో ముంచెత్తుతున్నారు.

ఈ ఘనతంతా వివాహ వ్యవస్థని పకడ్బందీగా రూపొందించిన మన మహర్షులకీ దార్శనికులకీ చెందుతుంది.

పెళ్లిని సృష్టించిన మహానుభావుడు నిజంగా దేవుడే!

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

పెళ్లితో యువతీ యువకులు తమ స్వేచ్ఛనీ స్వాతంత్ర్యాన్నీ పోగొట్టుకుంటారని కొందరు ఆరోపిస్తూంటారు.

అది పాక్షిక సత్యం మాత్రమే.

పెళ్లికి పూర్వం 'నా ఇష్టం' 'నా ఆనందం' 'నా డబ్బు' అనుకుంటారు పెళ్లయ్యాక 'నా' స్థానే 'మా' చేరుతుంది. ఇద్దరి గురించీ కలిసికట్టుగా ఆలోచించాల్సి వస్తుంది. ప్రాధాన్యతలూ మారతాయి. బాధ్యతల నిర్వహణకుగాను తమని తాము నియంత్రించుకోవలసి వస్తుంది. కొండొకచో ఇష్టాఇష్టాల్నీ ప్రక్కన పెట్టాల్సి రావచ్చు.

అయినంత మాత్రాన వారు స్వేచ్ఛ కోల్పోయినట్టు కాదు.

నిజానికి వివాహం తర్వాతే భార్య భర్తలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పెరుగుతాయి. కానవి బాధ్యతతో కూడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు!

స్వీయ సమర్పణ

పెళ్లంటే ఒకరి మీద ఒకరికి ఆకాశమంత నమ్మకం. భూదేవంత ప్రేమ.

ఈ ప్రేమానమ్మకాలే వైవాహిక జీవితానికి పునాది. అది దృఢంగా ఉంటే ఆకాశ హర్మ్యాన్ని సైతం నిర్మించుకోవచ్చు!

అందు నిమిత్తం ఒకరికొకరు సమర్పించుకోవాలి. ఆత్మ నివేదన చేసుకోవాలి.

త్రివిధంగా అంటే భౌతికంగా మానసికంగా ఆధ్యాత్మికంగా ఈ సమర్పణ జరగాలి. భార్య భర్తకీ భర్త భార్యకీ సమర్పించుకోవాలి.

అహాన్ని అదుపులో పెట్టుకోవాలి. కష్టాలకి తట్టుకోవాలి. కలహాలకి తావివ్వకూడదు. అనుమానాలని మొలకెత్తనివ్వరాదు. అపోహలకి వీలు కల్పించకూడదు. అవిశ్వాసం చోటు చేసుకోకూడదు.

అనుక్షణం సహనం సద్భావన క్షమ అవగాహనలతో శుద్ధి చేసుకుంటూ ఉండాలి.

పంచుకున్న సంతోషం రెట్టింపైతే పంచుకున్న దుఃఖం సగం అవుతుందని గుర్తుంచుకోవాలి.

ఎవరూ ఎక్కువ కాలం అరాచకంగా తిరగలేరు. ఎన్ని చోట్ల తిరిగినా చివరి గమ్యం ఇల్లే. చివరికి చేరేది జీవిత భాగస్వామి చెంతకే.

మనిషి తన మనిషి తనాన్ని కోల్పోనీయకుండా ఉంచేదే పెళ్లి!

ఈ బంధం శాశ్వతం

పెళ్లికి ముందు కాబోయే భార్య రంభలా ఉండాలని పురుషుడు కోరుకోవచ్చు. మన్మథుడే భర్తగా లభించాలని స్త్రీ కోరుకోవచ్చు.

ఒకరి అందం, వయస్సు మరొకర్ని మాయ చేయవచ్చు. మోహంలో పడేయవచ్చు. ఆకర్షణలో గిరికీలు కొట్టించవచ్చు.

పెళ్లయ్యాక ఆమె ఎలా ఉన్నా అతడికి రంభే. ఆమెకతడి కళ్ళకు నవమన్మథుడే.

అందం తరిగిపోతుంది. యౌవనం కరిగిపోతుంది. మోహపు పొరలు చిరిగిపోతాయి.

అయినా వారి బంధం సడలదు. ప్రేమ తరగదు.

వయస్సు పెరిగే కొద్దీ వారి మానసిక బంధం మరింత గట్టి పడుతూంటుంది.

ఒకరి తోడిదే మరొకరి లోకమని, ఒకరు లేకపోతే మరొకరు లేనట్టే అన్పిస్తుంది.

ఒకరి కోసం ఒకరు బ్రతికే అపూర్వ బంధమే వివాహబంధం!

ఆకర్షణతో దగ్గరై మోహావేశంతో ఉక్కిరిబిక్కిరై ఆత్మీయతల్తో ముడివడి, రాగబంధాల్లో తరించి అలౌకిక ఆనందం వైపు జంట బాటసారులు చేసే అనంత పయనమే పెళ్లి!

పెళ్లి సారాంశం

వివాహ కార్యక్రమం సమాజశ్రేయస్సుకు తప్పనిసరి.

పెళ్లి అనే విషయానికి ఒక అంతర్గత సారాంశమూ ఒక బాహ్యరూపమూ ఉన్నాయి.

స్త్రీ పురుషుల మధ్య అసమాన సంబంధాన్ని చట్టబద్ధంగా ఏర్పరచడమే దాని అంతర్గత సారాంశం.

ఆ కర్మ కాండ ఒక సంప్రదాయ తతంగంగా ఒక పద్ధతిలో జరపటమే దాని బాహ్యరూపం.

ఇది ప్రపంచంలో ఒక్కో జాతిలో ఒక్కో రకంగా ఉంది. ఎక్కడ ఏ రకంగా వున్నా వాటి సారాంశం మాత్రం ఒక్కటే.

ఆడ మగలను జతచేయడం, వారి భౌతిక అవసరాలు తీర్చడమే పెళ్లి పరమార్థం కాదు. సృష్టి క్రమాన్ని కొనసాగించే పవిత్ర కార్యం పెళ్లి.

హిందూ సంస్కృతి వివాహకాండకి ఒక లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక ప్రత్యేకతని చేకూర్చింది. ఒక దార్శనికతని ప్రదర్శించింది. ఒక సంస్కారంగా రూపొందించింది.

జీవన సూత్రాన్నీ జీవిత పరమార్థాన్నీ ఒకే వేదిక మీద ఆవిష్కరించింది!

పెళ్లితంతు అవసరమే

పెళ్లి ప్రాథమికంగా సాంఘిక చట్ట సమ్మత ఒప్పందం.

అందుకు మతపరమైన కాండ లేక తంతు అవసరం. అలాగని కేవలం ఒక తంతుని పెళ్లి అనలేం.

పెళ్లికి కేవలం ఒక స్త్రీ ఒక పురుషుడి అంగీకారమేకాదు వారి తల్లిదండ్రుల ఆమోదం కూడా కావాలి. ఇరు కుటుంబాల సహాయ సహకారాలు కావాలి. సమాజపు ఆమోదముద్ర ఉండాలి.

మనదేశంలో పెళ్లి వ్యక్తిగతం కాదు. సామాజిక గతం. సాంఘిక బంధం.

పెళ్లి రహస్య కాండ కాదు. బహిరంగ వేడుక.

అందు నిమిత్తం పెళ్లి కార్యక్రమం తప్పనిసరి.

దాని ద్వారానే ఆమె ఫలానా వారి భార్య, అతడు ఫలానా వారి భర్త – అని పదిమందికీ తెలుస్తుంది. వారి బంధానికి గుర్తింపు లభిస్తుంది. వారి సంతానానికి వారసత్వ హక్కు సంక్రమింపజేస్తుంది.

ఇద్దరూ కూడా ఒకరి కొకరు విశ్వాసపాత్రంగా ఉండి కౌటుంబిక జీవనం సాగించడానికి సమాజం అండగా ఉంటుంది.

బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తున్నారా అని పోలీసింగ్ చేస్తుంది. దారి తప్పితే హెచ్చరించి సన్మార్గంలో పెడుతుంది.

స్త్రీ పురుష బంధానికి పెళ్లి శ్రీరామరక్ష!

చట్టబద్ధత కోసం

పెళ్లి అనే కార్యక్రమం జరిగితేనే చట్టపరమైన హక్కులు లభిస్తాయి. ఆస్తి వారసత్వపు హక్కులు సంక్రమిస్తాయి.

పెళ్లి కార్యక్రమం లేనంత మాత్రాన స్త్రీ పురుషులు ప్రేమగా కలిసుండకూడదని కాదు. ఇద్దరూ స్నేహంగా తోడునీడల్లా ఉండొచ్చు. శారీరక సంబంధమూ పెట్టుకోవచ్చు. ఒకరి బంధుమిత్రుల్ని ఒకరు గౌరవించుకోనూవచ్చు.

కాని వారి బంధాన్ని చట్టం గుర్తించదు. వారికెలాంటి హక్కులూ ఇవ్వదు. మరెలాంటి రక్షణా కల్పించదు.

పెళ్లి చేసుకోకుండా పిల్లల్ని కని విడిపోతే ఆ స్త్రీని అతడు పోషించక్కర్లేదు. ఆ పిల్లలకు తన ఆస్తి పంచివ్వాల్సిన బాధ్యతా లేదు.

పెళ్లి ద్వారా పుడితేనే పిల్లలకు ఆస్తిహక్కు లభిస్తుంది.

పెళ్లి లేకుండా కలిసి వుంటే ఆమె భార్య కాదు ఉంపుడుగత్తె అవుతుంది. అతడు భర్త కాదు. ఉంపుడుగాడు అవుతాడు.

హిందూ వివాహ చట్టం ఒక పురుషుడికి ఇద్దరు భార్యల్ని గుర్తించదు. ఒక్క భార్యనే గుర్తిస్తుంది. గౌరవిస్తుంది. ఆదరిస్తుంది.

పెళ్లి కార్యక్రమంలో సప్తపది, అగ్ని ప్రదక్షిణ వగైరా ఉంటేనే పెళ్లి అయినట్లని హిందూ వివాహచట్టం నిర్దేశిస్తోంది!

పరిశోధనా ఫలితాలు

వివిధ పరిశోధనల్లో వెల్లడైన సత్యాలేమిటో చూడండి –

వివాహం వల్ల స్త్రీ పురుషులిద్దరూ సమానంగా లాభం పొందుతున్నారు. వారిలో మానసిక ధైర్యం, భరోసా పెరిగి ఒత్తిడితగ్గి మేధోపరమైన సమస్యలకు దూరంగా ఉంటున్నారు.

సంతానవతులైన వివాహిత మహిళల్లో మానసిక సమస్యలు మరీ అరుదు.

వివాహితులకంటే అవివాహితులలోనే ఎక్కువమంది మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

వివాహ విశిష్టత

పెళ్లి ఒక సాం–ఘిక సంబంధం.

అది స్త్రీ పురుషుల మధ్య ఎక్కువ తక్కువల తోటీ పోషణా రక్షణా శ్రమ విభజనా ఆస్తి వారసత్వం వగైరా కీలకమైన సమస్యలు తోటీ ఏర్పడే సంబంధం.

ఎవరితో పెళ్లి జరిగినా ఒకచోట కలిసి జీవించడం వల్ల ఏర్పడే మానసిక బంధం సాంప్రదాయక స్వభావంలోనే ఉంది.

ఇద్దరూ చెరోచోటా ఉండి ఎవరి ఇష్టానుసారం వారు ఎవరి వృత్తి నిమిత్తం వారు ఎవరి లక్ష్యం నిమిత్తం వారు జీవిస్తోంటే వారికి పెళ్లైనా కానట్టే.

పెళ్లంటే మానసిక శారీరక ఆర్థిక అవసరాలను తృప్తిపరిచే మహోన్నత సాధనం.

మృత్యువు తప్ప మరేదీ తమ బంధాన్ని విడదీయలేదని తమది జన్మ జన్మల బంధమనీ విశ్వసించడం హిందూ వివాహ వ్యవస్థ ఔన్నత్యానికి పరాకాష్ఠ!

వివాహదినోత్సవం

ఫిబ్రవరి 22 ని ప్రపంచ వివాహ దినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతోంది. వివాహపు విశిష్టతనూ ఔన్నత్యాన్నీ ఎలుగెత్తి చాటడం నూతన తరాలు గుర్తించేట్లు చెయ్యడానికే.

కరుగుతూ వెలుతున్న రెండు కొవ్వొత్తుల బొమ్మలను వివాహదినోత్సవానికి సంకేతంగా ఎన్నుకోవడం గమనార్హం!

భారతీయ వివాహ వ్యవస్థ

సమాజం సరియైన దారిలో సాగిపోవడమే వివాహ వ్యవస్థ లక్ష్యం. పశువుల్లా విచ్చలవిడిగా ప్రవర్తించకుండా ఇంద్రియాలను నిగ్రహించుకుని తద్వారా ఆత్మోన్నతి పొందటం సమాజోద్ధరణలో పాలుపంచుకోవడం వివాహ వ్యవస్థ ద్వారానే సాధ్యం.

వివాహమనే నియమం వల్లే సమాజం ఆరోగ్యంగా ఉంది. మానవజాతి అభివృద్ధి చెందుతోంది. ఆత్మసంస్కారం పెరగడానికి ఆదర్శజీవితం గడపడానికి దోహదపడుతోంది.

ఆనందప్రదమైన వ్యక్తిగత జీవితం, చక్కని ఆరోగ్యం, ఒత్తిళ్ళను తేలిక చేయటం – లాంటి వివాహగతమైన ప్రయోజనాల వల్ల వృత్తిపరమైన అభివృద్ధి సైతం గణనీయంగా ఉంటుంది.

పరస్పర ప్రేమాభిమానాలు, శాశ్వతత్వం, స్వచ్ఛతలకు ప్రతిబింబం మన వివాహం.

అందుకే భారతీయ వివాహ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా ఆదర్శప్రాయంగా నిలిచి ఉంది. ప్రపంచంలోని ఇతర జాతుల వారిచే కొనియాడబడుతోంది!

అలాంటి సర్వోత్కృష్టమైన వివాహ సంప్రదాయాన్ని గౌరవిద్దాం! గౌరవింపబడదాం!

5

పెళ్లి సామెతలూ సూక్తులూ!

పెళ్లి గురించి భార్యాభర్తల బంధం గురించి అత్తాకోడళ్ళ సంబంధం గురించి సంసార సాగరం గురించి ఎన్నో సామెతలు. చురకలు. జీవిత సత్యాలు. నిష్ఠుర నిజాలు!

అలాగే రకరకాల వ్యాఖ్యానాలు. అనుభవ పాఠాలు. అవగాహన పెంచే పెద్దల చద్ది అన్నం లాంటి మాటల మూటలు!

వాటిని తెలుసుకోవాలి. లోతుల్ని తరచి చూడాలి. విస్తృతార్థాన్ని గ్రహించాలి.

భుజాలు తడుముకోవచ్చు. నాలిక్కరచుకోవచ్చు. పెదవీ కొరుక్కోవచ్చు. నవ్వుకోవచ్చు. ఆనందించనూవచ్చు. గురివింజను గుర్తుచేసుకోనూవచ్చు.

ఆపైన విషయలోతుల్ని గ్రహించాలి. లోకరీతిని అవగాహన చేసుకోవాలి. ఒక్కసారి తమలోకి తాము చూసుకోవాలి. విశ్లేషించుకోవాలి. ఎవరికి వారు తమని తాము సంస్కరించుకోవాలి. సంస్కార సంసారులు కావాలి.

జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలి!

సామెతలు

అనుభవసారాన్ని అల్పాక్షరాల్లో చెప్పిన జీవన సత్యాలే సామెతలు.

అవి నిత్యం జనం నోళ్ళలో నానుతూ ఒక తరం నుంచి మరొక తరానికి మౌఖికంగా సంప్రాప్తిస్తున్న అపూర్వ సంపద.

ఈ ఆణిముత్యాల్ని ఆయా కాలమాన పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.

పెళ్లికి సంబంధించిన సామెతలు

పెళ్లంటే నూరేళ్ళపంట

పెళ్లి సందడిలో పుస్తె కట్ట మరిచాడట

పెళ్లికి వెళ్తూ పిల్లిని చంకబెట్టుకెళ్ళినట్టు

పెళ్లిళ్ళు స్వర్గంలో నిర్ణయించబడతాయి
ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు.

అయిపోయిన పెళ్లికి బాజాలెందుకు
విఘ్నేశ్వరుడి పెళ్లికి వేయి విఘ్నాలు
వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయమన్నారు
అయ్యిందమ్మ పెళ్లి అణిగిందమ్మ రంధి
గుంద్రాయి దాచేస్తే పెళ్లాగుతుందా!

తాతా పెళ్లాడతావా అంటే నాకెవరు పిల్లనిస్తార్రా అన్నాట్ట!
పప్పు లేని పెళ్లి ఉప్పు లేని కూర
ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చినట్టు
దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే
పూరణం లేని బూరె వీరణం లేని పెళ్లి

ఆరాటపు పెళ్లికొడుకు పేరంటాల వెంటపడినట్టు
కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదు
తలచుకున్నప్పుడే తలంబ్రాలు కావాలంటే ఎలాగు!
తాంబూలాలిచ్చేశాను తన్నుకు చావండి
అరుంధతీ గిరుంధతీ కనబడుటలేదుగాని ఆరువందల అప్పుమాత్రం కనబడుతున్నది

గతికితే అతకదు.
కయ్యానికైనా వియ్యానికైనా సమ ఉజ్జీ ఉండాలి
పాత్ర మెరిగి దానం గోత్ర మెరిగి బిడ్డనీ ఇవ్వాలి
ఈడు చూచి పిల్లనియ్యి పిడిచూచి కొడవలియ్యి
తల్లిని చూచి పిల్లను పల్లును చూచి పశువును కొనవలె
తల్లిని చూసి పిల్లని పాడిని చూసి బర్రెనీ ఎంచుకోవాలి

దశకొద్దీ దొరికాడే దిశమొల మొగుడు

బండెడు ధనమిచ్చినా బావమరిది లేని చుట్టరికం పనికిరాదు

కాకి ముక్కుకి దొండపండు

కోడల్ని బీదింట్లోంచి తెచ్చుకో – కూతుర్ని గొప్పింట్లోకి ఇచ్చుకో

బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరాదు

పూజ కొద్దీ పురుషుడు దానం కొద్దీ బిడ్డలు

ఏడ్చేదానికి మొగుడొస్తే నాకూ వస్తాడందిట

తాడులేని బొంగరం జోడులేని బతుకు

పిలిచి పిల్లనిస్తానంటే ఒక కన్ను చిన్నదన్నాట్ట

సంసార సంబంధిత సామెతలు

ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమా

ఆలి పంచాయితీ రామాయణం పాలి పంచాయితీ భారతం

ఆలి అదుపు ఇంటికి పొదుపు

ఆలి మాట విన్నవాడు అడవిలో పడ్డవాడు ఒకటే

ప్రేమలేని మొగుడు పెరుగులోనూ రాళ్ళొచ్చాయని చితకబాదాడట

మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు దెప్పినందుకు

ఉంచుకున్న వాడు మొగుడూ కాదు పెంచుకున్న వాడు కొడుకూ కాదు

మొగుడిని కొట్టి మొగసాల కెక్కినట్టు

చేతకాని మొగుడు చెబితే వినడు కొడితే ఏడుస్తాడు

ఏ మొగుడూ దొరక్కపోతే అక్క మొగుడే దిక్కయినట్టు

రాజుని చూసిన కళ్ళతో మొగుడ్ని చూస్తే మొట్ట బుద్ధయిందిట

అరవై ఊళ్ళకు అమలు దారు ఆలికి దాసుడు

రుచీ పచీ లేని కూర కంచంలో దండగ ఉలుకూ పలుకూలేని మొగుడు మంచంలో దండగ.

ఇంటి కళ ఇల్లాలే చెబుతుంది
ఇంటికి దీపం ఇల్లాలే
ముద్దు చేసిన కుక్క మూతి నాకును చనువు చేసిన భార్య చంకెక్కును.
రూపంలో స్త్రీలు పరాక్రమంలో పురుషులు రాణిస్తారు
సంతానం లేని స్త్రీ దానం లేని విత్తం కలుగు లేని తూము ఒక్కటే
కాపురం చేసే లక్షణం కాలు తొక్కిననాడే తెలిసిందన్నట్టు
కడుపుతో ఉన్నమ్మ కనక మానుతుందా వండుకున్నమ్మ తినక మానుతుందా
అధమునికి ఆలి అయ్యేకంటే బలవంతుడికి బానిస అయ్యేది మేలు

అత్త రాకాసి ఆలి భూకాసి
అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టు
దయలేని అత్తకి దండం పెట్టినా తప్పే
అత్తా ఒకింటి కోడలే మామా ఒకింటి అల్లుడే
అత్తల కాలం కొన్నాళ్ళు కోడలికాలం కొన్నాళ్ళు
అత్త చేసిన పనికి ఆరళ్ళు లేవు
అత్తలేని కోడలు ఉత్తమురాలు కోడలు లేని అత్త గుణవంతురాలు

అత్త సొమ్ము అల్లుడు ధారబోసినట్టు
కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందట
ఓపలేని అత్తకు వంగలేని కోడలు
అత్తగారి అధికారం కొన్నాళ్ళు కోడలిపెత్తనం కొన్నాళ్ళు
అత్త చేజారినది అడుగాటి కుండ కోడలు చేజారినది కొత్తకుండ.

అత్తపెట్టే ఆరళ్ళు కనపడతవి గానీ కోడలు చేసే కొంటె పనులు కనపడవు
అన్నీ అమర్చిన తరువాత అత్తగారు వేలు పెట్టినట్టు
అడ్డాల నాడు బిడ్డలు గాని గడ్డాలనాడు బిడ్డలా
కనిపెంచిన నాడు కొడుకులు గాని కోడళ్ళు వచ్చాక కొడుకులా
ఇంటి కంటె గుడి పదిలం

సంసారం జానెడు ఖర్చు బారెడు

ఇల్లు ఇరకటం ఆలి మరకటం

చిన్న ఇల్లే కట్టుకున్నా పెద్ద కాపురమే చెయ్యాలి

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే బిడ్డ పుట్టినట్టు

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్టు

ఆలూలేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగమన్నట్టు

ఆడది తిరిగి చెడింది మగాడు తిరక్క చెడ్డాడు

అయిన వాళ్ళకి ఆకుల్లో కానివాళ్ళకు కంచాల్లో

ఆలుమగల కలహం అద్దం మీద ఆవగింజ

తమలపాకుతో తనొకటంటే తలుపు చెక్కతో తానొకటి అన్నట్టు

బతకని బిడ్డ బారెడు

అలిగి అత్తారింటికి చెడి చెల్లెలింటికి పోరాదు

సిరి కొద్దీ చిన్నెలు సాగే కొద్దీ వన్నెలు

అమ్మాయి పుట్టింది అంటే ఆయువు సగం కుంగింది అన్నమాటే

కూతుళ్ళు కన్నమ్మకు కుర్చీ పీటలు కొడుకును కన్నమ్మకు గోడపంచెలు

ఐదేళ్ళ ఆడపిల్ల అయినా మూడేళ్ళ మొగపిల్లాడికి లోకువే

ఎంతవారలైనా కాంతాదాసులే

వివాహసూక్తులు

సూక్తులంటే మంచిమాటలు. పెళ్లి గురించి ప్రముఖులు వెలిబుచ్చిన మాణిక్యాల్లాంటి సూక్తుల్నీ నిర్వచనాల్నీ వ్యాఖ్యానాల్నీ ఒక్కసారి తలచుకుందాం. పునః పరిశీలన చేద్దాం. హంసలా క్షీర నీరాలను వేరు చేసి చూద్దాం.

'ఇద్దరి గుండె చప్పుడు ఒక్కటయ్యే సన్నాయి మేళమే పెళ్లి'

'మగాడికి కీర్తి కాంత కనకం మూడూ ఒకేసారి కలిసొచ్చే సందర్భం కల్యాణం.'

'పెళ్లి రెండు హృదయాలను ఏకం తచేసి సుదీర్ఘమైన జీవనాన్ని అందించడమే గాకుండా రెండు కుటుంబాల మధ్య వారధిలా నిలుస్తుంది.'

'పెళ్లయ్యే దాకా ప్రతి మగాడూ గొంగళి పురుగులాంటివాడు. పెళ్లయ్యాకే సీతాకోక చిలుకలా మారతాడు.'

'పెళ్లి విలువ పెద్దలు పిల్లల్ని పుట్టించడంలో లేదు. పిల్లలే పెద్దల్ని రూపొందించడంలో ఉంది.'

'వివాహమంటే కలిసి జీవించడం'

'తెలుగు సినిమా పెళ్లితో ముగుస్తుంది. జీవితం ఆడదానికైనా మగవాడికైనా పెళ్లితోనే మొదలవుతుంది'

'పెళ్లి మగవాళ్ళకి మజిలీ ఆడవాళ్ళకి గమ్యం'

'పురుషులు తమ స్వాతంత్ర్యాన్ని స్త్రీలు తమ సౌఖ్యాన్ని ఒడ్డి ఆడే జూదమే వివాహం'

'వివాహం పురుషుణ్ణి రాక్షసుణ్ణి చేస్తుంది. స్త్రీని బానిసని చేస్తుంది.'

'భారతీయ సంప్రదాయ వివాహబంధం పవిత్రం. అది మరణంతో కూడా తెగిపోదు. ఏడేడు జన్మలు కొనసాగుతుంది.'

'పెళ్లి సక్సెస్ కావాలంటే చాలా త్యాగం కావాలి. కొంచెం నటన కావాలి'

'వివాహ వార్షికోత్సవమంటే ప్రేమ, విశ్వాసం, భాగస్వామ్యం, సహనం ఓర్పుల సంగమాన్ని పండుగ చేసుకోవడమే.'

'నా మనసు నీదవుతుంది. నీ మనసు నాదవుతుంది. ఈ వివాహంలో నువ్వు నేను కలిసి పరిపూర్ణ మానవులం అవుదాం.'

'పరస్పర ఆలంబనకు సమాన స్వేచ్ఛకు ఒకరికొకరు తప్పనిసరి. బాధ్యత వహించడానికి స్త్రీ పురుషుల నడుమ ఏర్పడిందే వివాహబంధం'

'అనుకూలవతియైన స్త్రీతో వివాహం తుపాను సమయంలో దొరికే నౌకాశ్రయం వంటిది.

'వివాహవిజయం రెండు విషయాల మీద ఆధారపడి ఉంటుంది. ఒకటి సరియైన జోడీని ఎన్నుకోవడం. రెండు సరియైన జోడీగా ఉండటం'

'పెళ్లంటే ఇద్దరి కలయిక మాత్రమేకాదు. ఇద్దరూ కృషి చేస్తేనే ఆ వివాహం నిలుస్తుంది. ప్రేమ, అంకితభావం, అవగాహన, అనుకంప, కలయిక – కలగలిపి తయారు చేసిన వంటకమే పెళ్లి'

'నాలోనూ నీలోనూ లోపాలున్నాయి. ఇద్దరం కలిసి వాటిని సవరించుకోవడమే పెళ్లి లక్ష్యం'

'జీవితం రేడియో సెట్టుకు భర్త ఏరియల్, భార్య ఎర్తు'

'వివాహబంధం చిరకాలం గట్టిగా ఉండాలంటే తొలిరేయి అనుభవానికి భార్యా భర్తలిరువురు కొత్త అయి ఉండాలి'

'సౌష్ఠవంగల స్త్రీ నగతో సమానం. సౌశీల్యం గల స్త్రీ సంపదతో సమానం'

'అన్ని గొప్ప విషయాల వెనుక ఆరంభంలో స్త్రీ పాత్ర ఉంటుంది'

'పురుషుడి ప్రతి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది'

'భార్యా భర్త లిరువురిలో ఎవరు గొప్పవాళ్ళు? ఈ ప్రశ్న అడగనివాళ్ళు!'

'స్వర్గాన్ని నరకం చేసేది నరకాన్ని స్వర్గం చేసేది మనస్సే'

'వివాహం చేసుకొని భార్యాపుత్రులతో ధార్మిక కర్మలను చేయువాడే పరిపూర్ణుడైన మానవుడు.'

'నేను హోమాన్ని నువ్వు ఋక్కువు. నేను ఆకాశాన్ని నీవు నేలవి. అందుకే మనిద్దరం వివాహం చేసుకుని తరిద్దాం. పుత్రులను పొందుదాం. ప్రేమాను రాగాలతో వందేళ్ళు బ్రతుకుదాం – అని పురుషుడు స్త్రీని ఆహ్వానించాలి.'

'జీవతమనే పుస్తకం స్త్రీ పురుషులతోనే మొదలవుతుంది'

ఛలోక్తులు

పెళ్లి గురించీ భార్యా భర్తల సంబంధం గురించీ ప్రముఖులు విసిరిన హాస్యవ్యంగ్య చమత్కార వ్యాఖ్యానాల్నీ విసిరిన చెణుకుల్నీ అవలోకిద్దాం. ఆత్మ విమర్శ చేసుకుందాం.

'పురుషుడి బలహీనత ఎక్కడ ఉన్నదో స్త్రీ బాగా గ్రహించ గలుగుతుంది. కాని అతని గొప్పతనం ఎక్కడ ఉన్నదో మాత్రం గ్రహించలేదు' **– ఠాగూర్**

'తొందరపడి వివాహం చేసుకున్నవారు తీరిగ్గా పశ్చాత్తాప పడతారు' **– విలియం కాంగ్రీడ్**

'వివాహం ఒక పుస్తకంలాంటిది. దానిలో మొదటి అధ్యాయం కావ్యరూపంలోను మిగత అధ్యాయాలు గద్యరూపంలోను ఉంటాయి' **– నికొలస్**

'ప్రేమ అనేది పెళ్లికి సూర్యోదయం లాంటిదైతే పెళ్లి అనేది ప్రేమకు సూర్యాస్తమయం లాంటిది' **– ఫ్రెంచి సూక్తి**

'పెళ్లైన మర్నాడే హఠాత్తుగా తన వయస్సు ఏడేళ్ళు పెరిగిపోయినట్లు భావిస్తాడు పురుషుడు'
– బేకన్

'పిరికి వాళ్ళు కూడా చేయగల ఒకే ఒక్క సాహసకృత్యం పెళ్లి చేసుకోవడం'**– వోల్టేర్**

'నిన్ను నీవు నాశనం చేసుకోవాలనుకుంటే ధనవంతురాలైన అమ్మాయిని పెళ్లాడు.'

– మిచ్‌లెట్

'పెళ్లయితే సంతోషం పోయినట్టే. పెళ్లి కాకపోతే సంతోషం లేనట్టే'**– బోపెన్ హార్**

'భార్య ఇనుముతో చేయని సంకెల' **– చాణక్యనీతి**

'సవ్యమైన వ్యక్తితో వివాహం జరిగితే రెక్కలు మొలిచి గాలిలో తేలిపోతున్నట్టు అనిపిస్తుంది. లేకపోతే సంకెళ్లలో బిగిసినట్లు అయి పాతాళంలోకి కుంగిపోతున్నట్లు అనిపిస్తుంది' **– బీచర్**

'పెళ్లైనవాడు ఏ పనైనా చేయగలడు – పెళ్లాం ఇష్టపడితే' **– బెర్నార్డ్ షా**

'శుభ్రంగా పెళ్లి చేసుకో. అనుకూలిస్తే సుఖపడతావు. లేకపోతే వేదాంతివి అవుతావు.'

'పెళ్లి కాకముందు కళ్ళు పూర్తిగా తెరచి చూడు. పెళ్లయ్యాక సగం మాత్రమే చూడు'

'అస్సలు బాధ్యతలు తెలీవు. పెళ్లిచేసి మెడకో గుదిబండను తగిలిస్తే సరి బతుకేమిటో బరువేమిటో తెలుస్తుంది.'

'మొత్తం మీద పెళ్లి అనేది ఎవరూ తప్పించుకోలేని ఉపద్రవమే'

'పెళ్లి కాని స్త్రీ మగాడితో సమానం'

'వివాహం అనేది బోనులాంటిది. బయట ఉన్నవారు లోపలకు వెళ్ళాలని ఉబలాట పడతారు. లోపల ఉన్నవారు ఎలా బయట పడటమా అని మథన పడుతుంటారు.'

'పురుషుడి సాహచర్యం లేని స్త్రీ వాడిపోతుంది. స్త్రీ సాహచర్యం లేని పురుషుడు మూర్ఖుడవుతాడు' **– చెకోవ్**

'భర్త అంటే భార్యకోసం ఓ చట్టాన్ని రూపొందించి దానికి ఆమె చేసే సవరణలన్నింటినీ మారు మాట్లాడక అంగీకరించేవాడు" **– బెవర్లీ నికోల్స్**

'పెళ్లి మనిషిని తాత్వికుడినీ స్థిత ప్రజ్ఞుడినీ చేస్తుంది. పెళ్లయిన తరువాత దేనిమీదా ఆసక్తి కోరికా ఎందులోనూ ఉత్సాహం ఉద్వేగం ఉండవు' **– శతృఘ్న సిన్హా**

6

పెళ్లిళ్ళలో రకాలు

పెళ్లి జరిగే పద్ధతిని బట్టి పెళ్లిళ్లని అనేక రకాలుగా విభజించవచ్చు.

పెళ్లికి వధూవరుల ఇష్టాయిష్టాలు ముఖ్యం. కొన్ని సార్లు ఒకరికిష్టముండి రెండవవారికి లేకపోయినా లేక ఇద్దరికీ ఇష్టం లేకపోయినా పెళ్లి జరగవచ్చు.

పెద్దల అభీష్టాలు స్థితిగతులు ఆకాంక్షలు ఆస్తులు – వగైరాలు పెళ్లిలో ప్రముఖ పాత్ర వహిస్తూంటాయి. శక్తి, శౌర్యం, అధికారం, దౌర్జన్యం, కుతంత్రం–లను తక్కువగా అంచనావేయకూడదు. ఇక కాలమాన పరిస్థితుల ప్రభావం గురించి చెప్పనే అక్కర్లేదు.

అష్టవిధ వివాహాలు

'బ్రాహ్మోదైవస్థ థైవార్షః ప్రాజాపత్యః తథా సురః
గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమో ధమః'

మనుస్మృతి ప్రకారం ఎనిమిది రకాల హిందూ వివాహాలు చెప్ప బడ్డాయి.

అవి – బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యం, ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచము.

వీటిలో ఒకటి మినహా మిగతావన్నీ వధూవరుల ప్రేమ భావనలతో సంబంధం లేనివే. ఆ ఒక్కటీ గాంధర్వం.

ప్రాచీనకాలంలో పెళ్లిళ్ళు పైన పేర్కొన్న ఎనిమిది విధాలుగా జరిగేవి. అలాగని చెప్పి వాటన్నిట్నీ అంగీకరించలేదు. గాంధర్వ, ఆసుర, రాక్షస, పైశాచ వివాహాలు ఖండించబడ్డాయి.

బ్రాహ్మ వివాహం

బ్రహ్మమనగా ధర్మము. వేద సంబంధమైనది.

కన్యాదాత వరుడ్ని వెదకాలి. ఆ వరుడు కూడా వేదాధ్యయనం చేసినవాడూ సత్ప్రవర్తనుడూ అయి వుండాలి. కన్య యొక్క వయోరూప గుణ శీలాలకు తగిన విద్యా వంతుడై వుండాలి.

అలాంటి ఉత్తమ గుణ సంపన్నుడ్ని తానే పిలిచి మర్యాద చేసి సర్వాలంకారభూషితయైన కన్యను ఉదకధారా పూర్వకంగా దానం చేయుట బ్రాహ్మ వివాహం.

ఈ వివాహం ఉత్తమమైనదిగా చెప్పబడింది. నేటికీ అధికంగా అనుసరింప బడుతున్న పద్ధతి. ఎంచేతంటే కన్యాదాత తన వయోజ్ఞానాలనూ అనుభవాన్నీ ఉపయోగించి వరుడ్ని ఎన్నిక చేస్తాడు గనుక అది వధువుకి శుభస్కరం.

అంతేకాదు. వరుడు ధనవంతుడై వుండాలనలేదు. విద్యాధనవంతుడై వుండాలన్నారు. అతడి ప్రవర్తనా బాగుండాలన్నారు. కట్నప్రసక్తీ లేదు. వధువే కట్నమన్న మాట!

దైవ వివాహం

కన్యాదాత జోతిష్టోమము మొదలైన యజ్ఞాలు చేయిస్తున్నప్పుడు యజ్ఞం చేయించిన ఋత్విజునికి కన్య నిచ్చి పెళ్లి చేయుట.

అనగా పురోహితుడ్నే దైవంగా భావించి కన్యాదానం చేయుట. యజ్ఞసమయంలో ఇలా చేయటం పుణ్యకార్యంగా భావించేవారు.

సరైన వరుడు లభించనప్పుడు లేదా సేవా నిమిత్తమై ఇలా చేసివుండొచ్చు. ఆర్థిక కారణాలూ కారణమై ఉండొచ్చు. ఏమైనప్పటికీ ఇది హీనమైన వివాహంగా భావించబడింది.

ఈ తరహా వివాహాలు ఎప్పుడో అంతరించిపోయాయి.

ఆర్ష వివాహం

యజ్ఞయాగాదులు చెయ్యడానికో వ్యవసాయప్పనుల కోసమో వరుని దగ్గర్నుంచి జత ఆవులనో ఎద్దులనో తీసుకుని అందుకు బదులుగా కన్యనివ్వడం.

వివాహ ఖర్చు కూడా భరించలేని వారు వరుడి నుంచి ఏదొకటి తీసుకుని కన్యాదానం చేసే వారని భావించవచ్చు.

ఇది కన్యాశుల్కాన్ని పోలి వున్నప్పటికీ దానికి భిన్నమైనది.

ఇందులో కన్యాదాత ధనాపేక్షతో గాక యజ్ఞానికో ఉదరపోషణార్థమో జత పశువుల్ని తీసుకుంటాడు. పశువులూ సంపదే అయినా తీసుకుంటున్న కారణ స్వభావం వేరు గనుక తప్పు లేదన్నారు శాస్త్రకారులు.

ప్రాజాపత్యం

వరుడొచ్చి కన్యనిమ్మని కన్యాదాతని అర్థిస్తాడు

అతడి యోగ్యతలు సంతుష్టి కలిగిస్తే, “ధర్మనిర్వహణ కోసం ఈమెను ధర్మపత్నిగా స్వీకరించు. మీరిద్దరూ కలిసి ధర్మాన్ని ఆచరించాలి. ప్రజాపతిలా సంతానాన్ని కని పితౄణం తీర్చుకోవాలి. భార్య బ్రతికుండగా సన్యాసం స్వీకరించరాదు. మరొక వివాహం చేసుకోరాదు” అని చెప్పి ప్రమాణం చేయించి మరీ కన్యనివ్వడం.

ఇక్కడ వరుడు కన్యను ఇష్టపడటమేగాక ఆమెనిచ్చి పెళ్లి చేయమని వధువు తల్లిదండ్రుల్ని కోరతాడు. అతడి గుణగణాలు నచ్చి అతడి ధర్మపత్నిగా ఉండేందుకు ధర్మాచరణ కోసం గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వహిస్తానని మాట తీసుకుని మరీ కన్యనిచ్చి వివాహం చేస్తారు.

అతడిదివరకే వివాహితుడైతే అతడికి కన్యనివ్వరన్నమాట.

ఇది కొంతవరకు నేటి ప్రేమ వివాహాల లాంటిదే కాని ఇక్కడ ప్రేమించింది లేదా ఇష్టపడింది వరుడు మాత్రమేనని గమనించాలి.

ఆసుర వివాహం

కన్యకీ ఆమె బంధువులకీ ధనం ఇచ్చి వరుడామెని వివాహమాడటం.

ఇది కన్యను కొనుక్కోవడమే. కన్యాశుల్కమే. వధువుకే గాక ఆమె తల్లిదండ్రులకీ ధనమిచ్చి ఇష్టపరిచి పెళ్లి చేసుకోవడమన్నమాట. పూర్వం దీనిని దోషయుక్తంగా భావించేవారు కాదు.

ఈ పద్ధతి కొన్ని ఆటవిక తెగల్లో వుంది.

కూతుర్ని అమ్ముకున్నవాడి ముఖం చూడరాదని పద్మపురాణం ఘోషించిన సంగతి ఈ సందర్భంగా గమనార్హం.

గాంధర్వ వివాహం

వధువు, వరుడు – ఇద్దరూ కూడా ఒకర్నొకరు కామించారు. ఇష్టపడ్డారు. పరస్పరం వెంటబడ్డారు. పెద్దల అనుమతి లభించలేదు. లేదా పరిస్థితులు అనుకూలించ లేదు. అయినా వారు వివాహమాడటమే గాంధర్వం.

ఇది కామ సంబంధమైనది. గంధర్వులు కామాతురులంటారు గనుక ఆ పేరు వచ్చిందీ పెళ్లికి.

శకుంతలా దుష్యంతుల వివాహం ఇటు వంటిదే.

ఈ వివాహానికి మూలం ప్రేమ గనుక ఇది ప్రశస్తమైనదని కొందరి భావన.

ఈనాటి కొన్ని ప్రేమ వివాహాలూ ఇలాంటివే. కోరిక లేక మోహం తీరేక మాయమై పోతుంటారు. వారిది ప్రేమ అనే కన్నా మోహం అనడం సబబు.

రాక్షస వివాహం

కన్య తల్లిదండ్రులు కన్యనివ్వడానికి అంగీకరించలేదని వారిని కొట్టి లేదా హింసించి లేదా చంపి వారి కోసం విలపిస్తున్న కన్యని బలవంతంగా తీసుకొనిపోయి పెళ్లాడటం.

యుద్ధసమయాల్లోనూ కొన్ని ఆటవిక జాతుల్లోనూ ఈ తరహా పెళ్లిళ్ళు జరిగేవి.

వరుడు బలవంతుడు గనుక అతడ్నీ అతడి పెళ్లినీ సమర్థిస్తూనే దానికి రాక్షస వివాహం అని పేరు పెట్టింది సమాజం.

పైశాచ వివాహం

కన్య నిద్రలో నిషాలో మత్తులో అపస్మారకంలో లేక ఏమరపాటుగా వున్నప్పుడు లేదా మోసగించి బలాత్కారం చేయుట. లేదా బలవంతంగా ఎత్తుకుపోయి శీలాన్ని హరించి పెళ్లాడుట.

ఇది అత్యంత నీచమూ హేయమూ అయిన పద్ధతి.

నిజంగా ఇది పైశాచికమే!


ఏది శ్రేష్ఠమైంది?

పైన పేర్కొన్న అష్టవిధ వివాహాల్లో బ్రాహ్మ వివాహం అత్యుత్తమమైనదిగా పేర్కొనబడింది. ఆ తర్వాత దైవ, ప్రాజాపత్య, ఆర్ష వివాహాలు శ్రేష్ఠమైనవన్నారు.

అంతేకాదు. బ్రాహ్మవివాహం వలన జన్మించిన కుమారుడు పన్నెండు తరాల వరకూ పితరులకు సద్గతి కల్గిస్తాడు. దైవ వివాహం వల్ల 10 తరాలకూ, ప్రాజాపత్యం వల్ల 8 తరాలకూ, ఆర్షం వల్ల 7 తరాలకూ సద్గతి కలుగుతుందని చెప్పబడింది.

గాంధర్వ, ఆసుర, రాక్షస, పైశాచ వివాహాలకు సమాజపు ఆమోదముద్ర లభించలేదు సరికదా ఖండించబడ్డాయి!

బల పరీక్షా వివాహాలు



వరుడి శక్తి యుక్తులు యుద్ధ ప్రావీణ్యం వగైరాలు పరీక్షించడానికి ఒక బలపరీక్షను ఏర్పాటు చేసి విజేతకి కన్యనిచ్చి పెళ్లి చేయడం.

ఇవి పూర్వం క్షత్రియుల్లో ఎక్కువగా జరిగేవి.

రాజ్యనిర్వహణా దక్షత, శత్రువుల మీద విజయం సాధించగల సామర్థ్యం గీటురాయిగా ఈ పరీక్షలుండేవి. బలవంతుడిదే రాజ్యం అని నమ్మిన కాలం అది.

అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని చేజిక్కించుకోవటం, మిగిలిన రాజుల్ని ఓడించి దుర్యోధనుడు భానుమతిని పెళ్లాట్టం ఈ కోవలోకే వస్తాయి. శ్రీరాముడికి సైతం శివధనుర్భంగం చేయక తప్పింది కాదు!

స్వయంవరాలు

వధువు నిర్ణయానికి పెద్దపీట వేసే పెళ్లి స్వయంవర వివాహం.

వధువు తండ్రి కూతురి స్వయంవరాన్ని ప్రకటించి తనకి నచ్చిన లేదా తను మెచ్చిన వారికి ఆహ్వానం పంపుతాడు. స్వయంవరానికి విచ్చేసిన వారిలో తనకు నచ్చిన వారి మెడలో వరమాల వేస్తుంది వధువు.

నలదమయంతుల కల్యాణం ఇలా జరిగిందే.

తండ్రి తన కుమార్తెకు స్వయంగా తగిన యోగ్యుడైన వరుని అన్వేషించలేని సందర్భంలో స్వయంవరానికి అనుమతిచ్చేవారు. కన్యతానే పతిని వెదుక్కుంటుంది లేదా వరిస్తుంది గనుక ఆమె మీద విశేషమైన బాధ్యత ఉంటుంది.

రుక్మిణీ కళ్యాణం



ఇది మనువు చెప్పిన ఏ వివాహ పరిధిలోకీ రాదు.

ఇందులో రుక్మిణి కృష్ణుడ్ని ఇష్టపడుతుంది. ప్రేమిస్తుంది. ప్రేమపత్రం పంపి అతడొచ్చి తనని ఎత్తుకుపొమ్మని కోరుతుంది. అతడొచ్చి అడ్డొచ్చిన బంధువుల్ని త్రొసిపుచ్చి మరీ ఎత్తుకుపోయి ధర్మపత్నిని చేసుకుంటాడు.

మనుశాస్త్రం వరుడి దృష్టితో వివాహాలని విభజించగా ఇది వధువు దృష్టితో జరగటం విశేషం. పైగా కులాంతరం కూడానూ.

పెళ్లికాని అమ్మాయిలు 'రుక్మిణీ కళ్యాణం' చదివితే త్వరగా పెళ్లవుతుందని చెబుతూంటారు.

అంటే పెద్దలు ప్రేమ వివాహాలని పరోక్షంగా ప్రోత్సహిస్తున్నట్టు భావించవచ్చా?!

ఆధునిక వివాహాలు

ఇవి ఎన్ని రకాలో చెప్పడం కష్టం.

పెద్దలు కుదిర్చిన పెళ్లి నుంచి అవసరార్థం చేసుకునే పెళ్లిళ్ల వరుకూ ఎన్ని రకాలున్నాయో లెక్కలేదు.

సంప్రదాయాన్ని బట్టి ఆచార వ్యవహారాలని బట్టి అవసరాన్ని బట్టి సందర్భాన్ని బట్టి జరుగుతున్న కొన్ని ముఖ్య రకాల పెళ్లిళ్ళు చూద్దాం.

సంప్రదాయ పెళ్లి

స్థూలంగా పెద్దలు కుదిర్చే పెళ్లి.

వధువు తల్లిదండ్రులూ వరుడి తల్లిదండ్రులూ ఇష్టపడి తమ పిల్లలకు దగ్గరుండి మరీ వివాహం జరిపించటం.

వరుడి గుణగణాలు వధువుకీ ఆమె బంధువులకీ నచ్చాలి. అలాగే వధువు రూపలావణ్యాలు వరుడికీ అతడి బంధువులకీ నచ్చాలి.

కొన్ని సందర్భాలలో వధూవరుల అభిప్రాయాలకి తగిన విలువనివ్వకుండా లేదా వారి అభిప్రాయం తెలుసు కోకుండా వారి శ్రేయస్సు కోరి పెద్దలే పెళ్లి కుదర్చ వచ్చు.

కాని వధూవరులిద్దరూ కూడా విద్యాధికులవుతున్న ఈ రోజుల్లో కేవలం పెద్దలే నిర్ణయం తీసుకొవడమనేది బాగా తగ్గుముఖం పట్టింది.

పెద్దలు ఎలాంటి ప్రలోభాలకీ, అహాలకీ, మూర్ఖత్వాలకీ లోను కాకుండా విజ్ఞతతో లోకజ్ఞానంతో వ్యవహరించాలి.

పిల్లలు తమ స్వప్నాలూ ఆశలూ ఆక్షాంక్షలూ పెద్దలకు వివరించాలి. పెద్దల అనుభవానికి, ముందు చూపుకి తగిన విలువ, గౌరవం ఇవ్వాలి.

అటు పెద్దల ఇటు పిల్లల పూర్తి అంగీకారంతో జరిగే సంప్రదాయ పెళ్లికి మించింది లేదు.

ప్రేమ వివాహం

సినిమాల పుస్తకాల ప్రభావం వల్ల నైతేనేమి, ఆడామగా కలసి చదవటం ఉద్యోగాలు చెయ్యడం వల్లనైతేనేమి, విద్య, వృత్తి లేక ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల నైతేనేమి ప్రేమ వివాహాలు అధికమయ్యాయి.

అబ్బాయి అమ్మాయి ఒకర్నొకరు ప్రేమించుకుని తమ తమ ఇళ్లల్లో చెప్పి గాని చెప్పకుండా గాని, చెప్పి ఒప్పించిగాని, వ్యతిరేకిస్తే ఎదిరించి గాని ఈ తరహా వివాహాలు చేసుకుంటున్నారు.

ప్రేమకీ ఆకర్షణకీ తేడా తెలియని వయస్సులో ప్రేమ పేరిట దారి తప్పి మోసపోతున్న వారున్నారు. ఒన్ సైడ్ లవ్‌తో రెండో వారిని చంపడానికీ లేదా తామే చావడానికీ సిద్ధ పడుతున్న వారున్నారు.

ప్రేమని పండించుకుని సుఖజీవనం చేస్తున్నవారూ వున్నారు.

పెద్దలు పిల్లల భవిత గురించీ, పిల్లలు పెద్దల అండదండల గురించీ సీరియస్‌గా ఆలోచిస్తే ప్రేమ వైఫల్యాలని కొంత వరకూ నివారించవచ్చు.

తల్లి దండ్రుల్ని ఒప్పించి చేసుకునే ప్రేమ వివాహం సర్వోన్నతమైంది.

ఆర్థిక వివాహాలు

ధనం ప్రధాన పాత్ర పోషిస్తుంది.

అది డబ్బు కావచ్చు. ఆస్తి కావచ్చు. కంపెనీ వాటాలు కావచ్చు.

ఆస్తి కలిసి వస్తుందని గాని, ఆస్తి బయటి వారికి వెళ్ళ కూడదని గాని, కంపెనీ యాజయాన్యం చేజారకూడదని గాని – మొత్తానికి ఆర్థిక లావాదేవీలే ఈ పెళ్లిళ్ళకు ముఖ్యం.

ఉన్నత వర్గంలో జరిగే ఈ పెళ్లిళ్ళలో వక్తిగత ఇష్టాఇష్టాలకు చోటు తక్కువ. ఆస్తి పాస్తులుంటే అవెలాగైనా ఎక్కడైనా తీర్చుకోవచ్చని వారు భావిస్తారు.

వారిది డబ్బు ప్రపంచం. పెళ్లిళ్ళూ అందులో భాగమే!

గ్లామర్ వివాహం

అందచందాల్ని, పేరు ప్రతిష్ఠల్ని, కీర్తి కిరీటాల్ని చూసి మోజుపడి చేసుకునే వివాహాలివి.

సినిమా నటులు, క్రికెట్ ఆటగాళ్ళు, మోడల్స్, గాయకులు, తదితర గ్లామర్ ప్రపంచపు తళుకు బెళుకు తారలు మోజుపడి చేసుకునే పెళ్లిళ్ళు ఈ కోవలోకి వస్తాయి.

వారి గ్లామర్ శాశ్వతమన్న భ్రమలో పెళ్లి చేసుకుంటారు. రంగులు కరిగి పోయాక వాస్తవంతో రాజీ పడలేక నిరాశ నిస్పృహ ఆత్మవంచన దుర్వ్యసనాలూ చుట్టు ముట్టగా ఆర్థికంగా భంగపడతారు. ఎంత వేగంగా వివాహాలు అవుతాయో అంతే వేగంతో విఫలమవుతాయి.

గ్లామర్ గ్రామర్ వేరు జీవిత వాస్తవికత వేరు అని గుర్తించి నడచుకుంటే తప్ప ఈ వివాహాలు విజయవంతం కావు.

కాంట్రాక్టు వివాహం

పెళ్లిని శాశ్వత బంధంగా గాక పరిమిత కాలపు అవగాహనగా ఒప్పందం కుదుర్చుకుని మరీ చేసుకునే పెళ్లి.

ఎక్కువగా ఆకర్షణ వల్లనో పరస్పర అవసరం దృష్ట్యానో లేక ఆర్థిక లావాదేవీల దృష్ట్యానో గ్రీన్ కార్డ్ కోసమో చేసుకుంటారు.

పాశ్చాత్యదేశాల నుండి ఇవి దిగుమతి అయ్యాయి. ఆకర్షణ లేదా అవసరం తీరే వరకూ కలిసి వుండటం ఆ పిమ్మట విడిపోవడం.

పిల్లలు పుడితే వారినేం చేయాలి, విడిపోతే ఎవరు ఎవరికి ఏమివ్వాలనేది ముందుగానే అగ్రిమెంటులో రాసుకుంటారు.

హిందీ నటుడు అక్బర్ ఖాన్ పెళ్లికి ఇలాంటి అగ్రిమెంటే రాసుకున్నారని వార్త!

ఆర్య సమాజ్ వివాహాలు

ఆర్యసమాజ్ కేంద్రాల్లో వధూవరుల వివరాలు ఇచ్చి ఫీజు చెల్లించి వివాహం చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఆధునికభావాలు గల వారు చేసుకుంటున్న పద్ధతి ఇది.

ఎక్కువగా ప్రేమ వివాహాలూ కులాంతర వివాహాలూ అక్కడ చేసుకుంటూ వుంటారు.

వారిచ్చే సర్టిఫికేట్ రిజిస్ట్రార్ ఆఫ్ మారేజెస్ ఇచ్చే సర్టిఫికేట్ తో సమానమైంది.

కులాంతర మతాంతర వివాహాలు

ప్రేమే ఆధారంగా జరిగే ఈ పెళ్లిళ్ళలో వధూవరులు వేరువేరు కులాలు, మతాలు, జాతుల వారైనా వారిదృష్టిలో ఎలాంటి తేడా వుండదు.

ఇద్దరిదీ ఒకటే కులం– యువకులం. ఒకటే మతం – అభ్యుదయ మతం అని భావించి ఒకటవుతారు.

భిన్న ఆచార వ్యవహారాలు, విభిన్న విశ్వాసాలు, వేరువేరు సంస్కృతుల నేపథ్యాలు వారి మధ్య విభేదాలు సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

మరి కొన్ని వివాహాలు

పెళ్లి చేసుకునే పద్ధతి, విధానాలని బట్టి మరికొన్ని రకాల వివాహాలున్నాయి.

దండలపెళ్లి, ప్రతిజ్ఞ చేసి ఒకటయ్యే అభ్యుదయ వాదులపెళ్లి, రిజిస్ట్రేషన్ పెళ్లి, కుండ మార్పిడి పెళ్లి వగైరా వగైరా.

పెళ్లి ఏ రకమైనదైనా కావచ్చు.

మనసావాచా కర్మణా వివాహ లక్ష్యాన్ని సాధించే ప్రతీదీ శుభ కళ్యాణమే!

7

స్త్రీ పురుష జాతులు

స్త్రీలంతా ఒకే రకంగా వుండరు. ఒకే విధంగా ప్రవర్తించరు. ఒకే రకపు స్వభావం కలిగి ఉండరు.

పురుషులూ అంతే.

అయినప్పటికీ కొన్ని కొన్ని లక్షణాలు కామన్‌గా వుంటాయి. వాటన్నిట్నీ క్రోడీకరించి స్త్రీ పురుషుల్ని కొన్ని రకాలుగా విభజించారు.

వాత్స్యాయనుడు కూడా స్త్రీ పురుషుల్ని కొన్ని జాతులుగా విభజించాడు. అందుకాయన తీసుకున్న ప్రమాణాలు వేరు. ఆయన్ది పాక్షిక దృష్టి గనుక ఆ విభజన ప్రాచుర్యం పొందలేదు.

స్త్రీ పురుషుల శారీరక లక్షణాలూ ప్రవర్తనా అలవాట్లని బట్టి కొక్కోకుడు వారిని వివిధ రకాలుగా విభజించాడు.

స్త్రీలను పద్మిని, చిత్తిని, శంఖిని, హస్తిని అని నాలుగు జాతులుగా విభజన చేశాడు.

అలాగే పురుషుల్ని శశ, వృషభ, అశ్వ, ఏణ అంటూ నాలుగు రకాలుగా పేర్కొన్నాడు.

ఆయన చెప్పిన ఒక్కో జాతి లక్షణాలేమిటో చూద్దాం.

పద్మినీ జాతి స్త్రీ

సుతిమేత్తని శరీరం, విశాల నేత్రాలు, గుండ్రని ముఖం, విశాల మైన నుదురు, ధనుస్సు వంటి కనుబొమ్మలు, బిత్తరి చూపులు, సంపెంగలాంటి నాశికాగ్రం, తెల్లని పలువరుస, అరటిబోదె లాంటి తొడలు, దొండపండు లాంటి పెదవులు, సింహపు నడుము, కుంభముల వంటి స్తనములు, ఎత్తైన పిరుదులు, తుమ్మెద రెక్కల్లాంటి జుట్టు, చిరునవ్వు ముఖం – కలిగి వుంటుంది.

శాంత స్వభావియై మృదుమధురంగా మాట్లాడుతుంది. ఓర్పు, దైవభక్తి, యుక్తాయుక్త వివేక జ్ఞానం, మెండుగా వుంటాయి.

వినయవిధేయతలు ప్రదర్శిస్తుంది. ఆచార వ్యవహారాలు పాటిస్తుంది. సంగీత సాహిత్యాలన్నా శాస్త్రపురాణాలన్నా ఎంతో ఇష్టం.

పద్మినీ జాతి స్త్రీలు అల్పాహారము తింటూ అల్పరతిచే అనందం పొందుతూంటారు. ఆమెవున్న ఇల్లు సిరిసంపదలతో తులతూగుతుంది.

దేవాలయాల మీది శిల్పాలలో పద్మినీ జాతి స్త్రీయే సాక్షాత్కరిస్తూంటుంది.

చిత్తినీ జాతిస్త్రీ

నల్లని పొడవైన శరీరం, పొడవైన ముక్కు, కొనదేరిన నాలుక, చిన్ని కళ్లు, సన్నని నడుము, పెద్ద పిరుదులు, పెద్ద స్తనములు కలిగి వుంటుంది చిత్తిని లేక చిత్తిణీ జాతిస్త్రీ.

ఇతరుల్ని హీనంగా చూచుట, కోప స్వభావం, పూలంటే అమిత ఇష్టం, స్వేచ్ఛా జీవితాన్ని కోరుట, నీచ స్వభావం, అమిత కామేచ్ఛ, పరపురుష సాంగత్యం కోరుట– ఈ స్త్రీ లక్షణాలు.

ఆహారం మధ్య రకంగా తీసుకుంటుంది. రంగురంగుల చీరలు ధరిస్తుంది. నాట్య సంగీత విద్యల్లో నేర్పరి.

శంఖినీ జాతి స్త్రీ

తేజస్సు గల ముఖము, ఒడ్డూ పొడవూ గల బలిసిన దేహం, చామన ఛాయ, పెద్ద పెద్ద పాదాలు, మృదువైన దేహం, వేలాడే స్తనములు, పెద్ద భుజాలు – కలిగివుంటుంది.

స్వేచ్ఛా జీవితాభిలాషి. తరచూ కోపంతో చిర్రుబుర్రులాడుతుంది. భోగములను కోరుతుంది. కంఠస్వరం కర్కశం. అలంకార ప్రీతి అధికం. పరపురుషులందు వాంఛ కలిగి వుండును. నీచులతో సహవాసం చేయును. భర్త మీద అమిత ప్రేమ. రతికాలమున నగ్నం కావడానికి సిగ్గుపడును. ఉపరతి యందు విశేష అభిలాష వుంటుంది.

పరిహాసాలాడుతూ మోటుగా వ్యవహరిస్తూంటుంది శంఖినీ జాతి స్త్రీ.

హస్తినీ జాతి స్త్రీ

విశాలమైన ముఖము, ఎర్రని నేత్రాలు, పొడవైన ముక్కు, పెద్ద పెదవులు, పొడవైన బలిష్ఠమైన శరీరం, పొట్టి పాదాలు, క్రిందికి జారు స్తనములు, ఎత్తైన పిరుదులు, పెద్దపెద్ద తొడలు, పెద్ద నడుం, లావుపాటి శరీరం, చామనచాయ – కలిగివుంటుంది.

తరచుగ నవ్వుతూండటం, తరచూ చిరుతిండి తినడం, కల్లు సారాయి సేవించడం, దురాశ, చంచల స్వభావం, పరపురునితో సంభోగాభిలాష, అమిత కామేచ్ఛ, పతియందు అతిప్రేమ – ఈ జాతి స్త్రీ లక్షణాలు.

శశ జాతి పురుషుడు

కుందేలు (శశం) వలె సుందరమైన శరీరం, సమానమైన పొడవు, పొడవుకు తగిన లావు, ఎరుపు రంగు, విశాలమైన నుదురు, నవ్వు ముఖం, చక్కని పలు వరుస–కలిగివుంటాడు.

ఆచార వ్యవహారాలందు ఆసక్తి, వినయ విధేయతలు, దైవభక్తి, పరోపకార బుద్ధి, శాంత స్వభావం, ఏక పత్నీవ్రతం – ఈ జాతి పురుషుడి లక్షణాలు.

ఏణ జాతి పురుషుడు

లేడి (ఏణ) చూపులు, గుండ్రని ముఖము, చక్కని పలువరుస, నల్లని జుట్టు, విశాలమైన కళ్ళు, వెడల్పైన ఫాల భాగం, విశాలమైన వక్షస్థలం, సన్నని నడుము, ఎర్రని దేహం, ఆజానబాహుడు, ఎత్తైన పిరుదులు, పలుచని పాదములు – కలిగివుండును.

శాంత స్వభావం, చిరునవ్వు ముఖం, దైవభక్తి, వినయవిధేయతలు, అమిత రతి ఆసక్తి – ఏణ జాతి పురుషుడి లక్షణాలు.

అశ్వజాతి పురుషుడు

అశ్వము(గుర్రము) వలె పొడవైన శరీరము, గుండ్రని ముఖం, నల్లని దట్టమైన జుట్టు, పెద్ద కళ్ళు, పొడవైన ముఖం – కలిగి వుంటాడు.

సాహస ప్రవృత్తి, స్థిరచిత్తం, అమిత రతి ప్రేమ – వీరి లక్షణాలు.

వృషభజాతి పురుషుడు

ఎద్దు (వృషభం) వలె శరీరం లావుగా పొడవుగా వుండుట, పెద్ద పాదములు, పలుచని నాలుక, పెద్ద గుండ్రని ముఖం, లావైన కటి ప్రదేశం – కలిగివుండును.

సిగ్గు లేని సంభాషణ, అమిత కామేచ్ఛ, అమిత భోజనాసక్తి, పెద్ద కంఠ ధ్వని, పరస్త్రీ వ్యామోహం – వృషభజాతి పురుషుడి లక్షణాలు.

ఎవరికెవరు సరిజోడి ?

ఏ జాతి పురుషుడు ఏ జాతి స్త్రీని పెళ్లాడిన వారిద్దరికీ అన్ని విధాలా సరిపడునో సరిజోడి అగునో కూడా శాస్త్రాలలో చెప్పబడింది.

అలా సమఉజ్జీ అయినచో వారు అమితంగా సుఖింతురనీ వారికి ఆరోగ్యకరమైన సంతానం కలుగునని వారి ఉద్దేశం.

శశజాతి పురుషునకు పద్మినీ జాతి స్త్రీకీ పొంతన అనుకూలము.

ఏణ జాతి పురుషునకు చిత్తినీ జాతి స్త్రీకీ సరిపడును.

అశ్వజాతి పురుషునకు శంఖినీ జాతి స్త్రీకీ జోడి అనుకూలం.

వృషభ జాతి పురుషునకు హస్తినీ జాతి స్త్రీకీ పొంతన కుదురును.

స్త్రీ జాతి ప్రత్యేకత

పద్మినీ జాతి స్త్రీ ఉత్తమురాలనీ చిత్తిని మధ్యమని శంఖిని అధమమనీ హస్తిని అధమాధమమనీ కొక్కోకుడు నిర్ణయించాడు.

నిజానికి స్త్రీలలో ఆయా జాతి లక్షణాలని గుర్తించడం అసాధ్యం.

నాలుగు రకాల స్త్రీలలోని గుణగణాలని – మంచివీ చెడ్డవీ కూడా – కలగా పులగంగా వుండే స్త్రీలే అధికంగా కనిపిస్తారు. వారిని ఏ జాతిలో చేర్చాలన్నది ప్రశ్న.

పైగా పురుషుల కన్నా స్త్రీలు అనేక విషయాల్లో అధికులని చెప్పారు.

"స్త్రీణాం ద్విగుణమాహారం, బుద్ధిశ్చాపి చతుర్గుణమ్

సాహసం షడ్గుణం చైవ, కామోష్టగుణిముచ్యతే"

పురుషుల కంటే స్త్రీలకు ఆహారం రెండు రెట్లు, బుద్ధి నాలుగురెట్లు, సాహసం ఆరురెట్లు, కామం ఎనిమిది రెట్లు ఎక్కువ వుంటుందిట!

నేటి కాలానికి సరిపడదు

నేటి స్త్రీ పురుషుల్ని వివిధ జాతులుగా విభజించడం సాధ్యంకాదు.

ఇదివరకులేని సౌందర్యసాధానాలు ఎలాంటి వారినైన అందంగా తీర్చిదిద్దుతున్నాయి. జిమ్సూ బ్యూటి పార్లర్లు చక్కని శరీరాకృతినిస్తున్నాయి.

ఆహార పదార్థాలూ ఔషధాలూ కొందరికి మోదాన్నీ మరికొందరికి ఖేదాన్నీ కలిగిస్తున్నాయి. వారి రూప లావణ్యాల మీద వాటి ప్రభావం చెప్పలేనిది!

ఉన్నత విద్య, వృత్తి నిబద్ధత, కెరీర్ కాన్షస్‌నెస్, ఉద్యోగవ్యాపార రంగాల్లో దూసుకుపోయే గుణం, ఆర్థిక స్వేచ్ఛ, స్త్రీ పురుషుల సాన్నిహిత్యం, దృక్పథంలో వచ్చిన మార్పు, వైజ్ఞానికాభివృద్ధి – ఇవన్నీ స్త్రీ పురుషుల్ని పూర్వం కన్నా భిన్నంగా ప్రత్యేక వ్యక్తిత్వాలతో తీర్చిదిద్దుతున్నాయి. వారి నడవడికలో దృక్పథాల్లో పెనుమార్పు తీసుకొచ్చాయి.

స్త్రీ పురుష సమానత్వం, ప్రపంచీకరణ, విభిన్న సంస్కృతుల ప్రభావం – అటు స్త్రీల పైనా ఇటు పురుషులపైనా తీవ్రంగా వుంటోంది.

వారి అలవాట్లని ప్రవర్తనని ఆశల్ని స్వప్నాల్ని – సమస్తాన్నీ నియంత్రిస్తున్నాయి.

వారి సెక్స్ జీవితం మీద వివిధ ఒత్తిళ్ళ (టెన్షన్స్) ప్రభావం మునుపెన్నడూ లేనంత ఎక్కువగా వుంటోంది!

తెలుసుకోవడం మంచిదే

కొక్కోకుడి స్త్రీ పురుష జాతుల లక్షణాలు తెలుసుకోవడం అవసరమే.

రూపురేఖలు, శారీరక లక్షణాలు, ప్రవర్తన, నడవడిక, సంభాషణ – లని బట్టి వధూవరుల గుణగణాలు కొంత వరకూ తెలుసుకోవచ్చు.

భవిష్యత్తులో వారితో జీవితం ఎలా వుంటుందో అంచనా వేయవచ్చు.

అంతేకాదు. ఏయే లక్షణాలు ఉత్తమమైనవిగా పేర్కొన్నారో వాటి గురించి తెలియడం వల్ల ఆ లక్షణాలు పెంపొందించుకోవడానికి వీలుపడుతుంది. తమని తాము మార్పు చేసుకుని సరిదిద్దుకుని చక్కగా 'ప్రెజంట్' చేసుకోడానికీ తోడ్పడుతుంది.

విద్య ఉపాధి రంగాల్లో స్త్రీ పురుషులెంతగా దూసుకుపోయినా ప్రాథమికంగా వారు స్త్రీ పురుషులని– ప్రకృతి పురుషులని మరువకూడదు!

8

ప్రేమ



ప్రేమ గురించి రాయని కవీ ప్రేమ గురించి మాట్లాడని యువతీ యువకులూ ఉండరంటే అతిశయోక్తి కాదు.

పెళ్లికి ముందే ప్రేమలో పడటం లేదా పడ్డామనుకోవడం సర్వ సాధారణమయ్యింది.

సినిమాలూ కాల్పనిక సాహిత్యం 'ప్రేమలో సాహసం సేయరా' అంటూ పురిగొల్పుతున్నాయి. అలా సాహసించి గెలిచినవాడే 'హీరో' అని తెగేసి చెబుతున్నాయి.

'వీలయితే నాలుగుమాటలు కుదిరితే కప్పుకాఫీ' అంటూ ప్రేమించిన అమ్మాయి ఆహ్వానిస్తే ఎగిరిగంతెయ్యని ప్రేమికుడూ ఉండడు.

ప్రేమికులు ఒప్పుకున్నా లేకున్నా ప్రేమ లక్ష్యం పెళ్లే. కాని అన్ని ప్రేమలూ పెళ్లికి దారితీయవు!

అమృతధార

ప్రేమ ఒక అద్భుత భావన. అలౌకిక ఆనందం. అంతులేని ఆత్మతృప్తి. రెండు గుండెల ఏకనాదం.

కలల్ని సంతోషాన్ని కలతల్ని విచారాన్ని ఆశల్ని ఆశయాల్ని విజయాల్ని వైఫల్యాల్ని కలబోసి కలిసి పంచుకుంటూ ముందుకు సాగిపోవటం ప్రేమ లక్ష్యం.

ఒకరి కోరికలకి అవసరాలకి అనుభూతులకి అనుభవాలకి రెండోవారి ప్రతిస్పందనే ప్రేమ.

ప్రేమ రెండోవారి ఆనందాన్ని క్షేమాన్ని కోరుతుంది. అందుకోసం తనని తాను అర్పించుకునేట్లు చేస్తుంది.

ఒక వయస్సుకో ఒక దశకో పరిమితమైపోదు ప్రేమ. పెళ్లి చేసుకున్నాక కూడా నిరంతరంగా ప్రవహించే జీవనది ప్రేమ.

ప్రేమకి మరణం లేదు. ఎంచేతంటే అది అమృతం నుండి పుట్టింది గనుక. ఇంకా కరక్టుగా చెప్పాలంటే అమృతధారే ప్రేమ!

ప్రేమ - కామం

ప్రేమ వేరు కామం వేరు.

ఒకటి ఇవ్వటమైతే రెండో కొల్లగొట్టడం.

ప్రేమలో త్యాగం ఉంది. నిస్వార్థముంది. శాంతి ఉంది. ఆనందం ఉంది. ఆత్మార్పణ ఉంది.

జీవిత పరిణతి పరిపూర్ణత ప్రేమవల్లనే సాధ్యం!

కామం సంకుచితమైనది. స్వార్థపూరితమైంది. భోగాభిలాషి.

అది ఒక ఉద్రేకం. ఆవేశం. విచక్షణని మింగే ఉప్పెన!

ప్రేమ కామాల మధ్యగల అంతరాన్ని గుర్తించాలి. గుర్తెరగాలి. తదను గుణంగా ప్రవర్తించాలి. దేనికెంత విలువివ్వాలో తెలుసుకుని మసలాలి.

ముఖ్యంగా యువతీయువకులు ఆ రెంటికీ మధ్యగల సన్నని గీతని గుర్తించడం అత్యవసరం.

అప్పుడే నిఖార్సైన ప్రేమకి పట్టం గట్టగలుగుతారు. లేదా కామాగ్నిలో మాడి మసవుతారు!

ప్రేమ పుట్టుక

నది పుట్టుక ప్రేమ పుట్టుక ఒక్కలాంటివే. అవి ఎవరికీ తెలీవు.

కలిసి చదివే చోట, ఉండే చోట, పని చేసే చోట యువతీ యువకుల మధ్య పరిచయం ఏర్పడటం సహజం. అది చనువుగా మారవచ్చు. స్నేహంగా ఎదగవచ్చు. ఆకర్షణ పెరగవచ్చు. అభిమానంగా ఇష్టంగా మారవచ్చు. పిమ్మట ప్రేమగా రూపాంతరం చెందవచ్చు.

తరచూ కలుసుకోవటం, కబుర్లు చెప్పుకోవడం, కలిసి తిరిగటం, బహుమతులిచ్చి పుచ్చుకోవడం, సినిమాలకి షికార్లకి పార్టీలకి వెళ్ళడం, కలల్లో తేలిపోవడం, వెనకాముందూ చూడకుండా బాసలు చేసుకోవడం - ఇవన్నీ ప్రేమ యాత్రలో మజిలీలే.

ఒకర్నొకరు అర్థం చేసుకుని ఒకరితోడు కోసం ఒకరు తపిస్తూ ఒకటవ్వాలని ఉవ్విళ్ళూరతారు ప్రేమికులు.

ఇద్దరు ఒకటవ్వడమే పెళ్లి. ప్రేమకు మలిదశ!

ప్రేమ ఎప్పుడు ఎలా ఎందుకు పుడుతుందో తెలీదు. ఒకసారి పుట్టిందంటే పుడకల దాకా కొనసాగాలి. కాలానికి ఎదురొడ్డి నిలవ గలగాలి.

అదే ప్రేమంటే!

వాలంటైన్స్ డే

ఫిబ్రవరి 14. ప్రేమికుల రోజు.

ఐ లవ్యూ చెప్పేందుకు ప్రపంచ యువత ఓకే చేసిన రోజు.

మూగ ప్రేమకు మాటలు నేర్పి అనురాగానికి రాగం కట్టి మనసు పాటకు పాదం కలిపి ఆనందనాట్యం చేసే రోజు.

మదిలో దోబూచులాడుతున్న భావాల గులబీని ప్రేయసి/ప్రియుడికి దోసిళ్ళలో పెట్టుకుని మరీ అందించి అనుబంధపు తీగతో బంధం వేసుకోజూసే రోజు.

నేను ప్రేమిస్తున్నాను – అనే రెండు పదాలని నిజాయితీగా నిర్భయంగా చెప్పేందుకు ధైర్యమిచ్చి వెన్నుతట్టే రోజే వాలంటైన్స్ డే.

ప్రేమ భావన తెలియజెప్పడానికి గుండె గొంతుకలో అడ్డుపడితే ఆదుకోడానికి రకరకాల కార్డులూ గిఫ్టులూ ఈ మెయిల్సూ! ఏకంగా అక్షరాలే అద్దిన రకరకాల పూలు!

పచ్చ జెండా ప్రేమికుల మనసున మల్లెల మాలలని ఊగిస్తుంది. తిరస్కారం గుండెల్లో తుఫాను సృష్టిస్తుంది.

అందుకే ప్రేమ వెలిబుచ్చే ముందు అవతలి వారి సానుకూల స్పందనని 'వినడం' తప్పనిసరి. తస్మాత్ జాగ్రత్త!

పసి ప్రేమలొద్దు

ప్రేమించడానికి వయస్సుతో నిమిత్తంలేదు. ఎవరైనా ఏ వయస్సులోనైనా ప్రేమించవచ్చు. ప్రేమించబడనూవచ్చు.

కాని శాశ్వత అనుబంధాన్ని అంటే పెళ్లిని ఆశించే ప్రేమికులు మాత్రం వయస్సు విషయంలో రాయబడని 'నిబంధనలు' ఫాలో అవ్వాల్సిందే.

యౌవనారంభ దశలో కలిగే ఊహలు కోరికలు క్రష్‌లు మోజులు వ్యామోహాలు మొదలైన వాటికి ప్రేమ రంగు పులమకూడదు.

'టెన్త్ క్లాస్' ప్రేమల్ని సినిమాల్లోనే వెలగనివ్వాలి తప్ప నిత్యజీవితంలో కాదు.

ఎదిగీ ఎదగని వయస్సులోని ఇష్టాల్ని ఆకర్షణల్ని ప్రేమ అని భావించవద్దు. భ్రమ పడనూ వద్దు.

నిజానికి టీనేజ్ కలలు కనే వయస్సు. అప్పుడప్పుడే కళ్ళు తెరచి ప్రపంచాన్ని కొత్తగా వింతగా చూసే పక్షి పిల్లకీ వారికీ తేడా లేదని గమనించాలి.

ఓ ప్రముఖ నటుడి 19 ఏళ్ళకుమార్తె ప్రేమపెళ్లి చేసుకోవటమే కాదు 15వ ఏటనుంచీ ప్రేమించుకుంటున్నామని చెప్పిన సంగతి వినే ఉంటారు!

చదువు, వృత్తి విద్య, మానసిక ఎదుగుదల, విజ్ఞానతృష్ణల మీద దృష్టి తపన స్వప్నం కృషి సర్వం కేంద్రీకరించాల్సిన దశలో ప్రక్క ఆకర్షణలకు లోనుకాకూడదు.

లక్ష్యసాధనవైపు దూసుకుపోవాల్సిన 'గుర్రాలు' కళ్ళకు గంతలు కట్టుకోవడం తప్పనిసరి!

కాలేజీ ప్రేమలు ముద్దేగాని వద్దు

ప్రేమకథల పుట్టినిళ్ళు కాలేజీలు.

స్కూలుదశ దాటి కాలేజీలో అడుగుపెట్టే సరికి యువతీ యువకులకు రెక్కలొస్తాయి. ఒక ప్రక్క యౌవనం పురివిప్పుతోంటే మరో ప్రక్క కోరికలు గుర్రాలై దౌడు తీస్తుంటాయి.

కొత్త లోకం. కొత్త స్నేహాలు. కొత్తగా లభించిన స్వాతంత్ర్యం.

స్కూలు యూనిఫాం వదిలెయ్యటంతోనే హఠాత్తుగా తాము పెద్దవారమై పోయామన్న ఫీలింగు మెదడును ఆక్రమించుకుంటుంది.

సరదాలు స్నేహాలు సినిమాలు షికార్లు పుకార్లు – అన్నీ చవిచూస్తారు.

వీటిలో ఏదో థ్రిల్ మరేదో ఆస్వాదన కన్పిస్తుంది. ఆవేశం ఎక్కువ ఆలోచన అతి తక్కువగా ఉంటాయి. అవగాహనా రాహిత్యం అధికం. బరువు బాధ్యతల స్పృహ శూన్యం.

వెనుకా ముందూ చూడరు. కళ్ళకి తప్ప మెదడుకి పని కల్పించరు.

ప్రపంచంలో తామే నిజమైన ప్రేమికులమనుకొంటారు. అదో సాహసిక చర్యగా గొప్ప పనిగా భావిస్తారు. కులం మతం ఆస్తి అంతస్తులన్నీ ట్రాష్ అనుకుంటారు. తమ

ప్రేమ ఒక్కటే సత్యం, శాశ్వతం అన్న భ్రమలో నిలువునా కూరుకుపోతారు.

జీవన వాస్తవికత చిన్న షాక్ ఇచ్చేసరికి బెంబేలు పడతారు. కొందరు దులిపేసుకుంటారు. కొందరు కృంగిపోతారు.

తర్వాతెప్పుడైనా గుర్తొస్తే అదో 'పిల్లచర్య' గా 'వేడి వయస్సు ఆట'లా భావించుకుని నవ్వుకుంటారు!

పెళ్లి పాట పాడే కాలేజీ ప్రేమలు చాలా తక్కువ మరి!

సహోద్యోగుల ప్రేమ

ఒకే కార్యాలయం లేక సంస్థలో పనిచేసే సహోద్యోగుల మధ్య ప్రేమ ఉదంతాలు పెరుగుతున్నాయి.

స్కూళ్ళు, కాలేజీలు, బ్యాంకులు, ప్రభుత్వాఫీసులు, వృత్తి సంస్థలు ఒకప్పుడు వీటికి వేదికలు. ఇప్పుడు కొత్తగా కాల్‌సెంటర్లు, బిపిఓలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు ప్రముఖ కేంద్రాలయ్యాయి.

ఆఫీసుల్లోని చక్కని వాతావరణం, కలిసి పనిచేసేప్పుడు ఏర్పడే అభిప్రాయాలు, ఎక్కువ సేపు కలిసి ఉండటం కలిసి పనిచెయ్యడం వల్ల ఏర్పడే సాన్నిహిత్యం, వ్యక్తిత్వాలపై పరస్పర అవగాహన – ప్రేమ పుష్పించి ఫలించడానికి దోహదపడుతున్నాయి.

వీరికి కాబోయే జీవిత భాగస్వామిపై ముందస్తు అవగాహన అధికంగా ఉంటుంది. అప్రోచ్‌లో ఆలోచనలో ఆచరణలో పరిణతి ఉంటుంది.

ఆర్థిక స్వేచ్ఛ, స్వయం నిర్ణయశక్తి, ప్రణయంలో పరిణతి, ఎదిగిన వ్యక్తిత్వం, పెళ్లి గురించిన సంపూర్ణ అవగాహన – వారి ప్రేమల్ని సఫల వివాహాలవైపు నడిపిస్తున్నాయి.

ప్రేమార్హత

ఏది పొందడానికైనా సాధించడానికైనా కొన్ని అర్హతలు తప్పనిసరి.

అవి ప్రేమకూ వర్తిస్తాయి.

మహారాణిని రిక్షావాడు ప్రేమించొచ్చు. పని పిల్లతో కోటేశ్వరుడి ఏకైక వారసుడు డ్యూయెట్లు పాడనూవచ్చు.

అవి సినిమాలకే కథలకే పరిమితం.

నిజ జీవితంలో ఆ నటీనటులూ దర్శకులూ రచయితలూ సైతం అలాంటి ప్రేమల్ని సహించరన్నది కఠిన వాస్తవం.

ప్రేమించడానికి వయస్సే కాదు అవతలివారిని అర్థం చేసుకోగల మనస్సుండాలి. పరిణతి ఉండాలి. వారి ఫీలింగ్సు తెలుసుకోవాలి. వారి స్వప్నాలనీ లక్ష్యాలనీ అర్థం చేసుకోవాలి. వారి ఆశల్ని పండించగల నేర్పు ఓర్పు దక్షత ధైర్యం ఆర్థిక దన్ను ఉండాలి.

ప్రేమించడానికన్నా ప్రేమించబడటానికి అదనపు అర్హతలు – అవతలివారికి నచ్చి మెచ్చేవి – కావాలి.

ప్రేమ బంధాన్ని వివాహబంధంగా మార్చుకోగల శక్తీ యుక్తీ గలవాళ్ళు దాన్నొక భావనగానే గాక బాధ్యతగా భావించగల వాళ్ళు నిస్సందేహంగా ప్రేమించవచ్చు. ప్రేమించబడునూవచ్చు.

ప్రేమాయ నమః!

ఒన్ సైడ్ లవ్

'నా వంక చూసి నవ్వింది. అది ప్రేమే'

'నేనంటే లవ్. అందుకే నాకంత హెల్ప్ చేస్తోంది/చేస్తున్నారు'

'నా చూపుకోసం పడిగాపులు కాస్తూంటాడు తెలుసా?'

'నన్ను చూడగానే ఆమె మొహం వెలిగిపోతుంది.'

"నేనేం చెప్పినా చేసెయ్యడానికి ఎవర్రెడీ'

ఇలాంటి డైలాగ్స్‌కి కాలం చెల్లింది.

ప్రేమలో అతిగా ఊహించుకోవటం ఊరికే ఊహల్లో ఊరేగటం మంచిది కాదు. గోరంతల్ని కొండంతలు చేసుకోకూడదు. ప్రతి దాన్నీ భూతద్దంలో చూడనూకూడదు. గొప్పలకి పోకూడదు. దాపరికాలుండ కూడదు.

సంజ్ఞల చిరునవ్వుల దశ దాటేకైనా మనస్సు విప్పి మాట్లాడుకోవడం అత్యవసరం.

అవతలి వారు రెస్పాండ్ అయితే ఫర్లేదు. తమ ప్రేమ ఒన్‌సైడ్ అని తేలితే మాత్రం అంతటితో ఆ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిది.

డిప్రెషన్‌కి లోనవ్వడం, ఆత్మహత్యకి తలపడటం అవివేకం. కక్షకట్టడం, పగతో ద్వేషంతో రగిలిపోవడం తగదు. కక్ష కార్పాణ్యాలు నేరస్తుల్ని చేస్తాయి. చక్కని భవిష్యత్తుని కాస్తా చిన్నా భిన్నం చేస్తాయి. ఒన్‌సైడ్ ప్రేమకులీ విషయాన్ని గుర్తించి తమ దృష్టిని మరో వైపు మరల్చుకోవాలి. మరో ఆశా సౌధం నిర్మించుకోవాలి!

శృంగార ప్రేమ అనర్థదాయకం

కొందరికి ప్రేమ శారీరక వాంఛల్ని తీర్చుకునే మార్గం. అవతలి వారిని బుట్టలో పడెయ్యడానికి ఎన్నో మాయ కబుర్లు చెబుతారు. రంగుల కలల్ని ఆవిష్కరిస్తారు. తీయని కోర్కెల్ని రెచ్చగొడతారు.

ఆ ఉచ్చులో చిక్కుకోకూడదు. సంయమనం పాటించాలి. విచక్షణా జ్ఞానం ప్రదర్శించాలి.

పెళ్లికి ముందు శృంగారం నిషిద్ధం.

కళ్యాణానికి ముందు కాలు జారటం అనైతికం. జీవితం కలుషితమవుతుంది. ప్రాచీన కాలంలోనే కాదు ఆధునిక కాలంలోనూ అది సమస్యల విషవలయమే.

మనస్సు పడినవారి స్పర్శకు రెచ్చిపోయి శారీరకంగా ఒకటైతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. గర్భం వస్తే ఇక చెప్పనే అక్కర్లేదు.

ఒకరంటే ఒకరికి గౌరవం పోతుంది. తేలిక భావం ఏర్పడుతుంది. తప్పు చేశామన్న భావన తొలచివేస్తుంది. ఏ కారణం చేతనైనా పెళ్లి చేసుకోకపోతే రెండోవారు బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడవచ్చు. అశాంతికి ఆందోళనకి గురి చెయ్యవచ్చు. ఖర్మకాలి గర్భం ధరిస్తే వారి మనోవ్యథకి అంతే ఉండదు!

జీవితాంతం పశ్చాత్తాప పడాల్సిన పరిస్థితి కొనితెచ్చుకోవద్దు.

మనశ్శరీరాలను పవిత్రంగా ఉంచుకుని పెళ్లయ్యాక తమ జీవత భాగస్వామికి అర్పించుకోవడంలో ఉన్న ఆనందం, తృప్తి, అనుభూతి వర్ణనకందనివి!

మోడర్న్ × ట్రెడిషన్

ప్రేమించే అమ్మాయి చాలా మోడర్న్‌గా స్టైలుగా అదిరిపోయే డ్రెస్సుల్తో ఆహా ఓహో అన్పించేలా ఉండాలని ఆశిస్తారు అబ్బాయిలు.

వారే పెళ్లయ్యాక అమ్మాయి సంప్రదాయ దుస్తుల్లో సంసార పక్షంగా ఉండాలనుకుంటారు. సతీ సావిత్రిలా ఉండాలని ఆశిస్తారు.

అమ్మాయిలూ అంతే.

పెళ్లికి ముందు ప్రేమికులుగా ఉన్నప్పుడు తమని బైక్‌మీద షికార్లకి తీసుకెళ్ళాలనీ, తనని కేండిల్ లైట్ డిన్నర్లకీ ఫ్రెండ్స్‌ని ఐస్‌క్రీం పార్లర్‌కీ, బేకరీకీ తీసుకెళ్ళాలనీ ఖరీదైన గిఫ్టులూ బొకేలూ కార్డ్సూ ఇవ్వాలనీ – ఆశిస్తారు.

పెళ్లయ్యాక అవన్నీ దండుగుమారి ఖర్చులన్చెప్పి కత్తెర వేసేస్తారు. అతడు శ్రీరామ చంద్రుడిలా మారిపోవాలంటారు. అనవసర తిరుగుళ్ళూ పార్టీలూ వద్దంటూ ఆర్థిక ఆంక్షలు విధించేస్తారు. ఒక్కసారిగా ఆరిందాలా మారిపోతారు.

పెళ్లయ్యాక రెండోవారిలో వచ్చే మార్పు చూసి బిత్తరపోవటం, మారిపోయారంటూ సణగటం చేస్తారు.

ఆ మార్పుకి కారణం సంస్కృతీ ప్రభావం మరియు పెళ్లి ద్వారా సంక్రమించిన బాధ్యతలు మాత్రమే!

సో – ప్రేమకు మోడర్న్, పెళ్లికి ట్రెడిషన్ అన్నమాట!

భద్రత ముఖ్యం

ఇది వరకన్నా ఇప్పుడు ప్రేమకి ప్రాక్టికల్ దృక్పథం పెరిగిందని చెప్పాలి.

ప్రేమించే ముందు రూపం కులం హోదా ఆర్థికస్థితిగతుల్ని పట్టించుకుంటున్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ అంచనాలు రూపొందించుకుంటున్నారు.

అంతే తప్ప మరీ గుడ్డిగా వ్యవహరించట్లేదు.

ప్రేమించినవారు దక్కకపోతే 'బెటర్ లక్ నెక్ట్స్ టైం' అనుకుంటున్నారు తప్ప కుంగిపోవట్లేదు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నంత మాత్రాన అంతా సజావుగా సాగిపోతుందన్న భరోసా ఏమీ లేదు. అయినా తెలియని రిస్క్ కన్నా తెలిసిన రిస్క్‌లో సుఖం ఉందని ధైర్యం చేస్తున్నారు ప్రేమికులు.

ఏది ఏమైనా ప్రేమిస్తున్నానని చెబుతున్న అబ్బాయిలో అమ్మాయి మొదట చూసేది నిజాయితీని. నిర్ణయించుకునేది మాత్రం అతడు భవిష్యత్తులో తనకు సామాజిక పరమైన ఆర్థిక పరమైన భద్రత కల్పించగలడా లేదా అన్న అంశాన్ని బట్టే!

ప్రేమ ఇవ్వలేని భద్రత పెళ్లి ఇస్తుంది మరి!

అందుకే హిందూ వివాహవ్యవస్థలో పెళ్లి తర్వాత పెరిగే ప్రేమ చిరంజీవి!

9

వివాహ యోగ్యతలు

ఉద్యోగానికే కాదు వివాహానికీ కొన్ని అర్హతలుండాలి.

వయసొస్తే చాలు నిరభ్యంతరంగా పెళ్లాడేయొచ్చు - అనుకోవడం సరికాదు.

పెళ్లికి వయస్సు ఒక యోగ్యత మాత్రమే. ఇంకా చాలా లక్షణాలుండాలి. గుణగణా లుండాలి.

పెళ్లి నూరేళ్ళ సహజీవన యాత్ర. అది సజావుగా సాగాలంటే భార్యాభర్తలెన్నో బాధ్యతలు నెరవేర్చాలి. ఎన్నో ధర్మాలు ఆచరించాలి. తామూ సుఖసంతోషాల్లో తేలియాడాలి.

అందు నిమిత్తం కొన్ని అర్హతలుండి తీరాలి.

చట్టం నిర్దేశించిన నియమాలు

హిందూ వివాహచట్టం హిందూ వివాహానికి కొన్ని షరతుల్ని విధించింది.

వివాహ సమయానికి ఇద్దరిలో ఎవరికీ భర్త/భార్య జీవించి వుండరాదు.

వివాహంనాటికి వధువుకి 18, వరుడికి 21 ఏళ్ళు నిండివుండాలి.

వధూవరులిద్దరిలో ఏ ఒక్కరూ మతిస్థిమితం లేనివారై వుండరాదు.

నిషేదిత రక్తసంబంధాలకు చెందిన వారై ఉండరాదు.

ఆచారవ్యవహారాలు అనుమతిస్తే తప్ప సపిండ వివాహాలు జరగరాదు.

పెళ్లి మత ఆచారానుసారం జరగాలి. సప్తపది మొదలైనవి వివాహకాండలో తప్పనిసరి.

ఈడు కుదరాలి

వధువుకి 22 సం., వరుడికి 25సం. వుండటం శ్రేయస్కరం. అది పెళ్లికి అన్నివిధాలా ఐడియల్ ఏజ్ అని భావించబడుతోంది. ఉన్నతవిద్య అభ్యసిస్తే మరో మూడేళ్లు కలుపు కోవచ్చు.

ఆ వయస్సుకి వారి అవగాహనాశక్తి, సెక్స్ కోరిక స్థాయి, సర్దుబాటుతత్వం సమాన స్థాయిలో వుంటాయి. గనుక సంసారం సాఫీగా సాగిపోతుంది.

పెళ్లైన 3 - 4 ఏళ్ళకి సంతానం కలిగినా వారికి 55 ఏళ్ళొచ్చేసరికి వారి సంతాన బాధ్యత పూర్తిచెయ్యగల్గుతారు.

నడివయస్సు పెళ్లిళ్ళు మంచివికాదు. వారి సంతానం మందమతులయ్యే అవకాశం వుందని పరిశోధనలు చెబుతున్నాయి.

వధువుకన్నా వరుడు కనీసం 2 - 3 సం. పెద్దవాడై వుండాలి. 5సం. తేడా వుండటం శ్రేయస్కరం.

ఎంచేతంటే స్త్రీకి పురుషుడికంటే పునరుత్పత్తి శక్తి ముందుగా వస్తుంది. త్వరగా పోతుంది. వారి శృంగార జీవితం సాఫీగా సాగాలంటే వయస్సు భేదం అభిలషణీయం.

జోడూ కుదరాలి

వధూవరులిద్దరూ ఒకరికి సరిజంటగా మరొకరుండాలి.

ఒకరు లావుగా మరొకరు పీలగా, ఒకరు పొడుగ్గా రెండోవారు పొట్టిగా వుండకూడదు.

ఒకరికి తగిన జోడీగా రెండోవారుండాలి.

అలావుండటం వారికి తృప్తినీ గర్వాన్నీ ఇస్తుంది. నూన్యతాభావాన్ని కలిగించదు సరికదా ఆకర్షణని, ఇష్టాన్ని పెంచుతుంది.

కలిసి బయటికెళ్తే నలుగురూ మెచ్చుకోలుగా చూస్తారు. చూడముచ్చటైన జంట అనుకుంటారు. వారి సంతానమూ బాగుంటుంది.

వధువుకన్నా వరుడు పొడుగులో శరీరాకృతిలో కాస్త అధికంగా వుండాలి. వరహీనం మంచిది కాదు.

ఆరోగ్యం అతిముఖ్యం

కాబోయే దంపతులిద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో వుండాలి. ఎలాంటి దీర్ఘరోగాలూ లేకుండా వుండాలి.

పిచ్చి, ఉన్మాదం, ఎయిడ్స్, కుష్ఠువ్యాధి లాంటివి వుండకూడదు.

శారీరక ఆరోగ్యమేకాదు మానసికంగానూ వారు ఆరోగ్యంగా వుండాలి. వివాహానికి ముందు వధూవరులకు హెచ్.ఐ.వి పరీక్షలు తప్పనిసరిచేయనున్నది ప్రభుత్వం. ఈ విధానం గోవాలో అమల్లోవుంది. ఇది ఆహ్వానించదగిన పరిణామం.

భార్యభర్తలు ఆరోగ్యంగా వుంటేనే వారికి పుట్టే పిల్లలు కూడా అందంగా ఆరోగ్యంగా ఎలాంటి అవలక్షణాలూ లేకుండా వుంటారు.

పెళ్లి లక్ష్యాలలో సత్సంతానం ఒకటన్నది మరువరాదు.

సంపాదనాశక్తి ఉండాలి

సంపాదించే శక్తి, ఆర్థిక బలం వుండాలి. ఆదాయ మార్గాలు లేనివారు పెళ్లి చేసుకోకుండా వుండటమో పెళ్లిని వాయిదావేసుకోవడమో చెయ్యడం మంచిది.

భార్యబిడ్డల్ని పోషించగల ఆర్థిక శక్తి కాబోయే భర్తకి ఉండితీరాలి. భర్త అంటే భరించే వాడనేగా అర్థం!

కనీసం కాబోయే భార్యకైనా సంపాదనాశక్తి ఉండాలి.

ఇద్దరికీ ఆ శక్తి లేనప్పుడు వారికి మరే ఆదాయమార్గాలూ లేనప్పుడు వారికి వివాహం జరిపించక పోవడమే ఉత్తమం.

భార్యాభర్తలు తమ పోషణని చూసుకోగలిగితే చాలదు వారికి పుట్టే బిడ్డలను సైతం పోషించాలి. విద్యాబుద్ధులు చెప్పించాలి. వారికి చక్కని భవిష్యత్తునివ్వాలి.

అందుకు తగిన ఆర్థిక స్తోమతు కలిగినవారే పెళ్లిచేసుకోడానికి అర్హులు!

బాధ్యతల అవగాహన ఉండాలి

డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు – అంతా కూడా వృత్తి చేబట్టేముందు సంవత్సరాల శిక్షణ పొందుతూంటారు.

కాని ఎన్నో బాధ్యతలు కలిగి ఎన్నో జీవితాలతో (పిల్లలతో కలిపి) ముడివడిన పెళ్లికి ఎలాంటి శిక్షణా తీసుకోకుండానే పెళ్లిపీటల మీద కూర్చుంటున్నారు.

ఇది సత్సాంప్రదాయం కాదు.

వధూవరుల తల్లిదండ్రులూ బంధుమిత్రులూ పెళ్లి గురించీ తద్వారా వచ్చే బరువు బాధ్యతల గురించీ వారికి అవగాహన కల్పించాలి. పెళ్లిగురించిన పుస్తకాలని చదివించాలి.

పెళ్లిమంత్రాలలో ఎన్నో ప్రమాణాలున్నాయి. నీతిబోధన వుంది. బాధ్యతల వివరణ వుంది. ధర్మప్రబోధంవుంది.

శక్తివంతమైన మంత్రాల అర్థాన్ని వధూవరులకు వివరింపజెయ్యాలి.

అప్పుడే వధూవరులు తమ తమ పాత్రలని విజయవంతంగా పోషించగలుగుతారు. సంసార సాగరాన్ని ఈదగలుగుతారు!

వంశచరిత్ర తిరగెయ్యాలి

కేవలం వధూవరుల యోగ్యతల్ని పరిశీలిస్తే చాలదు. వారి వారి వంశాల యోగ్యతలూ చూడాలి.

పెళ్లికి అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలూ తిరగెయ్యాలన్నారు పెద్దలు.

సాధ్యాసాధ్యాల్ని ప్రక్కనబెట్టి వారి మాటల అంతరార్థం చూద్దాం.

జీన్స్ గురించి తెలీని వారెవరూ లేరు. శారీరక లక్షణాలు తెలివి తేటలు – వాటి ద్వారానే ఒక తరాన్నుంచి మరో తరానికి సంక్రమిస్తుంటాయి.

ముఖ్యంగా కొన్ని రకాల అవలక్షణాలూ రోగాలూ అవయవనిర్మాణ లోపాలూ జీన్స్ వల్లే వస్తూంటాయి. ఆస్మా, ఒబెసిటి, షుగర్ – లాంటివెన్నో ఎన్నో!

పెద్దల మాటల్లోని ముందుచూపుని ఆధునిక శాస్త్ర పరిశోధనలు సర్టిఫై చేస్తున్నాయి గనుక సాధ్యమైనంత వరకు వంశచరిత్ర తిరగెయ్యటం శ్రేయస్కరం!

కుటుంబ యోగ్యతా చూడాలి

ఆటలు, సంభాషణలు, స్నేహం, వివాహం – అన్ని విధాలా సరిసమానులతోనే చెయ్యాలి.

కయ్యానికైనా వియ్యానికైనా సమ ఉజ్జీ ఉండాలి.

లేడీ డయానా ప్రిన్స్ చార్లెస్‌ని వివాహమాడి ఉండొచ్చు. అలాటి కొన్ని మినహాయింపులుండొచ్చు. (ఆ పెళ్లి ఎలా పెటాకులైందో అందరికీ తెలిసిందే) స్థూలంగా రెండు కుటుంబాల స్థాయి సమానంగా ఉండటం అభిలషణీయం.

వర్గభేదాన్ని పట్టించుకోకుండా వివాహం జరిపించినా వారి వారి అలవాట్లూ అభిరుచులూ అహాలూ స్నేహాలూ దృక్పథాలూ పరిసరాలూ భార్యాభర్తల్ని సమానులుగా ఉంచవు. సాఫీగా నడవనివ్వవు. అంతస్తుల అడ్డుగోడలు విభేదాల్ని సృష్టించే ప్రమాదం పొంచి ఉంటుంది!

ఏకస్థాయి కుటుంబాల మధ్య జరిగే పెళ్లిళ్ళలో అలాంటి భేదాలకీ విభేదాలకీ తావుండదు.

సర్దుకుపోయే గుణం ఉండాలి

పెళ్లవగానే వధువు మరో ఇంటి సభ్యురాలవుతుంది.

తర్వాత స్వంత కుటుంబం ఏర్పరచుకుంటుంది.

ఒక్కోసారి పెరిగిన వాతావరణం, ప్రదేశం, సంస్కృతి నుంచి పూర్తిగా కొత్త 'లోకం' లో అడుగుపెట్టాల్సి వస్తుంది.

మహానగర అమ్మాయి పల్లెకు పల్లెటూరి అమ్మాయి పట్నం మారాల్సి రావచ్చు. ఒక్కోసారి విదేశాలకే వెళ్ళాల్సి రావచ్చు.

అందుకు తగిన విధంగా ఆమె సర్దుకుపోగలదో లేదో తెలుసుకోవాలి.

అబ్బాయి సైతం తన అలవాట్లు, స్నేహితులు, స్వేచ్ఛా సంచారం వగైరా మార్చుకుని బాధ్యతాయుతమైన యజమాని లేదా కర్త పాత్రకు మారాల్సి వుంటుంది. అందుకతడు మానసికంగా సంసిద్ధుడు కావాలి.

ఎక్కువ తక్కువ భావనలు, డామినేటింగ్ నేచర్ లేకుండా సర్దుకుపోతేనే సయోధ్య బలంగా ఉంటుంది.

పెళ్లికి ముందు ఈ గుణాన్ని అంచనావెయ్యడం కష్టమే అయినా వారి మనస్తత్వాలూ ప్రవర్తనా తెలిసిన పెద్దలు శ్రద్ధ కనబరిస్తే తగిన జోడీతో జతకలపొచ్చు.

పాకిస్థాన్ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్‌ని పెళ్లాడి పాకిస్థాన్ వెళ్ళిన జెమైమా గోల్డ్‌స్మిత్ అక్కడి ఉష్ణ వాతావరణం, ఈగలు భరించలేక తిరిగి లండన్ వెళ్ళిపోయింది. ఆమె పెళ్ళికి ముందే ఆ విభిన్న వాతావరణం సంస్కృతుల కోణం నుంచి ఆలోచించి ఉంటే అలా జరిగేది కాదు. కనీసం ముందే మానసికంగా సంసిద్ధమయ్యేది గనుక వివాహం విఫలమయ్యేది కాదు!

మనస్తత్వాలు విశ్లేషించాలి

ఎవరి మనస్తత్వం వారిదే. ఎవరికి వారు తామే కరక్టు, తమదే కరక్టు అని భావించవచ్చు.

కాని పెళ్లయ్యాక సహజీవనం చెయ్యాల్సిఉంటుంది.

అందుకు కొంత సర్దుబాటు, కొంత సంయమనం, కొంతశ్రద్ధ, కొంతమార్పు అవసరం. పట్టు విడుపులూ అవసరమే.

హఠాత్తుగా ఎవరూ తమ ప్రవర్తనని మార్చుకోలేరు.

మార్చుకుంటారని భావించడమూ అత్యాశే.

అంచేత వారిని వారిగా అంచనావెయ్యాలి. వారి ఎమోషన్స్, టెంపర్‌మెంట్, సెంటిమెంట్స్, అలవాట్లు, ఆకాంక్షలు విశ్లేషించాలి.

మంచివా చెడ్డవా అన్నది ప్రక్కనబెట్టి 'అవి వారి యోగ్యతలు' గనుక అందుకు సరిపోయే యోగ్యతలు గలవారినే చూడాలి.

ఒకరికి తన భార్య తనకంటే ఎక్కువ సంపాదించడం లేదా పెద్ద హోదాలో ఉండటం ఇష్టం లేదనుకోండి అతడికి తక్కువ సంపాదించే అమ్మాయితో పెళ్లి జరిపించడం మంచిది.

అలాగే తమకన్నా తక్కువ చదివిన అబ్బాయిని చేసుకోడానికి అమ్మాయి ఇష్టపడకపోవచ్చు. అది అయోగ్యత కాదు. అదే ఆమె యోగ్యతగా భావించి వరాన్వేషణ చేయాలి.

కులమతాల పాత్ర

పెళ్లిలో కులమతాల పాత్ర చాలా శక్తిమంతమైంది.

బహిరంగంగా ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇది సత్యం.

కమ్యూనిస్టులమూ అభ్యుదయవాదులమూ అని చెప్పుకునే వారిక్కూడా పిల్లల పెళ్లి విషయం వచ్చేసరికి 'కులం' గుర్తొస్తుంది. మతం, జాతి వగైరాలు జ్ఞప్తికొస్తాయి.

ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, నియమ నిబంధనలు, వ్యవహారశైలి, కుటుంబజీవన విధానం – ఒక్కో కులంలో ఒక్కోరకంగా ఉంటాయి.

ఒక్కో మత విశ్వాసాలు, పూజలు, ప్రార్థనలు, పండుగలు ఒక్కో తరహాలో ఉంటాయి.

ఒక్కో జాతి సంస్కృతి, భాష, దృక్పథం, తాత్విక చింతన ఒక్కో విధంగా ఉంటుంది.

వధూవరులు విభిన్న కుల, మత, జాతులకు చెందిన వారైతే వారిలో తేడాలు రావచ్చు. ఎడ్జస్టు కాలేకపోవచ్చు. అభిప్రాయ భేదాలు తలెత్తవచ్చు. విభేదాలకు దారి తీయనూవచ్చు.

ఒకే జాతి ఒకే మతం ఒకే కులంలో జరిగే పెళ్లిళ్ళలో జీవన విధానంలో పెద్దగా తేడాలుండవు గనుక ఆయా పెళ్లిళ్ళు విజయవంతం కావడానికి అవకాశాలెక్కువ.

సాటి కులస్తుడు లేక మతస్తుడు అన్నదీ ఓ యోగ్యత గనుక కులమత జాతుల్ని యోగ్యతల్లో చేర్చడం తప్పుకాదు!

శీల సంపద

ప్రాపంచిక సంపదల్లో ప్రముఖమైనవి విద్యా వినయ శీలసంపదలు.

వృత్తి లేక వ్యాపార రంగాల్లో రాణించడానిక్కావలసిన విద్య వినయాలు కలిగివుండాలి. సత్ప్రవర్తన, సత్శీలం, సంయమనం, సదాశయం తదితరాలూ ఉండాలి.

శీలమంటే సమస్త సద్గుణ సంపత్తి. అది ఉన్న చోటే శౌర్యం, వైభవం ఉంటాయి. శీలం లేకపోతే అన్నీ కోల్పోయినట్టే. శీలం మనిషికి గొప్ప ఆభూషణం. సంపద.

పెళ్లికి ముందు ఎవరు ఎవరితో ఎలా తిరిగినా ఎలాంటి సంబంధాలు కలిగివున్నా పాశ్చాత్య సమాజంలో తప్పులేదు.

కాని వివాహత్పూర్వ శారీరక సంబంధాలని హిందూ సమాజం అనుమతించదు.

పెళ్లి నాటికి వధూవరులిద్దరూ కూడా శారరీకంగా మానసికంగా పవిత్రులుగా ఉండా లంటుంది. అది ముఖ్య యోగ్యతగా పేర్కొంటుంది.

అలాటి వారి మధ్య జరిగిన వివాహం మీద గత సంబంధాల నీడలు పడవు. భయాలుండవు. బెదిరింపులుండవు. ఒకరినొకరికి సంపూర్ణంగా అర్పించుకో గలుగుతారు మనస్ఫూర్తిగా ప్రేమించుకోగల్గుతారు.

పవిత్రత మనశ్శరీరాల సంగమానికి చక్కని ఇంధనం. వారి వివాహం విజయవంత మవడానికి అవకాశాలు అత్యధికం.

జాతక పొంతనం

ప్రస్తుతం వాస్తు, జాతకాల మీద ఆసక్తి, నమ్మకం పెరిగాయి.

నమ్మకం ఉన్న వారు జాతకాలు చూపించుకోవచ్చు.

వివాహ విషయంలో వధూవరుల జాతకాలు సానుకూలంగా ఉండుటే 'పొంతనం' అంటారు.

వారి వారి జన్మ నక్షత్రాలను బట్టి జాతకచక్రాలు వ్రాయిస్తారు. రాశి, అంశ, ఆరూఢ చక్రములు మూడూ ఇరువురికీ వేసి జాతక పరిశీలన చేస్తారు.

కంప్యూటర్ ద్వారా కూడా 'జాతక పొంతన' చూసుకోవచ్చు.

అయోగ్య వివాహాలు

కొన్ని రకాలు వివాహాలు నిషిద్ధం అన్నారు. వధూవరులకు విడివిడిగా వివాహాయోగ్యత లున్నప్పటికీ వారికి వివాహం కూడదన్నారు.

సగోత్రీకులు వివాహం చేసుకోరాదు. గోత్రమంటే ఒకే మూలపురుషునికి చెందిన వారన్నమాట. దూర దూర దూర రక్త సంబంధం గలవారన్న మాట. ఒకే గోత్రం వారిని చేసుకుంటే 'ఎండాగమీ'. బయటి గోత్రం వారిని చేసుకుంటే 'ఎక్సాగమీ' అవుతుంది.

ఎక్సాగమీ శ్రేయస్కరం.

పిల్ల యొక్క గోత్రముతోనే గాక పిల్లతల్లి యొక్క గోత్రము వరుని గోత్రముతో సమానమైనను వివాహం కూడదని వేదవ్యాస స్మృతి పేర్కొంది.

గోత్రం చూడటం మహర్షుల దూరదృష్టికి నిదర్శనం. ఇది మరే జాతిలోనూ లేని అపూర్వ సంగతి.

మేనరికాలు మంచివి కాదు. బలహీనంగా ఉండే జీన్స్‌కి అండ దొరికి బలీయ మవుతాయనీ, కొన్ని నరాల కండరాల జబ్బులూ చర్మవ్యాధులూ కన్ను ముక్కు చెవి గొంతు వ్యాధులు గుండె జబ్బులూ జీన్సుద్వారా సంక్రమిస్తాయంటారు డాక్టర్లు.

సపిండవివాహాలు అంటే ఒకే శరీరంతో సంబంధం ఉన్నవారి మధ్య వివాహం నిషిద్ధం.

వధువు సోదరుడ్ని వరుడి సోదరికిచ్చి చేసే 'కుండమార్పిడి పెళ్లిళ్ళు' మంచివి కావన్నారు.

10

వివాహ నిర్ణయం

వరుడు లేక వధువును ఎంపిక చేసి వివాహాన్ని నిశ్చయం చేసే బాధ్యత అనాది నుంచీ తల్లిదండ్రులే స్వీకరిస్తున్నారు.

తరాలు మారే కొద్దీ తరాల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. వృద్ధ తరపు అభిప్రాయాలకీ యువతరపు ఆకాంక్షలకీ సంఘర్షణ తప్పటం లేదు.

వారిద్దరికీ సామరస్య పూర్వక సర్దుబాటు తప్పనిసరి. ఎంచేతంటే ఇద్దరి లక్ష్యమూ ఆకాంక్షా వివాహం సఫలం కావాలన్నదే గనుక.

వధూవరుల జీవితాల్ని నడిపించే పెళ్లి నిర్ణయాన్ని పెద్దలు తీసుకున్నా పిల్లలు చేసుకున్నా ఇరువురూ ఉమ్మడిగా చేసుకున్నా అదెంతో కీలకమైంది. గురుతరమైంది.

వధువు తల్లిదండ్రులు

ఆది నుంచీ వరాన్వేషణ వధువు తల్లిదండ్రులే చేస్తున్నారు.

పెళ్లయ్యేవరకూ ఆడపిల్ల సంరక్షణా బాగోగులు చూడాల్సిన బాధ్యత ఆమె తల్లిదండ్రులదే.

ఆమెకి అన్ని విధాలా తగిన వరుడ్ని తెచ్చి కన్యాదానం చెయ్యడం, కట్నకానుకలిచ్చి వరుడిని తృప్తి పరచడం, చీరసారెల్తో అత్తింటికి పంపడం – వారి బాధ్యత.

స్వతహాగా అమ్మాయిలు సిగ్గరులు. వ్యవహార జ్ఞానమూ తక్కువే.

ఇప్పుడు ఆర్థికంగా స్వతంత్రులవుతున్నప్పటికీ పెద్దల అభీష్టానికే పెద్ద పీట వేస్తున్నారు.

వరుడి చదువూ సంపాదనల నుంచి వారింటి స్థితిగతుల వరకూ సమస్తమూ తిరగేసి తమకి తగిన వరుడ్ని తల్లిదండ్రులే తేగలరని ఇప్పటికీ వారు విశ్వసిస్తున్నారు.

అతికొద్దిమంది అమ్మాయిలు మాత్రం ప్రేమ వివాహాలవైపు మొగ్గు చూపుతున్నారు.

మొత్తం మీద అత్యధిక పెళ్లిళ్ళు వధువు తల్లిదండ్రుల నిర్ణయానుసారమే జరుగుతున్నాయి.

వధువు అభిప్రాయాలకు ఇది వరకన్నా అధిక విలువివ్వబడుతోంది. ఇది ఆహ్వానించాల్సిన పరిణామం.

వరుడి తల్లిదండ్రులు

వధువు ఎంపికలో సైతం వరుడి తల్లిదండ్రులే ప్రధానపాత్ర ధరిస్తున్నారు.

కాబోయే వియ్యాలవారి ఆస్తిపాస్తులు, అమ్మాయి అందచందాలు, చదువు సంధ్యలు, కలిసిపోయే తత్వం వగైరాలని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.

వారి నిర్ణయాన్ని కట్నం లేక వధువు ద్వారా సంక్రమించే ఆస్తి ప్రభావితం చేస్తోందన్నది నిర్వివాదాంశం.

కట్నం కన్నా మిగతావాటికీ విలువిస్తున్న వారు లేకపోలేదు గాని వారి సంఖ్య స్వల్పం.

అబ్బాయి అభిప్రాయాలకు విలువనిస్తున్నప్పటికీ ఆర్థికాంశాలే ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.

'క్విక్ మనీ' 'క్విక్ రిచ్' జాడ్యం కొందరు కుర్రాళ్ళని అధికంగా ప్రభావితం చేస్తున్న సంగతీ గుర్తించాలి.

ఏది ఏమైనా కులం, మతం, ఆస్తి, అంతస్తు, వంశమర్యాదలు – వరుడి తల్లిదండ్రుల నిర్ణయాన్ని శాసిస్తున్నాయని చెప్పాలి.

ఇప్పుడిప్పుడే వారి దృక్పథంలో మార్పు వస్తోంది. దానిక్కారణం వరుడితోబాటు సమానంగా ఒక్కోసారి అధికంగా వధువు సంపాదన ఉండటమే!

వధూవరులు

కలిసి జీవించాల్సిన వాళ్ళే ఒకర్ని ఒకరు నిర్ణయించుకుంటే అది సహజంగా ఉంటుంది. చక్కగా ఉంటుంది.

తమ అభిప్రాయాలకు, వేవ్‌లెంగ్త్‌కి సరిపోయే 'బెటర్ ఛాయిస్'ని ఎన్నుకుంటారు గనుక వారి మధ్య దాపరికాలుండవు. ఒకర్నొకరు బాగా అర్థం చేసుకోగల్గుతారు. ఆస్తి కులమతాల ప్రభావం పరిమితంగా ఉంటుంది.

కాని ఆర్థిక స్వేచ్ఛలేని కన్య స్వతంత్ర నిర్ణయం తీసుకోజాలదు. వరుడికి తండ్రి ఆస్తి వారసత్వం కావాలి గనుక తండ్రిని ధిక్కరించే సాహసమూ చెయ్యలేకపోవచ్చు.

పైగా వారి వయస్సు, అనుభవం, లోకజ్ఞానం పరిమితం. పరిణతి లేనివి. ఆకర్షణ, మోహం, ఉద్రేకం, సాహస ప్రవృత్తి, సంప్రదాయ వ్యతిరేకత, తొందరపాటు – వారి కళ్ళకు రంగుటద్దాలు తగిలిస్తాయి.

వయస్సు వేడిలో వారు తీసుకునే వివాహ నిర్ణయాలు నూటికి నూరుపాళ్ళూ సరియైనవి కాజాలవు.

ప్రేమ వివాహాలు చేసుకుంటున్న వారిలో తమ నిర్ణయానికి ఆనందిస్తున్న వారి కంటే మోసపోయామని భ్రమపడ్డామని మాయలో కూరుకుపోయామని విచారిస్తున్న వారి సంఖ్యే అధికం!

పురాణాల్లో స్వయంవరాలు చేసుకున్న ప్రముఖ స్త్రీలు – సీత, ద్రౌపది, దమయంతి – కష్టాలు పాలవడం గమనార్హం!

పెద్దలు కుదిర్చిన పెళ్లి వల్ల లాభాలు

ఒకప్పటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో తండ్రీ కొడుకుల మధ్య దూరం ఉండేది. ఇప్పటి చిన్న కుటుంబాల్లో అది లేదు. పెద్దరికం, అధికారం ప్రదర్శించకుండా ఎంతో స్నేహంగా ఉంటున్నారు. అర్థం చేసుకుని ప్రవర్తిస్తున్నారు. పిల్లల ఉన్నతికోసం ఏం చేయడానికైనా సిద్ధపడుతున్నారు.

పెళ్లి నిర్ణయం తీసుకోబోయే ముందు ఎన్నో పరిశీలిస్తున్నారు. దూరదృష్టి ప్రదర్శిస్తున్నారు. వ్యవహారజ్ఞానంతో వ్యవహరిస్తున్నారు.

కుటుంబం, ఆస్తి, చదువు, అందం – అన్నీ చూచి సమ ఉజ్జీని ఎన్నిక చేస్తున్నారు.

పెద్దలు నిర్ణయించిన పెళ్లిలో వధూవరులు ఒకరికొకరు కొత్త కాబట్టి ఒకరిమీద ఒకరికి గౌరవం, నమ్మకం, కుతూహలం, మోజు, అభిమానం ఉంటాయి. పెళ్లితో ఒకటయ్యామన్న భావనతో ప్రేమ పుడుతుంది. భరోసా ఏర్పడుతుంది. అదృష్టవంతులమన్పిస్తుంది. చిన్న చిన్న లోపాలున్నా పెళ్లైంది గనుక తేలిగ్గా సర్దుకుపోతారు.

పెద్దలు ఆస్తులూ ఆశీస్సులూ లభిస్తాయి. అండదండలుంటాయి. అభిప్రాయ భేదాలొస్తే సర్దిచెప్పి సామరస్యత నెలకొనేలా కృషిచేస్తారు.

ఇరు కుటుంబాల ప్రేమాభిమానాలు లభిస్తాయి. సంఘంతో బంధువర్గంతో సత్సంబంధా లుంటాయి.

వారి సంతానానికీ మమతానురాగాలు లభిస్తాయి. బంధుప్రీతి తెలుస్తుంది. అనుబంధాల విలువ అవగతమవుతుంది.

పెద్దలు కుదిర్చిన పెళ్లిలో నష్టాలు

కాబోయే వధూవరులకు (దగ్గరి సంబంధాల్లో తప్ప) ఒకరి గురించొకరికి తెలీదు.

ఒకరి అభిరుచులూ అలవాట్లూ ఆకాంక్షలూ మరొకరికి తెలిసే అవకాశం ఉండదు. అందువల్ల వారిమధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. విభిన్న స్వభావాల ఘర్షణ వివాహ అశాంతికి దారితీయవచ్చు.

కట్న కానుకల తేడాపాడాల వల్ల పొరపచ్చాలు రావచ్చు. వారి సఖ్యత దెబ్బ తిననూ వచ్చు.

పెద్దల ఆహాలూ మూర్ఖత్వాలూ పట్టుదలలూ మూఢాభిప్రాయాలూ బాంధవ్యానికి గొడ్డలిపెట్టు కావచ్చు.

మేనరికాలు తదితర దగ్గరి సంబంధాలు చేసుకోవాల్సి రావడంవల్ల అనువంశిక జబ్బులు రావచ్చు. సంతానం అనారోగ్యం పాలవ్వొచ్చు.

ముఖ్యంగా వరుడి తరపు పెద్దల అధికృతా ప్రభావం అధికంగా ఉండటం వల్ల భార్యాభర్తల సంబంధం ఒడిదుడుకులకు లోనవ్వొచ్చు.

వధూవరులు చేసుకునే పెళ్లి వల్ల లాభాలు

ఒకరి నొకరు చాలా వరకు అర్థం చేసుకుంటారు.

ఇద్దరికీ అవతలి వారిలో నచ్చే అంశాలు ఎక్కువగా ఉంటాయి.

ఆశలూ ఆశయాలూ కలలూ కాంక్షలూ కొంతైనా తెలుస్తాయి.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మానసిక తృప్తి, ఏదో సాధించామన్న గర్వం కలుగుతాయి. మిగతా వారికన్నా భిన్నమైన వారమనీ అధికులమనీ భావిస్తారు. తమని తాము హీరో హీరోయిన్లుగా భావించుకుని పొంగిపోతారు.

వారు తమ ఆశయాల్ని సాధించవచ్చు. ఆకాంక్షలు నెరవేర్చుకోవచ్చు. ఒకరి సహాయ సహకారాలు మరొకరికి పూర్తిగా లభిస్తాయి గనుక ముమ్మందుకు దూసుకుపోవచ్చు. ఎన్నెన్నో విజయాలు సాధించవచ్చు.

పెద్దలతో సమన్వయం లేనప్పుడు 'మేమిద్దరం ఒకటి' అన్న భావం బలపడి వారి బంధం దృఢమవవచ్చు!

స్వయం నిర్ణయం వల్ల నష్టాలు

పెళ్లయ్యాక ఒన్‌సైడ్ ప్రేమ లేక ఇష్టం అని తేల (తెలియ) వచ్చు.

అవతలి వారి ఆస్తి చూసో అందం చూసో చేసుకున్నవారు ఆస్తి దక్కలేదనో అందం తరిగిందనో (మునుపటంత అందంగా లేరనో) కృంగిపోవచ్చు.

పెద్దల అభిమానం, ఆశీస్సు, అండదండలు లభించకపోవచ్చు. ఆర్థిక సహకారమూ లభ్యం గాక పోవచ్చు. అభద్రత ఆందోళనపరచవచ్చు.

తర్వాత కన్పించిన చిన్న చిన్న లోపాలని భూతద్దంలో చూసి తనది తొందరపాటు నిర్ణయమని బాధపడవచ్చు.

సరియైన సంపాదన లేదా ఆర్థిక స్థితిగతులు లేకపోతే వివాహం ఒడిదుడుకుల పాలవ్వొచ్చు.

పెళ్లివల్ల సంక్రమించే బాధ్యతలకు బెదరవచ్చు. తప్పించుకో జూడవచ్చు. రెండోవారిని విడిచి పారిపోనూవచ్చు.

వారి సంతానానికి పెద్దల ప్రేమాభిమానాలు లభించకపోవచ్చు.

నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్న వధువు

పెళ్లి నిర్ణయాన్ని పెద్దలు చేసినా పిల్లలు తమంతట తాము చేసుకున్నా వధువు అభిప్రాయానికి ప్రాముఖ్యత ఇవ్వక తప్పదు.

ఒకప్పుడు పెళ్లికి వధువు యొక్క అభిప్రాయం కనుక్కోవటం అవమానంగా భావించేవారు. ఆమె తల్లిదండ్రులు సైతం 'దాని మొఖం! దానికేం తెలుసు!' అనేవారు.

కాని వరుడి తల్లితండ్రులకన్నా వరుడికన్నా కూడా వధువు పాత్ర నానాటికీ పెరుగుతోంది. ఆమె అభిప్రాయం తెలుసుకున్నాకే వివాహ నిర్ణయం చేయాల్సి వస్తోందన్న సంగతి ప్రత్యేకంగా గమనించి తీరాలి.

విద్య స్త్రీ ఆలోచనా పరిధిని విస్తృత పరిచింది. వ్యక్తిత్వ వికాసం వారిని తీర్చిదిద్దింది. ఆర్థిక స్వేచ్ఛ వారి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

పెళ్లికన్నా కెరీర్‌కి అధిక ప్రాముఖ్యత ఇస్తున్న వారూ లేకపోలేదు. ఒంటరిగా మిగిలి పోవడానికిక్కూడా సిద్ధపడుతున్న వారూ ఉన్నారు..

ఈనాటి వధువు అర్థం చేసుకునే భర్తని కోరుకుంటోంది. తన కెరీర్ ఉన్నతికి తోడ్పడాలనీ అందుకోసం గృహకృత్యాల్లో పిల్లల పెంపకంలో బాధ్యత పంచుకునే వారై ఉండాలని ఆశిస్తోంది.

ఆమె అభిప్రాయాలని పరిగణనలోకి తీసుకున్నాకే వివాహం నిర్ణయం చెయ్యడం సమంజసం. అలా అని వరుడి అభిప్రాయాలని త్రోసి పుచ్చాల్సిన పనిలేదు. సమన్వయం సాధించగలిగితే ఉత్తమం.

ఆదర్శ నిర్ణయం

ఈనాటి పెళ్లిళ్ళలో అధికభాగం పెద్దలే కుదురుస్తున్నారు. అవే ఎక్కువగా విజయవంత మవుతున్నాయి కూడా.

ఆ సక్సెస్ రేటు మరింత పెరగాల్సి ఉంది.

అందుకోసం పెద్దల అనుభవమూ దూరదృష్టీ లోకజ్ఞానం – పిల్లల అభీష్టాలూ ఆశలూ ఆశయాలూ – రెండిట్నీ కూడా తగుపాళ్ళలో రంగరించాలి.

పెద్దలు పెళ్లి నిశ్చయించే ముందు తమ సంతానంతో మనస్సు విప్పి మాట్లాడాలి. వారి అభిప్రాయాలు తెలుసుకోవాలి. అవసరమైతే తగిన సూచనలివ్వాలి. జాగ్రత్తలు చెప్పాలి. తమ స్థితి గతుల్నీ కుటుంబ బరువు బాధ్యతల్నీ వివరించాలి. సంబంధపు బాగోగులు తెలియజెప్పాలి. పెద్దరికం ప్రదర్శించకుండా స్నేహితుల్లా వ్యవహరించాలి.

నామమాత్రపు పెళ్లి చూపుల్తో సరిపెట్టకుండా అబ్బాయీ అమ్మాయీ కలిసి మాట్లాడుకునేట్టు చూడాలి. ఒకరి గురించొకరు కొంతవరకైనా తెలుసుకునేందుకు అంచనా వేసుకునేందుకు అవకాశం కల్పించాలి. ప్రోత్సహించాలి.

వారి అభిప్రాయం సానుకూలంగా ఉంటేనే వివాహాన్ని నిర్ణయించాలి.

వధూవరులు సైతం పెళ్లి తమ భావి జీవితాలకు ఉమ్మడి ద్వారం అన్నది గ్రహించి ప్రవర్తించాలి.

తమ మనస్సులోని భావాలు ఆశలు ఇష్టాఇష్టాలు అన్నీ కూడా సిగ్గుపడకుండా నిర్మొహమాటంగా విప్పి చెప్పాలి. ఎవర్నైనా ప్రేమిస్తే ఆ సంగతి చెప్పి మిగతా విషయాలు పెద్దలకు వదిలెయ్యాలి. పెద్దల అభిప్రాయాలూ వాటి వెనుకనున్న కారణాలూ తెలుసుకోవాలి. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవాలి.

పెద్దలు కోరేది తమ శ్రేయస్సే నన్న సంగతి విస్మరించరాదు.

ఈ విధంగా పెద్దలూ కాబోయే వధూవరులూ కలిసి నిర్ణయించిన పెళ్లి నిశ్చయంగా ఆదర్శప్రాయమైంది. ఆనందకరమైంది!

11

మధ్యవర్తులు

వివాహాల్లో మధ్యవర్తులకు చాలా ప్రాధాన్యత ఉంది.

ఫలానా వారింట్లో పెళ్లికెదిగిన యువకుడున్నాడన్న వార్తని అమ్మాయి తరపు వారికందించాలి. ఫలానా ఊళ్లో మీ అబ్బాయికి తగిన అమ్మాయి వుందని వరుడి తల్లిదండ్రులకు చెప్పాలి.

వారి గురించి వీరికీ వీరి గురించి వారికీ చెప్పి వారి మధ్య సయోధ్య కుదర్చాలి. సంధాన కర్తగా వ్యవహరించాలి.

ఆ పనిని సవ్యంగా నిర్వహించి పెళ్లికి మార్గం సుగమం చేసేవారే మధ్యవర్తులు లేదా సంధానకర్తలు.

సంధానకర్తల ఆవశ్యకత

మీ అమ్మాయిని మా అబ్బాయికివ్వండని అడగటానికి మొహమాటంగా వుంటుంది. అహమూ అడ్డురావచ్చు.

మీ అబ్బాయికి మా అమ్మాయినిస్తామని తిన్నగా వెళ్ళి అడిగితే వారెలా ప్రతిస్పందిస్తారోనని అనుమానం, ఎలాంటి కోరికలు కోరతారోనన్న భయమూ వుంటుంది.

ఎలావోలా సర్దిచెప్పుకుని వారు వీరిని గాని, వీరు వారిని గాని అడిగినా తమ గురించన్నీ చెప్పుకోలేరు. గొప్పలు చెబుతున్నారనుకుంటారేమోనన్న సంకోచం వెనక్కి లాగుతూంటుంది. అదే సమయంలో వ్యతిరేక ప్రభావం చూపే అంశాలని దాచటానికీ ప్రయత్నిస్తారు.

ఇచ్చిపుచ్చుకోటాల గురించి నిర్మొహమాటంగా అడగలేరు. చెప్పలేరు.

ఇదే మధ్యవర్తి వుంటే ఎలాంటి ఇబ్బందీ వుండదు. వారికి స్వార్థం వుండదు గనుక

తమకి తెలిసిన విషయాలన్నీ వివరిస్తారు. అవతలివారి అనుమానాల్ని నివృత్తి చేస్తారు. కట్నకానుకల అంచనా తెలియజేస్తారు.

ఇరువైపుల వారినీ కలిపి 'శుభం' అనిపించాలని చూస్తారు.

వివిధ అవతారాలెత్తిన మధ్యవర్తుల గురించి తెలుసుకుందాం.

బంధుమిత్రులు

వీరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తే కార్యం పూర్తి సానుకూలంగా వుంటుంది.

సాధారణంగా ఇరుపక్షాల వారూ వారికి బాగా కావాల్సిన వారో తెలిసిన వారో అవుతారు. రెండు కుటుంబాల స్థితిగతుల గురించి చక్కని అవగాహన వుంటుంది. వారి వారి అమ్మాయీ అబ్బాయిల గురించి సద్భావన వుంటుంది.

వారిని కలిపితే బాగుంటుందన్న అభిప్రాయం ఏర్పడిన మీదట రంగంలోకి దిగుతారు.

ఆస్తిపాస్తులు మంచిచెడులు అన్నీ తెలిసి వుంటాయి గనుక సమఉజ్జీ అవుతారో లేదో పోల్చి చెప్పగలుగుతారు. గోరంతలు కొండంతలు చేసి చెప్పాల్సిన అవసరంగాని మాయమాటలు చెప్పి మోసగించాల్సిన అగత్యంగాని వుండవు. స్వలాభాపేక్షా వుండదు.

గనుక చర్చలూ నిర్ణయాలూ సుహృద్భావ వాతావరణంలో జరుగుతాయి. ఇద్దరికీ నచ్చచెప్పి పనిని సానుకూలం చెయ్యగలరు. అభిప్రాయభేదాలు తలెత్తితే సర్దిచెప్పనూ గలరు.

వివాహం నిర్విఘ్నంగా జరగడానికి తోడ్పడతారు.

ఇద్దరి క్షేమాలూ శుభాలూ వారికి ముఖ్యం గనుక బంధుమిత్రులే పెళ్లికి మధ్యవర్తులైతే అన్ని విధాలా బాగుంటుంది.

పెళ్లిళ్ళ పేరయ్యలు

ఊరూరా తిరిగి పెళ్లికావాల్సిన అబ్బాయిల అమ్మాయిల వివరాలు సేకరిస్తారు. కాలికి బలపం కట్టుకుని మరీ తిరిగి ఒకరి వివరాలు ఒకరికి చెప్పి పెళ్లి కుదర్చడానకి కృషి చేస్తారు పెళ్లిళ్ళ పేరయ్యలు.

ఇది వృత్తి కాని వృత్తి. కొందరికి ప్రవృత్తి.

వీరి సంఖ్య నానాటికీ తగ్గపోతున్నా వీరి అవసరం సమాజానికి చాలా వుంది.

ఎక్కడెక్కడో వున్న వారి సమాచారం మరెక్కడో వున్న వారికి అందించడం వీరి ప్రధాన కర్తవ్యం. ఏ స్థాయి వారికి ఆ స్థాయి సంబంధాల గురించి తెలియజెప్పడమే గాక మగ్గపుకండీలా అటు ఇటు తిరిగే గౌరవనీయమైన మధ్యవర్తులు వీరు.

కేవలం వధూవరుల గురించే కాదు ఆయా కుటుంబాల గురించి వాకబు చేసి మరీ అన్ని విషయాలూ చెబుతారు. అదే ప్రాంతంలో తిరగవలసిన వారు గనుక లోటుపాట్లని తెలియజేయడానికి వెనుకాడరు.

దారి ఖర్చులు తీసుకుంటూ సంభావన ఆశించి తిరిగే పెళ్లిళ్ళ పేరయ్యలను విశ్వసించవచ్చు.

అలాగని పూర్తిగా వారి మాటల్ని గుడ్డిగా నమ్మకూడదు. ఆయా ప్రదేశాల్లోని బంధుమిత్రుల ద్వారా వెరిఫై చేయించి ముందడుగు వేయడం మంచిది.

మ్యారేజ్ బ్యూరోలు

ఒక ఆఫీసు, కులాల వారీ వధూవరుల వివరాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే సిబ్బంది గల మ్యారేజ్ బ్యూరోల సంస్కృతి ఊరూరా వెలసింది.

సంస్థారూపం దాల్చిన పెళ్లిళ్ళ పేరయ్యల వ్యవస్థే ఇది.

వారికీ వీరికీ మౌలికమైన తేడావుంది.

పేరయ్యలు సంబంధీకుల ఇల్లూ వాకిలీ చూస్తారు. వారి ఆశలు, కోరికలు స్వయంగా తెలుసుకుంటారు. వ్యక్తిగత, వంశ వివరాలు సేకరించి సాధికారంగా చెబుతారు.

మ్యారేజ్ బ్యూరోల వారందుకు భిన్నం. వారి గురించి వీరికేమీ అవగాహన ఉండదు. వ్యక్తిగతంగా ఏమీ చెప్పలేరు. కేవలం అవతలివారు రాసిచ్చిన వివరాలు మాత్రమే 'చూపించ' గలరు.

అంటే సంబంధాల వివరాలు సూచిస్తారు తప్ప వివరాల్లోకి వెళ్ళరు.

ఫీజు చెల్లించి కావాల్సిన వివరాలు చెబితే చాలు మిగతా కథవారే నడిపిస్తారు.

ఫోటోలు చూపిస్తారు. కంప్యూటర్ల సాయంతో తగిన జోడీని ఎన్నుకోడానికి తోడ్పడతారు. ఇరుపక్షాలనీ కలుపుతారు. సంప్రదింపులకు అవకాశం కల్పిస్తారు.

తమ దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వివరాలు మాత్రమే ఇవ్వగలుగుతారు. ఆయా సంస్థల ఖ్యాతిని బట్టి సంబంధాల డేటా బేస్ వుంటుంది.

ఇరువైపుల్నుంచీ ముందుగా కొంత రిజిస్ట్రేషన్ సొమ్ము వసూలు చేస్తారు. పెళ్లి కుదిరితే కొంత కమీషన్ లేక బహుమానం ఆశిస్తారు.

ఇది లాభసాటి వ్యాపారమైంది.

కొన్ని బ్యూరోలు కొన్ని కులాలకే పరిమితమైతే మరి కొన్ని అన్ని కులాల వారి డేటా అందిస్తున్నారు.

సంబంధాల మంచి చెడుల గురించి వీరికి బాధ్యతేమీ వుండదు.

అవతలి వారు తప్పుడు సమాచారం అందిస్తే వీరిని నిందించడానికీ వుండదు.

అంచేత వధూవరుల తరపు వారు స్వయంగా గాని బంధుమిత్రుల ద్వారా గాని అవతలి వారి గురించి వాకబు చెయ్యాలి. మరిన్ని వివరాలూ విశేషాలూ సేకరించుకోవడం తప్పనిసరి.

ఆ తర్వాతే వివాహ నిర్ణయం చేసుకోవాలి.

పత్రికా ప్రకటనలు

వధూవరుల తల్లిదండ్రులుగాని సంరక్షకులుగాని కొండొకచో స్వయంగా వారేగాని పత్రికలలో ప్రకటన ఇస్తారు.

'వరుడు కావలెను' 'వధువు కావలెను' అని ఇచ్చే ఈ ప్రకటనల్లో సంక్షిప్త వివరాలే వుంటాయి.

కులం, వయస్సు, ఎత్తు, విద్యార్హత, ఉద్యోగం, సంపాదన, ఆస్తి, ప్రాంతం –గురించి మాత్రమే తెలియజేస్తారు.

అంటే వ్యక్తిగత వివరాలకూ ఆదాయానికే ప్రాధాన్యతన్నమాట.

ఆసక్తి గలవారు వారిచ్చే ఫోన్ నెంబర్లతో లేదా పోస్టుబాక్సు నెంబర్లతో సంప్రదించాల్సి వుంటుంది.

ప్రకటన ఇచ్చిన వారికీ నచ్చితే ముందుకెళ్ళవచ్చు.

ప్రకటనలో పేర్కొన్న వివరాలు నిజమో కాదో స్వయంగా తెలుసుకోవాలి. ఇతర వివరాలు తెలిసిన వారి ద్వారా వాకబు చెయ్యాలి.

మోసపూరిత ప్రకటనలతో పత్రికల వారికేమీ సంబంధం వుండదని గమనించాలి.

క్షుణ్ణంగా వెరిఫై చేసుకోవడం అత్యవసరం.

పెళ్లైనవారు ఆ సంగతి దాచిపెట్టి మరోపెళ్లి కోసం ప్రకటన ఇచ్చిన దాఖలాలెన్నో వున్నాయి. జాగ్రత్త జాగ్రత్త!

మ్యారేజ్ డాట్ కామ్‌లు

ఇంటర్నెట్ ప్రాచుర్యంలో కొచ్చేక మ్యారేజ్ డాట్ కామ్‌ల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. వాటి ఆదరణ గణనీయంగా వుంటోంది.

నిజం చెప్పాలంటే ఇవి ఎల్లల్ని చెరిపేశాయి.

రాష్ట్రంలోనే కాదు దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడ ఏ మూల వున్న వధూవరుల వివరాలనైనా సరే చిటికెలో అందిస్తాయి.

వీరికి ఆఫీసులుంటాయి గాని వాటిని సందర్శించాల్సిన అవసరం లేదు. ఇంటర్నెట్ వుంటే చాలు.

రిజిస్ట్రేషన్ ఫీజుని సైతం క్రెడిట్ కార్డ్‌తో చెల్లించవచ్చు. ఫోటోలతో సహా వివరాలను వెబ్‌సైట్లో స్వయంగా పెట్టుకోవచ్చు.

కోరుకునే వివరాలిచ్చి వాటికి మేచయ్యే సంబంధాల గురించడిగితే క్షణాల్లో కళ్ళముందు ప్రత్యక్షమవుతాయి. ఫోన్, ఈ మెయిల్ ఐడీ ద్వారా అవతలి వారిని కాంటాక్ట్ చెయ్యవచ్చు.

కేవలం ఆ సంస్థలో రిజిస్టర్ చేసుకున్న వారి వివరాలు మాత్రమే అందుబాటులో వుంటాయి. ప్రపంచాన్ని జల్లెడ పట్టి కావాల్సిన వధువు లేక వరుడ్ని వెదకి పట్టివ్వడం వీటి ప్రత్యేకత.

కొన్ని సంస్థలు AIDS, STD, Hepatitis, Thalesaamia మొదలైనవి ముందే టెస్ట్ చేయించి ఆయా రిపోర్టుల్ని కూడా వెరిఫికేషన్‌కు పెడుతున్నాయి.

పట్నాలలో డాట్‌కామ్‌ల జోరు అత్యధికంగా వుంది.

ఇంటర్నెట్ ద్వారా అమ్మాయి లేక అబ్బాయిని చూడటం, ఒకరి అభిప్రాయాలూ అభిరుచులూ మరొకరు తెలుసుకోవడం, చాటింగ్‌తో దగ్గరవ్వడం, తల్లిదండ్రులకి చెప్పి పెళ్లిచేసుకోవడం చకచకా జరిగిపోతున్నాయి. దూరాభారాల వల్లా బిజీ లైఫ్ వల్లా పెద్దలూ వీటిని ప్రోత్సహిస్తున్నారు.

Bharat Matrimony. com 2006 -07 లో 7 లక్షల వివాహాలు జరిపించి 100 కోట్ల వ్యాపారం చేసింది. Jeevansathi.com 75 కోట్ల వ్యాపారం చేసిందంటే వీటికి లభిస్తోన్న ఆదరణేమిటో తెలుసుకోవచ్చు.

ఇవి కేవలం 'సాంకేతిక' వివరాలు మాత్రమే ఇస్తాయి. వంశమర్యాదలూ సంప్రదాయాలూ కుటుంబ వివరాలూ స్వయంగా కలిసి మాట్లాడి ఎంక్వైరీ చేసి ఒక నిర్ణయానికి రావడం శ్రేయస్కరం.

పేర్లు ఫోటోలు వృత్తి ఆదాయ వివరాలు 'మార్చి' 'రంగులద్ది' 'షైనింగిచ్చి' ఇచ్చే వారుంటారు. వాటిని నమ్మి విదేశీ సంబంధాల మోజులో తొందర పడటం మంచిది కాదు. ఉద్యోగం, సంపాదనల గురించి మాయచేసే మోసగాళ్ళూ వుంటారు. తస్మాత్ జాగ్రత్త!

వివాహ పరిచయ వేదిక

కొన్ని కులాల వారు వారి సంఖ్య అధికంగా వున్న ప్రాంతాలలో వివాహ పరిచయ వేదికల్ని ఏర్పాటు చేస్తున్నారు.

సాటి కులస్తుల సౌకర్యార్థం ఉచితంగా ఏర్పాటు చేసే పరస్పర పరిచయ వేదికలివి.

పెళ్లి కెదిగిన అబ్బాయి లేక అమ్మాయి గల వారి కుటుంబాలిందులో పాల్గోవచ్చు.

వారిని వేదిక మీదకు పిలిచి పరిచయం చేస్తారు. వివరాలు చదువుతారు. కావాల్సిన అర్హతలూ చెబుతారు.

ఆసక్తిగలవారు అప్పటికప్పుడే అక్కడికక్కడే అవతలి వారిని సంప్రదించవచ్చు. వధూవరులు ఒకర్నొకరు చూసుకొవచ్చు. మాట్లాడుకోనూవచ్చు.

ఒకరి వివరాలొకరు తెలుసుకున్నాక నచ్చితే అప్పుడు గాని తర్వాత గాని పెళ్లికుదుర్చుకోవచ్చు.

పట్నాల్లో ఎవరు ఏ కులస్తులో తెలీదు. అందరితో అందరికీ పరిచయం ఉండే అవకాశమూ లేదు.

ఆ లోటును ఈ వివాహ వేదికలు పూడుస్తున్నాయి.

సంబంధాన్వేషణలో వున్న తల్లిదండ్రులకు ఆయాచిత వరంలా ఇవి పనిచేస్తున్నాయి.

ఇరుపక్షాలవారూ ఒకే ప్రాంతానికి చెందినవారై వుంటారు గనుక పెళ్లిళ్ళు కుదుర్చుకోవడం సులభం అవుతుంది.

వివాహపరిచయ వేదికలు ఏర్పాటు చేసినచోట కిక్కిరిస్తే జనమే వీటి విజయానికి సాక్ష్యం!

పరిమళించిన మానవత్వం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న వరకట్న దురాచారాన్ని రూపు మాపాలన్న లక్ష్యంతో మానవతా విలువలకు అద్దం పడుతూ ఏర్పడిందో కొత్త సంస్థ.

www.idontwantdowry.com ఈ మధ్యే ప్రారంభించబడిన వెబ్‌సైట్. అనతికాలంలో ప్రాచుర్యం పొందిన సంస్థ.

కట్నం ఆశింపు లేకపోవడమే ఇందులో పాల్గొనటానికి ప్రధాన అర్హత.

కట్నం ఆశించనివారూ కట్నం ఇవ్వడం ఇష్టంలేని వారూ కట్నం ఇవ్వలేనివారూ ఈ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. నచ్చిన జోడీని ఎన్నుకోవచ్చు.

12

వధూవరుల ఎంపిక

వరుడు లేక వధువుని ఎంపిక చేయడం చాలా క్లిష్టమైన వ్యవహారం.

వ్యక్తిగత సామాజిక ఆర్థిక అంశాలతోబాటు అనేక విషయాలు పరిశీలించాలి. అనేక కోణాల్నుంచి పరిశోధించాలి.

పెళ్లి నూరేళ్ళ బంధం. ఆ బంధం దృఢంగా వుండాలంటే దాని పునాది బలంగా వుండాలి.

వివాహానందం సంపూర్ణంగా గ్రోలాలంటే, భాగస్తుల జీవితాలు రసరమ్య కావ్యాలు కావాలంటే వాళిద్దరూ ఒకరికొకరు సరిపోవాలి. సరిజంట కావాలి.

తోడునీడగా మారాలి. చెయ్యీ చెయ్యీ పట్టుకుని జీవనయానం సాగించాలి.

అందుకు పునాది వధూవరుల ఎంపిక.

'వివాహశ్చ వివాదశ్చ సమమోరేవ శోభతే' అన్నారు.

కయ్యానికైనా వియ్యానికైనా సమఉజ్జీ ఉండాలి.

వయోరూప విద్యాది విషయాలలో సమస్థితిలో ఉన్నవారి వివాహం రాణిస్తుంది.

వివాహ విజయం చాలా వరకూ ఈ ఎంపిక మీదే ఆధారపడి వుంటుంది.

(i) వరుడి ఎంపిక

వరుడిలో కోరే లక్షణాలు

'కన్యా వరయతే రూపమ్
మాతావిత్తం పితా|శ్రుతమ్।
బాంధవాః కులమిచ్ఛంతి
మృష్టాన్ని మితరే జనాః॥

పెళ్లికూతురు తనకి కాబోయే భర్త అందంగా వున్నాడా లేదా అని చూస్తుందిట. ఆమె తల్లి మాత్రం కాబోయే అల్లుడు బాగా సొమ్ములున్న వాడేనా అని చూస్తుందిట. డబ్బుంటే చాలు కూతురు సుఖపడుతుందని ఆమె విశ్వాసం కావచ్చు.

ఇక కన్య తండ్రి వరుడి సంపాదనా సామర్థ్యం వంశ ప్రతిష్ఠలు చూస్తాట్ట. బంధువులేమో స్వకులస్తుడేనా అని ఆరా తీస్తారట. మిగతా జనం వివాహభోజనం గురించే ఆలోచిస్తారట.

పెద్దల ఉవాచ

'బుద్ధిమతే కన్యాం ప్రయచ్ఛేత్' – అన్నది ఆర్యోక్తి.

బుద్ధిమంతుడైన వరుడికే కన్యనివ్వాలి.

'బ్రహ్మ చర్యేణ కన్యాయువానాం విదతే పతిమ్' – అన్నారు అథర్వవేదంలో.

స్త్రీ తన గుణ కర్మ స్వభావాలకు అనుకూలంగా సత్పురుషుడు సుశీలుడు ఉత్తమ రూపగుణాలు కలిగిన పురుషుని పతిగా పొందాలని వేదం ఆదేశిస్తోంది.

'కులంచశీలం చ వపుర్యశశ్చ విద్యాంచ విత్తం న సనాథతాం చ।
ఏతాన్గుణాన్సప్త పరీక్ష్యదేయా కన్యాబుధైః శేష మచిన్తనీయమ్॥

కులం, శీలం, శరీరం, యశస్సు, విద్యాధనం, బంధువుల సహకారాలు అనే సప్తగుణాలను పరీక్షించి కన్యనివ్వాలని స్మృతి చంద్రిక చెబుతోంది.

కుటుంబ నేపథ్యం

వరుడి వంశం గురించీ కుటుంబం స్థితి గతుల గురించీ బంధుమిత్రులతో గల సంబంధ బాంధవ్యాలగురించీ వాకబు చెయ్యాలి.

ముఖ్యంగా వరుడు తన కుటుంబంతో బంధుమిత్రులతో ఎలా మెలగుతున్నాడో చూడాలి. ఎలాటి సంబంధం కలిగి వున్నాడో పరిశీలించాలి.

ఆస్తులు, అప్పులు, బాధ్యతలు, బరువులు – తెలుసుకోవాలి. వాటి ప్రభావం భవిష్యత్తులో వరుడి మీద ఎంత వుంటుందో అంచనా వెయ్యాలి.

గొప్ప కుటుంబమని చెప్పి అబ్బాయిని చూడకుండా కలిసి మాట్లాడకుండా పెళ్లి నిశ్చయించ వద్దు. అమెరికా వరుడని హడావిడి పడిపోయి మూహూర్తాలు పెట్టుకో వద్దు.

నిదానం ప్రధానం!

పనిచేసే ప్రదేశంలో

అబ్బాయి పనిచేస్తున్న ఆఫీసులో లేదా వ్యాపార ప్రదేశంలో అతడి ప్రవర్తన గురించి ఎంక్వైరీ చెయ్యాలి.

అతడి కొలీగ్స్‌తో సహచరుల్తో మాట్లాడాలి.

కేవలం అతడి జీతం, రాబడి, ప్రమోషన్ అవకాశాలు, వ్యాపారాభివృద్ధి వగైరాలు అడిగి వూరుకోకూడదు.

పనిమీద అతడికి గల శ్రద్ధ లేక అతి శ్రద్ధ, భయం, భక్తి, కోపతాపాలు, లోటుపాట్లు, అంకిత భావం, సమయపాలన, డిసిప్లిన్ వగైరాలూ కనుక్కోవాలి. సహోద్యోగుల్తో ఎలా మసల్తున్నాడో వ్యవహరిస్తున్నాడో తెలుసుకోవాలి.

ఉద్యోగం లేక వ్యాపారమే సర్వస్వం అనుకునే వర్క్‌హాలిక్‌లుంటారు జాగ్రత్త!

స్నేహితులూ అలవాట్లూ

ఒకరి గురించి పూర్తిగా తెలియాలంటే అతడి స్నేహితుల గురించీ చదివే పుస్తకాల గురించీ తెలుసుకోవాలి.

అబ్బాయిల మీద స్నేహాల ప్రభావం ఎక్కువగా వుంటుంది.

అంచేత అతడి స్నేహితుల్ని కలిసి మాట్లాడితే చాలు అతడి గురించి చాలా తెలుస్తాయి. ముఖ్యంగా అతడి అలవాట్లు!

త్రాగుడు, జూదం, వ్యభిచారం, లంచగొండితనం, వృథా వ్యయం – వగైరాల గురించి జాగ్రత్త వహించాలి.

'ఇవాళ రేపు ఇవి మామూలే' 'లెక్కలోవి కాదులే' 'పెళ్లయ్యాక మారతాళ్ళే' అని నిర్లక్ష్యం చెయ్యొద్దు.

చిన్నగా మొదలైన దుర్వ్యసనాలే మహమ్మారిగా మారి కబళించెయ్యొచ్చు!

విద్య, మంచి నడవడి, శీలం, బంధుత్వం కలవాడే ఉత్తమ వరుడని పేర్కొన్నారు గౌతముడు.

వివాహ లక్ష్యమైన సంతానాన్ని పొందడానికి తగినట్లుగా వరుడు వీర్యవంతుడై ఉండాలి.

మూర్ఛరోగి, పక్షవాతం కలవాడు, సగోత్రుడు, కుష్ఠురోగి, పతితుడు, మాయల మారిగా వ్యవహరించే వాడు – వీరికి పిల్లనివ్వరాదని స్మృతులు చెబుతున్నాయి.

ఉత్తమ వరుడు

జాతి, విద్య, యౌవన, జలస్వాస్థ్య, బాంధవ సహాయం, ధనం, ఉత్సాహం–కలిగి వుండాలి.

మంచివంశంలో పుట్టి ఉండాలి. బంధు సంపత్తి కలిగివుండాలి. పదిమంది మెచ్చే స్వభావం కలవాడై ఉండాలి. గృహస్థాశ్రమమును సంతోషంగా స్వీకరించాలి. ఋణత్రయాన్ని తీర్చగల పూర్ణపురుషుడై వుండాలి.

మంచి లక్షణాలు, సదాచార సత్ప్రవర్తనలు, వయస్సు, విద్య, ధనరూప సౌందర్యాలు, బంధుమిత్ర సంపత్తి, జాతినీ సమాజాన్నీ సంప్రదాయాన్నీ ప్రేమించే తత్వం, పదిమంది మెప్పు పొందగల నేర్పు – కలిగి వుండాలి.

వ్యక్తిత్వం ముఖ్యం

అబ్బాయి రూపమూ సంపాదనా చూసి ఇంప్రెస్ అవడం సహజం.

ఆ ఫస్ట్ ఇంప్రెషన్ ప్రభావానికి లోను కాకూడదు. ఆ అభిప్రాయాన్ని లోలోపలే దాచుకోవాలి. అతడితో అన్ని విషయాలూ మాట్లాడాలి. అతడేమిటో ఎలాటి వాడో తెలుసుకోడానికి ప్రయత్నించాలి. లోపాలు వెదకాలి.

అతడి మాటతీరునీ ప్రవర్తనాసరళినీ శ్రద్ధగా గమనించాలి. ఆత్మవిశ్వాసపు స్థాయి తెలుసుకోడానికి ప్రయత్నించాలి.

అతడి వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యాలి.

నీతీ నిజాయితీ శ్రమించేతత్వం కలవారు ఖచ్చితంగా ఉన్నతస్థాయి కెదుగుతారు. అడ్డదార్ల మీద మోజు, దురలవాట్లు గలవారు, ప్రస్తుతం ఎంతటి ఉచ్ఛస్థితిలో వున్నప్పటికీ తర్వాత పతనమవుతారు!

ఆర్థిక సమర్థత

భర్త అంటే భరించే వాడని అర్థం.

భార్యా బిడ్డల్ని పోషించగల సమర్థత వరుడికి వుండాలి.

ప్రస్తుతం సంపాదన లేకపోయినా సంపాదించగల అర్హతలు – అంటే చదువు, అనుభవం, నైపుణ్యం వుండాలి.

తాత తండ్రుల ఆస్తిపాస్తులున్నా వాటిని నిలబెట్టుకోడానికైనా సమర్థత, చాకచక్యం వుండి తీరాలి. కూర్చొని తింటే కొండలైనా కరిగిపోతాయి కదా!

స్థిరమైన ఉద్యోగం లేక వ్యాపారం లేక ఆదాయ మార్గం వుండి తీరాలి.

ఆమె న్యాయమైన కోర్కెలు తీర్చగలగాలి. సంతానానికి చక్కని భవిష్యత్తు ఇవ్వగలగాలి.

డబ్బున్నంత మాత్రాన సంస్కారవంతుడూ చక్కని వరుడూ అవుతాడనుకోవద్దు!

రేపులోకి తొంగి చూడాలి

ఇవాళ్టి ఆస్తి, సంపాదన, ఉద్యోగం, సామాజిక పరిస్థితి గురించి తక్కువగానూ రేపటి గురించెక్కువగానూ ఆలోచించాలి.

నేటి చిరుద్యోగి చకచకా మెట్లెక్కి ఉన్నతాధికారిగా మారవచ్చు.

పనిమీద శ్రద్ధ, ఇష్టం లేనివారు ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే వుండిపోవచ్చు.

చిన్న వ్యాపారి అవకాశాల్ని అంది పుచ్చుకుని బహుముఖంగా వృద్ధిచెందవచ్చు.

చిరంజీవి, ధీరూభాయ్ అంబానీ పెళ్లినాటికి సామాన్యులే.

ఎదగాలన్న తపన, లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదల, అవకాశాలను సృష్టించుకోవాలన్న తహ తహ, క్రమశక్షణ, నిరంతరసాధన - ఉన్నత విజయాలకు మెట్లు.

ఆ దృష్ట్యా ఆలోచించి వర నిర్ణయం చెయ్యాలి.

వధువు దృక్పథం

వధువు ఆశించే అందం వరుడిలో వుందో లేదో చూడాలి. ఆమెకి తగిన వాడు ఐ వుండాలి. ఈడూజోడూ చదువుసంధ్యల్లో సమఉజ్జీ అయితే ఆమె ఎక్కువ ఆనందిస్తుంది.

వధువు చదువు కొనసాగించడానికి, ఉద్యోగ వ్యాపారాలు చెయ్యడానికి, కెరీర్‌మీద దృష్టిపెట్టడానికి అతడు అనుకూలమో కాదో తెలుసుకోవాలి. ఆమె ఉద్యోగిని అయితే ఆమె డ్యూటీకి క్యాంపులకు సహకరించాలి. ఆమె లేనప్పుడు ఇంట్లో ఆమె బాధ్యతలు నిర్వహించాలి. ఆమె ఉన్నప్పుడు పిల్లల బాధ్యతలు పంచుకోవాలి.

కెరీర్ మహిళ కోరే ఈ లక్షణాలు అతడిలో వుండేలా జాగ్రత్త వహించాలి.

స్వప్నసుందరులు

వివిధ సర్వేల్లో అమ్మాయిలు ఎలాంటి వారిని కోరుకుంటున్నారో చెప్పేరు. వారి భావాలానోసారి స్పృశిద్దాం.

'డబ్బు హోదా కన్నా ప్రేమానురాగాలు ముఖ్యం'

'పర్సనాలిటీ కన్నా కూడా 'పర్సు'నాలిటీ అతి ముఖ్యం

'కేరింగ్ అండ్ షేరింగ్ గా వుండాలి'

'సంపాదన వుండాలి. ప్రేమగా మాట్లాడాలి. ఆత్మీయంగా చూసుకోవాలి. అనురాగం కురిపించాలి'

'పురుషుడి సంపాదనకన్నా అతడి అందం తెలివితేటలే మమ్మల్ని ఆకర్షిస్తాయి'

'ఆర్థిక భద్రతతో బాటు స్వచ్ఛమైన మనస్సుగల జీవిత భాగస్వామికే మా ఓటు!'

ఆరోగ్యం ఆరాధన

వరుడు ఆరోగ్యవంతుడై వుండాలి.

ఎలాంటి అనువంశిక రోగాలు, దీర్ఘవ్యాధులు లేకుండా చూడాలి. ఉంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. అవసరమైతే డాక్టర్ల సలహా స్వీకరించాలి.

షికార్లు, నాటకాలు, ఆటలు, భక్తి, పూజ, యోగ – తదితరాల మీద అభిమానం అభినివేశం ఏ స్థాయిలో వున్నాయో గమనించాలి.

అతడి శారీరక మానసిక ఆరోగ్యం మీద వాటి ప్రభావం ఎంతో వుంటుంది మరి!

నేర ప్రవృత్తి

ఏమైనా నేరాలు చేసివుంటే శిక్ష అనుభవించివుంటే ఆ నేర స్వభావం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

తదనంతరం అతడిలో వచ్చిన మార్పు తాత్కాలికమో కాదో గమనించాలి. అతడి ఆలోచనా విధానంలో దృక్కోణంలో నిజంగా మార్పు వచ్చిందో లేదో తేల్చుకోవాల్సి వుంది.

మారిపోయాను, మారిపోతాను – లాంటి ప్రామిస్‌లను ఎంత వరకూ విశ్వసించవచ్చో ఆలోచించాలి.

నేరప్రవృత్తి వెనుక గల అసలు కారణాలను విశ్లేషించకుండా వివాహ నిర్ణయం చెయ్యడం శ్రేయస్కరం కాదు!

పెళ్లికి ముందూ జాగ్రత్తే

పెళ్లినిశ్చయానికీ పెళ్లికీ మధ్య కొంత సమయం వుంటుంది.

అప్పుడు కూడా అతడి గురించి జాగరూకతతో వుండాలి. అమ్మాయితో అతడెలా ప్రవర్తిస్తున్నాడో ఆరా తీయాలి. అగౌరవంగా అమర్యాదగా తొందరపాటుతో లేక ఉద్రేకపూరితంగా వ్యవహరిస్తోంటే సీరియస్‌గా ఆలోచించాలి.

ఆ వ్యవధిని ప్రొబేషన్ సమయంగా భావించి అవసరమైతే పెళ్లి నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి. అంతే తప్ప 'పెళ్లయ్యాక మారిపోతాళ్ళే' అని సరిపెట్టుకోవద్దు. పెళ్లి ఆగిపోవటం అప్రతిష్ట అని ఆందోళన పడవద్దు.

అల్లారు ముద్దుగా పెంచిన మీ అమ్మాయి భవిష్యత్తు ముందు అవి అత్యంత అల్ప విషయాలని గుర్తుంచుకోవాలి!

(ii) వధువు ఎంపిక

రూప సౌందర్యాలు

వరుడు అమ్మాయి అందానికి అత్యధిక ప్రాముఖ్యతనిస్తాడు. 36-24-36 కొలతల్లోనే అందం వుంటుందనుకుంటాడు. డ్రీమ్‌గర్ల్ కోసం కలలు కంటాడు.

అంచేత రూపలావణ్యాలకు కొంత విలువ ఇవ్వక తప్పదు.

భార్య అందం మగాడికి గర్వకారణమవుతుంది. అంతా తనని లక్కీఫెలో అనుకుంటారనుకుని పొంగిపోతాడు. పార్టీలకీ ఫంక్షన్లకీ తీసుకెళ్ళి గొప్పగా పరిచయం చేస్తాడు.

అతడి అహాన్ని తృప్తిపరచడానికి ఆమె అతడికన్నా అందమైనది అయితే బావుంటుంది.

సౌందర్యం వ్యక్తిత్వంతో సమ్మేళనమైనప్పుడు మరింతగా భాసిస్తుంది!

చదువూ ఉద్యోగం

ఈ నాటి అబ్బాయిలు బాగా చదివిన వధువుల్ని ఇష్టపడుతున్నారు. ఉద్యోగస్తులై వుండాలని కనీసం ఉద్యోగం లభించే అర్హతలుండాలని ఆశిస్తున్నారు.

చదువూ సంపాదన విషయాల్లో తమని 'మించిన' వారినీ ఆహ్వానిస్తున్నారు.

ఇవాళ రేపు సుఖసంతోషాలన్నీ డబ్బుతో ముడిపడివున్నాయి.

కాన్వెంటు సీటు నుంచి స్వంత ఇంటి వరకూ సమస్తమూ ఆర్థికం చుట్టూతా తిరిగుతున్నాయి.

ఇద్దరూ సంపాదిస్తేనే కోరిన సౌఖ్యాలు సమకూర్చుకోగలుగుతున్నారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు నివ్వగలుగుతారు.

ఆరోగ్య ఐశ్వర్యాలు

వధువు తెచ్చే కట్నకానుకలు లేదా ఆమెతో సంక్రమించే ఆస్తి సంపదలు విలువైనవే.

కాని అవే అన్నీ కాదు.

ఆమె ఆరోగ్యంగా వుండాలి. దేహపుష్టి, వర్చస్సు కలిగి ఉండాలి. సంసార జీవితం గడపడానికి సంతానాన్ని కనిపెంచడానికి తగినంత బలంగా పుష్టిగా వుండాలి. ఆరోగ్యాన్ని మించిన ఐశ్వర్యం లేనే లేదు.

ఆమె కుటుంబపు నేపథ్యాన్ని వంశక్రమాన్ని బట్టి ఆమె సంతానవతి కాగలదో లేదో కొంతవరకూ అంచనా వేయవచ్చు.

"క్షేత్రం బీజవతే దేయం నాబీజౌ క్షేత్రమర్హతి" అన్నాడు మనువు.

సంతానోత్పత్తికి సమర్థమైన క్షేత్రం అవసరం. బీజశుద్ధి కన్నా క్షేత్రశుద్ధి ముఖ్యం. ఎంచేతంటే బీజం బలహీనమైనా క్షేత్రం బలమైనదైతే ఆ బీజం చక్కగా మొలకెత్తుతుంది.

అవసరమనుకుంటే డాక్టర్ని సంప్రదించవచ్చు.

వంటా వార్పూ

స్త్రీ మొదట గృహిణి. తర్వాతే మిగతా పాత్రలు.

అమ్మాయికి వంట వచ్చోరాదో తెలుసుకోవాలి. రానంత మాత్రాన కించపరచొద్దు. అదేమీ బ్రహ్మ విద్య కాదు. ఆసక్తి వుంటే కొద్దిరోజుల్లోనే ప్రావీణ్యం సంపాదించగలరు.

అతిథులకు స్వయంగా వండి వడ్డించడం మహద్భాగ్యం.

కేవలం వంట ఎలా చెయ్యాలో తెలుసుకుంటే సరిపోదు. ఇంటిల్లపాదీ ఆరోగ్యంతో కళ కళలాడాలంటే ఆరోగ్యకరమైన పౌష్ఠికాహారాన్ని అందించడం నేర్చుకోవాలి.

వృద్ధులకు, రోగులకు, పిల్లలకు ఎప్పుడు ఎలాటి ఆహారాన్నివ్వాలో తెలుసుకోవాలి.

ఆకుకూరలని ఎక్కువగా వాడటం, మసాళాలను తగ్గించడం, కొవ్వుపదార్థాల విషయంలో సమతూకం పాటించడం వగైరా చిట్కాలు తెలుసుకోవాలి.

రుచికరమైన పదార్థాలు ఆప్యాయంగా వడ్డించి 'భోజ్యేషుమాతా' అన్పించుకోగలగాలి!

సహనసౌశీల్యాలు

అమ్మాయికి సహనం సౌశీల్యం పెట్టని ఆభరణాలు.

మర్యాదగా మసలటం, సహనంతో వ్యవహరించటం, సర్దుకుపోయేతత్వం, ఆదరస్వభావం – ముఖ్యం.

ప్రేమాస్పదురాలవ్వాలి. సమస్యలకి తట్టుకోవాలి. అత్తమామల్ని ఆదరించాలి. భర్తకి చేదోడుగా నిలవాలి.

అసూయ, అత్యాశ, ముక్కోపితనం, అధిక ధనాకాంక్ష – కూడవు.

టెంపర్, సుపీరియారిటీ కాంప్లెక్స్, గర్వాతిశయం లేకుండా స్నేహంగా వుండాలి. కఠిన వాస్తవాన్ని కూడా మృదువుగా చెప్పగలగాలి.

ప్రసన్న వదనంతో వీడని విశ్వాసంతో దక్షతతో వ్యవహరించగల అమ్మాయిని ఎన్నుకుంటే ఆ ఇల్లు స్వర్గమే అవుతుంది!

అండదండలు

సోదరులున్న కన్యనే వివాహమాడాలన్నారు పెద్దలు.

పుట్టిల్లు కలకాలం వుండాలంటే ఆమెకి సోదరులుండాలి. ఆమె కష్టసుఖాల్లో పాలుపంచుకునేది తండ్రి తర్వాత సోదరులే కదా.

నూతన దంపతులకు భవిష్యత్తులో ఏవైనా ఒడిదుడుకులు రావచ్చు. అప్పుడు వారికి అండదండలందించగలిగే స్థితిలో పుట్టింటి వారుండటం అభిలషణీయం.

పెళ్లయ్యాక వరుడు వధువుని సరిగ్గా ఆదరించకపోవచ్చు. వేరే పెళ్లి చేసుకోవచ్చు. లేదా అతడికి/ఆమెకి మృత్యువు సంభవిస్తే పిల్లలు అనాథలవ్వొచ్చు.

అటువంటి సమయాల్లో నచ్చచెప్పడానికి, అవసరమైతే బెదిరించడానికి, సహకరించడానికి, ఆదరించడానికి. భరోసా ఇవ్వడానికి ఆమె పుట్టింటివారు ఎంతవరకూ సహాయసహకారా లందించగలరో చూడాలి.

'ఏ కన్యకు సోదరుడు లేడో ఏ కన్యకు తండ్రి ఎవరో తెలియదో ఆమెను ప్రాజ్ఞుడు వివాహం చేసుకోకూడదు' అని మనుస్మృతి చెప్పిన మాటలు గమనార్హం!

13

పెళ్లి చూపులు

ప్రేమ వివాహాలలోనూ దగ్గరి బంధుత్వాలలోనూ మినహా మిగతా 99 శాతం పెళ్లిళ్ళకు పెళ్లి చూపులే నాందీ గీతం పాడతాయి.

పెళ్లి చూపులు ప్రతి వారి జీవితంలోనూ అత్యంత ప్రధానమైన 'మలుపు' అని చెప్పాలి.

కాబోయే జీవన సహచరిని/సహచరుడ్ని తొలిసారిగా కలిసే క్షణాలవి. స్వప్నాలకీ సత్యానికీ వారిధి కట్టే ఘడియలవి.

ఎలా ఉంటారోనన్న ఉత్కంఠ. ఎలా ప్రవర్తించాలో నన్న గాభరా, తను అవతలివారికి నచ్చుతానో లేదో నన్న ఆందోళన!

అంతేకాదు. ఏ మాత్రం పరిచయంలేని కొత్త వ్యక్తికి ఎదురుపడటం, పెళ్లి కళ్ళతో చూడటం, మాట్లాడటం, వారి గురించి ఒక అవగాహనకి రావడం, నూరేళ్ళ జీవితానికి సంబంధించిన నిర్ణయం తీసుకోవాల్సిరావడం – కష్టమే అయినా అనివార్యం!

విదేశాల్లో పెళ్లికి ముందు 'డేటింగ్' అంటూ కలిసి తిరిగినవాళ్ళు కూడా పెళ్లయ్యాక నచ్చలేదంటూ విడిపోతూంటారు.

మన దేశంలో కొన్ని నిమిషాల పెళ్లి చూపుల్లో తొలిసారిగా చూసి కలిసి నచ్చి పెళ్లి చేసుకున్న జంటలు కలకాలం హాయిగా కలిసి ఉంటున్నాయి.

అదే భారతీయ సంస్కృతి యొక్క గొప్పతనం! పెళ్లి మీద వారికి గల నిబద్ధతకు తార్కాణం!

పెద్దల పాత్ర

సాధారణంగా ఇరుపక్షాల పెద్దలకూ అన్ని విధాలా అంగీకారమయ్యాకే పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తారు.

అంటే సంబంధం కలుపుకోడానికి ఇరువర్గాలూ ఇష్టపడ్డాయన్న మాట. ఒకరి స్థితిగతులు మరొకరికి నచ్చాయన్నమాట.

కొన్ని కులాల్లో కట్నాల గురించి సూచాయిగా ఒక అంగీకారానికొచ్చాకే పెళ్లి చూపులకు సిద్ధమవుతారు.

ఎక్కువగా పెళ్లి చూపులయ్యాకే అమ్మాయీ అబ్బాయీ ఒకరి కొకరు నచ్చాకే ఆర్థికాంశాల గురించి మాట్లాడుకుంటారు.

అవతలి వారి ఆర్థిక స్తోమతు ముందే తెలుస్తుంది గనుక ఇంచుమించులో మరీ భీష్మించుకోకుండానే ఒక అంగీకారానికొస్తారు. తేడా ఎక్కువగా ఉంటే మధ్యవర్తులు ఇద్దరికీ నచ్చచెప్పి ఒప్పిస్తారు.

పిల్లల శ్రేయస్సుని కోరే వారిలో ప్రథములు వారి తల్లిదండ్రులే. అన్ని విధాలా ఆలోచించి వారు నిర్ణయం తీసుకుంటారు. గనుక ఆ విషయాలు పెద్దలకే వదిలెయ్యటం మంచిది.

వధూవరులు కేవలం ఒకరికొకరు నచ్చటం అన్న అంశానికే పరిమితమవడం అభిలషణీయం.

కట్న కానుకల గురించి 'అత్యాశ'కు పోతున్నా మూర్ఖంగా ప్రవర్తిస్తున్నా వారించడం తప్పనిసరి.

పెళ్లికి సిద్ధంగా ఉన్నారా?

అబ్బాయిగాని అమ్మాయి గాని పెళ్లి చూపులకు సిద్ధమవుతున్నారంటే వారు పెళ్లికి రెడీ అయినట్టే లెక్క.

అంచేత పెళ్లి చూపుల్లో పాల్గోబోయే ముందు తాము వివాహబంధానికి సిద్ధంగా ఉన్నదీ లేనిదీ ప్రశ్నించుకోవాలి. ఇంకెవరినైనా ప్రేమిస్తూండి ఉంటే ఇష్టపడుతూండి ఉంటే ఆ సంగతి ఇంట్లో చెప్పి ఏదో ఒక నిర్ణయానికి రావాలి.

దాన్ని దాచి ఉంచడం ఆపైన బాధపడటం అర్థరహితం.

ముఖాముఖి చెప్పలేకపోతే ఇతర కుటుంబ సభ్యుల ద్వారా స్నేహితుల ద్వారా బంధువుల ద్వారా చెప్పించవచ్చు.

పెద్దల్ని నొప్పించలేక పెళ్లి చూపులకెళ్లి 'నచ్చలేదు' అని చెప్పడం సరికాదు. అది దారుణం కూడా.

పెద్దలు కుదిర్చిన పెళ్లి అనివార్యమైనప్పుడు ప్రేమనూ పూర్వ పరిచయాలనూ విస్మరించి తీరాలి!

గాలిమేడలు కట్టవద్దు

అబ్బాయిలు తామేదో హీరోలమని భ్రమించకూడదు. తమ స్థితిగతుల్నీ విద్యనీ రూపాన్నీ సంపాదననీ దృష్టిలో ఉంచుకోవాలి. ఉన్నతస్థితిలో ఉన్నారనో అధికంగా సంపాదిస్తున్నారనో 'సుపీరియారిటీ కాంప్లెక్స్' తో విర్రవీగకూడదు.

అవతలి వారిని తక్కువగా భావించకూడదు. అగౌరపరచరాదు.

ఎన్ని పెళ్లి చూపుల కెళితే అంతగొప్ప అనుకుంటూ గొప్పలకు పోకుండా అన్ని విధాలా బాగుంటుందన్పించిన వాటికే వెళ్ళాలి. అభిరుచులు, అర్హతలు, హోదా ఆధారంగా సరిపోతాయనుకున్న సంబంధాలని షార్ట్ లిస్ట్ చేసుకోవాలి.

తమ దర్పాన్ని ఆధిక్యతను ప్రదర్శించడానికి గాక 'సమ జోడి' కోసం పెళ్లి చూపులకెళ్తున్న సంగతి గుర్తుంచుకోవాలి.

ఇక అమ్మాయిలు కూడా రేమాండ్స్ కంప్లీట్‌మేన్‌లు అరుదుగా ఉంటారని గ్రహించాలి. తను అందగత్తెననో అధికంగా సంపాదిస్తున్నాననో గర్వపడకూడదు.

ప్రాయం వచ్చిన పందిపిల్లా అందంగానే ఉంటుందనే మోటు సామెత గుర్తు పెట్టుకోవాలి. తన స్థితి తల్లిదండ్రుల పరిస్థితి తెలుసుకుని వాస్తవ దృష్టితో ఆలోచించి మసలుకోవాలి.

ఎక్కడ ఏర్పాటు చెయ్యాలి?

ఎక్కువగా పెళ్లిచూపుల్ని అమ్మాయీ వారింట ఏర్పాటు చేస్తారు.

అది కుదరనప్పుడు బంధుమిత్రుల ఇళ్ళల్లో హోటల్ రూముల్లో సైతం అరేంజ్ చేస్తున్నారు. కొందరు ఇంకో అడుగుముందుకేసి ఇద్దర్నీ పార్కుకో రెస్టారెంట్‌కో పంపిస్తున్నారు.

ఎక్కడ అరేంజ్ చేసినా అది అమ్మాయికి అనుకూలంగా ఉండాలి. ఫ్రీగా ఉండటానికి మసలటానికి అలవాటైన వాతావరణం అయితే మంచిది. కుటుంబ సభ్యులు ప్రక్కన ఉంటే ఆమెకి కొండంత అండగా ఉంటుంది. సిగ్గూ సంకోచం తగ్గుతాయి.

వధువు ఇంటికి వరుడు వెళ్ళి చూడటంలో మరో మేలు కూడా ఉంది.

ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నారు. ఇల్లు, శుభ్రత, అలంకరణ, ఇతర వస్తు విశేషాలు ఆ ఇంటివారి గురించి చాలా 'కబుర్లు' చెబుతాయి.

అవి ఒక నిర్ణయం తీసుకోడానికి వరుడి తరపువారికి సాయపడతాయి.

ముహూర్తం అవసరమా?

పెళ్లి చూపుల్లో వధూవరులు తొలిసారిగా కలుస్తారు. వారి కలయిక ఫలించి పెళ్లికి దారి తీయాలి. ఆపైన కలకాలం కలిసుండాలి.

ఆ ఆకాంక్షకి దన్నుగా ముహూర్తం పెట్టిస్తారు. తిథి వార నక్షత్రాలు చూసి ఏ రోజు ఏ సమయం అనుకూలంగా ఉంటుందో నిర్ణయించి కబురు చేస్తారు. వర్జ్యం లేకుండానూ చూసుకుంటారు.

సోమ, మంగళవారాలు పెళ్లి చూపులకు అనుకూలం కావంటారు కొందరు.

కొందరు కేవలం తిథి చూచి పెళ్లి చూపులకెళ్తారు.

ఏమైనా సమయం నిర్ణయించి ఆహ్వానించడం ఆడపిల్ల వారి వంతు సమయపాలన పాటించడం మగపెళ్లి వారి బాధ్యత.

పెళ్లి చూపులు పగటిపూట మాత్రమే ఏర్పాటు చెయ్యాలన్నారు పెద్దలు. అలా ఎందుకన్నారో కాస్త ఆలోచిస్తే విషయం బోధపడుతుంది.

ఎంతమంది వెళ్ళాలి

ఇంత మందే వెళ్ళాలని నిబంధనేమీ లేదుగాని ఎంత తక్కువమంది వెళ్తే అంత మంచిది.

పది మందిని వెంటేసుకుని అట్టహాసంగా వెళ్ళకూడదు. వరుడి కుటుంబ గౌరవ మర్యాదలు ఇనుమడించేలా ముఖ్యమైన వారు వెళ్తే సరిపోతుంది.

పెళ్లి చూపులు అంగ అర్థ బంధుబల ప్రదర్శనావేదిక కాదు.

వరుడితోబాటు తల్లిదండ్రులూ తోబుట్టువులూ ఒకరిద్దరు స్నేహితులూ వెళ్ళటం మంచిది.

వారైనా అతడికి సలహాలూ సూచనలూ ఇవ్వొచ్చుగాని అతడు ప్రభావితమయ్యేట్లు ప్రవర్తించరాదు.

సాధ్యమైనంత వరకూ అతడు వధువు విషయంలో స్వతంత్ర నిర్ణయం తీసుకునేలా ప్రోత్సహించాలి.

అతి అనర్థదాయకం

అమ్మాయిని చూసుకోడానికి పెళ్లి వారొస్తున్నారని 'అతి' చెయ్యవద్దు.

శిల్పాలు, కళాఖండాలు ఎరువు తెచ్చి మరీ హాలులో పెడతారు కొందరు. ఇండోర్ ప్లాంట్స్, వాటర్ ఫాల్ సీనరీస్ వగైరాలతో అలంకరిస్తారు. రంగుల దీపాలతో కన్నులు మెరిపిస్తారింకొందరు.

ఎంతో గొప్పగా రిచ్‌గా కన్పించాలని ఇంటిని సినిమా సెట్టింగ్‌లా మార్చవద్దు. ఎలా ఉన్నవి అలాగే ఉంచండి. మీ టేస్ట్ తెలిసేలా వాటిని అందంగా సర్దండి చాలు.

అలాగే అమ్మాయిని 'అతి'గా అలంకరించవద్దు. బ్యూటీపార్లర్‌కి పంపి మరీ మేకప్ చేయించాల్సినపని లేదు.

అమ్మాయిని తలస్నానం చేసి మేకప్ లేకుండా సింపుల్‌గా రమ్మని కోరితే పరిస్థితెలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి.

సాధ్యమైనంతవరకూ నేచురల్‌గా చూపించండి. సహజ వెలుతురులో చూపించండి.

ఆమె ఎలావున్నా ఆమెని ఆమెగా ఇష్టపడే వాడితో ఆమె బంధం సుఖప్రదమవుతుంది!

ఫస్ట్ ఇంప్రెషన్

ఒకర్నొకరు చూసుకోక ముందే ఒకరి ఫొటోలొకరు చూసి ఉండొచ్చు. పెళ్లిలోనో ఫంక్షన్స్‌లోనో చూసి ఉండనూ వచ్చు.

విద్య, ఉద్యోగం, హోదా, ఆదాయం వగైరాల గురించి విని ఉండొచ్చు.

వాటిని బట్టి రెండోవారి గురించి ఒక అభిప్రాయం, ఇంప్రెషన్ ఏర్పడటం సహజం.

అది పాజిటివ్ అయినా నెగటివ్ అయినా సరే దాని ప్రభావాన్ని పెళ్లిచూపుల మీద పడనివ్వొద్దు.

రెండోవారిని మొదటిసారిగా చూస్తున్నట్టు ప్రథమంగా కలిసినట్టు భావించాలి. స్వయంగా చూసి, విని, మాట్లాడి, తర్కించుకుని ఒక అంచనాకి రావాలి.

రూపురేఖలు

భార్యను ఎన్నుకోవడంలో కంటి కంటే చెవిని ఉపయోగించాలన్నారు. ఆ పెద్దలే కోడలు నలుపైతే కులమెల్ల నలుపవుతుందనీ అన్నారు.

రూపలావణ్యాలు చూసి ఫ్లాట్ అయిపోవద్దు. అందంగా అన్పించకపోతే 'ప్చ్' అని నిట్టూర్చనూ వద్దు.

ఒకరికి నచ్చని అమ్మాయి లేక అబ్బాయి మరొకరికి నచ్చుతారు. అందం చూసే కళ్ళల్లో ఉంటుంది. అదీగాక అందం శాశ్వత పదార్థం కాదు. పిల్లలు పుట్టేక వన్నె తరుగుతుంది. నడి వయస్సుకది శిథిలమవుతుంది.

బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యం మిన్న.

ముఖవర్చస్సు, మాట తీరు, హావభావాలు, ఆశలు, ఆకాంక్షలను బట్టి వ్యక్తిత్వాన్నీ హృదయ సౌందర్యాన్నీ తెలుసుకోడానికి ప్రయత్నించాలి.

తొలి సమావేశం

పెళ్లి చూపుల్లో అబ్బాయి అమ్మాయిలకు ఏకాంతం కల్పిస్తూ వారి సమావేశాన్ని ఏర్పాటు చెయ్యడం తప్పనిసరి.

ఒకరి గురించొకరికి తక్కువ సమయంలో వీలైనంత ఎక్కువ తెలుసుకునేందుకది బాగా ఉపయోగపడుతుంది.

బంధుమిత్రులు ఏమనుకుంటారోనన్న భయసంకోచాలు లేకుండా ఇరువురూ ఫ్రీగా మాట్లాడుకోవాలి.

జీవితాంతం కలిసి ఉండాల్సిన వారిని కలిపే ఆ కొన్ని నిమిషాలు ఆ ఇద్దరికీ అగ్ని పరీక్షే!

ఏం మాట్లాడుకోవాలి?

అబ్బాయి తన ఇష్టాయిష్టాలు, ఆశలూ ఆశయాలూ, ఆలోచనలు, స్థితిగతులు మొహమాట పడకుండా చెప్పాలి.

సాధ్యమైనంత క్లుప్తంగా అదే సమయంలో సూటిగా చెప్పాలి. ఎవరో తరుము తున్నట్టుగా గాక నింపాదిగా అర్థమయ్యేలా వివరించాలి. డొంక తిరుగుడుగా మాట్లాడటం, అనవసర విషయాలు ఏకరువు పెట్టడం చెయ్యకూడదు.

తను చెప్పడమే కాదు ఆయా విషయాలపై ఆమె అభిప్రాయాల్ని చెప్పించుకోవాలి. నిర్భయంగా నిస్సంకోచంగా మాట్లాడేలా ఎంకరేజ్ చెయ్యాలి.

అభిప్రాయాలు కలబోసుకున్నప్పుడు అన్నిట్లోనూ ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అప్పుడు ముఖ్యమైన అంశాల్లో పరస్పరాంగీకారం కుదిరిందో లేదో సరిచూసుకోవాలి.

ఇద్దరూ నిజాయితీగా చెబితే నూటికి నూరుపాళ్ళు ఏకాభిప్రాయం అనేది అసంభవం.

అదే సమయంలో అభిప్రాయాలకు 'మార్పు' సహజమని గుర్తించడం అత్యవసరం!

హుందాగా వ్యవహరించాలి

ఎక్కువ తక్కువ భావనలని రానివ్వకుండా హుందాగా ప్రవర్తించాలి. స్నేహ పూర్వకంగా సంభాషించాలి.

పూర్వ పరిచయం లేని వారిని 'నీకు' 'నువ్వు' అనిగాక 'మీరు' 'ఏమండి' అంటూ గౌరవంగా సంభోదించడం సరైన పద్ధతి.

అమ్మాయి బిడియపడి గలగలా మాట్లాడలేక పోవచ్చు. అటువంటప్పుడు అబ్బాయి చొరవ తీసుకోవాలి. తన గురించి చెప్పి ఆమె గురించడగాలి. ఆమె మదిలోని ప్రశ్నలన్నీ సంధించేలా ప్రోత్సహించాలి.

ఏకాంతాన్ని దుర్వినియోగం చెయ్యకూడదు. తమకింకా పెళ్లికాలేదన్న సంగతి మరువకూడదు.

శరీరాన్ని తాకటం, ముద్దు పెట్టుకోవడం లాంటివి చెయ్యకూడదు. అలాటి చేష్టలే అవతలి వారిలో వ్యతిరేక భావనలు కల్గిస్తాయి. సంబంధం కుదిరినా అవి నీడలా వెంటాడుతూ లేని భయాల్ని కల్పిస్తాయి!

అన్నీ చెప్తారనుకోవడం భ్రమ

వధూవరులు తమ గురించన్నీ నిజాలే చెబుతారని లేదా చెప్పినవన్నీ నిజాలేనని నమ్మవద్దు.

దురలవాట్లు, షార్ట్ టెంపర్, పాత ప్రేమ, పిరికితనం, భయం – వగైరాల గురించెవరూ చెప్పరు. తమ పాజిటివ్ సైడ్‌నే చూపిస్తారెక్కువగా.

వారి మాటల్ని బట్టి ముఖంలోని ఫీలింగ్సుని బట్టి కుటుంబ బ్యాక్ గ్రౌండ్‌ని బట్టి ఎవరికి వారు అంచనా వేసుకోవాలి.

అవసరమైతే సూటిగా ప్రశ్నించి వారి రియాక్షన్ని గమనించాలి.

నిర్భయంగా స్పష్టంగా చెప్పాలి

పెళ్లి చూపులయ్యాక అమ్మాయి/అబ్బాయి నచ్చిందీ లేనిదీ సంబంధం చేసుకోవడానికి ఇష్టపడుతున్నదీ లేనిదీ స్పష్టంగా చెప్పాలి.

వెంటనే చెప్పలేకపోతే కొంత గడువు తీసుకోవాలి. ఆ గడువు లోపల విస్పష్టంగా చెప్పాలి. నాన్చుడు ధోరణి, లేదా మరికొన్ని సంబంధాలు చూసేవరకూ పెండింగులో ఉంచడం అన్నిసార్లూ మంచిదికాదు.

అవతలివారి గురించి సందేహాలేమైనా ఉంటే వాటిని పెద్దలకు చెప్పి సందేహ నివృత్తి చేసుకోవాలి.

పెద్దల ఒత్తిడికీ లేదా కట్న కానుకల ప్రలోభానికీ లోనుకాకూడదు.

పెళ్లి మీ భవిష్యత్తుని నడిపించే నిర్దేశించే తీర్చిదిద్దే అపూర్వ ప్రక్రియ.

సాధ్యమైనంతవరకూ మీ మనస్సు మాట వినండి. స్వతంత్ర నిర్ణయం తీసుకోండి.

ఆదిశంకరుడే ఆదర్శం

తన వేషం తన రూపం తన చేష్టలు తన నడవడిక తన గతచరిత్ర – అన్నిటినీ పెళ్లికి ముందే పార్వతికి చెప్పాడు శంకరుడు.

అన్నిటికీ ఆమె ఆమోదించాకే ఆమె ఇష్టాన్ని తెలుసుకున్నాకే పెళ్లాడాడు.

ప్రతి వరుడికీ ఆదర్శప్రాయుడు అర్ధనారీశ్వరుడు!

పెద్దల బాధ్యత

అబ్బాయీ అమ్మాయీ ఒకర్తో ఒకరు మాట్లాడుకున్నాక వారి అభిప్రాయం ఏమిటో పెద్దలు తెలుసుకోవాలి. రెండో వారితో పెళ్లికి వారు సుముఖలో కాదో స్పష్టంగా తేల్చుకోవాలి.

అవసరమైతే కొంత సమయం ఇవ్వాలి. సందేహాలుంటే తీర్చాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ అభిప్రాయాల్ని పిల్లల మీద రుద్దకూడదు. ఒత్తిడి చెయ్యకూడదు.

వారి ఆలోచన తప్పనిపిస్తే విడమరచి చెప్పాలి. వివరించి చెప్పాలి. అంతిమ నిర్ణయం మాత్రం వారికే వదిలెయ్యాలి.

సాధ్యమైనంత త్వరగా పెద్దలు తమ అభిప్రాయాన్ని అవతలి వారికి తెలియజేయాలి. అమ్మాయి నచ్చలేదనే వంకతో మరింత కట్నం కోసం బేరసారాలు సాగించవద్దు. ఆ సంగతి అమ్మాయికి తెలుస్తుంది. దాని ప్రభావం ఆమె మనస్సు మీద పిమ్మట ఆ జంట వైవాహిక జీవితం మీద పడుతుంది.

వరుడికి నచ్చినా వధువుకి నచ్చని యెడల అవతలి వారు అవమానంగా భావిస్తారేమోనని సంకోచించకూడదు. తమ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలియజేసి తేలికపడాలి.

పెద్దలు తమ నిర్ణయాన్ని తెలియజేయటానికి తాత్సారం చెయ్యకూడదు.
అది అనేక అనుమానాలకీ అపార్థాలకీ దారి తీస్తుంది!

14

నిశ్చితార్థం

పెళ్లి చూపుల ఘట్టం ముగిసింది. అబ్బాయికి అమ్మాయీ అమ్మాయికి అబ్బాయీ నచ్చారు.

పెద్దల మధ్య కట్నకానుకల చర్చలు పూర్తయ్యాయి. ఇద్దరూ ఏకాభిప్రాయానికొచ్చి సంబంధం కలుపుకోవడానికి సిద్ధపడ్డారు.

ఫలానావారి అబ్బాయికి ఫలానావారి అమ్మాయినిచ్చి పెళ్లి చేయడానికి ఇరుపక్షాల పెద్దలూ నిశ్చయిస్తూ చేసే వేడుక నిశ్చితార్థం.

పెళ్లి కుదిరిందని పదిమందికీ చెబుతూ పదిమందినీ పిలిచి చేసుకునే వేడుక ఇది.

పెళ్లితో సమానం

నిశ్చితార్థం పెండ్లితో సమానం. నిశ్చితార్థమైతే సగం పెళ్లి అయినట్టే లెక్క.

వధూవరుల మీద జాతక ప్రభావం ఈ ముహూర్తం నుండే ప్రారంభమవుతుందంటారు జ్యోతిశ్శాస్త్రవేత్తలు.

పెళ్లి ముహూర్తంలానే నిశ్చితార్థానికీ తిథివార నక్షత్రాలు చూసి ముహూర్తం నిర్ణయిస్తారు.

శుభముహూర్తం నిర్ణయించుకున్న రోజున వరుడి తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్యాదాత ఇంటికి తరలివెళ్తారు.

సాధారణంగా నిశ్చితార్థం వధువు ఇంట చేసుకుంటారు. ఫంక్షన్ హాల్స్‌లో ఆడంబరంగా చెయ్యడం కొత్తగా మొదలైన పద్ధతి.

నిశ్చితార్థానికి వరుడు ముఖ్యం కాదు గాని ఇప్పుడు వరుడు కూడా పాల్గొంటున్నాడు. ఇది మంచి సంప్రదాయమే.

పచ్చతోరణం

వివాహ సమయంలో ఉపయోగించే మూడు పచ్చని వస్తువులు – మామిడాకులు, తమలపాకులు, కొబ్బరిబొండం.

ఇవి పచ్చగా ఉండటమే గాక పచ్చదనాన్ని త్వరగా కోల్పోవు.

పచ్చదనం శుభానికి చిహ్నం.

అందుకే పండగలకీ శుభకార్యాలకీ పూజలకీ వీటిని తప్పనిసరిగా వాడుతూంటారు.

తాంబూలాల ప్రత్యేకత

తాంబూలం అంటే తమలపాకు, వక్క. వీటికి పిసరంత సున్నం కలిపి నోట్లో వేసుకుంటే చాలు నోరు ఎర్రగా పండుతుంది.

విభిన్నమైన ప్రకృతి సిద్ధమైన పదార్థాల కలయికతో కొత్త రంగు కొత్త రుచి ఇవ్వటం దాని ప్రత్యేకత.

భోజనానంతరం తాంబూలం ఇవ్వడం ఒకప్పుడు అతిథి మర్యాదల్లో భాగం.

వ్రతమో శుభకార్యమో చేసినప్పుడు లేదా సంభావన ఇచ్చేటప్పుడు తాంబూలం ఇవ్వడం ఆచారం. దానితోబాటు పండ్లూ ఇస్తూంటారు.

క్షీరసాగర మథనంలో తమలపాకు పుట్టిందంటుంది స్కంధ పురాణం!

నిశ్చయ తాంబూలాలు



పెళ్లి నిశ్చయం చేస్తూ వధువు తల్లిదండ్రులూ వరుడి తల్లిదండ్రులూ పరస్పరం తాంబూలం, పళ్ళూ ఇచ్చి పుచ్చుకుంటారు.

దీన్నే నిశ్చయ తాంబూలాలంటారు. 'తాంబూలాలు తీసుకున్నాము' 'తాంబూలాలు ఇచ్చాము' అంటారు.

'తాంబూలాలు ఇచ్చేశాను తన్నుకు చావండి' అని కన్యాశుల్కంలో ఓ డైలాగ్ ఉంది.

తాంబూలాలిస్తే ఇహ దానికి తిరుగుండదని, ఇరుపక్షాలూ దానికి కట్టుబడి ఉంటాయనీ అర్థం.

నిశితార్థమయ్యాక చిన్న చిన్న లోటు పాట్లు బయటపడితే సర్దుకుపోవాలి. సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాల్తప్ప నిర్ణయాన్ని తిరగదోడ కూడదు.

అలా అని వధూవరుల భావి జీవితాన్ని విపరీతంగా ప్రభావితం చేసే అంశాల విషయంలో అలసత్వం వహించరాదు.

దీర్ఘరోగం, ఉద్యోగ లేమి, ముందే మరో వివాహం, వివాహేతర సంబంధం లాంటివి బయటపడితే అప్రమత్తమవ్వాలి. నిజనిర్ధారణ చేసుకున్నాక అవసరమైతే నిశ్చయాన్ని రద్దు చేసుకోడానికి వెనుకాడకూడదు.

అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు!

నిశ్చితార్థం అవసరమా?

అమ్మాయిని ఫలానా వారి అబ్బాయికిచ్చి పెళ్లి చెయ్యడానికి ఒప్పుకున్నామంటారామె బంధువులు.

అబ్బాయికి ఫలానా వారి అమ్మాయితో వివాహం జరిపించడానికి అంగీకరిస్తున్నా మంటారు అబ్బాయి బంధువులు.

ఈ మాటల ప్రమాణానికి కర్మకాండా రూపమే నిశ్చితార్థం.

పెళ్లి సామాజిక ప్రక్రియ గనుక నిశ్చితార్థానికి పదిమందినీ పిలుస్తారు.

పెళ్లి కుదిరిందని అందరికీ తెలుస్తుంది. గనుక కొత్తగా సంబంధాలు తీసుకు రారెవరూ.

వధూవరుల బంధువులు కూడా కట్నానికో మరో దానికో ఆశపడి ప్రలోభపడి మరో సంబంధం కోసం ప్రాకులాడరు.

అందరికీ తెలిసిపోతుంది గనుక పెళ్లి ఒప్పందానికి ఇరు పక్షాలూ కట్టుబడి ఉంటాయి. మాట తప్పడం గౌరవభంగంగా భావిస్తారు

నిశ్చితార్థం ఒక అలిఖిత అగ్రిమెంటు.

ఇరువైపుల వారూ మాటకి కట్టుబడి ఉంటారన్న ధీమా ఉంటే నిశ్చితార్థ కార్యక్రమం నిర్వహించకపోయినా ఫర్లేదు.

వేడుకగా

నిశ్చయ తాంబూలాలు వధువు లేక వరుడి ఇంట్లో ఇచ్చి పుచ్చుకుంటారు.

సాధారణంగా వరుడి బంధువులు బంధుమిత్రులతో బాటు పురోహితుడ్ని తీసుకుని కన్యాదాత ఇంటికి తరలి వెళ్తారు.

పసుపు, కుంకుమ, పూలు, ఆకు, వక్క మొదలైన వాటితో బాటు తమ తాహతుని బట్టి అయిదు రకాల పండ్లూ అయిదు రకాల తీపి పదార్థాలూ తీసుకెళ్తారు.

వధువు కోసం నూతన వస్త్రాలూ బంగారు ఆభరణాలూ పట్టుకెళ్తారు.

వధువు తల్లిదండ్రులు వరుడికీ అతడి దగ్గరి బంధువులకీ బహూకరించడానికి శక్త్యనుసారం నూతన దుస్తులు సిద్ధం చేసుకుంటారు.

కన్యాదాత తాంబూలాలు మొదట వరుని తండ్రికిస్తాడు. పిమ్మట నలుగురు బంధువులకిస్తారు.

తిరిగి వరుడి తండ్రి వధువు తండ్రికీ అతడి తరపు నలుగురు పెద్దలకూ తాంబూలాలిస్తారు.

అంటే కేవలం వధూవరుల తండ్రులే గాక వారి తరపు వారు కూడా నిశ్చితార్థంలో భాగస్తులవుతున్నారు.

'మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటాము' 'మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇస్తున్నాము' అని చెబుతూ వధూవరుల తండ్రులు తాంబూలం, పండ్లు గల పళ్లెములు పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటారు.

పురోహితుడు **'ధ్రువం తే రాజా....'** అంటూ మంత్రాలు పఠిస్తోంటే వరుని తల్లిదండ్రులు వధువుకి పూలు, పళ్ళు, పసుపు కుంకాలు, కొత్త బట్టలు, బంగారు ఆభరణాలు ఇచ్చి ఆశీర్వదిస్తారు.

గౌరీపూజ

వధువు చేత గౌరీ పూజ, లక్ష్మీ పూజ చేయించి నిశ్చితార్థాని కొచ్చిన పెద్దలంతా అక్షింతలు చల్లి ఆశీర్వదిస్తారు.

వరుడిని కూడా కూర్చోబెట్టి లక్ష్మీ పూజలో భాగస్తుడ్ని చేస్తున్నారు.

పిమ్మట వధూవరులు పరస్పరం పూలదండలు మార్చుకుంటారు.

పెద్దలంతా ఇద్దరి శిరస్సుల మీదా అక్షతలు చల్లి ఆశీర్వచనాలందజేస్తారు.

ఉంగరాల మార్పిడి

పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంతో నిశ్చితార్థ సమయంలో వధూవరులు ఉంగరాలు మార్చుకునే ఆచారం కొత్తగా పుట్టుకొచ్చింది.

ఇందు నిమిత్తం వెడ్డింగ్ రింగ్స్ పేరిట ఒకే రకం డిజైన్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన ఉంగరాలు బంగారు దుకాణాల్లో లభ్యమవుతున్నాయి.

నిశ్చితార్థంతో సగంపెళ్లి అయినట్టే గనుక ఉంగరాలని ధరించడంలో తప్పులేదు.

వధూవరులను దగ్గర చెయ్యడానికివి ఎంతగానో దోహద పడతాయి.

ఒకరినొకరికి గుర్తు చేస్తూంటే ఒకరి తలపులతో ఒకరు ఊహల్లో ఊరేగుతారు. మానసికంగా దగ్గరవుతారు.

అతిథి మర్యాదలు

నిశ్చితార్థానికి తమింటి కొచ్చిన వరుడి బంధువుల్ని తగురీతిగా సత్కరించి సంతోష పరచటం కన్యాదాత విధి.

వరుడికీ వరుడి తల్లి దండ్రులకూ నూతన వస్త్రాలు బహూకరించాలి. శక్తి ఉంటే వారితో వచ్చిన వారి బంధువులకూ కొత్త బట్టలు పెట్టాలి. అలా చేయలేకపోతే కనీసం కుటుంబ సభ్యులకి పెట్టి మిగతావారిలో ఆడవారికి బొట్టు పెట్టి రవికెల గుడ్డలు ఇవ్వాలి.

పిమ్మట అతిథులందరికీ భోజన ఏర్పాట్లు చేసి సాదరంగా సాగనంపాలి.

ఈ సందర్భంలోనే వధువు తల్లిదండ్రులకూ వారి దగ్గరి బంధువులకూ వరుడి తరఫువారు నూతన వస్త్రాలు బహూకరించడం కొత్తగా మొదలైన ఆచారం. ఈ ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఆహ్వానించదగిందే!

లగ్న నిర్ణయం

వధూవరుల జన్మ నక్షత్రాలను జాతక చక్రాలను పరిగణనలోకి తీసుకుని శుభముహూర్తం నిర్ణయిస్తారు.

నిశ్చితార్థం రోజునే ఇరువైపుల వారి అభిప్రాయాలు, అనుకూలాంశాలు, అడ్డంకులు తెలుసుకొని పండితుడిచే లగ్నం పెట్టిస్తారు.

ఏ కారణం చేతనైనా ఆవాళ కుదరకపోతే లేక ఫలానా సిద్ధాంతిగారి చేతే లగ్నం పెట్టించాలనుకుంటే తర్వాత ముహూర్తం పెట్టించుకోవచ్చు.

నిశ్చితార్థానికీ పెళ్లికీ మధ్య

రెంటికీ మధ్య ఎక్కువ వ్యవధి ఉండటం మంచిది కాదు.

లగ్నాలు లేకపోతేనో మూఢాలు వస్తేనో లేక ఇతర బలమైన కారణాలుంటేనో తప్ప సాధ్యమైనంతవరకూ దగ్గర్లోనే ముహూర్తం పెట్టుకోవడం ఉభయులకూ మంచిది.

ఈ మధ్య సమయాన్ని వధూవరులు తమ మధ్య సాన్నిహిత్యం పెంచుకోడానికి ఉపయోగించుకోవాలి.

దూర ప్రదేశాల్లో ఉంటే ఫోన్, ఈ మెయిల్, చాటింగ్ ద్వారా దగ్గరవ్వొచ్చు. దగ్గర్లోనో ఒకే ఊరిలోనో ఉంటే కలిసి సినిమాలకీ షికార్లకీ వెళ్ళవచ్చు. ప్రేమానుబంధాన్ని పెంచుకోవచ్చు.

ఎలాగూ పెళ్లి కాబోతోంది కదా అని చెప్పి ఎట్టి పరిస్థితుల్లోనూ హద్దులు దాటరాదు. శారీరకంగా కలవరాదు.

తొలి అనుభవాన్ని తొలిరాత్రికే రిజర్వు చేసుకోవాలి. అప్పుడే అందం ఆనందం! అభిమానం ఆకర్షణ! గౌరవం మర్యాద!

15

కట్న కానుకలు

ధనేచ్ఛ ఎప్పుడూ ఎవరికీ తీరలేదు. ఇకపై తీరదు. తీరజాలదు.

కామనయే అన్ని పాపాలకూ మూలమన్నారు గీతలో

కట్నం ఇవ్వడం తీసుకోవడం చట్టరీత్యా నేరం. దురాచారం అయినా వరకట్నం ఒక సాంఘిక ధర్మంగా తయారైంది.

దోపిడీ సమాజం సృష్టించిన స్త్రీ సమస్యల్లో కట్నం ఒకటంటారు కొందరు. కట్నం తీసుకన్న వ్యక్తిని ప్రేమించొద్దు ద్వేషించండంటారింకొందరు.

ఎవరేమనుకున్నా కట్న కానుకల్లేని పెళ్లిళ్ళు అత్యంత అరుదుగా జరుగుతున్నాయి.

ఇచ్చిన కట్నం లేక కానుకలు చాల్లేదని ఇంకా ఇంకా కావాలని హింసించే ఘటనలు రోజూ ఎక్కడో అక్కడ జరుగుతూనే వున్నాయి.

వీటికి అడ్డుకట్ట పడాలంటే 'వూరికే ఇతరుల సొమ్మొచ్చిపడాలి' అనే దబ్బాశని నియంత్రించాలి. ఇది యువతీ యువకుల వల్లే సాధ్యం!

ప్రాచీన కాలంలో

పెళ్లికి పూర్వం అమ్మాయి తండ్రి ఇంట్లో పనీపాటా చేసేది. పెళ్లయ్యాక ఆమెని అబ్బాయి తీసుకెళ్ళిపోతాడు. దాంతో పని చేసే వారొకరు తగ్గుతారు. అది ఆమె తండ్రికి నష్టం కలిగిస్తుంది.

ఆ నష్ట పరిహారంగా గొర్రెలో బర్రెలో పశువులో పనిముట్లో ఇచ్చి పిల్లను తెచ్చుకునే వారు.

ఎక్కువగా ఆనాటి 'ధనం' అయిన పశువులు, పనిముట్లు రూపంలోనే ఇవ్వడం ప్రపంచంలోని దాదాపు అన్ని జాతుల్లోనూ ఒకప్పుడున్న పద్ధతి.

ఋగ్వేద కాలంలో

కన్యతో బాటు ధన కనక వస్తువాహనాదులను ఇచ్చి అత్తవారింటికి పంపేవారు.

తమ శక్త్యను సారం కన్య సుఖ సంతోషాలు కోరి సంతోషంగా స్వచ్ఛందంగా ఇచ్చే కానుకలవి. అవి ఆమెకే చెందుతాయి. ఆమె ఆస్తి అన్నమాట.

తర్వాతి కాలంలో దాసీ జనాన్ని సైతం ఇవ్వటం జరిగింది. యుద్ధాలకుపయోగించే గుర్రాలు ఏనుగులు కూడా ఇవ్వబడ్డాయి.

తమ గొప్పతనాన్ని ప్రదర్శించుకోవడం, అమ్మాయి మీద గల ప్రేమానురాగాలు చాటు కోవడం, వరుడి శక్తి సంపత్తులు పెంచడం నాటి వాటి లక్ష్యాలు.

కన్యాశుల్కం

మధ్య కాలంలో డబ్బిచ్చి కన్యని తెచ్చుకోవడం కొన్ని ప్రాంతాల్లో మొదలైంది.

ముఖ్యంగా వయస్సు పై బడిన మగవారు పెళ్లికి సిద్ధపడటం వల్ల ఈ దురాచారం మొదలైవుండొచ్చు.

అమ్మాయిల్ని అమ్ముకునే ఈ దురాచారాన్ని సభ్యసమాజం హర్షించలేదు. ఫలితంగా కొన్ని తెగల్లో తప్ప కన్యాశుల్కం అదృశ్యమైందని చెప్పాలి.

వరకట్నం

అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నందుకు గాను వివిధ రూపాల్లో వరుడికి వధువు తండ్రి ఇచ్చే సొమ్మే వరకట్నం.

సామాజిక ఆమోదం అభించిన 'దురాచారం.' చట్టం నిషేదించినా యధేచ్ఛగా సాగిపోతున్న 'దాహం'.

పెళ్లి కుదిరిందంటే చాలు కట్నం ఎంతని నిస్సిగ్గుగా అడిగే స్థాయికి చేరుకుంది సమాజం! స్త్రీ పురుషలిద్దరూ కూడా దానిని గౌరవించడం వ్యవస్థలోని దోపిడి దృక్పథానికీ అత్యాశకీ ప్రత్యక్ష నిదర్శనం!

'విలువ' ని బట్టి 'తూకం' వేసి 'బేరం' కుదుర్చుకుని 'పెళ్లి' నిర్ణయించడం పెళ్లిని వ్యాపారంగా మార్చడమే.

చదువు ఖర్చు, ఉద్యోగపు ఖర్చు, పెళ్లి ఖర్చు – సమస్తం రాబట్టాలని చూడటం దారుణం. బాధ్యతలకి వెల కట్టి వసూలు చేయబూనటం అమానుషం. హిందూ సమాజం ముక్త కంఠంతో గర్హించాల్సిన విషయం.

ప్రేమానురాగాలతో ప్రారంభమవ్వాల్సిన భార్యాభర్తల సంబంధం డబ్బు సంబంధంగా మొదలవకూడదు.

స్త్రీ ధనం కోసం ఆశపడే పురుషుడు అధముడన్నారు మహర్షులు.

ఇది గుర్తుపెట్టుకుంటే చాలు పవిత్రమైన వివాహవ్యవస్థలో వరకట్నపు అపశ్రుతులు వినపడవు!

దాన స్వీకరణ

ఇతరుల నుండి దానాన్ని స్వీకరించడం ఋణ సంబంధమే అవుతుంది.

కన్యాదానం కూడా ఇందులోకే వస్తుంది. కాని గృహస్థాశ్రమంలో కన్యను దానం ఇస్తేనే తీసుకోవాలి.

ఇతరుల నుండి దానంగానే కాదు ఏ రకంగా సొమ్ము తీసుకున్నా అది దోషమే అవుతుంది.

గోదానం వగైరాలు స్వీకరించే బ్రాహ్మణులు సైతం దానికి గాయత్రీజపంతో ప్రాయశ్చిత్తం చేసుకుంటారు.

ధనాశతో గాక ఇచ్చేవారి తృప్తి కోసం 'దక్షిణ' గా కొంత తీసుకోవచ్చు. వధువు తండ్రి కన్యని దానం చేస్తూ దక్షిణ ఇవ్వవచ్చు.

కాని వరకట్నంగా భారీ సొమ్ము డిమాండ్ చేసి మరీ తీసుకోవడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు.

కట్నంవేరు ఆస్తి వేరు

పెళ్లికీ కట్నానికీ లంకె పెట్టడం మంచి సంప్రదాయం కాదు.

కట్నం తీసుకోవటం పాపం. ఇతరుల సొమ్ము ఊరికే వచ్చి పడాలని ఆశించడం నరక లోకానికి తీసుకెడుతుందంటున్నాయి శాస్త్రాలు.

వరకట్నంగా వరుడికి సొమ్ము లేక ఆస్తి పాస్తులివ్వడం వేరు.

వధువు తల్లిదండ్రులు తమ మగపిల్లల్తో సమానంగా ఆడపిల్లలకు ఆస్తిలోభాగం ఇవ్వడం వేరు.

మొదటిది చట్ట వ్యతిరేక డిమాండ్. రెండోది చట్టరీత్యా సంక్రమించిన హక్కు,

కట్నం వరుడికీ అతడి బంధువులకీ చెందుతుంది.

హక్కుగా సంక్రమించిన ఆస్తి ఆమె స్వంతమవుతుంది.

కట్నం అత్తింటి వారి ఉమ్మడి ఆస్తిలో కలుస్తుంది.

ఆమె ఆస్తి ఆమె స్వంతం. ఆమెకు ఆర్థిక శక్తి సమకూరుస్తుంది.

మొదటిది పెళ్లిలో సెటిల్ చేసుకునే వ్యవహారం.

రెండోది కన్యాదాత ఆస్తి పంపకాల సమయంలో ఇచ్చేది. ఆయన ఆస్తిలోనే కాదు అప్పుల్లోనూ బాధ్యతల్లోనూ ఆమెకు భాగముంటుందని గుర్తుంచుకోవాలి.

అందుకే దాన్ని చట్టం ఆమోదించింది. మొదటిదాన్ని నిషేదించింది!

స్త్రీ ధనం

వధువు పుట్టింటి నుంచి తెచ్చుకున్న ధనాన్ని స్త్రీ ధనం అంటారు.

భర్త విడిపోయినా లేదా చనిపోయినా లేదా దూరమైనా లేదా ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఆమెను ఆదుకోగలగాలి. ఆర్థిక రక్షణ కల్పించాలి. అందుకు ఉపయోగిస్తుందన్న సదుద్ధేశంతో ముందుచూపుతో ఏర్పాటు చేసిన ఆచారం ఇది.

వేదాలలోనూ స్త్రీధన ప్రస్థావన వుంది.

హిందూ వారసత్వ చట్ట ప్రకారం స్త్రీ ధనం మీద సంపూర్ణ హక్కూ అధికారం స్త్రీదే. మరెవరూ దానిని తాకజాలరు. దాని మీద అత్తింటి వారికి ఎలాంటి హక్కూ అధికారం సంక్రమించవు.

ఆభరణాలు, డబ్బు, దుస్తులు, వస్తు సామాగ్రి, ఆస్తులు వగైరాలన్నీ స్రీ ధనమే. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే దీని ఉద్ధేశం.

మధ్యే మార్గం

వ్యావసాయిక కుటుంబాలూ, పట్నాలలోని మధ్య తరగతి కుటుంబాలూ వరకట్నం ఇచ్చే విషయంలో మధ్యే మార్గాన్ని అనుసరిస్తున్నాయి.

కొంత కట్నాన్ని రొక్కంగా బంగారు ఆభరణాలుగా ఇస్తున్నారు. మిగితాది పొలం, తోట, ఇల్లు, ఇంటి స్థలం వగైరా స్థిరాస్థుల రూపంలో ఇస్తున్నారు. అది కూడా అమ్మాయి పేరన రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నారు.

దీని వల్ల వరుడి తరపు వారి ఖర్చులకీ అవసరాలకీ అప్పులకీ సొమ్ము లభిస్తోంది.

కొంత బంగారంలో మదుపు చేసినట్లు అవుతోంది. అవసరానికి ఆదుకొంటుంది కదా!

అమ్మాయికి 'పసుపు కుంకాల' కింద ఆస్తి దక్కుతోంది. అది ఉమ్మడి ఆస్తిలో ఆమెకి లభించిన వాటా అన్నమాట. ఆమెకి రక్షణగా వుంటుంది. ఆదాయమూ (పంట/అద్దె) వస్తుంది.

ఆస్తి కన్యాదాత ఆధీనంలో వుంటుంది గనుక అమ్మేసుకుంటారేమో నన్న భయం వుండదు.

ఉభయతారకంగా వుంటోందీ పద్ధతి.

కట్నం ప్రతిష్ఠ పెంచదు

'మా అబ్బాయికి లక్షల్లో కట్నం వచ్చింది' 'మా అమ్మాయికి బోలుడు కట్నం ఇచ్చాం' – లాంటి గొప్పలు గొప్పగా చెబుతూండటం వింటూవుంటాం.

అదో గర్వకారణంగా స్టేటస్ సింబల్‌గా భావిస్తూంటారు.

నిజానికి కట్నం ఇవ్వడం గొప్పకావచ్చు కాని పుచ్చుకోవడం కాదు. అందుకనే అలాంటి గొప్పలు చెప్పుకోడానికి యువత సిగ్గుపడుతోంది.

కట్నరూపంలోగాకుండా ఆస్తిగా – అదైనా సమాన హక్కుగా – అదైనా పంపకాలు జరిగినప్పుడు వారసత్వంగా – ఇమ్మనటం, ఇచ్చేట్లు ప్రోత్సాహించటం చెయ్యాలి.

వధూవరులిద్దరూ సమానమే. ఇద్దరి తరఫు నుంచీ వారసత్వంగా ఆస్తి సంక్రమిస్తే సంతోషమే. లేకపోతే నో రిగ్రెట్స్ – స్థాయికి యువతరం ఎదగాలి.

స్వశక్తితో సంపాదించిన ధనం అత్యంత విలువైంది. సంతృప్తికరమైంది!

ఆడబడుచు కట్నం

వరుడి ఆడబడుచు అతడి కన్నా ఎక్కువగా వధువు మీద పెత్తనం చలాయిస్తుంది. వంకలు పెడుతుంది. తల్లికి చాడీలు చెబుతుంది. దీర్ఘాలు తీస్తూ ఎక్కేస్తుంది.

అందుకే ఆడబడుచుని అర్థమొగుడంటారు.

వారిని మంచి చేసుకోడానిగ్గాను పెళ్లిలో ఆమెకి కొత్త చీర, కంకణాల సామాన్లు, కానుకలు ఇవ్వడం ఒక లాంఛనమైంది.

అది కాస్తా ఇప్పుడు కట్నమై కూర్చుంది. అదికూడా పైన చెప్పిన బహుమానాలు గాక!

వరకట్నంలో సుమారు పదిశాతం ఆడబడుచు కట్నంగా కన్యాదాత ఇవ్వాలని డిమాండ్ చేసేంతగా ఎదిగింది.

వధువు తండ్రి మీద ఇంతభారం వెయ్యడం, దాని కోసం అలకలు కోపాలు ముక్కు చీదుళ్ళు ఎంతవరకూ సబబో ఆడబడుచులు ఆలోచించాలి.

నేటి ఆడబడుచే రేపటి ఆడపిల్ల తల్లి అని మరువకూడదు!

కానుకల లిస్టూ పెద్దదే

ఇవాళ రేపు కట్నాన్ని మించి పోతున్నాయి మర్యాదలూ లాంఛనాలూ కానుకలూ.

పెళ్లిలో ఇవిపెట్టాలి, పెళ్లయ్యాక అవి పెట్టాలి, పండగలకి ఏవేవో పెట్టాలంటూ ముందే గొంతెమ్మ కోర్కెలు కోరేస్తున్నారు.

లాంఛనాల పేరులో ఏవేవో అడుగుతూ కన్యాదాతకు ఊపిరాడకుండా చేస్తున్నారు.

నగలు, టివి, ఫ్రిజ్, సూట్, మోటారు సైకిల్, కారు – వగైరా వగైరాలని వారి వారి స్థాయిని బట్టి డిమాండ్ చేస్తున్నారు.

అమ్మాయిని కాపురానికి పంపేటప్పుడు చీరె, సారె, సామాన్లతో పంపిస్తూంటారు. వేరు కాపురం పెడుతున్నప్పుడు కొత్త దంపతులు దేనికీ ఇబ్బంది పడకూడదని ఇంటికి కావాల్సిన మంచం, పరుపు, బీరువా, వంట సామాగ్రి, బియ్యం, పప్పు, ఉప్పు, అన్నీ ఇస్తూంటారు.

అదొక సంప్రదాయం. అదొక తృప్తి.

అందుకే శక్త్యానుసారం పెడుతూంటారు వధువు బంధువులు.

అదిగాక వేరే కానుకలాశించడం, లాంఛనాలంటూ గుంజాలని చూడటం మంచిది కాదు. మరి దారి లేక వియ్యాల వారిని అసంతృప్తి పర్చలేక ఏవో తంటాలు పడి వాటిని తీరుస్తున్నారు.

అది యువకులు గ్రహించాలి. కోరికలకు కళ్ళెం వేసుకోవాలి. హుందాగా గౌరవప్రదంగా వ్యక్తిత్వం ఇనుమడించేలా ప్రవర్తించాలి.

స్త్రీలలో చైతన్యం

నేటి అమ్మాయిలు విద్యావంతులు. ఉద్యోగస్తులు. వారు ప్రవేశించని రంగం లేదు. ప్రావీణ్యం సాధించని అంశమూ లేదు.

వారి చైతన్యం పురుషులతో పోటీ పడుతోంది.

కట్నం ఇచ్చి అమ్ముడుబోవడానికి యువతులు సిద్ధంగా లేరు.

వరకట్నం ఆశిస్తూ బేరసారాలు సాగిస్తున్నవారిని హీనంగా అగౌరవంగా వెన్నెముక లేని వారిగా చూస్తున్నారు.

వారి దృష్టిలో దృక్పథంలో వచ్చిన మార్పుని అబ్బాయిలు గుర్తించాలి.

ఆమె మనస్సులో చక్కని రూపం ప్రతిబింబించాలంటే వరుడు వరకట్నానికి గుడ్‌బై చెప్పాలి. లేకపోతే ఏం జరగొచ్చో ఈ సంఘటన చెబుతుంది.

ఢిల్లీలోని నిషాశర్మకి మునీష్ దలాల్‌తో పెళ్లి నిశ్చయమైంది. కట్నం ఒప్పందమూ జరిగింది. తీరా మూహూర్తం పెట్టుకున్నాక అధిక కట్నం డిమాండ్ చేశారు. ఆమె తల్లి దండ్రుల్ని వేధించారు. దాంతో ఆమె కాబోయే భర్త మీద నోయిడా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసి సంచలనం సృష్టించింది.

సో– వరుడి బంధువులూ!

వధువు వరుడి చిటికెన వేలు పట్టుకుని మహాలక్ష్మిలా మీ ఇంట్లో అడుగు పెట్టాలని కోరుకొండి తప్ప వేలూ లక్షల మూటలు మోసుకు రావాలని ఆశించొద్దు!

16

శుభ లగ్నం

శుభాన్ని ఆశించే ప్రతికార్యాన్నీ శుభసమయంలో ప్రారంభించటం అనాదిగా వస్తున్న ఆచారం.

ప్రారంభం బాగుంటే ఫలితం బావుంటుంది.

పెళ్లి జీవిత చక్రానికి ఇరుసులాంటిది. చక్ర గమనం సవ్యంగా సాగాలి. వధూవరుల జీవితాలనే గాక వారి కుటుంబాలనీ వారికి కలిగే సంతానాన్నీ ప్రభావితం చేస్తుంది పెళ్లి.

పెళ్లి వల్ల పెళ్లితో ముడిపడిన వారంతా బాగుండాలి. వారికి అడుగడుగునా శుభం కలగాలి.

ఆ ఆకాంక్షకి ప్రతిరూపమే శుభముహూర్తం! శుభలగ్నం!

ముహూర్తం ఆవశ్యకత

ఇతర మతాలలో ముహూర్తానికి పెద్దగా ప్రాముఖ్యత లేదు. అతిథుల సౌకర్యాన్ని ఇతర ఏర్పాట్లనీ దృష్టిలో పెట్టుకుని ఇంచుమించుగా 'టైం' నిర్ణయిస్తారు. కరక్టుగా అదే క్షణానికి వివాహం జరిగి తీరాలన్న నియమమూ లేదు.

కాని హిందూ మతం సమయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఘడియ విఘడియల్లో నిర్దేశిస్తుంది. సత్ఫలితాలు కావాలంటే ఖచ్చితంగా ముహూర్తానికే పెళ్లి జరగాలని శాసిస్తుంది.

లగ్నాన్ని కూడా వారి వారి అనుకూలతలని బట్టి గాక శాస్త్రప్రకారం వధూవరుల నక్షత్ర రాశుల్ని బట్టి నిర్ణయించడం జరుగుతుంది.

వధూవరులు పెళ్లిలో జీలకర్ర బెల్లం పెట్టుకునే సమయమే శుభ ముహూర్తం!

గ్రహనక్షత్రాల లెక్కింపు

బ్రహ్మాండంలో ఉండే గ్రహాల నక్షత్రాల ప్రభావం మానవుడిపై వుంటుంది. ఆయా సమయాల్ని బట్టి వాటి ప్రభావం మంచిగానూ చెడుగానూ వుంటుంది.

వాటి గమనాన్ని స్థానాన్ని లెక్కలోకి తీసుకుని శుభ ఫలితాలు చేకూరేలా ముహూర్తం నిశ్చయిస్తారు. దానివల్ల సత్ఫలితాలు లభిస్తాయన్న విశ్వాసమే వివాహ ముహూర్తానికి పునాది.

శుభముహూర్తం

శతపథ బ్రాహ్మణంలో చెప్పిన కాలప్రమాణాన్ని హిందూ వివాహంలో పాటిస్తున్నారు.

24 గంటల కాలాన్ని ఒక 'రోజు' గా పరిగణిస్తే రోజుకు 50,625 భాగాలున్నాయి.

15 ప్రాణులు ఒక 'ఇదాని'

15 ఇదానులు ఒక 'క్షిప్ర'

15 క్షిప్రలు ఒక 'ముహూర్తం'

15 ముహూర్తాలు ఒక 'రోజు'

ఇలా విభజించాక వధూవరుల జన్మ నక్షత్రాలను, జాతక చక్రాలను పరిగణలోకి తీసుకుని శుభ ముహూర్తం నిర్ణయిస్తారు.

ఆ సమయాన వధూవరులకు ముడిపడితే వారి వైవాహిక బంధం కలకాలం శు భప్రదంగా సాగుతుందని నమ్మకం!

శుభ మాస వారాలు

వివాహానికి మాఘ, ఫాల్గుణ, వైశాఖ, జ్యేష్ఠ మాసాలు శుభ ప్రదమని పండితుల అభిప్రాయం.

జనవరి చివరలోనో ఫిబ్రవరి ఆరంభంలోనో వచ్చే మాఘమాసం పెళ్లిళ్ళకు మంచి సీజన్.

కార్తీక మార్గశిర మాసాలు మద్యమ ఫలితాలనిస్తాయి. అంచేత ఈ మాసాల్లో పెళ్లికి ఫరవాలేదు గాని కాస్త అలోచించాలి.

ఆషాడ, పుష్య, భాద్రపద మాసాలు శూన్య మాసాలు. పెళ్లిళ్ళు చేయరు.

బుధ, గురు, శుక్రవారాలు వివాహానికి ఉత్తమం. ఆదివారం మధ్యమం. సోమ, మంగళ వారాల్లో ముహూర్తం పెట్టరాదంటారు. కొందరు సోమవారం ఫరవాలేదంటారు.

రాత్రి పూట జరిపే పెళ్లిళ్ళకు వారం పట్టింపు అవసరం లేదని కొందరి అభిప్రాయం.

గ్రహబలం

స్త్రీలకు గురుబలము, పురుషునకు రవిబలము, ఇరువురకు చంద్రబలము శ్రేష్ఠమైనవి.

రజస్వల అయిన స్త్రీకి లగ్న బలము చూడాలి.

వివాహ సమయాన కన్యకు గ్రహానుకూలం లేనిచో బృహస్పతి పూజ చేయించాలి.

ముహూర్త లగ్నమునకు ఏడవ స్థానమున ఏ గ్రహమూ లేకుండా చూసుకోవాలి.

వివాహనక్షత్రాలు

వివాహానికి మూల, అనూరాధ, మృగశిర, రోహిణి, హస్త, రేవతి, స్వాతి, మఖ, ఉత్తర, ఉత్తరాషాడ, ఉత్తరాభాద్ర నక్షత్రాలు శుభప్రదము, శ్రేష్ఠము అని పండితుల భావన.

అశ్వి, శ్రవ, చిత్త, ధని మధ్యమములు.

భార్యాభర్తలు ప్రేమగా జీవించాలంటే స్వాతి నక్షత్రంలో పెళ్లి చాలా మంచిదంటారు.

వివాహ తిథులు

వివాహానికి ప్రశస్తమని చెప్పబడిన తిథులు - 2,3,5,7,10,11,12,13,15.

కృష్ణ పాడ్యమి మంగళప్రదం. కృష్ణ ఏకాదశి లగాయతు క్షీణ చంద్రుడు కనుక ఏకాదశి లగాయతు గల తిథులు నింద్యములు.

వధూవరుల నక్షత్రాలు.

వధూవరుల జన్మ నక్షత్రాలను మూడు గణాలుగా విభజించారు.

అశ్విని, పునర్వసు, పుష్యమి, హస్త, మృగశిర, అనూరాధ, శ్రవణం, రేవతి, స్వాతి– ఇవన్నీ దేవగణం.

భరణి, రోహిణి, ఆరుద్ర, పుబ్బ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర – ఇవి మనుష్యగణం.

విశాఖ, ధనిష్ట, మూల, మఖ, శతభిషం, జ్యేష్ఠ, చిత్త, కృత్తిక, ఆశ్లేష – ఇవి రాక్షసగణం లోనివి.

వధూవరుల నక్షత్రాలు ఒకే గణానికి చెందినవైతే ఉత్తమం.

ఒకరిది దేవగణం రెండోవారిది మనుష్యగణం అయినా మంచిదే.

దేవరాక్షస గణాలు లేదా రాక్షస మనుష్య గణాలైతే మంచిదికాదు.

ఒకవేళ ఇద్దరిదీ ఒకే నక్షత్రమైతే వరుడు ముందు పాదంలోనూ వధువు తర్వాతి పాదంలోనూ ఉండాలి.

అయితే గణ విషయంలో పెద్దగా పట్టింపు లేదు.

వధూవరుల నక్షత్రాలకు (జన్మ లేక నామ) ఒక్కో జంతువును ఏర్పరిచారు. ఆ జంతువులు విరోధ జంతువుల కాకుండా చూసుకోవాలి.

ఉదాహరణకి పాము–ముంగిస, ఆవు–పులి వగైరాలు కూడదు.

రాశుల మైత్రి

వధూవరుల జన్మ లేదా నామ రాశి తెలుసుకుని షష్టాష్టకములు, ద్విర్ద్వాదశం లేని రాశుల వారు వివాహం చేసుకోవచ్చును.

ఒకరి రాశి నుండి మరొకరి రాశిని లెక్కించగా 6,8 కాకూడదు. అదే షష్టాష్టకము.

ఒకరి రాశి నుండి మరొకరి రాశిని లెక్కించగా 2,12 కాకూడదు. అదే ద్విర్ద్వాదశం.

దీనిని చూడనవసరం లేదని కొందరి అభిప్రాయం.

అయితే మేష, వృశ్చికములు షష్టాష్టకములు అయినప్పటికీ రాజ్యాధిపతి కుజుడగుట వలన మంచిది. వివాహం చేసుకొనవచ్చు.

అలాగే వృషభ, తుల రాశులు షష్టాష్టకములు అయినా గాని శుక్రుడు అధిపతి అయినందున వివాహం చేయవచ్చు.

మిథునం–మకరం, సింహం–మీనం, కర్కాటకం–కుంభం, కన్య–మేషం, వృశ్చికం–మిథునం, ధనుస్సు–కర్కాటకం, మకరం–సింహం, కుంభం–కన్య, మీనం–తుల, వృషభం–ధనుస్సు రాశులవారికి వివాహం కూడదు అని పండితాభిప్రాయం.

పంచక రహితం

పంచక రహితంకాని ముహూర్తాలను దోషప్రదంగా భావిస్తారు.

శుభకార్యం నాటి తిథి, వార, నక్షత్ర, లగ్న సంఖ్యలను కలిపి, వచ్చిన మొత్తాన్ని తొమ్మిదితో భాగిస్తారు.

శేషాన్ని బట్టి ముహూర్త ఫలం వుంటుంది.

శేషం 1 అయితే మృత్యు పంచకమని, 2 అయితే అగ్ని పంచకమని, 4 అయితే రాజ పంచకమని, 6 అయితే చోరపంచకమని, 8 అయితే రోగ పంచకమని చెబుతారు.

ఈ అంకెలు శేషంగా వస్తే ముహూర్తానికి పనికిరావు.

అలాకాక మిగిలిన సంఖ్యలు శేషంగా వస్తే దాన్ని పంచకరహితం అంటారు.

ఆ ముహూర్తం శుభకార్యాలకి శుభప్రదమంటారు పంచాంగ పండితులు.

అమ్మాయి తరపు అభ్యంతరం

లగ్నం పెట్టే ముందు అమ్మాయి, ఆమె తల్లి యొక్క బహిష్టు సమయాల్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి.

పెళ్లిలో గౌరీ పూజ నుంచి సత్యనారాయణ స్వామి వ్రతం వరకూ సమస్తమూ శు చి శుభ్రతలతో మడి ఆచారాలతో చేయాల్సి వుంటుంది.

పెళ్లయ్యాక అత్తింట మూడు నిద్రలు చేయడం, శోభనం వుంటాయి.

మధ్యలో బహిష్టు అయితే ఎన్నో రకాల ఇబ్బందులెదురవుతాయి. వాటిని నివారించడానికి ముందే జాగ్రత్త తీసుకోవాలి.

మరీ తప్పనిసరైతే బహిష్టుని వాయిదా వేసే మాత్రలు వాడాల్సి వుంటుంది.

శాస్త్ర నిషేదాలు

పెళ్లి కెదిగిన కుమార్తె కుమారుడు వుంటే మొదట కుమార్తె పెళ్లి చెయ్యాలి. కాని కుమార్తె పెళ్లి కన్నా ముందు కుమారుడి ఉపనయనం చేయాలి.

ఒకే కడుపున పుట్టిన అన్న దమ్ములకు ఆరు నెలల లోపున వివాహం చేయరాదు. కాని ఫాల్గుణ మాసముందు ఒకరికి చైత్రమాస మందు మరొకరికి చేయవచ్చు. అనగా ఉగాదికి ముందు ఒకరికి తర్వాత మరొకరికి చేయవచ్చు.

త్రిజ్యేష్ఠాలు కూడదు. అంటే వధూవరులిద్దరూ జ్యేష్ఠులైనచో వారి వివాహం జ్యేష్ఠంలో చేయరాదు. ఒకరు జ్యేష్ఠులు రెండోవారిది జ్యేష్ట నక్షత్రం అయినచో వారి వివాహం జ్యేష్ఠ మాసంలో చేయకూడదు. ఇరువురిదీ జ్యేష్ఠా నక్షత్రాలే అయినచో జ్యేష్ఠంలో చేయరాదు.

అన్న దమ్ముల్ని అక్క చెల్లెళ్ళ కిచ్చి వివాహం చేయరాదు.

ఇద్దరు సోదరులకు ఒకే లగ్నంలో ఒకే ఇంటిలో పెళ్లిగాని ఉపనయనం గాని చేయరాదు. కవలపిల్లలకు మాత్రం ఏక కాలమందు చేయవచ్చు.

ఒకే లగ్నమందు కుమార్తెకు కుమారునకు పెళ్లిళ్ళు చేయరాదు.

కుమారునికి ఒక కుమార్తెకు ఒకే సంవత్సరంలో వివాహం చేయవచ్చును. అది శుభప్రదం.

లగ్నం గ్యారంటీ కార్డు కాదు

రాశి క్రమాన్ని బట్టి లగ్నం నిర్ణయించడం జరుగుతుంది. ఒకే లగ్నానికి ఎన్నో పెళ్లిళ్ళు జరుగుతూంటాయి.

వారంతా ఒకే రకంగా వుండరు. వారి జీవితాలన్నీ ఒకే రకంగా సాగవు.

లగ్నం పెళ్లి సఫలతకి గ్యారంటీ పత్రం కాదు. అది ఒక ఆకాంక్ష మాత్రమే.

హితం కోరి శుభాన్నాశించి మంచి మనస్సుతో ఫిక్స్ చేసే టైం ముహూర్తం.

టైం బాగున్నా మనిషి ప్రవర్తన బాగుండక పోతే వారి టైం తిరగ బడుతుంది.

వైవాహిక జీవితం సాఫీగా సాగటమనేది వధూవరుల చేతుల్లో చేతల్లో వుంది. నడతలో నడవడికలో వుంది. ఆలోచనలో అవగాహనలో వుంది. అనుబంధంలో అనురాగంలో వుంది.

లగ్నం నిమిత్త మాత్రమే.

మంచి జరిగితే పొగట్టం చెడుజరిగితే నిందించడం సరికాదు.

కాలమహిమని అర్థం చేసుకోవాలి!

అశౌచములు

తండ్రి మృతి వలన ఒక సంవత్సరం, తల్లి మృతి వలన ఆరునెలలు, భార్య మృతి వలన మూడు నెలలు అశౌచముంటుంది.

సోదరుడు లేదా కుమారుని మృతి వలన నలభై అయిదు రోజులు, దాయాదుల మృతి వలన నెలరోజులు అశౌచం.

అశౌచానంతరం శాంతి కర్మలు చేసి వివాహం చేయవలెనని స్మృతి రత్నావళిలో పేర్కొనబడింది.

వివాహ నిశ్చయానంతరం రెండు వంశముల వారి యందు ఎవరికైనా మరణము సంభవించిన ఒక సంవత్సరం తరువాత వివాహం చేసినచో శుభము కలుగునని మేధాతిథిలో కలదు.

కుజ దోషం

జన్మలగ్నము లగాయితు 1,2,4,7,8,12 స్థానములలో కుజుడున్నా లేక ఆ స్థాన ములకు కుజ దృష్టి సోకినా అది స్త్రీల యొక్క భర్తృ భావమునకు, పురుషుల కళత్ర భావమునకు చెడు తెస్తుంది.

గనుక అలాంటి జాతకులకు వివాహం చేయరాదన్నారు.

స్త్రీ పురుష జాతకములు రెండింటికీ సమాన కుజదోషము కలిగి వున్నచో వారికి వివాహము చేయవచ్చును.

దోష శాంతులున్నందున కుజదోషం గురించి ఆందోళన పడక్కర్లేదు.

కుజదోషం గల ఐశ్వర్యారాయ్ పెళ్లికి ముందు 'శాంతి' చేసుకున్న సంగతి పత్రికల్లో చదివే ఉంటారు.

లగ్న పత్రిక

సుముహూర్తం నిర్ణయించేక లగ్న పత్రిక రాయించాలి. పసుపు కుంకుమ చందనం పూసి దేవుడి మందిరంలో పెట్టి పూజించాలి.

శుభతిథి చూసుకుని లగ్న పత్రికను కన్యాదాత తన దగ్గరి బంధువు చేత వరుడి తండ్రికి పంపించాలి.

లగ్న పత్రిక తెచ్చిన వారికి నూతన వస్త్రాలు బహూకరించి మర్యాద చెయ్యటం సంప్రదాయం.

17

కళ్యాణ వైభోగమే!

ఆకాశమంత పందిరి వేసి భూదేవంత అరుగు మీద ముత్యాల తలంబ్రాలతో రంగ రంగ వైభోగంగా కళ్యాణం జరిపించాలని పిల్లలు ఆశిస్తారు. పెద్దలు ఆకాంక్షిస్తారు.

పెళ్లి అత్యంత సంతోషదాయకమైన వేడుక.

వధూవరులకు అపురూప ఆనందానుభూతుల్ని కలిగిస్తూ ప్రేక్షకులకు చూడముచ్చట గొల్పుతూ పెద్దలకు హర్షాన్ని కలిగించే శుభకార్యం.

వ్యక్తుల జీవితాల్లోనే గాక కుటుంబం వ్యవస్థలోనే ప్రముఖ పాత్రవహించే కళ్యాణం నిజంగా కమనీయమే!

వేదకాలంలో వివాహం

ఋగ్వేదకాలంలో వివాహాల తీరు తెన్నుల గురించి ఆంధ్రవిజ్ఞాన సర్వస్వంలో ఏం చెప్పబడిందో చూద్దాం.

'ప్రౌఢలై వర సమాగమమును అభిలషించు వధువులు మాత్రమే వివాహ మొన రింపదగిన వారు. వరుని మిత్రులు వధువు తండ్రి వద్దకు వచ్చి కన్యనిమ్మని అర్థింతురు. వివాహము కన్య ఇంటగాని వరుని ఇంట గాని జరిగేది. కన్యాదాత రెండెడ్లను పూన్చిన రథము మీద కన్యను కూర్చుండబెట్టి వరుని గృహమునకు పంపును. వివాహ సూచకముగా వరుడు వధువు హస్తము పట్టుకొనును. పెద్దలందరు వధూవరులనాశీర్వదింతురు.'

ఇటీవలి కాలంలో

పెళ్లిళ్ళు ఎంతో సౌహార్థపూరిత వాతావరణంలో అయిదు రోజుల పాటు జరిగేవి. ఆదరాభిమానాలకూ ఆత్మీయతకూ అద్దం పట్టేవి.

పది పది హేను రోజుల ముందే బంధుమిత్రులు తరలి వచ్చేవారు. పందిళ్ళు వేయడం నుంచి పచ్చళ్ళు పెట్టడం వరకూ అన్నిటికీ సాయపడే వారు. సౌహార్దం తప్ప స్వార్థం ఏకోశానా కనపడేది కాదు.

బావా మరదళ్ళ సరసాలు, బంధుమిత్రుల పరాచికాలు, ఆడవారి పాటలు, పాన్పులు, పిల్లల ఆటలు, కొబ్బరాకు బూరలు – పెళ్లింటిని కళకళలాడించేవి.

నూతన వధూవరులు పల్లకీలో ఊరేగుతోంటే ఊరంతా పండగలానే ఉండేది.

బంధువులే వంటా వార్పూ వడ్డనలకు నడుం కట్టేవారు. నవగాయపిండి వంటల్తో నలభీమపాకాలతో పంక్తి భోజనాలు పెట్టేవారు.

అవన్నీ గతకాలపు స్మృతులైపోయాయి!

మామిడాకుల తోరణం

పెళ్లంటే గుర్తొచ్చేది మామిడాకుల పచ్చతోరణాలే.

ప్రతి శుభకార్యానికీ ఇంటి ప్రధాన ద్వారానికి తప్పనిసరిగా కట్టే మామిడాకుల ప్రత్యేకత అంతా ఇంతా కాదు.

మామిడి చెట్టు పార్వతికి ప్రతిరూపంగా భావిస్తారు. శివపార్వతుల కల్యాణం మామిడి చెట్టు కిందే జరిగింది. అంచేతే మామిడాకులకంత ప్రాధాన్యత.


పూజలు వ్రతాల్లో మామిడి ఆకును నీళ్ళగ్లాసులో ఉంచి అభిషిక్తకార్యకలాపాలకు వినియోగిస్తారు.

మామిడాకును సన్నగా మడచి దారాన్ని ముడివేసి పురోహితుడు వధూవరుల చేతికి కడతాడు. అదే తోరం లేక దీక్షా కంకణం. వ్రతాలక్కూడా దాన్ని ధరిస్తారు. చేబట్టిన కార్యక్రమం పూర్తయ్యే వరకూ దీక్షగా ఉంటామని, ఉండాలని చెబుతుంది.

అగ్నిహోత్రంలో మామిడి పుల్లల్ని సమిధలుగా వినియోగిస్తారు.

కళ్ళకి పచ్చదనం హాయిని కలిగించటమే కాదు అనేక మంది గుమిగూడటం వల్ల గాలిలో ఎక్కువయ్యే కార్బన్ డై ఆక్సైడ్‌ను పచ్చని మామిడాకులు పీల్చి ప్రాణ వాయువుని విడుదల చేస్తాయి!

మేళతాళాలు



ఇవి లేనిదే పెళ్లి వేడుకలో హుషారే ఉండదు.

సన్నాయి మేళంగాని బ్యాండ్ మేళంగాని వినబడితే చాలు మనస్సు ఉత్సాహ భరితమవుతుంది.

అసలు మంగళ వాయిద్యాలే పెళ్లికి అందం చందం!

మామిడి తోరణాలు కట్టేటప్పుడు, పెళ్లి కూతుర్ని చేసేప్పుడు, జీలకర్ర బెల్లం పెట్టేటప్పుడు, సూత్రధారణ వేళ మంగళవాయిద్యాల హోరు పెళ్లిపందిట్లో ఉత్తేజం నింపుతుంది.

కొన్ని చోట్ల వాద్యాలకనుగుణంగా నృత్యం చెయ్యడం, పాటలు పాడటమూ ఉంది.

పరోక్షంగా మనిషిలోని కళల్ని వెలికితీసి ప్రోత్సాహమిచ్చే చక్కని సందర్భాలు పెళ్లిళ్ళు.

నేటి ధోరణి

ఇప్పుడంతా ఎక్కడ చూసినా హడావిడి పెళ్లిళ్ళే. ప్రతీదీ రెడీమేడ్‌గా దొరుకుతున్నాయి గనుక అన్నీ చకచకా తెచ్చి అంతే వేగంగా ముగించేస్తున్నారు.

అమెరికా వరుడైతే అతడి విమాన టైము కనుగుణంగా ముహూర్తం మిగతా కార్యక్రమాలూ జరిపించేస్తున్నారు.

ఫంక్షన్ హోలులో కాంట్రాక్టర్ ఏర్పాటు చేసే మండపంలో వీడియో సాక్షిగా చకచకా కానిచ్చేసి 'హమ్మయ్య' అనుకుంటున్నారు.

అతిథులు కూడా అలా వచ్చి ఇలా మొహం చూపించి అలా ప్లేట్లు పట్టుకుని కేటరర్ పెట్టే భోజనం తిన్నామన్పించి ఇలా మాయమై పోతున్నారు.

అంతటా హడావిడి. అంతా బిజీ బిజీ.

మిగతా ఫంక్షన్స్ ఎలా జరిపినా ఫర్లేదు. పెళ్లిమాత్రం అంతా దగ్గరుండి ఘనంగా జరిపించాలి. మానవ కళ్యాణానికి పెళ్లి కేంద్ర బిందువన్న సంగతి అంతా గుర్తుంచుకోవాలి.

పెళ్లి ఎక్కడ ఎలా చేసినా హిందూ సంస్కృతి ననుసరించి పెళ్లిలోని వివిధ కార్యక్రమాలనీ నిర్వర్తించాలి. పెళ్లిమంత్రాల అర్థాన్ని పెళ్లిలోని అంతరార్థాన్ని సందేశాన్ని నవ దంపతులకు తెలియజేయాలి.

ఈ బృహత్తర కార్యం పెళ్లి పెద్దలూ పెళ్లికొచ్చిన అతిథులూ కలిసి నిర్వర్తించాలి!

అట్టహాసపు పెళ్లిళ్ళు

జయలలిత దత్తపుత్రుడు సుధాకర్ పెళ్లికి 100 కోట్లు ఖర్చయ్యింది. సినిమా ఆర్ట్

డైరెక్టర్ 75 వేల చదరపు అడుగుల స్థలంలో పెళ్లిపందిరి సెట్‌వేశారు. కల్యాణ మండపం అలంకరణకు 50 లక్షలు, పెళ్లి పందిరి డైనింగ్ హాళ్ళకు 70 లక్షలు, తాంబూలాలకి 16 లక్షలూ ఖర్చయ్యాయిట. 300 ఏసీకార్లు పెళ్లివారి బంధుమిత్రులకోసం ఏర్పాటు చేశారు!

లాలూ ప్రసాద్ యాదవ్ ఇద్దరు కూతుళ్ళ పెళ్లిళ్ళకూ 100 కోట్లు పైనే ఖర్చయినట్టు వార్త.

సహారా సంస్థల అధిపతి సుబ్రతోరాయ్ తన ఇద్దరు కుమారుల పెళ్లిళ్ళకోసం 'సహారా షెహర్' పేరిట ఏకంగా ఊరినే నిర్మించారు. 120 హెక్టార్ల స్థలంలో ఏర్పాటు చెయ్యడమే కాదు హెలిపాడ్ సైతం నిర్మించారు. సుమారు పదివేల మంది అతిథులు హాజరయ్యారు.

నిర్మాత భరత్ షా తమ్ముడి పిల్లల పెళ్లిళ్ళు కూడా అత్యంత వైభవంగా జరిగాయి. సుమారు 86 కోట్లు ఖర్చయ్యాయిట. బెల్జియంలో జరిగిన ఈ పెళ్లిళ్ళకోసం రాజస్థాన్ హవా మహల్, అజంతా ఎల్లోరా గుహలు, వారణాసి స్నానఘట్టాలు నిర్మించడం ఓ ప్రత్యేకత!

ఉక్కుదిగ్గజం లక్ష్మీ మిట్టల్ కుమార్తె వనీషా మిట్టల్‌కు అమిత్ భాటియాతో జరిగిన వివాహమూ ఓ చరిత్రే. ఫ్రాన్స్‌లో జరిగిన పెళ్లి మొత్తం ప్రపంచంలోనే ఖరీదైన పెళ్లి. స్టార్‌నైట్లు, డాన్స్ బాలేలు కల్చరల్ ప్రోగ్రాంలు - వారం పైగా సాగాయి. 250 కోట్లు ఖర్చయినట్లు అంచనా!

పెళ్లి చేసి చూడు

ఇల్లు కట్టిచూడు, పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అవి చేసిన వారికే అందులోని సాధక బాధకాలు తెలుస్తాయి. సమాజంలోని ఎందర్తో ఎన్ని రకాల పనులు పడతాయో ఏయే సామాజిక వర్గాలవారి అవసరం ఎంత ఉండేదీ తెలిసేది అప్పుడే.

అంతే కాదు బడ్జెట్ తారుమారయ్యేదీ ఆ రెండిట్లోనే!

కొందరు పెళ్లిళ్ళు తమ అంతస్తునీ ఐశ్వర్యాన్నీ ప్రకటించుకునే సందర్భంగా భావిస్తారు. ఎంత ఆడంబరంగా చేస్తే అంత గొప్పగా ఫీలవుతారు. ఆ గొప్పల కోసం అప్పుల పాలవడమూ కద్దు.

ఆస్తులమ్మి పెళ్లి చేసే పరిస్థితి రానీకుండా తమ లిమిట్స్‌లో చెయ్యాలి. తమ ఆర్థిక పరిస్థితిని బట్టి ఎవరికి వారు పెళ్లికి ఒకస్థాయిని నిర్ణయించుకోవాలి. దానికి లోబడి కార్యక్రమం జరిపించాలి.

తాహతుని బట్టి బడ్జెట్ వేసుకుని దాన్ని అక్షరాలా పాటించడానికి ప్రయత్నించాలి. అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తేనే అనుకున్న బడ్జెట్ కన్నా 10-20 శాతం అధికంతో బయట పడవచ్చు.! డబ్బు కొద్దీ పిండి. పిండి కొద్దీ రొట్టె!

సంగీతానికి ప్రాముఖ్యత

మంగళ వాయిద్యాల సంగీతంతోబాటు పెళ్లిళ్ళలో పాటలకు కూడా ఎంతో ప్రాముఖ్యతా ప్రత్యేకతా ఉన్నాయి.

అప్పగింతల పాటలు, వదిన మరదలు పాటలు, ఎదురుకోళ్ళ పాటలు, వధువు ఒడి నింపే పాటలు, హారతి పాటలు - ఇలా ఎన్నో స్త్రీల పాటలు పాడతారు. లోకజ్ఞానం, హాస్యం, చమత్కారం రంగరించుకున్న ఈ పాటలు పెళ్లింట్లో ఆనందాన్ని పొంగిస్తూంటాయి. స్త్రీలలోని కళల్నీ అల్లర్నీ హాస్య చతురతనీ బయటపెడుతూంటాయి.

పెళ్లి కుమారుడు పెళ్లికి బంధుమిత్రులతో తరలి వెళ్ళేప్పుడు నృత్యాలు చెయ్యడం కొన్ని చోట్ల ఉంది. పంజాబీల్లో అగర్వాల పెళ్లిళ్ళలో అయితే మరీ ఎక్కువగా ఉంది. ఉత్తరాది వారి బారాత్ ననుసరించి ఆ తరహా పద్ధతిలో దక్షిణాదిలోనూ మొదలుపెట్టారు.

కొందరింకో అడుగు ముందుకేసి నృత్య దర్శకుల చేత వధూవరులకూ బంధుమిత్రులకూ చిన్నపాటి డాన్సులూ స్టెప్పులూ నేర్పిస్తున్నారు. 20-25 రోజుల శిక్షణకి అయిదు పదివేల దాకా ఖర్చు చేస్తున్నారు.

పెళ్లిలోని ఆనందాన్ని ద్విగుణీకృతం చెయ్యడానికి ఎన్నెన్ని మార్గాలో!

వెడ్డింగ్ ప్లానర్స్

'ఉద్యోగంతో లేక వ్యాపారంతో బిజీ బిజీగా వుంటున్నాం. దగ్గరి బంధువులంతా ఎక్కడెక్కడో ఉన్నారు. పెళ్లి పనుల్ని సమన్వయ పరచి చక్కగా పూర్తి చెయ్యడం ఎలారా దేవుడా' - అని దిగులుపడక్కర్లేదు.

'వరుడి తరఫు వాళ్ళు కట్నం వద్దుగాని పెళ్లి భారీగా చెయ్యమన్నారు. ఎలా చెయ్యాలో ఏమిటోనని భయపడక్కర్లేదు. పెళ్లికి తక్కువ వ్యవధి ఉందని బెంబేలు పడక్కర్లేదు.

వివాహానికి సంబంధించిన సమస్త బాధ్యతల్నీ నెత్తినేసుకుని చక్కగా చాకచక్యంగా నిర్వర్తించే సంస్థలిప్పుడు పుట్టుకొచ్చాయి.

బడ్జెట్ ప్లస్ కోరికలు చెబితే చాలు పెళ్లి పనులన్నీ చకచకా చక్కబెట్టేస్తారు ఈవెంట్ మేనేజర్లు. వధూవరుల సెలక్షన్ నుంచి హనీమూన్‌కి పంపడం వరకూ సమస్తమూ చేసేస్తారు వెడ్డింగ్ ప్లానర్స్.

మండపంలోని అతిథులకి గులాబీ లిచ్చి ఆహ్వానించడం నుంచి వారికి తాంబూలమిచ్చి సాగనంపే వరకూ అన్నీ వారే చూస్తారు. వధువుకి మేకప్ చేయించడమే కాదు వినోదకార్యక్రమాల ఏర్పాటు, భోజనాల పర్యవేక్షణా అన్నీ వాళ్ళే చేస్తారు.

వధూవరుల తల్లిదండ్రుల బట్టనలక్కుండా చిరునవ్వు చెదరకుండా దగ్గరుండి పిల్లల పెళ్లి ఆనందాన్ని సంపూర్ణంగా ఆస్వాదించవచ్చు.

మొత్తం ఖర్చులో 10-20 శాతం కమీషన్‌గా ఛార్జి చేస్తుంటారు ఈవెంట్ మేనేజర్లూ వెడ్డింగ్ ప్లానర్లూ.

డబ్బుదే ప్రధానపాత్ర

పెళ్లికి డబ్బు మూట కావాల్సిందే.

కట్న కానుకల కోసం పెళ్లి ఖర్చులకోసం ముందుగానే డబ్బు సమకూర్చుకోవాలి. తగిన విధంగా ప్లాన్ చేసుకోవాలి.

పెళ్లి బరువవ్వకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. వీలైనప్పుడల్లా పిల్లలకోసం బంగారం, స్థలాలు, పొలాలు, షేర్లు కొంటూ ఉండాలి. కొంత బ్యాంకుల్లో ఫిక్సెడ్ డిపాజిట్ రూపేణ దాచవచ్చు.

ముహూర్తం పెట్టుకోగానే వివిధ రూపాల్లోని డబ్బుని ఒక్కొక్కటిగా ఉపయోగించుకోవాలి. స్థిరాస్థులు అమ్మాల్సి వస్తే ఆ పని ఇంకాస్త ముందుగా చేసుకుంటేనే సమయానికి చేతికి డబ్బు అందుతుంది.

అత్యవసరమైనప్పుడు ఎవరెవరి దగ్గర ఏయే మార్గాల ద్వారా ఎంత అప్పు లేక చేబదులు లభించవచ్చో ముందే అంచనా వేసుకోవాలి.

ముందు చూపు లేనప్పుడు పొదుపు చేయగల పరిస్థితి లేనప్పుడు సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో పెళ్లి చెయ్యాలి.

పెళ్లిళ్ళకోసం కొన్ని బ్యాంకులు ప్రత్యేక పథకాల ద్వారా అప్పులిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా 'స్టార్ సువిధ', బ్యాంక్ ఆఫ్ బరోడా వారి 'కన్యా వివాహం', కెనరా బ్యాంక్ వారి 'సహాయిక', స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ వారి 'కన్యా వివాహ సువిధ' – ద్వారా పెళ్లి ఖర్చు నిమిత్తం ఆదాయాన్ని బట్టి 50,000 నుంచి పది లక్షల దాకా అప్పులిస్తున్నాయి!

కళ్యాణమస్తు

తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ఎంపిక చేసిన చోట్ల శాస్త్రోక్తంగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు.

పెళ్లి ఖర్చంతా దేవస్థానం వారే భరిస్తున్నారు.

వధువుకు సంప్రదాయిక బంగారు తాళిబొట్టు, వెండి మట్టెలు, నూతన వస్త్రాలు వగైరాలని సమకూర్చడమే గాక భోజన వసతి సైతం కల్పిస్తున్నారు.

పెళ్లి కూతురుకి 18 సం. పెళ్లి కుమారునికి 21 సం. నిండి ఉండాలి. ఆ విషయం ధ్రువీకరించే పత్రాలు, ఆ వివాహం తల్లిదండ్రులకు సమ్మతమైనట్టు ఒక అఫిడవిట్టు, అప్లికేషన్ సమర్పిస్తే చాలు.

ఎలాంటి ఖర్చు లేకుండా దేవుడి సొమ్ముతో జరిపించే ఈ పెళ్లిళ్ళు పేదవారికి బంగారు వరం అని చెప్పాలి.

వివిధ ప్రాంతాల్లో పెళ్లి వేడుకులు

వివిధ ప్రాంతాల్లో వివాహ వేడుకలు వివిధ రీతుల్లో జరుగుతుంటాయి. కొన్ని మార్పులూ చేర్పులూ ఉన్నప్పటికీ వేదమంత్రాల సాక్షిగా హిందూ సంస్కృతిని చాటేవిగా వుంటాయి.

పంజాబ్‌లో వైభవంగా జరుపుతారు. మొదట 'రోక్నా' – వధువు బంధువులు వరుడ్ని చుట్టు ముట్టడంతో పెళ్లి కార్యక్రమం మొదలవుతుంది. వరుడ్ని పండ్లతో స్వీట్లతో ముంచెత్తుతారు. డబ్బు చూపించి ఊరిస్తారు. ఆటపట్టిస్తారు. తర్వాత 'షాగున్' – అతడి

బంధువులు కానుకల్ని సమర్పిస్తారు. తర్వాత 'బారాత్' – ఊరేగింపుగా పెళ్లికుమార్తె ఇంటికెళ్తారు. పాటలు పాడుతూ నృత్యం చెయ్యడం, కచ్చీ లస్సీలో ముంచిన గాజులు తొడగటం, వధువు గోరింటాకు పెట్టుకుని ఇంటి గోడల మీద ఎర్రటి ముద్రలు వేయడం – వీరి ప్రత్యేకత.

కేరళలో పగటిపూటే పెళ్లిళ్ళు చేస్తారు. వధూవరులు ఒకరికొకరు పూలదండలతో సత్కరించుకొంటారు. రావి ఆకు ఆకారంలో ఉండే పెండెంటును వధువు మెడలో వరుడు అలంకరిస్తాడు. తర్వాత 'పుడవీ' – వరుడు ఖరీదైన చీరలను వధువుకు బహూకరిస్తాడు. వధువు ఎరుపు, ఆకుపచ్చ లేదా బంగారు రంగు చీర ధరిస్తే వరుడు ధోవతి చొక్కా ధరిస్తారు. బ్రాహ్మణ వరుడు చొక్కా ధరించడు.

బెంగాల్‌లో శంఖాన్ని పూరిస్తూ పెళ్లి కార్యక్రమం మొదలు పెడతారు. పెళ్లి రోజున 'గాలె హోలద్' అనే వేడుక ఉంటుంది. గంధాన్ని నీటిలో కలిపి వధూవరులచే స్నానం చేయిస్తారు. వరుడు ఊరేగుతూ 'బారాత్' వెళ్తాడు. వరమాల వేసే వరకూ వరుడ్ని చూడకూడదని ఆమె కళ్ళకి తమలపాకుల్ని అడ్డంగా ఉంచుతారు. వరుడు ధోవతి, టోపీ ధరిస్తే వధువు ఎర్రటి చీర ధరిస్తుంది.

రాజస్థాన్‌లో తమ పూర్వీకుల రాచరికానికీ ధీరత్వానికీ సూచనగా ఘనంగా జరుపుతారు. వరుడిని వీరుడిలా అలంకరిస్తారు. నడుముకి కత్తికడతారు. తలపై ఎర్రరంగు పాగా, మెడలో హారాలు, ధగధగలాడే చుడీదార్ ధరిస్తాడు. తమ పెద్దలు యుద్ధాల్లో చూపిన పరాక్రమాన్ని పాటల్లో వర్ణిస్తారు. ఇవి వారి పెళ్లిళ్ళలో తప్పనిసరి.

మహారాష్ట్రలోనూ ఘనంగానే జరుపుతారు. 'సాకుర్ పురా' అంటే వరుడి వేలికి ఉంగరాన్ని తొడుగుతారు. వధూవరుల మధ్య 'తెరాసెల్లా' కడతారు. సప్తపది, మాంగల్యధారణ ఉంటాయి. పెళ్లవగానే 'ఝూల్' – అంటే బంధువులంతా వలయాకారంగా కూర్చోగా వధువు తల్లి పళ్లెంలో దీపాలని వెలిగించి దాన్ని ముందుగా వరుడి తల్లికిస్తుంది. ఆమె తన భర్తకీ అతడు తన కుటుంబ సభ్యులకీ వరుసగా ఇస్తారు.

గుజరాతీల పెళ్లిళ్ళూ ముచ్చటగా ఉంటాయి. వరుడు పట్టు ధోవతి, అంగవస్త్రం, పాగా ధరించగా వధువు తెల్లచీర, మోచేతిదాకా గాజులు, తలమీద త్రిభుజాకారపు కిరీటమూ ధరిస్తుంది. వధువుని వరుడి చేతిలో పెట్టి 'కృష్ణార్పణమస్తు' అంటాడు కన్యాదాత. వధూవరులు 24 పోగులతో చేసిన ఎర్రటి దండలని మెడలో ధరిస్తారు.

18

పెండ్లి పిలుపు



పెళ్లి ఆనంద సందర్భం. అనుబంధాలను గుర్తుచేసే సమయం. ఆత్మీయతలు పెల్లుబికే కాలం.

పాల్గొన్న ప్రతీవారూ సంతోషపడే ఏకైక ఘట్టం!

శుభకార్యానికి ఆహ్వానించడమంటే వారి పట్ల ఆదరాభిమానాలూ ఆప్యాయతలూ ఉన్నాయని ప్రకటించడమే. వారి రాక ఆనందదాయకంగా భావిస్తున్నట్టు చెప్పడమే.

ఆహ్వానితులు ఆ ప్రేమని స్వీకరించాలి. స్పందించాలి. శుభకార్యంలో పాలు పంచుకోవాలి.

అది ఉభయులకీ తృప్తిని కలిగిస్తుంది. ఆనందింపజేస్తుంది.

వారు వేసే అక్షింతలే వధూవరులకు శుభాశీస్సులు

పిలుపు తప్పనిసరి

పెళ్లి, విందు, పండుగ, వ్రతం వగైరా శుభకార్యాలకి పిలవందే వెళ్ళకూడదు.

యజ్ఞయాగాది క్రతువులకీ దైవ కార్యాలకీ ఆహ్వానం లేకపోయినా అందరూ వెళ్ళాలి.

ఇది పెద్దలమాట. ఆచరించాల్సిన వాక్యం.

పెళ్లికి బంధుమిత్రులందర్నీ పిలవాలి. ధనికపేద తేడాలు ప్రదర్శించకూడదు. పాత పగలనీ విభేదాలనీ విద్వేషాన్నీ మరచి పిలవాలి. మళ్ళీ కలిసిపోవడానికిదో చక్కని అవకాశంగా భావించాలి.

దూరపు బంధువుల్నీ చిన్ననాటి మిత్రుల్నీ గుర్తుపెట్టుకుని మరీ పిలవాలి. ఆ రకంగా వారిని మరచిపోలేదన్న సంగతి వారికి తెలియజెయ్యాలి.

ఆడవారికి బొట్టుపెట్టి ఆహ్వానించడం సంప్రదాయం. సాధ్యమైనంతవరకూ పాటించడం అభిలషణీయం.

బాంధవ్యాన్నీ స్నేహాన్నీ గట్టి పరచుకోవడమే కాదు ఒకరి పిల్లలు మరొకరికి తెలుస్తారు. ముందు తరాల వారికీ పాత తరానికీ వారధిగా పనిచేసే అపూర్వ అవకాశాల వేదిక పెళ్లి పందిరి!

ఎంతమందిని పిలవాలి

ఎవరెవర్ని పిలవాలనుకుంటున్నారో ఒక లిస్టు తయారు చేసుకోవాలి. ఎవరినైనా మరచిపోయారేమోనని ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి.

బడ్జెట్‌ను బట్టి ఎంతమందిని పిలిస్తే అనుకూలంగా వుంటుందో అంతమందినే పిలవాలి. పిలిచిన వారందరూ రారు. అందరికీ వీలు కాకపోవచ్చు. అదే రోజున మరో కార్యానికి హాజరవ్వాల్సి రావచ్చు. అవన్నీ లెక్కలోకి తీసుకోవాలి.

ఆఖరి క్షణాల్లో కొందర్ని కొత్తగా పిలవాల్సి రావొచ్చు. అందుకు కొంత అవకాశం వుంచు కోవాలి.

అవసరమైతే కొందర్ని తగ్గించుకోవాలి. ఇరుపక్షాల బడ్జెట్ అంచనాలు మించకుండా జాగ్రత్త పడాలి. అదే సమయంలో అతిధులకు అసౌకర్యం కలక్కుండానూ చూడాలి.

ఎంత మందిని పిలిస్తే అతిధి సత్కారాలు సవ్యంగా చెయ్యగలరో అందర్నే పిలవాలి. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు!

ముందుగానే పిలవాలి

పెళ్లికి రమ్మని ఆఖరి నిమిషంలో హడావిడిగా ఆహ్వానించ వద్దు.

అతిథులు తగిన విధంగా ప్రయాణాన్ని లీవుని ప్లాన్‌చేసుకోడానికి వీలుగా రెండు మూడు వారాలముందు పిలవాలి.

దూరపు అతిథులు రైలు, బస్సు రిజర్వేషన్లు చేసుకోడానికి ఆ మాత్రపు సమయం అవసరం.

అదీగాక అదే మూహూర్తానికి అనేక శుభకార్యాలు జరుగుతూంటాయి. ఒకటికన్నా ఎక్కువ చోట్లకి వెళ్ళాల్సి రావచ్చు. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోడానికి సమయమివ్వాలి.

ప్రయాణాలూ బహుమతులూ ఖర్చుతో కూడుకున్నవని మరువకూడదు!

స్వయంగా పిలవాలి

వధూవరుల తల్లిదండ్రులు, లేదా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, బావ బావ మరుదులు – వగైరా దగ్గరి బంధువులు స్వయంగా వెళ్ళి పిలవాలి. స్వహస్తాలతో శుభలేఖ ఇచ్చి నేరుగా పిలవడంలో అభిమానం వుంది. మర్యాద వుంది. ఆత్మీయతా భావన ఉంది.

పని ఒత్తిడివల్లో దూరాభారాల వల్లనో స్వయంగా పిలవ లేనప్పుడు శుభలేఖలు పోస్టులో పంపించాలి. అంతటితో వూరుకోక ఫోన్‌చేసి ఆయా కారణాలు చెప్పి మరీ ఆహ్వానించాలి.

పెళ్లి రోజు దగ్గరి కొచ్చేక ఫోన్ ద్వారా గుర్తుచెయ్యడం లేదా ఈ మెయిల్ పంపించడం మరీ మంచిది.


ఏమైనా ఆహ్వానించేప్పుడు ప్రదర్శించే బంధు/స్నేహప్రీతిని బట్టి ప్రతిస్పందన వుంటుందని గుర్తుంచుకోవాలి!

శుభలేఖలు

లగ్నం పెట్టేక కన్యాదాత వరుడి తరఫు వారికి లగ్నపత్రిక పంపిస్తారు.

అది అందుకున్నాకే శుభలేఖలు ముద్రింపించాలి.

శుభలేఖపైన శ్రీరస్తు, శుభమస్తు, అవిఘ్నమస్తు అని వుండాలి.



'స్వస్తిశ్రీ......' అంటూ తిథి వార నక్షత్రాలతో ఇరువైపుల కుటుంబ పరిచయాలతో వధూవరుల పేర్లతో శుభలేఖ సాగాలి.

వివాహం ఎక్కడ జరుగుతుందో చెప్పి 'సకుటుంబ బంధు మిత్ర సపరివార సమేతంగా విచ్చేసి వధూవరుల నాశీర్వదించి మమ్మానందింపజేయ ప్రార్థన' అంటూ ముగించాలి.

విందు ఎప్పుడో రాయటం మంచి సూచన.

శుభలేఖలు ఎన్నో రకాల్లో ఎన్నో ఖరీదుల్లో లభిస్తున్నాయి. వాటిని కొని వివరాలని ప్రింటు చేయించవచ్చు. లేదా ప్రత్యేకంగా డిజైన్ చేయించవచ్చు.

వధూవరుల ఫోటోలు ముద్రించాలనుకున్నవారు వారిద్దరూ కలిసున్న ఫోటోనిగాక విడివిడిగా వున్న ఫోటోల్నే వేయించాలి.

ఆడియో వీడియో కేసెట్లద్వారా పిలుపులు, ఇంటర్నెట్ పిలుపులు – వారి స్తోమతుని బట్టి అభిలాషను బట్టి పిలుచుకోవచ్చు.

శుభాహ్వానం పలకాల్సింది పెద్దలే

కుటుంబపెద్ద వివాహ ఆహ్వానం పలుకుతున్నట్టు శుభలేఖ వేయడం హిందూ సంప్రదాయం.

పెద్దల్ని గౌరవించడమే గాక పెద్దరికానికి పెద్దపీట వెయ్యాలి.

కుటుంబ పెద్ద పేరుతో బాటు ఆయన భార్య పేరు కూడా వెయ్యడం ఆనవాయితీగా మారింది. ఇది ఆచరించాల్సిన పరిణామం.

వధూవరుల తల్లిదండ్రులు కుటుంబపెద్దలు కానిచో వారిపేర్లను ఆగ మనాభి లాషులంటూ పేర్కొనవచ్చు.

ఎక్కువమంది పెద్దలున్నచో వారిపేర్లు శుభలేఖ దిగువన వేసి ఫలానా ఫలానా వారి ఆశీస్సులతో లేక అభినందనలతో అని వేయడం మంచి పద్ధతి.

ఉమ్మడి కుటుంబాలు విడిపోయినా – పెద్దల్ని పూజ్యస్థానంలో వుంచడం భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని చాటే గొప్ప విషయం. అశ్రద్ధచెయ్య వద్దు.

మా పెళ్లికి రండి

వధూవరులు తమ తమ సర్కిల్లో పంపిణీ చేసుకోడానికి ఇంగ్లీషులో 'నా పెళ్లికి రండి' అంటూ విడిగా కార్డులు వేసుకుంటున్నారు.

ఇది పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో మొదలైన పద్ధతి.

ఇంగ్లీషు తెలీని వారికోసం మరియు క్లుప్తంగా నాజూగ్గా వుండటానికీ అలా చేస్తున్నారు.

బంధుమిత్రుల కోసం ఒక శుభలేఖనీ, సహోద్యోగులూ స్నేహితుల కోసం మరోటీ ప్రింటు చేయిస్తున్నారు.

ఇది మంచిపద్ధతి కాదు.

పెళ్లి తాము చేసుకోవడంలేదనీ పెద్దలు చేస్తున్నారనీ గుర్తుంచుకోవాలి.

అవసరమైతే ఇంగ్లీషులో పెద్దల పేర్లతో శుభలేఖల్ని ప్రత్యేకంగా వేయించుకోవచ్చు. మన సంస్కృతిని ఇతరులకు తెలియజేయవచ్చు.

కవరు మీద వధువు లేక వరుడి పేరు, ఆఫీసు ఎడ్రస్సు ప్రింటు చేయిస్తే ఫలానావారి పెళ్లి అని తేలిగ్గా తెలుస్తుంది.

పసుపు రాయడం మరువవద్దు

శుభలేఖలు ప్రింటైరాగానే వాటికి పసుపు, సెంటు పూయాలి.

ఇది శుభసమాచారాన్ని చేరవేస్తున్న పత్రిక అన్నది చూడగానే తెలియడానికి పెద్దలు చేసిన ఏర్పాటు అది.

మొదటగా శుభలేఖను పూజామందిరంలో వుంచి ప్రార్థించాలి.

పిమ్మట స్థానికి దేవాలయానికెళ్ళి ఆ దేవుడి పేరిట మొదటి శుభలేఖ రాసి పూజారి ద్వారా దేవుడి పాదాల దగ్గర పెట్టించాలి.

ఆ తర్వాత వధువు తండ్రి వరుని తండ్రికి శుభలేఖ పంపాలి. వరుడి తండ్రి కన్యాదాతకు తమ శుభలేఖ పంపి ఆహ్వానించాలి.

తదుపరి బంధుమిత్రులకు శుభలేఖలు పంచాలి.

శుభలేఖను కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానమువారికి పంపినట్లయితే స్వామివారి ఆశీర్వాదం పంపిస్తారు.

చిరునామా మీద ప్రత్యేక శ్రద్ధ

ముచ్చటైన కార్డు మీదా, సెంటు మీదే గాక చిరునామా మీదా ఎక్కువ శ్రద్ధ పెట్టాలి.

పోస్టులో శుభలేఖల్ని పంపేవారు పూర్తి ఎడ్రస్సు సేకరించి చక్కని దస్తూరీతో రాయించి పోస్టుచేయాలి.

పెళ్లిసందేశం అతిథికి చేరవేసేది చిరునామాయే!

సమయం తక్కువ వుంటే కొరియర్ ద్వారా పంపించడం మంచిది. త్వరగా చేరుతుంది.

ఫోన్, ఈ–మెయిల్స్ ద్వారా పెళ్లికి ఆహ్వానించినా సాధ్యమైనంత వరకూ శుభలేఖని పంపించాలి. కనీసం శుభలేఖని స్కాన్ చేసి నెట్ ద్వారా మెయిల్ చెయ్యాలి లేదా వెబ్ డిజైన్ చేయించి లింక్ పంపించాలి.

మరి కొన్ని సూచనలు

అతిథులు ఎలాంటి ఇబ్బందీ పడకుండా వివాహప్రదేశానికి చేరడానిగ్గాను తగిన సూచనలను శుభలేఖ వెనకాల ఇవ్వాలి.

ఆ ప్రదేశం ఎక్కడ ఏ రూటులో వున్నది, అక్కడికెలా చేరాలి – అన్నవి వివరించాలి. రూటు మ్యాపు ఇవ్వగలిగితే మరీ మంచిది.

పెళ్లికెళ్ళడానికి బస్సు సౌకర్యం కల్పిస్తే ఆ విషయం పేర్కొనవచ్చు లేదా చెప్పవచ్చు.

బహుమతులు తీసుకోవడం ఇష్టంలేని వారు ఆ సంగతి పేర్కొనడం 'ఆడంబరం' అనిపించుకోదు. అతిథులు నొచ్చుకోకుండా చిన్నబుచ్చుకోకుండా రక్షించిన వారవుతారు.

అతిథి దేవుళ్ళు



ఆహ్వానిస్తే విచ్చేసినవారు అతిథులు.

అతిథి దేవో భవ – అన్నారు. అతిథుల్ని దేవుళ్ళుగా భావించే సంస్కృతి మనది.

వారిని పిలవటంతో పని అయిపోదు. నిజానికప్పుడే మొదలవుతుంది.

పెళ్లికొచ్చిన వారిని వారి వారి స్థాయినీ హోదానీ బట్టిగాక అందర్నీ సమాన ఆదరంతో అభిమానంతో ఆహ్వానించాలి.

పన్నీరు జల్లి గులాబీనో మరోటో అతిథులకు అందిస్తూ చిరునవ్వుల్తో స్వాగతం పలికేందుకేర్పాట్లు చెయ్యాలి.

'టీలు తాగారా టిఫినీలు తిన్నారా' అని అడక్కపోయినా భోజనం చేశారో లేదో అతిథుల్ని అడగటం మర్యాద. ఎవరైనా చెయ్యకపోతే వారిని భోజనాల వైపు పంపి వారి బాధ్యత మరొకరి కప్పగించడం అభిమానాన్ని చాటుకోవడమే అవుతుంది.

సమయాన్ని బట్టి 'కూల్డ్రింక్' 'టీ' అరేంజ్ చెయ్యొచ్చు.

వారికి పిసరంత అసౌకర్యం కలక్కుండా జాగ్రత్తలు తీసుకోవడం మర్యాద! బాధ్యత!!

అతిథులకీ కోడ్

అతిథులు 'అతి'కి పోకుండా మర్యాదగా వ్యవహరించాలి. చిన్న చిన్న లోటుపాట్లున్నా సర్దుకుపోవాలి. ఆహ్వానితుల ఫోన్లు, కాస్మటిక్సు, బుక్స్ వగైరాలు అనుమతి లేకుండా ఉపయోగించరాదు.

తమ వస్తువుల్ని ముఖ్యంగా నగలని డబ్బుని ఎవరికి వారు భద్రపరచుకోవాలి. పదిమంది మసల్తున్నప్పుడు ఏమైనా జరగవచ్చు. దొంగతనం చేశారంటూ ఎవర్నో అనుమానించి అవమానించి ఇబ్బంది పడేకన్నా ముందు జాగ్రత్త అందరికీ మంచిది!

అతిథి మర్యాదల్లో చిన్న చిన్న లోపాలున్నా సర్దుకుపోవాలి తప్ప విమర్శించడం తగదు.

సీతారాముల స్మరణ

ఆదర్శ దాంపత్యానికి ఏకపత్నీ వ్రతానికి ఏకపతి వ్రతానికి ఆదర్శమూర్తులు సీతారాములు. ఆసేతుహిమాచలం పూజించే ఆదర్శదంపతులు వారు.

వారి వివాహాన్ని తలుస్తూ వారి ఆశీస్సులు ఆశిస్తూ ఒకప్పుడు శుభలేఖల మీద ఈ శ్లోకం తప్పని సరిగా ముద్రించేవారు.

ఇష్టమున్నవారు ఇప్పుడూ వేయించవచ్చు. సంప్రదాయాన్ని గౌరవించవచ్చు. సీతారామకళ్యాణ మనోహర దృశ్యాన్ని తలచుకుని పులకించేట్లు చెయ్యనూవచ్చు.

'జానక్యాః కమలామలాంజలిపుటే యాః పద్మరాగాయితాః
న్యస్తా రాఘవమస్తకే చ విలసత్కుందప్రసూనాయితాః ।
స్రస్తాశ్శ్యామలకాయకాంతికలితా యా ఇంద్రనీలాయితాః
ముక్తాస్తాశ్శుభదా భవంతు భవతాం శ్రీరామవైవాహికాః ॥

19

పెళ్లి ఏర్పాట్లు

పూర్వం పెళ్లిపనులు మూడు నాలుగు నెలల ముందే ప్రారంభమయ్యేవి.

ఆడబడుచులూ ఇరుగుపొరుగు ముత్తైదువలూ వచ్చి పసుపుకొట్టడంతో మొదలయ్యేవి.

ఇంటికి సున్నాలు, గుమ్మాలకు రంగులు వేయించడం, పచ్చళ్ళూ వడియాలూ పెట్టడం, నగలు చేయించడం, పెళ్లిబట్టలు కొనటం, సంత నుంచి కిరాణా సరుకులు తెప్పించడం, తాటాకు పందిళ్ళు వేయించడం, గాడిపొయ్యి తవ్వించి వంటవారితో బూందీలడ్డు అరిసెలు సున్నుండలు వగైరాలు చేయించడం – అబ్బో క్షణం తీరిక లేనంత పని వుండేది.

అక్కడికీ బంధుమిత్రులూ ఇరుగు పొరుగువారూ తలో చెయ్యీ వేసేవారు.

ఇప్పుడు డబ్బుంటే చాలు ఫోన్‌మీద పనులన్నీ చకచకా చక్కబెట్టెయ్యొచ్చు.

అలా అని చెప్పి నిమ్మకి నీరెత్తినట్టు కూర్చుంటే కాదు. పెళ్లిలో ఏది లేకపోయినా వెలితే. కావాల్సిన వన్నీ ముందే లిస్టు రాసుకుని సమకూర్చుకోవాలి. ఆఖరి క్షణంలో హడావిడి పడితే రూపాయికి రూపాయి ఖర్చయ్యే ప్రమాదముంది!

వినాయకుడి బియ్యం

లగ్నపత్రిక పంపేక వధువు తల్లిదండ్రులు, అందుకున్నాక వరుడి తల్లిదండ్రులు పెళ్లిపనులు మొదలుపెట్టాలి.

మొదట విఘ్నాధిపతి పూజ చెయ్యాలి. ఎలాంటి విఘ్నాలూ కలక్కుండా శుభకార్యం సవ్యంగా నెరవేరేందుకు వినాయకుడ్ని ప్రార్థించాలి.

అయిదు శేర్లు లేక అయిదు తవ్వల బియ్యం మూటగట్టి వినాయకుడి ముందుపెట్టాలి. ఇది వినాయకుడికి ముడుపు కట్టడమన్నమాట.

వివాహకార్యక్రమమంతా పూర్తయ్యాక ఆ బియ్యాన్ని పిండిచేసి కుడుములూ క్షీరాన్నం వండి పంచిపెట్టాలి. అంతవరకూ అ మూటని కదపకూడదు.

పురోహితుడిచేత ముహూర్తం పెట్టించుకుని వినాయకుడి బియ్యంకట్టాలి. ఈ కార్యక్రమమయ్యాకే పెళ్లిపనులు మొదలుపెట్టాలి.

కళ్యాణ మండపం

పెళ్లి ఎక్కడ చేయాలన్నది పెద్దలు మొదట నిర్ణయించుకోవాలి.

వారికే గాక పెళ్లికొచ్చే అతిథులకు కూడా అనుకూలంగా వుండేట్లు చూడాలి. రాకపోకలకు ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం వుండాలి. లేదా పెళ్లి వారే ఏర్పాటు చెయ్యాలి.

'నిజ గృహంబు'లో అంటే కన్యాదాత ఇంట జరిపించడం శ్రేష్ఠం. వేదకాలంలో కన్యాదాత ఇంటనే వివాహం జరిగినట్టు అథర్వవేదంలో పేర్కొనబడింది.

అక్కడైతే వధువుకీ ఇతర ఆడవారికీ అనుకూలంగా వుంటుంది.

స్థానిక బంధుమిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. అప్పూ అరువూ లభిస్తాయి.

వివిధ సామాజిక వర్గాలకు చెందిన పురోహితుడు, చాకలి, మంగలి, కంసాలి, సాలి మొదలైన వారు అందుబాటులో వుంటారు.

ఇంటిదగ్గర కుదరని పక్షంలో కళ్యాణ మండపాల్లో చెయ్యవచ్చు. వాటినీ ముందుగానే బుక్ చేసుకోవాల్సి వుంటుంది.

మొక్కు వున్నవారు తిరుపతి, అన్నవరంలాంటి పుణ్యక్షేత్రాల్లో చెయ్యవచ్చు.

పురోహితుడు

హిందూవివాహం వేదోక్తంగా చేసే కర్మకాండ. పురోహితుడు లేకుండా పెళ్ళిచెయ్యటం కుదరదు.

వధూవరుల తరపున ఒక్కో పురోహితుడుండాలి.

ఒకే ముహార్తానికి అనేక పెళ్లిళ్ళు ఇతర కార్యక్రమాలూ జరుగుతూంటాయి. పురోహితులు చాలా బిజీగా వుంటారు.

ముందుగానే పురోహితుడ్ని ఏర్పాటు చేసుకోవాలి. అతడి ఫోన్‌నెంబర్ తీసుకుంటే అవసరమైనప్పుడు సంప్రదించవచ్చు.

పట్నాల్లో అయితే పురోహితుడికివ్వాల్సిన సంభావన గురించి ముందే ఒక మాట అనుకోవడం బెటర్.

వస్తు సామాగ్రి

పెళ్లికి కావాల్సిన సమస్త సామాగ్రి లిస్టుని పురోహితుడు రాసిస్తాడు. కొందరు ప్రింటు చేయించి మరీ ఇస్తున్నారు. దాని ప్రకారం అన్నీ సమకూర్చుకోవాలి.

ముఖ్యంగా పెళ్లి పీట. 6" ఎత్తు 37" పొడవు 5" వెడల్పు వుండాలని శాస్త్రం. కొత్తగా చేయించాల్సిన పనిలేదు. కొందరిళ్ళలో వుంటుంది. దానిని తెచ్చి శుద్ధిచేసి పసుపురాయించి బొట్లు పెట్టాలి.

పసుపు, కుంకుమ, నవధాన్యాలు, అక్షింతలకు బియ్యం, కాళ్ళు కడగటానికి పళ్ళెం, యజ్ఞోపవీతం, పూలదండలు, సనికెల, కొబ్బరి బోండాలు ఒకచోట – వీలైతే కొత్త తాటాకుల బుట్టలో సర్దుకోవాలి.

పుస్తెలు, పసుపు, దారం, వెండిచుట్లూ పిల్లేళ్ళు, ఆచారం వుంటే అరివేణి (రంగులు పూసిన కుండ) సిద్ధం చేసుకోవాలి.

వంటా వార్పూ

విందు రోజునే గాకుండా పెళ్లి కోసం వచ్చే బంధుమిత్రులకు రుచికరమైన భోజనం పెట్టేందుకు వంటవారిని కుదర్చుకోవాలి. వారు ఎన్ని రోజులుండాలో చెప్పాలి.

ఏయే వంటలూ పిండి వంటలూ చెయ్యాలో ముందుగానే చెప్పి అందుకు సరిపడా కిరాణా సరుకుల్నీ కాయగూరల్నీ సమకూర్చుకోవాలి.

అరటి ఆకులు లేదా ప్లాస్టిక్ ఆకులూ గ్లాసులూ వగైరాలతోబాటు వడ్డన చేసేవారినీ అరేంజ్ చేసుకోవాలి.

పదార్థాలు ఎంత బాగా కుదిరినా చక్కగా వడ్డించే వారు లేకపోతే అంతా నిష్ప్రయోజన మవుతుంది.

కేటరింగ్

ఫుడ్ కేటరింగ్‌కి ఆర్డరివ్వాలనుకున్నవారు కూడా ముందుగానే సరియైన వారిని ఎన్నుకోవాలి.

గతంలో తెలిసిన వారికి కేటరింగ్ చేసిన వారైతే మంచి చెడులు తెలుస్తాయి. కొత్తవారైతే వారి చేత ఈమధ్య కేటరింగ్ చేయించుకున్నవారి అభిప్రాయం కనుక్కున్నాక ఫైన్‌లైజ్ చేసుకోవాలి.

రుచికరంగా తయారుచెయ్యడమే కాదు సమయానికి రెడీ చెయ్యడం సంతృప్తికరంగా వడ్డించడమూ ముఖ్యమే.

ఏవేం కూరలు చెయ్యాలో స్వీటేంపెట్టాలో ఐస్‌క్రీం పెట్టాలో అక్కర్లేదో – మొత్తం మీక్కావాల్సిన మెనూ చెప్పండి. లేటెస్ట్ ఐటమ్స్ ఏమిటో కనుక్కుని ఐటమ్స్ లిస్టు తయారు చెయ్యండి.

వాటిని బట్టి ప్లేటుకి ధర ఎంతో మాట్లాడుకున్నాక ఆర్డరివ్వాలి.

వడ్డన పాత్రలేగాక ప్లేట్లు, గ్లాసులు, మినరల్ వాటర్, స్టాల్స్ వగైరాలు వారు తెస్తారో లేదో ముందుగానే తెలుసుకోవాలి.

ఒక్కసారి ప్లేటు తీసి కిందపెడితే చాలు దాన్ని ప్లేటు కింద జమకట్టి చార్జి చేస్తారు. కొందరు ప్లేట్ల లెక్కింపులో మోసం చేస్తారు. కొన్ని ఐటమ్స్ తక్కువగా అరేంజ్ చేసి త్వరగా అయిపోయాయని నాటక మాడతారు.

ఆ విషయాలు తెలిసిన ఒకరిద్దరికి పర్యవేక్షణ పని అప్పగిస్తే అతిథులు తృప్తిగా భోంచేస్తారు. బిల్లు బరువూ తగ్గుతుంది!

పూల మండపం



హిందూ వివాహం ఆరుబయట భూమిమీద జరగాలి. అంటే మండపంలో. బయట కుదరకపోతే లోపలే దాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

వివాహమండపం చతురస్రాకారంలో వుండాలి. నాలుగు స్తంభాలుండాలి. ఇంటికి ఈశాన్యంలో ఏర్పాటుచేయ్యాలి. పూలతో దేవుళ్ళ చిత్రాలతో అలంకరించాలి.

రెడీమేడ్ మండపాలు అద్దెకు లభిస్తున్నాయి. స్తోమతనుబట్టి పూలమండపం, ముత్యాల మండపం, విద్యుద్బల్బుల మండపం వగైరాలలో నచ్చినది ఎన్నుకోవచ్చు. మళ్ళీ వాటిని ప్రత్యేకంగా అలంకరింప జేయించవచ్చు.

కొందరు ప్రత్యేకంగా మండపం కట్టించి పూలతో అలంకరింపజేస్తున్నారు. ఇంకొందరింకో అడుగు ముందుకేసి సినిమా సెట్టింగులాంటి మండపం వేయించి ఇండోర్ ప్లాంట్స్ తెప్పించి మరీ డెకరెట్ చేయిస్తున్నారు.

లోకో భిన్న రుచిః!

భజంత్రీలు

భజంత్రీలు లేకపోతే పెళ్లిసందడే వుండదు.

సన్నాయిమేళం ఏర్పాటు చేస్తే సంప్రదాయబద్ధంగా వుంటుంది.

సన్నాయిరాగంలో డోలుధ్వనిలో మధురమైన ఆనందముంది. మనస్సుని రంజింపజేసే లక్షణముంది. వీటిని మంగళవాయిద్యాలంటారని గుర్తుంచుకోండి.

ఆధునిక సంగీతపు హోరుజోరు కోరుకునే వారు బ్యాండు మేళం ఏర్పాటు చేసుకోవచ్చు.

వివాహానికి సంగీతం తప్పనిసరిగా ఉండాలని వారాహ గృహ్యసూత్రంలో పేర్కొనడం గమనార్హం.

షామియానా కుర్చీలూ వీడియోలూ

పెళ్లి పందిట్లోకి లేదా ఫంక్షన్ హాలు లోకి కావాల్సిన కుర్చీలూ వగైరా కూడా ఆలస్యం చెయ్యకుండా బుక్ చేసుకోవాలి. ఆలస్యం చేస్తే వాటి కోసం ఊరంతా తిరగాల్సి రావచ్చు. రిసెప్షన్ కోసం రెండు ప్రత్యేక కుర్చీలు ఆర్డరివ్వడం మరచి పోవద్దు.

వాటితో బాటే ఫొటోగ్రాఫర్నీ వీడియో గ్రాఫర్నీ మాట్లాడుకోవాలి.

అద్భుతమైన ఘడియల్ని బంధించి అపురూపంగా దాచుకునేట్లు, చూసుకున్న ప్రతిసారీ మురిసిపోయేట్లు చేసేవి ఫోటోలూ వీడియో సీడీలే.

వీడియో వారితో మిక్సింగ్‌తో సహా ఎంతవుతుందో ముందుగా మాట్లాడుకోవాలి.

ఫోటోగ్రాఫర్తో ఎన్ని ఫోటోలు తీయాలో చెప్పి వాటికెంత అవుతుందో ముందుగానే అడిగి తెలుసుకోవడం మంచిది. డిజిటల్ ఫోటోలైతే షీటు రేటు ఎంతో మాట్లాడుకుని బడ్జెట్ అంచనా వేసుకోవాలి.

వినోద కార్యక్రమం

రిసెప్షన్ సమయంలో వినోద కార్యక్రమం ఏర్పాటు చేస్తే బావుంటుంది.

శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, భరతనాట్యం, పాటల కార్యక్రమం, హాస్యకదంబం, మిమిక్రీ, కవితాగోష్ఠి - అభిరుచి మేరకు అరేంజ్ చేసుకోవచ్చు.

ఆహుతుల్ని అలరించడానికిది ఎంతగానో తోడ్పడుతుంది.

ట్రాన్సుపోర్టు కోసం

ఇంటికీ పెళ్లిప్రదేశానికీ దూరం ఎక్కువ వుంటే పెళ్లికూతుర్ని తీసుకెళ్ళడానికి, సామాగ్రి చేర్చడానికి, బంధువుల్ని అటు ఇటు చేరవేయడానికి చిన్నకారు లేక సుమో లేక రెండూ ఏర్పాటు చేసుకుంటే సౌకర్యంగా వుంటుంది.

తాంబూలం మరువ వద్దు

శుభలేఖలో వివాహాని కొచ్చి 'మదర్పిత చందన తాంబూల సత్కారం గైకొని' వెళ్ళాల్సిందిగా పూర్వం పేర్కొనేవారు.

ఇప్పుడు శుభలేఖల్లో మార్పు వచ్చినప్పటికీ తాంబూలం ఇచ్చి పంపటం సంప్రదాయం. ఒట్టి తాంబూలం ఇవ్వకూడదు గనుక అరటిపళ్ళో మరో పండ్లో పెట్టి ఇవ్వాలి. ఆడవారికి రవికెల గుడ్డ ఇచ్చి బొట్టుపెట్టడం రివాజు.

కొందరు వివిధ గిఫ్టులిస్తున్నారు. వెండి కుంకుమ భరిణెలు ఇస్తున్నవారూ లేకపోలేదు.

వారి వారి స్తోమతను బట్టి గిఫ్టు లివ్వవచ్చు.

కాని వాటితో బాటు తాంబూలం పండ్లూ ఇవ్వడం మరచిపోవద్దు. మానవద్దు!

సరదాల హడావిడి

పెళ్లి ఊరేగింపులో ముహూర్త సమయాన ధూం ధాం అంటూ హడావిడి చేసే బాణాసంచాని మరువ వద్దు.

అలాగే పెళ్లాయ్యాక తలంబ్రాల సమయంలో మండపంలో పూలవాన, నురగల వర్షం కురిపించే రకరకాల స్ప్రేలూ, తలంబ్రాలుగా పోసుకోడానికి రంగు రంగుల పూసలూ అవీ ఎన్నో ఎన్నో వస్తున్నాయి.

సరదాల సందడి కోసం అలాటివి ఖరీదు చెయ్యవచ్చు. పెళ్లిపందిరిలో రంగుల అందాలని విరజిమ్మ వచ్చు. ఏకంగా హరివిల్లునే మండపంలో కట్టేయనూవచ్చు!

20

అందాలూ ఆభరణాలూ

వివాహం అనేది ఎవరికైనా సరే జీవితంలో మరపురాని మధురమైన ఘట్టం.

పెళ్లికి ఎన్నివేల మంది వచ్చినా సరే వధూవరులు చుక్కల్లో చంద్రుళ్ళలా వెలిగిపోవాలి. లైమ్‌లైట్‌లో వారు మాత్రమే ఉండాలి.

అందుకు దోహదపడేవి ప్రత్యేక అలంకరణలూ ఖరీదైన చీరలూ ధగధగ మెరిసే ఆభరణాలూ ఆపైన సిగ్గులూ ముసిముసి నవ్వులూ అనుభూతులూ ఆనందాలూనూ!

చక్కని అలంకరణ ప్రత్యేకమైన డ్రెస్‌లు ఆకర్షింపజేస్తాయి. హుందాతనాన్ని పెంచుతాయి. ఆత్మస్థైర్యం ఇనుమడింపజేస్తాయి. ఆనందపు తేరు మీద తేలియాడేలా చేస్తాయి!

పట్టుచీరలు



మిగతాప్పుడు జీన్సూ చుడీదార్లూ ధరించినా పెళ్లిలో మాత్రం సంప్రదాయ దుస్తుల్ని ధరించడానికే నేటికీ అమ్మాయిలు ఇష్టపడుతున్నారు.

నిజానికి పెళ్లనగానే మొదట గుర్తొచ్చేవి పట్టు చీరలు ధరించి హడావిడిగా కలతిరిగే ఆడవాళ్ళే.

పెళ్లికి కనీసం రెండు పట్టు చీరలైనా పెళ్లి కూతురు కొనిపించుకుంటే ఒక్కటైనా కొనుక్కుంటారు దగ్గరి బంధువులు.

పట్టు చీరలకు పెట్టింది పేరు కంచి. పెళ్లి కుదరగానే తిన్నగా కాంచీపురం (కంచి) వెళ్లి పట్టుచీరల్ని కొనుక్కొచ్చేవారూ లేకపోలేదు.

వేలాది రూపాయల్తో కొనే పట్టు చీరల్ని జాగ్రత్తగా ఎన్నిక చేసుకోవాలి. చీరల గురించి తెలిసిన వారిని వెంట తీసుకెళ్ళడం మంచిది.

ఎన్నో డిజైన్లు మరెన్నో రంగుల ఫ్యాషన్లతో నేస్తున్నారు. నలభై వేల రంగులు కలబోసి నేశామంటూ ఒక ప్రకటనలో ప్రముఖ సినీ నటి ఒక చీరని ప్రదర్శించడం టీవీలో చూసే ఉంటారు.

కంచి చీరలు ఎంతకాలమైనా వన్నె తగ్గకపోవడానికి ప్రధాన కారణం వెండి బంగారు జరీ లేక ప్యూర్ జరీ. చీర ధర నిర్ణయించేది ఈ జరీ పోగులే.

తక్కువ రకం జరీ త్వరగా ముడుచుకుపోతుంది. గుచ్చుకుంటుంది. నల్ల బడుతుంది. జరీని పలకమీద రాస్తే గీత తెల్లగా ఉంటే బంగారు జరీగానూ, ఎర్రగా ఉంటే రాగి జరీగానూ గుర్తించవచ్చు.

పెళ్లయ్యాక ప్రతి శుభకార్యానికీ వ్రతాలకీ పట్టు చీరలే ధరిస్తారు. గనుక చాలా ఏళ్ళ వరకూ చెక్కు చెదరకుండా ఉండాలి. అంచేత రాజీ పడకుండా నాణ్యమైన పట్టు చీరల్నే కొనుగోలు చేయాలి.

బంగారు ఆభరణాలు



ఆడవారికీ ఆభరణాలకీ విడదీయలేని సంబంధం ఉంది.

పెళ్లికి ముందు ఎన్ని ఆభరణాలున్నా గానీ పెళ్లికి కొత్త ఆభరణాలు కొనటం పరిపాటి. వధువుకోసం ఆమె కుటుంబీకులే కాదు వరుడి కుటుంబీకులు సైతం నగలు కొని బహూకరిస్తూంటారు.

ఆభరణాలు అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. బంగారు బొమ్మగా మారుస్తాయి.

అంతేగాక సంప్రదాయాన్నీ హోదానీ భద్రతనీ ప్రతిబింబిస్తాయి ఆభరణాలు.

బ్రైడల్ వేర్ పేరిట ప్రత్యేక ఆభరణాల సెట్ కూడా మార్కెట్లో లభ్యమవుతున్నాయంటే వాటి ప్రత్యేకత వాటి మీద గల మోజు తెలుసుకోవచ్చు.

నగలని ప్రముఖ దుకాణాల్లో కొనటం మంచిది. రకరకాల డిజైన్లలో లభించడమే గాక మార్చుకొన్నప్పుడు బంగారానికి మార్కెట్‌రేటు లభిస్తుంది. హాల్ మార్కు గల ఆభరణాలు కొనుగోలు చేయటం అన్ని విధాలా శ్రేయస్కరం.

రాళ్ళ నగలు కొనేప్పుడు ప్రత్యేక జాగ్రత్త అవసరం.

అతికి గొప్పలకి పోకుండా తమ బడ్జెట్‌కు లోబడి బంగారు నగల్ని కొనాలి. వీలు కానిచో పాతవి మార్చి కొత్త ఫాషన్‌వి సరికొత్త డిజైన్‌వి కొనుక్కోవచ్చు.

బంగారానికన్నా ఖరీదైన ప్లాటినం నగలు ఇప్పుడిప్పుడే జనాన్ని ఆకట్టుకుంటున్నాయి!

అందాల బొమ్మగా వధువు



పెళ్లి పీటల మీద కూర్చునేప్పుడు మరింత అందంగా, పుష్టిగా, ఆకర్షణీయంగా కన్పించాలంటే ముందు నుంచే జాగ్రత్త అవసరం.

ఆరోగ్యం గురించి అధిక శ్రద్ధ ఎప్పుడూ అవసరమే అయినా పెళ్లి సమయంలో మరీ అవసరం. అందంగా ఆరోగ్యంగా కళకళలాడుతూ ఉంటే 'అందమే ఆనందం' అన్పిస్తుంది.

ఆహారంలో ఆకుకూరలు, పండ్లు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. నీళ్ళు ఎక్కువ త్రాగాలి. నూనె పదార్థాలు తగ్గించాలి. వాకింగ్, ఎక్సర్ సైజులు, యోగా చేస్తే చర్మం వదులవదు పైగా నిగనిగలాడుతుంది.

మొహం మీద మొటిమలు, మచ్చలు లాంటి ఉంటే బ్యూటీ పార్లర్‌లో ట్రీట్‌మెంట్ చేయించుకోవాలి. ముఖవర్చస్సు పెరిగేలా తీర్చిదిద్దుతున్నారు కూడా.

చేతులపైనా కాళ్ళపైనా ఉండే రోమాలు తొలగించడానికి షేవింగ్ చేయవద్దు. అలాచేస్తే కుదుళ్ళు గట్టిపడి రఫ్‌గా మారతాయి. వాక్సింగ్ చేయించడం మంచిది. క్రీములు వాడితే చర్మం నల్లబడే ప్రమాదముంది.

అబ్బాయిలకూ ఫేసియల్స్

వరులకు కూడా బ్యూటీ కాన్షస్‌నెస్ బాగా పెరిగింది.

ముచ్చటగా కన్పించాలని ముచ్చట పడుతున్నారు. డ్రెస్ విషయంలోనే గాక సౌందర్యం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఫేసియల్స్ వల్ల ముఖం కాంతివంతమై మెరిసిపోతుంది. మరీ పెళ్లికి ముందు రోజున గాక నెలకి ముందోసారి, మధ్యలో మరోసారి, పెళ్లికి రెండు మూడు రోజులకింకోసారి చేయించుకోవాలి. ఫలితం అద్భుతంగా ఉంటుంది. అక్షరాలా మెరిసిపోతారు.

చర్మతత్వాన్ని బట్టి ఫేసియల్స్‌లో ఎన్నో రకాలున్నాయి. పొడి, జిడ్డు, సాధారణ చర్మాలకు ఒకోదానికీ ఒకో రకంగా చేస్తారు.

మర్దన వల్ల మూసుకున్న చర్మ రంధ్రాలు తెరచుకుని రక్త ప్రసరణ పెరుగుతుంది. శరీరం కాంతివంతమవుతుంది.

సంప్రదాయ సౌందర్య సాధనాలు

పెళ్లి కూతుర్ని చేసేప్పుడు ఒంటికి నూనెరాసి పసుపు పూస్తారు. పసుపు యాంటి బయోటిక్‌గా పనిచేసి శరీరానికి రక్షణనిస్తుంది. పిండితో నలుగు పెట్టడం వల్ల మేనికి మెరుపు వస్తుంది.

గంధం, కుంకుమ పువ్వు లేపనం పూయడం సౌందర్య పోషణకే.

తలస్నానం చలువ చేస్తుంది. శరీరం తేలికవుతుంది. అందాన్ని పెంచేది తలకట్టే. నల్లని ఒత్తయిన జట్టు – పొడుగాటి జట్టు అందం చెప్పనలవి కాదు. జట్టున్నామె ఎన్ని కొప్పులైనా పెడుతుందన్నది సామెతే కాదు నిజం కూడా.

నలుగుపిండి పెట్టుకుని స్నానం చేస్తే చర్మంపై ఉండే మృతకణాలు తొలగి చర్మం ప్రకాశవంతమవుతుంది.

కాటుక వల్ల ముఖానికి కళవస్తుంది. కళ్ళకు చలువ చేయటమే కాదు కళ్ళు కాస్త పెద్దవిగా కన్పిస్తాయి.

కనుబొమల మధ్య పెట్టుకునే కుంకుమ బొట్టు అందాన్ని ద్విగుణీకృతం చేసే సంప్రదాయ చిహ్నం. ఆ ప్రదేశానికీ తల వెనుక నుండే పిట్యూటరీ గ్రంథికీ సంబంధం ఉంది. కంప్యూటర్ చిప్‌లా బొట్టు పని చేస్తూ మెదడుకి చురుకైన శక్తినిస్తుంది.

వధూవరులకు శోభనిచ్చేది కళ్యాణ తిలకమే.

ఎడమ బుగ్గపై పెట్టే దిష్టి చుక్క దుష్టశక్తులదృష్టి నుంచి కాపాడుతుందని నమ్మకం.

కురులకు సాంబ్రాణి కర్పూరాలతో పొగవేయటం వల్ల కేశాల తడి ఆరుతుంది. సువాసనలద్దుకుంటాయి.

తలలో ముడుచుకునే పూలు, మొగలి పూరేకుల జడలు సువాసనల్ని వెదజల్లుతాయి. మనస్సుని ఆహ్లాద పరుస్తాయి. మత్తు జల్లుతాయి.

తాంబూల సేవనం పెదాలని ఎర్రబరిచి దొండ పండుల్ని చేస్తాయి. అందాన్ని పెంచుతాయి. జీర్ణశక్తిని అధికం చెయ్యడమేగాక శృంగార భావనలు రేకెత్తిస్తాయి.

ఇంద్రధనుస్సు గాజులు

స్త్రీలు ధరించే రంగురంగుల గాజులు వారి అందానికి వన్నె తెస్తాయి.

వారి చేతులు కదిలినప్పుడల్లా అవి చేసే సున్నిత శబ్దాలు మనస్సుని రంజింపచేస్తాయి.

ఇంద్ర ధనుస్సులోని రంగుల్ని నింపుకునే గాజులు కళ్ళకి ఆహ్లాదం కలిగిస్తాయి.

జీవనాడి మణికట్టు ద్వారా పోతుంది. అక్కడ పట్టుకునే నాడీ వ్యవస్థ పనితీరుని పరిశీలిస్తారు డాక్టర్లు.

ఆ నాడికి కొద్దిపాటి ఒత్తిడి కలిగిస్తూ రక్త ప్రసరణనీ తద్వారా హృదయ స్పందననీ నియంత్రించవచ్చు. అంచేతే మహిళలు విధిగా గాజులు ధరించాలంటాయి వైద్యగ్రంథాలు.

చేతులకు రంగులు

అమ్మాయి ఒకింటికి గృహిణిగా మారబోతుందనడానికి చిహ్నంగా ఆమె చేతులకు పసుపు రాస్తారు. ఇది సృష్టి కార్యానికి చిహ్నంగా భావిస్తారు.

వివాహానంతరం ఆమె తల్లి అవడం, పిల్లల్ని పెంచడం లాంటి బాధ్యతల్ని నిర్వర్తించాల్సి ఉంది. అంటే ఆమె చేతులు ప్రత్యేకత సంతరించుకోబోతున్నాయని సింబాలిక్‌గా చెప్పడమన్న మాట.

అదీ గాక పసుపు సృష్టికీ వృద్ధికీ అధినేత అయిన లక్ష్మీదేవి చిహ్నం.

పెళ్లి కూతుర్ని చేసినప్పుడు పసుపు రాసినా తర్వాత మెహందీని పెట్టించుకుంటున్నారు. బజార్లో లభ్యమవుతున్న మెహందీ కోన్ లతో చేతుల మీద చక్కని డిజైన్ వేయించుకోవచ్చు. గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యవంతమైన దాంపత్య జీవితానికి సంకేతం.

మెహందీ పెట్టించుకునే ముందు చేతులకు కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్ రాసుకుంటే ఎర్రగా ఉంటుంది. త్వరగా పోదు కూడా.

గోళ్ళకి నెయిల్ పాలిష్ వేసుకోవడం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

సింపుల్ మేకప్

బ్యూటీసియన్ చేత పెళ్లి మేకప్ చేయించుకునే వారు 'అతి'కి పోకూడదు. సాధ్యమైనంత సింపుల్‌గా శరీర వర్ణంలో కలిసిపోయే లాంటి మేకప్ చేయించుకోవాలి.

మొదట ముఖాన్ని ఐస్‌క్యూబ్‌తో మర్దనా చేసుకున్నట్టయితే త్వరగా చెమట పట్టదు. వివిధ రకాల ఫౌండేషన్ షేడ్స్‌లో చర్మపు రంగుకు సరిపోయే రంగుని ఎన్నిక చేసుకుని వేసుకోవాలి.

కంటి రెప్ప పైన ఐ లైనర్ వేసుకోవాలి. గోధుమ రంగు బెటర్.

లిప్ స్టిక్ వేసుకునేప్పుడు మొదట ఔటర్‌లైన్ గీసుకున్నాక పెదాలకు రాయాలి. బ్రష్‌తో చేస్తే నీట్‌గా వస్తుంది.

వీటన్నిటికన్నా అసలు సిసలు అందాన్ని తెచ్చి పెట్టేది పెళ్లి కళ.

పెళ్లి భావనతో మనస్సులోంచి పెల్లుబికే ఆనందం, మొగ్గతొడిగే సిగ్గులు, కించిత్తు గర్వం తృప్తీ కలగలిసిన దరహాసం పెళ్లి కూతుర్ని సౌందర్య మూర్తిగా నిలుపుతాయి!

21

శ్రీరస్తు

భారతీయ సంస్కృతిలో వివాహానికి సమున్నతమైన సముదాత్తమైన పవిత్రమైన స్థానం వుంది.

పాశ్చాత్య దేశాల్లోలా అది కొన్ని నిమిషాల గంటల వ్యవహారం కాదు.

కొన్ని రోజుల పాటు సాగే హిందూ వివాహంలో ఎన్నో ఘట్టాలున్నాయి. ప్రతిదానికీ ఓ ప్రత్యేకత ఓ అర్థం ఓ పరమార్థం వున్నాయి.

ప్రేమ, విధేయత, అంకితభావం, సమాగమ భావన మొదలైనవి పంచుకునే వైవాహిక జీవితానికి వధూవరులను సన్నద్ధం చేస్తాయి.

ఆ దిశగా వారిని మానసికంగా దగ్గర చేర్చేందుకు ఏర్పాటు చేసినవే వివిధ ఆచారాలు! వివాహ సన్నాహం గురించి ఈ 'శ్రీరస్తు'లో చూద్దాం.

శ్రీరస్తు అంటే మంగళమగు గాక అని అర్థం. అందుకే శుభలేఖలో అగ్రభాగాన ఉంటుందీ పదం.

పెళ్లికుమార్తెను చేయుట



పెళ్లికి ముందు తిథి వార నక్షత్రాలను బట్టి పెళ్లికుమార్తెను చేయుటకు సమయం నిర్ణయిస్తారు. పురోహితునిచే ఈ కార్యక్రమానిక్కూడా ముహూర్తం పెట్టిస్తారు.

దీనిని కూడా ఒక వేడుకగా చేస్తారు. సాధారణంగా మేనమావ ఇంట చేస్తారు. లేదా దగ్గరి బంధువుల ఇంట చేస్తారు. కుదరనప్పుడు కన్యాదాత ఇంట చేస్తారు.

కుమార్తెను పీట మీద తూర్పు ముఖంగా కూర్చోబెడతారు.

బంధుమిత్రుల్నీ ఇరుగుపొరుగు వారినీ పిలిచి మంగళవాయిద్యాలు మ్రోగుతూండగా పెళ్లి కూతురును చేస్తారు. ముత్తైదువలూ పెద్దలూ అక్షింతలేసి ఆశీర్వదిస్తారు.

ఆమెతో బాటు వరసైన చిన్న అమ్మాయిని తోడిపెళ్లికూతురుగా కూర్చోబెడతారు.

పెళ్లికూతురితో సమానంగా ఆమె పైనకూడా అక్షింతలేసి ఆశీర్వదిస్తారు.

తలస్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. కళ్యాణం బొట్టు, బుగ్గనచుక్క పెడతారు.

వరుడ్ని పెళ్లికొడుకుని చేశాకే వధువును పెళ్లికూతుర్ని చేస్తారు. రెంటికీ కొన్ని నిమిషాల వ్యవధి ఉన్నా సరిపోతుంది.

పెళ్లికూతుర్ని చేశాక ఆమెని ఎలాంటి పనీ చెయ్యనివ్వరు. ఊరుదాటి వెళ్ళనివ్వరు. రేపటి వైవాహిక జీవితం గురించాలోచిస్తూ పెళ్లిపనులు గమనిస్తూండమని చెప్పక చెబుతారు.

పెళ్లికుమారుని చేయుట

పెళ్లికూతుర్ని చేసినట్టే పెళ్లికొడుకుని మేనమావ ఇంట లేదా స్వగృహంలో చేస్తారు.

బావమరిది వరుసగు పిల్లవాడిని తోడిపెళ్లి కొడుకుగా ఎడమవైపు కూర్చోబెడతారు.

మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా పెద్దలంతా అక్షింతలు వేసి దీవిస్తారు.

పెళ్ళయ్యేవరకూ పెళ్లికొడుకుని పనీ పాటా చెయ్యనివ్వరు. భావిజీవితం గురించి మధురోహలల్లుకుంటూ విశ్రాంతిగా గడపమంటారు.

తిలకము దిద్దరుగా

పెళ్లికూతురు/పెళ్లికొడుకుని చేశాక వారి నుదుట కళ్యాణతిలకం దిద్దుతారు.

ప్రత్యేకంగా వుండే ఆ బొట్టు వివాహ సూచకంగా భావిస్తారు.

బుగ్గన కాటుకతో చుక్క పెడతారు. ఎలాంటి దిష్టీ తగలకుండా వుండేందుకు పెడతారు గనుక దాన్ని దిష్టిచుక్క అని కూడా అంటారు.

కొత్త దుస్తులు, బుగ్గన చుక్క, నుదుట కళ్యాణతిలకంతో వధూవరులకు పెళ్లి కళ వచ్చేస్తుంది.

సిగ్గులూ ముసిముసి నవ్వులూ మొదలవుతాయి.

బంధువుల ఇంట భోజనాలు

పెళ్లికొడుకు/పెళ్లికూతురు చేసింది లగాయితు వరుడు గాని వధువు గాని సాధారణంగా వారి ఇంట భోజనం చెయ్యరు.

చెయ్యకూడదని కాదు. ఆ అవసరం పడకుండా ఊళ్ళోని బంధుమిత్రులు పూటకొకరు చొప్పున భోజనానికి పిలుస్తారు.

భోజనం పెట్టి పెళ్లి గురించి వైవాహిక జీవితం గురించి నాలుగు మంచి మాటలూ ముందు జాగ్రత్తలూ చెబుతారు. తమ అనుభవాన్ని కాబోయే కొత్తదంపతుల శ్రేయస్సు కోరి వివరిస్తారు. ఎవర్తో ఎలా మసలాలో హిత బోధచేస్తారు.

పిమ్మట నూతనవస్త్రాలో బహుమతో పండ్లో ఇచ్చి సాగనంపుతారు.

ఈ ఆచారం రాను రాను పల్లెల్లో సైతం కనుమరుగవుతోంది.

రక్షాబంధనం

తెల్లదారాన్ని తొమ్మిది వరుసలుగా తీసుకొని పసుపు రాసి మామిడాకును మడిచిచుట్టి తోరం తయారుచేస్తారు.

దానినే రక్షాబంధన కంకణం అంటారు.

గంధం, ధూపం, పువ్వులు, అక్షింతలు వేసి పూజించాక వరునికైతే కుడిచేతికీ వధువుకేమో ఎడమచేతికీ రక్షాబంధనం కడతారు. పెళ్లికి వెళ్ళేముందు ఇష్టదేవతా పూజ చేశాక ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

వధూవరుల తల్లిదండ్రులక్కూడా కడతారు.

ఆ కంకణాలు కార్యదీక్ష స్వీకారానికి ప్రతీకలు. ఇవి రక్షాకవచంగా పనిచేస్తాయి. పురుడు, మైల సోకకుండా చేస్తాయి.

కాళ్ళగోళ్ళు తీయుట

పెళ్లిరోజున గాని పెళ్లికి ముందురోజున గాని వధూవరులకు కాలిగోళ్ళు తీసే కార్యక్రమం జరుపుతారు.

బంధుమిత్రుల్ని పిలిచి బాజాభజంత్రీలు మ్రోగుతూండగా వధువుని/వరుడుని పీటమీద కూర్చోబెట్టి మంగలి చేత కాలిగోళ్ళూ చేతిగోళ్ళూ తీయిస్తారు.

అక్షింతల్ని దక్షిణతోబాటు చేతిలో పట్టుకుని దిష్టితీస్తారు. అక్షింతల్ని వధువు లేక వరుడి మీద వేసి దక్షిణని నీటి గిన్నెలో వేస్తారు.

ఆ దక్షిణా అప్పుడు వధువు లేక వరుడు ధరించిన వస్త్రాలూ ఇంటి మంగలికి చెందుతాయి.

గోళ్ళు తీయుట ఆరోగ్య సంబంధిత విషయమే కాదు. బ్రహ్మ చర్యదీక్షకు స్వస్తి చెబుతూ దాంపత్య జీవితంలోకి అడుగుపెడుతున్నందున ఆ వైపుగా వేస్తున్న తొలి అడుగు కూడానూ.

అదీగాక నమ్ముకున్న సామాజిక వర్గానికి గుర్తింపునిస్తూ తగిన విధంగా ఆదరించడమూ ఇందులో వుంది.

బాసిక ధారణ



సాధారణంగా కళ్యాణానికి తరలి వెళ్ళబోయేముందు బాసికం కడతారు. కొందరు పెండ్లికొడుకు లేక పెండ్లికూతుర్ని చేసినప్పుడే కట్టేస్తారు.


బాసికాన్ని త్రిభుజాకారం లేదా చతురస్రాకారంలో తయారుచేసి వధూవరుల నుదుట కడతారు. నీరు పసుపు సున్నం మిశ్రమాన్ని బాసికానికి రాసి పసుపు దారంతో నుదుటికి కడతారు. దీన్ని చందన ధారణ అని కూడా అంటారు.

ముఖానికి శోభ కలిగించడమే గాక దృష్టి దోష నివారణకూ ఉపయోగిస్తుంది.

పైగా భ్రూమధ్యంలో ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు ప్రధాన నాడులుంటాయి. అవి కలిసే స్థానాన్ని ఆజ్ఞా చక్రస్థానమనీ దివ్యదృష్టి నిచ్చే చక్షువు అనీ అంటారు.

అలాంటి సున్నితభాగంపై 'నర దృష్టి' పడకుండా తగిన జాగ్రత్తకోసం ఈ ఏర్పాటని కొందరి అభిప్రాయం.

ఇష్టదేవతా పూజ



పెళ్లిరోజు ఉదయం గాని పెళ్లికి తరలివెళ్ళేరోజు ఉదయం గాని అటు వరుని ఇంట్లోనూ ఇటు వధువు ఇంట్లోనూ ఇష్టదేవతా పూజ చేస్తారు.

మొదట గణపతి పూజ చేసి తర్వాత తమ కులదైవం లేదా ఇష్టదేవత పూజ చెయ్యాలి. వధువు గౌరీపూజ కూడా చెయ్యాలి. దాని వలన కన్యను ఆశ్రయించి వున్న దేవి ప్రసన్నురాలై సర్వశుభాలను కలుగజేస్తుంది. దీర్ఘ సుమంగళీత్వాన్ని ప్రసాదిస్తుంది.

పూజ సమయంలో పెద్ద ప్రమిద లేదా మట్టిమూకుడులో నూనెపోసి పెద్దవత్తువేసి అఖండదీపం వెలిగించాలి. దీన్నే వేంకటేశ్వర దీపం అంటారు. పెళ్లయ్యాక తిరిగి ఇంటికొచ్చేవరకూ ఈ దీపం వెలుగుతూనే వుండాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

పూజానంతరం పెద్దల ముత్తైదువల ఆశీర్వాదాలు పొందాలి.

రక్షాబంధనం కట్టుకోవాలి.

బాసికమూ కట్టాలి.

ఇవి పూర్తవడంతోనే వధూవరులు పెళ్లిమండపంలో ప్రవేశించి వివాహ కార్యక్రమంలో పాల్గోవచ్చు.

వివాహంలో ముఖ్యాంశాలు

హిందు వివాహంలో ఎన్నో అంశాలున్నాయి. విశేషాలున్నాయి. ప్రాంత కులాలని బట్టి కొన్ని మార్పులూ మినహాయింపులూ వున్నప్పటికీ అన్ని అంశాల గురించీ తెలుసుకోవటం అవసరం.

1. స్నాతకం
2. కాశీయాత్ర
3. వరపూజ – ఎదుర్కోళ్ళు
4. గౌరీపూజ
5. వధూవరుల మంగళస్నానాలు
6. కన్యావరణం
7. మధుపర్కాలు
8. యజ్ఞోపవీత ధారణ

9. మహాసంకల్పం
10. వరుడి కాళ్ళు కడుగుట
11. కన్యా దానం
12. జీలకఱ్ఱ –బెల్లం పెట్టుట
13. స్వర్ణజలాభి మంత్రణం
14. యోక్త్రబంధనం
15. మంగళసూత్ర ధారణ
16. తలంబ్రాలు
17. బ్రహ్మముడి
18. ఉంగరాలు తీయుట
19. సప్తపది, పాణిగ్రహణం
20. ప్రధానహోమం
21. కాళ్ళు తొక్కించుట
22. సన్నికల్లు తొక్కుట
23. లాజహోమం
24. స్థాలీపాకం
25. నాగవల్లి
26. సదస్యం
27. నల్లపూసలు కట్టుట
28. అరుంధతీ దర్శనం
29. ఉయ్యాల–బొమ్మని అప్పజెప్పుట
30. అంపకాలు
31. గృహప్రవేశం– సత్యనారాయణ స్వామి వ్రతం

32. కంకణ విమోచనం

33. గర్భాధానం

వివాహకాండతో సంబంధం లేకపోయినా పెళ్లితో ముడిపడ్డ మరి మూడు అంశాలున్నాయి. అవి -

1. వివాహభోజనం

2. వధూవరులకు బహుమతులివ్వడం

3. అతిథులకు తాంబూల సత్కారం

పెళ్లిని వారి వారి అభిలాష, హోదా, సంపద, కులాచారాలను బట్టి 3 లేక 5 రోజులు చేస్తూంటారు. భాష, వస్త్రధారణలో తేడాలున్నప్పటికీ కులప్రాంతీయ భేదాలున్నప్పటికీ హిందూ వివాహంలో ముఖ్యమైన ఘట్టాల్లో మాత్రం తేడా లేదని చెప్పాలి. కాదంటే కొన్ని చోట్ల కొన్ని అంశాలని వివరంగా జరపించకుండా జరిపించినట్టుగా మంత్రాల్లో చెప్పేస్తారు పురోహితులు.

వివాహకాండలోని వివిధ అంశాలనీ అప్పుడు చదివే మంత్రాల అర్థాలనీ ప్రతీవారూ తెలుసుకోవాలి. అప్పుడే హిందూ సంస్కృతి యొక్క ప్రత్యేకత, వివాహానికి ఇచ్చిన విశిష్టత, వివాహం ద్వారా ఆశిస్తున్న సామాజిక కళ్యాణం అవగతమవుతాయి.



22

వివాహ కార్యక్రమం

ప్రాచీన ఆర్ష సంప్రదాయంలో వివాహం భౌతికమైన క్రియా కలాపం కాదు. వేద విహితమైన శిష్టాచారం.

ఋషి పుంగవులు మానవ జీవితంలో వివాహాన్ని మహత్తర సంస్కారంగా రూపొందించారు.

మానవజీవితానికి ప్రధానమైన అర్థకామాలను ధర్మ బద్ధంగా రూపొందించుకొనడమే వివాహవ్యవస్థ యొక్క పరమార్థం. దాని వల్లనే మానవులకు మోక్షం ప్రాప్తిస్తుంది.

వివాహంలో జరిగే ప్రతిపనికీ ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ చెప్పే మంత్రాలు వధూవరులిద్దరూ పెద్దల ముందు తీసుకుంటున్న నిర్ణయాలు.

వివాహానికి సంబంధించిన సమగ్ర స్వరూపం వధూవరులకు తెలియజేయాలి. అప్పుడే వారు జీవితాల్లో వేసే ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయగల్గుతారు.

ఆ దిశగా వధూవరుల్ని సన్నద్ధం చేస్తూ బోధిస్తూ ప్రేరేపిస్తూ హెచ్చరిస్తూ సాగుతాయి వివాహకాండలోని వివిధాంశాలు.

మంత్రాక్షరాలు

అక్షరాలు శక్తి స్వరూపాలు. మంత్రాలు మహత్తు కలిగిన శబ్దాలు. పైగా **'దైవం మంత్రాధీనం'** అన్నారు.

మంత్రోక్తంగా జరుగుతుంది హిందూవివాహం.

మంత్రాలు ట్రాష్ అనే వారున్నారు. అందులో ఏమున్నాయో తెలుసుకోకుండా విమర్శించే వారున్నారు. మళ్ళీ వారిలో కొందరు తమ పిల్లల పెళ్లిళ్ళని మంత్ర సహితంగా సంప్రదాయ పద్ధతిలో చేసిన వారూ వున్నారు.

ఎవరి నమ్మకం వారిది. ఎవరి విజ్ఞత వారిది.

పదే పదే జపించి తన్మూలంగా ఉన్నతి పెంపొందింపజేసేదే మంత్రం.

మంత్రాలు అర్థమైనా కాకపోయినా వేదవాక్కుగా జీవితసాఫల్యాన్ని చేకూర్చే ఉపదేశాలుగా భావించి గౌరవించే వారూ వున్నారు. సమస్త ధర్మాలకూ మూలమైనది వేదం అని వారి విశ్వాసం.

వేద శ్లోకాలన్నీ మంత్రాలుగా పరిగణింపబడుతున్నాయి.

కొన్ని అక్షరాల కలయికతో రూపొందిన 'పొగడ్త' 'తిట్టు' 'అనునయం' 'విమర్శ' ల ప్రభావం మన మీదెంత వుంటుందో మనకి తెలుసు.

మాటలే మంత్రాల్లా అమృత పూతల్లా పని చేస్తాయి.

మాటలే గొడ్డలిపెట్టులై కోపాన్నీ విద్వేషాన్నీ రగిలిస్తాయి.

అంతేకాదు. మంత్రోచ్చాటన వల్ల దైవికశక్తులు వధూవరులకు మానసిక స్థైర్యాన్నీ శక్తినీ భరోసానీ ఇస్తాయి. కొత్త భాధ్యతల్ని సంతోషంగా నిర్వర్తించేందుకు సంసిద్ధం చేస్తాయి.

పెళ్లి మంత్రాలు సంస్కృతంలో వున్నందున వాటి భావాల లోతుల్లోకి వెళ్ళ లేక పోతున్నాం. వాటిల్లోని నిక్షేపాల అర్థం గ్రహించలేక పోతున్నాం. వాటిని తెలుసుకోవాడానికి ప్రయత్నించాలి. తెలుగులోకి అనువదించి చెప్పించాలి.

స్వస్తి

సర్వజీవ శుభాన్ని కాంక్షించడం వైదిక సంస్కృతిలోని ముఖ్యాంశం.

ప్రకృతి శక్తులు, వాటిని అధిష్ఠించి నిర్వహించే దేవతలు, కాలరూపంలో వున్న దైవం – మేలు చెయ్యాలన్న ఆకాంక్ష వేదమంత్రాల్లో శక్తిమంతంగా కన్పిస్తుంది.

యజ్ఞయాగాలు ధ్యానదీక్షలు పూజాస్తోత్రాలు – అన్నీ శుభసంకల్పంతో చేసేవే.

సు+అస్తి = స్వస్తి. స్వస్తి అంటే మేలైన ఉనికి లేదా స్థితి.

దాన, అహింస, జ్ఞాన గుణాలే స్వస్తి గుణాలు.

ఉత్తర భారతదేశంలో ప్రతి శుభకార్యంలోనూ సింధూరంతో పసుపుతో స్వస్తిక్ పద్మం వేస్తారు.

స్వస్తిక్ చిహ్నం 卐 ఇది ఓంకారానికి రేఖారూపం!

ప్రపంచానికి ఓంకార శబ్దాన్ని అందించింది భారతదేశమే!

ప్రార్థన మహిమ

'నువ్వు ప్రార్థిస్తున్నపుడు నువ్వు నీ దేహాన్ని దాటి నీ చుట్టూతా ఉండే విశ్వ వ్యాప్త అస్తిత్వంలో భాగమవుతావు. అప్పుడు ఆస్తీ వయసూ కులమూ జాతీ అనే భేదాలుండవు'

'దేవుడి నుంచి శక్తి ప్రసారం ఒక సర్క్యూట్‌లో దేవుడి ద్వారా నా తండ్రికి, ఆయన్నుంచి నాకూ తిరిగి నా నుంచి దేవుడికి ప్రసరిస్తున్నట్టు నేను అనుభూతి చెందాను. ప్రార్థనల మంత్ర ప్రభావం మమ్మల్నందర్నీ ఆవరించింది'

అబ్దుల్ కలాం చెప్పిన ఈ మాటల్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటే అవగాహనా పరిధి విస్తృతమవుతుంది.

స్నాతకం

వరుడి ఇంట్లోగాని విడిదిలోగాని కళ్యాణ మండపంలోగాని స్నాతకం చేస్తారు. సాధారణగా పెళ్లిరోజు ఉదయం జరిపిస్తారు.

పెళ్లికి ముందు బ్రహ్మచారి చేసే వ్రతమే స్నాతకం.

సర్వప్రాయశ్చిత్తం కోసం శరీర శుద్ధి కోసం ఇది ఉద్దేశించబడింది.

స్నాతుడంటే వేదాధ్యయనం పూర్తి చేసినవాడు, పెళ్లి చేసుకోబోయేవాడు, స్నానం చేసినవాడు, చదివినవాడు అని నిఘంటువు అర్థాలు.

డిగ్రీ పాసైన వారికి విశ్వవిద్యాలయాలు పట్టాను ప్రధానం చేసే వేడుకను స్నాతకోత్సవం అనటం తెలిసిందే.

బ్రహ్మచర్య దీక్షను వదలి, క్షురకర్మ చేయించుకుని, వేడినీళ్ళతో స్నానం చేసినవాడు స్నాతకుడౌతాడు. ఆ కార్యమే స్నాతకం.

'వేదమనూచ ఆచార్యోన్తేవాసిన మనుశాస్తి

సత్యం వద ధర్మం చర స్వాధ్యాయాన్మా ప్రమదః'

వేదాధ్యయనం పూర్తిచేసిన శిష్యుడికి గురువు "సత్యం మాట్లాడు, ధర్మాన్ని ఆచరించు. నేను నేర్పిన విద్యను తిరిగి అధ్యయనం చెయ్యడంలో అశ్రద్ధ చేయకు" అని ఉపదేశిస్తాడు.

గురువుకు ఇష్టమైన గురుదక్షిణ సమర్పిస్తాడు శిష్యుడు.

విద్యాభ్యాస సమయాన నిషిద్ధములైన సుగంధభోగాలూ అలంకరణలూ వేడినీటి స్నానాలూ కేశఖండనాలూ ఇకనుంచి అతడికి అనుభవైకవేద్యం!

ఇవి–ముఖ్యంగా కేశఖండనం చేయించుకోకుండా వుండటం లాంటివి ఈ నాటికి సరిపడవు. కనుక ఒక ఆచారంగా జరుపుతారంతే.

విఘ్నేశ్వర పూజతో మొదలవుతుందీ కార్యక్రమం.
పురోహితుడు వరునిచే గోత్రప్రవరలు చెప్పిస్తాడు.

సమావర్తనం

భారతీయ సంప్రదాయానుసారం వివాహానికి ముందు సమావర్తనం జరుపుతారు.

సమావర్తనమంటే తిరిగివచ్చుట. విద్యాభ్యాసం పూర్తి చేసుకుని గురువాజ్ఞతో గృహస్థ ధర్మాన్ని స్వీకరించడానికి స్నాతకుడై ఇంటికి రావటమన్నమాట.

'ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః' అన్నారు.
అంటే సంతాన పరంపరను తెంచి వేయకుండా గురుకులాన్ని వదలి వచ్చాడు.

విద్యాభ్యాస కాలాన్ని బ్రహ్మచర్యకాలంగా చెప్పబడుతుంది గనుక బ్రహ్మచర్య దీక్ష విడిచి స్నాతకవ్రతం ఆచరించడానికి వచ్చాడు. అదీ గురువాజ్ఞతో. గురువు సదాచారాలను సత్ప్రవర్తననూ బోధించి మరీ గృహస్థాశ్రమ ప్రవేశానికి అనుమతిస్తారు.

ఈ సందర్భంలో స్నాతకుడు ఆభరణాలు, ధోవతులు, గొడుగు, చెప్పులు, చేతికర్ర, పూలమాల, నలుగు పిండి, తలనూనె, కాటుక, తలపాగా మొదలైన వాటిని గురువుకు సమర్పిస్తాడు. తనూ ధరిస్తాడు.

నిజానికి సమావర్తనం విద్యాసంబంధిత సంస్కారం. కాని వివాహానికి ముందు నిర్వర్తిస్తూ వివాహంలో భాగం చేశారు. 'స్నాతకం' పేరుతో క్లుప్తంగా జరిపిస్తున్నారు.

కాశీయాత్ర

'చరిత బ్రహ్మచర్యోహం కృతవ్రత చతుష్టయః।
కాశీయాత్రాం గమిష్యామి అనుజ్ఞాం దేహి మే శుభామ్॥

"నేను వేదాధ్యయనం పూర్తి చేశాను. వేదవ్రతాల్ని అనుష్ఠించేను.నాకు కాశీ వెళ్ళడానికి అనుజ్ఞనివ్వండి" అని తల్లిదండ్రుల్ని బంధువుల్నీ కోరతాడు స్నాతకుడు.

గొడుగు, కర్ర చేత బట్టి కాలినడకన కాశీయాత్రకు బయల్దేరతాడు!

'సాలంకారాం మమ సుతాం కన్యాం దాస్యామి తే ద్విజ।
పాణిం గృహిత్వా సాగ్నస్త్వం గచ్ఛ స్వాగచ్ఛ మద్గృహమ్॥'

‘ఓ యువకుడా! నీకు సర్వాలంకృతయైన మా అమ్మాయినిచ్చి వివాహం జరిపిస్తాము. అపుడు ధర్మపత్నీ సమేతుడవై త్రేతాగ్నులతో కూడి వెళ్ళగలవు. ఇపుడు మాఇంటికి రమ్ము’ అని కన్యాదాత లేక కన్య సోదరుడు కోరతాడు.

దానికి అంగీకరించి స్నాతకుడు (వరుడు) అగ్నిని ప్రజ్వలింప జేసి వివాహదీక్షను స్వీకరిస్తాడు. రెండవ యజ్ఞోపవీతాన్ని ధరిస్తాడు. గృహస్థాశ్రమ నియమాలను ఉల్లంఘించనని ప్రమాణంచేస్తాడు.

కాశీయాత్ర అంతరార్థం

వేదవిజ్ఞాన సంపన్నుడవుతాడు స్నాతకుడు. విద్యాభ్యాసమూ పూర్తయ్యింది. యౌవనపు భావావేశాలు చుట్టుముట్టి వుంటాయి.

ఏదో చెయ్యాలి ఇంకేదో తెలుసుకోవాలి మరేదో సాధించాలన్న జిజ్ఞాస, తపన అధికంగా వుంటాయి. ధర్మాచరణ, తపస్సు ఆకర్షిస్తాయి. వైరాగ్యభావనలూ జనిస్తాయి. అందుకే కాశీయాత్ర సంకల్పిస్తాడు.

అతడ్ని వారించి గృహస్థాశ్రమాన్ని స్వీకరించమని బంధువులు నచ్చచెబుతారు. మానవజీవితాన్ని పునీతం చెయ్యగల శక్తి గృహస్థాశ్రమానికే వుందని వివరిస్తారు.

వేదధర్మం నిర్దేశించిన బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్న్యాసము అను నాలుగు ఆశ్రమాల్లో ఏదో ఒక దానిని చేబట్టక తప్పదనీ అనాశ్రమిగా వుండకూడదనీ బోధిస్తారు.

నాలుగు ఆశ్రమాల్లో ఉత్తమమైనది గృహస్థాశ్రమం. భావావేశంలో వైరాగ్యభావనలతో కొట్టుకు పోవద్దనీ కామిగాని వాడు మోక్షగామి కాలేడని చెబుతారు. ధర్మార్థకామాలను అనుభవించాక భార్యతో కలిసి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలని బోధిస్తారు.

అంటే కాశీయాత్రను యౌనవ దశ నుండి ఉత్తర దశకు వాయిదా వేయించడమే దీని లక్ష్యం!

వేడుకగా కాశీయాత్ర

వరుడు పాదుకలు, గొడుగు, చేతి కర్ర ధరించి మెడలో పసుపు గుడ్డ వేసుకుంటాడు. సన్యాసం తీసుకుని కాశీయాత్రకు పోతానని బంధుమిత్రులతో చెబుతాడు.

కన్యాదాత గాని బావమరిది గాని వచ్చి కాశీ వెళ్ళవద్దనీ వధువునిచ్చి వివాహం జరిపిస్తామనీ గృహస్థుగా మారమనీ కోరతారు.

అతడందుకంగీకరించగా నుదుట బొట్టుపెట్టి నూతనవస్త్రాలూ తాంబూలం ఇచ్చి నోట్లో బెల్లం ముక్కపెట్టి ఆహ్వానిస్తారు. ఆ సందర్భంగా బావమరిది కాబోయే బావకాళ్ళు కడుగుతాడు. బావ బావమరిదికి బహుమతి ఇస్తాడు.



ఈ కార్యక్రమం ఒక వేడుకగా ఉత్సాహవినోదాలతో నిర్వహిస్తారు.

వరపూజ-ఎదుర్కోళ్ళు

కాశీయాత్రను విరమించి పెళ్లికి సిద్ధపడి మేళ తాళాలతో బంధుమిత్రులతో వస్తాడు వరుడు.

కన్యాదాత, అతడి బంధువులు ఎదురెళ్లి ఆహ్వానిస్తారు.

వారిని విడిది ప్రదేశానికి తోడ్కొని వెళ్తారు. మంచి నీటి బిందెలు, పానకం బిందెలు, నూతన వస్త్రాలతో స్వాగతం పలుకుతారు.

వరుడికీ అతడి బంధువులకీ పానకాన్నిస్తారు.



పిమ్మట కన్యాదాత వరుడి తండ్రికీ మరో నలుగురు బంధువులకూ బొట్టుపెట్టి అత్తరు చల్లి తాంబూలమిచ్చి బంధుమిత్ర సమేతంగా వివాహానికి రమ్మని ఆహ్వానిస్తాడు. వరుడి తండ్రి కూడా కన్యదాతకీ వారి బంధువులకూ బొట్టుపెట్టి తాంబూలమిస్తాడు. వివాహ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేస్తున్నామని తెలియజేస్తాడు.

సత్సంబంధం నెలకొల్పుకోవాలి

వివాహసమయంలో వధూవరుల బంధువుల ప్రవర్తన గౌరవపూర్వకంగా వుండాలి. హుందాగా వుండాలి. సత్సంబంధం నెలకొనేదిలా ఉండాలి.

ఇచ్చి పుచ్చుకోవటాల గురించి ముందే ఒక అవగాహనకి వచ్చివుంటారు గనుక కొత్త కోరికలు కోరరాదు. అడంబరాల కోసం ఒత్తిడి తేవటం మంచిది కాదు.

ఒకవేళ ఏ కారణం చేతనైనా అనుకున్న విధంగా కానుకలివ్వలేకపోతే పెళ్లి గొప్పగా జరిపించలేకపోతే పట్టింపులకు పోరాదు. రసాభాస చేసి అవమానించకూడదు.

తేడాలువస్తే పొరపాట్లు లోపాలూ దొర్లితే సహృదయంతో అర్థంచేసుకోవాలి. ఇరువైపు పెద్దల సహకారం తీసుకుని సామరస్య పూర్వకంగా సర్దుబాటు చేసుకోవాలి. సయోధ్య పెంచుకోవాలి తప్ప గొడవపడటం తగదు.

ఇరువురి బంధుమిత్రుల ముందు ఎవరు చులకనైనా అవమానం పొందినా అది ఇద్దరికీ అప్రతిష్ఠేనని మరువరాదు. వాటి ప్రభావం వధూవరుల మీద వారి భావిజీవితం మీద వుంటుందని గుర్తుంచుకోవాలి.

దీర్ఘకాలిక సంబంధ బాంధవ్యాల దృష్ట్యా సంయమనంతో సుహృద్భావ పూర్వకంగా మెలగాలి. పొరపచ్చాలు రాకుండా జాగ్రత్త పడాలి.

బంధుత్వాన్ని పటిష్ఠపరచుకునేలా వధూవరులకు శుభం జరిగేలా ఇరు కుటుంబాల వారూ ప్రవర్తించాలి.

బంధు మిత్ర సపరివార సమేతంగా

పెళ్లికి ప్రముఖులు, గురువులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, పరివారజనం అంతా తరలి వెళ్ళాలి.

వధూవరులు శుభప్రదమైన వైవాహిక జీవితం గడపాలని, సత్సంతాన భాగ్యం కలగాలని మంచి మనస్సుతో ఆశీర్వదించాలి.

పెద్దల దీవెనలు పిల్లలకు రక్షాకవచాలు.

అంతేగాక వధూవరులు చేసే వివాహ ప్రమాణాలకు వారంతా ప్రత్యక్షసాక్షులు. ఇద్దరిలో ఎవరైనా వాటిని అతిక్రమిస్తే మందలించి సరియైన దారిలో పెట్టాల్సిన బాధ్యత వారిమీదవుంది.

అందుకనే వారి సమక్షంలో ఒకర్నొకరు విడవకుండా కలిసి వుంటామని ప్రమాణం చేయించటం. ఇలా ప్రమాణం చెయ్యటమే వివాహ ప్రతిజ్ఞ.

వధూవరులు తమతమ వ్యక్తిత్వాలను మరచి ఇద్దరూ ఒకటన్న ఒకటయ్యామన్న భావనని బలంగా మనస్సులో ముద్ర వెయ్యడమే దీని ఉద్దేశం.

ఆ క్షణంనుంచి ఒకరినొకరు శాసించకూడదు. ఆధిక్యత ప్రదర్శించ రాదు. రెండోవారిని డామినేట్ చెయ్యాలని చూడకూడదు. ఒకరికి అనుకూలంగా ఒకరు మసలాలి. వారి మధ్య ప్రేమాభిమానాలు మాత్రమే వికసించాలి. స్వంత కోరికల అవసరాలకన్నా ఎదుటివారివి మిన్న అని భావించాలి.

ఇద్దరూ సహనాన్ని గౌరవాన్ని అనురాగాన్ని అభిమానాన్ని నమ్మకాన్ని ప్రదర్శించాలి. అప్పుడే వివాహజీవితం చక్కగా వుంటుంది.

ఇది గ్రహించి జీవితాంతం కొన్ని నియమాలకు కట్టుబడి వుంటామని చేసే ప్రతిజ్ఞే పెళ్లి. పెళ్లి లక్ష్యం అదే.

యువజంట సంసారజీవితంలోకి అడుగుపెట్టేందుకు అతిధులను సాక్షులుగా వుంచటమే వివాహకార్యక్రమ ఉద్దేశం.

వివాహ ఆహ్వానితుల్ని అభిమానంగా విచ్చేసిన అతిధుల్ని సాదరంగా ఆహ్వానించాలి. పెళ్లి చూసేందుకు వీలుగా మండపంలో తగిన ఏర్పాట్లు చెయ్యాలి.

విందు ఇచ్చి తృప్తిగా సాగనంపాలి.

23

శుభమస్తు (వివాహకాండ)



వరుడుంటే పెళ్లి కొడుకు. మగడు. రేడు. స్వామి. శ్రేష్ఠుడు.

వరించగల అర్హతలు గలవాడే వరుడు.

వధువంటే పెండ్లి కూతురు. స్త్రీ, భార్య, కోడలు.

వరించబడిన స్త్రీయే వధువు.

వధూవరుల మనః శరీరాల పవిత్ర కలయికే వివాహం.

తమ తమ ప్రత్యేక వ్యక్తిత్వాలను త్యాగంచేసి ఇద్దరు ఒకటవ్వడానికి చేసే ప్రతిజ్ఞా కార్యక్రమమే పెళ్లి

స్త్రీ పురుషులు సమానులు కారు. ప్రతిభ, శక్తి, తెలివి, బలం, బలహీనత, కోరిక అన్నీ సమానంగా వుండవు.

ఒకరి శక్తియుక్తులకు మరొకరు వెన్ను దన్నుగా నిలుస్తూ ఒకరి లోపాలను మరొకరు పూడుస్తూ ఒకరికొకరు చేదోడవడం వారి కలయికకు పరమార్థం.

భార్యా భర్తలకు విధి నిర్దేశన చేస్తూ వివాహలక్ష్యాన్ని వివరిస్తూ సాగే వివాహకాండ లోని వివిధ ఘట్టాలను అవలోకిద్దాం.

సంప్రదాయ దుస్తులు

వివాహ సమయంలో వధూవరులిద్దిరూ సంప్రదాయ దుస్తులు ధరిస్తారు.

వధువు పట్టుచీర ధరిస్తే వరుడు పంచె కట్టుకుంటాడు. ఇతర సమయాల్లో ఎలాటి దుస్తులు ధరించినా పెళ్లి పీటలమీద సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించడం పిల్లల మీదగల సంస్కృతీ ప్రభావ ఫలితమే.

వధూవరులే గాక పెళ్లికి హాజరయ్యే స్త్రీలంతా పట్టుచీరలు ధరించి కళకళలాడటమూ సంస్కృతీ విశేషమే.

వరాగమనం

నిశ్చయించబడిన ముహూర్తానికి ముందే వరుడు బంధు మిత్రులతో కలిసి కన్యాదాత ఇంటికి లేదా వివాహస్థలానికి చేరతాడు.

బంధుమిత్రులు గురువులు జ్ఞాతులు ముత్తయిదువలతో మంగళవాయిద్యాల మధ్య తరలి రావడమే వరాగమనం.

మంగళస్నానాలు

పూజలు చేయడానికి వీలుగా వధూవరులు మంగళ స్నానాలు చేసి పరిశు భ్రులవుతారు.

ముందుగా వధువు,ఆ తర్వాత వరుడు మంగళ స్నానాలు చెయ్యాలి.

కన్యాదాత, ఆతడి భార్య సైతం అభ్యంగన స్నానాలు చెయ్యాలి.

గౌరీపూజ

వరుడు వచ్చే ముందు వధువు చేత కన్యాదాత ఇంట్లో గౌరీపూజ చేయిస్తారు. వివాహితమై పదికాలాలపాటు పసుపు కుంకాలతో వర్ధిల్లేలా దీవించమని మంగళ గౌరిని పూజిస్తుంది.

'సర్వమంగళ మంగళ్యే శివే సర్వార్థ సాధికే ।
శరణ్యే త్ర్యంబికే గౌరి నారాయణి నమోస్తుతే ॥

అన్ని శుభాలనిచ్చేది, శివుని భార్య, సర్వ కోరికలు తీర్చేది, ముగ్గురమ్మల మూలపుటమ్మ, శ్రీమహావిష్ణువు సోదరి అయిన గౌరీ దేవికి నమస్సుమాంజలి!

గౌరీ మాతని విశ్వమాతృశక్తిగా భావిస్తారు. నమ్మకం, పవిత్ర ఆలోచనలు, క్రియలకు ప్రతిరూపంగా మంగళ ప్రదాయినిగా భావిస్తారు. అందుకే వధువు చేత గౌరీ పూజ చేయిస్తారు.

వరుడు విఘ్నేశ్వరపూజ చేస్తాడు. వివాహానికి ఎటువంటి విఘ్నాలూ కలక్కూడదని ప్రార్థిస్తాడు.

కన్యావరణం

దీనినే గోత్ర ప్రవరలు చెప్పడం అని కూడా అంటారు.

గోత్రమంటే వంశం. ప్రవర అంటే వంశమూల పురుషులకూటం.

కన్యావరణమంటే వరుడు ఉత్తమ లక్షణాలు గల కన్యను వరించుట అని అర్థం.

వరుడు కోరినమీదట యోగ్యులైన గృహస్థులు వెళ్ళి మంచి కన్యను నిశ్చయిస్తారు. కన్యాదాతకి వరుడి గోత్ర ప్రవరలు చెబుతారు. అంటే వరుని ముత్తాత, తాత, తండ్రి ఎవరో తెలియజేస్తారు. కన్య ముత్తాత తాత తండ్రుల గురించి తెలుసుకుంటారు. వరుడికి కన్యనిమ్మని మూడుసార్లు కోరగా కన్యాదాత అంగీకరిస్తాడు.

సంబంధ నిశ్చయానికి ముందు జరిగే సంప్రదింపుల్ని పెళ్లిలో ఆచారానుసారం జరుపుతున్నారు.

లోకరీతి వేరేగా వున్నప్పటికీ శాస్త్రప్రకారం వరుడే కన్యనిమ్మని కన్యాదాతను కోరాలి.

కన్య తండ్రి దాత. వరుడు ప్రతి గ్రహీత. దాత స్థానం ఉన్నతమైంది.

వరుడి తరపున అతడి పెద్దలు వధువు తరపు పెద్దలనూ కన్యాదాతనూ సమీపిస్తారు. వరుని వంశక్రమాన్ని -ముత్తాత, తాత, తండ్రి గురించి వివరిస్తారు.

అలాంటి వంశంలో పుట్టిన వరునికి ధర్మసంపాదన నిమిత్తం కన్యను-ఆమె ముత్తాత, తాత, తండ్రుల పేర్లు చెప్పి మరీ-ఇమ్మని కోరతారు.

కన్యాదాత తన పెద్దలతో కలిసి **'వృణీధ్వం దా స్యామి'** అని తన అంగీకారాన్ని తెలియజేస్తాడు.

ఈ విధంగా గోత్రప్రవరలు చెప్పి వరుని పక్షం వారు మూడు సార్లు అడగటమూ కన్యాదాత తన అంగీకారాన్ని మూడు సార్లు చెప్పడం జరుగుతుంది.

ఆ సంగతి వరునికి చెప్పగా, **'శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం, ధర్మ ప్రజ్ఞా సంతతి వృద్ధ్యర్థం, స్త్రియ ముద్వాహే'** అంటాడు. అనగా శ్రీ పరమేశ్వర ప్రీతి కోసం ధర్మ సంతాన సంపద నిమిత్తం ఈ కన్యను వివాహమాడతానని చెబుతాడు.

మధుపర్కాలు

వధువు ఇంటికొచ్చిన వరుడికి పెరుగు, నెయ్యి, తేనె కలిపిన పానీయాన్ని ఆతిధ్యమిస్తారు. అదే మధుపర్కం.

ఆయుర్వేద ప్రకారం తేనె జీర్ణశక్తిని పెంచి దేహానికి పుష్టిని కలిగిస్తుంది. నెయ్యి శరీరానికి శక్తి నిస్తుంది. పెరుగు చలవ చేస్తుంది. వరుడిని శారీరకంగా దృఢంగా శక్తిమంతుడిగా చెయ్యడమే ఆ మిశ్రమ లక్ష్యం.

'మయా క్రియమాణ కన్యాదానం గత్వేన వరం మధుపర్కేణ పూజయిష్యే' అని మంత్రం చెబుతూ నూతన వస్త్రాలను ఇప్పిస్తాడు పురోహితుడు.

ఈ వస్త్రాలనే మధుపర్కాలుగా వ్యవహరిస్తూంటారు.

యజ్ఞోపవీత ధారణ

ఉపనయన కాలంలో పురోహితుడు వరుని చేత ఒక యజ్ఞోప వీతం ధరింప జేస్తాడు.

వివాహ సమయంలో కన్యాదాత వెండి జంధ్యం పోగుని పూజించి వరునికి ప్రదానం చెయ్యగా అతడూ దానిని పూజించి ధరిస్తాడు.

'ఉద్వాహాంగ భూతం ద్వితీయ యజ్ఞోపవీత ధారణం కరిష్యే' అనగా ధర్మకార్యాల కొరకు సంతతి కొరకు సంపద కొరకు ఈ స్త్రీని వివాహమాడుతున్నానని చెబుతూ వరుడు రెండవ యజ్ఞోపవీతాన్ని ధరిస్తాడు.

బ్రహ్మచారి ఒంటి పోస యజ్ఞోపవీతాన్ని ధరిస్తాడు. ఇప్పుడు రెండు పోసల జంధ్యాన్ని ధరింపజేస్తారు.

రెట్టింపైన బాధ్యతలకిది చిహ్నం.

తనతోబాటు భార్యకి రక్షణ కల్పిస్తానని స్వసుఖం కన్నా ఆమె సుఖ సంతోషాలకోసం కృషి చేస్తానని ప్రతిన బూనటమన్నమాట.

యజ్ఞోపవీతం సదా అతడికా బాధ్యతల్ని గుర్తు చేస్తుంది. సన్మార్గంలో నడిపిస్తుంది.

గంపలో వధువు

కన్యను ఆమె మేనమామ గంప లేక బుట్టలో ఉంచి కళ్యాణ వేదిక వద్దకు తీసుకొస్తాడు.

అపాత్ర దానం చెయ్యకూడదన్నారు. అపాత్ర అంటే పాత్ర లేకుండా అనే అర్థం చెప్పుకుని ఈ తంతు ఏర్పాటు చేసి వుండొచ్చు.

కన్య తల్లి పుట్టింటి వారిక్కూడా పెళ్లిలో ప్రాముఖ్యం ఇస్తూ వారిని కూడా వివాహకాండలో ఓ భాగం చెయ్యడానికి మొదలై వుండొచ్చు. లేదా కన్యకు మేనరికం చెయ్యట్లేదని అందుకు మేనమామ అంగీకరించారని పరోక్షంగా తెలియజేయటానికి ఉద్ధేశించి వుండొచ్చు.

ఏమైనా ఇది ఆంధ్ర దేశంలో మాత్రమే వున్న ఆచారం.

పుణ్యాహవాచనం

దైవాది కర్మ ప్రారంభంలో మంగళార్థం చేసే శుభ కర్మం. అశుద్ధి నివారక మైన కర్మమే పుణ్యాహవాచనం.

శుభకర్మ జరగబోయే ప్రదేశం పవిత్రమగుటకు ఉద్దేశించిన కర్మ ఇది. స్థలశుద్ధి కోసమేగాక అమంగళము తొలగి శాంతి, పుష్టి, వృద్ధి కలగటానికి వివాహ ప్రారంభంలో చేస్తారు.

కలశంలో నీరు పోసి అందులో మామిడాకులు, దర్భలు, పుష్పాలు, అక్షింతలు వేసి వరుణాదిదేవతలను ఆవాహన చేస్తారు. పిమ్మట ఆ నీటిని మామిడాకుతో మండపం నలుదిక్కులా చల్లుతారు.

మంగళాచరణం

వరుడు ముందుగా తల్లి దండ్రులకు పెద్దలకు పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందాలి. ఆ తర్వాత కళ్యాణ మండపంలో ప్రవేశించాలి.

"ఓం భద్రం కర్ణేభిః......" అంటూ శుభాన్నాశిస్తూ మంత్రం చదువుతూ అతడ్ని ఆహ్వానించి అక్షింతలు చల్లి దీవిస్తారు.

పవిత్రీకరణం

మనశ్శరీరాలను శుద్ధి చేయుటే పవిత్రీకరణం.

ఎడమ చేతిలోకి నీరుతీసుకుని కుడి చేత్తో మూసి **"ఓం అపవిత్రః పవిత్రోవా..."** అంటూ మంత్రం చెప్పేక తలమీంచి నీటిని వెనకవైపున చల్లాలి.

ఆచమనం

మంత్రపూర్వకంగా అరచేతిలోకి నీరు తీసుకుని త్రాగటమే ఆచమనం.

మనస్సుని నియంత్రించే అలోచనల్ని వాక్కుని క్రియని శుద్ధి చేయుటే ఆచమనోద్దేశం.

కుడిచేతిలోకి నీరు తీసుకుని మూడు సార్లు మంత్రం చెబుతూ త్రాగాలి.

మొదటి సారి : **ఓం అమృతోపస్తరణ మసి స్వాహా**

రెండవ సారి : **ఓం అమృతాపిధానమసి స్వాహా**

మూడో సారి : **ఓం సత్యం యశః శ్రీర్మయి శ్రీహి శ్రయతా స్వాహా**

ఆచమనం మూడు సార్లు చేయుట వలన త్రిమూర్తులకు ప్రీతి పాత్రులవుతారు.

శిఖా వందనం

సమాజహితమైన ఆలోచనలు, నిర్మాణాత్మక స్ఫూర్తి లభించాలని చేసే చర్య ఇది.

ఎడమ చేతిలోకి నీరు తీసుకుని కుడి చేతి వేళ్ళు ముంచి శిఖని (పిలకని) పట్టుకోవాలి లేదా శిఖ వుండే ప్రదేశాన్ని స్పృశించాలి.

ప్రాణాయామం

ఇది ప్రకృతి శక్తుల్ని ఆవాహన చేస్తూ అంతర్గత శక్తిని పెంచుకుని మనస్సులోని దురూహల్ని దూరం చేసుకోడానికి చేసే ప్రక్రియ.

కుడిచేతి మధ్యవేలు, ఉంగరం వేలు, బొటన వేలు ఉపయోగించి ఒకసారి కుడి వైపు ముక్కు రంధ్రాన్నీ మరోసారి ఎడమ వైపు ముక్కు రంధ్రాన్నీ మూస్తూ రెండో దాని ద్వారా గుండెల్నిండా గాలి పీల్చాలి. గాలిని బిగబట్టి వుంచగలిగి నంతసేపు వుంచి మెల్లగా వదలాలి.

ప్రాణాయామం చేసే ముందు పఠించాల్సిన గాయత్రీ మంత్రం:

'ఓం భూః ఓం భువః ఓం సువః ఓం మహః

ఓం జనః ఓం తపః ఓం సత్యం

ఓం తత్సవితుర్వరేణ్యం

భర్గోదేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్'

న్యాసం

ఇది స్పర్శేంద్రియాలని నియంత్రించే నాడీ కేంద్రాలను శుద్ధి చేసే ప్రక్రియ.

ఎడమ చేతిలోకి నీళ్ళు తీసుకుని కుడి చేతివేళ్ళు తడి చేసుకోవాలి. పెదవుల్ని,

నాశికా రంధ్రాల్ని, కళ్ళని, చెవుల్ని, చేతుల్ని తొడల్ని – మొదట ఎడమ భాగాన్ని పిదప కుడి భాగాన్ని మంత్రం చదువుతూ వేళ్ళతో స్పృశించి నీటిని వెనుక వైపున చల్లాలి.

ఓం వాంగ్మే ఆస్యేస్తు! (పెదవులు)
ఓం నసోర్మే ప్రానోస్తు! (ముక్కు పుటాలు)
ఓం అక్షనోర్మే చక్షురస్తు! (కళ్లు)
ఓం కరన్యోర్మే శ్రోత్ర మస్తు! (చెవులు)
ఓం బాహ్వోర్మే బలమస్తు! (చేతులు)
ఓం ఉర్వోర్మే ఓజోస్తు! (తొడలు)

ఆఖరిది జపించేప్పుడు రెండు చేతుల్తో నీటిని శరీరపు వెనుక భాగం వైపు చల్లాలి.

పృధ్వీపూజ

ఓర్పుకి సహనానికి మాతృ లక్షణాలకి ప్రతీక అయిన భూదేవిని పూజించుట.

"ఓం పృధ్వీత్వయా ధీర్తా లోకా..." అంటూ మంత్రం జపిస్తూ భూమి మీద కొన్ని నీళ్ళు చిలకరించి భూదేవిని పూజించాలి.

పునః పరిశీలన

పైన పేర్కొన్న ప్రక్రియల్ని ఒక్కసారి పరిశీలిద్దాం.

అందరికీ అంటే వివాహ కార్యంలో పాల్గొనే వారికేగాక మొత్తం సమాజానికి మేలు జరగాలన్న ఆకాంక్ష వుంది.

మనశ్శరీరాలనే కాదు ఆలోచనలని, వాక్కుని, పనుల్ని, జ్ఞానేంద్రియాల్ని నియంత్రించే నాడీ మండలాన్ని, మెదడుని పవిత్రం చేసే యోచన ఉంది.

వధూవరులు వివాహ యజ్ఞంలో పాల్గొనే ముందు వారి గతాన్ని గతపు ఆలోచనల్ని సంస్కరించడమూ వుంది.

పెళ్లికి ముందు ఎన్నో రకాల ఆలోచనలుండొచ్చు. కోరికలూ ఊహలూ వుండొచ్చు. బలహీనతలూ ఉండొచ్చు. అనేక రకాల పనులు చేసి వుండనూ వచ్చు.

వాటన్నిట్నుంచీ వారిని 'విముక్తం' చేసి ఇక నుంచి మీరు కొత్త మనుషులు. మీ శరీరమూ మనస్సూ పవిత్రమైనవి అని చెప్పటమూ ఉంది.

ఇక పై మీరు మీ మనః శరీరాలు క్రియలు సమస్తమూ మీ ఇద్దరి కోసమే సమాజాభివృద్ధి కోసమే అన్న హితబోధ వుంది.

సమస్త జీవుల ఉనికికీ మనుగడకీ ఆధారభూతం భూమి. మనిషికి తిండి బట్ట సమస్తం అందించి మానవాభివృద్ధికి తోడ్పడే మహాశక్తి. ఆ శక్తిని పూజించడం- అదీ నూతన సృష్టి కర్తలు కాబోతున్న వేళ వధూవరులచేత చేయించడం పూర్వుల మహోన్నత దృష్టికి నిదర్శనం!

గణపతి పూజ



ఒక పళ్లెం నిండా బియ్యం పోసి తమలపాకు పెట్టి దాని మీద పసుపుతో చేసిన గణపతిని ఉంచాలి. బొట్టుపెట్టి గణపతిని పూజించాలి.

ఎలాంటి విఘ్నం జరక్కుండా వివాహం నిర్విఘ్నంగా జరుగుటకు వధూవరులు విఘ్నాధిపతియైన వినాయకుడ్ని పూజించాలి.

విజ్ఞానానికి వినయానికి వివేకానికి తెలివితేటలకి అధిపతి గణపతి. తొలిపూజ అతడికే చెయ్యాలి.

కలశ పూజ



4

పిండి పసుపుల్తో షట్కోణం వేసి మధ్యలో ఓం అని రాయాలి. దాని మీద చిన్న బిందె లేక చెంబుని నీటితో నింపి ఉంచాలి. అందులో పచ్చకర్పూరం కస్తూరి కుంకుమ పూవు చందనం వెయ్యాలి. దానికి పసుపు పూసి బొట్లు పెట్టాలి.

మామిడాకులు వేసి కొబ్బరికాయ పెట్టాలి. కాయ చుట్టూ రవికెల గుడ్డ చుట్టాలి.

'కలశస్య ముఖే విష్ణుః కంఠేరుద్ర స్సమాశ్రితః
మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృ గణాస్మృతాః
కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపా వసుంధరా!
ఋగ్వేదో అథయజుర్వేద సామవేదోహ్య ధర్వణః
అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః'

అని చదువుతూ అక్షతలు వేసి నమస్కరించాలి. కలశాన్ని కుడిచేత్తో తాకి పూజించాలి.

పంచభూతాల్లోని భూమికి ముందులోనే పూజచేయించారు ఇప్పుడు నీటికి చేయిస్తున్నారన్న మాట.

నీరు జీవానాధారం. చక్కని ద్రావకం. ప్రకృతి శక్తిని ఆవాహన చేస్తూ కలశ పూజ చేయిస్తారు.

నదుల ఆవాహన

ఒక రాగి గ్లాసులోకి నీరు తీసుకుని పసుపు రాసి బొట్టు పెట్టి గంధంతో అలంకరించాలి.

'గంగే చ యమునే చైవ కృష్ణే గోదావరి సరస్వతీ
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ త్సన్నిధిం కురు॥'

అని చెబుతూ దేశంలోని జీవనదుల్ని ఆ పాత్రలోకి ఆవాహన చెయ్యాలి. అక్షతలు వేసి పూజించాలి.

తమలపాకుతో ఆ నీటిని దేవతామూర్తులపై పూజా ద్రవ్యాలపై తమపై చల్లు కోవాలి.

ఈ పూజలయ్యాకే వివాహ ఘోషణ చేయబడుతుంది.

24

కన్యాదానం

వివాహకాండలో కీలకమైన ఘట్టం కన్యాదానం.

నిజానికి వివాహమంటే కన్యదానమే. కన్యాదానమంటే వివాహమే.

కన్యాదానం కూడా ఒకరకమైన దానమే అయినా ఇది విభిన్న మైనది. విశిష్ఠమైనది.

'నువ్వొకందుకు పోస్తోంటే నేనొకందుకు తాగుతున్నాను' అనే పద్ధతిలోగాక కన్యాదాత ఎందుకు ఇస్తున్నాడో అందునిమిత్తమే కన్యాగ్రహీత స్వీకరిస్తాడు.

సంతానార్థం త్రిధర్మ రక్షణార్థం కన్యాదానం చేస్తారు. అందుకోసమే స్వీకరించాలి.

కన్య లేకుండా అవి సాధించలేరు. ఆమె ఒక మార్గం. ఒక మీడియం. ఒక ముక్తికారిణి. ఒక మోక్షప్రదాయిని.

అలాంటి కన్యని దానం చెయ్యడం వల్ల కన్యాదాతకు పుణ్యలోక సుఖాలు దక్కుతాయి. వరుడికి ఐహిక సుఖాలతోబాటు జీవిత పరమార్థం చేకూరుస్తుంది.

వరపూజ

వరుడు సర్వగుణ సంపన్నుడు గనుక అతడ్ని గౌరవించాలని ఋషులు చెప్పారు.

వరుడు సామాన్యుడు కాదు. లక్ష్మీనారాయణ స్వరూపుడు. కన్యాదాన ఫలం లభింపజేసేవాడు. కన్యాదాతకీ అతడి పూర్వీకులకీ పుణ్యలోక ప్రాప్తి కలిగించేవాడు.

తమ కుమార్తె ద్వారా సంతానాన్ని పొంది మానవజాతి నిరంతరంగా కొనసాగేలా చేస్తున్న మహావ్యక్తి.

అలాంటి వరుడు నిస్సందేహంగా పూజార్హుడే. పూజనీయుడే.

వధూవరుల మధ్య తెర

మండపంలో వధూవరులను ఎదురెదురుగా పీటల మీద కూర్చోబెడతారు..

వరుడు తూర్పునకు, కన్య మరియు కన్యాదాత పశ్చిమానికి, వధువు తల్లి ఉత్తరాభిముఖంగా కూర్చోవాలి.

సుముహూర్తానికి ముందుగా వధూవరులు ఒకరినొకరు చూసుకోకుండా ఇద్దరి మధ్యా పసుపు రాసిన తెల్లని వస్త్రాన్ని 'అడ్డుతెర'గా కడతారు.

దీన్నే తెరసెల్లా, తెరపట్టుట అంటారు.

స్వస్తిక గుర్తు, శ్రీ, శుభం, ఓం, శ్రీరామ– అని రాయబడ్డ రకరకాల ప్రత్యేక తెరలు బజార్లో లభిస్తున్నాయి.

మహాసంకల్పం

కన్యాదానానికి ముందు కన్యాదాత 'సంకల్పం' చేస్తాడు.

మానవజీవితంలో వివాహం ముఖ్యమైంది. సంకల్పం విలక్షణమైంది. విశ్వస్వరూపాన్ని వర్ణిస్తూ చెబుతారు గనుక మహా సంకల్పమైంది.

అనంతమైన కాల చక్రాన్ని వర్ణించి అట్టి దైన కాలంలో కలియుగంలో ప్రథమ పాదంలో జంబూద్వీపంలో భరతవర్షంలో భరత ఖండంలో మేరోర్థక్షిణ దిగ్భాగంలో శ్రీ శైలస్య... ప్రదేశంలో కృష్ణా గోదావర్యోర్మధ్య దేశంలో చాంద్ర మాస రీత్యా ఫలానా సంవత్సరంలో – ఆయనంలో – ఋతువులో – మాసంలో – పక్షంలో – తిథి వార నక్షత్రాలలో ఇట్టి సముహూర్తంలో 'శ్రీలక్ష్మీనారాయణ ప్రీత్యర్థం' అలంకరించబడిన కన్యను బంగారంతోను నీటితోను కూడిన కన్యని దానం చేస్తాను – అని సంకల్పిస్తాడు.

ఈ మహావిశ్వంలో మానవుడెంత అల్పుడో చెప్పక చెప్పడమే ఇది!

అంతే గాక అనేక కోట్ల సంవత్సరాల పాటు తనకూ తన పూర్వీకులకూ శాశ్వత బ్రహ్మలోక నివాస సిద్ధి కొరకు ఈ కన్యాదానం చేస్తున్నానని కన్యాదాత సంకల్పం చెబుతాడు.

'సాలంకృత సహిరణ్యోదక కన్యాదాన మహం కరిష్యే' అంటాడు.

కన్యాదానం చేయదగ్గవారు

తండ్రి కన్యాదానం చెయ్యడం ఉత్తమోత్తమం.

ఆయన లేనిచో తండ్రి తండ్రి, ఆయనా లేనచో సంస్కారం పొందిన సోదరుడు చేయవచ్చు.

అతడూ లేనిచో ఆ వంశపు దాయాదులు, వారునూ లేనిచో తల్లి కన్యాదానం చేయుటకు అర్హులు.

ఎవరూ లేనియెడల కన్యయే స్వయంగా స్వయంవరం చేసుకొనవచ్చు. అంటే స్వదాన మన్నమాట.

మాతామహుడు, మేనమామ కూడా కన్యాదానం చేయవచ్చునని నారద వచనం.

వరుని కాళ్ళు కడుగుట



వరుడి పాదాలను పళ్లెంలో పెట్టించాలి. ముందు కుడి కాలును తర్వాత ఎడమ కాలును ఇంద్రుని అంశగా భావించి కడగాలి. పిమ్మట రెండు పాదాలనూ కలిపి కడగాలి.

కన్యాదాత భార్య చెంబుతో నీళ్లు పట్టుకుని కుడి చేయి దోసిలి అడ్డుపెట్టి నీటిని వరుని పాదాలపై పోస్తూంటే కన్యాదాత కడగాలి.

ఇదే 'పాద్యం'

'అర్ఘ్య'– పవిత్ర జలంతో వరుడి చేతుల్ని శుభ్రం చేయాలి.

'ఆచమనం' చేయించాలి. వరుడు మూడు సార్లు త్రాగాలి.

'నైవేద్య మధు పర్కాలు' – నెయ్యి పెరుగు తేనె చక్కెర మిశ్రమంలో తులసి ఆకు వేసి ఆహారంగా ఇవ్వాలి.

అతడి కెప్పుడూ ఆరోగ్యాన్నిచ్చే అలాంటి ఆహారం లభించాలని జీవితాంతం చక్కని గుణాలతో వర్థిల్లాలని కోరుతూ మంత్రాన్ని జపించాలి.

"శ్రీ లక్ష్మినారాయణ స్వరూపస్య
వరస్య ఇదమాసనం
ఇదం పాద్యం
అమీ గంధాః
ఇమే అక్షతాః......"

అనగా శ్రీ లక్ష్మినారాయణ స్వరూపుడైన వరునికి ఇదే ఆసనం, ఇదే పాద్యం, ఇవిగో సుగంధ ద్రవ్యాలు, ఇవి అక్షతలు – అని ఆయా వస్తువు లిచ్చి వరుని పూజిస్తాడు కన్యాదాత.

పాదప్రక్షాళన తప్పు కాదు

వధువు తల్లిదండ్రులు చిన్న వాడైన వరుని పాదాలు కడగటమే కాదు ఆ నీటిని తల మీద చల్లుకుంటారు.

పిల్లకి పెళ్లి చెయ్యని వాడనే నింద నుంచి తమని వరుడు గట్టెక్కిస్తున్నాడు. ఆమె ద్వారా తమకి మనుమల్నీ మనుమరాళ్ళనీ కల్గించి వంశాన్ని నిలబెడుతున్నాడు. ఇటు పది అటు పది తరాల వాళ్ళకి నరకం లేకుండా చేస్తున్నాడు. తాత ముత్తాతల్ని కూడా బ్రహ్మలోకానికి పంపే శక్తిని ఈ వివాహం ద్వారా అల్లుడిస్తున్నాడు.

అందుకే అతడు దేవతాస్వరూడయ్యాడు.

'అత్ర వగహి భూకి తావత్త రావాం
నిజమాతు రుత వాఘూతాస్యులా.....
దశ పూర్వేషాం దశా పరేషాం....
యానైగ్రహ మండల పర్యంతం....కరిష్యే'

'తుభ్యం సహిత్స ధర్మ భ్యః ప్రతి పాదయామిః'

ఓ అల్లుడా! నా కూతుర్ని నీతో పాటు సర్వధర్మాలూ ఆచరించడానికి నేనంగీకరిస్తూ ఈమెనిస్తున్నాను.

అల్లుడు సింహాసనం మీద కూర్చుంటే తన కూతురిది అర్థ సింహాసనం అన్నమాటే కదా!

యుగ ధర్మం

ఒక్కో యుగంలో ఒక్కో ధర్మానికి ప్రాముఖ్యత నిచ్చింది పద్మ పురాణం.

కృతయుగంలో తపస్సుకు, త్రేతాయుగంలో జ్ఞానానికి, ద్వాపరంలో యజ్ఞాలకు ప్రాముఖ్యతనిచ్చింది. కలియుగంలో దానానికి విశిష్ట స్థానం కల్పించింది.

పురాణాల్లో ఎన్నో రకాల దానాలున్నాయి. శిబిచక్రవర్తి తన శరీరాన్నీ, దధీచి ఒంట్లోని ఎముకల్ని దానమిచ్చారు. ఇక కర్ణుడు, బలిచక్రవర్తుల దానాల గురించి తెలిసిందే.

మొత్తం 16 రకాల దానాలు చెప్పబడ్డాయి. వాటిలో నాలుగు దానాలు మరింత విశిష్టమైనవి. అవి కన్యాదానం, గోదానం, భూదానం, విద్యాదానం. వీటిని చతుర్విధ దానాలంటారు.

భూదానంలో భూమి మీదనూ, గోదానంలో గోవు మీదనూ గల అన్ని హక్కులనూ దానం పుచ్చు కున్నవారికి ఇచ్చి వేస్తారు.

వారు వాటిని అనుభవించవచ్చు. ఇంకొకరికి ఇవ్వవచ్చు. ఏమైనా చేసుకోవచ్చు.

కన్యాదానం వాటికి భిన్నమైనది.

వధువు యొక్క సర్వ బాధ్యతల్ని మరొకరికి బదిలీ చెయ్యడమే కన్యాదాన ఉద్దేశం.

ఇంతదాకా ఆమె పోషణ, రక్షణ, సంతోషం, ఓదార్పు, ప్రోత్సాహం – అన్నీ తల్లి దండ్రుల బాధ్యతలు. ఇకపై అవి ఆమె భర్తకూ అత్తింటివారికీ మార్చబడతాయి.

కన్య ఒక ఆస్తి కాదు

డబ్బు లేక వస్తువుల్ని దానం చెయ్యడానికీ కన్యాదానానికీ పోలికే లేదు.

వధువును ఎవరూ కూడా ఒక ఆస్తిగా భావించరాదు. ఇతరులకు దానం చెయ్యరాదు.

వివాహం అనేది ద్వైపాక్షిక ఒప్పందం. దాన్ని దైవసాక్షిగా అగ్నిసాక్షిగా మనస్సాక్షిగా అంగీకరించాలి. గౌరవించాలి. అనుసరించాలి.

ఇది వధూవరులకే కాదు వారి కుటుంబాలకూ వర్తిస్తుంది.

కన్యాదాన కాండ లక్ష్యం ఒక్కటే. పుట్టింట్లో లభించిన ప్రేమాభిమానాలు రక్షణ ప్రోత్సాహకాలూ అత్తింట్లోనూ నిరాటంకంగా లభించాలన్నదే.

ఈ ఘట్టం అత్తింటివారిలో కలిసిపోడానికి సర్దుకు పోవడానికి మానసికంగా సంసిద్ధపరుస్తుంది. భరోసా కల్పిస్తుంది. ధైర్యస్థైర్యాలిస్తుంది.

కన్యాదాత బాధ్యత ముగిసి పోదు

'ఇమాం కన్యాం సంతానోత్పాదనార్థం తుభ్యం సంప్రదదే'- ఈ కన్యను కేవలం సంతానోత్పత్తికిగాను నేను నీకిస్తున్నానంటూ వధువు తండ్రి సంకల్పిస్తాడు.

సాధారణంగా దానమిచ్చేప్పుడు **'తుభ్యమహం సంప్రదదే నమమ'** అంటాడు దాత. అంటే దీన్ని నీకిచ్చి వేస్తున్నాను. దీనీ మీద నా అధికారాన్నీ హక్కునీ కోల్పోతున్నానని చెబుతాడు.

కాని కన్యాదానంలో చివరి పదం **'నమమ'** అనరు.

అంచేత కన్య మీది అధికారాన్ని ఏ తండ్రీ కోల్పోవనట్లే. కన్యమీదే కాదు అల్లుని మీద కూడా అధికారం మంత్ర పూర్వకంగా వుందన్నమాట.

కన్యాదానం తర్వాత వధువు పట్ల ఆమె కుటుంబీకుల బాధ్యత తీరి పోయినట్లు కాదు. అంతటితో చేతులు దులిపేసుకోవటం కాదు.

ఆమె బాగోగులు చూడాల్సిందే. చక్కని భవిష్యత్తు లభించడానికి తోడ్పడాల్సిందే. ఆమె, ఆమె సంతానం సుఖ సంతోషాలతో తులతూగేందుకు పుట్టింటివారి అండ, సహకారం ఎప్పుడూ వుండాలి.

అంతేగాక అల్లుడు సరైన త్రోవలో లేకుంటే పొరబాట్లు చేస్తుంటే సరిదిద్దాల్సిన బాధ్యత కన్యాదాత మీద ఉంది.

కన్యాదానం



వరుని కాళ్ళు కడిగేక కన్యాదాత శచీదేవిని పూజించి కన్యాదానం చేస్తాడు. వధూవరుల మధ్య తెరను సుముహూర్తం వరకూ అలాగే వుంచాలి. కన్యాదాత ఈ క్రింది విధంగా చెప్పి కన్యాదానం చేస్తాడు.

"కన్యాం కనక సంపన్నాం కనకాభరణై ర్వృతాం ।

దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోక జిగీషయా ॥

విశ్వంభర స్సర్వ భూతా స్సాక్షిణ్యః సర్వదేవతాః ।

కన్యా మిమాం ప్రదాస్యామి పితౄణాం తారణాయ వై ॥

కన్యాం సాలంకృతాం సాధ్వీం సుశీలాయ సుధీమతే।

ప్రయతోహం ప్రయచ్ఛామి ధర్మకామార్థ సిద్ధయే ॥

"నాకు బ్రహ్మలోకం సిద్ధించే నిమిత్తం సువర్ణ సంపన్నురాలైన ఈ కన్యను విష్ణు స్వరూపుడైన నీకిస్తున్నాను. నా పితరులు తరించడానికై ఈ కన్యను దానం చేస్తున్నాను. భగవంతుడు, పంచభూతాలు, సర్వదేవతలు సాక్షులగుదురుగాక. సాధు శీలయైన అలంకరించబడిన ఈ కన్యను ధర్మకామార్థ సిద్ధి కలిగే నిమిత్తం మంచి శీలం కలిగిన బుద్ధి మంతుడవైన నీకు దానం చేస్తున్నాను."

ఆభరణాలు ధరించి కొబ్బరి బొండం, పువ్వులు, అక్షతలు, బంగారం లేక దక్షిణ పట్టుకున్న కన్య కుడి చేతిని వరుడి కుడి చేతిలో ఆమె తల్లి దండ్రులు ఉంచి ఉదకంతోసహా దానం చేస్తారు.

అంటే వధువు తల్లి జలధార పోస్తోంటే కన్యాదాత తన కుడి చేతిని కొబ్బరి బొండం పైన, ఎడమ చేతిని వరుడి చేతుల కింద వుంచి దానం చేస్తారు.

గోత్ర ప్రవరలు మళ్ళీ చెబుతారు.

దానం చేసి వూరుకోకుండా కన్యాదాత ఏమంటాడంటే–

'అష్టాదశ వర్షాత్కన్య పుత్రవత్పాలితా మయా

ఇదానీం తవ దాస్యామి దత్తాం స్నేహేన పాలయ'

'పద్దెనిమిదేళ్ళపాటు ఈ కన్యను కుమారుడితో సమానంగా పెంచి ఇదిగో ఇప్పుడు నీకు దానమిస్తున్నాను. నీ వీమెను స్నేహితురాలిలా ప్రేమాభిమానాలతో చూసుకోవాలి' అని చెబుతాడు.

అంతటితో ఆగకుండా, **"తుభ్యం ప్రజా సహత్వ కర్మభ్యః ప్రతిపాదయామి"** అని కుడా అంటాడు.

అంటే సంతానం పొందటం మొదలైన ధర్మకార్యాల నిమిత్తం నీకీమెను ప్రతిపాదిస్తున్నానని అర్థం. అనగా నీవీమె ద్వారానే సంతానం పొందాలి. ఈమెతో కలిసే వివిధ ధర్మాలు నిర్వర్తించాలి– అని చెప్పడం.

'వృణీధ్వం' (వరించవలసింది) అని మూడు సార్లు కన్యాదాత చెప్పగా **'వృణీమహే'** (వరించుచున్నాను) అని వరుడు మూడుసార్లు చెబుతాడు.

కన్యాదానమంటే కన్యను దానము చేయుట అని గాక కన్యా + ఆదానమ్ (కన్యాయా ఆదానమ్) అనగా 'కన్యను గ్రహించుట' అని అర్థం చెప్పుకోవాలంటారు కొందరు పండితులు.

వరుడి కాళ్ళు కడిగేక అర్ఘ్యం ఇచ్చి మధుపర్కం ఇవ్వగా అతడు స్వీకరిస్తాడు. వస్త్రాభరణాలూ ఇస్తాడు కన్యాదాత.

కన్యాదాన ఫలం



కన్యాదాన ఫలం అమోఘమూ అపరిమితమూ.

కన్యాదానం వల్ల లభించే పుణ్యం సామాన్యమైంది కాదు. కోట్ల సంవత్సరాలు సత్యలోకంలో నివసించడానికి అర్హత లభింపజేస్తుంది. పది తరాల పూర్వీకులూ తర్వాతి పది తరాల వారూ శాశ్వతంగా సత్య లోకంలో నివసించడానికి సైతం సరిపోతుందా పుణ్యం.

నూరు యజ్ఞాలు చేసిన ఫలానికి మూడు రెట్ల పుణ్యం ఒకే ఒక్క కన్యాదానం వల్ల లభిస్తుందిట.

మత్స్య పురాణంలో –

'సర్వాభరణ సంయుక్తాం కన్యకాం యో దదాతి చ।

తేన దత్తా ధరా సర్వా సశైల వన కాననా॥' అన్నారు.

అంటే వనాలు పర్వతాలతో విలసిల్లే ఈ భూమండలం మొత్తాన్ని దానం చేస్తే వచ్చేంత పుణ్యఫలం ఆభరణాలంకృతయైన కన్యను దానం చేయుట వల్ల లభిస్తుంది.

అందుకే ఆడసంతానం లేని వారు బంధుమిత్రుల కుమార్తెను కన్యాదానం చెయ్యడానికి ఉబలాట పడతారు. అది కుదరనిచో దేవుడి కళ్యాణం జరిపించి తృప్తి పడతారు.



25

నాతి చరామి

కన్యను దానంగా స్వీకరించాడు వరుడు.

అదిగో ఆ ఉత్తరక్షణాన్నుంచీ ఆమె అతడి శరీరంలో జీవితంలో కష్టంలో సుఖంలో ధర్మ కార్యాల్లో అన్నిటా సగ భాగమవుతుంది.

ఆమెతో కూడేకనే అతడికి సంపూర్ణత్వం సిద్ధించేది. పెళ్లయ్యే వరకూ అతడు అర్ధానుస్వారమే.

కని పెంచిన తల్లిదండ్రుల్నీ తోబుట్టువుల్నీ పుట్టి పెరిగిన ఇంటినీ విడిచి అతడికి సమర్పితమైంది. ఇకపై ఆమె బాగోగులన్నీ అతడితో ముడివడి ఉన్నాయి.

ఆమెని కంటికి రెప్పలా జీవితాంతం కాపాడాల్సిన మహత్తర బాధ్యత వరుడి మీద ఉంది!

ఆ సత్యాన్ని నొక్కి చెప్పి వరుడి చేత చేయించే ప్రతిజ్ఞే 'నాతి చరామి'!

గోత్రం మారుతుంది

కన్యాదానంతో వధువు గోత్రం మారుతుంది. వరుడి గోత్రమే ఆమెదవుతుంది.

ఇంటిపేరు కలిగి ఉండటం తెలుగువారి ప్రత్యేకత. పెళ్లితో వధువు ఇంటిపేరు కూడా మారుతుంది. భర్త ఇంటి పేరే ఆమెదవుతుంది.

విద్యావంతులు, ఉద్యోగినులు అన్ని రకాల సర్టిఫికెట్లలోనూ రికార్డుల్లోనూ ఇంటిపేరు మార్పు చేసుకునే సదుపాయం ఉంది.

ఈ మధ్య ఎక్కువ మంది మహిళలు ఇంటిపేరు మార్చుకోడానికి ఆసక్తి చూపడం లేదు.

చిన్నప్పట్నుంచి ఉన్నపేరు మార్చుకోడానికి కొందరు ఇష్టపడటంలేదు. పుట్టింటి మమకారం కొందర్ని మార్చుకోనివ్వట్లేదు. ఇంటి పేరు మార్పు 'తతంగం' పూర్తి చేసే సమయమూ ఓపికా లేక కొందరాపని చేయట్లేదు.

ఇంటిపేరు మార్చుకోనంత మాత్రాన అత్తింటి మీద గౌరవం లేదని భావించరాదు. అది సాంకేతిక విషయం మాత్రమే. గోత్రం మారుతుంది గనుక అది పట్టించుకోవాల్సిన విషయమూ కాదు.

బాధ్యతల స్వీకరణ

కొత్త ఇంట్లో అనగా అత్తవారింట్లో వధువు కొత్తదిగా అనుభూతి చెందకూడదు. కొత్త వ్యక్తిగా పరాయిదిగా భావించబడకూడదు.

ఆమె కలిసి పోవాలి. అత్తింటి వారు కలుపుకోవాలి. తమ మనిషి అనుకోవాలి.

అందరి ప్రేమాభిమానాలు, ఆదరణ, సహకారం, శ్రద్ధ అన్నీ ఆమెకు దక్కాలి.

కన్యాదానాన్ని స్వీకరించడం ద్వారా ఆమె భౌతిక మానసిక ఆధ్యాత్మిక బాధ్యతలన్నిటినీ అతడి కుటుంబీకులు స్వీకరించాలి. ఇకపై ఆమె సుఖసంతోషాలకీ రక్షణకీ బాగోగులకీ ముఖ్య బాధ్యులు వారే.

ఆ బాధ్యతా నిర్వహణలో వారు సమాజానికి జవాబుదారులు.

ఇవన్నీ నొక్కి చెప్పడానికి ఏర్పాటు చేసిందే కన్యాదానకాండ.

సాలగ్రామ గోదానాలు

కన్యాదానానంతరం కన్యాదాత సాలగ్రామాన్ని పూజించి బ్రాహ్మణునికి దానమివ్వాలి.

గోదానమూ చెయ్యాలి. కాని వరుని కుటుంబీకులకు చెయ్యాలి.

గోవు పాడికీ పవిత్రతకీ వంశాభివృద్ధికీ చిహ్నం.

కన్యాదాత ఇవ్వదలిస్తే వరుడి బంధువర్గం తీసుకోడానికి ఇష్టపడితే కన్యాదానంతో బాటు గోదానమూ చెయ్యవచ్చు.

వరుడి కుటుంబ ఆరోగ్య రక్షణకూ వ్యవసాయానికీ దీటైన బహుమతి ఇది.

గోవుకు తగిన వసతి, ఆలనాపాలనా చూసే సౌకర్యం పుచ్చుకునేవారికి లేకపోతే గోవు బదులు డబ్బు లేక బంగారం దానమివ్వొచ్చు.

గుప్తదానం

కన్యాదాన సమయంలో కన్యాదాత వధువుకి గుప్తదాన మివ్వడం ఆచారం.

సాధారణంగా బియ్యపుపిండిలో దాచిపెట్టి మరీ ఇస్తారు. ఏమిచ్చారన్నది ఇచ్చేవారికీ పుచ్చుకునే వారికీ తప్ప ఇతరులకు తెలియకూడదు. తెలిస్తే తక్కువిచ్చారంటూ ముఖం ముడుచుకోవచ్చు. సమస్యలు రావచ్చు. అందుకనే గుప్తదానమన్నారు ఋషులు.

ఏమిచ్చారని అత్తవారు అడగరాదు. వారికా సొమ్ము మీద ఎలాంటి హక్కూ ఉండదు.

అవసరమైనప్పుడు వధువుకి ఉపయోగపడ్తాయనే ముందు చూపుతో ఇవ్వబడిన సొమ్మే గుప్తదానం.

ప్రస్తుతం రూపాయి బిళ్ళని పిండిలో పెట్టి ఇస్తూ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

నాతిచరామి



కన్యాదానం, గోదానం అయ్యాక సర్వదేవతల సాక్షిగా పెళ్లయ్యాక వరుడెలా ప్రవర్తించాలో వివరిస్తారు.

వివాహ ధర్మాలు చెప్పి వాటికి కట్టుబడి ఉంటానని ప్రమాణం చేయిస్తారు.

పెద్దల స్థానే పురోహితుడే ఆ మంత్రాన్ని చదువుతాడు.

ఋషులు ఆదేశించినట్టు క్రమశిక్షణ, ధర్మాచరణ కలిగిన జీవితాన్ని గడపాలంటారు. మతం, ప్రకృతి సంపద, శృంగార విషయాల్లో నియమాల కట్టుబాటుకి కట్టుబడి ఉండాలని చెప్పగా వరుడు అంగీకరిస్తాడు.

అతడికి దేవతలంతా సాయపడాలని కోరుతూ పెద్దలు వధూవరుల మీద అక్షింతలు చల్లి ఆశీర్వదిస్తారు.

ఈ సందర్భంలో చెప్పే మంత్రం.

'ఓం గౌరీమ్ కన్యా మిమాం పూజ్య
యథా శక్తి విభూషితాం గోత్రాయి షర్మానే తుభ్యం
దత్తాం దేవ సమాశ్రయ ధర్మస్యాచరణం సమ్యక్
క్రియతా మనయా సాః
ధర్మేచ అర్థేచ కామేచ యత్వం నాతిచరే విభో'

అని పురోహితుడు చెప్పగా వరుడు దానికంగీకరిస్తూ **'నాతి చరామి'** అని ముమ్మార్లు ప్రమాణం చేస్తాడు.

ధర్మములో అర్థములో కామములో ఈ కన్యను అతిక్రమించి గృహస్థాశ్రమ ధర్మములను సాగించనని ప్రమాణం చేయడమన్నమాట.

భార్యతోనే బతుకు

'నాతి చరామి' అంటే ఈ స్త్రీని విడువను అనేకాదు 'ఈమెతోనే నా జీవితం. నా జీవితంలో సగం ఈమెయే. ఈమె లేకుండా బతక (లే)ను' అనే అంతరార్థమూ వుంది.

ధర్మార్థ కామాల్లో ఆమెతోడిదే తన జీవితమని వరుడు ప్రమాణం చెయ్యడం ప్రపంచంలోని ఏ జాతిలోనూ లేదు.

భార్య సహకారం సాహచర్యం లేనిదే భర్త ఏమీ సాధించలేడని ఆమె అండ ఆమె తోడు ఉంటేనే అన్నిటా విజయం సంభవమని గూఢార్థం!

భార్యా సమేతుడై చేసినప్పుడే పూజలు, వ్రతాలు యజ్ఞాలు మరే కార్యాలకైనా సరే సంపూర్ణత సిద్ధిస్తుంది. దేవతలు ప్రీతి చెందుతారు.

పుణ్యక్షేత్ర సందర్శనాలూ నదీ స్నానాలూ పుష్కర స్నానాలూ పూర్తి ఫలం ఇవ్వాలంటే భార్యా సమేతుడై చెయ్యలంటుంది తైత్తిరీయ బ్రాహ్మణం.

శ్రీరాముడు అశ్వమేథయాగాన్ని బంగారు సీతతో కలిసి నిర్వర్తించిన సంగతి గుర్తు చేసుకోండి. దాని అంతరార్థం పురుషుడొక్కడుగా చేసిన యజ్ఞం ఫలించదనే.

ఏ కార్యమైనా వ్యవహారమైనా భార్యతో కలిసి లేదా భార్యతో ఆలోచించి చెయ్యడం సర్వదా శ్రేయస్కరం. శుభప్రదం!

వధువు ప్రతిజ్ఞ

నాతి చరామి అని వరుడు ప్రతిజ్ఞ చేశాక అతడు వధువుచే ప్రమాణం చేయిస్తాడు.

'ధర్మేచ అర్థేచ కామేచ తుభ్యం ప్రజా సహత్వ ధర్మచ్య ప్రతిపాద యామి'

"ధర్మార్థకామములందూ సంతానోత్పత్తి యందూ నీతో ననుసరించి గృహస్థాశ్రమ ధర్మాలను నిర్వర్తిస్తాను. నీవు కూడా నాతో అట్లే ఆచరించాలి" అని చెప్పి, అలాగే ఆచరిస్తానంటూ ఆమె చేత ప్రమాణం చేయిస్తాడు.

ఇలా వధూవరులిద్దరూ ప్రమాణం చేయడం వారి అన్యోన్యతకీ ఐకమత్యానికీ భావసారూప్యతకీ నిదర్శనం.

పరస్పర విరుద్ధంగా కనిపించే ధర్మార్థ కామాలను సమన్వయ పరిచే శక్తి భార్యకే ఉందని మహాభారతం చెబుతోంది.

అర్ధకామాలు భార్య ద్వారా నెరవేరడం వల్ల అధర్మ దోషం అంటదు.

ఇలా ధర్మంలో ఆ రెండూ కలిసి పురుషుడ్ని ఉన్నతుడ్ని చేస్తున్నాయి.

ఈ లోతు తెలుసుకుంటే కుటుంబ వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుంది.

26

జీలకర్ర - బెల్లం



సుముహూర్తమంటే మంగళ సూత్రం కట్టే సమయం కాదు.

వధూవరులు ఒకరి శిరస్సు మీద మరొకరు జీలకర్రా బెల్లంల మిశ్రమాన్ని పెట్టుకునే సమయమే ముహూర్తం.

గ్రహబలాన్నీ తిధివార నక్షత్రాలనీ చూసి వధూవరులకిద్దరికీ శుభం కలిగేలా శుభం కలగాలని ఆశిస్తూ వేద పండితులు నిర్ణయించింది శుభముహూర్తం.

సరిగ్గా ఆ సమయానికి జీలక్రరా బెల్లంలు వధూవరుల చేత పెట్టిస్తారు.

అలా పెట్టగానే వారికి పెళ్లి అయినట్టు లెఖ్ఖ.

అంచేత ఈ ఘట్టం తర్వాత ఇంకా వివాహ కార్యక్రమం ఉన్నప్పటికీ కూడా అతిథులు అక్షింతలు వేసి భోజనాలకి వెళ్ళిపోతూంటారు!

శుభలగ్నం

వధూవరుల నక్షత్రాలు, రాశులు చూచి గ్రహబలాన్నీ తిధి వారాల ఫలాల్నీ లెక్కించి శుభముహూర్తం నిర్ణయిస్తారు.

ఆ ముహూర్తాన పెళ్లి జరిగితే అన్ని విధాలా వధూవరులు పుత్రపౌత్రాదుల్తో సుఖసంతోషాలతో పాడి పంటలతో భోగభాగ్యాలతో తులతూగుతారని పెద్దల భావన.

ఇది ఒక నమ్మకమే అయినప్పటికీ గ్రహాల ప్రభావాన్ని తక్కువగా అంచనా వెయ్యకూడదు.

అదీగాక వధూవరులకు గ్రహరాశులన్నీ అనుకూలించాలని వారి వివాహం విజయవంతమవ్వాలని ఆకాంక్షించడమూ వుంది.

పెళ్లికి ఏదో ఒక సమయాన్ని నిర్ణయించాలి కదా. అది అన్ని విధాలా శుభస్కరంగా ఉండేట్లు పెట్టడంలో తప్పులేదు. పైగా శుభం జరుగుతుందన్న ఆశ, ఆకాంక్ష వధూవరులకీ వారి కుటుంబాలకీ కొండంత భరోసా ఇస్తుంది. ఆనందాన్ని పంచుతుంది. భవిష్యత్తులోకి ఆశావహంగా చూసేలా చేస్తుంది.

అలాటి దాన్ని శుభముహూర్త మనటం భావ్యమే కదా!

లగ్నాష్టకాలు

ముహూర్త సమయానికి అయిదు పది నిమిషాలముందే కన్యాదానం వగైరాలు జరిపించేస్తారు.

లగ్నం వరకూ గల వ్యవధిని పూర్తి చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమమే లగ్నాష్టకాలు.

అంటే ముహూర్తానికి మిగిలి వున్న సమయాన్ని బట్టి వీటిని పఠిస్తారు. వ్యవధి లేకపోతే విరమించి తిన్నగా జీలకర్ర-బెల్లం పెట్టించేస్తారు.

వధూవరులకు మంగళం కలగాలని చదివేవి గనుక అవి ఎనిమిది శ్లోకాలు గనుక 'మంగళాష్టకాలు' అని కూడా అంటారు.

లగ్నాష్టకాల్లో చదివే ప్రతిశ్లోకం చివరా **'సీతా రాఘవయోద్వివాహ సమయే కుర్యాదిదం మంగళమ్'** అంటారు. దాని అర్థం 'సీతారాముల పెళ్లిలో శుభం జరుగు గాక' అని!

అక్కడ ఉన్నది రాముడూ సీతా గాక పోయినా వరుడు రాఘవుడు లేదా శ్రీ మహావిష్ణువని భావిస్తారు.

అప్పుడు వధువు సీత లేదా శ్రీమహాలక్ష్మి అవుతుంది.

అందుకనే **'శ్రీ మహావిష్ణు రూపాయ వరాయ శ్రీమహాలక్ష్మి స్వరూపణీం కన్యామ్'** అంటారు.

అనగా మహావిష్ణు స్వరూపుడైన ఈ వరుడికి మహాలక్ష్మి రూపిణి అయిన వధువు నిచ్చి వివాహం చేస్తున్నామని మంత్రాల్లో చదువుతారు.

కాబట్టి ఎక్కడ పెళ్లి జరిగినా దంపతులు సీతారాములే లక్ష్మీనారాయణులే అవుతూంటారు!

జీలకర్ర, బెల్లంల ప్రత్యేకత

జీలకర్ర ఘాటైనది. బెల్లం తీయన. వీటి మిశ్రమం వేరు చేయలేనంతగా కలిసిపోతుంది. వధూవరుల బంధం కూడా విడదీయలేనంతగా కలిసిపోవాలన్నది ఆకాంక్ష.

జీలకర్ర బెల్లాన్ని కలిపి నూరినా నమిలినా ధన సంజ్ఞకమైన విద్యుత్తు (పాజిటివ్ ఎలక్ట్రిక్ చార్జి) పుడుతుందని పదార్థ విజ్ఞాన శాస్త్రవేత్తలు సూత్రీకరించారు. వధూవరుల పరస్పర జీవశక్తుల ఆకర్షణకు ఇది తోడ్పడుతుంది.

జీలకర్ర బెల్లం అనేవి ధన, ఋణ ధ్రువాలు. అటునుంచి ఇటు, ఇటు నుంచి అటు కలిసినప్పుడు విద్యుదయస్కాంత శక్తి పుడుతుంది. అదే సమయంలో వధూవరులు ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకోవడం వల్ల పరస్పర ఆకర్షణకులోనవుతారు. వారు ఒకే విధమైన జీవన తత్వానికి అనుసంధానమవుతారని చెబుతారు.

యోగశాస్త్ర భావన

మనిషికి తలపై మాడు భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది.

చిన్న పిల్లల్లో మెత్తగా ఉండే భాగం ఇదే. క్రమేణా గట్టిపడుతుంది.

నిత్యం మూసుకుని ఉండే ఈ బ్రహ్మరంధ్రంపై జీలకర్ర బెల్లంల మిశ్రమాన్ని ఉంచడం వల్ల అది తెరచుకుంటుంది.

వరుడి చేతి ద్వారా అతని లోని శక్తి జీలకర్ర బెల్లంల మిశ్రమంలోకి అక్కడ్నుంచి బ్రహ్మ రంధ్రంలోకి, అక్కడ్నుంచి దానిక్రిందున్న సహస్రాకార చక్రంలోకి, అందులోంచి భ్రూమధ్యం లోని ఆజ్ఞాచక్రంలోకి వెళ్ళి అక్కడ్నుంచి వెలుపలికి వస్తుంది.

అలాగే ఆమె నుంచి అతడిలోకి.

అప్పుడు ఒకరి భ్రూమధ్యం (కనుబొమల నడుమభాగం) లోకి మరొకరు చూస్తారు గనుక ఇరువురి శక్తులు కలుసుకుంటాయి. హస్తమస్తక సంయోగం వల్ల ఒకరితో ఒకరు కలిసిపోతారు.

స్థూలంగా చెప్పాలంటే జీలకర్ర బెల్లం ఘట్టం ద్వారా చూపులు మనసులు కలిసిన వధూవరులు ఒకరికొకరు పూర్తిగా వశమవుతారని భావన.

ఉత్తరద్వార దర్శనం

నాభి నుంచి తలవరకూ గలపై భాగాన్ని ఉత్తరాయణం అంటారు. అదెంతో పవిత్రమైంది. అందుకే ఆ భాగంలో బంగారు నగలు ధరిస్తారు.

బొడ్డు క్రింది నుంచి పాదాలు వరకూ గల భాగాన్ని దక్షిణాయణం అంటారు. ఇది అపవిత్రమైంది గనుకే వెండి నగలు ధరిస్తారు.

జీలకర్ర బెల్లం పెట్టేప్పుడు మంత్రశక్తి కారణంగా బ్రహ్మరంధ్రం తెరచుకుంటుంది.

శరీరమంతటికీ ఉత్తరంవైపున నడినెత్తి మధ్యలో ఉన్న బ్రహ్మరంధ్రం తన రెండు తలుపుల్నీ తెరిస్తే ఆ ఉత్తర ద్వారంలో పరమాత్మని ఎవరికి వారు దర్శించడమే ఉత్తర ద్వార దర్శనం!

శుభముహూర్తాన...

ముహూర్త సమయానికి ఖచ్చితంగా జీలకర్ర బెల్లం పెట్టించాలి.

కళ్యాణ వేదికపై వధూవరులు తూర్పుపడమ ముఖాలుగా ఒకరికి ఎదురుగా ఒకరిని కూర్చోబెడతారు.

వారి మధ్య ఉత్తర దక్షిణ ముఖాలుగా పసుపు రాసిన తెల్లని తెర పట్టుకుని ఇద్దరు నిలబడతారు.

పురోహితుడు సూర్యసూక్తం పఠిస్తూండగా మరో ప్రక్క మంగళ వాయిద్యాలు మోగుతూండగా ముహూర్తం వేళ వధూవరులు ఒకరి తలపై ఒకరు తమ కుడి చేతుల్తో తమలపాకుతో జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని ఉంచుతారు. దాని మీద చెయ్యి అలాగే ఉంచి ప్రమాణాలు చేస్తారు.

మాడుకు తాకేలా మిశ్రమాన్ని పెట్టాలి. వధూవరులకు అదే తొలి స్పర్శ అవుతుంది.

శరీరంలో శిరస్సుది పూజ్యస్థానం. అందుకే మొదట శిరస్సును స్పృశింపజేస్తారు.
అనంతరం అడ్డుతెర (తెరసెల్లా) తొలగిస్తారు.
వధూవరులు ఒకరినొకరు భ్రూమధ్యం లోకి చూస్తారు. అదే తొలిచూపు.
సుముహూర్తాన వారిద్దరు ఒకర్నొకరు చూసుకోవడమే **'సమీక్షణం'**

శుభక్షణాల్లో కలిసిన ఆ ప్రథమ దృష్టి వారి మధ్య మానసిక బంధాన్ని అనుక్షణం పెంచుతుందని విశ్వాసం.

ఒకరినొకరు స్పృశించడం ఒకరినొకరు చూసుకోవడమే ముహూర్తమన్నమాట. సుముహూర్తంలోనే అలా చూసుకోవాలనే ఉద్ధేశంతోనే అంత వరకూ వధూవరుల మధ్య తెరని అడ్డుగా కట్టేది!

ఆనందమానందమాయె



జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని శిరస్సుల మీద పెట్టగానే –

"అయం ముహూర్త స్సుమూహూర్తో అస్తు అస్మిన్ శుభదినే
శుభయోగే శుభ నక్షత్రే శుభకరణే శుభలగ్నే సర్వగ్రహ
శుభ స్థానేషు స్థిత్వా అన్యోన్యానుకూల దాంపత్య వంశాభివృద్ధి.
వరం ప్రదదాతి హరిః ఓం తత్సత్ జీరగుడాన్నిక్షిప్య..."

అంటూ పురోహితుడు మంత్రాలు పఠిస్తాడు.

మంగళవాయిద్యాలు తారస్థాయిలో మ్రోగుతాయి.

వధూవరుల చేత 'దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, కీర్తి, శక్తి, అభివృద్ధి కావాలని సత్సంతానం కలగాలని దీవించండి' అని మంత్రాలతో ప్రార్థింపజేస్తాడు పురోహితుడు.

పెద్దలు 'సుఖీభవ', 'సౌభాగ్య సిద్ధిరస్తు', 'తథాస్తు' 'ఓం సౌభాగ్యమస్తు' 'ఓం శుభం భవతు' అంటూ వధూవరుల శిరస్సులపై అక్షతలు వేసి దీవిస్తారు.

వరుడి ప్రక్కన వధువు

ఇంతదాకా ఎదురెదురుగా కూర్చున్న వధూవరులని ఒకే వరుసలో కూర్చోబెడతారు.

వరుడి ఎడమ ప్రక్కన వధువు కూర్చోవాలి.

ఇకపై చేసే కార్యాలన్నీ జంటగానే చేస్తారు.

వరుడు వధువుకి పూలమాల వేయగా ఆమె కూడా అతడి మెడలో పూలదండ వేస్తుంది.

తనకి కన్యాదానం చేసినందుగ్గాను వరుడు కన్యాదాత దంపతులను నూతన వస్త్రాలతో సత్కరిస్తాడు. పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు పొందుతాడు.

కన్యాదాత యొక్క మావగారు లేక బావమరిది కూడా కన్యాదాత దంపతులకూ వధువుకీ నూతన వస్త్రాలు బహూకరిస్తారు.

కాడి రంధ్రం ద్వారా అభిషేకం

వధువు శిరస్సుపై దర్భల చుట్టని వుంచి దాని మీద బండి కాడి ఆన్చి పట్టుకుంటారు. కాడి రంధ్రంలో బంగారాన్నుంచుతారు. దాన్లోంచి వధువు తలపై పడేట్లు జలం పోస్తారు.

కాడి రంధ్రంలోంచి బంగారం మీదుగా దర్భల మీంచి వధువు తలని పవిత్ర జలంతో అభిషిక్తం చేయటం వలన ఆమెకేమైనా జన్మదోషాలుంటే అవన్నీపోయి పవిత్రురాలవుతుందనీ శుభం జరుగుతుందనీ ఈ తంతు నిర్వహిస్తారు.

కాడి రంధ్రం గుండా పోసిన నీటిని సోమరసంగా భావిస్తారు.

యోక్త్రధారణ

24 దర్భలతో అల్లిన తాడును వధువు నడుముకు కట్టి ముడి వేస్తాడు వరుడు. దానితో ఆమెకు కర్మార్హతను కలిగిస్తాడు.

దర్భతాకిడితో ఆమె శరీరం పవిత్రం చెయ్యబడుతుంది.

ఉపనయనంతో వరుడికి ఎలాగైతే యజ్ఞకర్మలు చేసే అర్హత లభిస్తుందో యోక్త్రధారణ వల్ల వధువుకి భర్తతో కలిసి యజ్ఞం వంటి సర్వకర్మలనూ చేయడానికి అర్హత వస్తుంది.

అందువల్లనే దీనిని 'పత్నీవ్రతోపనయనం' అంటారు.

ఈ సందర్భంలో వరుడు చెప్పే మంత్రానికి అర్థం –

"ఈ జీవిత యజ్ఞమనే శుభకార్యం కోసం ఈమె నడుముకు దర్భతాడు (యోక్త్రం) కడుతున్నాను. మంచి మనస్సు, యోగ్యమైన సంతానం, చక్కని సౌభాగ్యం, శుద్ధమైన శరీరం. నీకు ఏర్పడాలని కోరుతున్నాను. అగ్నిహోత్రమున నాకు సహధర్మచారిణివై సత్కర్మలకు సిద్ధమవుతావని ఆశిస్తున్నాను."

ఈ రకంగా జీవిత యజ్ఞ నిర్వహణాధికారం భార్యకు లభిస్తుంది.

సుమంగళీ సింధూర దానం

ఉత్తర భారతదేశంలో ఉన్న ఆచారమిది.

వధూవరులిద్దరూ ఒకరికొకరు మనస్ఫూర్తిగా హామీ ఇచ్చుకుంటారు. తమ చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదనీ జీవితాంతం విశ్వాసపాత్రంగా వుంటామనీ నిజాయితీగా వ్యవహరిస్తామనీ మరోసారి ప్రమాణం చేస్తారు.

ఈ ప్రమాణానికి ముద్ర వేస్తున్నట్టుగా వరుడు వధువు పాపిట్లో కుంకుమబొట్టు పెడతాడు. మంత్రం చదువుతూ ఉంగరంతోగాని నాణెంతోగాని సింధూరాన్ని మూడుసార్లు అద్దుతాడు.

ఆ బొట్టు అతడికి ఆమె భర్తగా సంరక్షకుడిగా గుర్తింపునిస్తుంది.

ఆమె స్థానాన్ని అర్హతల్ని గుణాల్ని పెంపొందిచడానికి సాయపడతానని ప్రమాణం చేస్తాడు.

ఉత్తరాది వారికి మంగళసూత్రం ఉండదు. పాపిట్లోని సింధూరమే వివాహిత అని తెలియజెప్పే సూచిక అవుతుంది.

సమర్థుడికి భార్యనని సగర్వంగా చాటుతూ శిరస్సు మీద ధరిస్తుంది!

మంగళ తిలకం

సింధూర దానానికి ప్రతిగా వధువు వరుడి నుదుట తిలకం దిద్దుతుంది.

అతడ్ని గౌరవిస్తానని అతడి ప్రతిష్ఠ, స్థానం పెరిగేలా ప్రవర్తిస్తానని ప్రమాణం చేస్తుంది.



27

మంగళసూత్ర ధారణ

మంగళసూత్ర ధారణ దక్షిణ భారతదేశపు ఆచారం. ఉత్తరాది వారికిది లేదు.

గళ సూత్రమే మంగళసూత్రం.

పుస్తెలు గుచ్చిన పసుపుతాడు మంగళకరమైన మంగళాలకు నిలయమైన సూత్రం. అదే మంగళసూత్రం.

హిందూస్త్రీ వివాహిత అయినట్లు తెలియజేసే చిహ్నం ఇది.

తాళిబొట్టు, శతమానం, పుస్తెలతాడు, మాంగల్యం, సూత్రాలు – మంగళ సూత్రానికి పర్యాయపదాలు.

తాళిబొట్టు

తాళిబొట్టులో రెండు పుస్తెలుంటాయి. ప్రాంత ఆచారాల్ని బట్టి అవి గుండ్రంగానో రావి ఆకులానో లేక తమిళనాడులోలా విభిన్న రూపంలోనో ఉంటాయి.

వధువు పుట్టింటివారు ఒకటి, మెట్టినింటి వారు మరొకటి తేవడం సంప్రదాయం.

ఇది వరకు పెళ్లి రోజున విశ్వకర్మ (కంసాలి) ఇంటికి ముత్తైదువలూ పెద్దలూ మేళ తాళలతో వెళ్ళి పుస్తెల్ని తీసుకొచ్చేవారు.

పుస్తెకు బదులు పసుపు కొమ్ము సైతం వాడవచ్చు.

రెండు పుస్తెలూ లక్ష్మీ పార్వతులకి ప్రతిరూపాలుగా భావిస్తారు.

అవి వధువు రెండు కుటుంబాలకు మధ్య వారధి అనీ ఇరు వైపులవారి అనురాగాన్ని గ్రోలుతూ బాధ్యతలు నిర్వర్తిస్తూ సంతాన సంపదల వృద్ధికి కృషి చేస్తూ పుట్టింటికీ అత్తింటికీ పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అనుక్షణం గుర్తు చేస్తూంటాయి!

మంగళసూత్రం 'సౌభాగ్యాభరణం'!

మాంగల్య పూజ



మాంగల్యాన్ని ధరించిన స్త్రీ గౌరీ ఉపాసనను ఇతర వ్రతాల్ని అనుష్ఠించేందుకు అర్హతను పొందుతుంది.

మంగళసూత్రం భార్యాభర్తల శాశ్వతానుబంధానికి నిదర్శనం.

ఈ సూత్రానికి గౌరీదేవి అధిష్ఠానదేవత.

బంగారు మాంగళ్యాలను పసుపు త్రాటికి గుచ్చి వాటిలో మంగళదేవత, లక్ష్మీదేవిని ఆవాహన చేసి పూజిస్తాడు వరుడు.

పళ్లెంలో బియ్యం పోసి వాటి మీద కొబ్బరిబొండం తాంబూలం ఉంచాలి. తమలపాకుల్లో మంగళసూత్రాలు, మట్టెలు ఉంచి తమలపాకుతో సహా కొబ్బరి బొండం పై ఉంచాలి.

వాటికి వధూవరులచే పూజ చేయించాలి.

పిమ్మట సభలోని విప్రులచేతా ముత్తైదువుల చేత స్పృశింపచేయాలి. ముత్తైదువుల కంఠాలకి తాకించి వారి ఆశీస్సులందజేయించాలి.

పురోహితుడు మంగళసూత్రాన్ని అందరికీ చూపిస్తాడు. అక్షతల్ని అందరికీ ఇస్తాడు.

సూత్ర ధారణ

వరుడు వధువుకి ఎదురుగా నిలబడి వధువు మెడలో మంగళసూత్రాన్ని కడుతూ మూడు ముళ్ళు వేస్తాడు.

'మాంగల్యం తంతునానేన మమ జీవన హేతునా।

కంఠే బధ్నామి సుభగే త్వం జీవ శరదాం శతమ్॥'



అనగా 'నా జీవన హేతువైన ఈ సూత్రంలో నీ కంఠంలో మాంగ్యల్యాన్ని కడుతున్నాను. బంధహేతువైన మంగళసూత్రాన్ని ధరించి నీవు నిండు నూరేళ్ళు జీవించు' అని అర్థం.

పసుపు కుంకుమతో మూడు ముళ్ళని పూజించి వధువు తలమీద అక్షతలు చల్లుతాడు వరుడు.

వధువాతనికి నమస్కరిస్తుంది.

బాజా భజంత్రీలు తారస్థాయిలో మ్రోగుతాయి.

బంధుమిత్రులంతా వచ్చి వధూవరుల శిరస్సుపై అక్షతలు వేసి ఆశీర్వదిస్తారు.

సుఖమయమైన వైవాహిక జీవితాన్ని గడుపుతున్నంతకాలం స్త్రీ తన మంగళ సూత్రాన్ని ఒంటి మీంచి తీయదు. సావిత్రి మెడలోని మంగళసూత్ర శక్తే ఆమె భర్తని రక్షించిందని పురాణం. చంద్రమతి మెడలోని మంగళసూత్రం హరిశ్చంద్రుడికి మాత్రమే గోచరించేదన్న సంగతి వినే ఉంటారు.

మూడు ముళ్ళు

వరుడు వధువు మెడలో మంగళసూత్రాన్ని కడుతూ మూడు ముళ్ళు వేస్తాడు.

'త్రిషత్యా హి దేవా!' అంటుంది వేదం. అనగా ముమ్మారు ఉచ్చరించిన మాటను దేవతలు సత్యంగా పరిగణిస్తారు. అంచేత మూడు ముళ్ళు వేయిస్తారు.

ఈ మూడుముళ్ళూ బ్రహ్మ విష్ణు మహేశ్వరుకు ప్రతీకలుగా భావిస్తారు.

ఇంకో కారణమేమిటంటే ప్రతి వ్యక్తికీ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడు ఉంటాయి. ఈ మూడు శరీరాలకు మూడు ముళ్ళు వేయిస్తున్నట్టుగానూ భావించవచ్చు.

మూడు ముళ్ళు భర్తతో కుటుంబంతో సమాజంతో వధువుకి ఏర్పడబోయే అనుబంధానికి నిదర్శనం.

మనసా వాచా కర్మాణా అని కర్మలు మూడు. ఈ మూడు విధాలుగానూ సూత్రం కడతారు గనుక మూడు ముళ్ళు వేస్తారంటారు.

నమ్మకం, ప్రేమ, పవిత్రతల సమాహారమే కదా మూడు ముళ్ళ బంధం!

అక్షతలు

వడ్లు మొలకెత్తుతాయి. కానీ బియ్యం మొలకెత్తవు. అలానే కర్మ వాసనల నుండి దూరంగా ఉండి తిరిగి జన్మవద్దు అనే భావంతో పూజించడం అక్షతల పూజ.

బియ్యంలో ఆవునెయ్యి, పాలు, పసుపు, మంగళ ద్రవ్యాలు కలపగా తయారైనవి అక్షతలు.

క్షయం లేనివి అక్షతలు. క్షతిలేని సంతతశుభాల్ని కలిగించేవి అని అర్థం.

మంత్రపూర్వకంగా పసుపు కుంకాలు కలిపి తయారు చేసినవి గనుక అక్షతలను మంత్రాక్షతలు అంటారు.

ప్రతి శుభకార్యంలోనూ పెద్దలు చిన్నవారిపై చల్లి ఆశీర్వదించడం హిందూ సంస్కృతిలోని ఆచారం. అక్షతలు పూర్ణత్వానికి పవిత్రతకు చిహ్నాలు!

మంత్రాక్షతలను చేతిలోకి తీసుకున్నప్పుడు వారిలోని విద్యుత్తు వాటిలోకి ప్రవేశిస్తుంది. తలపై వేసినప్పుడు అక్షింతల ద్వారా ఆ విద్యుత్తు వారిలోకి పరావర్తనం చెందుతుంది.

గాయత్రీ మంత్ర ప్రకారం మానవుని దేహంలో 24 విద్యుదుత్పాదక కేంద్రాలున్నాయి. వాటిలో ముఖ్యమైంది తల భాగం. అందుకే అక్షింతలను తల మీద వేయడం!

తలంబ్రాలు

వీటినే 'అక్షతారోపణం' అనీ అంటారు.

మొదట వరుడు వధువు హస్తాన్ని దర్భలతో తుడుస్తాడు. ముత్యాలు పగడాలు కలిపిన పసుపు బియ్యాన్ని ఎండుకొబ్బరి చిప్పతో రెండుసార్లు పోస్తాడు. క్షీరాన్ని రెండుసార్లు చిలకరిస్తాడు.

వరుని దోసిలిలో అదే విధంగా అక్షింతలను పోస్తాడు పురోహితుడు.

వరుడు వధువు తలమీద పోశాక వధువు వరుడి శిరస్సు మీద పోస్తుంది.

'ప్రాలు' అంటే బియ్యం. తలమీద పోసుకునే బియ్యం కాబట్టి తలంబ్రాలు అయ్యింది.

తలంబ్రాల ఘట్టం సుమనోహరమైంది. ఆనంద వినోదాలు పంచేది.



సీతమ్మ చేతిలో ముత్యాల తలంబ్రాలు పోయగానే అవి ఆమె దేహచ్ఛాయ కారణంగా పద్మరాగాల్లా ప్రకాశించాయట. రామయ్య దేహం మీద పైనుంచి కిందకు జారుతున్నప్పుడు ఇంద్రనీలమణులై ప్రకాశించాయట. ఎంత రసరమ్య భావన!

తలంబ్రాలు పోసుకోవడం వేదాల్లోలేదు. మధ్యలో వచ్చిన ఆచారం. దక్షిణాదిలోనే కన్పిస్తుంది.

ఇప్పుడు వీడియోలో అందంగా కన్పించడానికి తలంబ్రాలలో చమ్కీలు, మల్లెపూలు, గులాబీరేకులు, థర్మాకోల్ బాల్స్ వగైరాలు కలుపుతున్నారు.

పసుపు కలిపిన బియ్యం వధూవరుల తలమీంచి శరీరం పైకి పడటం వల్ల దుష్టశక్తుల దృష్టి నీచగ్రహాల పీడ సోకదని ఓ నమ్మకం.

వధువును ధాన్యలక్ష్మిగా వర్ణిస్తారు.

తలంబ్రాలు పోసుకునేప్పుడు సంతానవృద్ధీ పశుసంవృద్ధీ యజ్ఞసమృద్ధీ కలగాలని పురోహితుడు మంత్రాలు చదువుతాడు.

ఇద్దరికీ సమానస్థానం కల్పిస్తూ 'కలిసి చేస్తాము' 'కలిసి చేసుకుంటాము' అన్న భావనని కలగజెయ్యడమే దీని ఉద్దేశం.

పోటీ పడి మరీ పోసుకునే తలంబ్రాలు ఘట్టం ఆద్యంతం కమనీయం. రమణీయం.

దీని వల్ల వధూవరుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది.

ఎక్కువ తక్కువ భావం సమసి పోవాలి.



తలంబ్రాల మంత్రాలు

తలంబ్రాల సందర్భంగా పురోహితుడు ఎన్నో మంత్రాలను చదువుతాడు.

వాటిలో మచ్చుకి ఒక మంత్రం యొక్క అర్థం:

'కర్రి ఆవులను స్మరించండి. అనేక దానాలు చేయండి. పుణ్యం వృద్ధి పొందాలి. శాంతి, పుష్టి తుష్టి వృద్ధి కలగాలి. విఘ్నాలు తొలగిపోవాలి. ఆయుష్యం, ఆరోగ్యం కలగాలి. క్షేమం మంగళం కలగాలి. సత్కర్మలు వృద్ధి పొందాలి. గ్రహాల వల్ల నక్షత్రాల వల్ల సోముని వల్ల మన దాంపత్యం సరిగా జరగాలి. శాంతి కలగాలి'

వధూవరుల దాంపత్యం శోభస్కరం శుభస్కరంగా వుండాలన్న 'శుభాకాంక్ష'లే ఈ మంత్రాలు!

బ్రహ్మముడి



వధువు చీరకొంగునూ వరుడి ఉత్తరీయం యొక్క అంచునూ కలిపి ముడివేస్తాడు పురోహితుడు. వారి బంధాన్ని పటిష్ఠపరిచే చర్య ఇది.

దీనినే బ్రహ్మముడి వేయుట, కొంగులు ముడివేయుట, బ్రహ్మగ్రంథి అంటారు.

ఇద్దర్ని కలిపి కొత్త వ్యక్తిని సృష్టించడం. రెండు శరీరాల రెండు మనస్సుల ఏకత్వమన్న మాట.

కొంగుముడిలో నాణెం, పువ్వులు, దర్భలు, పసుపు కొమ్ము, అక్షింతలు పెట్టి ముడి వేస్తారు.

వధూవరుల మీద అక్షతలు వేస్తూ పురోహితుడు–

'ధ్రువం తే రాజా వరుణో ధ్రువం దేవో బృహస్పతిః

ధ్రువం త ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువమ్'

అని మంత్రం చదువుతాడు.

'దాంపత్య సామ్రాజ్యాన్ని ధరించిన మీకు వరుణుడు, బృహస్పతి, ఇంద్రుడు, అగ్ని నిశ్చలత్వం కలుగజేయుదురుగాక!'

'పూషా త్వేతో నయతు హస్త గృహ్యాశ్వినౌ త్వా ప్రవహతాం రథేన!

గృహాన్ గచ్ఛ గృహపత్నీ యథా సోవశినీ త్వం విదథమావదాసి'॥

'నిన్ను పూష ఇలా వెంట తీసుకెళ్ళాలి. అశ్వినీ దేవతలు నీ చేతులు పట్టుకుని రథంపైన తీసుకుని రావాలి. ఇంటి ఇల్లాలిగా అన్నింటిని తీర్చిదిద్దటానికి నా ఇంటికిరా. యజమానురాలిగా గృహస్థ ధర్మాన్ని నిర్వహించు' (పూష దేవతలందు శ్రేష్ఠుడు)

కేవలం రెండు వస్త్రాలని కాదు ఇద్దరు వ్యక్తుల్ని కలిపి క్రొంగొత్త ఆకారాన్ని సృష్టించడమే దీని లక్ష్యం.

ప్రేమానుగారాలతో సీతారాముల్లా పార్వతీ పరమేశ్వరుల్లా కలిసి సుఖించమని దీవిస్తారు.

కొంగుముడిలోని పదార్థాలు

బ్రహ్మముడిలో పెట్టిన నాణెం డబ్బుకి ప్రతీక.

ఇకపై డబ్బూ ఆస్తీ ఏ ఒక్కరిదీ కాదని చెబుతుందిది. ఎవరు సంపాదించినా దానిమీద ఇద్దరికీ హక్కు ఉంటుందనీ ఆదాయం, ఖర్చు, ప్రణాళిక – కలిసి ఉమ్మడిగా చేయాల్సిన పనులని భావం.

దర్భగడ్డి ఎన్నటికీ వాడని ప్రేమకి నిదర్శనం.

దర్భగడ్డి తన జీవ లక్షణాన్ని కోల్పోదు. కాసిన నీళ్ళు చల్లితే చాలు మళ్ళీ పచ్చగా మారుతుంది. అలా వివాహబంధం ఎప్పటికీ పచ్చగా ఉండాలని జీవితాంతం వారి మధ్య ప్రేమాభిమానాలూ సాహచర్యమూ సజీవంగా ఉండాలని తాత్పర్యం.

పసుపు కొమ్ము ఆరోగ్యానికి చిహ్నం.

వధూవరులిద్దరూ శారీరక మానసిక ఆరోగ్యాలు బాగా ఉండేట్లు చూసుకోవాలి. నడచుకోవాలి. మరొకరి ఆరోగ్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించకూడదు. అనవసర ఒత్తిళ్ళకీ క్షోభకీ ఆందోళనకీ గురి చెయ్యరాదు.

అక్షింతలు సమిష్టి బాధ్యతలకు గుర్తు.

బంధుమిత్రులతో సత్సంబంధాలు కొనసాగించాలి. సమాజం పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి. బాధ్యతాయుతంగా మెలగాలి. వారి బంధం వారిద్దరితోనే

కాదు సమాజంతో కూడా అనుసంధానం చెయ్యబడిందని చెప్పడం దీని ఉద్దేశం. వడ్లగింజల్ని పాతితే వేలాది గింజలు కాస్తాయి. సంఘహితం కోరే కార్యాల్ని విత్తితే సమాజ వికాస పుష్పాలు పూస్తాయి.

పువ్వులు సంతోషానికీ పవిత్రతకూ మారుపేరు.

అవెక్కడ ఉన్నా సంతోషంగా ఉంటుంది. చక్కని అనుభూతుల్ని కలిగిస్తుంది. వధూవరులు కూడా ఒకర్నొకరు సంతోషపెట్టడానికి కృషి చేయాలి. ఒకరి కీర్తి ప్రతిష్ఠలు మరొకరికి వ్యాపింప జేయాలి. పవిత్ర మనస్కులై మెలగాలి.

కొంగుముడిలో ఉంచే ఈ అయిదు పదార్థాలూ భార్యాభర్తలకి వివాహ లక్ష్యాన్ని గుర్తు చెయ్యడానికి ఉద్ధేశింపబడ్డాయి.

ఇద్దరి మధ్య సద్భావనని నిజాయితీని పెంచి వారి బంధాన్ని శాశ్వతం చేసి వారి వైవాహిక జీవితాన్ని విజయవంతమూ శుభప్రదమూ చెయ్యాలన్నదే పెద్దల ప్రయత్నం. ఆశయం!

కొన్ని ప్రాంతాల్లో బ్రహ్మముడిలో కంద పిలకలు, ఖర్జూరఫలాలు, వక్కలు, తమలపాకులు ఉంచుతారు.

వస్తువు లేమైనా ఆశయం ఒక్కటే. ఆకాంక్ష ఒక్కటే.

పాణిగ్రహణం

వధూవరులు ఒకరి కుడిచేతిని మరొకరు 'కరచాలనం'లోలా పట్టుకోవడమే ప్రాణిగ్రహణం. సమంత్రకంగా పట్టుకుని సప్రమాణాలు చెయ్యడమే పాణిగ్రహణం. వివాహంలో ముఖ్యమైన ఘట్టం ఇది.

వరుడు వధువు యొక్క తిరగేసిన కుడిచేతిని తన బోర్లించిన కుడిచేత్తో పట్టుకోవాలి.

'సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః।
తృతీయో అగ్నిష్టేపతి స్తురీయస్తే మనష్యజాః॥'

'నీవు తొలుత సోమునకు, రెండవసారి గంధర్వునకు, మూడవసారి అగ్నికి నాలుగవసారి మానవుడనగు నాకు భార్యవైనావు'

'సోమో దదద్గంధర్వాయ గంధర్వోఽదద దగ్నయే।
రయించ పుత్రాంశ్చాదా దగ్ని ర్మహ్య మథో ఇమామ్॥'

'సోముడు గంధర్వునకు, గంధర్యుడు అగ్నికి ఇవ్వగా అగ్ని నాకు ఈమెను ధనపుత్ర సహితముగ ఇచ్చినాడు'

'గృహ్ణామి తే సౌభగత్వాయ హస్తం మయా పత్యా జరదష్టిర్యథాసః ।
భగో ఆర్యామా సవితా పరంధిర్మహ్యాం త్యాదుర్గార్హ్వ పత్యాయ దేవాః ॥'

'మనం కడదాకా సౌభాగ్య భరితంగా కలిసి జీవించడానికి, సంతానాన్ని పొందటానికి నీ చేతిని పట్టుకున్నాను. సవిత మొదలైన దేవతలు గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వర్తించడానికి నిన్ను నాకు ఇచ్చారు' అంటాడు వరుడు.

వివాహం జీవితాంతం కొనసాగే పవిత్రబంధం. ఇది దేవతల అనుగ్రహంతో ముడివడిన బంధం - అని సారాంశం.


పాణి గ్రహణాన్ని ఒకరికొకరు 'చేదోడు'గా ఉంటామని 'చేయూత' నిస్తామని అభయం ఇచ్చిపుచ్చుకోవడంగా భావించాలి.

ఒకరి చేతినొకరు పట్టుకోవడం వైవాహిక జీవనయాత్ర ఆరంభానికి సూచిక.

కలిసి సాగడమంటే ఒకర్నొకరు ఉత్సాహపరచుకుంటూ ఉత్తేజపరచుకుంటూ ఉన్నత విలువల సాధనకి ఒకరికొకరు సహకరించుకుంటూ ఒక్కరిగా బ్రతకడమే!

అదే వివాహ ధ్యేయం!

ప్రాచీనకాలంలోనూ!



'ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ।
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా॥'

రామాయణంలో రాముని చేత సీత యొక్క పాణిగ్రహణం చేయిస్తూ జనక మహారాజు అన్నమాటలివి.

'ఈ సీత నా కుమార్తె. నీకు సహధర్మచారిణి. ఈమెను పరిగ్రహించు. నీకు మంగళ మగు గాక. ఈమె చేతిని నీచేతితో గ్రహించు.'

పాణిగ్రహణ ప్రతిజ్ఞ

ఈ సందర్భంగా వరుడు కొన్ని ప్రమాణాలు చేస్తాడు. భవిష్యత్తు గురించామెకి భరోసా కలిగిస్తాడు.

'అమోహ మస్మిమాత్వం మాత్వమస్యమోహమ్ ।
సామాహ మస్మిఋక్త్వం ద్యౌరహం పృథివీత్వమ్ ॥'

'ఇంతదాకా నేను లక్ష్మీ హీనుడ్ని. నీవు లక్ష్మివి. నీ చేరికతో నేను లక్ష్మీవంతుడ్నయ్యాను. నీవు నిజంగా లక్ష్మివే. నువ్వు లేకుంటే నేను దీనుడ్ని. నీవు సామవేద ఋక్కువు. నేను స్వరలాస్యాన్ని. నీవు సజల సఫల సంపన్నమైన ధరణివి. నేను నిర్మలమైన ఆకాశాన్ని!'

'తావేహి వివాహావహై సహరేతో దధావహై ।
ప్రజాం ప్రజన యావహై పుత్రాన్ విందావహై బహూన్ ॥'

'రా! నా ప్రాణాన్ని వివాహ సూత్రంతో కలిపి బంధించుకొందాం. ప్రపంచంలోని మేళన శక్తితో సత్పుత్రులను కని ప్రపంచానికి సమర్పించుకొందాం!'

'తేసన్తు జరదష్టయః సంప్రియారోచిష్ణు సుమనస్యమానౌ ।
పశ్యేమ శరదః శతం జీవేమ శరదః శతం శ్రణుయామ శరదః శతం'

'మనమిద్దరం సుందరమైన తేజస్సులను పొంది ప్రేమమగ్నులమవుదాం. మన ఇద్దరి మనస్సులను మంగళమయ భావాలతో నిమగ్నం చేద్దాం. శత సంవత్సరాల శోభను చూద్దాం. శతవర్షాలు సుఖంగా జీవిద్దాం. నూరు వసంతాల పాటు కోకిల కల కూజితాలను విందాం.'

ఎంత అద్భుత ఆకాంక్ష! ఎంత ఆశావహదృక్పథం!

వివాహం సంతానం కోసమే కాదు సుఖానుభవం కోసం కూడా.

నూరేళ్ళు సుఖ సంతోషాలతో తులతూగాలి!

మనస్సమర్పణ

వధువు గుండెల మీద వరుడు చేయి వుంచి ఇలా అంటాడు.

'యదేత్ హృదయం తవ తదస్తు హృదయం మమ

యదిదం హృదయం మమ తదస్తు హృదయం తవ'

అనగా 'నీ మనస్సు నా మనస్సు కావాలి. నా మనస్సు నీ మనస్సు కావాలి' అని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తాడు.

పాణిగ్రహణంలో మరో విశేషం కూడా ఉంది.

వరుడు తన కుడి చేతితో వధువు అరచేతిని మూస్తాడు. అంటే ఆమె అయిదు వేళ్ళనీ తన చేత్తో కవర్ చేస్తాడు.

అలా పట్టుకుని భగ, ఆర్యమ, సవిత, ఇంద్ర, అగ్ని, సూర్య, వాయు, సరస్వతి-లను స్తుతిస్తాడు.

దీర్ఘాయుష్షు, సత్సంతానం, అభివృద్ధి, ఆనందం, అవగాహన వివాహ జీవితంలో ఉండాలని కోరతాడు.

మూసిన వధువు వేళ్ళు ఆమె గుండెకు చిహ్నం.

పాణిగ్రహణం వల్ల ఆమె తన గుండెను అతడి చేతుల్లో పెడుతోందన్న మాట!

దాన్ని పదిలంగా చూసుకోవాల్సిన బాధ్యత వరుడిదే!

28

సప్తపది

ఇది వివాహకాండలో అత్యంత ముఖ్యమైన ఘట్టం.

హిందూ వివాహ చట్టరీత్యా సప్తపది జరిగితేనే వివాహం అయినట్టు లెఖ్ఖ.

సప్తపది అంటే ఏడడుగులు. వివాహసమయంలో వధూవరులు కలిసికట్టుగా వేసే ఏడు అడుగులే సప్తపది.

ఒక్కో అడుగుకూ ఒక్కో ప్రత్యేకత వుంది. ఒక్కో ప్రతిజ్ఞ వుంది.

జీవితాంతం ఒకరితో ఒకరు ఒకరి ప్రక్కన ఒకరు ఒకరికోసం ఒకరుగా వుంటూ ఒకటిగా కలిసి జీవిస్తామంటూ అందుకు నాందిగా అగ్నిసాక్షిగా కలిసి వేసే తొలి అడుగులే సప్తపది.

జీవితానికి అవసరమైన ముఖ్యాంశాల్ని ఏడు అడుగుల్లోకి ఇమిడ్చి ప్రామాణికంగా రూపొందించబడినదే 'సప్తపది'!

అగ్ని ప్రదిక్షణ



సప్తపదికన్నా ముందు వధూవరులు అగ్నిచుట్టూ క్లాక్‌వైజ్‌గా ఏడుసార్లు ప్రదక్షిణ చెయ్యాలి.

మొదటి నాలుగుసార్లూ వధువు ముందు నడవగా వరుడు అనుసరించాలి.

మిగతా మూడుసార్లూ వరుడిని వధువు అనుసరించాలి.

ఇక్కడ వరుడికన్నా వధువుకి అధిక ప్రాముఖ్యమివ్వడం గమనార్హం.

కుటుంబ వ్యవహారాల్లో వధువుదే నాయకత్వ ప్రాధాన్యత.

భర్త ఆమె సలహాని పాటించాలి. స్త్రీకి సర్దుకుపోయే సామర్థ్యం ఎక్కువ. పైగా అనుభవాన్ని త్వరగా గ్రహిస్తుంది. గనుక ఆమె మాట వినాలని సూచన.

బయటి వ్యవహారాలు పురుషుడి రాజ్యంలోవి గనుక వాటినతడు చక్కబెట్టాలి.

రెండింట్లోనూ ఉభయుల సంప్రదింపులు తప్పనిసరి.

స్త్రీకి సున్నితమైన మనస్సు, ప్రేమ హృదయం, భావోద్వేగాలు ఉంటాయి.

మగాడికి శారీరకబలం, నేర్పు, కార్యదక్షత ఉంటాయి.

సుఖజీవనానికి రెండూ కావాల్సిందే. రెండూ సహకరించాల్సిందే. ఆ సంగతి నొక్కిచెబుతుందీ ఘట్టం.

సీతారాములు, లక్ష్మీనారాయణులు, పార్వతీపరమేశ్వరులు-అంటూ స్త్రీకి పథమగౌరవం ఇవ్వడం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన విషయం. గర్వించాల్సిన సంగతి.

సప్తపది



భార్యకి భర్త 'ఏడుగడ' అంటారు. అంటే ఏడు విధాలా రక్షణగా వుండాలి. అందుకే అగ్నిసాక్షిగా ఏడడుగులు నడిపిస్తారు.

వధూవరులిద్దరూ ఒక జట్టుగా మిలటరీ మార్చింగ్‌లోలా ఏడు అడుగులు వెయ్యాలి.

వరుడు వధువు కుడిచేతిని పట్టుకుని యజ్ఞకుండమునకు ఉత్తర భాగానికి తీసుకెళ్తాడు. అక్కడామె వరునికి కుడివైపున నిలబడాలి. వరుడు తన కుడి హస్తాన్ని వధువు కుడిభుజంపై వుంచి ఇద్దరూ ప్రక్క ప్రక్కన ఈశాన్యదిశగా కుడికాలుతో అడుగులెయ్యాలి. అడుగు దూరంలో గుప్పెడు బియ్యం లేదా తమలపాకు వుంచి అక్కడికి అడుగు వేయమంటాడు పురోహితుడు.

ప్రతిఅడుగుకీ ఒకో మంత్రం చెబుతూ అలా ఏడు అడుగులు వేయిస్తాడు.

ఇద్దరూ ఒకేసారి కలసికట్టుగా అడుగువెయ్యాలి.

ఒక్కో అడుగూ ఒక్కో అంశానికి ప్రతీక. వివాహితుల జీవితం స్థూలంగా ఏడు అంశాలతో ముడివడి వుంది.

ఆయా అంశాల సాధనకు కృషిచేస్తామని వధూవరులిద్దరూ దేవతల సాక్షిగా పెద్దల ఎదుట ప్రమాణం చెయ్యాలి.

వివాహ విధుల్లో సప్తపది అతిముఖ్యమైంది. సప్తపది జరిగితేనే పెళ్లయినట్టు.

ఏడడుగుల బంధం

'ఏకమిషే విష్ణుస్త్వాన్వేతు

ద్వే ఊర్జే విష్ణుస్త్వాన్వేతు

త్రీణి వ్రతాయ విష్ణుస్త్వాన్వేతు

చత్వారి మయో భవాయ విష్ణుస్త్వాన్వేతు

పంచపశుభ్యో విష్ణుస్త్వాన్వేతు

షడృతుభ్యో విష్ణుస్త్వాన్వేతు

సప్త హోత్రాభ్యో విష్ణుస్త్వాన్వేతు'

వరుని వెంట వధువు వేసే ఒక్కొక్క అడుగుకు ఒక్కొక్క ప్రయోజనం ఉంది. అది పై మంత్రంలో వరుడు చెప్తాడు.

"నీవు నావెంట నడు. విష్ణుమూర్తి నీవు వేసే మొదటి అడుగువల్ల అన్నాన్ని రెండవ అడుగు వల్ల బలాన్ని, మూడో అడుగువల్ల మంచి కార్యాలను, నాల్గో అడుగువల్ల సౌఖ్యాన్ని, ఐదో అడుగువల్ల పశుసమృద్ధినీ, ఆరో అడుగువల్ల ఋతు సంపదను, ఏడో అడుగువల్ల ఏడుగురు హోతలను నీకు అనుగ్రహించుగాక!"

ఆహారం కోసం మొదటి అడుగు

సప్తపదిలో వేసే తొలిఅడుగు ఆహారంకోసం.

'ఓమ్ ఇష ఏక పదీ భవ సామామనువ్రతాభవ....'

'ఓ వధూ! నీవు అన్నము కొరకు ప్రథమ పాదమునుంచుము'

జీవించడానికి ఆహారం ముఖ్యమే అయినా ఏదిబడితే అది తినకూడదు. ఆహారం ఆరోగ్యాన్ని పెంచి పోషించేదిగా ఉండాలి. రుచికన్నా బలవర్ధకత ముఖ్యం. ఎంత ఖరీదైన ఆహారమైనా రుచిగా వండకపోతే సరైన రీతిలో భద్రపరచకపోతే వృథా అవుతుంది.

అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం వివాహితుల ప్రథమ బాధ్యత. అన్నానికి మూలమైన ధాన్యం సమృద్ధిగా ఉండటమే ఐశ్వర్యం కదా!

శక్తి కోసం రెండో అడుగు

'ఓమ్ ఊర్జే ద్విపదీ భవ....."

బలసంపాదనకై ద్వితీయ అడుగు వేయాలి.

శారీరకశక్తి, మేధోశక్తి, మానసికశక్తి – చక్కని జీవనానికి అత్యవసరం.

కష్టించి పనిచెయ్యాలి. విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. మంచి ఆలోచనలతో అలవాట్లతో శక్తి సంపన్నులు కావాలి.

చదువు, చర్చ, జ్ఞానం, ఆరోగ్యం, పోటీతత్వం పెంచుకోవాలి.

ఇద్దరూ శక్తిమంతులుగా ఆరోగ్యవంతులుగా ఉండటానికి తెలివితేటల్ని పెంచుకోవడానికీ కృషిచెయ్యాలి.

సాధనతో శక్తి వికసిస్తుంది. సంపద సృష్టికి శక్తిమూలం. ముఖ్యం!

శక్తియుక్తుల్ని చెడుకార్యాలకు వినియోగించకూడదు. సమాజకళ్యాణానికి కృషిచెయ్యడం సంఘజీవిగా వారి బాధ్యత. సదాచార వర్తనులై పరోపకారబుద్ధితో ఉత్తములుగా జీవించాలి.

సత్కర్మల కోసం మూడో అడుగు

సత్కార్యాలకోసం అంటే వ్రతాలు మొదలైనవాటి కోసం వేసే అడుగు మూడవది. అంటే దీనితో వ్రతాలాచరించే అధికారం సిద్ధిస్తుందన్నమాట.

గృహస్థాశ్రమ ధర్మాలను నిర్వహించే యజమానికి గృహిణి అర్ధాంగి. అన్ని పనుల్లోనూ చేదోడు వాదోడుగా వుండాలి.

పురుషార్థ సాధనలోనేకాదు కుటుంబ నిర్వహణలో సంతాన పెంపకంలో సామాజిక బాధ్యతల్లో ధార్మిక కార్యాల్లో సాయసంపదలందివ్వాలి.

అతడు అధర్మమార్గాన పయనించకుండా కాపుగాయాలి.

కుటుంబం తద్వారా సామాజ కళ్యాణానికి తోడ్పడే చక్కని కార్యాల్ని దానధర్మాల్ని వ్రతాల్ని చేయించాలి. అందుకోసం వేసిందీ అడుగు.

సుఖం కొరకు నాల్గవ అడుగు

'ఓం మయోభవాయ చతుష్పదీ భవ...."

సుఖవృద్ధికై చతుర్థ అడుగు వెయ్యాలి. ఎప్పుడూ కష్టపడటమే కాదు శరీరమూ మనస్సూ సేదదీరడానికి విశ్రాంతీ వినోదమూ చాలా అవసరం.

సుఖజీవనానికి అనువైన వాతావరణం కల్పించుకోవాలి.

తృప్తీ సంతోషాలు వృద్ధి చేసుకోడానికి విహారయాత్రలకి తీర్థయాత్రలకి సినిమాలకి షికార్లకి వెళ్ళాలి.

సమస్యలూ ఇబ్బందులూ ఉంటాయి. వాటికి ఇవ్వాల్సిన దాని కన్నా అధిక విలువివ్వకూడదు. నిబ్బరంగా వ్యవహరించాలి. ఆశావహ దృక్పథం అలవర్చుకోవాలి.

చిరునవ్వుల్ని చెదరనీయకూడదు. చిన్న చిన్న వాటిల్లో సైతం ఆనందం వెదుక్కోవాలి.

సుఖం అనేది డబ్బులో కాదు తృప్తిలో వుందన్న సంగతి మరువ రాదు.

తృప్తిని మించిన ఆనందం లేదన్నది గ్రహించాలి.

అసూయ, దుర్బుద్ధి, ద్వేషం, ఉక్రోషం దురాశలాంటి వాటిని మన దరి దాపులకు రానివ్వకూడదు. సుఖానికి ఫలం ఆయుసమృద్ధే!

పశుసమృద్ధి కొరకు అయిదవ అడుగు

"ఓం ప్రజాభ్యః పఞ్చపదీ భవ...."

పశుసంపద కోసం అయిదవ అడుగువేయాలి.

పశువుల పెంపకం, వ్యవసాయం ప్రాచీన వృత్తులు.

పాడి పంట సమృద్ధిగా లభించాలంటే పశువుల వృద్ధి జరగాలి.

ఈ నాటికీ పాలు పెరుగు నెయ్యి వగైరాలన్నీ పశువుల్నుంచే లభిస్తున్నాయి.

వాటిని పూజించడం వ్యావసాయిక దేశమైన మనదేశపు సంస్కృతి. సంక్రాంతి పండుగలో కనుమనాడు పశువుల్ని పూజించేది ఇందుకే.

ఋతువుల అనుగ్రహం కొరకు ఆరవ అడుగు

'ఓమ్ ఋతభ్యః షట్పదీ భవ..."

ఋతువుల అనుకూలతకోసం వేసేది ఆరవ అడుగు.

ఆరవ అడుగు నడుచుటచే ఋతువుల అనుగ్రహసిద్ధి లభిస్తుంది. సత్వర ఫలితాలు కలగజేస్తాయి.

మనిషి సాగించే వ్యవసాయాది సమస్త కార్యకలాపాలకు ఋతువులు అనుకూలించాలి. తద్వారా ప్రకృతి కరుణించాలి.

సకాలంలో వర్షం పడితే పంటలు బాగా పండుతాయి. వృక్ష సంపద పెరుగుతుంది. పశువులు వృద్ధిచెందుతాయి. మనిషికి ఆహార నీటి కొరతలుండవు.

ఒక్క వ్యవసాయానికే కాదు ప్రతి పనికీ ప్రకృతి అనుకూలించాలి. మానవ మనుగడ ప్రకృతి మీదే ఆధారపడి వుంది గనుక ఋతు ప్రసన్నత కోసం ప్రార్థించాలి. తుఫానులూ సునామీలూ సృష్టించి మనిషి మీద ప్రకృతి ఆగ్రహించకుండా అర్థించాలి. అనుగ్రహించమని ప్రకృతిని ప్రార్థించాలి. ప్రకృతో రక్షతి రక్షతః!

హోతల కోసం ఏడవ అడుగు

ఏడుగురు హోతలు పొందడానికి వేసే అడుగు ఏడవది.

హోత అంటే యజ్ఞం చేసేవాడు. అగ్ని. రుత్విజుడు.

అంతటి ఉత్తములు ఏడుగురు సంతానంగా పొందాలన్న ఆకాంక్ష.

సంతానంతో భార్యాభర్తల మైత్రి దృఢమవుతుంది. ఆనందం, అన్యోన్యత చిర సుఖసంతోషాలు లభిస్తాయి.

భార్యభర్తల ప్రేమ ఫలమే సంతానం. పుత్ర పౌత్రపరంపర సంతానం ద్వారానే కొనసాగుతుంది. అంటే సంతానం ద్వారానే సృష్టి నడుస్తుంది.

'నపుత్రస్య గతిర్నాస్తి' అన్నారు. ఇక్కడ పుత్ర అంటే పుత్రుడు లేక పుత్రిక అని చెప్పుకోవాలి. సంతతి లేకపోతే 'పర' గతులే కాదు 'ఇహ' గతులూ వుండవు.

సంతానం వల్లే ఇంట్లో ఆనందం వెల్లి విరుస్తుంది. వారి వల్లే స్త్రీ పురుషుల అనురాగం గాఢమవుతుంది. వారి ద్వారానే వంశం తద్వారా సమాజవృద్ధి జరుగుతుంది. వయస్సు మళ్ళేక సంతానమే ఆలంబన అవుతుంది.

సప్తసోపానాలు

'సఖా సప్తపదా భవ సఖాయౌ సప్తపదా బభూవ
సఖ్యంతే గమేయం సఖ్యాత్ తేమా యోషం సఖ్యాన్మే మాయోష్ఠాః
సమయావః సంకల్పావహై సంప్రియౌ రోచిష్ణూ
సుమన స్యమానౌ ఇషమూర్జమభిసంవాసానౌ సం నౌమనాంసి సంవ్రతా
సముచిత్తాన్య కరమ్'

ఏడడుగులు వేసిన తరువాత వరుడు వధువుతో చెప్పే మంత్రం:

"నాతో ఏడడుగులు నడచి నాకు మంచి స్నేహితురాలివి అయితివి. నీ స్నేహం నుండి నేను ఎప్పుడూ విడిపోను. నీవు నా సఖ్యత నుండి విడిపోకు. మనం కలసి మెలసి పరస్పర ప్రేమతో అనుకూల దాంపత్యంలో ప్రకాశిస్తూ నిండు మనస్సుతో ఆహారాన్ని బలాన్ని పొందుతూ కలసి ఉందాం. కలసి ఆలోచించుకుందాం. మన మనస్సులు కలసేలా నడచుకుందాం. బాహ్యేంద్రియాల విషయంలో కూడా కలసి ఉండేట్లు నడచుకుందాం."

'సా త్వమసి అమూహం అమూహ మస్మి
సా త్వం ద్యౌరహం పృథివీ త్వం రేతోహం
రేతోభృత్ త్వం మనోహమస్మి
వాక్ సామాహ మస్మి ఋక్ త్వం సామామను వ్రతా భవ'

'ఈ విధంగా నువ్వు పొరబాటులేక వుండుము. నేనూ అలాగే వుంటాను. మన

మనస్సులెప్పుడూ కలిసివుండాలి. కలిసి ధర్మాన్ని అనుష్ఠిద్దాం. నీవు ఆకాశము నేను పృధ్వి. నీవు శుక్రము నేను శుక్రము ధరిస్తాను. నీవు మనస్సు, నేను వాక్యం. ఈ విధంగా నేను సామను అవుతాను. నీవు ఋక్కువు ఐ వర్తింపుము' అంటుంది వధువు.

దానికి జవాబుగా వరుడు –

'పుంసే పుత్రాయవేత్త వే శ్రియై
ఉత్తరయ వేత్తావ ఏహి సూనృతే'

'నీవు సత్యమును పలుకు దానవు. మంచి వ్రతము కలదానవు. నీ వలన నేను యోగ్యమైన సంతానమును, సంపదనలను పొందగలను. నా వద్దకు రమ్ము'

ఈ విధంగా ఏడడుగుల సంబంధాన్ని ఏడు జన్మల అనుబంధం కావాలని వధూవరులు బాసలు చేసుకుంటారు.

ఆజన్మ మిత్రత్వం

ఏడడుగులు కలిసి నడిస్తే విడదీయరాని స్నేహబంధం ఏర్పడుతుందని సంప్రదాయం.

దాంపత్య బంధం ఆజన్మ స్నేహబంధమే.

ఆ మైత్రిని మరింత బలోపేతం చేసేదిగా వుండాలి భార్యార్తల నడవడిక.

ఒకరు తప్పు చేస్తే రెండవ వారు సరిదిద్దాలి తప్ప కటువుగా బాధపెట్టేట్టుగా బదులు తీర్చుకునేట్టుగా ప్రతిస్పందించ కూడదు.

సహనంతో అభిమానంతో ఆర్తితో అనురాగంతో విశాల హృదయంతో ప్రవర్తించాలి. అర్థం చేసుకోవాలి. అనునయించాలి. చేదోడు కావాలి. అండగా నిలవాలి.

అవతలి వారు పశ్చాత్తప పడేలా మార్పువచ్చేట్టుగా వ్యవహరించాలి తప్ప వికటించేట్లు గాయపడేట్లు ప్రవర్తన వుండకూడదు.

స్వాభావికమూ ఆనందకరమూ అయిన శృంగారయజ్ఞంలో ఇద్దరూ ఉత్సాహంగా పాల్గోవాలి. సమానపాత్ర ధరించాలి. లైంగిక సంబంధం వారి బంధాన్ని పటిష్ఠ పరుస్తుంది. మానసిక సాంత్వన చేకూరుస్తుంది.

జీవిత భాగస్వామి తన శత్రువుకాదు మిత్రువు అని గుర్తుంచుకోవాలి. వారి మనస్సు గెలవడానికి మమకారంతో తపనతో క్షమతో నిస్వార్థ సేవతో ఆదరభావంతో సాహచర్యకాంక్షతో నడచుకోవాలి !

సప్తపది లక్ష్యం.

ఏడు అడుగులు ఏడు భావాలు ఏడుకోరికలు ఏడు ఆకాంక్షలు ఏడు పునాదులు ఏడు ప్రతిజ్ఞలు ఏడు సూత్రాలు!

వాటి మీదే ఆధారపడి వుంది వధూవరుల భావి జీవనసౌధం!

సప్తపది తర్వాతే వధువు గోత్రం వరుని గోత్రంగా మారుతుందంటారు కొందరు పండితులు.

అగ్నిసాక్షిగా ఏడడుగులు నడచి కొత్త జీవితంలోకి అడుగు పెట్టిన ప్రతిస్త్రీ తన భర్తతో తాను ఎంతకాలం బతుకుతానని ఆలోచించదు. ఎలా బతుకుతానని ఆలోచిస్తుంది.

ఆ సంగతెప్పుడూ వరుడు గుర్తుంచుకోవాలి. అందుకనుగుణంగా తను అడుగులెయ్యాలి. తనతోబాటు ఆమెని నడిపించాలి.

ఒకరి స్నేహం నుంచి మరొకరెన్నటికీ వియోగం పొందకూడదు. పరస్పర ప్రేమతో అనుకూల దాంపత్యం నెరపాలి. కలిసి ఆలోచించాలి. మనస్సులు కలుపుకుని మసలాలి.

వారి నిబద్ధత మీదే కుటుంబజీవనం, దాంపత్య సౌఖ్యం, సంతానం నిలిచి ఉన్నవి. సమాజపు అభివృద్ధి, జాతి ఉన్నతి ఆధారపడి వున్నాయి.

వివాహకాండలో వివిధఘట్టాలలో చేసిన ప్రమాణాలను తు.చ. తప్పక ఆచరిస్తే– మనసావాచాకర్మణా అనుసరిస్తే –ఏడడుగులబంధం ఏడు జన్మల అనుబంధంగా మారాలని అన్పించి తీరుతుంది!

స్థాన మార్పిడి

సప్తపది తర్వాత వధూవరులు తమ తమ స్థానాలను మార్చుకుంటారు.

అంతదాకా వధువు వరుడికి కుడి ప్రక్కన కూర్చుంటుంది. ఇప్పుడు ఎడమ వైపుకి మారుతుంది. దీన్ని హక్కుల, గౌరవాల పరస్పర మార్పిడిగా పంచుకోడానికి నిదర్శనంగా భావించవచ్చు.

విశేష ప్రాముఖ్యతగల శుభకార్యాల్లో అంటే వివాహం, పూజలు వ్రతాలు, కన్యాదానం చేయుట వగైరాల్లో భార్య భర్తకు కుడి వైపున ఉండాలి.

దానధర్మాలు చేసేప్పుడూ నిద్రించేప్పుడూ సరిగంగ స్నానాలు చేసేప్పుడూ భర్తకు ఎడమ వైపున ఉండాలంటారు శాస్త్రకారులు.

సప్తపది ప్రమాణాలయ్యాక వధువు వరుడి కుటుంబ సభ్యురాలవుతుంది. కుటుంబ రహస్యాలు పంచుకోదగ్గది అవుతుంది. బాధ్యతలు పంచుకోవాల్సిందవుతుంది.

స్థానమార్పిడి హక్కుల్నీ బాధ్యతల్నీ పంచుకోడానికి నిదర్శనంగా భావించవచ్చు.

ఇద్దరూ శక్తి-చేతనలకి చిహ్నాలు.

వారి కలయికే సృష్టికి మూలం!

విభిన్నపాఠాలు

సప్తపదిలో వేసే అడుగులకు సంబంధించి విభిన్న పాఠాలున్నాయి.

'వైదిక వివాహం'లో ఆహారం, బలం, ధనం, సుఖం, సంతానం, ఋతువుల అనుకూలత, స్నేహం - కొరకు ఏడు అడుగులు అని చెప్పబడింది.

మరొక ప్రాచీన గ్రంథంలో ఆహారం, బలం, వనరులు(సంపదలు), సుఖం, కుటుంబం, లైంగిక సంబంధం, స్నేహం - అని పేర్కొన్నారు.

కొందరు పండితులు ఆహారం, బలం, ధనం, సుఖం, సంతానం, ఋతువుల అనుకూలత, స్నేహం - అని అన్వయించారు.

మరొకరు ఆహారం, బలం, వ్రతాల కోసం, స్నేహం, పశుసమృద్ధికి, సంపద, యజ్ఞం చేయించే ఋత్విజుల దీవెనల కోసం అని చెప్పారు.

సంప్రదాయ వివాహాల్లో చెప్పే అన్న సమృద్ధి, బలం, మంచి పనులు, సౌఖ్యం, పశుసంపద, ఋతు అనుకూలత, ఏడుగురు హోతలు - అనే ప్రయోజనాలను స్వీకరించి పైన పేర్కొనడం జరిగింది.

మొత్తానికివన్నీ జీవితావసరాలే. సుసంపన్న జీవితానికి అవసరమైనవే.

29

అగ్నిసాక్షిగా ప్రమాణాలు



పంచభూతాల్లో ఒకటి అగ్ని. పవిత్రతకు మారుపేరు అగ్ని.

సీతని అగ్నిపునీతని చేసింది అగ్నే.

హిందూ వివాహం సర్వదేవతల సాక్షిగానే కాదు పంచభూతాల సాక్షిగా జరిగే పవిత్ర యజ్ఞం.

ఆ యజ్ఞానికి అగ్నిహోత్రుడే ప్రధాన సూత్రధారి!

అగ్నిదేవుడు

నాగరికత పరిణామ క్రమంలో అగ్నిని సృష్టించడం అత్యంత ప్రధాన ఘట్టం.

నిప్పు చెయ్యడం నేర్చుకున్నాక మనిషి మహత్తరమైన ప్రగతిని సాధించడాని చెప్పాలి.

సరస్వతీనది జీవనదిగా ప్రవహించిన కాలంలోనే మనిషి అగ్నిని కనుగొన్నాడు. అంటే దాదాపు పన్నెండువేల సంవత్సరాల క్రితమన్నమాట.

అగ్ని సృజన అద్భుతమైన జ్ఞాన ప్రక్రియ. అందుకే మానవుడు అగ్నిపై భక్తి ఆరాధనలు పెంచుకున్నాడు.

వేదాల్లో మొదటిదైన ఋగ్వేదంలో అగ్నికి ప్రముఖస్థానం కల్పించారు. అగ్నిని సృజించిన అనంతరమే యజ్ఞ ప్రక్రియ మొదలైంది.

అగ్ని మానవుని చైతన్యానికి ప్రతీక!

'అగ్నిముఖా వై దేవాః' అన్నారు.

దేవతలందరీ ముఖం అగ్ని. అదీగాక సంస్కారాలకు ప్రధానాంగమూ ప్రథమాంగమూ అగ్నే.

అంచేత అన్ని శుభకార్యాలలో అగ్ని హోత్రమే అగ్రభాగాన వుండాలి. దాని బదులు కొందరు గణపతి పూజ చేయిస్తున్నారు. పవిత్ర హోమాన్ని వెలిగించడం ముఖ్యమని గమనించాలి.

అగ్ని సాక్షి

అగ్ని సాక్షిగా వివాహం చేసుకోవడం హిందూ సంప్రదాయం.

ఏడేడు జన్మలకి ఇతడే నాభర్త కావాలని వధువు, ఈమెయే తనభార్య కావాలని వరుడు అగ్ని చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.

మనుస్మృతి ప్రకారం కన్యాదానం, పాణిగ్రహణం తర్వాత అగ్ని ప్రదక్షిణ చేస్తేనే కాని వివాహమైనట్టు కాదు.

అది పూర్తయ్యాకే వధువుకు పుట్టింటి గోత్రం పోయి భర్త గోత్రం సంక్రమిస్తుంది.

పంచభూతాలననుసరించి మానవుని గమనం వుంటుంది.

మానవునికి కావలసి తేజశ్శక్తి నిచ్చే సూర్యునికి ప్రతీకగా అగ్నిని పూజించడం ఆచారం. అందుకే ఏ నూతన కార్యక్రమాన్ని చేబట్టినా ముందుగా హోమంచేసి అగ్నిని సంతృప్తి పరచాలి. అప్పుడే ఆయా కార్యాలు జయప్రదమవుతాయని విశ్వాసం.

హోమం ప్రారంభానికి ముందు ఆ స్థలాన్ని పుణ్యజలంతో శుద్ధిచెయ్యాలి. వధూవరులిద్దరూ తూర్పు ముఖంగా కూర్చోవాలి. పురోహితుడు ఉత్తరదిక్కుగా ముఖంపెట్టి హోమానికి దక్షిణ దిక్కున కూర్చుని మంత్రోచ్ఛరణ చేస్తాడు.

కలశం



హోమం దగ్గర పవిత్ర కలశాన్ని ఉంచుతారు.

దానిలో స్థిరత్వ భావన దాగి వుందంటారు. వధూవరులు స్థిరంగా వ్యవహరించాలని సూచనన్నమాట.

కలశంలోని నీరు వరుణునికి సంకేతం. మామిడాకులు విష్ణువుకి ప్రతిరూపాలు. కొందరు కలశాన్ని భౌతిక శరీరంగానూ ఆకులను పంచతత్వాలుగాను నీటిని జీవన ప్రవాహంగానూ భావించాలన్నారు.

సమిధలు

హోమగుండంలో సమిధలను వేసి అగ్నిని రగిలిస్తారు.

గంధం, మామిడి, రావి, మర్రి తదితరాల పుల్లలను సమిధలుగా ఉపయోగిస్తారు.

వధువు నవధాన్యాలతో సహా సమిధలు అగ్నికి సమర్పిస్తుంది.

వరుడు పరిశుద్ధమైన ఆవునేతిని హోమంలో వేస్తాడు.

అప్పుడొచ్చే పొగ శ్వాసకోశంలోనూ గుండెలోనూ చేరి అక్కడ్నుంచి రక్తానికి చేరి సూక్ష్మరోగాణువులను నాశనం చేస్తుందని నమ్మకం.

గృహస్థాశ్రమం స్వీకరించబోయే వధూవరుల మనస్సులను దేహాలను పరిపుష్ఠం చేయగల శక్తి ఈ హోమం వల్ల కలుగుతుందని శాస్త్రకారుల అభిప్రాయం.

మంత్రోచ్చరణ చేస్తూ నెయ్యి, కర్పూరం, చందనం అగ్నికి 'స్వాహా' అంటూ సమర్పించడం వల్ల అహంకారం నాశనం అవుతుందని భావన.

దీపారాధన వల్ల లక్ష్మీదేవి ఆశీస్సులు దంపతులకు లభిస్తాయంటారు.

అగ్నిహోమం

సప్తపది తర్వాత వధూవరుల చేత అగ్నిహోమం చేయిస్తారు.

మండపంలో ఏర్పాటు చేసిన హోమగుండాన్ని రగిలిస్తారు.

వధువు తన కుడి చేతిని భర్త శరీరం మీద వుంచాలి. ఆ రకంగా ఆమె హోమంలో సింబాలిక్‌గా పాల్గొని చేసినట్టు అవుతుంది గనుక హోమఫలం లభిస్తుంది.

16 మంత్రాలు చదువుతూ నేతిని అగ్నికి అర్పించాలి.



ఈ మంత్రాలు సోమ, గంధర్వ, అగ్ని, ఇంద్ర, వాయు, అశ్వినీదేవతలు, సవిత, బృహస్పతి, విశ్వదేవతలు, వరుణుడు–లను స్తుతిస్తూ తమ వివాహాన్ని ఆశీర్వదించమని కోరతాడు.

సుదీర్ఘ వైవాహిక జీవితం, ఆరోగ్యం, సంపద, పిల్లలు, బాధావిముక్తి – ప్రసాదించమని అర్థిస్తాడు వరుడు.

ఆరో మంత్రంతో **'దశాయం పుత్రందేహి పతిం ఏకాశం కృతి'** అంటాడు.

అనగా తమకి పదిమంది సంతానం ప్రసాదించి ముసలితనంలో తన భార్యకి తను పదకొండో సంతానంలా వుండేలా దీవించమని ఇంద్రుడ్ని కోరతాడు!

అగ్నిసాక్షిగా ప్రమాణాలు

వధూవరులు అగ్నిసాక్షిగా కొన్ని ప్రమాణాలు చేస్తారు.

దీని ఉద్దేశం ఇద్దరు వ్యక్తులు ఒకటిగా కలిసి 'ఏక వ్యక్తిత్వం' సంతరించుకోవడమే. వారికి పదే పదే చెప్పి బాధ్యతలను మరచిపోకుండా చెయ్యడానికే ఇవన్నీ.

చిత్తశుద్ధితో వ్యవహరిస్తామని ఒకరికొకరు విశ్వాసపాత్రంగా వుంటామని ప్రమాణ పూర్వకంగా చెబుతారు.

వరుడు చేసే ప్రమాణాలు

వరుడి బాధ్యత ప్రాథమికమైంది. గనుక మొదట అతడిచేత ప్రమాణం చేయిస్తారు.

"ధర్మపత్నీ మిలిత్వైవ హ్యైకం జీవన మావ్యోహ్
ఆద్సారాభ్య యతో మిత్యామర్ధాంగి నీతి ఘోషితా!'

"ఈ క్షణం నుంచి వధువు నా అర్ధాంగి. నా వ్యక్తిత్వాన్ని ఆమెతో కలుపుతాను. ఇద్దరి కలయికతో నూతన సృష్టిచేస్తాను. నా శరీర భాగాల్లానే భార్య గురించీ శ్రద్ధ తీసుకుంటాను"

మిగతా సంస్కృత మంత్రాలకు తెలుగు పాఠం:

"అగ్నిదేవుడు వధువుకు మెట్టినింట అభిమానం కలిగేటట్లు చేయుగాక! బ్రహ్మదేవుడు మా ఇద్దరిని భార్యాభర్తలుగా చేశాడు. అతడు మాకు సంపదనిచ్చి దీర్ఘాయుష్యం ప్రసాదించుగాక! ఈ సుమంగళిని సౌభాగ్యముగా దీర్ఘాయువు కలదిగా ఆశీర్వదించండి"

"ఇంటి ఆర్థిక విషయాలు చూసే బాధ్యతను నేను సంతోషంగా నా భార్యకు అప్పగిస్తున్నాను. జీవితంలోని అన్ని ముఖ్యమైన విషయాల్లోనూ ఆమె అభిప్రాయాలూ సలహాలూ తీసుకుంటాను"

"నా భార్య బాహ్య రూపానికి సంబంధించిన అందం, ఆరోగ్యం, ప్రకృతి మార్పులు, రోగాలు, తెలియక చేసిన తప్పుల వల్ల ఆమె అంటే అనాకర్షణ పెంచుకోను. అసంతృప్తి ఫీలవను. ఆమెతో ఓపికగా ప్రేమతో సత్సంబంధం కొనసాగిస్తాను. ఆమె లోపాలను సరిదిద్దటానికి లేదా సర్దుకుపోవటానికి ప్రయత్నిస్తాను"

"నా భార్యకి ప్రాణస్నేహితుడిలా సదా ఉంటాను. వీలైనంత ఎక్కువ ప్రేమించడమే గాక ఈ ప్రమాణానికి మనసా వాచా కట్టుబడి ఉంటాను"

"నా భార్య పట్ల భర్తగా నేనెలాంటి నియమనిష్ఠలు ప్రదర్శించాలో అవన్నీ ప్రదర్శిస్తాను. అనైతిక వర్తన, వ్యభిచారం గురించిన ఆలోచన కూడా రానివ్వను"

"గృహ విషయాల్లో నా భార్యది పైచేయిగా ఉండేటట్లు చూస్తాను. ఆదర్శ గృహస్థు అన్పించుకునేలా ప్రవర్తిస్తాను. కుటుంబ బడ్జెట్‌ను భార్యతో సంప్రదించే రూపొందిస్తాను"

"నా శక్తి యుక్తుల్నీ వనరుల్నీ భార్య సుఖసంతోషాల కోసం శాంతి అభివృద్ధుల కోసం రక్షణ కోసం వినియోగిస్తాను"

"భార్య పట్ల నా ప్రవర్తన అభినందనీయంగా ఉండేట్లు చూచుకుంటాను. తప్పుల్నీ అభిప్రాయభేదాలనీ సామరస్య పూర్వకంగా పరిష్కరిస్తాను. ఇతరుల ముందు నా భార్య మీద ఆరోపణలు చెయ్యను. అవమానించను. నిర్లక్ష్యం చెయ్యను"

"పంచభూతాలు, పవిత్రాగ్ని, పెద్దల సాక్షిగా నాభార్య ప్రవర్తనని భరిస్తానని ఆమెకి బాధ కలగని విధంగా మృదువుగా సంభాషిస్తానని ప్రమాణం చేస్తున్నాను"

"ఏ కారణం చేతనైనా నా భార్య బలహీనురాలిగా అప్రయోజకురాలిగా బాధ్యతా రాహిత్యంగా మారితే అప్పుడు కూడా నా బాధ్యతల్నుంచి ప్రక్కకు జరగను. ఎప్పట్లానే పూర్తి సహకారాన్ని అందిస్తానని హామీ ఇస్తున్నాను"

"నా భార్యతో ప్రేమగా తీయగా మాట్లాడతాననీ ఆత్మీయంగా ప్రవర్తిస్తాననీ ఆమెకు విశ్వాసపాత్రునిగా వుంటానని ప్రమాణం చేస్తున్నాను."

వధువు చేసే ప్రమాణాలు

"నిన్ను నా హృదయం గ్రహించినవానిగా, సంస్కారవంతునిగా తేజోవంతునిగా గ్రహించాను. నీవు నాతో సంతానం కని సిరిసంపద లార్జించి సుఖంగా జీవించాలి. బ్రహ్మ మొదలైన వారు మనం సదా స్నేహమనస్కులుగా ఉండేట్లు అనుగ్రహించాలి. సరస్వతి మనం ప్రేమతో మాట్లాడుకొనేట్లు ఆశీర్వదించాలి."

"నా జీవనశైలిని నా భర్త శైలితో కలిపి నూతన వ్యక్తిగా మేం రూపొందుతాం. ఈ రకంగా నేనతడికి నిజమైన అర్ధాంగిగా జీవిస్తాను"

"నా భర్త తాలుకు బంధుమిత్రులంతా నా వారిగా భావించి వారితో సత్సంబంధాలు కొనసాగిస్తాను. వారితో అభిమానంగా ప్రవర్తిస్తాను. ఆదరిస్తాను."

"బద్ధకించకుండా గృహకృత్యాలు నిర్వర్తిస్తాను. ఈ రకంగా అభివృద్ధి సాధనలో నా భర్తకి సాయపడతాను"

"నాభర్తకి విశ్వాస పాత్రురాలిగా అనుకూలవతిగా వుంటాను. అతడ్నుంచి ఏమీ దాచను. అతడి మాటల్నీ సలహాలనీ చిత్తశుద్ధితో పాటించడమే నియమంగా పెట్టుకుంటాను"

"నిస్వార్థసేవ, పరిశుభ్రత, చక్కని సంభాషణ, సమయస్ఫూర్తి లాంటి చక్కని గుణాలు అలవర్చుకుంటాను. ప్రలోభాలను తగ్గించుకుంటాను. అసూయ, గయ్యాళితనం వగైరా చెడు లక్షణాలు పెరక్కుండా జాగ్రత్త పడతాను. ఈ విధంగా నా ఉనికి సంతోష ప్రదం చేసుకుంటాను."

"ఇంటి అవసరాలకు అనుగుణంగా ఇంటి ఖర్చులు తగ్గిస్తాను. అనవసరపు ఖర్చుచెయ్యను. నా భర్త శారీరక ఆర్థిక పరిస్థితి బాగుండనప్పటికీ ఆదర్శ గృహిణిగా నా బాధ్యతలు నిర్వర్తిస్తాను."

"నా భర్తని దేవుడి ప్రతినిధిగా ఆ జన్మ సహచరుడిగా భావిస్తాను. అతడితో వచ్చే అభిప్రాయ భేదాలను పట్టించుకోకుండా జీవితాంతం నేను చక్కబెట్టాల్సిన కార్యాల్లో అలసత్వం ప్రదర్శించను. పబ్లిక్‌లోగాని ప్రైవేటులోగాని నా భర్తని అవమానించను. నిర్లక్ష్యం చెయ్యను."

"నా భర్తకి హితులూ సన్నిహితులూ పూజ్యులూ అయిన వారిని నా సేవలతో అభిమానంతో ఆదరించి సంతృప్తులయ్యేట్లు చేస్తాను"

"జీవితంలోని ప్రతిక్షణమూ ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే నా భర్త పట్ల నా బాధ్యతలు ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్వహిస్తాను"

జీవనప్రమాణాలు

పెళ్లిలో చేసే పై ప్రతిజ్ఞలే వైవాహిక జీవనానికి వెలుగునిచ్చే ప్రమాణాలు.

పెళ్లినాటి ప్రమాణాలని తు.చ.తప్పకుండా పాటిస్తే చాలు ప్రతి వివాహమూ విజయవంతం అవుతుంది. ప్రతిసంసారం ఆనంద సాగరమవుతుంది.

పరస్పర అర్పణ, త్యాగం, సర్దుబాటు, అవగాహన, తపనలోనే వుంది దాంపత్యజీవన సౌరభమంతా!

30

లాజ హోమం

హిందూ వివాహంలో లాజ హోమానికి ఎంతో ప్రత్యేకత ఉంది.

లాజ హోమానికి ముందు ప్రధాన హోమం చేయిస్తారు. శిలారోహణమూ ఉంటుంది.

లాజహోమం తర్వాత ధ్రువ, అరుంధతీ నక్షత్రాల దర్శనం ఉంటుంది.

మధ్యలో మరికొన్ని అంశాలూ ఉన్నాయి. అవన్నీ ఒక్కొక్కటిగా చూద్దాం.

ప్రధాన హోమం

వధూవరులు దంపతులుగా మారేక చేసే మొదటి హోమం గనుక దీనిని ప్రధాన హోమం అంటారు.

వివాహానికి ప్రధాన సాక్షి అగ్ని.

అగ్నిహోత్రుని పూజించేందుకే ఈ హోమం.

దంపతులిద్దరూ ఒకరినొకరు తాకుతూ భక్తితో హోమం చెయ్యాలి.

ఆవు నేతిలో ముంచిన సమిధల్ని కుడిచేతి బొటనవేలు, ఉంగరం వేలు, మధ్యవేలుతో పట్టుకుని ముంజేతిని పైకి తిప్పి అగ్నిలో వేయాలి.

మంత్ర సహితంగా నమస్కరించి ప్రార్థించాలి.

ప్రాయశ్చిత్త హోమం

గాయత్రీ మంత్రం చదువుతూ అగ్నిహోత్రునికి అదనంగా అయిదుసార్లు నైవేద్యం సమర్పించాలి.

వరుడు నెయ్యి, వధువు హవిస్సు సమర్పించాలి.

వారు సమర్పించిన నైవేద్యంతోబాటు వారి పూర్వ రాగ ద్వేషాలు – వారి దాంపత్య జీవనానికి అడ్డొచ్చేవి – కాలి బూడిదవుతాయి.

అంటే వారి సుఖప్రద దాంపత్యానికి ఇబ్బంది కలిగించే సమస్తాంశాలూ – అనగా

పూర్వ ప్రేమలు, చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, ముక్కోపాలు వగైరాలన్నీ కూడా నశిస్తాయన్న మాట.

ఒక్కమాటలో చెప్పాలంటే వారిని బాధించే ఇబ్బంది పెట్టే కలచివేసే గతమంతా తుడిచిపెట్టుకు పోతుంది. వారు పవిత్రులై కొత్త జీవితం ప్రారంభిస్తున్నారన్నమాట.

దీనర్థం గతంలోని తప్పుల్ని మర్చిపోవాలి. పశ్చాత్తాప పడాలి. మళ్ళీ అవి జరక్కుండా జాగ్రత్తపడాలి. వాటి ప్రభావం భవిష్యత్తు మీద పడకుండా చూసుకోవాలి. చెడు అలవాట్లను వదులుకోవాలి.

గతం తాలూకు దుష్ప్రభావం నుంచి బయటపడి కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలి!

శిలారోహణం

దీనినే సన్నికల్లు తొక్కడం అంటారు.

అగ్ని హోత్రానికి ఉత్తరంగా సన్నికల్లు ఉంచుతారు. దాన్ని కుడికాలితో తొక్కమని వధువుకి వరుడు చెబుతాడు.

ఆమె సన్నికల్లుని తొక్కగా,

'అతి మమశ్మాన మశ్మేన త్వగ్గ్ స్థిరాభవ!
అభితిష్ఠ పృతన్య తస్సహస్వ పృతనాయతః॥'

అని మంత్రం చదువుతాడు వరుడు.

'ఈ రాతిని అధిష్టించు. నీవు దీనివలె స్థిరముగా వుందువు గాక. నాపై కలహమునకు వచ్చువారిని ఎదుర్కో. యుద్ధము చేయి' అని అర్థం.

సన్నికల్లులా దృఢంగా స్థిరంగా ఉండి శత్రువుల్ని ఉక్కు పాదాలలో అణిచేసే శక్తిని సమకూర్చుకోమని వరుడు బోధిస్తున్నాడు.

స్త్రీ ఆదిశక్తి అంశ అని గుర్తిస్తూ కీర్తిస్తున్నాడన్నమాట.

సన్నికల్లు రాయి మీద వధువు పాదం ఉంచగా ఆమె కాలివేళ్ళకు మట్టెలు తొడుగుతాడు వరుడు. కొన్ని కులాల్లో వధువు మేనమామ భార్య మట్టెలు తొడుగుతుంది.

ఈ ఆచారం గౌరవంతో మెలగుతూ ఇంటి సమస్యలను ఇబ్బందులను ఆమె ధైర్యంగా ఎదుర్కోవాలని సూచిస్తుంది.

కాలి మట్టెలు వివాహితగా గుర్తించే మరో చిహ్నం.

వధూవరులు తమకెలాటి ప్రతికూల పరిస్థితులెదురైనా సరే పెళ్లినాటి ప్రమాణాలకు కట్టుబడి ఉంటామని శిలలా చెక్కుచెదరమని దృఢంగా భావింపజేస్తుందీ ఘట్టం!

వధూవరుల కాళ్ళు తొక్కించుట

సానరాయి మీద వధూవరుల కాళ్ళు ఒకరిచే ఒకరివి తొక్కిస్తారు.

ఒకరి కుడికాలి బొటన వేలితో రెండోవారి ఎడమకాలు బొటన వేలిని తొక్కిస్తారు. కొన్ని చోట్ల కుడి కాలుని కుడి కాలుతోనే తొక్కిస్తారు.

అలా మూడు సార్లు తొక్కించాలి.

పాదస్పర్శ వల్ల కొత్తదనం పోతుంది. ఎక్కువ తక్కువ భావం నశిస్తుంది. సాన్నిహిత్యం పెరుగుతుంది.

తర్వాత్తర్వాత ఒకరి కాలు మరొకరికి తగిలినా దోషముండదు!

ఉంగరాలు తీయుట

చిన్నమూతి గల బిందెలో పాలు నీళ్ళు పోసి ఒక బంగారపు ఉంగరాన్ని వేస్తారు.

పురోహితుడు చెప్పగానే వధూవరులిద్దరూ బిందెలో చేయిపెట్టి ఉంగరాన్ని వెలికి తీయాలి. ఎవరు తీస్తే వారికా ఉంగరాన్ని రెండోవారు పెట్టాలి.

ఇది సరదా సన్నివేశమే. స్పర్శ తాలూకు సాన్నిహిత్యం కోసం ఏర్పాటు చేసింది.

పోటీపడి గెలవాలన్న పట్టుదల, ఓడిపోయి ఎదుటివారిని గెలిపించాలన్న ప్రేమ భావన – ఏక కాలంలో కలిగిస్తుంది.

వెరశి ఇద్దరి బిడియం బెరుకూ పోగొట్టి దగ్గర చేస్తుంది!

లాజ హోమం

వరిపేలాలను సంస్కృతంలో లాజలంటారు.

వధువు సోదరుడు కూడా ఇందులో పాల్గొంటాడు.

వధూవరులు పవిత్రాగ్ని చుట్టూ ఒకసారి ప్రదక్షిణ చేస్తారు. ఒక ప్రక్కగా నిలబడ్డ వధువు సోదరుడు గుప్పెడు పేలాలను సోదరికిస్తాడు. ఆమె వాటిని వరుడికిస్తుంది.

వధువు మంత్రం చదువుతూండగా వాటిని వరుడు అగ్నికి సమర్పిస్తాడు. ఇలా మూడుసార్లు చెయ్యాలి.



ఇదే లాజ హోమం.

మూడు ప్రదక్షిణలకూ వధువు పఠించే మూడు మంత్రాలు:

'ఓం అర్యమణం దేవం కన్యా అగ్నిమయ క్షత, సనో
అర్యమా దేవః ప్రేతో ముంచంతు మాపతేః స్వాహా
ఇద మర్యమ్ణే అగ్నయ ఇదం నమమ'

'కన్యలచే పూజింపబడు న్యాయమూర్తి అయిన పరమేశ్వరుడు నన్ను పితృగృహము నుండి వేరుచేసి, పతి గృహము నుండి వేరు చేయకుండుగాక!'

"ఓం ఇయం నార్యు ప బ్రూతే లాజా నావ పంతికా
ఆయుష్మానస్తు మే పతి రేధన్తాం జ్ఞాత మో మమస్వాహా
ఇద మగ్నయ ఇదం నమమ"

'పేలాలను అగ్నిలో హోమము చేయు నేను నా భర్త చిరంజీవి అగునట్లు నా బంధువులు వర్ధిల్లునట్లు భగవంతుని ప్రార్థిస్తున్నాను'

"ఓం ఇమాన్ లాజా నావ పామ్యగ్నౌ సమృద్ధి కరణం తవ
మమ తుభ్యం చ సంవననం తదగ్ని రనుమన్యతా
మియగ్వం స్వాహా ఇద మగ్నయ ఇదం నమమ"

'ఈ పేలాలను అగ్నిలో హోమము చేయుచున్నాను. పరమేశ్వరుడు మన ఇరువురిలో ప్రేమను వృద్ధి నొందించుగాక'

లాజహోమ ప్రత్యేకత

అగ్నిలో వేసిన వరిధాన్యం (వడ్లు) పువ్వుల వలె వికసించి పేలాలుగా మారతాయి. అలాగే అగ్నిలో పేలాలు వేసిన నూతన వధూవరుల ప్రేమానురాగాలు పేలాల వలె వికసించునని భావన.

వివాహ సంస్కారంలోకి వడ్లు తేవడంలో ఒక అభిప్రాయం ఉంది. వరి విత్తనాలను మొదట ఒకచోట వేస్తారు (నారుమడి). కొంత పెరిగేక (మోన తిరిగేక) అక్కడి నుండి నారుని తీసి మరొక చోట నాటుతారు. అచ్చట ఆ మొక్క పుష్పించి ఫలించి ధాన్యరాశినిస్తుంది.

కన్య విషయంలోనూ అలాగే జరుగుతుందని సూచన.

బావమరిదికి కూడా సముచిత స్థానం కల్పించడం విశేషం.

అతడు వధువు పుట్టింటి వారి ప్రతినిధి. తండ్రి తర్వాత సోదరికీ ఆమె సంతానానికీ అండదండలిచ్చేవాడు. బతక కోరేవాడు బావమరిది అన్నారందుకే.

ఈ సందర్భంలో వరుడాతడికి నూతన వస్త్రాలు బహూకరిస్తాడు.

లాజహోమం చెప్పే మరో పాఠమేమిటంటే పుట్టింటి నుంచి తెచ్చుకున్న ప్రతిదీ రహస్యంగా దాచుకోకుండా భర్తకివ్వాలి. అతడు కూడా సంపాదనని భార్యతో పంచుకోవాలి.

తన శక్తి వల్ల గాక ఉచితంగా లభించినదానిని స్వంతానికి గాక సమాజం కోసం ఖర్చు పెట్టాలన్నది నీతి సందేశం!

యోక్త్ర విమోచనం

వధువు నడుం చుట్టూ కట్టిన దర్భ త్రాటిని వరుడు సమంత్రంగా విప్పుతాడు.

సూర్య ధ్యానం

సూర్యుడు శక్తికి కేంద్రం. శక్తివంతమైన గ్రహం. సూర్యుని చుట్టూనే మిగతా గ్రహాలు తిరుగుతున్నాయి.

సమాజంలో సూర్యుడిలానే ముఖ్యస్థానంలో ఉండి సమాజోద్ధరణకు నిశ్చలంగా నిరంతరంగా కృషి చేస్తామని ప్రమాణం చెయ్యాలి.

కర్మసాక్షిని సాక్షిగానే గాక ప్రత్యక్షదైవంగా భావించి పూజించాలి.

కేవలం పగటి పూట జరిగే వివాహాల్లోనే సూర్య ధ్యానం చేయిస్తారు.

ధ్రువ దర్శనం

రాత్రి జరిగే వివాహాల్లో ధ్రువతార దర్శనం చేయిస్తారు.

ధ్రువుడు చిన్నప్పుడే అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి దేవుడిలో ఐక్యం కావడానికి అకుంఠిత దీక్షపూనిన మహాత్ముడు.

మిగతా తారల స్థానం మారుతూంటుంది తప్ప ధ్రువ నక్షత్రం స్థిరంగా ఉంటుంది. దిక్సూచి కనిపెట్టక ముందు నావికులకు దిక్సూచిగా ఉపయోగపడిందీ నక్షత్రం.

వధూవరులను బయటకు – తూర్పులేక ఉత్తరంవైపు తీసుకు వెళ్ళి ఆకాశంలోని ధ్రువ నక్షత్రాన్ని చూపుతాడు పురోహితుడు.

'ఎలాంటి కష్టనష్టాలెదురైనా బాధ్యతల నిర్వహణలో స్థిరంగా ఉండాలి. నిశ్చల చిత్తంతో వ్యవహరించాలి. విధ్యుక్త ధర్మ నిర్వహణలో స్థిరత్వం ముఖ్యం. పెళ్లినాటి ప్రమాణాల మీద స్థిర చిత్తంతో నిలబడాలి!'

ఈ సందేశాన్నివ్వడమే ధ్రువ నక్షత్ర దర్శన లక్ష్యం!

హిందూ వివాహబంధం ధ్రువతారలా సుస్థిరమైంది. శాశ్వతమైంది!

అరుంధతీ నక్షత్ర దర్శనం



'సప్తర్షయః ప్రథమాం కృత్తికానామరుంధతీ యద్ధ్రువతాం హనిన్యుః

షట్కృత్తిగా ముఖ్య యోగం వహన్తీయ మస్మాక మేధత్వష్టమీ।'

'సప్త ఋషులు తమ ఏడుగురు భార్యాలలో అరుంధతిని సర్వోత్తమురాలిగా శాశ్వతురాలిగా ఎంచిరి'

వశిష్ఠ మహార్షి భార్య అరుంధతి. సప్తర్షి మండంలో వశిష్ట నక్షత్రం ప్రక్కన మిణుకు మిణుకు మని ప్రకాశించే నక్షత్రమే అరుంధతీ నక్షత్రం.

పురోహితుడు వధూవరులకు అరుంధతీ నక్షత్రాన్ని చూపించి నమస్కరింపజేస్తారు.

అప్పుడు వధూవరులిద్దరూ భుజాలు తాకేలా నిలబడి అరుంధతిని చూడాలి.

అరుంధతీవశిష్ఠులు నూతన దంపతులకు ఆదర్శప్రాయులు. ఆ జంటలానే ఈ జంట కూడా ఎడబాటు లేకుండా కలిసుండాలి. ప్రశంసలందాలి ప్రసిద్ధి పొందాలి!

అరుంధతి ఆశీస్సులు వారికి లభించాలని ఆకాంక్ష!

సహధర్మచారిణి పదానికి అర్థం అరుంధతి.

విశ్వామిత్రుడు అక్కసుతో వశిష్ఠుడి కుమారులను శపిస్తాడు. విరక్తితో అరుంధతి నదిలోకి దూకి ఆత్మహత్యకు సిద్ధపడగా నది కరుణించి రక్షిస్తుంది. బిడ్డలకన్నా భర్త క్షేమమే ముఖ్యమని భావించిన అరుంధతి ఆయనను సేదదీర్చి కర్తవ్యోన్ముఖుడ్ని చేస్తుంది.

భర్తకు కష్టం వచ్చినప్పుడు తల్లిలా అక్కున చేర్చుకుని ఓదార్చి మళ్ళీ మామూలు మనిషిని చేసే గురుతర బాధ్యతను ఈ ఘట్టం వధువుకు దఖలు పరుస్తుంది.

అరుంధతీనక్షత్ర దర్శనం వల్ల కంటికి ఉత్తేజం కలుగుతుందని ఒక నమ్మిక.

గృహస్థు పాత్ర పోషణకు సిద్ధమవుతున్న వరుడికి అన్ని విషయాల్లోనూ 'సునిశిత దృష్టి' అవసరమని అంతరార్థం!

31

అప్పగింతలు

పెళ్లి మండపంలో జరిగే వివిధ వివాహ కార్యక్రమాల్లో ఆఖరి అంశం అప్పగింతలు.

వధువుని వరుడికీ అతడి కుటుంబ సభ్యులకీ అప్పగించడమే అప్పగింతలు.

పుట్టినప్పట్నుంచి ఇంతదాకా తమదిగా తమలో పెరిగిన బిడ్డని మరొకరికి అప్పగించడం ఎంతో బాధతో వేదనతో కూడుకున్న విషయం.

కరుణ రసార్ద్ర దృశ్యం అప్పగింతలు!

దాని కన్నా ముందు జరిగే మరికొన్ని అంశాలున్నాయి. అవేమిటో అవలోకిద్దాం.

పెళ్లి భోజనం

పెళ్లిలో వేదమంత్రాలకే కాదు విందు భోజనానికీ ఎంతో ప్రాముఖ్యత ఉంది.

పెళ్లి కెదిగిన యువతీయువకుల్ని 'పప్పన్నం ఎప్పుడు పెడతావ్' అని అడుగుతాం. అంటే ఎప్పుడు పెళ్లి చేసుకుని మాకు పప్పుతో భోజనం పెడతావు అని.

'వివాహ భోజనంబు వింతైన వంటకంబు...' పాట వినని వారూ హమ్ చేయని వారూ ఒక్కరూ ఉండరు.

నవకాయ పిండి వంటల్తో వడ్డించే భోజనం పెళ్లివారి ఆర్థిక స్థాయికీ వారి ఆప్యాయతా భిమానాలకీ నిలువెత్తు నిదర్శనం.

వివాహ శుభకార్యం జరిగిన వేళ ఆహూతులందరికీ సుష్టుగా భోజనం పెట్టి ఆనందపర్చడం శుభప్రదం.

అన్నదాతా సుఖీభవ!

అతిథి దేవో భవ!

పెళ్లికి పిలవగా వచ్చిన అతిథుల్ని మర్యాద పూర్వకంగా ఆహ్వానించాలి. ఆసనాలు చూపాలి. పెళ్లిని సావధానంగా తిలకించేందుకేర్పాట్లు చెయ్యాలి.

పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ అతిథులందరికీ మర్యాదలు జరిగేలా చూడాలి. భోజనం చెయ్యకుండా ఎవర్నీ వెళ్ళనివ్వకూడదు.

వారి ఆనందమే నూతన దంపతులకు వెలలేని ఆశీస్సులని గుర్తుంచుకోవాలి.

ఎన్ని రకాల పదార్థాలతో ఎంత ఘనంగా విందు ఏర్పాటు చేశామన్న దానికన్నా ఎంత అభిమానంతో వడ్డించామన్నది ముఖ్యం. అందుగ్గాను ప్రత్యేకంగా కొందర్ని భోజన పర్యవేక్షణకు నియమించడం మంచిది.

తాంబూల సత్కారం

పెళ్లికి వచ్చే వారెవరూ వట్టి చేతుల్తో రారు. తమ స్థాయిని బట్టి అనుబంధాన్ని బట్టి వధూవరులకు బహుమతులు తెస్తారు.

వాటికన్నా విలువైన ఆశీస్సుల్ని అందజేస్తారు.

వెళ్ళేప్పుడు వారు వట్టి చేతుల్తో వెళ్ళకూడదు. వారికి తాంబూలమిచ్చి సాదరంగా సాగనంపాలి. దానితోబాటు పండ్లు ఒక కవర్లో పెట్టి ఇవ్వటం మంచి పద్ధతి.

పెళ్లివారి ఆర్థిక స్థితిగతులు బాగుంటే బహుమతులూ ఇవ్వవచ్చు.

ఆడవారికి బ్లౌజు పీసులూ కుంకుమ బరిణెలూ వగైరాలు బహూకరించవచ్చు.

వధూవరులిద్దరి తరపు పెద్దలూ కలిసి చక్కని బహుమతిని అతిథులకు ఇస్తే చాలా బాగుంటుంది. చాన్నాళ్ళు గుర్తుంటుంది.

అవి పెళ్లి తాలూకు తీపి గుర్తులు!

చుట్టు ఉంగరం

వివాహమయ్యాక వరుడికి వధువు తల్లిదండ్రులు చుట్టు ఉంగరాన్ని బహూకరిస్తారు.

దీన్నే కళ్యాణ ఉంగరం అంటారు. గుండ్రని చుట్టును ధరించడం పరిపూర్ణత్వానికి సూచికగా చెబుతారు.

జీవితాంతం కలిసి ఉండే భార్యాభర్తల మధ్య బంధానికి ఆది అంతమూ రెండూ ఉండవు. అది అనంతమైనది. ఆ భావానికి చుట్టు ఉంగరం చిహ్నమంటారు కొందరు.

తొలినాళ్ళలో ఈజిప్టియన్లు ఎడమచేతి నాలుగోవేలు – ఉంగరం వేలు – నుంచి 'వీనా ఎమోరిస్' అనే రక్తనాళం నేరుగా హృదయానికి వెళ్తుందని భావించి 'వెయిన్ ఆఫ్ లవ్' అని పిలిచేవారు.

ఆ వేలుకి తను ఇచ్చిన ఉంగరం ధరిస్తే వారు తమ హృదయానికెంతో సన్నిహితంగా ఉన్నట్లు రొమాంటిక్ ఫీలింగు కలుగుతుంది. అందుకని ఆ వేలుకి పెళ్లి ఉంగరం తొడిగే సంప్రదాయం మొదలైంది.

మన వివాహాల్లో కళ్యాణ ఉంగరం తప్పనిసరి గాకపోయినా తప్పనిసరి వేడుకగా మారిపోయింది!

పెద్దల ఆశీస్సులు

నూతన వధూవరుల్ని పెద్దలు, పెళ్లి కొచ్చిన బంధువులూ, మిత్రులూ, పండితులూ అంతా ఆశీర్వదిస్తారు.

వాక్శుద్ధి గల పెద్దలు నిండు మనస్సుతో ఇచ్చే ఆశీస్సులు వధూవరుల్లో ఆత్మవిశ్వాసాన్ని కల్గిస్తాయి.

దోషాన్ని పోగొట్టి ఆయరారోగ్యాలూ భోగభాగ్యాలు సుఖసంతోషాలూ సత్సంతానప్రాప్తీ కలుగజేస్తాయి.

'ఓం ఇహైౖ వస్తం మావి యౌష్ఠ విశ్వ మాయుర్వ్య శ్నుతమ్

క్రేపంతే పుత్రై ర్నప్తృభిః మోద మానే స్వే గృహే'

'మీరిద్దరూ ఇలాగే కలిసివుందురు గాక. మీకు వియోగం కలుగకుండుగాక. మీరు పూర్ణాయుష్కులై పుత్ర పౌత్రులతో పరమానందంతో స్వగృహంలో క్రీడించెదరు గాక!' అని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తారు.

సర్వదేవతలూ పంచభూతాలూ పెద్దలూ సాక్షిగా జరిగే హిందూ వివాహం ఒక చూడచక్కని వేడుక. మహత్తరమైన శుభకార్యం. వేద సంస్కారం!

అప్పగింతలు



భారతీయ సమాజం మాతృస్వామ్యం నుండి సామాజిక పరిణామ క్రమంలో పితృ స్వామ్యానికి మారింది.

ఆడపిల్ల 'ఆడ' పిల్ల అయ్యింది. ఆమెకు పుట్టినిల్లు తాత్కాలికమూ మెట్టినిల్లు శాశ్వతమూ అయ్యాయి. భర్త ఇంటి పేరు, గోత్రము ఆమెవయ్యాయి.

వివాహకాండలో ఆఖరి అంకమైన అప్పగింతలు లేక అంపకాలు గుండెల్ని పిండేస్తాయి. కంటతడి పెట్టిస్తాయి.

కనిపెంచి పెద్ద చేసిన కూతుర్ని అల్లుడికీ వియ్యంకులకీ ధారాదత్తం చెయ్యటం – కణ్వమహర్షి చేతే కంటతడి పెట్టించింది ఇహ మానవ మాత్రులెంత!

తల్లికీ తండ్రికీ మధ్యన పెండ్లి కుమార్తెను కూర్చోపెడతారు. వారికి ఎదురుగా వరుడు, అతని తల్లిదండ్రులు కూర్చోవాలి. ఒక ఎండుకొబ్బరి ప్రమిదలో పాలుపోసి వధువు చేతులు పాలలో ముంచి వారి చేతులలో పెట్టి ఆమెను వారికి అప్పగిస్తారు.

ఆమెను ప్రేమాభిమానాలతో చూడమని వరుడ్ని అర్థిస్తారు. మీ కుమార్తె వలె చూసుకోమని వధువు అత్తమామల్నీ వారి బంధువుల్నీ కోరతారు. నీ సోదరిలా చూసుకోమని ఆడబిడ్డకు చెబుతారు.

అమ్మలక్కల కరుణరసార్ద్రమైన పాటలతో వీడ్కోలు చెబుతారు.

వధూవరులు బంధుమిత్రులకు నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకుంటారు.

వధువు అత్తవారింటికి పయనమవుతుంది.

కేరళలో మాతృస్వామ్యం

కేరళ రాష్ట్రంలోని నంబూద్రి, నాయక్, ఎఝువాలన్ని కుటుంబాలలో మాతృస్వామ్యం పాటిస్తారు.

పిల్లనిమ్మని అబ్బాయి తరపువారే వెళ్ళి అడుగుతారు. పెళ్లి తర్వాత వరుడు అత్తవారింటికి కాపురాని కెళ్తాడు.

పిల్లలకు తల్లి ఇంటి పేరే వస్తుంది.

తల్లిదండ్రుల ఆస్తులు ఆడపిల్లల పరంగా దక్కుతాయి గనుక అక్కడ వరకట్నం లేదు.

అమ్మాయికి పెళ్లి చేయకపోయినా చేసుకోకపోయినా అదొక చర్చనీయాంశంగా సమాజం చూడదు.

1960లో మాతృస్వామ్య వ్యవస్థ రద్దుకు చట్టం తెచ్చారు. స్వతంత్ర భారతావనిలో అన్ని వర్గాలు అన్ని రాష్ట్రాలూ ఒకేలా ఉండాలన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ కేరళలో పెళ్లి చేసుకుని భర్తను తమ ఇంటికి తీసుకెళ్తున్న అమ్మాయిలు కనిపిస్తూంటారు!

32

బహుమతులు



పెళ్లిలో వధూవరులకు బహుమతులివ్వడమనేది అన్ని దేశాల్లోనూ అన్ని జాతుల్లోనూ వున్న ఆచారం.

పెళ్లైన వెంటనే వధూవరులు తమ 'ఇంటి' ని అనగా 'కాపురాన్ని' ఏర్పాటు చేసుకుంటారు.

వారికెన్నో కావాల్సి వస్తాయి. అవన్నీ వారే ఏర్పాటు చేసుకోవడం కష్టం గనుక తలో చెయ్యీ వేస్తారు. కొత్త సంసారం సజావుగా సాగిపోవడానికి సహకరిస్తారు.

వధూవరుల తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు, మిత్రులు అంతా కూడా వారి మీద తమకి గల ప్రేమాభిమానాలని చాటుకోడానికిదో అవకాశంగా భావిస్తారు.

డబ్బు, బంగారం, స్థిరాస్తి, వస్తు సామాగ్రిని ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తారు. అమ్మాయి సుఖ శ్రేయస్సుల కోసం ఇవ్వబడే అపురూప కానుకలివి!

స్త్రీ ధనం

వధువు తల్లిదండ్రులు వివాహ సమయంలో ఆమెకిచ్చే స్థిరచరాస్తుల్ని స్త్రీ ధనం అంటారు.

దాన్నే పసుపు కుంకాల క్రింద ఇచ్చిన సొమ్ము అంటారు. ఆమె క్షేమాన్ని ఆశించి ఇచ్చిన ఆస్తి వాటా అంటారు. వరకట్నంలో భాగమంటారు. చట్టరీత్యా సంక్రమించిన ఆస్తి భాగమంటారు.

ఏ పేరు పెట్టుకున్నా ఆమెకి ఆమె పేరున ఇచ్చే సొమ్మంతా స్త్రీ ధనమే అవుతుంది. దానిపైన సర్వాధికారాలూ ఆమెవే. ఆమెని కాదని ఎవరూ దానిని తాకజాలరు.

దానిని ఆమె ఇష్టానుసారం ఉపయోగించుకోవచ్చు. ఖర్చు చేయవచ్చు. మరొకరికి బదిలీ చేయనూవచ్చు.

ఆమెకి కుటుంబమే సర్వస్వం గనుక కుటుంబ ఉన్నతికే దాన్ని ఉపయోగిస్తూ ఉంటుంది.

తల్లిదండ్రులిచ్చే కానుకలు

వధువు తల్లిదండ్రులు గాని అన్నదమ్ములుగాని ఇతర దగ్గరి బంధువులుగాని డబ్బు రూపంలో కన్నా స్థిరాస్థి రూపంలో బహుమతులు ఇవ్వడం శ్రేయస్కరం.

డబ్బుని పెద్దగా ఆలోచించకుండానే ఖర్చుపెట్టవచ్చు. మోజుపడి అప్రాధాన్య వస్తువుల్ని కొనవచ్చు. దుబారా చెయ్యవచ్చు.

ఇల్లు, పొలం, తోటలు, ఇంటిస్థలం – లాంటివైతే డబ్బుగా మార్చుకోడానికి టైము పడుతుంది. గనుక ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. బంధుమిత్రుల్ని సంప్రదించి సలహా తీసుకుంటారు.

పైగా స్త్రీ ఆస్తిని అమ్మటం చిన్నతనంగా భావించటమూ ఉంది గనుక తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప దాని జోలికి పోరు.

ఆ రకంగా ఆ ఆస్తి ఆమెకి కొంత భద్రత కల్పిస్తుంది. మున్ముందరి అవసరాలకు ఉపయోగిస్తుంది. ఈలోగా దాని మీద వచ్చే ఆదాయం ఆమె అవసరాలకుపయోగిస్తుంది.

బంగారం బంగారమే

మహిళలకు బంగారమంటే అత్యధిక ప్రీతి.

ఎక్కువ నగలు ధరించడమంటే సిరిసంపదలతో తులతూగుతున్నట్టే. లక్ష్మీదేవిలా ఉన్నట్టే.

అందువల్లనే ఎరువు సొమ్ముతోనైనా ఫంక్షన్లకి వెళ్ళి 'కుటుంబపు గొప్ప' చాటాలని తాపత్రయ పడుతూంటారు.

ఈనాటి యువత కూడా సింపుల్‌గా ఫాషనబుల్‌గా ఖరీదుగా ఉండే ఆభరణాల మీద మోజు చూపుతున్నారు. అందుకు కిటకిటలాడుతున్న నగల దుకాణాలే సాక్ష్యం!

బంగారం ధర పెరుగుతూనే ఉంది. విలువ తగ్గనిది ప్రపంచంలో ఎప్పుడైనా ఎక్కడైనా మారగలిగేది బంగారం ఒక్కటే.

నగలు బదులు బంగారు నాణాల్ని బహూకరించవచ్చు.

పెళ్ళిలో వధువుకి ఇరు కుటుంబాల వారూ బంగారు ఆభరణాల్ని బహూకరించడం మన పెద్దల ముందు చూపుకి నిదర్శనం!

షేర్లూ బాండ్లూ

వృద్ధులూ వ్యాపార కుటుంబాలకు చెందిన వారూ కానుకల్ని కంపెనీ షేర్లు, బాండ్లు, ఫిక్సెడ్ డిపాజిట్లు, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు వగైరా రూపాల్లో అందజేస్తుంటారు.

అవి లాభదాయకమైనవే. లిక్విడిటీ గలవే.

వాటి గురించిన అన్ని వివరాలనూ వధువు/వరుడికి ముందే వివరించి అవగాహన కలిగించాలి. అవసరమైతే వాటినెలా ఉపయోగించుకోవచ్చో తెలియజెప్పడం అవసరం.

వాహనాలు

వరుడ్ని ఆనందపరచడానికి బైక్, కారు లాంటి ఖరీదైనవీ కొందరిస్తూంటారు. కొందరు ముందే డిమాండ్ చేస్తున్నారు కూడా.

యువత స్వశక్తి మీద ఆధారపడటం నేర్చుకోవాలి. అడక్కుండా ఇస్తే తీసుకోవాలప్ప అడిగి తీసుకోవడం 'అడుక్కోవడమే' అవుతుందని గ్రహించాలి.

వస్తు సామాగ్రి

కొత్త కాపురానికవసరమైన మంచం, టేబుల్, కుర్చీ, సోఫా, టీవీ, ఫ్రిజ్ వగైరా ఫర్నిచర్ని కొందరు పెళ్లి సమయంలో పెడతారు. మరి కొందరు కొత్త కాపురం పెట్టేప్పుడు అంటే అమ్మాయిని కాపురానికి పంపేటప్పుడు బహూకరిస్తారు.

ఎప్పుడైనా సరే అవతలివారి అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. తమ తాహతునీ దృష్టిలో ఉంచుకోవాలి. గొప్పల కోసం అప్పుల పాలవ్వడం ఎవరికీ మంచిది కాదు.

వధూవరులు కూడా అవతలి వారి శక్తిని బట్టి ఆశించాలి తప్ప అత్యాశకు పోకూడదు. డిమాండ్ చెయ్యకూడదు.

బహుమతులకన్నా ప్రేమ వాత్సల్యాలు విలువైనవని గుర్తుంచుకోవాలి.

ఇతర రాష్ట్రాలవారి సంప్రదాయాలు

గుజరాతీలు నగలు, చీరలు, పాత్రలు వగైరాలను సంచిలోపెట్టి వధువుకి ఇస్తారు. దీనిని 'సాంచ్' అంటారు.

బెంగాలీలు డబ్బాడు కుంకుమతో బాటు విలువైన వస్తువులిస్తారు. దీనిని 'సింధూర దాన్' అని పిలుస్తారు.

పంజాబీలు వధువు సంసారానిక్కావలసిన సమస్త సామాగ్రినీ స్త్రీధనంగా సమకూరుస్తారు.

తమ తమ ఆర్థిక స్తోమతనుబట్టి ఎవరు ఏమి ఇచ్చినా తల్లిదండ్రులు కోరుకునేది ఒక్కటే – కూతురు మెట్టినింట సుఖసంతోషాలతో తులతూగాలి!

బంధుమిత్రులిచ్చే బహుమతులు

పెళ్లికొచ్చిన అతిథులంతా వధూవరులకు బహుమతులిచ్చి శుభాభినందనలు తెలియ జేస్తారు.

వధువు తరపు బంధుమిత్రులు ఆమెకీ, వరుడి తరపు వారు అతడికీ ఇస్తారు.

ఎవరికిచ్చినా బహుమతి ఏమిచ్చినా అది ఆ జంట పట్ల తమ ప్రేమాభిమానాలూ అభిరుచీ వెల్లడయ్యేలా ఉండాలి. వారికీ వారి ఇంటికీ ఉపయోగపడేలా ఇవ్వాలి.

కొత్త సంసారానికి ఉపయోగపడేవి ఇవ్వడం సముచితం.

ఫ్రిజ్, గ్రైండర్, కుక్కర్, డిన్నర్ సెట్, గ్లాస్‌వేర్ వగైరా కిచెన్ వేర్ ఇవ్వొచ్చు.

దేవుళ్ళ విగ్రహాలు, ఫొటోలు, డెకరేటివ్ పీసెస్, వాల్‌క్లాక్స్, పెయింటింగ్స్, సీనరీలు ఇచ్చి వారింటికి అందాన్ని చేకూర్చవచ్చు.

పెర్ఫ్యూమ్స్, దుస్తులు, టైలు, వాచీలు, ఉంగరాలు, బెడ్‌లైట్లు, బ్యూటీ కిట్స్, చక్కని పుస్తకాలు, ముత్యాల ఆభరణాలు వగైరా పెర్సనల్ ఐటమ్స్ బహూకరించవచ్చు.

ఒకే రకంవి అనేకం

ఎవరు ఏది బహూకరిస్తారో తెలీదు గనుక ఒకే రకంవి అనేకం రావచ్చు. కొన్ని తరహావి అసలే రాకపోవచ్చు.

అంచేత వధూవరులకు దగ్గరి వారైతే, ఏమీ అనుకోని వారైతే వారితో చర్చించి గిఫ్ట్ కొనివ్వడం బెస్ట్. అది కుదరనిచో కొత్త తరహాది ప్రత్యేకమైనది ఇవ్వవచ్చు.

కొలీగ్స్, స్నేహితులు ఎవరికి వారు ఇచ్చేకన్నా అంతా కలిసి ఒకే పెద్ద బహుమతి ఇవ్వడం చాలా మంచిది.

అమెరికా పద్ధతి

తమకు కావాల్సిన బహుమతుల జాబితాను వధూవరులు ముందే రూపొందిస్తారు.

వెడ్డింగ్ కార్డ్ ఇస్తూ ఆ లిస్టుని బంధుమిత్రులకి చూపిస్తారు.

తామివ్వాలనుకున్న గిఫ్ట్ సొమ్ముకి సరిపోయే వస్తువు పేరును టిక్ పెట్టి ప్రక్కన తమ పేరు రాస్తారు.

దీనివల్ల ఎక్కువమంది ఒకే రకం వస్తువులు ఇస్తారనే భయం ఉండదు. ప్రతి గిఫ్టూ వారి కుపయోగిస్తుంది. గిఫ్ట్‌తో బాటు బిల్లునూ ఇస్తారు. నచ్చకపోతే షాపుకెళ్ళి మార్చుకోవచ్చు. చైన్ స్టోర్స్ ఎక్కువ గనుక ఎక్కడ కొన్నా సులభంగా ఎక్చేంజ్ చేసుకోవచ్చు.

గిఫ్టు చెక్కులు ఉత్తమం

ఫలానాది కావాలని అడిగి పుచ్చుకునే సంప్రదాయం మనకు లేదు.

మరీ దగ్గరి బంధువులో క్లోజ్ ఫ్రెండ్సో ఫలానాది ఇవ్వనా అని అడిగితే తలూపొచ్చుగాని నోరు తెరచి అడగరు.

పెళ్లికి రావటమే ఒక బహుమతిగా భావించి తృప్తిపడతారు.

వధూవరుల కిష్టమైనది కొనుక్కుంటారన్చెప్పి కొందరు డబ్బు ఇస్తారు. ఇంకొందరు చెక్కులూ గిఫ్టు చెక్కులు ఇస్తారు.

డబ్బు పెళ్లిలోనే ఖర్చైపోవచ్చు. దేనికోసం ఇచ్చారో దానికోసం ఉపయోగ పడకపోవచ్చు.

గిఫ్టు చెక్కులు ఇవ్వడం మంచి పద్ధతి.

పెళ్లి హడావిడయ్యాక వధూవరులు తీరిగ్గా వాటిని మార్చుకుని అవసరమైనవి కొనుక్కోడానికి వీలు పడుతుంది.

కొన్ని మాల్స్ వారు గిఫ్టువోచర్లు అమ్ముతున్నారు. వాటిని కొని బహూకరించవచ్చు. వధూవరులు ఆయా మాల్స్ కెళ్ళి వారికి నచ్చిన/కావాల్సినవి కొనుక్కోవచ్చు.

బహుమతుల్ని పోల్చవద్దు

వధూవరులు గుర్తుపెట్టుకోవాల్సిన విషయమిది.

ఎట్టి పరిస్థితుల్లోనూ బహుమతుల్నీ అవిచ్చిన వారినీ పోల్చి చూడవద్దు. చిన్న బహుమతి ఇచ్చినవారి గురించి హీనంగా చులకనగా మాట్లాడవద్దు. ఇతరుల దగ్గర కామెంట్ చెయ్యవద్దు. ఖరీదైన కానుకలిచ్చినవారి గురించి అందరి దగ్గరా పదే పదే గొప్పగా చెప్పవద్దు.

బహుమతులు ఇచ్చేవారికి వధూవరుల మీదగల అభిమానానికి గుర్తులు. వాటికి విలువకట్టవద్దు. అవి అమూల్యాలు!



33

గృహప్రవేశం



వధువు కొత్త కోడలుగా అత్తింట తొలిసారిగా అడుగుపెట్టడమే గృహప్రవేశం లేదా వధూ గృహప్రవేశం.

వివాహం కన్యాదాత ఇంట లేదా కళ్యాణ మండపంలో – ఎక్కడ జరిగినా కన్యాదాత ఆధ్వర్యంలోనే జరుగుతుంది. అతడూ అతడి బంధువులూ వధువును అత్తవారి కప్పగిస్తూ అంపకాలు పెడతారు.

ఆ తదుపరి ఆమె జీవితమంతా అత్తవారింటితోనే ముడి పడుతుంది.

అలాటి ఇంట ఆమె ప్రవేశం ఆమెకీ ఆమె కొత్త కుటుంబానికీ శుభం జరగాలన్నది అందరి ఆకాంక్షనూ.

గొడ్డొచ్చిన వేళ బిడ్డొచ్చిన వేళ అన్నారు.

బిడ్డొచ్చిన వేళ అంటే ఆడబిడ్డ చేసే గృహప్రవేశమే.

ఆమె మీద ఆ ఇంటి ఉత్థాన పతనాలు ఎంతగా ఆధారపడి ఉన్నాయో సూక్ష్మంగా చెబుతోందా సామెత!

నూతన జంటకు ఆహ్వానం

నూతన దంపతులు ఇంటి వాకిట్లో అడుగు పెట్టగానే మొదట దిష్ఠి తీస్తారు.

పెళ్లిలో వారిమీద అనేక కళ్ళు అనేక రకాల దృష్టులు పడతాయి. గనుక దృష్టి దోషం పోవడానికి రకరకాల పద్ధతుల్లో దిష్టి తీస్తారు.

పిమ్మట ఆడబడుచులూ వదినెలూ అమ్మలక్కలూ వారిని గుమ్మం దగ్గర నిలిపేస్తారు. ఒకరి పేర్లొకరు చెప్పాలని పట్టుబడతారు.

సిగ్గుల మొగ్గలవుతూనే బ్రతిమాలించుకున్నాక పేర్లు చెబుతారు.

వధువు చేత కూడా భర్త పేరు చెప్పించడం విశేషం. తర్వాతెలాగూ పేరు పెట్టి పిలవలేరుగా!

తెలుగు వారికి ప్రత్యేకమైన పాటలూ మంగళహారతి పాటలూ పాడి హారతిచ్చి ఇంట్లోకి ఆహ్వానిస్తారు.

దీపాలతో స్వాగతం



చేతిలో దీపాలతో కూడిన పళ్ళెం పట్టుకుని అత్తగాని ఆడబడుచుగాని కొత్త కోడల్ని అత్తవారి ఇంట్లోకి ఆహ్వానిస్తారు.

దీపం లక్ష్మీదేవి స్వరూపమంటారు. వెలిగే దీపాలను పట్టుకోవడం లక్ష్మి సాన్నిధ్యంగా భావిస్తారు.

కోడలు తమింటికి మహాలక్ష్మి కావాలని ఆశిస్తూ ఆహ్వానించడమే ఇది!

కుడికాలు పెట్టాలి

వధూవరులిద్దరూ మొదట కుడికాలుని మోపుతూ ఇంట్లో ప్రవేశిస్తారు.

కుడిభాగం శుభసూచకమని పెద్దలు అభిప్రాయం. అందుకే ముఖ్యమైనవి కుడి చేయి లేదా కుడికాలుతో చెయ్యాలి.

ఆమె తన కొత్త ఇంట్లో కుడికాలుపెడుతున్నప్పుడు చెప్పే మంత్రాలు:

'గృహాన్భద్రాన్త్సుమనసః ప్రపద్యే వీరఘ్నీ వీరవతస్సువీరాన్

ఇరాం వహతో ఘృతముక్షమాణా స్తేష్వహగ్ం సుమనస్సం విశామి'

"ఈ ఇల్లు మంగళకరమైంది. ఇందలి వారు మంచి మనస్కులు. అన్నపానీయాలు ఇక్కడ సమృద్ధిగా వున్నవి. నేనీ గృహాన్ని నాదిగా చేసుకుంటున్నాను. మంచిమనస్సుతో ఈ ఇంట్లో ప్రవేశిస్తున్నాను. ఎవరికీ కష్టం కలిగించను'

మరో మంత్రానికి అర్థం –

'ఈ ఇంట్లో సంతోష హృదయంతో ప్రవేశించాను. నేనిక్కడ పిల్లలకు జన్మనివ్వాలి. వాళ్ళు ధర్మాన్ని పాటించాలి. ఈ ఇల్లు ఎప్పటికీ ధనధాన్యాదులతో తులతూగాలి. ఆహారాని కెప్పుడూ లోటు రాకూడదు. ఈ ఇల్లు నీతిమంతుల్తో పవిత్ర మనస్కులతో వర్థిల్లాలి!'

నవవధువు చేత ఇంట్లో నవధాన్యాలు చల్లిస్తారు. ఆమె రాక సిరి సంపదల్ని ధనధాన్యాల్ని పొంగించాలని ఆకాంక్ష.


పిమ్మట కొందరు వాస్తు పూజ చేయిస్తున్నారు.

ఉత్తరాదిలో వధువుచేత రంగునీళ్ళ పళ్లెంలో కాళ్ళు పెట్టించి ఇంట్లో అడుగు పెట్టమంటారు. కాలి ముద్రలేస్తూ గృహప్రవేశం చేస్తుంది వధువు.

ఇంట్లోనూ ఇంటి వారి మీదా చెరగని ముద్ర వేయబోతున్నందు కిది నాంది అన్నమాట!



సత్యనారాయణస్వామి వ్రతం



సత్యదేవుని వ్రతాన్ని తెలుగునాట ప్రతిశుభకార్యంలోనూ చేస్తారు. ఈప్సితార్థాలు నెరవేరతాయని విశ్వాసం.

వధువు గృహప్రవేశం చేసింది గనుక శుభాశీస్సులు కోరుతూ నూతన దంపతుల చేత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేయిస్తారు.

వారితో బాటు వరుడి తల్లిదండ్రులూ ఇంట్లోని ఇతర దంపతులు సైతం పాల్గొనాలి. కుటుంబమంతా కలిసి చేయడం శ్రేయస్కరం.

ఇరుగు పొరుగునీ బంధుమిత్రుల్నీ పిలిచి వేడుకగా జరుపుకోవాలి.

ఈ సందర్భంగా వరుని మావగారు తన ప్రతినిధి ద్వారా నూతన జంటకి నూతన వస్త్రాలు బహూకరిస్తారు.

స్థాలీపాకం

స్థాలీపాకమంటే వంటపాత్రలో వండిన వంటకం.

వివాహ సమయంలో హోమం కోసం ఆవుపాలతో వండిన అన్నమే స్థాలీపాకం.

వివాహ ప్రక్రియ సుదీర్ఘమైంది. సంక్లిష్టమైంది. కొన్ని పొరబాట్లు లోటుపాట్లు జరగవచ్చు.

వాటి ప్రాయశ్చిత్తార్థం, వివాహం చక్కని ఫలము నిచ్చేందుకు, వధూవరుల అభ్యుదయార్థం స్థాలీపాకం నిర్వహిస్తారు.

పవిత్రమైన అగ్నిని ఉపాసించే జీవనానికి నాంది పలికే కర్మయే ఆగ్నేయ స్థాలీపాకం.

దీనితో వధూవరుల గృహస్థ జీవితం మొదలవుతుందని చెప్పవచ్చు.

వధువు ఒకచిన్న వంటపాత్రలో నీళ్ళు పోసి బియ్యం వేసి అన్నం వండాలి. కాసిని ఆవుపాలు పోసి హోమం కొరకు సిద్ధం చేస్తుంది.

ఆ కార్యంలో వరుడామెకు సహాయపడతాడు.

పూర్వం వధువు చేత ధాన్యం దంపించి, బియ్యం బాగు చేయించి మరీ వండించేవారు. ఆమెకి వంటా వార్పూ పొదుపూ నేర్పూ ఎంతవరకు వచ్చో తెలుసు కోడానికలా చేసేవారేమో!

హోమద్రవ్యాన్ని సమంత్రికంగా హోమం చేస్తాడు వరుడు.

స్థాలీపాకంతో పూర్తి వివాహ సిద్ధి ఏర్పడుతుంది.

ఉయ్యాల బొమ్మని అప్పజెప్పుట

వధువు ఆడబడుచుకు బొట్టు పెడుతుంది.

ఆమె ఊయలలో చెక్క బొమ్మని పెట్టి ఊపుతూ "పాడి ఆవునిస్తావా పడుచునిస్తావా" అని అడుగుతుంది.

ఆ బొమ్మను తీసి ఆడబడచు చేతిలో పెట్టి ఆమె కోరిక తీరుస్తుంది ఆ వధువు.

అంతా ఆశీర్వదించి అక్షింతలు వేస్తారు.

కొత్త కోడలికీ ఆడబడుచుకీ మధ్య సఖ్యత కూర్చి సాన్నిహిత్యం పెంచేందుకు తోడ్పడుతుందీ అంశం.

మేనరికపు వివాహానికి బీజమూ ఉంది!

సదస్యం

సదస్యమంటే పెళ్లి మూడోనాడు బ్రాహ్మణుల మహదాశీర్వాదపు సభ.

సదస్యులనగా సభకి విచ్చేసిన వారు.

వేద విద్వాంసులను పిలిచి వారి సమక్షంలో ఇంద్రాది అష్టదిక్పాలక పూజ, గణపతి పూజ, సరస్వతీ పూజ చేస్తారు.

నూతన దంపతులు వారిని సత్కరించి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

పండితులను ఆదరించడమూ, పెద్దల ఆశీర్వాద బలం పొందటమూ 'సదస్యం' ఉద్దేశం!

నాకబలి

దీనినే నాగవల్లి అని కూడా అంటారు.

ఇది పెళ్లిలో ఆఖరున చేసే వేడుక. వివాహమైన అయిదవ రోజున లేదా ఆఖరు రోజున జరుపుతారు.

నాకబలి తర్వాత అదే రోజు శోభనం చెయ్యవచ్చు.

తొందరవల్లో పొరబాటు వల్లో ఏదేని కర్మ జరక్కపోయినా సరిగ్గా జరక్కపోయినా ప్రధాన సంస్కారానికి లోపం రాకుండా వధూవరులకు మంచి జరిగేందుకుగాను దేవతలకు చేసే పూజే నాకబలి.

తొమ్మిది మట్టి పిడతల్లో నవధాన్యాలు పోసి ఎనిమిది దిక్కుల్లో ఎనిమిదీ, మధ్యన ఒకటీ ఉంచుతారు. ఎనిమిది కోణాలు వచ్చేలా అయిదు రంగుల దారాలతో కడతారు. ప్రమిద మూత పెట్టి నూనెపోసి దీపాలు ఎనిమిది దిక్కుల్లో పెడతారు.

దంపతులు వివిధ దేవతలను పూజిస్తారు.

వధువుకు చీరలూ నగలూ బంధువులు బహూకరిస్తారు.

నల్లపూసలు కట్టడం

నాగవల్లి తర్వాత గౌరీ పూజచేసి వధువు మెడలో వరుడు నల్లపూసలు కడతాడు.

ఈ సందర్భంలో పఠించే మంత్రం

'నీల లోహితే భవతః కృత్యాసక్తి ర్వ ర్జ్యతే।

ఏదంతే అస్యా జ్ఞాతయః పతిర్బంధేషు బధ్యతే ॥'

'నలుపు ఎరుపు రంగులు గల మణులతో కూడిన సూత్రాన్ని ధరించుచున్నావు. దీని ప్రభావంచే నిన్ను ఇతరులెవ్వరూ పరాభవింపలేరు. నీ బంధువులు వృద్ధి చెందుతారు. నీ భర్తనగు నేను నీయందు అనురాగబద్ధుడ్నై ఉంటాను' అని భావం.

మెడలో నల్లపూసలదండ ధరించడం సుమంగళీత్వానికి గుర్తు.

ఈ మధ్య కాలంలో పెళ్లి పీటల మీదే వరుడి చేత వధువు మెడలో నల్లపూసలు కట్టిస్తున్నారు.

కంకణ విమోచనం

పెళ్లిలో వధూవరుల ముంజేతికి కట్టిన కంకణాన్ని విప్పుతారు.

దానితో వివాహ ప్రక్రియ పూర్తవుతుంది.

పాన్పు ఓ వేడుక

వరుడింట పెళ్లి సంబరాలు తక్కువగా జరుగుతాయి.

ఆ లోటు పూడ్చడానికీ వధూవరుల్ని దగ్గర చెయ్యడానికీ ఉద్దేశించినది పాన్పు.

వధూవరుల్ని అలంకరించిన పాన్పు మీద ఎదురెదురుగా కూర్చోబెడతారు.

వారి చేత పూబంతులాట ఆడిస్తారు. వసంతం, అత్తరు చిమ్మిస్తారు.

వెండి రూపాయి బిళ్ళలు ఇద్దరికీ సమంగా పంచిచ్చి బొమ్మా బొరుసూ ఆట ఆడిస్తారు.

ఈ వేడుకలో ఆడవారిదే పైచేయి.

రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరు పెళ్లి కొడుకునీ మరొకరు పెళ్లి కూతుర్నీ సపోర్టు చేస్తారు. ఉత్సాహపరుస్తారు. వెక్కిరిస్తారు. కేరింతలు కొడతారు.

అప్పుడు వారు చేసే అల్లరీ సందడీ చూడదగ్గ విశేషం.

పెళ్లికి వెళ్లని ఆడవారంతా వచ్చి పెళ్లికూతుర్ని చూసి వెళ్తారు.

ఈ సందర్భంలో అనసూయ కథ, ఊర్మిళ నిద్ర, గంగాగౌరీ సంవాదం, అత్తాకోడళ్ళ పాటలు, హారతి పాటలు – ఎన్నో అచ్చతెనుగు పాటలు గుబాళిస్తాయి!

పరిశీలన ముఖ్యం

అత్తింటితో అత్తింటివారితో వధువుకిదే తొలి పరిచయం.

గనుక ఇంటినీ ఇంట్లోని వారినీ వస్తువాహనాలనీ గమనించాలి. ఎవరూ చెప్పకుండానే అత్తింటివారి ఆర్థిక సామాజిక పరిస్థితి గురించి ఒక అవగాహన ఏర్పడుతుంది. అంచనాలు తల్లక్రిందులైనా సరే తొందరపడి బయట పడకూడదు.

ఇంటి సభ్యుల్ని పరిశీలించాలి. వారి గురించి వినాలి. అలవాట్లూ ఆలోచనలూ వీలుకుదిర్తే తెలుసుకోవాలి. అంతే తప్ప ఎవర్నీ ఏమీ అడగకూడదు. అనకూడదు.

కళ్ళకీ చెవులకీ పని చెప్పాలి తప్ప నోటికి కాదు.

తొందరపడి మాట్లాడిన ఒక మాట ఆమె మీద దురభిప్రాయం కలిగించే ప్రమాదముంది.

మున్ముందు తన పాత్ర చక్కగా పోషించేందుగ్గాను ప్రస్తుత సమయాన్ని ప్రిపరేషన్‌గా ఉపయోగించుకోవాలి!

చెప్పుడు మాటలు వినవద్దు

కొత్త కోడల్ని చూడటానికెందరో స్త్రీలు వస్తుంటారు. అంతా ఒకే రకంగా ఉండరు. ఒకే భావంతో రారు.

ఆప్యాయతతో కొందరొస్తే అసూయతో కొందరొస్తారు.

అత్తింటి గురించి ముఖ్యంగా అత్త గురించి లేనిపోనివి కల్పించి చెబుతారు. అపోహలు కల్పిస్తారు. అత్తమీది అసూయని ఉక్రోషాన్ని కొత్త కోడలిద్వారా తీర్చుకోవాలని చూస్తారు.

తస్మాత్ జాగ్రత్త!

తొందరపాటు పనికిరాదు

అత్తవారింటి గురించి వధువు తొందరపడి ఒక నిర్ణయానికి రాకూడదు.

లోటు పాట్ల గురించి భర్తతోగాని పుట్టింటి వారితో గాని చర్చించరాదు.

నిదానంగా హుందాగా వ్యవహరించాలి. గౌరవంగా స్నేహ పూర్వకంగా ప్రవర్తించాలి.

అత్త ఆడబడుచు తోడికోడళ్ళతో కలిసిపోవడానికి ప్రయత్నించాలి.

భేషజాలకు పోకూడదు. పుట్టింటి గొప్పలు చెప్పకూడదు.

ఆధిక్యత అసహనం ప్రదర్శించకూడదు. ఎవరినీ కించపరచరాదు.

ఎవరేమిటో తెలుసుకోవాలి. అవగాహన పెంచుకోవాలి.

సేకరించిన సమాచారాన్ని బట్టి తన కార్యక్షేత్రాన్ని నిర్ణయించుకోవాలి.

ఇది ఒక్కరోజులోనో ఒక్క వారంలోనో పూర్తయ్యే పనికాదని మరువకూడదు!

యానాళ్ళు తెచ్చుట

వధువు బంధువులు వరుడింటికి యానాళ్ళు తెస్తారు.

చీరసారెలు, బియ్యం, అలంకరణ సామాగ్రి, అరటి పళ్ళు వగైరాలు తెచ్చిస్తారు.

వారికి ఘనంగా భోజన ఏర్పాట్లు చేస్తారు.

బంధుత్వ విస్తరణ కిది నాంది.

అదే రోజున వధూవరుల్ని శోభనం చెయ్యడానిగ్గాను వధువు పుట్టింటికి తీసుకెళ్తారు.

వారితో బాటు వరుడి బంధువులూ వెళ్తారు.

వీరు వారికి విందు ఏర్పాటు చేస్తారు.

ఈ రాకపోకలు బంధుత్వబంధం బలపట్టానికి కారణమవుతుంది.

పెళ్లితో రెండు కుటుంబాలే కాదు రెండు కుటుంబాలవారి బంధువులూ కలిసిపోతారు!

రిసెప్షన్



పెళ్లి మరో ఊళ్ళో జరిగినప్పుడు వరుడి తల్లిదండ్రులు తమ ఇంట్లో రిసెప్షన్ అరేంజ్ చేస్తున్నారు.

ఆ సంగతి శుభలేఖలో ముద్రించడం జరుగుతుంది గనుక పెళ్లికి వెళ్ళలేననివారు రిసెప్షన్‌కి హాజరవుతారు.

తమ తమ స్థాయిని బట్టి రిసెప్షన్ని ఇంట్లో లేక హోటల్లో లేక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేస్తారు.

వధూవరుల్ని ప్రత్యేక ఆసనాల్లో ఆసీనుల్ని చేస్తారు. పూలదండల్ని మార్పించి అక్షింతలేసి ఆశీర్వదిస్తారు.

అతిథులంతా కూడా అక్షింతలు వేస్తారు. బహుమతులూ పూలగుచ్ఛాలూ ఇస్తారు.

కేవలం విందుతోనే సరిపెట్టక వినోద కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తే ఆహ్లాదకరంగా ఆనందంగా ఉంటుంది.

34

గర్భాధానం

పెళ్లి అంటే స్త్రీ పురుషుల కలయిక.

తనువుల కలయికతోగాని అది సంపూర్ణం కాదు.

ఆ కలయికే శుభకార్యం. శోభనం. గర్భాధానం.

గర్భాధానమంటే పెళ్లి తరువాత పిల్లలు పుట్టడం కోసం చేసే సంస్కారం. అక్కర, కార్యం. గర్భం కలిగించడం.

'గర్భాధానం' ని 'గర్భాదానం'గా వ్యవహరిస్తూంటారు.

ఒక సంస్కారం

గర్భాధానం షోడశ సంస్కారాల్లో ఒకటి.

గర్భాధానము వలన గర్భమున విడువబడిన వీర్యం అమోఘమై గర్భము ధరింపబడును. కనుకే దానిని గర్భాధానము అంటారు.

'ఏ కర్మ పూర్తియైన తర్వాత స్త్రీ పతిద్వారా శుక్రధారణను చేయుచున్నదో దానినే గర్భా లంబనమని, గర్భాధానమని యనుచున్నారు" అన్నారు శౌనకుడు.

క్షేత్రము బీజమును వేయుటకు క్షేత్ర, బీజ శుద్ధి ఎట్లు చేస్తారో అట్లే ఈ గర్భాధాన మంత్ర సంస్కారం వల్ల బీజదోషం, గర్భదోషం తొలగుతాయి.

గర్భాధాన ముహూర్తం

సృష్టి కారకమైంది స్త్రీ పురుషుల సంయోగం. అది శుభసమయంలో జరిగితే సత్సంతాన భాగ్యం కలుగుతుందనే నమ్మకంతో శోభనానిక్కూడా ముహూర్తం నిర్ణయిస్తారు.

గర్భాధాన ముహూర్తం రాత్రికాలమందే నిర్ణయించాలి. పగలుగాని అసుర సంధ్యా సమయానగాని నిర్ణయించకూడదు. సోమ, బుధ, గురు, శుక్ర వారములు శుభము. ఆదివారము మధ్యమము. శని, మంగళ వారములు నింద్యము.

పెళ్లైన మూడో రోజున గాని అయిదవరోజున గాని శోభనానికి ముహూర్తం పెడతారు. కొందరు పెళ్లి రోజు రాత్రే శోభనం జరిపించడం కద్దు.

మిథున విడియములు

శోభనం రోజున కొత్త దంపతుల చేత వివిధ పూజలూ కార్యక్రమాలూ చేయిస్తారు.

అందులో ఒకటి దంపతి తాంబూలాలిచ్చుట. దీనినే మిథున విడియములంటారు.

అయిదుగురు పాత దంపతులకు తాంబూలమూ పండ్లూ ఇచ్చి ఆశీస్సులు పొందుతారు.

వారిని గౌరవించడమంటే వారి దాంపత్య బంధాన్ని గౌరవించడమే.

అది తమకీ ఆదర్శం అన్న భావన ఉంది. సూచన ఉంది.

హృదయ స్పర్శ

వరుడు వధువు యొక్క కుడి భుజము మీదుగా తన కుడిచేయి సాచి వధువు హృదయమును తాకాలి. వధువు కూడ ఎదుటి నుండి తన కుడి హస్తంతో వరుడి హృదయమును తాకాలి.

ఇద్దరూ **"ఓం మమ ప్రతేతే హృదయం దధామి మమ చిత్త మను చిత్తంతే అస్తు..."** అంటూ మంత్రాలు పూర్తిగా పఠించే వరకు ఒకరి హృదయాన్ని ఒకరు తాకుతూండాలి.

వారి శరీరాల తాకిడితో మరింత సన్నిహితం చెయ్యడమే దీని ఉద్దేశం.

సమీక్షణం

వివాహానికి సంబంధించి ఇది చివరి కార్యక్రమం.

'అపశ్య న్త్వా మనసా చేకితానం తపసో జాతం తపసో విభూతం

ఇహ ప్రజామిహరయిగ్ం రరాణః ప్రజాయస్య ప్రజాయా పుత్రకామ'

"నిన్ను నా అభిప్రాయం తెలిసినవాడివిగా, మంచి సంస్కారంతో పుట్టినవాడివిగా, మంచి నియమాలతో పెంచుకున్న తేజస్సు గల వాడివిగా నేను గ్రహించాను. ఓ సంతానాభిలాషీ! నీవు నాలోనే సంతానాన్ని కని సిరి సంపదలనిచ్చి సుఖపడుము" అని వధువు వరుడితో అంటుంది.

వధూవరులిద్దరూ కలిసి

"సమంజంతు విశ్వేదేవా స్సమాపో హృదయా నినౌ

సంమాతరిశ్వా సంధాతా సముదేష్ట్రీ దిదేష్టునౌ" అంటారు.

అనగా – "విశ్వదేవులు, పవిత్ర జలాలు, వాయువు, బ్రహ్మదేవుడు మన మనస్సులను ఎల్లప్పుడూ స్నేహంతో ఉండు నట్లు చూచుగాక !"

తర్వాత వరుడు ప్రజాపతి, ఇంద్రుడు, సూర్యుడు మొదలగు దేవతలు మాకు బలము నిత్తురుగాక అని ప్రార్థిస్తాడు.

పిమ్మట గర్భాధాన మంత్రములు చదువుతాడు పురోహితుడు.

గదిలోకి పంపుట

శోభనపు గదినీ మంచాన్నీ రకరకాలపూలతో పూలమాలత్తో మత్తు గొలిపేలా అలంకరిస్తారు.

అత్తరు పరిమళం మైమరపింపజేస్తుంది. అగరువత్తుల ధూపం మరో లోకానికి తీసుకెళ్తుంది.

పాలు పళ్ళు తీపి పదార్థాలూ ఒక పళ్లెంలో ఉంచుతారు.

కొత్త దంపతుల్ని గదిలోకి తీసుకెళ్ళి పాన్పుమీద కూర్చోబెడతారు. ఒకరి ఎంగిలి పాలు ఒకరి చేత తాగిపిస్తారు. పూల బంతుల్తో ఆడిపిస్తారు. ఒకరికొకరు అత్తరు పూసుకునేలా పురిగొల్పుతారు.

పిమ్మట వారిని వదలి తలుపులు గడియపెడతారు.

ఒకవేళ ముహూర్తం పెందలకడనే వచ్చినట్లయితే ముందు పై విధంగా చేశాక వధూవరుల్ని బయటికి తీసుకొస్తారు.

తర్వాత బంధువుల భోజనాలయ్యాక వరుడ్ని గదిలోకి పంపుతారు. తర్వాత సర్వాలంకార భూషితయైన ధవళ వస్త్రధారియైన వధువును పాలగ్లాసుతో గదిలోకి పంపుతారు.

వధువింట శోభనం

తొలిరాత్రిని స్త్రీకి అనువైన చోట ఏర్పరిస్తే అనుకూలంగా ఉంటుంది.

అందుకనే ఎక్కువగా వధువింట ఏర్పాటు చేస్తారు. కొన్ని కులాల్లో వరుడింట ఏర్పాటు చేసే ఆచారమూ ఉంది.

ఎలాంటి ఇబ్బందీ బెరుకూ ఉండదని పూర్తి ప్రైవసీ ఉంటుందని హోటల్లో ఆరేంజ్ చేస్తున్నవారూ ఉన్నారు.

ఎక్కడ చేసినా అది వారికి మరపురాని మధురస్మృతిగా మిగలాలి.

ఇది తొలిరేయి

పెళ్లయ్యాక వధూవరులు జంటగా గదిలో ఒకే మంచం మీద గడిపే తొలిరాత్రి.

తర్వాతెన్నో రాత్రులు వస్తాయి. అయినప్పటికీ మొదటిరాత్రి మొదటి అనుభవం అపూర్వమైనది. మరపురానిది.

ఇద్దరికీ శృంగారం కొత్త.

ఉత్సుకత, ఆరాటం, కోరిక – తొందరపెడుతుంటాయి. సిగ్గు, సంకోచం, భయాలు, ఆందోళన, గగుర్పాటు – కళ్ళెం వేస్తుంటాయి.

తొందరపాటు తత్తరపాటు తప్పవు.

ముచ్చెమటలు, తడారిపోయే పెదవులు, మారే స్వరాలు, కంపించే శరీరాంగాలు – చిత్రంగా ఉంటుంది వారి మనఃస్థితి!

ఫస్ట్‌నైట్ సిండ్రోమ్ చాలా సున్నితమైన సమస్య. స్నేహపూరిత వాతావరణం కల్పించుకుని దానినధిగమించాలి!

మాటల మంత్రం వెయ్యాలి

తొందర తొందరగా ఏదేదో చేసెయ్యాలని ప్రయత్నించకూడదు.

ముఖ్యంగా అమ్మాయి బెదిరిపోకుండా ఆందోళన చెందకుండా చూడాలి. సిగ్గు బిడియాల్ని మెల్లమెల్లగా పోగొట్టాలి.

కోరికతో రెచ్చిపోతే ఆమె భయపడొచ్చు. చెడుగా భావించొచ్చు. విముఖురాలవ్వొచ్చు. కాళరాత్రిగా మార్చనూవచ్చు.

అంచేత అబ్బాయి సున్నితంగా చాకచక్యంగా వ్యవహరించాలి. తన కంగారునీ తడబాటునీ కప్పిపుచ్చుకుంటూ ఆదరంగా మాట్లాడాలి. మాటల్ని మంత్రాలుగా ప్రయోగించాలి.

పెళ్లిలో జరిగిన సరదాల గురించి చెప్పుకోవాలి. కలల గురించి ఆశల గురించి మనస్సు విప్పి మాట్లాడుకోవాలి. ఒకర్నొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. సంకోచం తగ్గి సాన్నిహిత్యం పెరిగేలా వ్యవహరించాలి.

అదే సమయంలో చక్కిలిగింతలు పెట్టుకోవాలి. ముద్దులతో మురిపించాలి. మైమరపించి అమ్మాయిని మచ్చిక చేసుకోవాలి.

మరోరకంగా చెప్పాలంటే అమ్మాయిని అబ్బాయి శృతి చెయ్యాలి!

మొదటి రాత్రే అన్నీ వద్దు

తొలి రాత్రిని పూర్తిగా అర్థం చేసుకోడానికీ దగ్గరవడానికీ ప్రయత్నించాలంటారు కొందరు.

అంత సంయమనం పాటించగలిగితే మంచిదే. కాని వాస్తవంలో అది జరిగే పని కాదు. ఒకవేళ జరిగితే అపార్థాలకు దారి తీయనూ వచ్చు!

తొలి సమాగం గురించి ఎన్నో కలలు కని వుంటారు. ఎంతో ఆకర్షణ పెంచుకుని ఉం టారు. ఎన్నెన్నో మధురోహలు అల్లుకుని ఉంటారు.

రెండోవారి శరీర భాగాలని చూడాలని స్పృశించాలని నిమరాలని ఒక్కరిగా కలిసి పోవాలని ఉవ్విళ్ళూరుతుంటారు.

యౌవనపు కోర్కెలు బుసకొడుతుంటే అవకాశం ఎదురుగా ఉన్నప్పుడు సంయమనం పాటించడం అసాధ్యం!

అందుకే మొదట బిడియపు వస్త్రాన్ని తొలగిస్తే చాలు ఆపైన వారిదే ఇష్టారాజ్యం!

ముద్దుతో మొదలు

సంకోచ బిడియాలు తగ్గి మానసికంగా మరింత దగ్గరయ్యాక ముద్దులతో కార్యక్రమం మొదలుపెట్టాలి.

కౌగలింతలతో శరీరపు తహతహల్ని తీర్చుకోవాలి.

ఒళ్ళంతా తడమటం, ఇష్టమైన భాగాలని ముద్దాడటం, మధ్య మధ్య పళ్ళూ స్వీట్లూ తినిపించుకోవడం, నవ్వులూ తుళ్ళింతలతో సరదాగా సఖ్యంగా ఉంటూ ముగ్గులోకి దింపాలి.

విశ్వరూపం

అవతలివారి నగ్నరూపాన్ని తనివి తీరా చూడాలన్న తహతహ ఉంటుంది. ముఖ్యంగా అబ్బాయిల్లో మరీ అధికంగా ఉంటుంది.

స్త్రీత్వపు చిహ్నాలైన పెదవులు, స్తనాలు, జుట్టు, నడుము, పిరుదులు – చూసి ఊరిపోతూ ఊహల్లో విహరించి ఉంటారు. అంచేత వాటిని త్వరగా చూడాలని ఆరాట పడటం సహజం.

పెళ్లికి ముందు తన శరీరంలోని కొద్ది భాగాన్ని కూడా నగ్నంగా పురుషులకు చూపించడానికి ఏ అమ్మాయీ అంగీకరించదు. కాని కొద్దిరోజుల పరిచయస్తుడైన యువకుడి ముందు శోభనం రోజున పూర్తి నగ్నం కావడానికి ఏ అమ్మాయీ అయిష్టత చూపదు.

కారణం వివాహబంధం. పెళ్లి ఇచ్చిన భరోసా. పెళ్లి వల్ల ఏర్పడ్డ అనుబంధం. పెళ్లితో కలిసిన మానసిక బంధం!

తోడి పెళ్లికొడుకూ తోడి పెళ్లికూతురూ

పెళ్లిలో వరుడికి తోడిపెళ్లి కొడుకూ వధువుకి తోడిపెళ్లి కూతురూ ఉంటారు.

దగ్గరి బంధువుల్నుంచే వారిని ఎన్నుకుంటారు. ఎల్లవేళలా వధూవరుల్ని అంటిపెట్టుకు నుండి వారికి సహకరించడం, కొత్తగా ఫీలవకుండా చూడటమూ వారి పని.

తొలిరాత్రి సంగమం గురించిన భయాలు పోగొట్టి తగిన సలహాలూ సూచనలూ ఇస్తారు.

గదిలోకి వెళ్ళగానే తొందరపడకుండా తలుపు గడియలు వేసుకోమంటారు. అమ్మాయిని బెదరగొట్టకుండా సున్నితంగా వ్యవహరించమని వరుడికి తోడి పెళ్లి కొడుకు చెబుతాడు.

అతడేం చేసినా అడ్డు చెప్పవద్దనీ అతడి కనుకూలంగా మసలుకోమనీ భయపడాల్సిందేమీ ఉండదనీ వధువుకి తోడి పెళ్లికూతురు చెబుతుంది.

సెక్స్ పరిజ్ఞానాన్ని అనుభవజ్ఞుల ద్వారా అందించడానికి పూర్వులు చేసిన ఏర్పాటే తోడి పెళ్లికొడుకూ తోడి పెళ్లికూతురూ!

బ్లూ సినిమా

కొత్త దంపతుల్ని గదిలోకి పంపేక తలుపు/కిటికీ రంధ్రాలలోంచి లోపలి కార్యక్రమం చూడాలని ఆడవారు ఉవ్విళ్ళూరుతుంటారు. ఉబలాట పడుతూంటారు.

అలా చూడటం పుణ్యంగా భావిస్తారు. సంతానం లేనివారు చూస్తే సంతానవంతులవుతారంటారు. ఆ 'క్రియ' చూసి ఉత్తేజితులవుతారు కదా మరి!

కాని పెళ్లికాని వారిని ఆ దరిదాపులకి రానివ్వరు. వారూ రారు.

అలా చూడటం సెక్స్ విజ్ఞానంలో ఓ భాగమే అని చెప్పాలి. నీలి చిత్రాలు చూసిన అనుభూతి కలిగిస్తాయి. వారి జడత్వాన్ని వదిలిస్తాయి. చిన్నవారిని చూసి రెచ్చిపోయేలా చేస్తాయి!

అందుకే శోభనం రోజు రహస్య దర్శనాన్ని తప్పు బట్టరు.

ఆ తర్వాత అలా చూడటం ముమ్మాటికీ తప్పే. ఆ ముచ్చట ఆ నాటికే పరిమితం!

శృంగారానికి తెరతీయండి

వధూవరులు తమ ఊహాల్నీ విజ్ఞానాన్నీ మేళవించి శృంగారానికి శ్రీకారం చుట్టాలి.

ఒకర్నొకరు చూసుకుని రాసుకుని ముద్దాడి గౌరవించుకున్నాక రతికార్యంలో పాల్గొనాలి.

మొదటి ప్రయత్నమే సఫలం కాకపోవచ్చు. యోని కండరాలు బిగుతుగా ఉండటం, కన్నెపొర అడ్డుగా ఉండటం, భయాందోళనలు త్వరగా దారివ్వవు.

సున్నితంగా వ్యవహరించి ప్రేరణ కలిగించి విజయులవ్వాలి.

మొదటి మూడు రాత్రులూ ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలోనే సాగవచ్చు. అంతమాత్రాన దిగాలు పడకూడదు. పుంసత్వం లేదని వాపోకూడదు. అందరూ ఇలాంటి దశ అనుభవించిన వారేనని గుర్తుంచుకోవాలి.

ఒకర్నొకరు ప్రోత్సహించుకోవాల్తప్ప కించపరచుకోకూడదు. అవమానించరాదు. సెక్స్ ఒక సైకలాజికల్ గేమ్ అని మరువరాదు.

సుఖ సంసారానికి నాటి ప్రవర్తనే పునాది అవుతుందని మరచిపోవద్దు!

కన్నెపొర అపోహలు

స్త్రీ మర్మాంగంలో పలుచని పొర వుంటుంది. దాన్ని కన్నెపొర (హైమన్) అంటారు.

పురుషాంగతాకిడికది చిరుగుతుంది. బాధ కలిగిస్తుంది. రక్తమూ రావచ్చు. అది తాత్కాలికమే. తర్వాతంతా సర్దుకుపోతుంది.

వస్త్రాలను రక్తపు మరకలంటితే ఆమె కన్య అని నిర్ధారణ అయినట్టు పూర్వం భావించేవారు.

కానిప్పటి పరిస్థితి వేరు. సైకిల్ తొక్కటం, ఆటలాడటం వగైరాల వల్ల కన్నెపొర ముందే చిరిగిపోవచ్చు. అంచేత ఆమె కన్య కాదని భావించడం తగదు. లేనిపోని అపోహలతో వైవాహిక జీవితాన్ని కలుషితం చేసుకోవద్దు!

సెక్స్ విజ్ఞానం

పెళ్లికి ముందు – కనీసం ఒకటి రెండు నెలల ముందైనా సెక్స్ విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదవటం ఇద్దరికీ మంచిది.

పశుపక్ష్యాదులకు సెక్స్ గురించెవరు బోధిస్తున్నారన్న వితండ వాదనలొద్దు.

వాటికి లేని భావోద్వేగాలు ఆనంద ప్రకటనలు మనిషికున్నాయి.

చక్కని సెక్స్ విజ్ఞానం అపోహల్ని తొలగిస్తుంది. జీవితాన్ని సుఖమయం చేస్తుంది.

పూర్వకాలంలోనే మనదేశంలో వాత్స్యాయన కామశాస్త్రం, కొక్కోకశాస్త్రం రచింపబడ్డాయి.

సెక్స్‌ని ఒక శాస్త్రంగా మన పూర్వులెప్పుడో గుర్తించారు. ప్రోత్సహించారు. పామరుల కోసం దేవాలయాల మీద సైతం చెక్కించారు!

గుప్తదానం

గర్భాదానం రోజు రాత్రి వధువు చూడకుండా ఆమె కొంగుకి బంగారం లేక రూపాయి బిళ్ళ ముడి వేస్తాడు వరుడు.

ఆమె తనని ఆర్పించుకున్నందుకు ప్రతిగా ఇచ్చిన దానంగా లేక గర్భాధానానికి దక్షిణ ఇవ్వటంగా భావించవచ్చు.

కొందరు పెళ్లిలో వరుడికి ఇవ్వబడ్డ చుట్టు ఉంగరాన్నే వధువు కొంగుకి కట్టింపిస్తారు. ఆ బంగారానికి మరికొంత చేర్చి సూత్రాలబొందు చేయించుకుని ధరిస్తుంది వధువు.

35

పెళ్లిళ్ళ రిజిస్ట్రేషన్

ఒకప్పుడు హిందూ వివాహాలకి రిజిస్ట్రేషన్ ప్రధానం కాదు.

దేశంలో జరిగే ప్రతివివాహం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నమోదు కావాల్సిందేనని సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు సంబంధిత నియమ నిబంధనలను మార్చాలని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలను ఆదేశించింది.

దరిమిలా హిందూవివాహాలని సైతం రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఇది తప్పనిసరి కూడా. అలాగని రిజిస్ట్రేషన్ చేయించనంత మాత్రాన ఆ పెళ్లిళ్ళు చెల్లక పోవటమంటూ వుండదు!

ప్రస్తుత సాంఘిక ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పెళ్లిళ్ళు రిజిస్టర్ చెయ్యడం సంబంధితులందరికీ చాలా మంచిది. రక్షాకవచంలా ఉపయోగిస్తుంది.

రిజిస్ట్రార్ ఆఫీసు

రిజిస్ట్రార్ ఆఫ్ మారేజెస్ (ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసే సబ్ రిజిస్ట్రార్) వివాహాలని రిజిస్టర్ చేస్తారు.

ముందుగా నోటీసు లేక శుభలేఖ ఇచ్చి ఫలానాతేదీన వివాహం చేసుకుంటున్నామని తెలియజేస్తే చాలు. ఆ రోజున వధూవరులు ఇద్దరు సాక్షులతో రిజిస్ట్రార్ వారి కార్యాలయానికెళ్ళి రిజిస్టర్లో సంతకాలు పెట్టి అధికారికంగా దంపతులవ్వవచ్చు.

వారి వయస్సుని ధ్రువీకరించే పత్రాలు సమర్పించాలంతే.

పెళ్లికి ముందు, పెళ్లిరోజున, పెళ్లయ్యాక-ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

నిర్ణీత ఫీజు చెల్లిస్తే స్వయంగా రిజిస్ట్రార్ కళ్యాణమండపం దగ్గరికొచ్చి వధూవరుల సంతకాలు తీసుకుంటారు.

రిజిస్ట్రార్ ఇచ్చే మారేజ్ సర్టిఫికేట్ అన్నిరకాల లావాదేవీలకూ లీగల్ డాక్యుమెంటుగా ఉపయోగిస్తుంది.

ఫలానా అమ్మాయికీ ఫలానా అబ్బాయికీ పెళ్లి అయ్యిందని చెప్పడానికి దీనికి మించిన రుజువూ సాక్ష్యం లేవు!

దేవాలయాల్లోనూ ఇస్తారు

దేవాలయాల్లో జరిగే పెళ్లిళ్ళకి కూడా మారేజ్ సర్టిఫికేట్ ఇస్తారు.

వధూవరుల, సాక్షుల సంతకాలు తీసుకుని ఎవరెవరికి ఎప్పుడు వివాహమయ్యిందో పేర్కొంటూ ఇస్తారు.

దేవాలయపు అధికారి సంతకంతో ఇచ్చే ఈ సర్టిఫికేట్ అన్ని విధాలా చెల్లుతుంది.

వీసాలకు తప్పనిసరి...

ఇతర దేశాల్లో ముఖ్యంగా అమెరికాలో నివసించే భర్త లేక భార్య దగ్గరకు రెండోవారు వెళ్ళడానికిగాను డిపెండెంట్ వీసాకి అప్లై చేసుకోవాల్సి ఉంటుంది.

దానికి మారేజ్ సర్టిఫికేట్ జతచెయ్యడం తప్పనిసరి.

అందుకని ఆఖరి నిమిషంలో వివిధ రుజువుల్తో ఆఫీసుల చుట్టూ తిరిగే కన్నా వివాహ సమయంలోనే రిజిస్ట్రేషన్ చేయించడం అన్ని విధాలా మంచిది.

వివాహానికి చట్టబద్ధత

మారేజ్ సర్టిఫికేట్ వివాహానికి చట్టబద్ధత కల్పిస్తుంది. అదనపు రక్షణనిస్తుంది.

దొంగపెళ్లి, రెండోపెళ్లి అరికట్టడానికుపయోగిస్తుంది.

దురదృష్టవశాత్తూ దంపతుల్లో ఒకరు చనిపోతే పెన్షన్, పి.ఎఫ్, ఇన్సూరెన్సు, నష్టపరిహారం వగైరాల సెటిల్‌మెంట్‌కు హెల్ప్ అవుతుంది.

కుటుంబ ఆస్తిలో వారికీ వారి పిల్లలకీ వారసత్వ హక్కుని కల్పిస్తుంది. అనవసర సమస్యల్నీ లిటిగేషన్లనీ నివారిస్తుంది.

రెండో పెళ్లి నుండి రక్షణ

హిందూ వివాహచట్ట ప్రకారం రెండో పెళ్లి చెల్లదు.

రెండో పెళ్లి ద్వారా జన్మించిన సంతానానికి కొంతవరకూ వారసత్వపు హక్కు లభిస్తుంది. కాని రెండో పెళ్లి వధువుకి ఎలాంటి హక్కూ సంక్రమించదు.

పెళ్లి రిజిస్ట్రేషన్ పట్ల వరుడు అనుకూలత ప్రదర్శించకపోతే వెంటనే జాగ్రత్త పడటం అవసరం. అతడికి అంతకుముందే మరో పెళ్లి అయ్యిందేమోనని ఆరా తీయడం మంచిది.

మాయమాటల్లో పడి 'పెళ్లి' అనే రక్షణ కవచాన్ని చట్టం కల్పించే భద్రతను దూరం చేసుకోవద్దు. అవతలి వారెంతటి స్థానంలో వున్నా సరే ఎంత ప్రేమించామన్నా ఎన్ని వాగ్దానాలు చేసినా సరే పెళ్లిని రిజిస్టర్ చేసే విషయంలో మెత్త పడవద్దు. రాజీ పడవద్దు.

ముఖ్యంగా అది వధువుకీ వారి సంతానానికీ శ్రీరామరక్ష.

రెండోపెళ్లి అని తెలిసీ చాటుగా వివాహమాడి చాటుగా కాపురం చెయ్యాల్సిన దుస్థితి కొనితెచ్చుకోవద్దు.

పరిస్థితులు వికటిస్తే పిల్లలు అనాధలవుతారనీ అలా చేసే హక్కు వారికి లేదనీ తెలుసుకోవాలి.

చట్టబద్ధత

హిందూ వివాహ చట్టప్రకారం భార్యభర్తలకి పెళ్ళయ్యేనాటికి ఇంకో భార్య లేక భర్త జీవించివుండకూడదు (విడాకులు తీసుకుంటే వారు మరొకరి భార్య/భర్త అవరు).

వారి పెళ్లి విధిగా కులమత పరమైన ఆచారాలు/కర్మకాండ ననుసరించి జరగాలి.

హిందూ సంప్రదాయ ప్రకారం సప్తపది నడచి వుండాలి. అప్పుడే వారి వివాహానికి చట్టబద్ధత లభిస్తుంది.

సంప్రదాయబద్ధంగా జరిగిన వివాహాన్ని నిర్ధేశించడానికి అగ్ని ప్రదక్షిణ, సప్తపది అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

బాల్యవివాహాలకు బ్రేక్

వివాహాల నమోదు ద్వారా తక్కువ వయస్సులోనే పెళ్లిళ్ళు చేసే పోకడలను అరికట్టవచ్చు.

బాల్యవివాహాలు, రెండు లేక అంతకన్నా ఎక్కువ సార్లు పెళ్ళిళ్లు చేసుకోవడం వంటి వాటికి అడ్డుకట్ట వేయవచ్చు.

ఇరుపక్షాలకూ అంగీకారం లేనిదే పెళ్లి జరగకుండా చూడటానికి ఇదెంతగానో ఉపయోగిస్తుంది.

అమ్మాయిలు సైతం ఇష్టంలేని పెళ్లిని తిరస్కరించగల అవకాశం ఉంది.

నిర్బంధ రిజిస్ట్రేషన్

ప్రస్తుతం విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారూ గ్రీన్‌కార్డ్, హెచ్‌ఒన్ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారూ ఎక్కువగా పెళ్లిళ్ళను రిజిస్టర్ చేసుకుంటున్నారు.

దీని పరిధి మరింత విస్తృతపరచి అన్ని వివాహాలూ రిజిస్ట్రేషన్ చేయించే స్థాయికి తీసుకెళ్ళాల్సివుంది.

2002లో వివాహాల నిర్బంధ రిజిస్ట్రేషన్ చట్టం మన రాష్ట్రంలోనూ తెచ్చారు. కాని నోటిఫై చేయలేదు. అందుకే అమలు కావట్లేదు.

రాష్ట్రంలో జరిగే ప్రతి వివాహం రిజిస్టర్ చేసి తీరాలని సెక్షన్ 7 పేర్కొంటోంది.

పెళ్లైన 30 రోజుల్లోపునే సంబంధిత అధికారికి వివాహమెమోరాండంను సమర్పించాలి!

చట్టాన్ని అనుసరిస్తే అది మన చుట్టమై సాయపడుతుంది!

36

హనీమూన్

భార్యాభర్తల మధ్య ఆత్మీయ సంబంధం ఏర్పడటానికి కీలకమైన కాలం వివాహమైన తొలినాళ్ళే.

ఒకర్నొకరు పూర్తిగా అర్థం చేసుకోడానికి తద్వారా తమ బంధాన్ని పటిష్ఠం చేసుకోడానికి తొలినాళ్ళని చక్కగా ఉపయోగించుకోవాలి.


అందుకు తోడ్పడేదే హనీమూన్. జంట యొక్క విహారయాత్ర.

పూర్వం మొక్కుల పేరిట తీర్థయాత్రలకు పంపేవారు. దూరపు ప్రాంతాన వున్న బంధువుల ఇళ్ళకు పంపేవారు. వాటి అంతరార్థం వారిని దగ్గర చేయడానికే.

జంటగా కలిసి బతకబోయేవారు ఒకరిని మరొకరు కొత్త కోణం నుండి చూడవచ్చు. సన్నిహితంగా మెలగి అలవాట్లూ అభిరుచులూ ఆనందపెట్టే విషయాలూ తెలుసుకోవచ్చు.

జీవితాంతం గుర్తుండిపోయే మధురానుభవం హనీమూన్ ట్రిప్!

ఏకాంతం అవసరం



పెళ్లయ్యాక భార్యభర్తలకు ఏకాంతం అవసరం. పెళ్లికి పూర్వమే ప్రేమించుకున్న వారిక్కూడా ఇది వర్తిస్తుంది.

ప్రేమికుల స్థానం పరిధి స్వతంత్రం వేరు.

ఆలుమగల బంధం బాధ్యత సాన్నిహిత్యం వేరు.

ప్రేమికుల కలలు ఆశలు ఊహల ఉయ్యాలలో ఊరేగుతాయి. వాటికి ఒక బాధ్యతాయుత రూపం ఇవ్వగలిగేది పెళ్లయ్యాకే.

ఎవరూ లేని ఏకాంతంలో ఆలుమగలు స్వేచ్ఛగా విహరించగలుగుతారు. ఎలా వుండాలన్పిస్తే అలా ఉండొచ్చు. ప్రవర్తించొచ్చు. భావోద్వేగాలు పంచుకోవచ్చు.

అప్పుడెలాంటి ఇన్హిబిషన్లూ వుండవు. ఎవరో చూస్తారని వింటారని సిగ్గు పడక్కర్లేదు. భయపడాల్సిన అవసరమూ వుండదు. ఇతర రాష్ట్రాలకెళితే అక్కడి వారి భాష వేరు గనుక వీరిష్టమొచ్చినట్టు ఫ్రీగా మాట్లాడుకోనూవచ్చు.

ఎంతో కీలకమూ అపురూపమూ అయిన హనీమూన్ కోసం కలలు కనని యువత ఉండదు.

శారీరకంగా ఒకటైన జంట మానసికంగా మరింత దగ్గరవ్వడానికి తోడ్పడే అద్భుతావకాశం హనీమూన్!

పెళ్లిలో భాగంగా చూడాలి

పెళ్లిలో వివిధ కాండలున్నాయి. హనీమూన్ కూడా అందులో ఒకటి గానే భావించాలి.

పెళ్లిఖర్చుతో బాటే ఈ ఖర్చునూ కలిపి చూడాలి. పెళ్లితోబాటే దీనికీ ఏర్పాట్లు చెయ్యాలి.

వధూవరులు సంపాదనా పరులైనా సరే వధువు తండ్రి లేదా వరుడి తండ్రి లేదా ఇద్దరూ కలిసి అరేంజ్ చెయ్యడం ఉత్తమం.

తీయని కమ్మని యుగళగీతం పాడుతూ వారు తమ వైవాహిక జీవితం ప్రారంభించేందుకు ఆ మాత్రపు శ్రద్ధ, ఖర్చు తప్పవు.

హనీమూన్ ఏర్పాటు పెద్దలు పిల్లలకిచ్చే విలువైన 'మధురమైన' బహుమతి.

వారి అభిమానాన్ని చాటుకోడానికిదో అవకాశం!

ఆ స్వర్గంలో మీ ఇద్దరే

కేవలం ఒకరితో ఒకరు, ఒకరి ఒడిలో ఒకరు, ప్రకృతి ఒడిలో మీ ఇద్దరూ–ఓహ్! ఎంత ఆనందం! ఉద్వేగం! ఉత్సాహం! అసలా ఊహే ఉత్తేజితుల్ని చేస్తుంది. మధురోహలు రేగి మదిలో గిలిగింతలు పెడతాయి.

చేతిలో చెయ్యి వేసుకుని నడవడం, చెవిలో గుసగుసలు చెప్పుకుంటూ షాపింగ్ చెయ్యడం, రాసుకుంటూ కూర్చుని బోటు షికారు చెయ్యడం, ఒకరికొకరు తినిపించుకుంటూ డిన్నర్ చెయ్యడం, సరిగంగ స్నానాలు చెయ్యడం, నీలాకాశం కింద ఒకరి ఒడిలో ఒకరు విశ్రమించడం, నడుం చుట్టూ చేయివేసి హత్తుకుంటూ బజార్లలో నడవటం, పాటలు పాడుకుంటూ పార్కుల్లో విహరించడం, స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటూ కౌగిల్లో కలసిపోవడం–ఓహ్! స్వర్గలోక విహారమే!

విహారయాత్రకి మీరిద్దరే వెళ్ళాలి. అది పూర్తిగా మీ ప్రైవసీకి పెద్దపీట వేసే సందర్భం. పొరబాటున కూడా మీతో ఎవర్నీ ఆఖరికి పెంపుడు జంతువునికూడా తీసుకెళ్ళొద్దు.

హనీమూన్ సిర్ఫ్ మీ కోసమే–మీ ఇద్దరికోసమే!

ముందే ప్రణాళిక వేసుకోవాలి

బడ్జెట్ ఎంతో నిర్ణయించుకున్నాక హనీమూన్‌కి ఎక్కడికి పంపాలి లేదా ఎక్కడికి వెళ్ళాలి అన్నది ముందుగానే డిసైడ్ చేసుకోవాలి.

నిర్ణయం ఎవరు తీసుకున్నా కొత్త జంట అభిప్రాయాలూ ఇష్టాలూ పరిగణలోకి తీసుకోవాలి.

విదేశాల కెళ్ళేట్టయితే పాస్‌పోర్ట్, వీసా, హెల్త్ సర్టిఫికేట్ వగైరాలు సిద్ధం చేసుకో వాల్సుంటుంది.

దేశంలోనే అయితే ఏయే ప్రాంతాలకెళ్ళాలి ఏయే ప్రదేశాలు చూడాలి ఎక్కడ ఎన్ని రోజులుండాలి–వగైరాలు ప్లాన్ చేసుకోవాలి.

అవసరమనుకుంటే హనీమూన్ ప్యాకేజీలు అరేంజ్ చేస్తున్న ట్రావెల్ ఏజెంట్లని సంప్రదించవచ్చు.

ట్రిప్‌కయ్యే ఖర్చు గురించి ఒక అంచనాకి వచ్చి దానిని బట్టి మార్పులు చేర్పులు చేసుకోవాలి.

ప్యాకేజ్‌లూ ఉన్నాయి

టూరిస్ట్ ప్యాకేజీలే కాదు కేవలం దంపతులకోసం ప్రత్యేకంగా రొమాంటిక్ స్పాట్స్‌ని కలుపుతూ ప్రత్యేక హనీమూన్ ప్యాకేజ్‌లు కూడా ఉన్నాయి.

ప్రముఖ టూరిస్టు కంపెనీలన్నీ నూతన దంపతుల కోసం ప్యాకేజ్‌లు ఆరేంజ్ చేస్తున్నాయి. వివరాలు 'నెట్'లో చూడవచ్చు. బుక్ చేసుకోవచ్చు.

సింగపూర్, మలేసియా, మాల్దీవులు-లాంటి దేశ సరిహద్దు ప్రాంతాలేగాక ప్రముఖ దేశాల్లోని టూరిస్ట్ స్పాట్స్‌కి తీసుకెళ్ళేవీ వున్నాయి.

రవాణా, హోటల్లో బస, భోజనాదులు, సైట్ సీయింగ్ -వగైరాలన్నీ వారే చూసుకుంటారు. వీటన్నిటితో కలిపి ప్యాకేజ్ ఇంత అని వసూలు చేస్తారు. ఇలాటి సౌకర్యం దేశంలోని ముఖ్య ప్రదేశాల దర్శనానికీ కల్పిస్తున్న సంస్థలెన్నో ఉన్నాయి. ముఖ్యంగా ఆగ్రా, గోవా, నైనిటాల్, సిమ్లా, కొడై కెనాల్, కోవలం బీచ్, అండమాన్ దీవులు వగైరా వగైరాలని కవర్ చేస్తున్నారు.

ఆర్థిక అనుకూలత వున్న వారికీ, అరేంజ్‌మెంట్స్ చేసుకోడానికి తగిన సమయం లేని వారికీ హనీమూన్ ప్యాకేజ్‌లు బెస్ట్!

వెంటనే వెళ్తేనే హనీమూన్

హనీమూన్‌కి ఎప్పుడైనా వెళ్ళవచ్చు.

పెళ్లైన వెంటనే గాని పెళ్లి తాలూకు శ్రమ, అలసట తగ్గేక గాని వెళ్లవచ్చు.

పెళ్లైన ఆర్నెల్లకో ఏడాదికో ఖర్చు, శలవులు చూసుకునీ వెళ్లవచ్చు.

కాని పెళ్లైన వెంటనే కనీసం ఒకటి రెండు నెలల్లో వెళ్ళడం ఉత్తమం. అప్పుడైతే ఫ్రెష్‌నెస్, న్యూ అప్రోచ్ వుంటాయి. భావోద్వేగాలు తారస్థాయిలో వుంటాయి. ఉత్సాహ ఉద్రేకాలు సరేసరి.

కొత్త అనుభూతులూ కొత్త అనుభవాలూ దక్కుతాయి. ఒకరి గురించొకరికి సరైన అభిప్రాయం ఏర్పడటానికి వ్యక్తిత్వం అభిరుచులూ అర్థం కావడానికి బాగా దోహదపడుతుంది.

తప్పనిసరి పరిస్థితుల్లో వెంటనే వెళ్ళకపోయినా తర్వాతైనా వీలైన వెంటనే వెళ్ళడం మంచిది. ఆ కొద్దిరోజుల్లో మీరు మూటగట్టుకునే అనిర్వచనీయమైన ఆనందానుభూతులు

జీవితాంతం ప్రతిదశలోనూ ఓ అద్భుత టానిక్‌లా పనిచేస్తాయి. తలచుకుంటేచాలు గుండెల్లో తీపి గుర్తులు కదుల్తాయి. పెదాలమీద లాస్యం సన్నగా నర్తిస్తుంది.

ఏమైనా పెళ్లైన వెంటనే వెళ్తే హనీమూన్ తర్వాత ఎపుడో తీరిగ్గా వెళ్తే తీర్థయాత్ర!

ఎక్కడి కెళ్ళటం బెటర్?

అది మీ మీ ఇష్టాలు అభిరుచులు పర్సు బరువు మీద ఆధారపడివుంటుంది.

ప్రేమచిహ్నమైన తాజ్‌మహల్‌ని ఢిల్లీ ఆగ్రా ఉదయపూర్‌లోని చారిత్రిక కట్టడాలను చూడటానికి వెళ్ళవచ్చు. మైసూర్ మహారాజా ప్యాలస్‌నీ బృందావన గార్డెన్స్‌నీ చూడవచ్చు. హైదరాబాద్ అందాలని ప్రత్యక్షంగా చూడనూ వచ్చు.

డార్జిలింగ్, కొడైకెనాల్, సిమ్లా, నైనివాల్, ఊటీ, కులుమనాలి వగైరా హిల్‌స్టేషన్లకెళ్లి ప్రకృతిలో మమేకం కావచ్చు.

సముద్రతీర ప్రాంతలైన గోవా, లక్షద్వీప్, కోవలం, పూరి, పాండిచ్చేరి వెళ్లి సముద్రంలో ఈదులాడవచ్చు.

తిరుపతి, కంచి, కన్యాకుమారి, వారణాసి, కోణార్క్, కలకత్తాల లోని దేవాలయాలని చూచి భక్తినీ రక్తినీ రంగరించుకోవచ్చు.

చెన్నై, ముంబాయి, బెంగుళూర్, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి సిటీల్లో చక్కెర్లు కొట్టి షాపింగ్ చెయ్యవచ్చు.

సింగపూర్, మలేషియా, పేరిస్, లండన్, న్యూయార్క్ మొదలైనవి చుట్టిరావచ్చు.

ఎటు వెళ్ళాలి ఏవేం కవర్ చెయ్యాలన్నది మీ ఇష్టం. ఇంకేం మీ ఊహలకు రెక్కలు తొడగండి!

వారం పదిరోజులుండాలి

హనీమూన్ ఎన్ని రోజులుండాలన్నది వారి వారి ఇష్టం.

వారం రోజుల్నుంచి పదిహేను రోజుల్దాకా ఉంటే చక్కగా ఎంజాయ్ చెయ్యగలుగుతారు.

రానూ పోనూ ప్రయాణానికే రెండు మూడు రోజులు ఖర్చవుతాయన్నది గుర్తుంచుకోవాలి.

ఖర్చు, శలవు, సీజన్ (వ్యాపారులు) దృష్టిలో పెట్టుకుని ఎన్ని రోజులన్నది దంపతులు నిర్ణయించుకోవాలి.

బయల్దేరింది మొదలు తిరిగి ఇంటికి వచ్చే వరకూ ఉద్యోగ వ్యాపారాలకు సంబంధించిన ఎలాంటి లంపటాలూ పెట్టుకోకూడదు.

అందుకనుగుణంగా ముందే ఏర్పాట్లు చేసుకోవాలి.

టైమంతా వారి ఆనందానికే వారి గురించిన ఆలోచన్లకే స్ట్రిక్టుగా పరిమితం చేసుకోవాలి. ఆ సమయమంతా తామిద్దరిదే. అందులో అణువంతైనా ఇంకెవరికీ మరి దేనికీ పంచకూడదు. తమనెవరూ డిస్టర్బ్ చెయ్యకూడదు.

సర్వం మరచి జంట పక్షులై ఆనంద తీరాల్లోకి ఎగిరిపోవాలి!

రిజర్వేషన్ ముఖ్యం

ఎక్కడికి ఎలా ఏ రూట్లో వెళ్ళాల్సిందీ ఎక్కడ ఎన్ని రోజులుండేదీ నిర్ణయించుకున్నాక టిక్కెట్లు రిజర్వు చేసుకోవాలి.

విమానం, రైలు, బస్సు- అన్నిటికీ కూడా ముందుగానే పక్కా రిజర్వేషన్ చేయించుకోవాలి. ప్రయాణం ఎక్కడా ఆగిపోకుండా రిజర్వేషన్ కౌంటర్ క్యూలో గంటలు గంటలు వృధా చెయ్యాల్సి రాకుండా ప్లాన్ చేసుకోవాలి. ఇంటర్నెట్ ద్వారా రేట్లు, సమయాలు చూసుకోవచ్చు. కొన్ని సైట్ల వారు అందిస్తున్న హనీమూన్ ప్యాకేజ్‌లు ఉపయోగించుకోవచ్చు.

ఒక్క చోటే ఎక్కువ రోజులుండొద్దు. థ్రిల్లింగా వుండదు. మొనాటనీగా అన్పించవచ్చు.

ఆయా ప్రదేశాలకు దగ్గర్లోని మరికొన్ని చూడ చక్కని ప్రదేశాల్ని కలుపుకోవాలి.

ఇద్దరూ చూడని ప్రాంతాలైతే ఎంతో ఎక్సైటింగా వుంటుంది. బాగా ఎంజాయ్ చెయ్యగల్గుతారు.

హోటల్ బుక్కింగ్

వివిధ ప్రదేశాల్లో స్టే చెయ్యడానికి హోటల్ బుక్కింగ్ కూడా ముందుగానే చేసుకోవాలి.

ట్రావెలింగ్ ఏజెంటు ద్వారా గాని నెట్ ద్వారాగాని చేసుకోవచ్చు.

ముందుగా బుక్కింగ్ చేసుకోకపోతే ఆయా పట్టణాలకెళ్ళేక హోటల్ అన్వేషణలో చాలా టైం వేస్టవుతుంది. విసుగొస్తుంది. అయినా అనుకూలమైన రేటులో హోటల్ దొరక్కపోవచ్చు. అప్పుడు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

హోటల్ రేట్లలో భారీ వ్యత్యాసం వుంటుంది. హిల్ స్టేషన్లలో అయితే సీజన్ బట్టి డిమాండ్‌ని బట్టి రేట్లు మారుతూంటాయి.

బడ్జెట్ ననుసరించి మీకు అనుకూలమైన రేట్లలో లభించే హోటల్ రూమ్‌ని బుక్ చేసుకోవాలి. ఆఫ్ సీజన్లో భారీ డిస్కౌంట్ ఇస్తారు. అడిగి నచ్చాకే కన్ఫర్మ్ చేసుకోవాలి.

ఖర్చు తక్కువవుతుందన్చెప్పి మరీ చీప్ హోటళ్ళలో బసచేయవద్దు. సేఫ్టీ వుండకపోవచ్చు. శుచీశుభ్రతా వుండవు. ప్రైవసీకి ఇబ్బంది కలగవచ్చు.

కొత్త జంటకి హోటల్ రూం తలుపు వేసుకోగానే మరో ప్రత్యేక లోకంగా మారిపోవాలి!

అవసరమైన సామాగ్రి

భారీ లగేజ్ తీసుకెళ్ళకూడదు. చక్రాలతో లాగుతూ తీసుకెళ్ళడానికి అనువుగావున్న రెండు సూట్‌కేసులూ భుజానికి తగిలించుకునే చిన్న బ్యాగ్ తీసుకెళ్తే బావుంటుంది.

ఒకరి దుస్తులు ఒక దాంట్లో అని గాక ఇద్దరివీ రెండిట్లలోనూ సర్దుకోవాలి. పొరబాటున ఒకటి పోయినా ఇబ్బంది వుండదు.

సూట్లూ పట్టుచీరలూ తీసుకెళ్ళకూడదు. ఫాషన్ దుస్తులూ జీన్స్ టీ షర్ట్సూ మోడ్రన్ డ్రెస్‌లూ నైటీలూ బెస్ట్. తమకి బాగా నచ్చినవి నప్పినవి ఆకర్షణీయంగా వుండేవి తీసుకెళ్ళాలి.

కెమేరా, వాక్‌మన్, ఐపాడ్, ఫిల్మ్, బ్యాటరీలు, ట్రావెల్‌గైడ్, బ్రోచర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తీసుకెళ్ళాలి.

అవసరమైన మందులు, అలంకరణ సామాగ్రి, టవల్స్, సోప్, ఆయిల్స్, షాంపూ, డియోడ్రెంట్స్, సెంట్స్ మరువ వద్దు.

కొన్నిచోట్ల హోటల్స్‌లో బసచేయడానికి ఐడీ కార్డ్ కావాలంటారు. మీకు సంబంధించిన ఏదేని గుర్తింపుకార్డు –పాన్‌కార్డు, ఓటర్‌కార్డు, ఫోటోవున్న రేషన్‌కార్డ్, ఎంప్లాయర్ ఇచ్చే ఐడీ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ – జిరాక్స్ కాపీలు తప్పనిసరిగా తీసుకెళ్ళాలి.

ఆయా ప్రదేశాల వాతావరణానికి తగ్గట్టు స్వెట్టర్స్, మఫ్లర్, స్విమ్ సూట్ వగైరాలు తీసుకెళ్ళండి.

ఎంత వద్దని చెప్పినా ఇంట్లో తినుబండారాలు చేసిస్తారు గనుక అవి తీసుకెళ్ళండి. బిస్కెట్లు, చాక్లెట్లు ఎక్కడబడితే అక్కడ లభిస్తాయి. అయినా కొన్ని సర్దుకోండి. తినాలనుకున్నప్పుడు దొరక్కపోవచ్చు కదా.

నగలని తీసుకెళ్ళవద్దు. సింపుల్‌గా ఒక చెయిన్తో వెళ్ళడం బెటర్.

మరో సంగతి సెక్స్ విజ్ఞానానికి సంబంధించిన బుక్స్ తీసుకెళ్ళండి. ఫామిలీ ప్లానింగ్ సాధనాలు తప్పనిసరి.

ఖర్చుకు వెనకాడొద్దు

హనీమూన్ ఒక ఆనంద సమయం. అలాటిది మరోసారి రాదు.

జీవిత భాగస్వామిని ఇంప్రెస్ చెయ్యడానికి ఇదో చక్కని అవకాశం.

అంచేత అడుగడుగునా ఖర్చులు లెక్కవేసుకుంటూ కూర్చోవద్దు. ఆనందంగా గడపడానికి కొంచెం ఎక్కువ ఖర్చైనా పట్టించుకోవద్దు. అలా అని దుబారా చెయ్యొద్దు. కాస్ట్లీ గిఫ్ట్స్ (ఒకరికొకరు ఇచ్చుకోడానికి) అవాయిడ్ చెయ్యండి.

అవసరమైనంత డబ్బు ముందే సిద్ధం చేసుకుని తీసుకెళ్ళండి.

క్రెడిట్‌కార్డ్, డెబిట్ కార్డ్ బాగా ఉపయోగిస్తాయి. అవి వున్న వారు కేష్ తక్కువ తీసుకెళ్ళడం మంచిది. హోటళ్ళలో రెస్టారెంట్లలో కార్డ్సు అంగీకరిస్తున్నారు. అవి లేనివారు సేఫ్టీకోసం ట్రావెలర్స్ చెక్స్ తీసుకెళ్ళొచ్చు.

హనీమూన్‌కి గుర్తుగా కొన్ని చక్కని కళాఖండాల్ని లేదా ఆయా ప్రదేశాల్లో ప్రత్యేకంగా లభించేవి కొనడం మరువవద్దు. ఇద్దరూ కలిసి ఇష్టపడి సెలక్ట్ చేసినవయితే మరీ మంచిది.

ఆయా ప్రదేశాల్లోని వంటకాల రుచుల్ని ఆస్వాదించండి. కొత్త తరహా దుస్తుల్ని కొనుక్కోండి. అక్కడి వారి ఆచారవ్యవహారాలూ జీవన పరిస్థితులూ పరిశీలించండి. ఇవి మీలోని కొత్తకోణాన్ని ఆవిష్కరిస్తాయి.

ప్రవర్తన సున్నితంగా ఉండాలి

హనీమూన్ దంపతుల ప్రవర్తన స్నేహంగా ఆత్మీయంగా వుండాలి.

ఒకర్నొకరు పెన్నిధిగా అపురూపంగా ప్రియస్నేహితులుగా భావించాలి.

నొప్పించడాలు, దాపరికాలు, వాదోపవాదాలు, కోపతాపాలు – ఖచ్చితంగా వద్దు.

రెండోవారి ఇష్టాయిష్టాల్ని అభిరుచుల్ని గౌరవించాలి. ఆధిక్యతా ప్రదర్శనలొద్దు. డామినేట్ చెయ్యొద్దు. కలిసి నిర్ణయం అన్నది ఇప్పుడే అలవర్చుకోవాలి.

ఒకరి కోసం ఒకరు సర్దుకుపోవాలి తప్ప నిర్మొహమాటంగా ఖండించేట్లుగా ప్రవరించ కూడదు. చిన్నపాటి బాధ, అసంతృప్తి కలక్కుండా ఇద్దరూ జాగ్రత్తలు తీసుకోవాలి.

శృంగారం శృతి మించరాదు

ఏకాంతం యౌవనకోరికల్ని రెచ్చగొడుతుంది. అలా అని అస్తమానం శృంగార ధ్యాస పనికి రాదు. రూముకే పరిమితమై పోరాదు.

రాత్రుళ్ళు ఆకర్షణీయంగా కనిపించీ కనిపించని దుస్తులు ధరించాలి. సెక్సీషేపుల్ని బయటపెట్టేవి బెటర్. సువాసనలు వెదజల్లే పూలు, సెంట్లు ఉండాలి. ప్రతిరాత్రీ వసంతరాత్రి చేసుకోవాలి.

శృంగారంలో కన్నా కలిసి గడపడానికి చక్కని కబుర్లు చెప్పుకోడానికి ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని ఒకర్నొకరు తాకుతూ ఒకరిమీదొకరు ఒరుగుతూ సాన్నిహిత్యంగా మెలగటానికి ఎక్కువ సమయం కేటాయించాలి.

చక్కని అవకాశం

అందరకీ దూరంగా వెళ్ళి ఎవర్తోనూ సంబంధం లేకుండా స్వేచ్ఛగా కాలం గడపడానికి హనీమూన్ ఓ చక్కని అవకాశం.

దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనస్సు విప్పి మాట్లాడుకోవాలి. కలల్నీ ఆశల్నీ కలబోసుకోవాలి.

ఒకరిపట్ల ఒకరు ఇష్టాన్నీ ఆసక్తినీ పెంచుకోవాలి. ఎదుటి వారిలో నచ్చిన అంశాలను మాత్రమే పట్టించుకుంటూ నచ్చనివి వదిలేయాలి. ఒకరి సాన్నిధ్యంలో మరొకరు తన్మయులు కాగలిగే ప్రేమ భావనను నెలకొల్పుకోవాలి. ముద్దులు కౌగిళ్ళతో శరీర సఖ్యత పెంచుకోవాలి.

మనస్సు, శరీరం హనీమూన్‌లో ముఖ్యమైనవి. మానసికంగా దగ్గరవ్వాలి. ఆ బంధం బలపడాలి. 'నా భార్య' లేక 'నా భర్త' అన్న భావన స్థిరంగా నాటుకోవాలి. శారీరకంగా సుఖపడాలి. లైంగికానందాన్ని తనివితీరా జుర్రుకోవాలి. 'మేమిద్దరం ఒకటి' అన్న అభిప్రాయం వేళ్ళూని వృక్షమవ్వాలి.

అదే హనీమూన్ లక్ష్యం.

జీవితాంతం గుర్తుండే మధురానుభవం హనీమూన్.

దాని మధురిమ మరింత పెరిగేదిగా తలచుకుంటే చాలు పులకింప చేసేదిగా వుండేలా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత హనీమూన్ దంపతుల మీదే వుంది!

37

కొత్త కోడలు

పెళ్లయ్యాక ఆడపిల్ల అత్తవారింట ఆడుగు పెడుతుంది. ఆపైన అదే ఆమె ఇల్లవుతుంది. ఆమె ఆ ఇంటికి మహాలక్ష్మి అవుతుంది.

భర్త ఉద్యోగ/వ్యాపార రీత్యా మరో ఊళ్లో వుంటే అక్కడి కెళ్తుంది గనుక 'అత్తింటి కాపురం' ఎన్నో రోజులుండకపోవచ్చు.

అయినప్పటికీ అత్తింటితో ఆమె అనుబంధం శాశ్వతమైంది గనుక ఆ ఇంటి వారితో చక్కని సంబంధ బాంధవ్యాలు కలిగి వుండాలి.

ఆ ఇంటి సౌభాగ్యానికి ఆమె కృషి చెయ్యాలి.

ఆ ఇంటివారు ఆమె ఆనందం ఇనుమడించేలా ప్రవర్తించాలి.

అప్పుడే ఆ ఇల్లు ఆనంద భవనం అవుతుంది. నందనవనం గా మారుతుంది!

కోడలి పాత్ర

ఆమెకిది కొత్త పాత్ర.

పుట్టింట్లో తల్లిదండ్రుల గారాబం మధ్య అల్లారు ముద్దుగా పెరిగి వుండొచ్చు. తన ఇష్టాయిష్టాల్ని నెగ్గించుకుంటూ స్వేచ్ఛగా మసలి వుండొచ్చు.

కాని కోడలి పాత్ర ధరించేప్పుడు కూతురి పాత్రని మరచి పోవాలి.

పొద్దుటే లేవటం దగ్గర్నుంచి 'సర్దుబాటు' తప్పదు. మిగతా బంధుజనంతో ఇంటి పద్ధతులతో కలిసి పోవడానికి కొత్త బాధ్యతల్ని స్వీకరించడానికి తనని తాను మార్చుకోవాలి.

భర్త, అతడి కుటుంబీకులు మెచ్చేలా కుటుంబ గౌరవమర్యాదలు ఇనుమడించేలా వుండాలి. వారి 'తేజం' ఆమె వల్ల ఆమె ద్వారా పెరగాలి.

'మా ఇంట్లో ఇలా చెయ్యం' 'మా ఇంట్లో ఇవి తినం' 'మా ఇంట్లో ఇలా జరగదు' అంటూ సన్నాయి నొక్కులు నొక్కవద్దు. పుట్టింటి గొప్పలు ఏకరువు పెట్టవద్దు.

అత్తంట్లో కోడలిగా కాదు కూతురిలా కలిసి పోవాలి.

వేరు కాపురం పెట్టమని భర్తమీద ఒత్తిడి తేకూడదు. ఉద్యోగాలు వచ్చేవరకో, పెళ్ళిళ్ళయ్యే వరకో మాత్రమే ఉమ్మడికుటుంబాలుంటున్నాయి. ఆ తర్వాత వేరు కాపురాలు తప్పనిసరవుతున్నాయి.

ఆ సంగతి గ్రహించి ఓర్పు సంయమనం పాటించాలి. అత్తింటి వారి మనస్సుల్ని గెలవటానికి ప్రయత్నించాలి.

ప్రత్యేకమైంది భర్త పాత్ర

అతడామె భర్తగా గాక కొత్త కోడలి భర్తగా మసలాల్సి వుంటుంది.

ఆమె అతడ్ని పెళ్లాడి అతడి కోసం అతడితో జీవితం పంచుకోడానికి ఆ ఇంటికొచ్చిందని మర్చి పోకూడదు.

ఆమెకు ఆ ఇల్లు కొత్త. ఇంట్లోవారు కొత్త, ఇంటి ఆచార వ్యవహారాలు కొత్త.

ఆ కొత్తదనాన్ని పోగొట్టాల్సిన బాధ్యత భర్తమీదే వుంది. అతడామెకీ ఇంట్లోని వారికీ 'లి ంక్'.

ఆమె కొత్తింట్లో ఇమిడేలా సహకరించాలి. ఇబ్బందులూ అవమానాలూ ఎదురు కాకుండా చూడాలి. అందరి ప్రేమాభిమానాలూ దక్కేలా సహకరించాలి.

ఎలాంటి లోటుపాట్లు కష్టాలు అసౌకర్యాలు లేకుండా రాకుండా కంటికి రెప్పలా అభిమానంతో ఆప్యాయతతో 'రక్ష' గా నిలవాలి.

ఇరువైపులా కావాల్సిన వారే అయినా రక్త సంబంధీకుల కన్నా భార్య మీద పిసరంత అధిక ప్రేమ చూపించాలి.

ఆమెకి అత్తింట్లో అతి సన్నిహితుడూ ఆత్మీయుడూ అతడేగా మరి!

ఆమె పుట్టి పెరిగిన ఇంటినీ తల్లిదండ్రుల్నీ సోదరుల్నీ వదలి వచ్చింది. అది అసాధారణ త్యాగం.

ఆమె అత్తింట ఎంత సుఖంగా శాంతిగా వుంటే ఆ ఇంటి కంత సౌభాగ్యం.

ఆమె సలహాలు తీసుకుంటూ సంప్రదిస్తూ గౌరవిస్తూ ఆమెనా ఇంటిలో భాగం చెయ్యాలి. అదే భాగ్యమని గుర్తించాలి.

అత్తా కోడళ్ళ వైరం

భారతీయ కుటుంబ వ్యవస్థలో అత్తా కోడళ్ళ వైరం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రెండు భిన్న మనస్తత్వాల ఘర్షణ అది.

'నా భర్త. నా ఇల్లు. నా ఇష్టం. నా మాటే చెల్లాలి' అనుకుంటుంది కోడలు.

'కోరి తెచ్చుకున్న కొరివి. కొడుకుని వలలో వేసుకుని నన్నింట్లోంచి తరిమేస్తుందేమో' అని అభద్రతా భావంతో అల్లల్లాడి పోతుంది అత్త.

ఇద్దరూ పోటీ పడేది ఒకరి గురించే. అతడి సుఖాన్నే ఇద్దరూ కోరుకుంటారు. ఇద్దరూ ఆశించేదీ అతడి ప్రేమనే.

అందుకే నేటి అత్తలూ కోడళ్ళూ విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. పరస్పర విశ్వాసంతో ప్రవర్తిస్తున్నారు.

కోడళ్ళంతా చదువుకున్న వారే. ఉద్యోగాలూ చేస్తున్నారు.

అత్తలు రెండవ లేదా మొదటి తరం విద్యావంతులే.

కొడుకులు కూడా వారి మధ్య ఘర్షణ నివారిస్తూ సఖ్యత పెంచడానికి కృషి చేస్తున్నారు.

ఆ దిశగా ముగ్గురూ మరింత కలిసి కట్టుగా అడుగు వేస్తే అత్తా కోడళ్ళు చక్కని స్నేహితులవుతారు!

మాట్లాడే తీరు మారాలి

అలకపాన్పు ఎక్కిన భార్యని చూసి "కోడల్ని ఏమన్నావమ్మా" అని తల్లిని అడిగాడు కొడుకు.

"నేనే మన్నాన్రా నాయానా. పొరుగిళ్ళకు పోవద్దన్నా. జగడమొద్దన్నా. నడుస్తూ తలకురులు విప్పవద్దన్నా. సందెకాడ దీపంబు పెట్టేటి వేళ సప్పుడు కాకుండ పెట్టి రమ్మన్నా. మాపు కాడ దీపంబు మలిపేటప్పుడు మళ్ళి చూడకుండ మలిపి రమ్మన్నా'' అని జవాబిచ్చింది తల్లి.

ఈ మాత్రానికే ఆలికి అలకెందు కొచ్చిందో అర్థంగాక తల పట్టుకున్నాడు కొడుకు!

నిజానికి అత్తలిలా చెప్పడంలో తప్పులేదు. కాని చెప్పే విధానంలో తప్పు వుంది. అనునయంగా కూతురికి ఎలాగైతే చెప్తుందో అలా చెప్పి వుంటే కోడలికి కోపం వచ్చేది కాదు.

చెప్పేవి మంచి మాటలైనా కటువుగానో నిష్ఠూరంగానో వ్యంగ్యంగానో గాక ఆదరంగా చెప్పాలి అత్త. తన కోసమే కదా అని ఆలకించాలి కోడలు.

అత్తా ఒకింటి కోడలే

ఈ సంగతి ప్రతి అత్తా ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి.

తనొచ్చినట్టుగానే కోడలు పిల్ల తల్లిదండ్రుల్ని విడిచి వచ్చింది. ఆమె కోడలు. అంటే కొడుకు జీవితంలో సగభాగం.

ఆమెది తెలసీ తెలీని వయస్సు. ఆమెవి వచ్చీరాని పనులు.

అది గ్రహించి ఆమె చక్కని కోడలుగా గృహిణిగా ఎదగడానికి తగిన తర్ఫీదు నివ్వాలి. ప్రోత్సహించాలి. తీర్చిదిద్దాలి.

వంకలూ విమర్శలూ కాదు అనునయం సహకారం ప్రోత్సాహం కావాలి.

కూతురికి చెప్పినట్టుగా నొప్పించకుండా చెప్పాలి. కొత్తదనం పోగొట్టాలి. తల్లిని మరిపించాలి.

కోడలి ఆనంద ఆరోగ్యాలే కొడుక్కి అపురూపవరాలన్నది గుర్తుంచుకోవాలి.

కోడలు కూడా అత్తని అమ్మలా ప్రేమించాలి. భర్త యొక్క తల్లిగా గౌరవించాలి. అనుభవశాలిగా విలువివ్వాలి.

అత్త మహారాణి అయితే తనామె ఉత్తరాధికారిణి 'కోడలు రాణి' అన్న సంగతి మరచిపోకూడదు.

అత్తలేని కోడలు-కోడలు లేని అత్త

"అత్తలేని కోడలు ఉత్తమురాలు ఓయమ్మా

కోడలు లేని అత్త గుణవంతురాలు ఆహా...."

దంపుడు పాటలోని ఈ చరణాలెంత అర్థవంతమైనవి!

అత్త లేకపోతే కోడలిదే రాజ్యం. ఆమె ఆడింది ఆట పాడింది పాట. అడిగేవారూ అధికారం చెలాయించేవారూ వంకలు పెట్టేవారూ వుండరు. అందుకే ఆమె ఇరుగు పొరుగు దృష్టిలో ఉత్తమురాలే.

కోడలు లేని అత్త పరిస్థితీ డిటోయే. కోడల్లేకపోతే ఆధిక్యత అహం ప్రదర్శించక్కర్లేదు. కోడలు కొడుకుని తన నుండి దూరం చేస్తుందేమోనన్న భయం అభద్రతా భావం వుండవు. ఆమె లోపాలని చేష్టల్ని విమర్శించే వారుండరు. సో- ఆమె గుణవంతురాలే.

కాని అత్త వుంటుంది కోడలూ వస్తుంది.

అయినా వారు గుణవంతురాలు ఉత్తమురాలు అన్పించుకోగలగటం లోనే వుంది వారి వ్యక్తిత్వమూ ప్రత్యేకతా!

పాతకాలపు అత్తకు మంగళం

సూర్యకాంతం లాంటి అత్తలకు ఈనాడు చోటు లేదు.

కోడలితో స్నేహంగా వుండాలి. పెద్దరికం వహించ వచ్చుగాని అధికారం చెలాయించ కూడదు.

కోడలు కొడుకుని తననుంచి వేరు చెయ్యడానికి రాలేదని గుర్తుంచుకోవాలి. ఆమె కొడుక్కెంత దగ్గరైతే తనకంత ఆనందం అని భావించాలి.

ముదిమిలో కూతుర్లా ఆదరించాల్సింది కోడలే. అందుగ్గాను ఇప్పట్నుంచే అభిమానంగా చూస్తూ అనుబంధం పెంచుకోవాలి.

తరాల అంతరం, ఆలోచనల్లో తేడా, అహంభావం, అభద్రతా భావం, అనవసర భయాలు – ఇద్దరి మధ్యా అడ్డు గోడలవ్వకుండా ఇద్దరూ జాగ్రత్త పడాలి.

అవగాహన వుంటే చాలు సయోధ్య అదే కుదుర్తుంది.

అత్తదే భారమంతా

అత్తగారింట కొత్త వాతావరణంలో ఇమడటంలో ఘర్షణ సహజమే.

కొత్త వ్యక్తుల మధ్య సామరస్య సంబంధాలు ఏర్పరచుకోడానికి కోడలెంతో కృషి చేస్తుంది. అంతఃసంఘర్షణని అనుభవిస్తుంది. అయినా సమాజం సర్దుకోమని ఆమెనే ఆదేశిస్తుంది. సర్దు కోకపోతే దోషిగా నిలబెడ్తుంది.

నిజానికి అత్తగారే చొరవ తీసుకోవాలి. ఘర్షణ నివారించాలి. సామరస్యత నెల కొనేలా చూడాలి.

తల్లిగా తన స్థానం చెక్కు చెదరదు. యజమానురాలిగా తన స్థానాన్ని లాక్కోవటానికి కోడలు రాలేదని గ్రహించాలి.

అత్తా కోడళ్ళ మధ్య సఖ్యత నెల కొల్పే భారం అత్త వహిస్తే అసలు సమస్య అనేదే వుండదు.

కోడలికి అన్ని బాధ్యతలూ ఒక్కసారిగా అప్పజెప్పకుండా మెల్లమెల్లగా అలవాటు చెయ్యాలి. రాని పనులు నేర్పాలి తప్ప 'మీ అమ్మ నేర్పలేదా' అంటూ అవమానించకూడదు.

వయసు్స, అనుభవం, కొడుకు ఆనందం, కుటుంబగౌరవం, కోడలి ప్రేమాభిమానాలు – అన్నీ దృష్టిలో పెట్టుకుని ప్రవర్తిస్తే అత్త అమ్మగా భావించబడటం ఖాయం!

కోడలికి రెండు మాటలు

పెద్దల అండ పిల్లలకెప్పుడూ కావాలి.

అత్తింటి పద్ధతుల్ని పుట్టింటి వాటితో పోల్చి వ్యాఖ్యానించొద్దు

అత్తగారిల్లే తన శాశ్వత చిరునామా అని గుర్తుపెట్టుకోవాలి.

అత్తగారింటి పద్ధతుల కనుగుణంగా అమాంతం మారిపోవడానికి ప్రయత్నించొద్దు. మీ వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూనే మీ జ్ఞానాన్ని జోడించి గుర్తింపు పొందేందుకు ప్రయత్నించాలి.

పరిమితుల్లో వుంటూనే ప్రత్యేకత నిలుపు కోవాలి.

అత్త, మావ, మరుదులు, ఆడబడుచులు –వారిని వారిలానే ప్రేమించి గౌరవించాలి. 'అతి' కి పోనవసరం లేదు.

కన్నవారినీ పుట్టింటినీ మరచి పోవద్దు. చులకన చేయవద్దు. వారి మర్యాదని కాపాడటమూ మీ బాధ్యతే.

పుట్టినింటికీ మెట్టినింటికీ మధ్య వారధిగా వుండాలి. రెండు కుటుంబాల అనుబంధం బలోపేతం చెయ్యడానికి కృషి చెయ్యాలి.

మీ భర్త గతం తల్లి తోనూ, భవిష్యత్తు మీతోనూ ముడిపడి వున్నాయని గ్రహిస్తేచాలు తల్లి మనస్సు, ఆరాటం, అభద్రత అన్నీ అర్థమవుతాయి. మీ బాధ్యత, మీలక్ష్యం, మీ బంధం అన్నీ అవగతమవుతాయి.

అప్పుడు మీరు అత్తింట్లో 'కోడలు మాలచ్మి' అవుతారు!

పెద్దాయన పెద్దమనస్సుతో

ఇంటికి పెద్ద అయిన మావగారు పెద్ద మనస్సుతో కోడల్ని ఆదరించాలి.

ఒకవేళ కట్న కానుకలకు సంబంధించిన భేదాభిప్రాయాలున్నప్పటికీ వాటిని ప్రక్కన బెట్టాలి. వాటి ప్రభావం కోడలి మీద ఏ మాత్రం పడనివ్వకూడదు. ఆర్థిక గొడవల గురించి ఆమెతో చర్చించకూడదు. అప్పుడే మీ మీద ఆమెకి గల గౌరవం రెట్టింపవుతుంది.

కోడలు తెచ్చిన లక్షలు కాదు లక్షణమైన కోడలు పిల్లే మీ ఇంటి మహాలక్ష్మి అనుకోవాలి.

ఆమె అవసరాలు తీరుతున్నాయో లేదో చక్కగా కలిసి పోగలుగుతోందో లేదో కంటతడి పెట్టకుండా వుంటోందో లేదో తెలుసుకుంటూ వుండాలి. తగిన చర్యలూ జాగ్రత్తలూ తీసుకోవడం ఆయన బాధ్యత.

తండ్రి పట్ల గల చనువుని ప్రదర్శించ లేకపోయినా మావగారి గౌరవం, విశాల దృక్పథం, పెద్దరికం తెలుసుకుని కోడలు ప్రవర్తించాలి. అవసరమైనప్పుడు ఆయనకు సూచించడానికి చర్చించడానికి వెనుదీయకూడదు.

వదినా మరదళ్ళు

వదిన–అన్న భార్య– సీత లాంటిది.

తను లక్ష్మణుడిలాంటివాడు

అన్న అంటే తండ్రి. వదిన అంటే తల్లి. తల్లి దండ్రుల తర్వాత వారంతటి వారు.

వయస్సులో పెద్దది అయినా గాక పోయినా మరిది ఆమెపట్ల మాతృభావంతో ప్రవర్తించాలి. గౌరవించాలి. ఆమె సోదరుడిలా సాయపడాలి.

ఆమె కూడా వారిని సోదర వాత్సల్యంతో ఆదరించాలి.

ఆడబడుచు అర్ధమొగుడు

ఇది ఊరికే పుట్టిన సామెత కాదు.

కోడలి మీద అజమాయిషీ చేయాలని చూసేదీ చాడీలు చెప్పేదీ ఆడబడుచే.

ఈర్ష్యాసూయలు ఆమె వింత ప్రవర్తనకు కారణాలు.

ఈనాటి ఆడబడుచులు విద్యావంతులూ ఉద్యోగినులూ అయినప్పటికీ ఆ లక్షణాలు పూర్తిగా పోలేదు.

వారా సంగతి గ్రహించి తమని తాము సరిదిద్దు కోవాలి. హుందాగా వ్యవహరించాలి. కొత్త కోడలికి సోదరిగా నిలవాలి. కొత్తింట్లో కలసి పోయేందుకు ఆ ఇంటి ఆచారవ్యవహారాలు త్వరగా నేర్చుకునేందుకు సహకరించాలి.

తను మరో ఇంటి కోడలు/కాబోయే కోడలు అన్న సంగతి గుర్తుంచుకుని మెలగాలి. తన ఆడబడుచు తనతో ఎలా మెలగాలనుకుంటుందో అచ్చం అలాగే తను కొత్త కోడల్తో మసలాలి.

అర్థమొగడిలా గాక స్నేహితురాల్లా ఉండాలి. అన్నగారి అభిమానం పొందాలి. అత్తా కోడళ్ళ మధ్య సమన్వయం పెరిగేలా ప్రవర్తించాలి తప్ప చాడీలు చెప్పి రెచ్చగొట్టకూడదు.

బావగారూ తోడి కోడలూ

కొత్త కోడలికి బావాగార్లూ తోడి కోడళ్ళూ వుంటే వాళ్ళామెను ఆదరంగా చూడాలి.

ముఖ్యంగా తోడికోడలు. తనూ మరో ఇంటి నుంచి వచ్చిందే గనుక ఆమెకి కొత్త అన్పించకుండా కలుపు కోవాలి. అక్కలా ఆదరించాలి తప్ప ఆమె నగలు, చీరలు, తెచ్చిన కట్నం వగైరాలు చూసి అసూయ చెందకూడదు. పెదవి విరవరాదు. కించపరచ కూడదు. లేనిపోనివి కల్పించి చెప్పకూడదు.

అశాంతి సృష్టించొద్దు

కొత్త కోడలు కోటి ఊహల్తో అత్తింట్లో అడుగు పెడుతుంది.

అత్తగార్ల కథలు వినివుంటుంది గనుక ఆమె అంటే భయం బెరుకు సందేహం వుంటాయి. ఇక అత్తగారి నుంచి చిన్న సమస్య ఎదురైనా బూతద్దంలో చూసి భయపడ్తుంది.

అత్తా కోడళ్ళ మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొనాలి. అవగాహన పెరగాలి. అభిమానం పొంగాలి. లేకపోతే ఇల్లు అశాంతి నిలయమవుతుంది.

అపార్థాలే చిన్న చిన్న పోట్లాటలే చిలికి చిలికి గాలివానగా మారతాయి. కుటుంబం విడిపోయే పరిస్థితికి దారి తీస్తుంది.

అత్తాకోడళ్ళ ప్రత్యక్ష పరోక్ష యుద్ధాల్లో మామా కొడుకులు నలిగిపోతారు. తస్మాత్ జాగ్రత్త!

మంచి అత్తకు చిట్కాలు

కోడల్ని మనస్ఫూర్తిగా ఇంట్లోకి ఆహ్వానించండి.

మీరు కోడలిగా వచ్చిన రోజుల్ని గుర్తు చేసుకోండి. మీ అత్త గారిలో మీకు నచ్చని అంశాలని అత్తగా మీరు ప్రదర్శించవద్దు.

కోడలు మీకన్నా విద్యావంతురాలూ ఉత్సాహపరురాలూ ఐ వుంటుంది గనుక తగిన విలువివ్వండి. ఆమె లోని కళల్నీ ప్రోత్సహించండి. ఉద్యోగం చెయ్యడానికి సహకరించండి. అది ఇంటి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తుందని గుర్తుంచుకోండి.

కొడుకూ కోడళ్ళకు ఏకాంతం కల్పించండి. మీకు ఇబ్బంది అయినా సరే వారికో గదిని కేటాయించండి.

వాళ్ళు సినిమాకో షికారుకో వెళ్తోంటే మీరు అనుసరిం44చకండి.

వంటా వార్పూ తెలియకపోతే ప్రేమగా నేర్పించండి.

మంచి కోడలు కండి

దాపరికం లేకుండా అత్తగారితో కలిసి పోండి. అవసరాలకీ ఆశలకీ కళ్ళెం వెయ్యండి.

మీ వారి చిన్నప్పటి కబుర్లూ అత్తగారు తీసుకున్న శ్రద్ధా అడిగి తెలుసుకోండి. ఆమెని 'మంచి అమ్మ' అంటూ అభినందించండి.

ఆవిడ వయస్సుకీ వివేకానికీ గౌరవం ఇవ్వండి. ఇంటి సమస్యలపై ఆమెకి అవగాహన ఎక్కువని గుర్తించుకోండి.

వంటా వార్పూ వ్రతాలూ పూజలూ పెట్టుపోతాలూ – వగైరాల్లో అత్తగారి సలహా తీసుకోండి.

అత్తగారిలో దాగివున్న కళల్ని వెలికి తీసి ప్రోత్సహించండి.

పాటలు పాడటం, అల్లికలు, ముగ్గులు, రచన చేయటం, ఇంటీరియర్ డెకరేషన్ వగైరాలన్నమాట.

మీ హద్దుల్లో మీరుండండి. అత్తగారి సామ్రాజ్యంలోకి చొరబడవద్దు.

ఆమె పుట్టిన రోజుకో పండగలకో చీర లేక మరోటో బహూకరించండి.

ఆమె అందాన్ని హుందాతనాన్ని ఆఖరికి ఆమె కట్టిన చీరని సైతం అప్పుడప్పుడూ మెచ్చుకోండి.

ఆమె పుట్టింటి వారి గురించి ఆమె బాల్యం గురించి పెళ్లివూసుల గురించి తీరికున్నప్పుడల్లా అడుగుతూండండి.

మీ ఆయనతో మీ పుట్టింటి వారితో ఇరుగు పొరుగుతో అత్తగారు వినేలా ఆమెని పొగడండి. ఆవిడ ఫ్లాట్ ఐ మీ తల మీద 'ఉత్తమ కోడలు' కిరీటం పెట్టకపోతే ఒట్టు!

38

అల్లుడు గారు

'అల్లుడనగ ఎవడు మీ అమ్మాయికి మగడు...'

మరీ అంత పచ్చిగా చెప్పి అథార్టీ చెయ్య కూడదు. అత్తింటి వారితో 'అల్లుడుగారు' అన్పించుకోవాలి. గౌరవించాలి. గౌరవించబడాలి.

అత్తవారిల్లంటే తనకు జీవిత భాగస్వామిని ఇచ్చిన ఇల్లు. ఆమె పుట్టి పెరిగిన ఇల్లు. విద్య వినయం నేర్పిన ఇల్లు. ఆమె ఆనందం కోసం చేయూత నివ్వడం కోసం సదా సిద్ధంగా వుండే ఇల్లు!

ఆమె బాల్య స్మృతులూ స్నేహాలూ అనుబంధాలూ ముడిపడిన ఆ ఇల్లంటే ఆమెకెంతో ప్రీతి. ఆ ఇంట అడుగు పెట్టిన మరుక్షణం చిన్న పిల్లై పోతుంది. ఎంతో స్వేచ్ఛగా హాయిగా ఆనందంగా ఒడ్డు మీంచి నీట్లోకి గెంతిన చేప పిల్లలా చిందు లేస్తుంది.

అలాంటి ఇంటినీ ఇంటి సభ్యుల్నీ అభిమానించడం గౌరవించడం ఆమె భర్తగా అల్లుడి విధి. కర్తవ్యం!

కొడుకులా ఉండాలి

అత్తమామలు అల్లుడ్ని గొప్పగా చూస్తారు. గౌరవిస్తారు. అడుగులకు మడుగులొత్తుతూ మర్యాద చేస్తారు.

అతడు కన్యాదాన ఫలం దక్కింపజేసిన వాడే కాదు తమ కూతురి జీవితపథ నిర్దేశకుడు కూడా.

కూతురి సుఖదుఃఖాలూ భవిష్యత్తూ అతడ్తోనే ముడి పడ్డాయి గనుక అతడు బాగుండాలని సుఖంగా వర్ధిల్లాలని తద్వారా కూతురు సుఖపడాలని వారు ఆశిస్తారు. ఆరాటపడ్తారు.

వారి ఆశల్ని నెరవేర్చేలా వారి ఆనందపు ఆశీస్సులు గైకొనేలా వుండాలి అల్లుడు.

అల్లుడిలాగాక కొడుకులా వారితో కలిసి పోవాలి. ఆ ఇంట ప్రత్యేక సభ్యుడవ్వాలి.

వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకోవాలి. శక్తి వుంటే వారికి సాయపడాలి. వారి అభివృద్ధికి ఆనందానికి తోడ్పడాలి.

తన పథకాలు సమస్యలు ఇన్వెస్ట్‌మెంట్లు (పెట్టుబడులు), ప్రమోషన్లు, ఇతర సమస్యలు, ఇబ్బందులు వారితో చర్చించాలి. గైడెన్స్ తీసుకోవాలి.

వారి గౌరవ మర్యాదలు ఇనుమడించేలా ప్రవర్తించాలి,

అప్పుడతడు తన భార్య ప్రేమాభిమానాలని మరింతగా పొందగల్గుతాడు. ఆమె దృష్టిలో హీరో అవుతాడు.

కానుకలాశించ వద్దు

పెళ్లిలోని ఆర్థిక లావాదేవీల జోలికి అతడు పోకుండా వుంటేనే మంచిది. దాన్ని పెద్దలకు వదిలెయ్యాలి.

ఒక వేళ అభిప్రాయభేదాలొస్తే 'పట్టు విడుపు' లకు ప్రయత్నించాలి. ఇద్దరికీ నచ్చ చెప్పి రాజీ చెయ్యాలి. పంతాలకూ పౌరుషాలకూ పోకూడదు. ఆజ్యం పోయకూడదు.

రెండు కుటుంబాల మధ్య సఖ్యత సుహృద్భావం పెరిగేలా హుందాగా వ్యవహరించాలతడు.

పెళ్లయ్యాక అత్తవారి నుంచి వాహనాలు, ఫర్నిచర్, డబ్బు ఆశించకూడదు. అడిగి తీసుకోవడం పెట్టకపోతే కోపించడం హేయం. అది యువతకి సిగ్గు చేటు అది 'బెగ్గింగ్' లోకే వస్తుంది సుమా!

ఉన్నంతలో అల్లుడికి ముట్టజెప్పడానికే చూస్తారు అత్తమామలు. అతడ్ని తృప్తి పరచడానికి శాయ శక్తులా ప్రయత్నిస్తారు. కొండొకచో శక్తికి మించి పెడతారు.

ఆ సంగతి గ్రహించాలి. వారి పై ఎలాంటి ఒత్తిళ్ళూ తేకూడదు. పుట్టింటి నుంచి ధన వస్తు వాహనాలు తెమ్మని భార్యని కోరవద్దు. అవమానించవద్దు. బెదిరించవద్దు. భయపెట్టవద్దు. చీటికీమాటికీ అది తీసుకురా ఇది పట్రా అంటూ భార్యని పుట్టింటికి తరమవద్దు.

తేలేదని హింసించవద్దు. పరిత్యజించాలని యోచించవద్దు. భార్య దృష్టిలో అల్పుడివి కావద్దు. కన్యాదాతని మానసిక క్షోభకి గురిచేయవద్దు. అప్పుల ఊబిలోకి నెట్టవద్దు. ఫాల్స్ ప్రెస్టేజ్‌కి పోవద్దు. మావగార్ని 'లూటీ' చెయ్యడానికి ప్రయత్నించవద్దు.

అత్తవారు బాగుంటే ఆదే చాలనుకోవాలి. వారు బాగుంటే తమకి పెట్టకుండా వుండరని గుర్తుంచుకోవాలి.

ఆప్యాయతానురాగాలకన్నా 'ఆర్థికం' ఎక్కువ కానే కాదు. భార్య ఆనందం కన్నా మరేదీ అధికం కాదు గాక కాదు!

భార్య సహకరించాలి

అమ్మాయికి పుట్టింటి మీద మమకారం వుంటే చాలదు. తన భర్తకీ ఆ ఇంటి మీద గౌరవం ఏర్పడేలా చక్కని పాత్ర పోషించాలి.

మీరు మీ వారి కటుంబంతో కలిసి పోవడం ఎంత ముఖ్యమో మీవారు మీ కుటుంబంలో కలిసి పోవడం అంతే ముఖ్యం. ఆ దిశగా కృషి చెయ్యాలి.

మీ కన్నవారి పరిస్థితి గురించి గొప్పలు గాక వాస్తవ స్థితిని మీ వారికి వివరించండి. అవసరమైతే సాయపడేందుకు ప్రోత్సహించండి. అతడి కోర్కెలకి కళ్ళెం వెయ్యండి. స్వయంగా సాధించుకున్న సంపాదించుకున్న వాటి విలువ ఉచితంగా తీసుకున్న వాటికి వుండదని నచ్చ చెప్పండి.

కన్న వారి బాగోగులు కోరడం అందుకు మీ భర్త సహకరించేలా చెయ్యడం మీ బాధ్యత!

మీ వాళ్ళు మీ వారిని ప్రశంసిస్తే ఆ సంగతి అతడికి చెప్పండి. విమర్శిస్తే చెప్పవద్దు.

మీరు కూడా పుట్టింటిని దోచుకుని మీ ఇంటిని నింపుకోవాలన్న కోరికను త్రుంచేయాలి. మీ వారు ఏదేదో తెమ్మని ఒత్తిడి తెచ్చినా లొంగ వద్దు. పరిస్థితి వివరిస్తూ సున్నితంగా వివరించి ఒప్పించడానికి ప్రయత్నించాలి తప్ప 'తందాన తాన' అనవద్దు.

పుట్టింటిని మరచి పోవడం, కన్నవారి బాగు విస్మరించడం క్షమార్హం కాని నేరాలు!

బావమరిది బతక కోరతాడు

పెళ్లిలోనే కాదు పెళ్ళయ్యాక కూడా బావమరిదికి చాలా ప్రాముఖ్యత వుంది.

వరుడి కాశీయాత్రను ఆపి పిలిచి పెళ్లికి ఒప్పించేది అతడే. లాజహోమంలో సోదరికి వరిపేలాలు అందిచ్చేది అతడే. తోబుట్టువు కూతురి (మేనకోడలు) పెళ్ళిలో ఆమెని గంపలో పెట్టుకుని మండపానికి తీసుకొచ్చే మేనమావా అతడే.

తండ్రి తర్వాత సోదరికి పుట్టింటి తరపున పెట్టుపోతలు చూసేది అతడే.

సోదరీ బావగారూ హేపీగా వుండాలని ఆశించే వారిలో ప్రథముడు బావమరిదే.

అతడు తన భార్య సోదరుడు గనుక అతడ్ని తనూ సోదరుడిగానే భావించాలి. అభిమానించాలి.

తమ పిల్లలకు మేనమామై తమింటి ప్రతి శుభకార్యానికీ భార్య పుట్టింటి ప్రతినిధిగా హాజరవుతాడు.

ఎప్పుడు భార్య పుట్టింటి కెళ్ళినా చీరో రవికో పెట్టి పండ్లో స్వీట్లో ఇచ్చి సాదరంగా సాగనంపుతాడు.

తమ బతుకూ బాగూ కోరే బావమరిదితో చక్కని సంబంధం ఏర్పరచుకోవాలి.

బావ బావమరుదుల అనుబంధాన్ని పురాణేతిహాసాలలో కృష్ణార్జునులు ద్రోణకృపాచార్యులు తెలియజెప్పారు.

మరదలికి ఆదర్శం

మరదళ్ళతో చక్కగా హుందాగా వ్యవహరించాలి. వారి అభిమానానికి పాత్రుడవ్వాలి.

వారి అల్లరినీ అభిమానాన్నీ ట్రూ స్పిరిట్‌తో స్వీకరించాలి.

మరదలు అతళ్ళోనే 'ఆదర్శ భర్త' ని చూస్తుంది. అందుకు సరిపోయేట్టుగా వుండాలతడి ప్రవర్తన.

ఆమె వివాహం కుదర్చడానికీ చెయ్యడానికీ స్వంత చెల్లెలికి చేసినట్టుగా సహాయసహకారా లందించాలి. ఆ ఇంటి మనిషిలా పూనుకోవాలి.

మరదలు కదాని అతిగా ప్రవర్తించకూడదు. లైంగికవేధింపులకు గురిచెయ్యడం నేరం. శిక్షార్హం.

అలాటి పనులు భార్య మీద వ్యతిరేక ప్రభావం కలిగిస్తాయి. ఏహ్య భావం కలగజేస్తాయి. అతడి వైవాహిక జీవితం మీద నీలినీడల్ని ప్రసరింపజేస్తాయి జాగ్రత్త!

ఆస్తిలో వాటా

చట్టరీత్యా తండ్రి ఆస్తిలో కొడుకుతో సమానంగా కూతురికీ వాటా లభిస్తుంది.

సాధారణంగా పెళ్లి సమయంలో కట్న రూపేణ ఆమె వాటా సొమ్ముని ఇచ్చేస్తారు. ఉమ్మడి ఆస్తిమీద ఆమెకింక హక్కు ఉండదు.

అయినప్పటికీ సోదరులు ఉమ్మడి ఆస్తి పంచుకుంటున్నప్పుడో అమ్ముకుంటున్నప్పుడో కొందరు కూతుళ్ళు అడ్డు పడుతుంటారు. తమకీ భాగం రావాలని పేచీకి దిగుతారు. కోర్టులకెక్కేవారూ ఉన్నారు.

అలాంటి స్థితి రాకుండా నివారించాల్సిన బాధ్యత అల్లుడి మీదే ఉంది.

భార్యకిస్తానన్నది ఇచ్చేశాక మళ్ళీ వాటా కోరకూడదు. బావమరిది తనకు లభించిన తండ్రి ఆస్తి అమ్మదలిస్తే అందుకామె సంతకం అవసరమైతే ఆమెని ఒప్పించాలి. ప్రతిఫలం ఆశించకుండా సంతకం పెట్టించి బావమరిదికి సహకరించాలి.

అతడు తన తోడబుట్టినవాడనీ అతడి క్షేమం కోరటం తన బాధ్యతనీ ఆమె భావించాలి. పెద్ద మనస్సుతో వ్యవహరించాలి.

అతడు కూడా సోదరికి కొంత ఇవ్వగలిగితే ఇవ్వవచ్చు. తల్లి తదనంతరం ఆమె నగలు సోదరి ఆశిస్తే ఇవ్వవచ్చు. దానికోసం తగవులాడటం మంచి పద్ధతి కాదు.

బ్రాహ్మణునికి భోజనం పెడితే వచ్చే పుణ్యమే చెల్లెలికీ కూతురికీ పెట్టడం వల్ల వస్తుందన్నారు పెద్దలు.

దీని అంతరార్థం గ్రహించి చిన్నప్పటి అన్యోన్యతని పెద్దయ్యాక కూడా కాపాడుకోవాలి సోదరీ సోదరుడూ.

వారి మధ్య సమన్వయ కర్తగా పొరపొచ్చాలు రానీకుండా చూడాల్సినవాడు అల్లుడే!

అత్తమామలకు అండగా

ఆడపిల్లలకు తండ్రి ఆస్తిలో భాగాన్ని చట్టం కల్పించింది.

తండ్రి బాధ్యతల్లోనూ భాగం కల్పించింది రక్త సంబంధం.

అల్లుడికి తన తల్లిదండ్రులు ఎంతో అతడి భార్యకి ఆమె తల్లిదండ్రులూ అంతే.

వారి బాగోగులు చూడాల్సిన నైతిక బాధ్యత ఆమె మీద ఉంది.

వారి పరిస్థితి బాగుండకపోతే తప్పని సరిగా ఆదుకోవాలి.

సోదరులు లేకపోతే వారి బాధ్యతని ఆమె, ఆమె భర్తా స్వీకరించాలి.

మావగారు గతిస్తే అత్తగారి పోషణ భారం వహించాలి. లేదా తమింటికి తీసుకొచ్చి ఆదరించాలి.

అల్లుడు పుత్ర ధర్మం పాటించాలి!

కూతురి కాపురంలో పరిమిత జోక్యం

అత్తమామలు కూతురు అల్లుళ్ళ సంసార విషయంలో సంపాదనలో ఇన్వెస్ట్‌మెంట్లో సలహాలూ సూచనలూ ఇవ్వవచ్చు. సహకరించవచ్చు.

కాని కూతురి అత్తింట్లో వారి జోక్యం పరిమితంగానే ఉండాలి. వారిది ఉమ్మడి కుటుంబమైతే జాగ్రత్త తప్పనిసరి.

వేరు కాపురం పెట్టమని ప్రోత్సహించకూడదు. ఆస్తులు పంపకాలు కోరమని పురిగొల్ప కూడదు. కుటుంబంలోని ఇతర సభ్యుల్ని అధికంగా ప్రేమిస్తున్నారనీ వారి కెక్కువ దోచిపెడ్తున్నారనీ నూరిపోయరాదు.

తమ కోడలి పుట్టింటి వారి నుంచి ఎలాంటి 'జోక్యం' ఆశిస్తారో అలాంటి జోక్యమే తామూ కల్పించుకోవాలి.

పరిధి దాటిన ప్రవర్తన ఎవరికీ శ్రేయస్కరం కాదు.

అల్లుడు అత్తమామల సలహాలని వినవచ్చు. ఆచరించవచ్చు. కాని అది తన కుటుంబ ఉమ్మడి శ్రేయస్సుకు భంగం కలగనంతమేరకే!

దశమగ్రహం

అల్లుడ్ని నిందా పూర్వకంగా దశమగ్రహం అంటారు.

కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన విష్ణు స్వరూపుడ్ని అలా అన్నారంటే దాని వెనుక ఎంత క్షోభ ఎంత ఏహ్య భావన ఎంత ఛీత్కారం ఎంత అగౌరవం ఉందో గ్రహించాలి.

అలాంటి భావన రానీకుండా, 'మా అల్లుడు అల్లుడుకాదు కొడుకే' అన్పించుకోడానికి ప్రతి అల్లుడూ కృషి చెయ్యాలి!

39

గృహస్థాశ్రమం

'గృహంలోని వారంతా సుఖంగా ఉండాలి. భార్య చక్కగా మాట్లాడుతూండాలి. పిల్లలు బుద్ధిమంతులవ్వాలి. మంచి మిత్రులుండాలి. పరస్త్రీ వ్యామోహం లేకుండా వుండాలి. స్వపత్నితోనే సంగమించాలి. పనివాళ్ళు యజమాని చెప్పిన మాట వినాలి. రోజూ అతిథుల్ని ఆదరించాలి. నిత్యపూజలు చేస్తూండాలి. రుచికరమైన భోజనం తినాలి. సత్సాంగత్యంతో ఇల్లు పవిత్రతకు ప్రతిరూపంగా ఉండాలి.'

ఇల్లు ఇలా వుండాలి. ఉంటే ఆ గృహస్థుని ఆశ్రమం ధన్యం అవుతుందన్నారు పూర్వులు. కాలానుగుణ మార్పులతో నేటికీ అవి శిరోధార్యమే!

ఆశ్రమ ధర్మాలు

'చతుర్థ మాయుషో భాగ ముషిత్వాద్యం గురోః కులే।
ద్వితీయ మాయుషో భాగం కృతదారో గృహే వసేత్॥
వనేషు విహృత్యైవం తృతీయం భాగ మాయుషః।
చతుర్థ మాయుషో భాగం త్యక్త్వా సంతాన్ పరివ్రజేత్॥

మనుస్మృతి మానవుని జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఒక్కోభాగం ఒక్కో ఆశ్రమానికి వినియోగించాలని పై శ్లోకం ద్వారా చెబుతోంది.

నాలుగు భాగాలలో మొదటిది గురుకులంలో వినియోగించాలి. ఆ ఆశ్రమమే బ్రహ్మచర్యం.

రెండో భాగం గృహస్థ జీవనంలో అంటే గృహస్థాశ్రమంలలో గడపాలి.

మూడు వానప్రస్థమునందూ నాలుగు సన్యాసాశ్రమమందూ గడపాలి.

త్రివర్గం

ప్రతి మనిషీ చతుర్విధ పురుషార్థాలను సాధించాలి.

అవి – ధర్మం, అర్థం, కామం, మోక్షం.

మొదటి మూడిటినీ త్రివర్గం అంటారు.

ఇవి సాధించడానికి అనువైన వ్యవస్థ గృహస్థాశ్రమం.

నాలుగు ఆశ్రమాల్లోకెల్ల గృహస్థాశ్రమం ప్రధానమైనది. ఉత్తమమైనది.

యతి, బ్రహ్మచారి, విద్యార్థి, గురువు, పోషకుడు, బాటసారి, వృత్తి లేనివాడు – ఈ ఏడుగురు భిక్షకులు గృహస్థునాశ్రయించే జీవిస్తారు.

వారి సేవయే గృహస్థుకు మోక్షార్థ సాధనం!

గృహస్థుడు

వేదాధ్యయనం చేసి స్త్రీని పెళ్లాడి ధర్మార్థకామములు నిర్వర్తిస్తూ పంచయజ్ఞాలు చేస్తూ వుండే వాడ్ని గృహస్థుడంటారు.

అంటే విద్యార్జన చేసి పెళ్లి చేసుకుని కుటుంబ జీవితం సాగించే వాడని అర్థం.

దేవ, ఋషి, భూత, పితృ, మనుష్య అనే అయిదు యజ్ఞాలని పంచయజ్ఞాలంటారు. ఇవి గృహస్థు నిత్యం చేయాలి.

అతడి మీదే సమాజంలోని సంపాదించని సంపాదనలేని వర్గాలన్నీ ఆధారపడివున్నాయి.

గృహస్థుడంటే పురుషుడొక్కడే అని అర్థం వచ్చినా భార్యతో కలిసి ఉన్నవాడు గనకు ఆ శబ్దం భార్యాభర్తల ఏకత్వానికి చిహ్నం.

గృహస్థోపనిషత్

మహాభారతంలోని ఈ శ్లోకం గృహస్థ జీవనాన్ని నిర్దేశిస్తోంది.

'ధర్మాగతం ప్రాప్యధనం యజేత దద్యాత్ప దైవాతిథీన్ భోజయేచ్చ ।
అనాద దానశ్చ పరైర దత్తం సైషా గృహస్థోపనిషత్ పురాణీ ॥'

'ధనాన్ని ధర్మ మార్గంలో సంపాదించాలి. సంపాదించిన ధనంలో కొంత భాగాన్ని దైవకార్యానికి దానానికి వెచ్చించాలి. ఇతరుల ధనాన్ని ఎన్నడూ అపహరించ రాదు.

ఇతరులు చేసిన దానాన్ని స్వీకరించవచ్చు. ఇంటికి వచ్చిన అతిథుల్ని సాదరంగా ఆహ్వానించాలి. భోజన సమయమైతే భోజనాన్ని ఏర్పాటు చెయ్యాలి.'

ఇదే ప్రాచీనమైన గృహస్థోపనిషత్ అంటే గృహస్థధర్మసారం!

గృహస్థ ధర్మాలు

గృహస్థు అందరికీ తల్లి, తండ్రి, పాలకుడు, సంరక్షకుడు.

అతడి నుంచి బ్రహ్మచారి మొదలు సన్యాసి వరకూ అంతా ఉద్భవిస్తున్నారు. అతని చేత పోషింపబడుతూ రక్షింప బడుతున్నారు. అందు నిమిత్తం అతడు ధనాన్ని సంపాదించాలి.

గృహస్థాశ్రమంలోనే ధర్మాన్ని అతిక్రమించకుండా ధనాన్ని ఆర్జించాలి. బ్రహ్మచర్య వానప్రస్థ సన్యాసాశ్రమాల్లో ధనసంపాదన ఉండదు.

నాలుగు ఆశ్రమాల్లో మిగతా మూడింటిని సేవించడమే గృహస్థుని ముఖ్య ధర్మం.

అతిథుల్ని ఆదరించం, పాలిచ్చే ఆవు గేదెలను పోషించడం, మునుల్ని సేవించడం, పితృదేవతలకు తిలోదక పిండ ప్రదానాలివ్వడం, భగవత్సేవ చెయ్యడం - గృహస్థుని ధర్మాలు.

గృహస్థు బాధ్యతలు

గృహనిర్వహణకు అవసరమైన ధనాన్ని సంపాదిస్తూ, కామాన్ని మితిమీరని రీతిలో తీర్చుకుంటూ, ధర్మబద్ధమైన జీవితం గడపాలి గృహస్థుడు.

గృహాన్నీ భార్యనీ ఇంటిమీద ఆధారపడిన సేవకున్నీ పెంపుడు జంతువుల్నీ రక్షించాలి.

తనశక్తి మేరకు ఇతరులకు అనగా సమాజానికి మేలు చెయ్యాలి. తన మనస్సు శరీరం బుద్ధి యోగ్యత అధికారం అన్నీ కూడా ఇతరుల సుఖసౌకర్యాల కోసం వినియోగించాలి.

అవసరమైతే తన సుఖాన్నీ విశ్రాంతినీ త్యజించాలి. ఇంట్లోకి అవసరమైన వన్నీ సమకూరుస్తూ ఇంటిల్లపాదినీ తనని నమ్ముకున్నవారినీ తృప్తి పరచడమే ఇంటి యజమాని యొక్క ప్రధాన బాధ్యత.

ఆ కార్యక్రమ నిర్వహణలో అతడికి తోడు నీడగా వుండి అతడి భార్య తోడ్పడాలి. సక్రమ నిర్వర్తనకు సహకరించాలి. అంటే గృహస్థాశ్రమానికి పురుషుడికి ఆధారం స్త్రీయే. అంచేతామె సత్శీలము సత్ప్రవర్తనతో భర్తతో క్షీరనీర న్యాయంగా ప్రవర్తించాలి.

ఇద్దరూ కలిసి గృహస్థాశ్రమ బాధ్యతల్ని నిర్వర్తించాలి.

అప్పుడే వారికీ సమాజానికీ మేలు చేసిన వారవుతారు. ధన్యులవుతారు!

గృహస్థ ఋణాలు

మనిషి పుట్టుక చేతనే మూడు ఋణాలతో పుడతాడంటుంది వేదం.

అవి దేవఋణం, మాతా పితృ ఋణం, ఋషి ఋణం. ఈ మూడిట్నీ తీర్చుకోకపోతే మళ్ళీ జన్మించాల్సి వుంటుందంటారు.

ఋణత్రయానికి భూత ఋణం, మనుష్య ఋణం చేర్చి మొత్తం అయిదు ఋణాల్ని గృహస్థ తీర్చాల్సి వుంటుందన్నాయి శాస్త్రాలు.

పంచ ఋణాలు

జీవించివున్నంత కాలం తల్లిదండ్రుల్ని ఆదరించడమే కాదు వారు చనిపోయాక సైతం వారికి సద్గతి కలిగేలా ప్రవర్తించాలి. వారి పేరుతో పిండ ప్రదాన తర్పణాదులు చెయ్యాలి. అప్పుడే పితౄణం నుంచి విముక్తి లభిస్తుంది.

పితృశబ్దం సంస్కృతంలో మాతాపితరులనిద్దర్నీ తెలియజేస్తుంది.

జన్మనిచ్చిన దేవతల ఋణం భగవత్సేవద్వారా తీర్చుకోవాలి. అప్పుడే దేవ ఋణ విముక్తి సాధ్యం.

పూర్వం విద్య విజ్ఞానం ఋషి ద్వారానే లభించేవి. ఋషితుల్యుడు గురువు. జీవనాని కవసరమైన సంపాదనని సాధించే విద్య నేర్పిన అతడి ఋణం గురుసత్కారం, దక్షిణ, భక్తిశ్రద్ధలు, విద్యని సద్వినియోగం చేయుట, పదిమందికి పంచుట ద్వారానే తీర్చుకోవాలి.

మానవ మనుగడకు మూలమైనవి పంచ భూతాలు. భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పు (తేజస్సు) – ఈ ప్రకృతి సంపదని సద్వినియోగపర్చాలి. అభ్యున్నతికి ఉపయోగించుకోవాలి తప్ప వృథా చెయ్యకూడదు. కలుషితం చెయ్యరాదు. పదార్థాన్ని సృష్టించలేము నాశనం చెయ్యలేము అన్నదీ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

పంచభూతాలని కాపాడుకుంటూ పది మంది కోసం ఉపయోగిస్తూ వాటి ఋణం తీర్చుకోవాలి.

ఇక మిగిలింది మనుష్య ఋణం.

తోటిమానవుల సహాయ సహకారాలు లేనిదే మనిషి జీవించలేడు.

భూమిదున్నేవారు, పంటలు పండించేవారు, కాలువలు తవ్వేవారు, గనుల్ని తొలిచేవారు, రోడ్లువేసేవారు, వాహనాలు తయారుచేసేవారు, యంత్రాలు నడపేవారు, ఉత్పత్తిచేసేవారు, వ్యాపారం చేసేవారు, విద్య వినోదం అందించేవారు – ఎందరెందరో!

మనిషి సుఖజీవనం వెనక ఎందరి శ్రమో వుంది. వారందరి ఋణం తీర్చుకోవాల్సిందే. వివిధ దాన ధర్మ కార్యాల ద్వారా ఇతరులకు సాయపడటం ద్వారా సమాజంలో తమ వంతు బాధ్యతని నిర్వర్తించడం ద్వారా మనుష్య ఋణ విముక్తులవ్వాలి.

అతిథి దేవోభవ

తిథి వారం అని లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేవాడు అ'తిథి'.

బ్రహ్మచారి, సన్యాసి–అతిథి సేవ చెయ్యక్కర్లేదు, వానప్రస్థంలో సైతం అతిథి సేవకు ద్వితీయ ప్రాముఖ్యతే ఇవ్వబడింది.

కాని అతిథిని ఆదరించడం గృహస్థు యొక్క ప్రధాన ధర్మం.

పాశ్చాత్య దేశాల్లో ఫోన్ చేసి అప్పాయింట్‌మెంటు తీసుకొని మరీ వస్తాడు గెస్ట్.

భారతీయ సంప్రదాయం దానికి పూర్తి భిన్నమైనది.

తల్లి, తండ్రి, గురువు, అతిథి – ఈ నలుగుర్నీ దైవస్వరూపులుగా భావించాలన్నది. వారికి ఆసనం పానీయం భోజనం – ఇచ్చి తీరాలన్నది.

ఇంటికి వచ్చిన అతిథి భోజనం చెయ్యకుండా వెళ్తే అతడు ఇంటి యజమాని యొక్క పుణ్యాన్ని తీసుకుపోతాడనీ, తన పాపం అతడికిచ్చి మరీ వెళ్తాడని చెబుతారు.

అంచేత అతిథికి అన్నం పెట్టడం కనీస ధర్మం.

అలాగని చెప్పి అతిథులందర్నీ ఒకే రకంగా విశ్వసించకూడదు. రావణుడిలా మారు వేషంలో రావచ్చు. తగిన జాగ్రత్త తీసుకోవడం తప్పనిసరి!

సంతానార్థమే

భారతీయ సంస్కృతిలో దాంపత్య జీవనం ఒక యోగమే కాని భోగం కాదు.

దీపం నుంచి దీపం వెలిగినట్టుగా ఒక తరం నుంచి మరో తరం ఉద్భవించేందుకు మానవులకు నిర్దేశితమైన పవిత్రధర్మం దాంపత్య జీవనం. దాన్నే గృహస్థాశ్రమ ధర్మంగా అభివర్ణించడం జరిగింది.

సంతతి అనే దారం తెగిపోకుండా పెళ్ళిచేసుకుని గృహస్థాశ్రమం స్వీకరించాలని తైత్తిరీయ ఉపనిషత్ ఉపదేశించింది.

కేవలం సుఖం కోసమే స్వీకరిస్తే గృహస్థధర్మం ఒక బంధం అవుతుంది. సంతతి కోసం స్వీకరిస్తే గృహస్థాశ్రమ నిర్వహణ మోక్షానికి మార్గదర్శకం అవుతుంది.

ఇది భారతీయ వాఙ్మయం ఇస్తున్న సందేశం!

గృహస్థుడే కామధేనువు

కోరికలన్నీ కనురెప్ప పాటులో తీర్చగల కామధేనువు సంతతే భూలోకంలోని గృహస్థులు.

ఎన్నోరకాల జీవరాశులు గృహస్థుమీద ఆధారపడి జీవిస్తున్నాయి. అందుకే అతడిది ఉన్నతస్థానం.

ఆ పుణ్య ప్రభావం చేతనే స్వర్గాది సర్వలోకాలను పొందటానికి అవకాశం లభిస్తోంది.

పితరులు, మునులు, దేవతలు, పంచభూతాలు, తోటిమానవులు, పశుపక్షులు, క్రిమికీటకాలు – అతడు పెట్టే 'అన్నం' కోసం ఎదురుచూస్తూంటారు.

అంటే కామధేనువు భూలోకంలో గృహస్థుడి రూపంలో వుందన్న మాట.

తనకున్న సంపదను భోగభాగ్యాలను ఇతరులకు కూడా ఇస్తూ వారితో సమానంగా తను అనుభవించాలి.

గృహస్థధర్మం ఒకరకమైన సోషలిజమే. అదే హిందూ ధర్మం యొక్క గొప్పతనం!

నలుగురితో నారాయణ

గృహస్థు ఇరుగు పొరుగుతో సఖ్యంగా మెలగాలి. భగవత్సృష్టిలో అంతా సమానమేనని గుర్తుంచుకోవాలి.

నైతికజీవనం కలిగి సంఘజీవితాన్ని సమర్థవంతంగా పోషించాలి. అందులోనే గృహస్థాశ్రమ ఉన్నతి ఉంది.

పండ్లు, తినుబండారాలు ఇంట్లోని పిల్లలతో బాటు పొరుగు వారి పిల్లలకూ పెట్టాలి. వారు కూడా వీరి పిల్లలపట్ల అలాగే ప్రవర్తించాలి. ఇచ్చిపుచ్చుకోవటం వల్ల పరస్పరానురాగం, సహకారం, సద్భావం పెరుగుతాయి.

పేరంటానికి పిలిచి పండ్లు మొదలైనవి ఇవ్వడం ఈ కోవలోదే.

శుభకార్యాలకు పిలిచి భోజన సత్కారాలు చెయ్యడం అనుబంధం బలపడటానికే.

సమస్యలు దుఃఖాలు ఎవరికీ తప్పవు. వాటినధిరోహించి ముందుకు సాగిపోవాలి.

అందుకు తోడ్పడేది తోటివారే. స్నేహితులే. బంధువులే.

అశుభకార్యాల్లో ముందుకొచ్చి అండగా నిలిచేదీ ఓదార్చేదీ ధైర్యం చెప్పి బాసటగా నిలిచేదీ వారే.

రోగం, భయం, మరణం లేని ఇల్లు ఉండదు కదా!

త్రికరణ శుద్ధిగా...

మనసా వాచా కర్మణా అనేవి త్రికరణాలు.

మనిషి జీవితంలో వీటికి అత్యధిక ప్రాధాన్యత వుంది. కల్మషం లేనిది శుద్ధం. దీనికన్నా గొప్పది పరిశుద్ధం.

శుద్ధం పవిత్రతకు అర్హత కలిగి వుంటుంది.

భావన వాక్కు ఆచరణలు – ఈ మూడూ ఒకే రీతిలో వుంటే త్రికరణశుద్ధి అవుతుంది.

అదే జీవన విధానంగా భార్యాభర్తలు గడపాలి.

మాయ, మోసం, అబద్ధాలు, మెచ్చుకోలు మాటలు, దుర్మార్గపు ఆలోచనలు దరిదాపులక్కూడా రానివ్వకూడదు. అంటే త్రికరణశుద్ధిగా గృహస్థాశ్రమంలో జీవించాలి! కలిసిపోవాలి!!

గృహస్థాశ్రమ ఔన్నత్యం

'యథా మాతర మాశ్రిత్య సర్వేజీవన్తి జన్తవః।

తథా గృహస్థ మాశ్రిత్య సర్వేజీవన్తి మానవాః॥'

కుటుంబంలో తల్లి నాశ్రయించి పిల్లలు పెరిగి పెద్దవాళ్ళై జీవిస్తారు. తల్లి వల్లే పిల్లలు దైహికంగా మానసికంగా సంస్కారవంతులవుతారు.

అలాగే ఈ సమాజమంతా గృహస్థుపైనే ఆధారపడి జీవిస్తున్నది. సమాజంలోని అన్ని వర్గాల వాళ్ళు గృహస్థునాశ్రయించే బ్రతుకుతున్నారు. అంటే గృహస్థాశ్రమం సమాజానికి తల్లిలాంటిది!

స్వర్గధామం


గృహస్థజీవితం స్వర్గధామమంటుంది అథర్వ వేదం.

గృహం స్వర్గం కావాలంటే భార్యాభర్తలు ధర్మాత్ములు, ప్రియంగా వ్యవహరించే వారై వుండాలి. పరస్పర సౌజన్యంతో మెలగాలి.

గృహస్థాశ్రమం అనే రధానికి భార్య భర్తలు రెండు చక్రాలు. ఇద్దరూ కలిసి జంటగా ఆ రధాన్ని సవ్యంగా నడిపించాలి.

'సంతుష్టో భార్యయా భర్తా
భర్త్రా భార్యా తథైవ చ।
యస్మిన్నేవ కులే నిత్యం
కల్యాణం తత్ర వై ధ్రువమ్ ॥'

మనుస్మృతిలోని ఈ శ్లోకానికి అర్థం – గృహంలో భార్య వలన భర్త, భర్త వలన భార్య శాంతిగా ప్రసన్నంగా ఉండాలి. అటువంటి గృహంలో సంతోషం సౌభాగ్యం వెల్లివిరుస్తాయి!



40

బ్రహ్మచర్యం

బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అను నాలుగు ఆశ్రమాల్లో మొదటిదానిలోనే వుండిపోయిన వాడు బ్రహ్మచారి. పెళ్లి కానివాడు.

అలాగని పెళ్లి చేసుకోని వారందర్నీ బ్రహ్మచారులనలేం. కామవాంఛ అణచుకున్న వారూ భోగేశ్చలేనివారూ మాత్రమే బ్రహ్మచారులు.

వారు మగ కావచ్చు. ఆడ కావచ్చు.

పెళ్లినీ పెళ్లివల్ల సంక్రమించే బంధాలనీ బాధ్యతలనీ వివిధ కారణాల వల్ల వద్దనుకుంటారు. ఒంటరి జీవితం కోరుకుంటారు.

పురాణాల్లో ఆంజనేయుడు, గణపతి, అయ్యప్ప, భీష్ముడు లాంటి బ్రహ్మచారులున్నారు.

లక్ష్యసాధన

కొందరికి కొన్ని నిర్దిష్టమైన లక్ష్యాలుంటాయి.

భగవత్సేవలో తరించాలని, రోగులకీ దీనులకీ సేవచేయాలని, బడుగువర్గాలకు అండగా నిలవాలని, జాతి లేక దేశరక్షణకు అంకితం కావాలని – ఇలా ఎన్నో.

వృత్తి లేక వ్యాపార పరంగా ఉన్నత శిఖరాలు సాధించడమే ధ్యేయంగా పెట్టుకుంటారు మరి కొందరు.

బ్రహ్మచారిగా వుంటే పూర్తి సమయాన్ని వాటికే కేటాయించవచ్చు. దృష్టినంతా లక్ష్యం మీదే కేంద్రీకరించవచ్చు. ఇష్టానుసారం స్వేచ్ఛగా మసలవచ్చు. స్వార్థాన్ని అధిగమించవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. మనశ్శరీరాల్నే గాక ఆర్థిక వనరుల్నీ వాటికోసం వినియోగించవచ్చు.

వారెన్నుకున్న మార్గాల్లో రంగాల్లో విలక్షణులై భాసిల్లడానికి విజయం సాధించడానికి బ్రహ్మచర్యాన్ని స్వీకరించడమే ఉత్తమమని కొందరు భావిస్తారు.

ఒంటరి ప్రయాణీకుడు వేగంగా వెళ్ళగలడన్నాడు రుడ్‌యార్డ్ కిప్లింగ్.

సిఆర్‌రెడ్డి, వావిలాల, పొట్టి శ్రీరాములు – ఒక ఆదర్శానికి కట్టుబడి ఒంటరితనాన్ని వరించిన ధీరులు!

ప్రతికూల పరిస్థితులు

కొంతమంది బ్రహ్మచారులుగా మిగలకూడదనుకుంటారు. వివాహితులు కావాలని ఆశపడతారు.

కాని పరిస్థితులు అనుకూలించవు. పెళ్లిళ్ళుకావు.

చెల్లెళ్ళ, తమ్ముళ్ళ బాధ్యత స్వీకరించాల్సి వస్తుంది. ఆ బాధ్యతల్ని నిర్వర్తించేప్పటికి పెళ్లి వయస్సుదాటి పోతుంది. అయిష్టంగానే బ్రహ్మచర్యాన్ని ఆచరించక తప్పనిసరవుతుంది.

ఆర్థిక కారణాలవల్ల కొందరూ, 'నచ్చక' కొందరూ, పెళ్లి చేసే వారు లేక కొందరూ, కాంప్రమైజ్ కాలేక మరి కొందరూ ముదిరిన బెండకాయలవుతారు. పెళ్లంటే విముఖత్వం లేకపోయినా పెళ్లికాని వారుగా మిగిలిపోతారు.

బ్రహ్మచారీ శతమర్కటః

కోతి ఎలా ప్రవర్తిస్తుందో అందరికీ తెలిసిన సంగతే.

ఒకటి కాదు పది కాదు వంద కోతులెలా ప్రవర్తిస్తాయో అలా వుంటాట్ట బ్రహ్మచారి.

అతడి మనస్సు అంత చంచలంగా చిత్రాతి చిత్రంగా వుంటుంది. అతడ్ని కట్టి పడేసే బంధాలుండవు. వేళకు ఇంటికెళ్ళాలి, ఇంటికి ఫలానాది తీసుకెళ్ళాలి, పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లడానికి ఉదయమే లేవాలి – వగైరా బాధ్యతలేమీ వుండవు.

అతడే ప్రభువు. అతడే సేవకుడు. అన్నీ అతడిష్టం. ఎలా కావాలంటే అలా, ఎలా వుండాలన్పిస్తే అలా వుండొచ్చు.

అందువల్ల నిలకడ మనస్తత్వం వుండదంటారు.

సింగిల్ పెర్సన్

ఒంటరిగా వుండే వారిని సింగిల్ మేన్, సింగిల్ ఉమన్ అంటారు.

వారంతా బ్రహ్మచారులు కావాలని లేదు.

అందుకే, "నేను సింగిల్ మేన్‌ని కాదు – బ్రహ్మచారిని" అంటారు అబ్దుల్ కలాం.

కుటుంబ బరువు బాధ్యతల బంధాల అనుబంధాలనే సాలెగూళ్ళలో చిక్కుకోకుండా

ఒంటరిగా స్వేచ్ఛగా జీవించాలనుకుంటారు. సంప్రదాయ పాత్రలైన భార్య, భర్త, అమ్మ, నాన్న పాత్రలను పోషించడం వారికిష్టముండదు.

అలా అని సెక్స్‌కి దూరం కారు. పెళ్లికీ సంసారానికీ దూరంగా వుంటారు కొందరు హోమోసెక్సువల్సుగా మారతారు.

ఇష్టానుసారంగా తమ ఆనందమే లక్ష్యంగా జీవించే ఈ తరహా వారు బ్రహ్మచారులు కారు. కాలేరు.

ఉన్నత వర్గాల్లో గ్లామర్ ప్రపంచంలో ఈ తరహా జీవితం కోరుకునే వారెక్కువగా వుంటారు. వారికి ఆర్థిక భద్రత వుండి వుంటుంది.

తోడులేని బ్రతుకు

ఒంటరిజీవితంలో బాధ్యతా రాహిత్యంలో ఆనందం, స్వేచ్ఛ పుష్కలంగా వుంటాయను కోవడం ఒక భ్రమ మాత్రమే.

ఎన్నోరకాల మానసిక శారీరక సామాజిక ఒత్తిళ్ళూ సమస్యలూ ఎదుర్కోవలసి వస్తుంది. స్త్రీలైతే మరీనూ.

బ్రహ్మచారులుగా మిగిలిపోయిన మగవారి గురించి పురుషత్వం లేనివారనో మూడో తరహా వారనో అనుకునే ప్రమాదం ఉంది.

పెళ్లిచేసుకోని ఆడవారి మీద బోల్డంత దొంగ సానుభూతి ఒలకబోస్తారు. ఈజీగా లోబర్చుకోవచ్చని వల విసుర్తారు. ప్రయత్నం వికటిస్తే అసహ్యంగా మాట్లాడతారు. పుకార్లు పుట్టిస్తారు.

స్త్రీకి స్వతంత్ర జీవనం గడపడం కష్టం. పెళ్లి లేకపోతే ఆమె బ్రతుకు దుర్భరమవుతుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో!

ఇవన్నీ ఒక ఎత్తు అయితే కష్టసుఖాలు పంచుకోడానికెవరూ లేకపోవడం మరోఎత్తు.

'నీకోసం చెమ్మగిల్లు నయనమ్ము' లేకపోవడం బాధాకరం. దుర్భరం. కుటుంబ బంధాలూ బాధ్యతలూ అపురూపమైనవి. వాటికి ప్రత్యామ్నాయం లేదు.

వాటిని వద్దనుకుని బ్రహ్మచారులుగా మిగిలిపోయేవారు స్థితప్రజ్ఞులైతే తప్ప పూర్తిగా రాజీ పడిపోగలిగితే తప్ప ప్రశాంతంగా బ్రతకలేరు.

ఒంటరితనం ఎంత స్వేచ్ఛనిస్తుందో అంత నరకమూ చవిచూపిస్తుంది!

కోర్కెల్ని అణచుకొంటే

యుక్త వయస్సు రాగానే శృంగార కోర్కెలు తలెత్తుతాయి.

ప్రతివారిలోనూ 'వాంఛ' 'ఇన్‌స్టింక్ట్' సహజం. దాన్ని తీర్చుకోవటం ప్రకృతిధర్మం. అణచుకోవడం ప్రకృతి విరుద్ధం.

బలవంతంగా అణచి వేసుకోవడం వల్ల అనేక శారీరక మానసిక సమస్యలొస్తాయి. రకరకాల ఒత్తిళ్ళకు అశాంతికి లోనవుతారు. హిస్టీరియా పేషంట్లుగా వికృత మనస్కులుగా శాడిస్టులుగా మారే ప్రమాదమూ వుంది.

ఒక అనుభవాన్ని ఆనందాన్ని పోగొట్టుకున్నామన్న భావం అసంతృప్తి జీవితాంతం వెంటాడుతూనే వుంటాయి. అసంతుష్టుల్ని చేస్తూనే వుంటాయి.

పెళ్లిమాని పొరబాటు చేశామన్న భావోద్వేగానికి ఎప్పుడో అప్పుడు లొంగి, వేదనా భరితులవటం ఖాయం! అప్పుడు సరిద్దుకుందామనుకున్నా 'టూ లేట్' అయ్యే ప్రమాదముంది!

"కామవాంఛ తీర్చుకోకుండా అణచిపెట్టడం వల్ల అనారోగ్యం ప్రాప్తిస్తుంది. పిచ్చి మతి భ్రమ లాంటి రోగాలు వస్తాయి. నిత్యం ఆహారం పుచ్చుకున్నట్టే కామాన్ని సేవించాలి" అంటాడు వాత్స్యాయనుడు.

లైంగిక సుఖం

మిగతా సుఖాలూ సంతోషాలూ వేరు. లైంగిక సుఖం పొందటంలోని ఆనందం వేరు.

లైంగిక జీవితం చక్కగా వుంటే శరీరమూ మనస్సూ తాజాదనం కలిగి వుంటుంది. ఉత్సాహంగా ఉత్తేజితంగా వుంటుంది.

స్త్రీలలో అయితే పునరుత్పత్తి వ్యవస్థ యాక్టివేట్ అవడం వల్ల అనేక మార్పులొస్తాయి. మేని కాంతి పెరుగుతుంది. రక్తప్రసరణ బాగుంటుంది. వక్షోజాలు, పిరుదులు చక్కని ఆకృతి సంతరించుకుంటాయి. ఎదుగుదల బాగుండి నిండుగా వుంటారు. స్త్రీత్వం వికసిస్తుంది.

మనస్తత్వ వేత్తల ప్రకారం ఇల్లు, కుటుంబం, కెరీర్, ఆఫీస్ ఇంకా ఎక్కడైనా సరే అపజయాలు కలుగుతూండటం సహజం. వాటన్నిటిమధ్యా దాంపత్య జీవితం బావుంటే మిగతా వాటిని తేలిగ్గా తట్టుకోగలుగుతారు. వాటిని విజయాలుగా మార్చుకోగలుగుతారు.

సెక్స్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అపరిమితానందాన్ని ఇస్తుంది. ఒత్తిళ్ళు దూరం చేస్తుంది.

సెక్స్ నిప్పులాంటిది. కంట్రోలు తప్పితే కాల్చివేస్తుంది. కంట్రోలులో వుంటే దివిటీలా పనిచేస్తుంది. లైంగిక సుఖాన్ని దూరం చేసుకోవడమంటే అమూల్యానందాన్ని చేజార్చుకోవడమే! అసంపూర్ణులుగా మిగిలిపోవటమే!

ఎన్నో మానసిక సమస్యలు

ఏకాకితనం ఏమాత్రం శ్రేయస్కరం కాదని మానసిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

యుక్తవయస్సులో నడివయస్సులో జీవితం సజావుగానే ఉన్నప్పటికీ వృద్ధాప్యం పై దాని ప్రభావం అధికంగా వుంటుంది. ఆ దశలో అవమానతలకు లోనై వ్యధాభరితులవుతారు. ఆలకించేవారు ఆదరించేవారు ఉండరు. ఉన్నా వారి చూపు వీరు దాచుకున్న 'మూట' మీదే ఉంటుంది తప్ప మనిషి మీద ఉండదు!

కుటుంబ జీవితం ఆనందానుభూతుల్ని ఇవ్వడమేకాదు భద్రతా భావం కల్పిస్తుంది. తనకోసం మరొకరున్నారన్న భావన ఆత్మవిశ్మాసాన్ని ముందుకు దూసుకుపోయే లక్షణాన్ని పెంపొందిస్తుంది.

నిరాశా నిస్పృహల్ని పారద్రోలి మనస్సుని సేదదీరుస్తుంది. భరోసా ఇస్తుంది. వెన్ను తడుతుంది. వెంట వుంటుంది.

ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిపడే బాధ్యతల్తో బిజీగా ఉంటారు. అవి నెరవేరుస్తూ తృప్తి పొందుతూంటారు.

మనిషి సంతుష్టికి కావాల్సినవన్నీ సమకూర్చే కుటుంబ వ్యవస్థను కాదనుకోవటమంటే అనేక మానసిక సమస్యలను ఆహ్వానించడమే అని చెప్పాలి. అశాంతినీ అసంతృప్తినీ కోరితెచ్చు కోవడమే అని చెప్పాలి.

స్త్రీలలో మెనోపాజ్ దశలో శారీరకంగా మానసికంగా అనేక మార్పులు సంభవిస్తాయి. దాన్ని తట్టుకోడానికి వారికో ఆసరా, భద్రతా భావం అవసరమని శాస్త్రవేత్తల అభిప్రాయం.

ఒక టీవీ ప్రోగ్రాంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు విష్ణుహరి దాల్మియా సెక్స్ అనుభవంలేని తన సహచరుల మీద జాలి దయ చూపిస్తున్నానన్నారు. సెక్స్ అనుభవం లేకపోవడమంటే ప్రపంచ సుఖానుభూతిలేని అనుభవహీనులవడమంటారు. సెక్స్ కొన్ని లిమిట్స్‌కీ పరిధులకీ లోబడి వుండాలంటారాయన.

పవిత్రతకు చిహ్నం

కొందరు బ్రహ్మచర్యాన్ని పవిత్రతకు మారు పేరుగా భావిస్తారు. అస్కలిత బ్రహ్మచారిగా వుంటే సుదృఢులూ తేజోవంతులూ అవుతామనుకుంటారు.

మరికొందరు గృహస్థాశ్రమం వల్ల మోక్షానికి భంగం కలుగుతుందని నమ్ముతారు. జీవితమంతా బ్రహ్మచారిగా వుండిపోవటం వల్ల స్వచ్ఛత మిగిలి మోక్షం తేలిగ్గా లభిస్తుందని భావిస్తారు. గృహస్థాశ్రమం వల్ల అది కొంత మైలపడుతుందని భ్రమపడుతూంటారు.

అది సరికాదని భారతంలోని జరత్కారుడి కథ బోధిస్తోంది.

జరత్కారుడు పెళ్లిచేసుకోనందున అతడి పూర్వీకులు ఊర్ధ్వలోకగతుల్ని పొందలేక కొమ్మకి తలకిందులుగా వేలాడుతూంటారు.

అది తెలిసి సంతానం కోసం పెళ్లి చేసుకుంటాడతడు. ఆ రకంగా పూర్వీకులకు సద్గతులు కల్పిస్తాడు.

వివాహ ఫోబియా

కొంతమంది యువతీ యువకులు పెళ్లంటే రకరకాల భయాలకు లోనవుతారు. దాంతో వివాహానికి విముఖత చూపిస్తారు.

వివాహబంధం పట్ల సరైన అవగాహన లేకపోవడమే దీనికి ముఖ్య కారణం.

పురుషద్వేషం, స్త్రీ ద్వేషం, పెళ్లంటే భయం, మైథున భయం, విఫలమైన వివాహాల ప్రభావం, గృహహింస సంఘటనలు, అత్తల ఆరళ్ళ కథలు, ఊహల్లోని రాకుమారులూ దేవకన్యలూ తారసపడక పోవడం, ప్రేమించిన వారు దూరమవడం – వగైరా కారణాలుంటాయి.

తల్లిదండ్రులు లేదా స్నేహితులు వారి భయాల్ని పోగొట్టాలి లేదా మారేజ్ కౌన్సిలర్లనో సైకియాట్రిస్టులనో కన్సల్ట్ చేయించాలి.

వారిలో గూడు కట్టుకున్న భయాల్ని పారద్రోలితే వారి ఆలోచనలు సక్రమ రూపు దాలుస్తాయి. బ్రహ్మచారిగా మిగిలిపోవాల్సిన దుస్థితి తప్పుతుంది.

పెళ్లి ఆఖరి మజిలీ కాదు

బ్రహ్మచారికి తుది మజిలీ వివాహం. అంటే పెళ్లవుతూనే బ్రహ్మచర్యానికి తెరపడుతుందన్నమాట.

అలాకాని వారికి పెళ్లే పరమావధిగా అన్పించక పోవచ్చు.

హిందీ సినిమా డైరెక్టర్ తనూజాచంద్ర “పెళ్లి జీవితానికి పరమావధి కాదు. నాకు చాలా మందితో సన్నిహిత సంబంధాలున్నాయి. అవేవీ నా వృత్తి నిర్వహణకు అడ్డంకి కాలేదు. పెళ్లి చేసుకోకపోతే జీవితమే లేదన్న సిద్ధాంతాన్ని నేను నమ్మను” అంటారు.

నిజమే వివాహం జీవితంలో ఒక భాగమే. కాని దాని ప్రభావం జీవితమంతా పరచుకుంటుంది. వివాహం జీవితానికి కేంద్ర బిందువు. జీవితాంతం కలిసి బ్రతికే అవకాశాన్ని కాలదన్నుకోవటం సంపూర్ణతకి దారితీయదు. ఒంటిగీత బొమ్మలా మిగిలిపోతారు.

వృత్తి, వ్యాపారం, కెరీర్ – ఎందులోనైనా సరే విజయం సాధించాలంటే ఆ విజయానందాన్ని పూర్తిగా అనుభవించాలంటే కుటుంబపు వెన్నుదన్ను కావాల్సిందే.

పెళ్లిలోనే జీవనసాఫల్యత వుంది. పెళ్లిద్వారానే జీవిత మాధుర్యం గ్రోలగల్గుతారు. పెళ్లిలేని జీవితం నిస్సారం! నిస్తేజం!

ఉన్నతులూ ఉన్నారు

పెళ్లిచేసుకోకపోయినా అనేక రంగాల్లో అనేక బాధ్యతలు విజయవంతంగా నిర్వహిస్తున్న వారూ కీర్తి కిరీటాలు సాధిస్తున్నవారూ ఎందరో వున్నారు.

మదర్‌థెరిస్సా, అబ్దుల్‌కలాం, వాజ్‌పేయి, రతన్ టాటా, లతామంగేష్కర్, కాన్షీరాం, మాయావతి, జయలలిత – ఇలా ఎందరో తమ తమ క్షేత్రాలలో రాణిస్తున్నారు. నిష్ణాతులవుతున్నారు.

వారి మనోబలాన్ని లక్ష్యసాధనా దీక్షని అభినందించాల్సిందే.

వారికైనా వారి వెనుక కుటుంబ ప్రోత్సాహం, సహకారం వుండి వుంటుందని గమనించాలి.

మన దేశంలో మొట్టమొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని సృష్టించిన డా. ఇందిరా హిందూజా, “వివాహ చేసుకుంటే నా కోసం ఇంటి దగ్గర ఆతృతగా ఎదురుచూసే వ్యక్తులుకు తగిన న్యాయాన్ని చేయలేననే ఊహతోనే వివాహం చేసుకోలేదు” అన్నారు.

గాంధీజీ ఉవాచ

‘బ్రహ్మాచర్యం అంటే శబ్దార్థరీత్యా బ్రహ్మ సాక్షాత్కారానికి దారితీసే విధంగా ప్రవర్తించటం. ఆదర్శప్రాయమైన ధ్యేయంతో నిష్కల్మష బ్రహ్మాచర్యం ఆచరించడం సాధ్యం కానప్పుడు వివాహం చేసుకోవడమే ఉత్తమం” అన్నారు గాంధీజీ.

పునరాలోచించాలి.

పెళ్లి వద్దనుకునేవారు బ్రహ్మచర్యమే ముద్దనుకునేవారు మరోసార తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలి.

వివాహానికి దూరమవడం వల్ల ఎన్ని అనుభవాల్నీ అనుభూతుల్నీ ఆనందాల్నీ బంధాల్నీ కుటుంబ జీవనాన్నీ కోల్పోతున్నారో తెలుసుకోవాలి.

నాలుగు పదులు దాటాక ఆకస్మాత్తుగా ఒంటరితనం అనుభవంలోకొస్తుంది. అప్పుడు జీవితంలో భావోద్వేగాలకు సంబంధించిన పార్శ్వం కన్పించదు.

సమాజ రీతికి ఎదురీదుతున్న సంగతీ గుర్తించాలి.

ఒంటరిగా ఉన్నవారికంటే వివాహిత మహిళలు నాలుగేళ్ళు, వివాహిత పురుషులు పదేళ్ళు ఎక్కువగా బతుకుతారని కాలిఫోర్నియా యూనివర్శిటీ జరిపిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇదీ ఆలోచించాల్సిన విషయమే.

ఈతి బాధల్నుంచి సంసార బాధల్నుంచి తప్పించుకోడానికి పెళ్లి వద్దనటం పలాయనమే అవుతుంది.

అప్పుడు కూడా బాధ్యతలు తప్పవు. సంపాదన తప్పదు.

పెళ్లిని తప్పించుకోవడం వల్ల ఒంటరితనం అసంతృప్తి అభద్రత తప్పవు!

41

శృంగారం

జీవితంలో అత్యంత ప్రాధాన్యత గల భాగం శృంగారం.

శృంగారమే మానవజాతి మనుగడకు సాక్షీభూతం.

జీవితంలో సెక్స్‌ను బాగా ఎంజాయ్ చేసేవాళ్ళే వివిధ కార్యరంగాల్లో విజయం సాధిస్తారని సిద్ధాంతీకరించిన వారూ వున్నారు.

ఒక్కటి మాత్రం నిజం. లైంగిక కోర్కెల్నుంచి ఆలోచనల్నుంచి తప్పించుకోవాలనుకునే వారు తమ తమ పనుల్ని సమగ్రంగా నిర్వర్తించలేరు.

అత్యంత విలువైనది సంతోషకరమైనది సంతృప్తినిచ్చేది శృంగారం. దాన్ని నిర్లిప్తంగా నిస్తేజంగా రొటీన్‌గా మారిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత భార్యాభర్తలిద్దరి మీదా వుంది.

సమాజం మరియు దాంపత్యం సెక్సు మీదా ఆస్తి మీదా నిలబడివున్నాయి. ఆది మానవుని కాలం నుంచీ ఇదే స్థితి!

రసవంతం చేసుకోవాలి

రోజు వారీ సమస్యలూ ఇబ్బందులూ అన్నిటినీ మరపిస్తుంది శృంగారం. టెన్షన్లు తగ్గించడమే కాదు నూతనోత్తేజాన్నిస్తుంది.

ధన పేద భేదం లేకుండా స్త్రీ పురుష వివక్ష లేకుండా వయస్సు తారతమ్యం లేకుండా అందరికీ ఆనందామృతాన్ని దోసిళ్ళతో జుర్రుకునే అవకాశం కల్పిస్తుంది.

ఆలుమగలు శృంగార జ్యోతులు వెలిగిస్తూ జీవితాన్ని రాగ రంజితం చేసుకోవాలి. కోపాలు కష్టాలు బాధలు బాధ్యతలు అన్నీ మరచిపోయి కోరికల కొలిమిలో కాలిపోవాలి. బిగికౌగిల్లో సేదదీరాలి.

జీవితమనే వంటకానికి కొత్త రుచిని అందించే మసాలా దినుసు సెక్స్.

సెక్స్‌ను బాగా ఎంజాయ్ చేసే దంపతులెంతో అన్యోన్యంగా వుంటారు. ఆనందంగా వుంటారు.

సెక్స్ శక్తి నిచ్చే టానిక్. అందుకే శృంగారం ఓ అద్భుత పరుసవేది!

కామకళా వేదిక

అలసిన శరీరాన్ని సేదదీర్చే అద్భుత ఏకాంత ప్రదేశం పడకగది.

పడకగది శృంగారానికి వేదిక. దాన్ని చక్కగా తమ అభిరుచులకు అనుగుణంగా అలంకరించుకోవాలి.

మెత్తని పరుపు, లేతరంగు దుప్పట్లు, గలీబులు శుభ్రంగా ఉండాలి. హాయి గొల్పేలా వుండాలి.

గోడలకు ఆహ్లాదకరమైన లైట్ కలర్ వేయించుకుంటే బావుంటుంది. ప్రకృతి చిత్రాల ఫొటోలు, పెయింటింగ్స్‌తో గది గోడల్ని అలంకరించుకోవాలి. నీలిరంగు బెడ్ లైట్ ఏర్పాటు చేసుకుంటే మంచిది.

నిలువుటద్దాలు గదిలో తప్పని సరి.

గది అగరువత్తుల పరిమళం లేదా మల్లెల సుగంధంతో గుబాళించాలి. మంద్రస్థాయి సంగీతమూ మనసుల్ని మురిపిస్తుంది.

పల్చని దుస్తులు ధరించాలి.

నైట్ డ్రెస్‌లు ఆకర్షణీయంగా వుండాలి. సువాసనలు వెదజల్లుతూండాలి.

పల్చగా వుండాలి. శరీరపు ఒంపు సొంపుల్నీ లోదుస్తుల్నీ చూపించీ చూపించ నట్టుండాలి.

బాధల్నీ సమస్యల్నీ విభేదాలనీ గమ్మం దగ్గరే వదిలేసి గదిలోకి అడుగుపెట్టాలి.

గది దంపతుల మన్మథ సామ్రాజ్యం.

ఎలాంటి సిగ్గులూ సంకోచాలూ ఉండకూడదు. స్వేచ్ఛా జీవులవ్వాలి. ప్రకృతి పురుషులుగా మారాలి.

సెక్స్ రెండు శరీరాలను ఒక చోట చేర్చడమే కాదు ఇరువురినీ మానసికంగా ఒకటి చేస్తుంది. ప్రేమ పెంచుతుంది. ప్రేమనిండిన మనస్సు శారీరక కలయిక కోసం తహతహ లాడిస్తుంది!

ఆరోగ్యం కాపాడు కోవాలి

శృంగారం ఆరోగ్యవంతుల క్రీడ.

ఎలాంటి నొప్పులూ రోగాలూ నీరసాలూ రాకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. బలమైన ఆహారం తీసుకోవాలి. వ్యాయామం చేస్తూండాలి. శుచి శుభ్రతలు పాటించాలి.

దంపతులిద్దరూ కుస్తీపట్టు పట్టేందుకు గోదాలోకి దిగే వస్తాదుల్లా ఉండాలి. తలపడాలి. ఒకర్నొకరు ఓడించడానికి యత్నించాలి.

కడకి ఇద్దరూ గెలవాలి!

మనస్సుకు కళ్ళేలు వేయొద్దు

కామకళని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దు కోవాలి.

శృంగారం గురించి ఆలోచిస్తూ రొమాంటిగ్గా వుండటానికి ప్రయత్నించాలి. అది కోరికని పెంచుతుంది.

మనస్సును ఫ్రీబర్డ్ చేసి వదలాలి. కోర్కెల్ని పురివిప్పనివ్వాలి. మనస్సులో మల్లెల మాలలూ మధురోహలూ యుగళగీతం పాడాలి!

శృంగార చిత్రాలు చూడండి. కామశాస్త్ర గ్రంథాలు చదవండి. ఫాంటసీలు ఆవిష్కరించండి.

అవి కోర్కెల్ని ఉద్దీప్తి చేసి శృంగారపు లోతుల్ని చవిచూపిస్తాయి!

ప్లెజర్ ట్రిప్స్

ఏకాంతాన్ని సృష్టించుకోండి. సినిమాలకీ షికార్లకీ వెళ్ళండి. కేండిల్ లైట్ డిన్నర్లు చెయ్యండి.

వీలుకుదిరినప్పుడు విహారయాత్రలకో తీర్థయాత్రలకో వెళ్ళండి.

వాటిని స్పెషల్ ట్రిప్స్‌గా ఎక్సైటింగా రూపొందించుకోండి.

వివిధ ప్రదేశాలు చూస్తూ తామిద్దరే లోకమన్నట్టు వ్యవహరిస్తూ సాన్నిహిత్యంలో శృంగారంలో సరికొత్త రుచులు ఆస్వాదించండి.

సెక్స్‌లోనే సంతృప్తి

శృంగారంలో భార్యాభర్తలిద్దరూ ఆసక్తితో ఆకర్షణతో పాల్గోవాలి. ఒకర్తో ఒకరు పోటీ పడేలా ప్రోత్సహించుకోవాలి.

ఇద్దరూ సంతృప్తి అనుభవించాలి. భావప్రాప్తి పొందాలి.

ఇదేదో మొక్కు బడి వ్యవహారంగానో లేక మగవారు తమ కోరిక తీర్చుకునే మార్గంగానో భావించ కూడదు.

సెక్స్‌క్రీడలో ఇద్దరూ సమాన ప్లేయర్లని గుర్తించి 'ఆట' ఆడాలి. ఆనందామృత భాండాన్ని అందుకోవాలి.

తృప్తికరమైన శృంగారజీవితాన్ని అనుభవించే వారెంతో ఉత్సాహంగా వుంటారు. చేసే పని మీద శ్రద్ధపెడతారు. ఎంచుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు.

జీవితాన్ని ఆనందమయం చేసుకుంటారు!

కామకళ

కామాన్ని మానవ సహజగుణంగా గుర్తించి తగిన రీతిలో సుఖించే మార్గాన్ని వాత్స్యాయనుడు 'కామసూత్ర' గ్రంథంలో వివరించాడు.

స్త్రీ పురుషుల కలయికలో సృష్టి కార్యముంది. అందునిమిత్తం వారి మధ్య ఆకర్షణ అవసరం. ఆకర్షణ కలిగించడంలో వారి పాత్రల్నీ బాధ్యతల్నీ పేర్కొన్నాడు. ఒకరి నుండి మరొకరు సుఖం అందుకునే మార్గాల్నీ భంగిమల్నీ తెలియజేశాడు.

కామానందం గురించి తెలుసుకున్న స్త్రీ పురుషులే ప్రశాంతంగా సుఖంగా దాంపత్యం చేయగలుగుతారన్నాడు వాత్స్యాయనుడు.

శృంగారభయంతో భర్తని దగ్గరకు చేరనివ్వని భార్యలున్నారు. భార్యకు సుఖాన్నెలా అందించాలో తెలీని భర్తలున్నారు. వారికోసం శృంగార రహస్యాల్ని వివరించి సంసార సుఖాన్ని తనివితీరా అనుభవించి సుఖించమన్నాడు 'కామసూత్ర'లో.

సంభోగ కృత్యములు

సంభోగానికి ముందు చేయాల్సిన కార్యాల్ని నాలుగు రకాలుగా విభజించాడు కొక్కోకుడు.

అవి – స్పర్శ, సంభాషణ, సంభావన, సంతర్పణ,

తాకుట, ముద్దు పెట్టుకొనుట, కౌగిలించుకొనుట స్పర్శకు చెందుతాయి.

పరిహాసమాడుట, మనోహర విషయాలు మాట్లాడు కొనుట, పరస్పర కౌశలము వెల్లడించుకొనుట సంభాషణలోకి వస్తాయి.

తాంబూల మిచ్చుకొనుట, పుష్పములు విసురు కొనుట, సుగంధ ద్రవ్యాలు పూసు కొనుట – ఇవి సంభావన.

పాలు అందించుట, పండ్లు తినిపించుట – సంతర్పణ.

ఈ రకపు చర్యల వల్ల భార్యాభర్తలు కామోద్రేకులవుతారు. వారి సంభోగం బ్రహ్మానంద దాయకమూ విశేష తృప్తికరమూ అవుతుందంటుంది కొక్కోక శాస్త్రం!

ముద్దు ముచ్చట

వంద మాటల్లో చెప్పలేని ప్రేమ ఒక్క ముద్దుతో వెల్లడవుతుంది.

పిల్లలకు బుగ్గలపై ముద్దు ఆనందకరం. యువతీయువకులకు పెదాలపై ముద్దు మోహనకరం.

శరీరంలోని సుతి మొత్తని భాగం పెదవులే. నరాల చివర్లు అధికంగా గల ప్రదేశమూ అదే.

పెదవుల కలయిక లోని ముద్దులు ఒకర్నుండి మరొకరికి ఒకరకమైన విద్యుత్తరంగాలని ప్రవహింపజేస్తాయి. తన్మయుల్ని చేస్తాయి.

'పెదవులు ఒక మొగ్గలా ముడిచి అవతలి వారి శరీరాన్ని తాకించడమే ముద్దు'– అన్నాడు వాత్స్యాయనుడు.

నాలుక కళ్ళు కూడా అప్పుడప్పుడూ ముద్దులో పాలు పంచుకుంటాయి.

శరీరంలో ముద్దుకు అనర్హమైన ప్రదేశమంటూ లేదు కాని అత్యంత రుచికరమైంది పెదవుల మీద ముద్దరేసే ముద్దే.

ముద్దుతో ఆరంభమైన స్పర్శ శరీరమంతటినీ ఆక్రమించాలని కోరుకుంటుంది!

సెక్స్ పరమౌషధం

సెక్స్ ఓ అవసరం. ఓ ఆనందం. అంతకుమించి ఓ ఔషధం.

శృంగారానుభూతుల వల్ల విడుదలయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్‌కు ఒత్తిడిని దూరం చేసే శక్తి వుంది. వారానికి మూడు సార్లు సంభోగించే వారిలో గుండె పోటు వచ్చే ప్రమాదం తక్కువ. డిప్రెషన్ తగ్గుతుంది. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

ఒత్తిడీ ఆందోళనా తగ్గుతాయి. గనుక రక్తపోటు నియంత్రణలో వుంటుంది.

సెక్స్‌ని మించిన వ్యాయామం లేదు. ఒకసారి సెక్స్‌లో పాల్గొంటే సుమారు 350 కేలరీలు ఖర్చువుతాయి. ఎండార్ఫిన్ హార్మోను వల్ల కండరాలు సక్రమమవుతాయి. వాటి కదలిక చురుగ్గా వుంటుంది.

శృంగార సమయంలో గుండె నిమిషానికి 70 నుండి 150 సార్లు కొట్టుకుంటుంది. రక్తప్రసారం వేగవంతమై సక్రియమవుతుంది.

శరీరంలో టెస్టెస్టరోన్ హార్మోను వేగంగా సంచరించడం వల్ల ఎముకలు, కండరాలు దృఢమవుతాయి. సెరోటినం హార్మోన్ స్రవించటం వల్ల చర్మానికి మెరుపూ సౌమ్యతా బిగింపూ కలుగుతాయి.

'సంభోగం వల్ల జ్ఞాపక శక్తి, బుద్ధి, ఆయువు, ఆరోగ్యం, ఇంద్రియ పుష్టి, యశము, బలము కలుగుతాయి, శరీరమునకు కాంతీ వస్తుంది. స్థిరబుద్ధి కలగజేస్తుంది' అని 'అష్టాంగ హృదయము' లో అంటారు వాగ్భటాచార్యులు.

ఫోర్ ప్లే ముఖ్యం

సంభోగానకి ముందు 'ఫోర్ ప్లే' కి అధిక సమయం కేటాయించాలి. కొక్కోకుడు చెప్పిన వివిధ కృత్యాల్నే ఫోర్ ప్లే గా ఆధునికులు చెబుతున్నారు.

సెక్స్ ఊహకే మగవారు సిద్ధం కావొచ్చు గాని స్త్రీలు త్వరగా సిద్ధపడరు. వారి కామనాడుల్ని ఫోర్ ప్లే ద్వారా కదిలించాలి. స్పర్శ, కౌగిలి, ముద్దు ద్వారా వారిలో కోరిక రగిలించాలి.

స్తనాలు, అధరాలు, బుగ్గలు, గడ్డము, పిరుదులు – స్త్రీ యొక్క కళాస్థానాలు. వాటి ద్వారా ఆమెకి కామోద్రేకం కలిగించాలి.

ఫోర్ ప్లే ద్వారా ఆమెని శృతి చేస్తే చాలు ఎన్ని రాగాలైనా పలుకుతుంది. అద్భుతానందాన్ని అందిస్తుంది. తానూ ఆనంద స్రవంతిలో కొట్టుకుపోతుంది!

రతి సుఖం

స్త్రీ పురుషులు రతిలో క్లైమాక్స్ కెళ్ళి అపూర్వానందాన్ని పొందే స్థితిని భావప్రాప్తి (orgasm) అంటారు.

అది చేరడానికి ఫోర్ ప్లే, ప్లే, పోస్ట్ ప్లే అని మూడు దశలున్నాయి.

ఫోర్ ప్లే గురించి పైన చెప్పడం జరిగింది.

ఇక ప్లే. అంటే రతికార్యం. సంభోగం. ప్రేరణనీ ఉద్రేకాన్నీ పొంది ఇద్దరి శరీరాలూ గాఢ ఒత్తిడిలో ఒకటై పోయి సృష్టి కార్యాన్ని జరపటం.

సంభోగంలో అలసిన జంట ఒకర్నొకరు ముద్దాడటం, ముంగురులు నిమరడం, హత్తుకుని పడుకోవడం – 'పోస్ట్ ప్లే'. తృప్తిని కలిసి అనుభవించడం అన్నమాట.

స్త్రీ సిగ్గు పడకూడదు

శృంగారానుభూతిని స్త్రీలు సంపూర్ణంగా పొందాలంటే సిగ్గు పడకూడదు.

తమనెక్కడ స్పర్శిస్తే సుఖానుభూతి కలుగుతోందో భర్తకు చెప్పాలి.

యోని పై భాగంలో వుండే క్లిటోరిస్, యోని పెదవులు, పెరీనియం, చనుమొనలు, చెవి వెనుక భాగం, మెడ, నడుం వెనుక, కింది భాగం – ఇవన్నీ స్త్రీలలో శృంగారానుభూతుల్ని రెట్టింపు చేస్తాయి.

పురుషుడు వాటిని ఫోర్‌ప్లేలో తగిన విధంగా స్పృశించాలి. తాకాలి. ముద్దిడాలి. మైమరపించాలి. అప్పుడే ఆమె మైనపు బొమ్మగా మారుతుంది!

సెక్స్ ఫోబియా

కొందరు స్త్రీ పురుషులు వివిధ ఫోబియాల వల్ల శృంగార జీవితానికి విముఖులుగా వుంటారు.

భర్తకి ఆమె మీద అనుమానం, మానసిక శారీరక వేధింపు, ఆమె సౌఖ్యం గురించి పట్టించు కోకుండా ప్రవర్తించడం, భయాందోళనలు కలిగించడం, శృంగారమంటే

పాపమన్న భావన, లైంగిక జ్ఞానం లేకపోవడం, జడత్వం – ఆమెలో సెక్స్ ఫోబియా కలిగించవచ్చు

అధిక ఒత్తిడి, సరిగ్గా పెర్ఫార్మ్ చెయ్యలేనేమోనన్న భయం, మగతనం లేదను కుంటుందేమోనన్న ఆందోళన, ఇష్టంలేని సమయంలో భాగస్వామి ఒత్తిడి – మగాడిలో ఫోబియాకి కారణాలు కావచ్చు.

మందులు, కౌన్సెలింగ్ వంటి చికిత్సల ద్వారా వాటిని పోగొట్టుకోవచ్చు.

భార్యాభర్తల మధ్య ఉద్వేగ పరమైన అనుబంధాన్ని మరింత పటిష్టం చేసేది శృంగారమని గుర్తుంచుకోవాలి. దాన్ని పూర్తిగా అనుభవించడం భార్యాభర్తల హక్కుగా భావించి తమని తాము అందుకు సంసిద్ధం చేసుకోవాలి!

డాక్టర్ని సంప్రదించండి

ఊహాకీ వాస్తవానికీ మధ్యగల అగాథానికి బెదరి పోతూంటారు కొందరు. నిరాశా నిస్పృహలకీ తద్వారా డిప్రెషన్కీ లోనవుతారు.

కొందరికి శీఘ్రస్కలనం సమస్య అయితే మరి కొందర్ని ఫ్రిజిడిటీ బాధిస్తుంది.

ఎన్నో అపోహలూ అనుమానాలూ భయాలూ కూడా వుండొచ్చు.

అలాంటి వారు వాటిని లోలోపలే దాచుకుని అశాంతి పాలు కాకుడదు. మిగతా అనారోగ్యాల్లాగానే ఇదీ అనుకోవాలి. ప్రతి సమస్యకీ పరిష్కారం, ట్రీట్మెంట్ వుంటాయని మర్చిపోకూడదు.

నకిలీ డాక్టర్ల ప్రకటనల మాయలో పడిపోకుండా తిన్నగా డాక్టర్ దగ్గరికెళ్ళి సమస్తం వివరించాలి. సిగ్గు పడకుండా చెప్పి ఉపశమనం పొందాలి.

శృంగార జీవితపు ఆయుష్షును రెట్టింపు చేసుకోవాలి!

నిరాసక్తత వద్దు

పడక గది ప్రయోగాల వేదిక కావాలి గాని చర్చావేదిక కాకూడదు. సమస్యల్ని బూతద్దంలో చూసుకునే ప్రదేశమూ దెప్పుకునే స్థలమూ కానీకూడదు.

బాధ్యతల వెంట వచ్చే బరువులు, వయసు మోసుకొచ్చే అనారోగ్యం, పదే పదే అదే అనుభవమన్న నిర్లిప్తత శృంగార జీవితాన్ని నిస్సారం చేస్తాయి. నిరాసక్తత కల్గిస్తాయి.

వాటిని మీ బెడ్ మీదకి ఎక్కనీకుండా జాగ్రత్త పడాలి!

నిత్య నూతనం కావాలి

దంపతుల మధ్య శృంగారం నిత్యం నూతనంగా వుండాలి. వారి పెళ్లి పుస్తకంలోని ప్రతి పేజీ రసభరితం కావాలి.

పడక గది బయట కూడా స్పర్శ, చిర్నవ్వు, సరస సంభాషణ, క్రేజీ లుక్స్ వగైరాలతో కవ్వించుకుంటూండాలి.

మధుర రాత్రుల్ని గుర్తుచేసుకోవాలి. మధురోహలల్లు కోవాలి.

రోజూ ఒకే రకమైన భంగిమ గాకుండా వివిధ రతి భంగిమలతో శృంగారంలో మునిగితేలాలి.

అభ్యంగన స్నానాలూ, మసాజ్‌లు, ఫాంటసీలు మీ ఇష్టం! ప్రతి రాత్రీ వసంత రాత్రి చేసుకోవాలి!

అలాగని 'అతి' వద్దు. సెక్సే లోకమన్నట్టు ప్రవర్తించ వద్దు. లిమిట్‌లో వుంటేనే అందం ఆనందం ఆరోగ్యం!

ఏం చేసినా ఎలా చేసినా మీ జీవిత భాగస్వామితోనే. అక్రమ సంబంధాల వంక కన్నెత్తి కూడా చూడొద్దు. ఆఫీసు ఫైళ్ళనీ లాప్‌టాపుల్నీ పొరబాటున కూడా గదిలోకి ప్రవేశించనివ్వొద్దు.

పడకటింటిని జయించిన వాడే విశ్వవిజేత కాగలడంటారు రసజ్ఞులు!

42

భార్యాభర్తల అనుబంధం



భారతీయ ధర్మానికి మూలస్తంభం కుటుంబం.

కుటుంబానికి మూలాధారం దాంపత్య ధర్మం. కాలగతిలో ఎన్ని పరిణామాలు సవాలు చేసినా ఈ ధర్మమే పరంపరను నిలబెట్టింది.

భార్యాభర్తల సంబంధం ఎలా వుండాలో ఆదర్శాలతో సహా వైదిక సంప్రదాయం స్పష్టం చేసింది.

'హాయిగా ఆలుమగలై కాలం గడపాలి, వెయ్యేళ్ళు మీరనుకూలంగా ఒకటై మెలగాలి' అని దాంపత్య బంధాన్ని నిర్వచించారో సినీకవి.

హరివిల్లు లాంటి దాంపత్యంలో ఎన్ని రంగులో! మరెన్ని రాగాలో!

స్నేహ బంధం

'పురుషునకు దైవ మిచ్చిన స్నేహితులెవరు ?' అని యక్షుడు ప్రశ్నిస్తే '**భార్యా దైవకృతా సఖా**' అని సమాధాన మిచ్చాడు ధర్మరాజు. అంటే భార్యే దైవ మిచ్చిన స్నేహితుడు.

సప్తపదిలో 'ఏడడుగులు వేసి నువ్వు నా స్నేహితుడివైతివి. మనం ఎప్పుడూ స్నేహితులుగా వుందాం. నాకెప్పుడూ నీ స్నేహం కావాలి. నేన్నీ స్నేహం విడువను. నువ్వూ నా స్నేహం వీడవద్దు' అంటాడు వరుడు.

యజుర్వేదంలో స్నేహధర్మం గురించి 'స్నేహితునిగా భావించే వారిని పరిత్యజించ రాదు. మిత్రుని వదిలిన వారికి ధర్మంలో భాగం వుండదు. పుణ్యమార్గం అతడికి గోచరించదు' అని చెప్పబడింది.

స్నేహ బంధమైన దాంపత్యంలో దీనిని సదా గుర్తుంచుకోవాలి.

పెళ్లితో ఒకటైన భార్యాభర్తలది ఆజన్మ స్నేహబంధం!

ప్రేమ బంధం

పెళ్లి ఒక ప్రేమ బంధమే. హీరోలైనా జీరోలైనా వారి బంధాన్ని ముడివేసేది ప్రేమే.

ఒకరి మీద ఒకరికి ప్రేమ వుండాలి. అంతా ఇంతా కాదు ఒకరి కోసం మరొకరు ఏమైనా చెయ్యగలంత ప్రేమ వుండాలి. ఆ ప్రేమ ఎవరూ విడదీయ లేనంత బలమైన బంధంగా మారాలి.

ఒక్కోసారి సహనం కోల్పోవచ్చు. ఆవేశపడొచ్చు. అభిప్రాయభేదాలు రావచ్చు. కోపం తాపం ఏమైనా రావచ్చు.

అయినా వారి బంధం చెక్కుచెదరకుండా వుంటుందంటే దానిక్కారణం ప్రేమ. ప్రేమ వున్నచోట క్షమ వుంటుంది. నిజాయితీ వుంటుంది. నమ్మకమూ గౌరవం వుంటాయి. అంకిత భావం వేరూనుతుంది.

శిఖరాలని అధిరోహించినా అగాథాలలోకి జారిపడినా ఒకరి చెయ్యి ఒకరు విడవనివ్వనిది ప్రేమధర్మం.

ఆ ప్రేమను ఒక సువ్యవస్థగా నిలబెట్టే అపూర్వబంధమే దాంపత్యం!

అహం లేని బంధం

"ముసలితనం రూపాన్ని, ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాన్ని, అసూయ ధర్మా చరణను, క్రోధం సంపదను, కామం సిగ్గును, గర్వం సమస్తాన్నీ హరిస్తుంది" అంటుంది విదురనీతి.

మానవుని పతనానికి దారి తీసే ముఖ్య శత్రువు అహంకారం.

అశాంతికి మూలకారణం 'నా అంతటివాడు లేడు. నే చెప్పిందే వేదం' అనే మనస్తత్వం.

అహం వున్న వ్యక్తి అందరిచే ద్వేషింపబడతాడు. 'ఇగో' పతనానికి నాంది.

దాంపత్య బంధంలో ఇలాంటి అహానికి తావులేదు.

భర్త తను అధికుడ్నని విర్రవీగకూడదు. సంసార రథచక్రాలు రెండిట్లో తనొకటి మాత్రమే. చక్రాల్లో తేడావుంటే బండి నడక సవ్యంగా వుండదు.

అహంకారాన్ని త్యజించి అంకితభావం పెంచుకోవాలి.

వారి మధ్య సమభావం వెల్లివిరియాలితప్ప సమరభావం వుండ కూడదు.

అహంకారం నిండిన 'నేను' గాక వినయాన్ని నింపుకున్న 'మేము' గా వర్ధిల్లాల్సిన బంధం ఇది!

స్పర్శానుబంధం

ఒత్తిడిని తగ్గించి భయాన్ని తుంచి అభద్రతని పోగొట్టి భరోసా ఇచ్చి మానసిక బలాన్ని చేకూరుస్తుంది జీవిత భాగస్వామి స్పర్శ.

నిజానికదో పరుస వేది.

భార్యాభర్తలది మామూలు స్పర్శ కాదు. ఆత్మీయ స్పర్శ. బలీయమైన స్పర్శ. దాని మహత్తు అమోఘం!

చేయిచేయి పట్టుకోవడం, భుజం మీద వాలడం, గుండెల మీద రాయడం, ఒడిలో పడుకోవడం, హత్తుకుని నిద్రించడం, ముద్దు పెట్టుకోవడం - ఇవన్నీ స్పర్శ యొక్క వివిధ వర్ణాలే.

ఆరోగ్యానికీ ఆనందానికీ అది చాలా ముఖ్యం.

దాంపత్య బంధ పటిష్ఠతకు ఈ స్పర్శానుబంధం చాలా ముఖ్యం!

లైంగిక బంధం

జంతువుల్లాగే మనిషికీ ప్రత్యుత్పత్తి కాంక్ష వుంటుంది.

కాని ఆ కాంక్ష జంతువుల్లోలా ప్రత్యుత్పత్తికే పరిమితమై పోదు.

ప్రేమ సాన్నిహిత్యాలతో బాటు వైవాహిక జీవితానికి శృంగారమూ కీలకావసరమే.

భాగస్వాముల మధ్య సజీవ సంబంధం సెక్స్ మాత్రమే.

వ్యక్తిగత ఆనందానికి అదే మూలం మరి.

ఎయిడ్స్ లాంటివి పొంచి వున్న ఈ కాలంలో లైంగిక సంబంధాన్ని పదిలంగా పవిత్రంగా చూసుకోవటం అత్యవసరం.

లైంగిక సంబంధం దాంపత్య బంధాన్ని స్థిరపరుస్తుంది. నిత్యనూతనం చేస్తుంది.

ఉత్తేజ పరుస్తుంది. ఊహల్లో ఊరేగిస్తుంది. వాస్తవంలో సంతుష్టీ సంతృప్తీ అనే అమృతాన్ని అందిస్తుంది!

ధర్మ బంధం

'**గార్హ్వ పత్యాయ దేవాః మహ్యంత్వాం అదుః**' గృహస్థాశ్రమ నిర్వహణకై దేవతలు నిన్ను నాకు ప్రసాదించారని వరుడు చెప్పే మంత్రం!

'**భార్య శ్రేష్ఠతమా సఖా**' అంటుంది స్మృతి.

కుటుంబ సామాజిక బాధ్యతలను ఒక యజ్ఞంగా నిర్వహించడంలో భార్యా భర్తలు కలసి ఉద్యమించాలని వేద బోధ.

'దంపతులారా! మీరిరువురూ కలిసి వర్తించండి. కలిసి ధర్మాన్ని ఆచరించండి. సమాన మార్గాన్ని అనుసరించండి. మీద్వారా వంశమంతా తరించాలి' అంటుంది యజుర్వేదం.

భార్య అంటే సహధర్మచారిణి. అనగా ధర్మం ఆచరించడంలో భర్తతో కలిసి పని చేయవలసింది. ధర్మం సకల పురుషార్థాలకూ సాధనం. ధర్మమే అసాధ్యం అయితే అర్థమూ లేదు పరమార్థమూ లేదు!

ధర్మాచరణకు ధర్మకార్యాలకు స్వధర్మ నిర్వహణకు సంఘధర్మ పాలనకు ముఖ్యమైంది ఆలుమగల బంధం.

ఆయా ధర్మాల నిర్వహణలోనే ఆ బంధపు శాశ్వతత్వం ఆధారపడి వుంది.

ప్రేరణా బంధం

ఆలుమగలు వృత్తిలో ప్రవృత్తిలో ఒకరికొకరు ప్రేరణ కావాలి. ఉత్ప్రేరకం కావాలి. ఉత్తేజితుల్ని చెయ్యాలి.

చేయూత నివ్వాలి. ఉన్నతికి సోపానం అవ్వాలి.

బయటి వారి ప్రోత్సాహం పైకి కన్పించేది మాత్రమే. అసలు శిసలు ప్రోత్సాహం లభించేదీ అభించాల్సిందీ జీవిత భాగస్వామి నుంచే.

చదువు, విజ్ఞానం, కళ, క్రీడ, కెరియర్ – ఏదైనా సరే ఎందులో నైనా సరే రాణించాలంటే ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే రెండో వారి సాయం కావాలి. సహకారం వుండాలి.

ఇంట్లో విజయానుకూల వాతావరణం కల్పించాలి.

గెలిస్తే పొగడాలి. ఓడితే ఓదార్చాలి.

అపజయాలు ఎదురైన వేళ ఓ ఆలంబనై నిలవాలి. గాయాలకు అనునయపు మందు పూయాలి. వెన్ను తట్టి క్రొంగొత్త శక్తిని స్ఫూర్తిని నూరిపొయ్యాలి. నిరాశా నిస్పృహలు దరి జేరకుండా కాపుగాయాలి.

వారెన్నుకున్న రంగంలో మరింత కృషి చెయ్యడానికి మరింతగా దూసుకుపోడానికి అవసరమైతే వారి బాధ్యతలు కొన్ని స్వీకరించాలి. వెసులుబాటు కల్పించాలి. ఆనందాన్నివ్వాలి. మనశ్శాంతికి భగ్నం కలక్కుండా చూడాలి.

అప్పుడే ఒకరి విజయం వెనుక ఒకరు వుండి తీరతారు!

సంతాన బంధం

భార్యాభర్తల అనురాగానికి ప్రతిరూపం సంతానం.

ఇద్దరి రక్తాన్నీ జీన్సు ద్వారా లక్షణాలనీ పంచుకు పుడతారు.

పిల్లల సృష్టి స్థితులకు కారకులు భార్యభర్తలే.

సంతానం కలిగేక వారి బంధం సుదృఢమవుతుంది.

వారి అనుబంధానికి కొత్త భాష్యం చెబుతుంది. కొత్త అనుభూతినిస్తుంది. కొత్త బాధ్యతలు తలకెత్తుతుంది.

సంతానం కోసమేనేమో అన్పించే దాంపత్యబంధం వంశాన్ని తరింపజేస్తుంది. మానవ సమాజాన్ని వికసింపజేస్తుంది.

సమబంధం

దంపతులు అల్ప ఆధిక్య భావనల్ని రానివ్వకూడదు. విమర్శలూ ఎత్తిపొడుపులూ వద్దు. గొప్పలూ వద్దు. నేల విడిచిసాము చెయ్యనూ వద్దు.

ఇద్దరి మధ్యా సమధర్మం సమభావం వెల్లివిరియాలి.

'మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గమూ' అన్నారు శ్రీశ్రీ.

అలాగ కలిసి వుండాలి. కలిసి భోంచేయాలి. కలిసి నడవాలి. కలిసి నిద్రించాలి. కలిసి వినోదించాలి. కలిసి సాధించాలి. కలిసి సంతానానికి ఉజ్వల భవితనివ్వాలి.

'**అనన్యా హిమయా సీతా భాస్కరస్య ప్రభా యథా**' అన్నాడు రాముడు. సూర్యునికి వెలుగులా సీత నాకు వేరు కానిదని అర్థం. దాంపత్యపు ఔనత్యాన్ని తెలిపే గొప్ప వాక్యమది.

ఒకే పరమాత్మ తనను రెండుగా విభజించుకున్నాడనీ అదే ప్రకృతీ పురుషులనీ ఆ అర్థ నారీశ్వర తత్వం వల్లనే సమస్త విశ్వం ఆవిర్భవించిందనీ వేదం చెబుతోంది.

'**త్వ ష్టా జాయా మజన యత్**

తృ ష్టా స్త్వై త్వాం పతిం' *అని ఓ మంత్రం.*

అనగా 'ఓ పురుషుడా! నీ కోసమే పరమేశ్వరుడు ఈ భార్యను సృష్టించాడు. నిన్ను ఆమె కోసం పతిగా సృష్టించాడు.'

ఒకరి కోసం ఒకరు. ఒకరితో ఒకరు. ఒకరిగా ఇద్దరు.

ఒక శరీరంలోని రెండు అర్థాంగాలు

ఒక జీవితంలోని రెండు అర్ధానుస్వారాలు.

రెండు సగాలూ కలిస్తేనే సంపూర్ణత్వం!

భాగస్వామ్య బంధం

భార్యాభర్తలిద్దరూ జీవిత భాగస్వాములు.

సుఖ దుఃఖాలు సమంగా పంచు కోవాల్సిన బంధం. ఇహంలోనే కాదు పరంలో కూడా కొనసాగే ఏడేడు జన్మల బంధమని ఒక విశ్వాసం.

ఆనందమైనా విచారమైనా విజయమైనా విఫలమైనా సరే ఇద్దరూ పంచుకోవాలి. పంచుకున్నప్పుడే ఆనందం రెట్టింపవుతుంది. దుఃఖం సగమవుతుంది.

ఇప్పుడు కావాల్సింది పితృస్వామ్యమూ మాతృస్వామ్యమూ కాదు భాగస్వామ్యమే!

ఇద్దరూ కలిసి ఆలోచించాలి. ఆర్థికాంశాలు నిర్వహించాలి. పిల్లలు, కెరీర్, ఇతర లక్ష్యాల సాధనకు కలిసి కట్టుగా కృషి చేయాలి.

భరించే వాడు భర్త భరించబడేది భార్య అనే అర్థాలు మారిపోయాయి.

స్త్రీ కూడా పురుషుడితో సమానంగా కొండొకచో అధికంగా సంపాదిస్తోంది. ఒకప్పుడు ఇల్లే ఆమెకు సర్వస్వం. ఇప్పుడు కెరీర్ కూడా ముఖ్యమైంది. రెండు పాత్రలూ సమర్థవంతంగా పోషిస్తోంది.

తదనుగుణంగా పురుషుడూ మారుతున్నాడు. అతడి దృక్పథమూ మారుతోంది.

భాగస్వామ్య బంధంగా అంగీకరించి కలిసి నడవటం తప్పనిసరి. ఇది ఇద్దర్నీ విజయుల్ని చేసే ఏకైక మార్గం!

బాధ్యతాబంధం

భార్య బాధ్యత భర్తది. భర్త బాధ్యత భార్యది. పిల్లల బాధ్యత ఇద్దరిదీ.

దాంపత్య యజ్ఞమంటే ఈ బాధ్యతల నిర్వహణే.

రెండోవారి అవసరాలు ఆసక్తులు అభిరుచులు లక్ష్యాలు భయాలు అన్నీ తెలుసుకోవాలి.

బలహీనతల్ని లోపాల్ని అలాగే శక్తియుక్తుల్ని ప్రత్యేకతల్ని తెలుసుకోవాలి.

సంపూర్ణ అవగాహనతో పరస్పర విశ్వాసంతో ప్రేమనమ్మకాలతో చిత్త శుద్ధితో బాధ్యతల్ని నిర్వర్తించాలి.

'జీవితమంతా నీతోనే వుంటాను. రక్షిస్తాను. నడిపిస్తాను. నడుస్తాను. నిలబెడతాను. నీ జ్ఞానం ప్రకాశింపజేస్తాను. నిన్ను తీర్చిదిద్దుతాను. నీక్కావాల్సిన సమస్త శక్తుల్నీ సమకూరుస్తాను' – అని ఒకరికి మరొకరు హామీ ఇచ్చుకోవాలి.

అందుకనుగుణంగా అంకిత భావంతో బాధ్యతా నిర్వహణకు ఇద్దరూ పూనుకోవాలి!

త్యాగబంధం

పెళ్లంటే ఒకర్నొకరు అర్పించుకోవడం. ఎంత అర్పించుకుంటే అంత ప్రేమించగలరు.

ప్రేమకి సరైన పరీక్ష స్వత్యాగమే.

రెండోవారి సుఖసంతోషాల కోసం స్వసుఖాన్ని సైతం త్యాగం చెయ్యడమే దాంపత్య పరమార్థం. భోగాల వల్ల నిజమైన సుఖం లభించదు. త్యాగం, కర్తవ్య పాలన వల్లనే జీవితంలో శాశ్వతమైన సుఖానుభూతి కలుగుతుంది.

స్త్రీలు పూజలూ వ్రతాలూ చేసేది భర్త సుఖశాంతుల కోసమే. పిల్లల క్షేమం కోసమే.

ఒకరికోసం ఏం చెయ్యడానికైనా సిద్ధపడటమే ప్రేమ. అదే సమయంలో చిన్న చిన్న లోపాలనీ బలహీనతల్నీ సహించే క్షమించే స్థాయికి చేరుకోవాలి.

సమయం, డబ్బు, సుఖం, ఆహారం – దేన్నైనాసరే జీవితభాగస్వామి కోసం వెచ్చించాలి. సర్వదా వారికోసం వాటిని వదులుకోడానికి సిద్ధపడాలి. రెండో వారి కళ్ళల్లో మెరిసే మెరుపుల్లో తమ ఆనందాన్ని వెదుక్కోవాలి!

భిన్నత్వంలో ఏకత్వం

వ్యక్తిగా స్త్రీ పురుషులు డిజాల్వ్ ఐ దంపతులుగా సమిష్టి లక్షణాలు అలవర్చుకోవాలి.
అవగాహన, అర్పణ, సంయమనం, సద్భావనతో ఆ స్థితి సాధించవచ్చు.
ఇద్దరూ ఒకటేనన్న సమిష్టి తత్వమే దాంపత్యానికి వెన్నూ దన్నూ.
వ్యక్తి గతమైన ఆసక్తుల్నీ అభీష్టాల్నీ మించి ఎదగాలి.
సమిష్టిగా ఉత్తేజ భరితమైన పరిపక్వతని దంపతులు సాధించాలి!
'**స్వర్గోవై లోకః నాకః**' అంటుంది యజుర్వేదం.
దుఃఖంలేని చోటు స్వర్గమే. దాన్ని ప్రతి ఇలంట్లో ప్రతిష్ఠించాలి దంపతులు!



43

ఉత్తమ భార్య

'భా' అనగా ప్రకాశించు. 'ఆర్యా' అనగా శ్రేష్ఠురాలు.

భార్య అంటే కుటుంబంలో శ్రేష్ఠురాలు.

ఇదివరకు హౌస్ వైఫ్. తర్వాత హోంమేకర్. ఇప్పుడు డొమెస్టిక్ ఇంజినీర్!

ఇంటిని దిద్దేది ఇల్లాలేగా!

'అర్థం భార్యా మనుష్యస్య
భార్యా శ్రేష్ఠతమః సఖా
భార్యా మూలం త్రివర్గ స్య
భార్యా మూలస్త రిష్యతి'

'పురుషుడి శరీరంలో సగం గనుక భార్య అర్ధాంగి. స్నేహితుల్లోకెల్ల ఉత్తమ స్నేహితురాలు. ధర్మ అర్థ కామ పురుషార్థాలు మూడింటికీ మూలం భార్యే. మోక్షానికి అంటే సద్గతి పొందటానికి కారణం కూడా భార్యే' అని అర్థం.

'అథో అర్ధోవా ఏష ఆత్మనో యత్పత్నీ' – భార్య అనగా పురుషుని జీవితంలో దేహంలో ప్రాణంలో ఆఖరికి ఆత్మలో కూడా సగం అని శృతి!

స్త్రీలలో రకాలు

బ్రహ్మ వైవర్త పురాణంలో స్త్రీలను సాధ్వి, భోగ్య, కులట అని మూడు రకాలుగా విభజించారు.

పర లోక భయంతో యశః కాముకతతో తన భర్తకు సేవ చేసే స్త్రీ సాధ్వి.

మనోవాంఛానుసారం వస్త్రాభరణాలను ధరిస్తూ కామము చేత స్నేహభావం కలిగి పతి సేవ చేస్తే స్త్రీ భోగ్య.

పురుషుని లక్షణాలు కలిగి యుండే స్త్రీ కులట. ఆమె కపటంతో పతిసేవ చేస్తుంది. కాని అందులో పతిభక్తి ఉండదు. ఈమె కామం పురుషుని కామం కంటే ఎనిమిది రెట్లు, ఆహారం రెండింతలు, నిష్ఠురతలు నాలుగింతలు, కోపం ఆరు రెట్లు ఉంటాయి.

సద్గుణవతి

'కార్యేషు దాసీ కరణేషు మంత్రి
భోజ్యేషు మాతా శయనేషు రంభా ।
రూపేచ లక్ష్మీః క్షమయా ధరిత్రీ
షడ్ధర్మ యుక్తాఖిలు ధర్మపత్నీ ॥'

సద్గుణవతియైన భార్య భర్తకు దాసిలాగా సేవ చేస్తుంది. మంత్రిలాగా ఆలోచన చెబుతూ సముచితమైన సలహాలిస్తుంది. తల్లిలాగా అన్నం పెడుతుంది. రతి సౌఖ్యాన్ని అందించేప్పుడు రంభలాగా వ్యవహరిస్తుంది. రూపంలో లక్ష్మీదేవిలా ముచ్చటగా అలంకరించుకుని చూడచక్కగా ఉంటుంది. సహనంలో భూదేవిలా ప్రవర్తిస్తుందని ఋషి వచనం.

అటువంటి భార్య లభించడం గొప్ప వరమే!

భార్య ధర్మాలు

గృహ శాంతిని సంరక్షించడం. సాంఘిక సంబంధాలు మెరుగుపర్చడం. సత్సంతానానికి జన్మనివ్వడం. భర్తలో ఆధ్యాత్మిక చింతన రగుల్కొల్పడం, ధర్మసాధనకు భర్తతో కలిసి నడవడం – భార్య ధర్మాలన్నారు.

అంటే పురుషుడ్ని నడిపించేశక్తి ఇంటిని చక్కదిద్దుతూ సంతానాన్ని తీర్చిదిద్దే మహాశక్తి స్త్రీయే.

'రేవశక్త్యా యుక్తో యది భవతి శక్తః'

ఆది శంకరాచార్యులు సౌందర్యలహరిలో చెప్పిన ఈ శ్లోకానికర్థం – "ఓ భగవతీ! సర్వమంగళ సహితుడైన ఆ పరమశివుడు కూడా జగన్నిర్మాణ శక్తి వైన నీతో చేరితే తప్ప ఈ లోకాలన్నిటినీ సృష్టించడానికి తగిన సమర్థుడు కాలేకపోతున్నాడు!"

అంటే అమ్మవారే చలన శక్తి అనీ ఆమె లేకపోతే ఆయన ఏమి చేయలేరని భావం!

గృహిణి

నేటికీ భార్యకిది ముఖ్యపాత్రే.

ఇంటిని తీర్చిదిద్దేది ఇల్లాలే. ఇల్లు ఆమె సామ్రాజ్యం.

ఇంటిని మనశ్శరీరాల విశ్రామ మందిరంగా సంతోషాల రేవులా స్వర్గ సీమలా తీర్చిదిద్దాలి.

భర్త ఇంట్లో ఎక్కువ సమయం గడిపేలా అతడు ఉత్సాహంగా ఇంటికొచ్చేలా చెయ్యాలి.

ఇంటినీ పడకగదినీ తీర్చిదిద్దటమే కాదు. వంటింటిని పరిశుభ్రంగా ఉంచాలి. ఆరోగ్యకరమైన రుచికరమైన ఆహారాన్ని వండి ఆప్యాయంగా వడ్డించాలి.

భర్త వ్యక్తిగత సేవలు స్వయంగా చేయాలి.

గృహ నిర్వహణలో అతడికి తోడ్పడాలి. ఇద్దరూ కలిసి గృహకార్యాలు చక్కబెట్టాలి. ఇంటిని చూస్తే ఇల్లాలిని చూడక్కర్లేదన్పించాలి.

అంతేగాక భర్త / కుటుంబ ఆర్థిక స్తోమతకు తగినట్లుగా మసలుకోవాలి.

నారీనింద్యాలు

కలహం, హింస, నింద, ద్వేషం, ఈర్ష్య, భేదము, విలాసం, అనవసరపు ఖర్చులు, ఆడంబరం, విషాదం, నవ్వులాట, ఎగతాళి, వాచాలత, ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం, మోహం, సోమరి తనం, వ్యభిచారం – వీటిని నారీ నింద్యాలుగా పేర్కొన్నారు.

మద్యపానం, దుష్టుల సహవాసం, భర్తకు దూరంగా ఉండటం, ఇష్టం వచ్చినట్లు తిరగటం, అతినిద్ర, పొరుగిళ్ళల్లో ఉండటం – ఈ ఆరు లక్షణాలూ స్త్రీలు చెడిపోయే మార్గాలన్నాడు మనువు.

బిగ్గరగా అరవడం, సణగటం, సాధించడం, మాసిన దుస్తుల్తో ఉండటం, డబ్బు దుబారా చెయ్యడం, ఇతరులతో పోల్చి భర్తని చిన్నబుచ్చడం, భర్త నొచ్చుకునేట్టు ప్రవర్తించడం, పెద్దలముందు అగౌరవంగా మాట్లాట్టం – భార్య చేయకూడనివి. తగనివి. తక్షణం వదులు కోవాల్సిన లక్షణాలు.

ప్రేమ విశ్వాసాలు ముఖ్యం

ఉత్తమ భార్య కావడానికి భర్తమీద ఆకాశమంత ప్రేమ విశ్వాసం ఉండాలి.

'నా వాడు. నేనతడిలోని సగం' అని బలంగా భావించాలి. అతడి అలవాట్లనీ ఆశయాల్నీ ప్రేమించాలి. అతడి కాలిలో ముల్లుదిగితే ఆమె కళ్ళు వర్షించాలి.

భర్తమీద అపరిమిత విశ్వాసం ఉండాలి. అతడెక్కడికెళ్ళినా ఎందరు ఆడవారి మధ్య మసలినా ఆ విశ్వాసం సడలరాదు. అనుమానం కలిగితే విచక్షణాజ్ఞానంతో వ్యవహరించాల్తప్ప అనుమానపీడితయై రెచ్చిపోయి రసాభాసం చెయ్యకూడదు.

దారి తప్పితే మందలించాలి. బంధుమిత్రుల్తో చెప్పించాలి. దారిలోకి తెచ్చుకోవాలి.

వివాహబంధాన్ని విజ్ఞత గల ఏ పురుషుడూ త్రోసి రాజన్లేడు.

అతడి కోసం సర్వం అర్పించడానకి సంసిద్ధపడిన భార్య త్యాగగుణమే అతడ్ని ఆమెకు కట్టి పడేస్తుంది.

ఇద్దరూ ఒకటి తప్ప వేర్వేరు కాదని విశ్వసించాలి. అందుకు తగినట్లుగా ప్రవర్తిస్తే చాలు అద్భుతాలు జరిగి తీరతాయి!

ప్రేమని బట్టే ఒక ఇల్లు స్వర్గం లేక నరకంగా వర్గీకరించవచ్చు!

విద్య విజ్ఞానాలు

విద్య విజ్ఞానాలు పెంచుకోడానికి వయస్సు, పెళ్లి అడ్డురావు.

విద్యావంతులే పిల్లల్ని ఉన్నతంగా తీర్చిదిద్దగలరు. విద్యతో లోకజ్ఞానాన్ని, తెలివితేటల్ని విస్తృత పరచుకోవాలి. లోక పరిశీలన ద్వారానే అది సాధ్యమవుతుంది.

తెలివైన ఆడపిల్ల ఇతరుల్నుంచి నేర్చుకుంటుంది. లోపాలని సరిదిద్దుకుంటుంది. పెళ్లి రోజు నుండే భర్తతో సంతోషంగా ఉండగలుగుతుంది.

అతడి ఆలోచనలకీ, ఆశయాలకీ మెరుగులు దిద్దటమే కాదు వాటి సాధనకు ప్రోత్సహిస్తుంది. చేదోడుగా నిలుస్తుంది.

తన విజ్ఞానాన్ని ఉపయోగించుకునేందుకు కెరీర్ ఏర్పరచుకుంటుంది. అదే సమయంలో వైవాహిక జీవితానికది అడ్డంకి గాకుండా జాగ్రత్త పడుతుంది.

కుటుంబం అన్ని విధాలా ఉన్నత స్థాయికి చేరుకోడానికి తన వంతు బాధ్యతల్ని ఇష్టా పూర్వకంగా నిర్వర్తిస్తుంది!

ప్రత్యేక వ్యక్తిత్వం

భార్య భర్తకి కార్బన్ కాపీలా ఉండాల్సిన పనిలేదు.

తన అభిమానాన్ని విద్యని ఆశయాల్ని నిలుపుకోవాలి. తనదైన వ్యక్తిత్వంతో రాణించాలి. అది సమిష్టి జీవితానికి విఘాతం కల్గించకుండా చూసుకోవాలి.

చదువునీ విజ్ఞానాన్నీ వినియోగించుకోడానికి ఆమెకీ కెరీర్ ముఖ్యమే. ఆర్థిక స్వేచ్ఛ లభించడమేకాదు ఏదో ఎంతో సాధించామన్న తృప్తి, విజయానందం లభిస్తాయి.

ఎన్నుకున్న రంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. లేదా సంఘసేవ చెయ్యవచ్చు. రాజకీయాల్లోనూ ప్రవేశించవచ్చు.

వైవాహిక జీవితానికీ కుటుంబ జీవనానికీ భంగం కలక్కుండా స్వాభిమానంతో సేవాభావంతో విశిష్ట వ్యక్తిత్వంతో రాణించవచ్చు.

స్త్రీ ఆకాశంలోనే కాదు భూమి మీదా సగం అని మర్చిపోవద్దు!

శృంగార నాయిక

పడకటింట్లో భర్త మనోరంజకంగా మసులుకోవాలి. అతడి కోరిక పెరిగేలా నిత్యనూతనంగా ఉండేలా ప్రవర్తించాలి. అతడే కాదు తనూ తృప్తి పడేలా వ్యవహరించాలి.

ఏ ఆటలోనైనా ఒకరే గెలుస్తారు. కాని ఇద్దరూ గెలిచే ఆట సెక్స్.

తనకేం కావాలో ఎలా బావుందో చెప్పాలి. పడక గది మీ ఉమ్మడి రాజ్యం. సిగ్గూ బిడియాలకు స్థానంలేదు. ఆనందోద్ధృతిని పెంచుకోవడమే ముఖ్యం.

తృప్తి కరమైన శృంగార జీవితం ఒకర్నొకరికి కట్టిపడేస్తుంది. ఆనందంగా ఆరోగ్యంగా ఉంచుతుంది. పక్కచూపుల్ని నియంత్రిస్తుంది.

అలకలు అందమేగాని దాన్ని జగడంగా అహం దెబ్బతినేలా మారనివ్వకూడదు. సమస్యల్ని విభేదాలని బెడ్రూంలో అడుగుపెట్టనివ్వకూడదు. శృంగార పదఘట్టనల క్రింద అవి కూడా నలిగిపోతాయి. కరిగిపోతాయి. కనీసం పలచబడి తీరతాయి!

అసూయ అవమానాలు

వీటిని దరిజేర నివ్వరాదు.

ఇతరుల్తో పోల్చుకోకూడదు. వారికున్న దాన్ని చూసి అసూయతో రగిలి పోకూడదు. తమకు లేదని వాపోవడమూ కూడదు.

భర్తని దురదృష్టవశాత్తూ పెళ్లాడాననీ మరొకర్ని చేసుకునుంటే సుఖపడే దాన్ననీ భావించరాదు.

భర్త మీద నిఘా వెయ్యడం, అనుమానంతో సాధించడం, ప్రతిచేష్టనీ ప్రశ్నించడం చేయరాదు. ఎత్తి పొడుస్తూ ఇతరుల్తో పోలుస్తూ చులకనచేస్తూ అవమానించరాదు. వాతావరణాన్ని కలుషితం చెయ్యకూడదు.

సంపాదన తక్కువని, డిగ్రీలు లేవని, ఆస్తిపాస్తుల్లేవని, తెలివితేటలు పూజ్యమని నిందించరాదు. శల్యసారథ్యం చెయ్య కూడదు.

పరిస్థితిని అర్థం చేసుకుని ఆ స్థితి మెరుగు పడేందుకు కృషి చెయ్యాలి తప్ప మనస్సు విరవరాదు.

అత్యాశలు వద్దు

కలలు కనొచ్చు. ఊహా స్వర్గాలూ నిర్మించుకోవచ్చు.

కానవి నేలమీద నడవాలి. వాస్తవపు పునాది మీదే నిర్మించుకోవాలి.

పెద్ద కోరికలు కోరడం, అవన్నీ భర్త తీర్చాలని పట్టుబట్టడం, అధిక గుర్తింపు ఆశించడం, తనకి అత్యధిక ప్రాముఖ్యత నివ్వాలని కోరడం – సరికాదు.

అతిగా ఆశించే భార్య అత్యధికంగా అసంతృప్తిపాలవుతుంది. నిరాశతో నిస్పృహతో అఘాయిత్యాలకు తలపడుతుంది.

ఉన్నదాంతో సంతృప్తి పడుతూనే మరింత సాధించడానికి దాన్ని పునాదిగా మార్చుకునే స్త్రీదే అధిక సంతోషం. అపూర్వ విజయం!

బ్రతుకున బ్రతుకై

శుభాశుభాల్లో భర్తకి తోడునీడగా ఉండాలి. అనుకూలవతిగా ఉండాలి. ఆదర్శమూర్తిగా ఉండాలి.

అనురాగాన్ని తీపి మాటల్లోగాక చేతల్లో వ్యక్తం చేయాలి.

సుఖదుఃఖాలు రెండింటినీ సమంగా పంచుకోవాలి. అతడి బాధ తనదిగా అతడి సంతోషం తనదిగా భావించాలి. అతడి తోడిదే తన బ్రతుకని గుర్తించి తదనుగుణంగా నడచుకోవాలి.

అతడి ఆశయసాధనలో తోడ్పడాలి. ప్రోత్సహించాలి. వెన్నంటి ఉండాలి. స్ఫూర్తిదాయకం కావాలి.

అహం, టెంపర్‌మెంట్ తగ్గించుకోవాలి. అభిప్రాయ భేదాలు రావడం సహజం. వాటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. భీష్మించుకు కూర్చోవడం, ప్రతిదానినీ వ్యతిరేకిస్తూ 'కాంట్రా'గా మాట్లాట్టం తగదు. ఓర్పు నేర్పులతో బాటు క్షమాగుణమూ పెంపొందించుకోవాలి.

అసూర్యంపశ్యగా అంతఃపురంలో పెరిగిన సీత అసాధారణమైన అరణ్యవాసంలోనూ భర్తను వెన్నంటి తిరిగింది.

సమర భూమిలో పతికి వెన్నంటి ఉండి విజయాన్ని చేకూర్చింది సత్యభామ.

అరుంధతి, అనసూయ, లోపాముద్ర వంటి మహర్షుల సతీమణులు వారి భర్తల శాస్త్ర రచనలకు జపతపాలకు పరిశోధనలకు అమూల్యమైన సహకారం అందించారు.

వారి స్ఫూర్తిని మనస్ఫూర్తిగా స్వీకరించాలి!

అధికురాల్నని భావించవద్దు

ఆమె పెద్దింటి అమ్మాయి అయి ఉండొచ్చు. ఆమె వెనుక తరగని ఆస్తులుండొచ్చు. పెద్ద చదువులు చదివి వుండొచ్చు. ఉద్యోగంలో హోదాలో సంపాదనలో పైచెయ్యి కావొచ్చు. అందంగానూ ఉండి ఉండొచ్చు.

అయినప్పటికీ సుపీరియారిటీ కాంప్లెక్స్ ప్రదర్శించకూడదు. తనొకరి భార్యనని ఒక ఇల్లాలినని మరచిపోకూడదు.

సామరస్యంగా సమన్వయంతో సహృదయంతో వ్యవహరించాలి. గర్వంతో పొగరుగా ప్రవర్తించరాదు. భర్తకు నచ్చని పనులు చేయరాదు.

మాటల్లో చేతల్లో అధిక్యతా భావం కన్పించకూడదు.

భార్యా భర్తల మధ్య ఎక్కువ తక్కువల భేదం ఎంత తక్కువ వస్తే అంతెక్కువ ఆనందం ఉంటుంది. అన్యోన్యత ఉంటుంది. ఆప్యాయతానురాగాలు పెరుగుతాయి!

బంధువుల్ని ఆదరించాలి

భర్త తరపు బంధువుల్నీ స్నేహితుల్నీ తనవారిలానే భావించాలి. ఆదరించాలి.

అత్తవారితో సత్సంబంధం నెలకొల్పుకోవాలి. కొనసాగించాలి. అత్తమామల పట్ల చెడు భావన రాకూడదు. చెడు తలపెట్టరాదు.

భర్త తప్ప అతని తరపువారు తన ఇంట్లో ఉండటానికి వీల్లేదన్న మనస్తత్వం అలవర్చుకోకూడదు.

అత్తింటివారితో దగ్గరయ్యేట్లుగా ఉండాలి తప్ప దూరమయ్యేట్లు భర్తని దూరం చేసేట్లు ప్రవర్తించకూడదు.

బంధుగణం అష్టఐశ్వర్యాల్లో ఒకటని గుర్తుంచుకుని మసలాలి!

అందం అలంకారం

అందం పెంచుకోడానికి బ్యూటీపార్లర్లకెళ్లవచ్చు. అలంకరణ మీద శ్రద్ధ చూపనూ వచ్చు.

కానవి తన వ్యక్తిత్వాన్ని పెంచేవిగా ఉండాలి. భర్త సంతోషించే విధంగా ఉండాలి.

నలుగురూ నవ్వేలా వేలెత్తి చూపేలా 'అతి'గా అన్పించకూడదు.

బిగుతైన దుస్తులు మినీలు ధరించి బయట తిరగవద్దు. పరపురుషుల్తో రాచుకు పూచుకుని తిరగొద్దు. విలాస భావాలు ప్రదర్శించ వద్దు.

ప్రవర్తన, ఆహార్యం, వస్త్రధారణ లిమిట్స్‌లో ఉంటేనే వ్యకిత్వానికి వన్నె వస్తుంది. గౌరవ మర్యాదలు లభిస్తాయి!

సహజ సౌందర్యాలు

సుందరమైన రంగు, సుకుమారమైన అంగాలు, నడవడి, దృష్టి, భావ భంగిమ, ఆభరణ సౌందర్యం, వాఙ్మాధుర్యం – బాహ్య సౌందర్యాలు.

ప్రేమ, ఓర్పు, ఔదార్యం, గర్వలేమి, వినయం, సహనశీలం, సమత, శాంతి, ధీరత్వం, వీరత్వం, పరదుఃఖకారుణ్యం, సత్యం, సేవ, అహింస, శీలం. ప్రభుభక్తి – అంతః సౌందర్యాలు.

బాహ్య సౌందర్యాల కంటే అంతః సౌందార్యాల మహత్త్వమధికం. రూపంవంతులైన స్త్రీలు తమ రూప సౌందర్యానికి గర్వించకుండా అంతర్గతంగా సద్గుణాలు సద్భావనలు వృద్ధిచేసుకోవాలి.

'అందం కంటిని మాత్రమే ఆకట్టుకుంటుంది. సౌశీల్యం మనసునంతటినీ దోచుకుంటుంది' – అన్న రామకృష్ణ పరమహంస మాటలు శిరోధార్యం!

పురుషుడు ఇష్టపడేవి

"స్త్రీల వక్షోజాల నుంచి పురుషుడు తొలుత చాలా తెలుసుకున్నాడు. ఆమె ఆరోగ్యాన్నీ, తన సంతానానికి కావాల్సిన ఆహారాన్నిచ్చే వ్యక్తి అనీ, సంతానోత్పత్తి చేసేందుకు తగినదనీ అతనికి అప్పట్లోనే చాలా కొత్తగా తెలిసిన విషయాలు" అంటుంది హెలెన్ ఫిషర్.

పురుషుడికి పెద్దవైన వక్షోజాలు గల స్త్రీ పట్ల ఆకర్షణ కలుగుతుంది. పొడుగు జుట్టు ఇష్టపడతాడు. చక్కని లుక్స్ – మేకప్, మేనరిజమ్స్, డ్రెస్ సెన్స్, మాట్లాడేతీరు – బాగా ఆకర్షిస్తాయి. ఇక కనులు సరేసరి మాటలే కాదు కథలూ చెబుతాయి.

అర్థం చేసుకోగల నేర్పు, సమయస్ఫూర్తి, పదిమందీ మెచ్చుకునే చక్కని ప్రవర్తన, హుందాగా సౌమ్యంగా అలరించే సంభాషణ, గౌరవాన్నిస్తూనే ప్రత్యేకత నిలుపుకునే పద్ధతి – స్త్రీలో పురుషుడు కోరుకుంటాడు.

అనవసర కాలక్షేపం వద్దు

పనీపాటా లేకుండా వుండటం. కాలక్షేపపు కబుర్లకు పెద్ద పీట వేయడం, పగలు ఎక్కువగా నిద్రపోవడం – కూడనివి.

ఇంటి పనుల మీదా ఇంటిని చక్కగా తీర్చిదిద్దటం మీదా హాబీల మీదా దృష్టి పెట్టాలి.

పరిశుభ్రంగా ఉండాలి. పిల్లల అవసరాలు, చదువులు పట్టించుకోవాలి. హాబీలను ఆర్థిక వనరులుగా మార్చుకోవచ్చు.

ఆసక్తి ఉంటే ఉద్యోగం, వ్యాపారం చేసి మీరేమిటో నిరూపించుకోవచ్చు. లేదా సంఘ సేవ చెయ్యవచ్చు.

సమయాన్ని సద్వినియోగ పరచుకుంటూ ఇంటా బయటా గెలవాలి.

ఆరు ఐశ్వర్యాలు

'సిద్ధ లక్ష్మీ : మోక్ష లక్ష్మీ: జయలక్ష్మీ : సరస్వతీ
శ్రీర్లక్ష్మీ : వరలక్ష్మీశ్చ ప్రసన్నా మను సర్వదా'

కార్యసిద్ధి, సత్య విచారణ వలన సిద్ధించే సంసార బంధమోచనం, ఆటంకాలను అధిగమించే జయం, విద్యాస్వరూపం, ఐశ్వర్యం, శ్రేష్ఠత – ఈ ఆరూ లక్ష్మీ రూపాలు. ఐశ్వర్యాలు.

ఇని లభించాలని స్త్రీలు వరలక్ష్మీ వ్రతం చేస్తారు.

వాటి స్ఫూర్తి గ్రహిస్తే చాలు మీ ఇంట ఐశ్వర్యతాండవమే!

పతియే ప్రత్యక్షదైవం

భార్యకి భర్త పరమేశ్వరుడు. గురువు. పూజనీయుడు. స్నేహితుడు. ప్రేమికుడు. ఆమె మనుగడకి ఆధారం. సంతానవతిని చేసి తద్వారా మాతృత్వపు రుచి చూపించే మహా పురుషుడు.

అందుకే అతడ్ని కనిపించే దేవుడన్నారు.

తన సుఖం సంతోషం బతుకు చావు అన్నీ అతడ్తోనే ముడివడి ఉన్నాయి.

అతడు సూర్యుడైతే తను వెలుగు.

అంచేతామె అతడ్తో వినయంగా ప్రవర్తించాలి. మధురంగా సంభాషించాలి. గౌరవించాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ భర్తను మోసగించరాదు. పరపురుషుల్తో అక్రమసంబంధం పెట్టుకోరాదు. భర్త తప్పుల్ని సహనంతో సవరించాల్తప్ప కోప్పడకూడదు. అవమానించరాదు. తెలివి, చదువు, సంపాదనలో భర్తకన్నా ఎక్కువైనా ఆధిక్యత ప్రదర్శించకూడదు. సణగడం, సాధించడం చేయరాదు.

అధర్మకార్యాలకు అవినీతి పనులకు పురిగొల్పకూడదు. పిల్లల సంరక్షణ నిర్లక్ష్యం చెయ్యరాదు. నిరాశతోనో కసితోనో పంతంతోనో ఆత్మహత్యకి తలపడవద్దు. అసలా ఆలోచనే రానీయరాదు. దాంపత్యంలో ఇగోయిజానికి నిరాశానిస్పృహలకి చోటులేదు.

భర్త చక్కని సేవాకార్యాలు ధర్మకార్యాలు చేసేలా ప్రోత్సహించాలి.

చివరిగా మరోమాట

ఉత్తమ పురుషుడ్ని పెళ్లాడినామెకంటె పెళ్లి చేసుకున్నవాడ్ని ఉత్తముడిగా చేసినామె అధిక ఆనందంతో తృప్తితో తులతూగుతుంది!

44

ఉత్తమ భర్త

భర్త అంటే స్త్రీని అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న పురుషుడు, మొగుడు, ప్రభువు, యజమాని అంటుంది నిఘంటువు.

పురుషత్వమంటే ధీరత్వం. ధీమత్వం. ధైర్యం. శౌర్యం.

భర్త అంటే భార్యాబిడ్డల్ని భరించేవాడు. పోషించేవాడు. వారి బాధ్యత స్వీకరించేవాడు – అని జనాభిప్రాయం.

పితృస్వామ్యానుసారం అతడే ఇంటికి యజమాని.

అతడి బరువు బాధ్యతలు ఇంటి గురించి ఇల్లాలి గురించి సంతానం గురించి చాలా అధికం.

ముఖ్యంగా కట్టుకున్న స్త్రీకి నచ్చేలా ఉండాలి. మెచ్చేలా నడవాలి. అలాగని ధర్మాన్ని తప్పకూడదు. ఆమె మనస్సు గెలుచుకోవాలి. ఏడేడు జన్మలకు ఇతడే నా భర్తకావాలని ఆమె కోరుకునేలా ఎదగాలి.

ఆ దిశగా అడుగులు వెయ్యడానికి ఉత్తమ లక్షణాలేవిటో చూద్దాం.

చక్కని వ్యక్తిత్వం

అతడు తనదైన వ్యక్తిత్వం కలిగి ఉండాలి. 'వెన్నెముక' బలంగా ఉండాలి.

కుటుంబ బరువు మోయడానికి కొడుకుగా భర్తగా తండ్రిగా బాధ్యతల్ని నిర్వర్తించడానికి తగిన శక్తియుక్తుల్ని సమకూర్చుకోవాలి. బంధుమిత్రుల్తో సత్సంబంధాలు కలిగి ఉండి పదుగురు మెచ్చే చక్కని గుణగణాలతో విలసిల్లాలి.

తన భార్య సీతలా సావిత్రిలా ఉండాలనుకున్నవారు తాము రాముడిగా సత్యవంతుడిగా ఆదర్శమార్గంలో నడవాలి.

పంచమకారాలు – మద్యం, మాంసం, మత్స్యం, ముద్ర, మైధునం – విషయాల్లో

సంయమనం అవసరం.

శారీరకంగా మానసికంగా ఆరోగ్యవంతుడై ఉండాలి. స్థిరచిత్తం కార్యనిర్వహణా సామర్థ్యం కలిగి ఉండాలి. కోపద్వేషాలను అధీనంలో ఉంచుకోగలగాలి. సత్ప్రవర్తన చక్కని నడవడిక ఆభూషణాలవ్వాలి.

వ్యక్తిత్వాన్ని (Character) కోల్పోతే సర్వాన్నీ కోల్పోయినట్టే. సద్గుణాలను జాగ్రత్తగా పెంచి పోషించుకోవాలి. సమున్నత వ్యక్తిత్వం సంతరించుకోవాలి.

స్త్రీ అందం రూపంలో ఉంటే మగాడి అందం వ్యక్తిత్వంలో ఉంటుంది!

ప్రేమంతా భార్యకే

అతడు భార్యని మాత్రమే ప్రేమించాలి.

పెళ్లికి ముందెవర్నైనా ఇష్టపడ్డా ప్రేమించినా లేక ఎవరి ఆకర్షణలోనైనా పడ్డా అవన్నీ మరచిపోవాలి. ఆ గతాన్ని తుడిచేసి భార్యని మనస్ఫూర్తిగా ప్రేమించాలి.

అతడి మనస్సునిండా ఆమే ఉండాలి. అతడి ప్రేమంతా భార్యకే చెందాలి. అందులో పిసరంత కూడా ఇతరులకు పంచరాదు.

ఆమెని మనసావాచాకర్మణా ప్రేమించటమే కాదు క్రియలోనూ దాన్ని ప్రదర్శించాలి.

ఉదయం లేస్తూనే చిరుముద్దు, మధ్యాహ్నం మినీ కౌగిలి, రాత్రి బిగికౌగిలి, అప్పుడప్పుడూ షికారు, ఏడాదికో మారు విహారయాత్ర – అన్నీ ప్రేమకి ఎక్స్‌ప్రెషన్సే.

ఆమె బర్త్ డే, తమ వెడ్డింగ్ డే లాంటివి గుర్తుంచుకోవాలి. కానుకలివ్వాలి. సర్ప్రయిజ్ గిఫ్టులూ ఇవ్వాలి. పార్టీలకీ ఫంక్షన్లకీ జంటగా వెళ్ళాలి. ఆమెతో కలిసి గడపడం ఆనందదాయకంగా భావించాలి!

సంపాదన ముఖ్యం

ఉద్యోగం పురుష లక్షణం అన్నారు.

అంటే సంపాదించాల్సిన వాడు భర్త అని అర్థం. భార్య కూడా సంపాదించవచ్చు. అయినప్పటికీ అతడు సంపాదించాలి. సంపాదించాల్సిన ప్రాథమిక బాధ్యత అతడిదే.

తల్లిదండ్రుల పోషణకు ధారాపుత్రుల పోషణకు భవిష్యత్ అవసరాలకు ఆశలు తీరడానికి ఆస్తులు కూడబెట్టడానికి అతడు శ్రమించాలి.

తాతతండ్రుల ఆస్తి తనకి వారసత్వంగా లభించినట్టే తనూ తనపిల్లలకూ మనవలకూ

ఆస్తిపాస్తులివ్వాలి.

ఉద్యోగమా వ్యాపారమా స్వయం ఉపాధా లేక మరోటా అన్నది ముఖ్యంకాదు. ఎలాగైనా సరే నీతికి లోబడి నిజాయితీగా సంపాదించాలి.

దొంగతనాలు మోసాలు మాయలు చెయ్యవద్దు. అవినీతి మార్గం తొక్కవద్దు. మీ కుటుంబ సభ్యుల భవిష్యత్తుతో చెలగాట మాడవద్దు. అధర్మ సంపాదన ఆందోళననీ బీపీనీ పెంచటమే కాదు ఏదో రోజున 'హార్ట్ ఎటాక్' తెప్పిస్తుంది. పాపం పండకుండా ఉండదు!

వాటిని నియంత్రించడానికే సంపాదనెలా వచ్చిందో భార్యకి చెప్పాలనీ ఆమెతో సంప్రదించే ఖర్చుపెట్టలనీ అన్నారు పెద్దలు.

సంపాదిస్తే సరిపోదు ప్రణాళికాబద్ధంగా ఖర్చుపెట్టడమూ కొంత దాచుకోవడమూ ముఖ్యమే.

అతి ఖర్చుకూ ఆడంబరాలకూ పోవద్దు. ఇతరులను చూచి వాతలు పెట్టుకోవద్దు. పిసినారిగా మారనూ వద్దు!

దుర్వ్యసనాలు

వెలది, వేట, పానీయం, జూదం, చోరత్వం, అధిక ప్రసంగం, అధిక భోజనం – సప్త వ్యసనాలు.

ఏ వ్యసనపు ఉచ్చులోనూ చిక్కుకోకూడదు.

వాటితోబాటు సిగరెట్లు త్రాగవద్దు. గంజాయి పీల్చవద్దు.

వ్యసనాల్ని ముట్టుకుంటే చాలు అలవాటై కూర్చుంటాయి. ఇల్లూ ఒళ్ళూ గుల్ల చెయ్యటమే కాదు సర్వనాశనం చేసి గాని శాంతించవు.

వ్యవసనపరుల్ని సమాజం సైతం చిన్నచూపు చూస్తుంది. ఆర్థిక ఇబ్బందులూ అప్పులూ పెరుగుతాయి. ఇంటిల్లపాదీ వాటి దుష్ఫలితాన్ని అనుభవిస్తారు. సంతానం మీద చెరగని చెడు ముద్ర వేస్తాయి.

సంతోషాలు ఆవిరవుతాయి. బాధ్యతలసలు గుర్తుండవు.

అదే ప్రత్యక్ష నరకం!

ఇల్లు స్వర్గంకావాలంటే నరకపుదారులైన వ్యసనాల తలుపుల్ని మూసి తాళం వెయ్యక తప్పదు!

గౌరవస్థానంలో భార్య

భార్యనీ ఆమె వ్యక్తిత్వాన్నీ గౌరవించాలి.

ఆమె వంటల్నీ గృహనిర్వహణనీ పరిశుభ్రతనీ అభినందించాలి.

పిల్లల పట్ల ఆమె చూపే శ్రద్ధకు కృతజ్ఞతలు చెప్పాలి.

ఆమెని చిన్నచూపు చూడకూడదు. 'నీకేం తెలీదు' 'నువ్వు తల దూర్చకు' 'నువ్వులోపలికి ఫో' లాంటి మాటల్తో కించపర్చొద్దు. ఖిన్నురాల్ని చెయ్యొద్దు.

స్త్రీ అవమానపడితే అగౌరపరిస్తే అదెంత అనర్థహేతువో వినాశకరమో నిండుసభలో ద్రౌపదీ వస్త్రాపహరణం నిరూపించిన సంగతి మరచిపోవద్దు.

ఆమెలోని విద్య విజ్ఞానం కళ – సమస్తాన్నీ ప్రోత్సహించాలి. ఉద్యోగస్తురాలైతే కెరియర్లో విజయానికి సహకరించాలి. ఆమె టైమింగ్స్ కనుగుణంగా ఇంటినీ పిల్లల్నీ చూసే బాధ్యత పంచుకోవాలి. అవసరమైనప్పుడు ఆమెకి సేవ చెయ్యడానికి వెనుకాడరాదు.

ఆమె హోదా కీర్తి సంపాదన అధికారం చూసి అసూయపడకూడదు. డిప్రెస్ అవ్వరాదు. అదో గర్వకారణమని భావిస్తేచాలు ఆమె సక్సెస్‌ని ఎంజాయ్ చెయ్యగల్గుతారు.

ఆమె వల్ల తప్పు జరిగితే దోషం కలిగితే అనునయంగా చెప్పండి. వివరిస్తూ విశదపర్చండి. క్షమాగుణం ప్రదర్శించండి. అపరాధాన్ని మన్నించండి తప్ప అల్లరి చెయ్యవద్దు.

పుట్టింటి నుంచి డబ్బు దస్కం తెమ్మని ఒత్తిడి తేవద్దు. హింసించవద్దు. ఆకారణంగా అనుమానించ వద్దు. మీ బంధాన్ని దెబ్బ తీసే విధంగా ప్రవర్తించవద్దు. భార్యాభర్తల మధ్య రహస్యాలుండకూడదని గుర్తుపెట్టుకోండి.

ఆమె అవసరాలు తీరుస్తూ ఇంటి పనిలో సాయపడ్తూ ఆమె ప్రేమని మరింతగా చూరగొనాలి. ఆమెని గౌరవిస్తూ మీరు గౌరవింపబడాలి!

ఓర్పూ నేర్పూ కావాలి

వైవాహిక జీవితంలో ఒడిదుడుకులు ఆటుపోట్లు తప్పవు.

వాటిని తట్టుకుని నిలబడాలి.

అభిప్రాయ భేదాలను సామరస్యంగా చక్కదిద్దుకోవాలి. చిన్నదానికి పెద్దరాద్ధాంతం

చెయ్యకూడదు. గోటితో పోయే దానికి గొడ్డలి కోసం వెదక్కూడదు.

సమయ సందర్భాల్ని బట్టి సంయమనంతో వ్యవహరించాలి. ఓర్పుతో వ్యవహారాలు చక్కబెట్టుకోవాలి.

కోపావేశంతో భార్యని తిట్టడం, కొట్టడం, నిందించడం అవమానించడం చెయ్యకూడదు.

ఎట్టి పరిస్థితుల్లోనూ వివేకం కోల్పోకుండా నేర్పుగా కార్యాలు చక్కదిద్దుకోవాలి.

అపజయాలెదురవుతాయి. నిరాశా నిస్పృహలు చుట్టు ముడతాయి. ఆర్థిక సమస్యలు కృంగదీస్తాయి. అయినా వెరవ కూడదు. వెన్నివ్వ కూడదు. ఆత్మహత్యలాంటి పిరికి చర్యలకు తలపడ కూడదు.

మీమీద భార్యా బిడ్డలు తల్లిదండ్రులు ఆధారపడి ఉన్నారని గుర్తుంచుకోవాలి. కుటుంబ సభ్యుల సహాయసహకారాలతో చక్కని కార్యాచరణతో ప్రయత్నించండి. పట్టుదలతో దీక్షతో శ్రమించండి. విజయం మీదే!

భార్య కాదు అర్థాంగి

“హిందూ ధర్మంలో స్త్రీకి శ్రేష్ఠస్థానం ఇవ్వబడ్డది. మనం సీతారాములు అంటాంగాని రామసీతలు అనము. సీతా సావిత్రులు లేనిచో రామసత్యవంతులను ప్రపంచం గుర్తించదు” అన్నారు గాంధీజీ.

తన లాగే ఆమెకీ కోరికలూ ఆశలూ ఆకాంక్షలూ ఆశయాలూ హక్కులూ బాధ్యతలూ ఉంటాయని గుర్తించాలి. శరీరంలోనే కాదు మనస్సులో కూడా సగం ఆమేనని, ఆమెదేనని గుర్తించాలి.

కష్టసుఖాల్లో సగం పాలుపంచుకునే భార్యని ప్రేమాభిమానాలతో చూడాలి. గౌరవించాలి. అన్నిటా సముచిత స్థానమివ్వాలి. సలహాలు తీసుకోవాలి. సమిష్టిగా ఆలోచించాలి.

‘మొగుడి’ లా అధికారం చెలాయించడం నియంతలా ఆజ్ఞల్ని జారీ చెయ్యడం కూడని పనులు!

తల్లా? పెళ్లామా?

జీవన శైలి తేడాలవల్ల అత్తాకోడళ్ల మధ్య అవగాహనా లోపాలు తలెత్తుతాయి. విభేదాలొస్తాయి. సమస్యలేర్పడతాయి.

వాటిని పరిష్కరించడంలో అతడు సున్నితమైన పాత్ర పోషించాల్సి ఉంటుంది.

ఒకవైపు మాతృత్వపు మధురానుబంధం. మరోవైపు భవిష్యత్ జీవితగమనం.

ఒకరు జన్మనిస్తే రెండవవారా జన్మని ధన్యం చేస్తారు.

ఇద్దరూ ముఖ్యమే. ఎటు మొగ్గినా మరొకరి మనస్సు గాయపడుతుంది.

తల్లిని దూరంగా ఉంచి ఆర్థిక సాయం చేస్తూ ఘర్షణ నివారించవచ్చంటారు కొందరు. అదెంతవరకూ ఆచరణీయమో ఆలోచించాలి.

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే మాత్రం ఇల్లూ పిల్లల్ని చూడటం కోసం తల్లిని ఆదరిస్తున్నారు. అవసరం గనుక సర్దుకుపోతున్నారు.

ఎవరికీ బాధకలక్కుండా ఇద్దర్నీ ఆదరించాలి. అదెలా అన్నది వారి వారి పరిస్థితుల్ని బట్టి నిర్ణయించుకోవాలి. ఇద్దర్నీ సంతుష్టుల్ని చెయ్యడంలోనే కుటుంబ శాంతి వుంది!

శృంగార రసానందం

దాంపత్యంలో ముఖ్యమైంది శృంగారం.

భార్య తన కామం తీర్చే యంత్రంగా గాక ఆమెదీ అనుభూతుల శరీరమని గుర్తించాలి. శృంగార క్రీడలో ఆమె సైతం ఉత్సాహంగా పాల్గొనేలా ప్రోత్సహించాలి.

ఆమెని సంతోష పెట్టేదిగా సంతృప్త పరిచేదిగా ఉండాలతడి ప్రవర్తన. రాత్రి అయ్యేకే తను గుర్తొస్తానని ఆమె భావించేట్లుగా అతడి ప్రవర్తన ఉండకూడదు.

ఎక్కువకాలం భార్యాభర్తలు ఒకరికొకరు దూరంగా ఉండటం మంచిదికాదు.

అలాగే పడకగదిలోకి ఆఫీసు పనినీ కంప్యూటర్నీ టీవీనీ ప్రవేశించనీయవద్దు!

స్త్రీ కోరుకునేది

ఆనందకరమైన దాంపత్య జీవితాన్ని ఆమె కోరుకుంటుంది. భావనాత్మకమైన బంధాన్ని ఆశిస్తుంది. స్థిరభద్రతని కాంక్షిస్తుంది.

ఆపైన పిల్లల్నీ సొమ్ముల్నీ కోరుకుంటుంది.

ఏది తగ్గినా అసంతృప్తి ఫీలవుతుంది.

స్థితిగతుల్ని విప్పి చెప్పడం ద్వారా ఆమె అసంతృప్తిని పోగొట్టాలి. సంపాదన, ఉద్యోగం, అక్రమ సంపాదనల గురించి సైతం వాస్తవాల్ని ఆమెకి చెప్పాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అబద్ధాలు చెప్పవద్దు.

మంచి అయినా చెడు అయినా ఇద్దరికీ తెలిసే జరగాలి. ఒకర్నొకరు సరైన మార్గంలోకి మళ్లించలేకపోతే ఫలితం – అదెలాంటిదైనా ఇద్దరూ అనుభవించాల్సుంటుంది.

భార్య ఆశల్ని అర్థం చేసుకోవాలి. అత్యాశలకు ఆజ్యం పోయకూడదు.

ఆమెని తృప్తి పరచాలి. అందుకోసం అడ్డదార్లు తొక్కరాదు!

భార్య స్థానం తెలుసుకోవాలి

ధర్మార్థ కామాలలో భార్య భర్తకు సహాయురాలుగా ఉంటుంది.

గృహస్థుడు ఇహలోక యాత్రను సక్రమంగా సాగించటానికి అతడి ధర్మపత్ని అందించే సహాయం వేరెవరూ అందించలేరు.

మనశ్శాంతిని కలిగించే మహాద్భుత శక్తి భార్య మాత్రమే.

భార్యవంటి బంధువు మరొకరు లేరు. ఆమె వంటి ఉత్తమగతి కూడా మరొకరు లేరు.

ధర్మసంపాదనలో భార్యకంటే ఎక్కువగా ఉపకరించేవారూ లేరు.

బ్రహ్మ తన నాలుకపై సరస్వతికి స్థానమివ్వగా విష్ణువు వక్షస్థలాన్నే లక్ష్మికి ఆసనం చేశాడు. ఇహ మహేశ్వరుడు దేహంలోని అర్ధభాగాన్ని పార్వతికిచ్చేశాడు.

'సీతయా రహితోహం వైనహి జీవామి లక్ష్మణ

నహి పశ్యామి వైదేహీం ప్రాణేభ్యోపి గరీయసీం'

సీతా వియోగం జరిగినప్పుడు "సీత లేకపోతే నేను బతకలేను. సీత నా ప్రాణాలకంటే గొప్పది" అని లక్ష్మణుడితో చెప్పి వాపోతాడు రాముడు.

భార్య ముంతాజ్ చనిపోతే ఆమెని 'బ్రతికించడానికి' షాజహాన్ చేసిన ప్రయత్నరూపమే తాజ్‌మహల్!

వర్క్‌హోలిక్ కావద్దు

ధన సంపాదన అవసరమే. అందుకు పని చేయాల్సిందే.

అలాగని వర్క్ హోలిక్‌గా మారవద్దు.

నిర్దేశించిన లక్ష్యాల్ని సాధించాల్సిందే.

అందుకని పూర్తిగా పనికి అంకితమై పోవద్దు.

పని ఒత్తిడి పెంచుకుంటూపోతే నిర్వేదానికి నిస్తేజానికి అసంతృప్తికి దారి తీయవచ్చు. నిద్రలేమి, అలసట బాధించవచ్చు.

కుటుంబ జీవితంలోని ఎన్నెన్నో మధురక్షణాలు చేజారనూవచ్చు. పనికీ ఇంటికీ మధ్య విభజన రేఖ గీసుకోక తప్పదు!

ఎంత బిజీగా ఉన్నా కుటుంబ సభ్యులకు కొంత సమయాన్ని కేటాయించాలి. వారితో రిలాక్స్‌డ్‌గా గడపటం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. బీపీ, గుండె జబ్బులు నివారించవచ్చు.

జిమ్ కెళ్ళడం, యోగా చెయ్యడం, గుడి కెళ్ళడం, హాస్య సినిమాలు చూడటం, మంచి పుస్తకం చదవటం – మానసిక ప్రశాంతిని చేకూరుస్తాయి. వాటివల్ల పనిని మరింత శ్రద్ధగా చెయ్యగలుగుతారు. సామర్థ్యాన్నీ పెంచుకోగల్గుతారు.

విహార వినోదాలు

ఆమెకీ విహార ప్రీతి ఉంటుంది. రోజువారీ పనుల ఒత్తిడి నుంచి ఆమెకీ రిలీఫ్ కావాలి. అలరించే వినోదం కావాలి.

అతడితో కలిసి ఎక్కువ సమయం గడపాలని ఆమె భావిస్తుంది. సాహచర్య సుఖం గ్రోలాలని చూస్తుంది.

అది తీరాలంటే సినిమాలకీ షికార్లకీ వెళ్ళాలి. అప్పుడప్పుడూ వంటమాన్పించి హోటల్‌కి తీసుకెళ్ళి కొత్తరుచులు రుచి చూపించాలి. విహారయాత్రలకీ తీర్థయాత్రలకీ వెళ్ళి మరింత దగ్గరవ్వాలి.

వినోద విహారాలు టానిక్‌లా పనిచేస్తాయి. కొత్త శక్తినిస్తాయి!

బంధుమిత్రుల్ని ఆదరించాలి

తన బంధువుల్నీ స్నేహితుల్నే కాదు భార్య బంధుమిత్రుల్ని కూడా ఆదరించాలి.

వారితో కలిసిపోవాలి తప్ప దూరంగా జరగటం ముభావంగా ఉండటం చెయ్యకూడదు.

శుభాశుభకార్యాలకు వెళ్తూ వారితో అనుబంధాన్ని పెంచుకోవాలి.

గృహసామ్రాజ్ఞి

'సామ్రాజ్ఞీ శ్వశురే భవ' (నా గృహానికి నువ్వు సామ్రాజ్ఞివి)

'మూర్ధానాం వయ్యురారోహి' (పతినైనా నా శిరస్సుపై అధిష్టించు).

ఉత్తమ స్థానంలో గౌరవించదగినది ఇల్లాలేనని వైదిక వివాహమంత్రాలు బోధిస్తున్నాయి.'

'అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైన నియోజయేత్।
శౌచే ధర్మేన్న పక్త్యాంచ పారిణాహ్యస్య చేక్షణే॥'

'ఆర్జించిన ధనాన్ని భార్యకు అధీనం చేయాలి. ధన రక్షణ వ్యయాలపై ఆమెయే అధికారిణి. గృహంలో సదాచారంలోనూ శౌచంలోనూ ధర్మంలోనూ ఆహారంలోనూ ఆమెదే పూర్ణ అధికారం' అని మనుస్మృతి ఉపదేశం!

స్వర్గసీమ

'కలకంఠి కంట కన్నీ రొలికిన సిరి ఇంటనుండనొల్లదు' అన్నాడు సుమతీ శతకారుడు.

తల్లి, భార్య, అక్క, చెల్లి, మేనత్త, కూతురు, కోడలు - ఇంట్లోని స్త్రీ ఎవరైనా గానీ ఏకారణం చేతనైనా గాని బాధపడకూడదు. వారినందర్నీ సంతోషపెట్టవలసిన బాధ్యత మగవారి మీద ఉంది. అది నెరవేరిస్తే ఇల్లు స్వర్గసీమే!

పురుషుడి ప్రతి విజయం వెనుక ఒక స్త్రీ వుంటుందన్నది సత్యం. ఆమె సహకారం ప్రోత్సాహం లేకపోతే అతడేమీ సాధించలేడు.

ఇల్లు స్వర్గంగా మారాలంటే ఇంట్లో శాంతి సౌఖ్యాలు తిష్ఠవెయ్యాలంటే ఆమెను విశ్వాసంలోకి తీసుకోవాలి. ఆమె మాటలు ఆలకించాలి. గృహ కార్యక్రమ నిర్వహణలో సమిష్టిగా వ్యవహరించాలి.

స్వార్థరహితంగా అభిమాన పూర్వకంగా త్యాగభావనతో తనవారి సుఖసంతోషాలే లక్ష్యంగా వ్యవహరించిన వాడే ఉత్తమ భర్త అవుతాడు.

45

అన్యోన్య దాంపత్యం



దంపతుల్దిరూ విడివిడిగా ఉన్నతులుకావచ్చు. ఉత్తములూ కావచ్చు.

కాని వారిద్దరూ కలిసి ఎలావున్నారు, ఒకరికోసం ఒకరు ఏం చేస్తున్నారు, వారి సహజీవనం ఏ స్థాయిలో వుందన్నదే వారి అన్యోన్యతకి గీటురాయి.

అన్యోన్య దాంపత్యమంటే భార్యభర్తలిద్దరూ కలిసి ఒకే ఇంట్లో వుండటం ఒకే మంచం మీద పడుకోవడం కాదు.

వారిది అనురాగ పూరిత సంబంధంకావాలి. పరస్పర విశ్వాసం నింపుకోవాలి. ఒకరి గురించొకరు కన్సర్న్ చూపించాలి. తపించాలి. ఒకరి అభీష్టాలు మరొకరు తెలుసుకుని మెలగాలి. తమ బలాల్నీ బలహీనతల్నీ అంగీకరించాలి. చేయి చేయి కలుపుకుని సమిష్టిగా ముందడుగు వేయాలి. పరస్పరావగాహనతో దాంపత్య జీవితాన్ని పండించుకోవాలి.

దాంపత్యం తాంబూలంలాంటిది. ఆకు వక్క సున్నం కలిస్తే తాంబూలం. ఏది తక్కువైనా నోరు పండదు. నమ్మకం, గౌరవం, ప్రేమ కలిస్తే దాంపత్యం. ఏది తక్కువై నా బతుకు పండదు.

స్త్రీపురుషులు ఇండిపెండెంట్ కాదు ఇంటర్ డిపెండెంట్ అని చాటగలగాలి!

ఆదర్శ దాంపత్యం

'అస్యాదేవ్యా యథారూపం అంగ ప్రత్యంగ సౌష్ఠవం
రామస్య చ యథారూపం తస్యేయ మసి తేక్షణా'

అశోక వనంలో వున్న సీత స్త్రీరూపంలో వున్న రాముడిలా హనుమంతుడికి

కన్పించిందిట. 'ఈ సీతారాముల రూపాలు శరీర సౌష్ఠవాలు సైతం ఒకే మాదిరిగా ఉన్నాయే' అని ఆశ్చర్యపోయాట్ట.

ఒకే రకపు ఆలోచనలు, ధర్మాలు, విశ్వాసాలు కలిగి ఇద్దరూ ఒకరిలో ఒకరు ఒకరికోసం ఒకరయ్యారని కవి భావన.

అందుకే వారు ఆదర్శ దాంపత్యానికి ఒక అద్భుత నమూనా అయ్యారు.

ధర్మపత్నీ సమేతస్య...

పూర్వం, "నా పాప పుణ్యాలలో నాభార్యకి వాటా వుంటుందా" అని వాల్మీకి నారదుడ్ని ప్రశ్నించాడు. "భార్యకి భర్త పుణ్యంలో సగం వాటా ఉంటుంది. కాని ఆమెకి అతడి పాపం అస్సలు చెందదు" అని జవాబిస్తాడు నారదుడు.

పెళ్లిలో '**శ్మ శ్రు దత్తం ధరే**' అంటూ వరుడు మెడలో జందెం వేసుకుంటాడు. జంధ్యం ఆచారం లేని కులాల్లో నీటిని ఆచమనం చేసి పోకచెక్కని వేళ్ళతో పైకి విసుర్తాడు.

ఆ క్షణం నుంచీ పుణ్యంలో సగఫలాన్ని భార్యకి ఇవ్వడానికి నిర్ణయించినట్టన్నమాట.

'పత్ని' అనే మాటకి 'యజ్ఞ సంయోగం' అనే అర్థం వల్ల భర్త చేసే ప్రతికర్మ, పూజ, వ్రతాల వల్ల వచ్చే పుణ్యంలో సగం భార్యకు చేరుతుంది. అందుకే 'ధర్మపత్నీ సమేతస్య' అని సంకల్పం చెప్పడం.

దీని భావమేమిటంటే పుణ్యంలో తనకి భాగం వస్తుంది గనుక భర్త చేత పుణ్యకార్యాలు చేయించాలి. పాపంలో భాగం రాకపోయినప్పటికీ పాప కార్యాలు చెయ్యనివ్వకూడదు. చేయనిస్తే అతడు నష్టపోవచ్చు. తత్ఫలితంగా మొత్తం కుటుంబం దుష్ఫలితాన్ని అనుభవించాల్సి రావచ్చు!

ఒకరికొకరు

భార్యభర్తలిద్దరూ ఒకరికోసం ఒకరు అన్నట్లుండాలి. ఒకరి గుండె ఒకరి కోసం తపించాలి.

తన ఆనందం, సుఖం, సంతోషం, బలం, భవిష్యత్తు – అన్నీ కూడా రెండోవారి మీద ఆధారపడి వున్నాయని బలంగా విశ్వసించాలి.

స్త్రీలు తమ పసుపు కుంకాలు చల్లగా వుండాలని కోరుకోవడంలోని అంతరార్థమిదే.

ఆమె తనకోసం పూజలూ వ్రతాలూ చేస్తోంది గనుక ఆమె మీద అతడికి ప్రేమ,

అనురక్తి పెరుగుతాయి. ఆమెని సంతోషంగా వుంచడానికి సుఖపెట్టడానికి ప్రయత్నిస్తాడు. ఫలితంగా వారు మానసికంగా మరింత దగ్గరవుతారు.

డబ్బుకన్నా కెరీర్ కన్నా విలువైంది ఒకటుంది. అది ఒకరి కోసం ఒకరు 'నీకు నేనున్నా' అన్న భావన.

ఒకరి సుఖాన్ని మరొకరు కోరుకోవడం, ఒకరి కోసం మరొకరు బ్రతకడం దాంపత్య పరమార్థం.

అది సాధ్యం చెయ్యడానికిద్దరూ తమ అవగాహనని పెంచుకోవాలి. తమ మధ్య కమ్యూనికేషన్ గేప్ లేకుండా చూసుకోవాలి.

చేయూత ఇవ్వాలి

ఒకరు పడిపోయినప్పుడు మరొకరు లేపాలి. ఒకరికొకరు సహకరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలి.

సంపూర్ణ జీవితానందం పొందటానికి తెలివితేటలూ డబ్బూ దస్కం కాదు భార్యాభర్తలకి ఒకరి మీద మరొకరికి గౌరం, విశ్వాసం, అభిమానం వుంటే చాలు.

సీత, ద్రౌపది భర్త వెంట అడవులకు వెళ్ళారుగాని స్వసుఖం కోసం పుట్టింటికి వెళ్ళలేదు.

ఎంచేతంటే స్త్రీ సుఖం పురుషుడి సన్నిధిలో వుంది. పురుషుడి సుఖం స్త్రీ ముంగిట వుంది.

ఇద్దరి సుఖాలూ పెనవేసుకున్నాయి గనుకే భర్త విజయం కోసం భార్య, భార్య సక్సెస్ కోసం భర్త కృషిచెయ్యాలి. స్ఫూర్తినివ్వాలి. ప్రోత్సహించాలి.

ప్రశంసల పన్నీటిజల్లు

ప్రశంసలు ఆనందపరుస్తాయి. ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయి. సంబంధాలను మెరుగుపరుస్తాయి.

ఒకరి పనిని ఒకరు మెచ్చుకోవాలి. ఒకరి శ్రమను మరొకరు గుర్తించాలి. గౌరవించాలి. ఒకరి విజయాన్ని రెండోవారు సెలబ్రేట్ చెయ్యాలి.

విజయాలు ఎవరు సాధించినా ఇద్దరివిగా భావించాలి.

'నేను' కాదు 'మేం' అన్నభావం మనస్సు లోతుల్లో స్థిరపడాలి.

సంపాదన తెలియాలి

భర్త సంపాదన గురించి బయటి వారికి తెలీకపోయినా ఫర్లేదు గాని భార్యకి మాత్రం తెలిసి తీరాలి. ఇంటి బడ్జెట్ రూపొందించడానికి, భవిష్యత్ అవసరాలకోసం పొదుపు చేయడానికి, తగిన విధంగా ఇన్వెస్ట్ చెయ్యడానికి అది ఉపయోగపడ్తుంది.

ఎంత సంపాదిస్తున్నాడన్నదే కాదు ఎలా సంపాదిస్తున్నాడన్నదీ భార్య తెలుసుకోవాలి.

కుటుంబంకోసం అతడు పడుతున్న శ్రమ, కష్టం తెలియాలి.

భర్త ఆదాయ మార్గాలు పట్టించుకోకుండా సమస్యవచ్చినప్పుడు బుడి బుడి దీర్ఘాలు తీస్తేకాదు. అతడు అక్రమార్జన చేస్తోంటే రాంగ్ రూట్లో వెళుతోంటే రాగల పరిణామాలగురించి ముందే హెచ్చరించాలి. నచ్చచెప్పాలి. లంచాలు ఫ్యూచర్ షాక్స్ అని మరువరాదు.

ఆమె సంపాదనకూ ఇదే సూత్రం వర్తిస్తుంది.

ఒకరికి తెలీని రహస్య సంపాదన రెండోవారికుండకూడదు.

అప్పుడే వారి సయోధ్య చక్కగా వుంటుంది

జాయింట్ బడ్జెట్

ఇద్దరూ కలిసి ఇంటి బడ్జెట్‌ని రూపొందించుకోవాలి.

ఒకరు ఖర్చుమనిషి మరొకరు అతిపొదుపు మనిషి అయితే ఘర్షణ తలెత్తవచ్చు. సంయమనంతో తమ తమ దృక్పథాలను విశ్లేషించుకుని ప్రాధాన్యాంశాల దృష్ట్యా ఆదాయవ్యయ పట్టికను తయారుచేసుకోవాలి.

భార్యాభర్తల బంధాన్ని శాసించే శక్తిని డబ్బుకివ్వకూడదు.

ఖర్చు, పొదుపుల గురించి వ్యక్తిగత విమర్శలు చేసుకోవద్దు.

భవిష్యత్ అవసరాలకు – ముఖ్యంగా విద్య, వైద్య, విహార, మరియు పెళ్లిళ్ళ కోసం వీలైనంత సేవింగ్స్ చెయ్యటం అలవాటు చేసుకోవాలి.

ఆర్థిక పరిస్థితిని బట్టే ఫర్నిచర్, ఆస్తులు కొనుగోలు చెయ్యాలి తప్ప గొప్పలకోసం అప్పులు చేసి కొనకూడదు. సంపాదన తక్కువైతే పెంచుకునే మార్గాలు వెదుక్కోవాలి తప్ప అసంతృప్తితో సాధింపులకు దిగకూడదు.

డబ్బు విషయాల్లో సమన్వయంతో వ్యవహరిస్తే ఇద్దరికీ ఎంతో ఆనందమూ తృప్తీ లభిస్తాయి!

రహస్యాలొద్దు

భార్యా భర్తలమధ్య రహస్యాలూ దాపరికాలూ ఉండకూడదు.

తర్వాతవి బయటపడితే మిమ్మల్ని ఇబ్బందిపెట్టవచ్చు. అపోహ కల్గించవచ్చు. అపార్ధానికి దారి తీయవచ్చు.

ఒకర్నొకరు సంపూర్ణంగా విశ్వసించాలి.

అలాగని పెళ్లికి ముందు చేసిన తప్పుల్ని చెప్పాల్సిన పనిలేదు. అవతలివారు ఎంత అర్థం చేసుకునే వారైనా తర్వాత్తర్వాత తేడాలొస్తే దాన్నే అస్త్రంగా మీ మీద ప్రయోగించవచ్చు.

గతం గతః అనుకోవాలి. ఆ తప్పుల్ని మళ్ళీ రిపీట్ చెయ్యనూకూడదు.

పెళ్లినాటి ప్రమాణాలు

విదేశాల్లో పెళ్లిచేసుకునే ముందు కొన్ని అగ్రిమెంట్లు రాసుకుంటూ వుంటారు.

కేథరిన్ జేటాజోన్స్, మైకేల్ డగ్లస్‌తో రాయించుకున్న ఒప్పందంలో ప్రతి వివాహేతర సంబంధానికీ మిలియన్ డాలర్లు చెల్లిస్తానన్న కండిషన్ ఉందిట.

జెన్నిఫర్ లోపెజ్, బెన్ ఎఫ్లెర్స్‌తో వివాహానికి 'అబద్ధాలాడను. ఆమె కోరినప్పుడల్లా శృంగారంలో పాల్గొంటాను' అని ఒప్పందం రాయించుకుందిట. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిహారమేమివ్వాలో కూడా రాయించిందిట.

అలాటి ఒప్పందాలిక్కడ అవసరంలేదు. స్థానమూ లేదు.

దేవతల సాక్షిగా పెళ్లినాడు చేసిన ప్రమాణాలు చాలు.

ఆజన్మాంతం కలిసుంటామని ప్రమాణం చేస్తారు తప్ప విడిపోతే ఇవ్వాల్సిన నష్టపరిహారం గురించిన ఊహ కూడా రానివ్వరు.

భారతీయ సంస్కృతి మనస్సుకీ మోక్షానికీ విలువిస్తుంది తప్ప భౌతిక సుఖాలకీ విలాసాలకీ కాదు!

శృంగార జీవితం

దాంపత్యానికి మూలం శృంగారం. ఆనందానికీ సంతాన ప్రాప్తికీ శృంగారం అవసరం.

భార్యాభర్తల మధ్య మాత్రమే లైంగిక సంబంధం వుండాలి. ఏక పత్నీ ఏక పతీ వ్రతులుగా వుండాలి. ఎయిడ్స్ లాంటివి వచ్చాక దాని విలువ పాశ్చాత్యులకి తెలిసింది

గాని ఆ బంధపు ఔన్నత్యాన్ని మన ఋషులెప్పుడో కీర్తించారు. ఆచరించాలని ఆదేశించారు.

అక్రమ సంబంధాలు, వ్యభిచారం, దాంపత్యజీవితాన్ని చిన్నాభిన్నం చేస్తాయి.

ఒకరికొకరు విశ్వాసపాత్రులుగా ఉండాలి. కోరికలు నిస్సిగ్గుగా చెప్పుకుని తీర్చుకోవాలి తప్ప పక్క దార్లు పట్టరాదు.

ఆలుమగల కలహాలు అన్నం తినే దాకానే – అన్నారు.

వారికేమైనా కలహాలూ భేదాభిప్రాయాలూ వస్తే పడకగదిలో అడుగుపెట్టగానే వాటన్నిటినీ మర్చిపోవాలి.

పడకగది శారీరకంగానే కాదు మానసికంగానూ దగ్గరచేర్చి సేదదీర్చి వినూత్నోత్సాహాన్ని కలిగించే అద్భుత ప్రదేశం!

సహజీవనం

అరణ్యవాసంలో సీత సుఖంగా జీవించడానికి రామలక్ష్మణులే ఎక్కువ కష్టపడ్డారు. సీత తన ప్రేమను వ్యక్తం చేయటం ద్వారా వెన్నంటి వుండటం ద్వారా భర్తకు గొప్ప ధైర్యాన్నిచ్చింది. ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

సీత అభిలాష, ఆత్మీయత, అనురాగం, ఆత్మవ్యక్తీకరణ రాముడిలో గొప్ప చైతన్యం తీసుకువచ్చాయి.

అదీ భార్యాభర్తలుండాల్సిన తీరు!

సహజీవనం ప్రారంభించగానే స్వభావాల్లో గుణాల్లో అలవాట్లలో ఆలోచనల్లో తేడాలు తెలుస్తాయి.

తనకు అనుకూలంగా ఆమె మారాలని అతడు ఆశిస్తాడు.

పురుషాహంకారాన్నీ ఆధిక్యతనీ భరించలేక అతడు మారితే బాగుడ్ననుకుంటుందామె.

నిజానికి ఇద్దరూ మారాలి. సర్దుకుపోయేతత్వం అలవర్చుకోవాలి. కొంత త్యాగమూ తప్పనిసరి.

కౌగిలిలో ఒకటైనట్టుగానే భేద భావాలు తగ్గించుకుని గౌరవాభిమానాలు పెంచుకుని చక్కని అవగాహనతో వ్యవహరించాలి.

అపార్థాలు కలతలు అశాంతి చెలరేగకుండా జాగ్రత్తపడాలి. ఒకర్నొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. 'మేం ఇద్దరం ఒకటి. కష్టసుఖాలు సమంగా పంచుకుంటాం' అనే పెళ్ళినాటి ప్రతిజ్ఞ గుర్తుతెచ్చుకుని మసలాలి.

సహజీవనం కాస్తా సమజీవనం కావాలి.

సహజీవనంలో గెలుపు, ఓటమి అనే మాటలకి స్థానంలేదు!

ఇంటిపనిలో సాయం

ఇంటిపని ప్రాథమికంగా భార్యదే అయినా ఆమెకి భర్త సహకరించాలి.

ఇద్దరూ ఉద్యోగులైతే ఇంటిపనీ పిల్లలపనీ ఇద్దరూ పంచుకోక తప్పదు. ఇగోలు వుండకూడదు.

ఒకరి టైమింగ్స్, కేంప్స్, డ్యూటీల కనుగుణంగా రెండోవారు సర్దుకుపోవాలి. అప్పుడే వారు ఆయా ప్రొఫెషన్స్‌కు న్యాయం చెయ్యగలుగుతారు.

సహకరించుకోవటం, కలిసి పనిచేసుకోవటం వల్ల పరస్పర గౌరవాభిమానాలు పెరుగుతాయి. కృతజ్ఞతా భావం మనస్సుని ఆర్ద్ర పరుస్తుంది.

సద్విమర్శలకు ఆహ్వానం

తప్పులుంటే విమర్శించడానికి వెనుకాడకూడదు.

సద్విమర్శలు చక్కని సోపానాల్లా ఉపయోగపడతాయి.

వాటితో బాటే సూచనలూ సలహాలూ ఇవ్వాలి.

విమర్శ ఆలోచింప చేసేదిగా ఆత్మవిమర్శ చేసుకునేదిగా వుండాలి. అంతే తప్ప గొడ్డలిపెట్టులా కటువుగా వుండకూడదు. బాధించకూడదు.

విమర్శించేక ఇతర విషయాలు తెచ్చి పొగడాలి. తద్వారా వారి మనస్సును తేలిక పర్చాలి.

ఏకధాటిగా విమర్శలు గుప్పించడం మంచిదికాదు. ఆగ్రహం తెప్పించటమేగాక బంధాన్ని దెబ్బతీసే ప్రమాదముంది!

విశ్లేషణ అవసరం

ఏదైనా సమస్యవచ్చినప్పుడు ఇబ్బంది ఎదురైనప్పుడు ఆలుమగలిద్దరూ కలిసి కూర్చుని డిస్కస్ చేసుకోవాలి.

ఒకరికి తెలిసిన వివరాలొకరికి చెప్పి ఇద్దరి అభిప్రాయాలూ సూచనలూ కలబోసుకోవాలి. విషయాన్ని అన్నికోణాల్లోంచీ విశ్లేషించుకోవాలి.

ఇద్దరూ కలిసి ఒక నిర్ణయానికి రావాలి.

ఫలితం ఎలావున్నా భాగస్వామ్యం బాధ్యతని పెంచుతుంది. బంధాన్ని పటిష్ఠ పరుస్తుంది!

సహనం అలవర్చుకోవాలి

అభిజాత్యాలు, మూర్ఖత్వాలు, సంకుచిత మనస్తత్వాలు, కోపాలు, కలహాలు మానవ సంబంధాలని దెబ్బతీస్తాయి.

వైవాహిక బంధాన్ని సైతం ప్రభావితం చేస్తాయి.

భార్యభర్తలిద్దరూ ఆ విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. సంయమనం పాటించాలి. తెగేదాకా దేన్నీ లాక్కూడదు. పట్టువిడుపులు అవసరం.

దాంపత్య సంబంధం ప్రత్యేకమైనది. విశిష్టమైనది. వ్యక్తుల ఇష్టాయిష్టాలు వైవిధ్యభరితం. సంక్లిష్టం. గనుక సర్దుబాటు తప్పదు.

ఆశావాదం నిరాశానిస్పృహల్ని పారద్రోలుతుంది. అపార్థాన్ని తొలగిస్తుంది.

ఆలుమగల కలహం అద్దం మీద ఆవగింజ నిలబడినంత సేపే వుండాలి.

సహనం స్త్రీలకే పరిమితమైంది కాదు. ఇద్దరికీ ముఖ్యమే. అవసరమే.

దంపతులు సహనంతో వ్యవహరించాలి. నిదానంగా ప్రవర్తించాలి. ఎక్కువ తక్కువలు లింగ వివక్ష ప్రదర్శించకూడదు.

అహానికీ స్వార్థానికీ భార్యభర్తల మధ్యచోటులేదు!

చలం చల్లని మాటలు

'స్త్రీ పురుషులు నిజమయిన స్నేహితులూ దంపతులూ కావాలంటే ఇద్దరికీ సంపూర్ణమైన స్వేచ్ఛవుండాలి. వారిమధ్య ప్రేమబంధమే గానీ అధికారబంధం వుండకూడదు. ఏ ఒక్క విషయంలోనూ పురుషుడు స్త్రీ మీద అధికారం నెరిపే హక్కుదారుగా వుండకూడదు. భర్త బానిసత్వం నుంచి తప్పించుకోడానికి స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలి. గనుక ఆర్జన ముఖ్యం. అందుకు విద్యే మూలం'

బాధ వ్యక్తిగతం కాదు

మీకు బాధ కలిగితే దాన్ని మీలోనే దాచుకోవద్దు

మీకు సమస్య వస్తే మీలో మీరే మథనపడవద్దు.

సుఖసంతోషాల్లానే బాధలూ బాధ్యతలూ పెళ్లయ్యాక వ్యక్తిగతంకాదు సమిష్టిగతం.

ఒకర్తో ఒకరు బాధని సైతం పంచుకోవాలి. ఓదార్పు పొందాలి. అప్పుడే మనస్సు తేలికపడుతుంది.

ఆహ్లాదభరిత వాతావరణం భార్యాభర్తల అన్యోన్యతకి కాంక్రీటులా పని చేస్తుంది!

అనుమానాలొద్దు

నమ్మకం దాంపత్యానికి పునాది.

ఉత్తరాలు, ఫోన్‌కాల్స్, ఈ మెయిల్స్, క్రెడిట్‌కార్డ్ బిల్స్ – వగైరాలు అనుమానపు దృష్టితో చెక్ చేయొద్దు.

ఒకర్నొకరు అకారణంగా అనుమానించుకుంటే ఆ సంగతి అవతలివారికి తెలిస్తే వారి దృష్టిలో మీ స్థానం ఎంతగా దిగజారుతుందో ఆలోచించండి.

అరమరికలు లేకుండా కలిసిపోవాలి తప్ప అనుమానాలతో దూరం జరక్కూడదు!

మీరే మారాలి

'దాంపత్య జీవనం సజావుగా సాగటానికి అవతలివారిదే బాధ్యత.'

'సంసారం ఇలా వుండటానికి రెండోవారే కారణం.'

'ఈ సమస్యలూ విభేదాలూ అన్నీ వారివల్లే వచ్చాయి.'

'వారు అర్థం చేసుకుంటే చాలు వారు మారితే చాలు అన్నీ మంచు విడినట్లు విడిపోతాయి.'

ఈ రకం ధోరణి వద్దు. తప్పంతా అవతలి వారిదేననీ వారే మారాలనీ ఆలోచించొద్దు.

'జరిగిందానికి నేనూ కారణమే. నా పాత్రా వుంది. నా బాధ్యతా వుంది. నేనూ మారాలి' అనుకోవాలి.

ఆ ఆలోచనను అమలు చేయాలి.

ఇద్దరూ అలాచేస్తే చాలు నిజంగా మంచు విడిపోతుంది. అపార్థాలు తొలగుతాయి. అన్నీ సర్దుకుంటాయి!

ప్రేమించండి

ప్రేమంటే ఇవ్వడం. మీ హృదయాన్ని ఆలోచనల్ని అంతరంగాన్ని పూర్తిగా ఎదుటి వ్యక్తి తలపులతో నింపుకోండి.

ప్రేమించే వ్యక్తికి ఇష్టాన్ని ఆనందాన్ని అనురాగాన్ని విశ్వాసాన్ని పంచివ్వాలన్న భావన మీలో మల్టిప్లై కానివ్వండి.

ప్రేమంటే రెండు మనసుల కలయికే కాదు రెండు జీవితాల భౌతిక మానసిక సంకలన సామాజికాల సంఘర్షణ.

ప్రేమంటే కలసి జయించడం!

సంప్రదాయ పాత్రలు

సాంప్రదాయమైన భార్య పాత్రే ముద్దు.

మన సంస్కృతీ ప్రభావం వల్ల ఆ పాత్రలో పాత్ర పోషణలో పెను మార్పులుండవు.

దృక్పథంలో బరువుల్లో బాధ్యతల్లో లక్ష్యాల్లో మార్పులొస్తాయి. కాలానుగుణ మార్పులూ వివిధ ప్రభావాలూ వుంటాయి.

అయినప్పటికీ స్థూలంగా భార్యాభర్తల పాత్రలు మారని సంగతి గుర్తుంచుకోవడం అవసరం. అప్పుడే పెళ్లి విజయవంతమవుతుంది. ఇద్దరూ ఆనందంగా వుంటారు.

మానవసంబంధాల్లో సమన్వయం సాధించడంలో కొంత ఘర్షణ తప్పదు. అది మానవ మనస్తత్వాలకు సంబంధించిన అంశం. భార్య భర్తలకూ అది వర్తిస్తుంది.

నిర్దిష్ట మనస్తత్వం విశిష్ట వ్యక్తిత్వం వుంటాయి గనుక పెళ్లి, సంప్రదాయ పాత్రలు, సామాజిక దృక్పథం అర్థం చేసుకోవాలి. వివాహ చట్రంలో ఇమిడిపోవాలి. కొంత స్వీకరించడానికి కొంత కోల్పోక తప్పదు.

అది గ్రహిస్తే చాలు భార్యాభర్తలు చక్కని స్నేహితులైపోతారు.

శాశ్వత బంధం

మీ జీవితంలో మీకు సంంధించిన ఏ విషయమైనా సరే కొంత కాలానికి రంగు కోల్పోవచ్చు.

ఇతరుల్తో మీకు గల బంధాలూ అనుబంధాలూ మధ్యలోనే ముగిసిపోవచ్చు.

కాని మీ జీవిత భాగస్వామితో మీ బంధం రంగు వెలవనిది. నిత్యనూతనమైంది. శాశ్వతమైంది.

మీ జీవిత రహదారిలో మీకు తోడుండే బాటసారి మీ జీవన సహచరే.

పరస్పర ప్రేమను పంచుకుంటూ దాంపత్య జీవితాన్ని కడవరకూ సంతోషంగా సంబరంగా గడపాలి!

46

ధర్మార్థ కామమోక్షాలు

ధర్మార్థకామమోక్షాలు చతుర్విధ పురుషార్థాలు. ఇవి ప్రతి హిందువూ సాధించాల్సిన జీవిత లక్ష్యాలు.

ధర్మార్థకామాలు ఇహలోకానికీ, మోక్షం పరలోకానికీ సంబంధించినవి.

ధర్మార్థకామాల ద్వారా మనిషి పశుత్వాన్ని విడిచి, మానవత్వాన్ని దాటి, దేవత్వాన్ని సైతం అధిరోహించి మోక్షాన్ని పొందాలంటాయి వేదశాస్త్రాలు.

ధర్మార్థకామములనే త్రివర్గాన్ని సేవించి కృతార్థులవడానికి ఏర్పాటు చేయబడిందే ఆశ్రమ వ్యవస్థ, ఇందులోని నాలుగు దశలూ బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్న్యాసమూనూ.

అధర్మ అర్థం అధర్మ కామం మానవుణ్ణి పతనం చేస్తాయి. రాక్షసుడిగా మారుస్తాయి!

ఆదర్శ రామాయణం

'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నాడు వాల్మీకి.

ధర్మార్థకామాలలో అధిక ప్రాధాన్యత ధర్మానిదే అన్నారు మహర్షులు.

రాముడు ధర్మానికీ ధర్మబద్ధ అర్థకామాలకీ ప్రతీక.

కైక కేవలం అర్థానికి (సంపదకు) ప్రతీకైతే రావణుడు కామానికి ప్రతీక.

కొడుక్కి రాజ్యాన్ని కట్టబెట్టాలని ప్రయత్నించి అప్రతిష్ఠ పాలయ్యింది కైక. కేవలం అర్థపరుల్ని లోకం ద్వేషిస్తుంది.

సీతను కామించడం ద్వారా అధర్మకామాన్ని కోరిన రావణుడుకి అపకీర్తి, నాశనం కలిగాయి.

అర్థకామాలు ధర్మబద్ధమైనప్పుడే అవి పురుషార్థాలుగా గుర్తింపబడతాయి. అలా కానప్పుడు అనర్థాలవుతాయి.

దైనందిన జీవితంలో సరైన నడవడికకు కావాల్సిన జ్ఞానాన్ని అందిస్తుంది రామాయాణం!

ఎవరు ఉత్తముడు?

ధర్మార్థకామాలు మూడింటినీ ఏకకాలంలో సాధించడానికి ప్రయత్నించేవాడు ఉత్తముడు.

రెండు పురుష్థాల సాధనకే పరిమితమయ్యేవాడు మధ్యముడు.

ఒక్కదాన్నే పట్టుకుని వేళ్ళాడే వాడు అథముడు.

ఆ ఒక్కటీ ధర్మం కావచ్చు అర్థం కావచ్చు కామం కావచ్చు. ఏదైనా సరే మంచిది కాదు.

ధర్మంపేరిట ఇల్లూ వాకిలీ భార్యాబిడ్డల్నీ వదులుకోవడం సరికాదు. అర్థమే పరమార్థ మనుకుంటూ డబ్బే ప్రధానమని జీవించడమూ తగదు. కామమే సత్యమని దాని కోసమే వెంపర్లాడటమూ నీచమే. అనర్థహేతువే.

ఏది ఎప్పుడు?

ధర్మ అర్థ కామములలో ఒకటి మరొక దానికి భంగం కలిగించని రీతిలో జీవించాలి. వయస్సుతో బాటు శరీరంలో వచ్చే మార్పులకు తగ్గ పనులే చెయ్యాలి.

యౌవనంలో ధర్మబద్ధంగా ఆనందించాలి. అర్థసాధనలో అధర్మానికి పాల్పడకుండానే విజయం సాధించాలి.

వయస్సు మళ్ళేక మోక్షం వైపు దృష్టి మళ్ళించాలి.

ఎలావోలా ధనసంపాదనే ముఖ్యమనుకోకూడదు. కష్టపడి సంపాదించిందే నిలుస్తుంది. ఆనంద పరుస్తుంది. సంపాదించిన దాన్ని నిలబెట్టుకునేందుకు మరింత ప్రయత్నం చెయ్యకతప్పదు.

కామం భౌతికావసరమే. అలాగని ఆ ఆలోచనతోనే ఆ ధ్యాసతోనే బ్రతికితే తనకీ తనవారికీ దుఃఖం తప్పదు.

ధర్మార్థ కామాల మధ్య సమతుల్యం పాటించాలి. అప్పుడే ఆనందంగా జీవించ లుగుతారు. ఏదో ఒక దానికే బానిసయ్యే వారిని బుద్ధిహీనులని చెప్పాలి.

మూడు ధర్మాలలో ఏదో ఒకటి సాధించేందుకు మిగిలిన రెండింటినీ నిర్లక్ష్యం చెయ్యడం తగదు. మూడూ సాధించాల్సిన పురుషార్థాలే!

పరస్పరాధారితం

ధర్మార్థకామాలు మోక్షానికి పునాదులు.

ధర్మము అర్థము – రెండింటికి కూడా కామమే కారణ భూతం.

కామిగాని వాడు మోక్షగామి కాలేడు.

ధర్మార్థకామాలు మూడూ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి వుండేలా ఒకదానికొకటి విరుద్ధం గాకుండా వుండేలా విభజించు కోవాలన్నాడు వాత్సాయునుడు!

ధర్మం

ధర్మమంటే ఉత్తమ జీవనం. సత్ప్రవర్తన. బాధ్యతా నిర్వహణ. సన్మార్గ వర్తన. ప్రకృతి పాలన.

వివాహం చేసుకుని సంసారం చేయడం ధర్మ గుణం.

సంసారంలో ఆనందం కావాలంటే వ్యక్తి గత, కుటుంబ, సామాజిక ధర్మాలకు లోబడి వుండాలి.

ధర్మమార్గంలో దంపతులైన తర్వాతే కామ భాగంలో అడుగుపెట్టాలి.

'ధర్మోహి తేషామధి కోవిశేషో

ధర్మేణ హీనాః పశుభిః సమానా' అన్నారు.

మనిషికీ జంతువుకీ తేడా ఒక్క ధర్మాచరణే. ధార్మికుడు కానివాడు పశుసమానుడే.

ధర్మం ఆచరించడానికి అహింసా వ్రతం పాటించాలి. మాంసాహారాన్ని విడనాడాలి.

దయ, దాతృత్వం, కరుణ, సహాయపడుట, జాలి, సేవాతత్పరత, సత్యవ్రతం, సద్భావన, సౌశీల్యం– కలిగివుండాలి.

అవి మనిషి చేత పుణ్యకార్యాలు చేయిస్తాయి.

ధర్మపత్ని అంటే అసలైన అర్థం భర్త చేయవలసిన ధర్మాన్ని నిర్వర్తించే వరకూ కృషి చేసే పత్ని.

వేదాలు ధర్మగుణం గురించి వివరించాయి. కామ అర్థసూత్రాలను ఎలా పాటిస్తున్నారనే దాని మీద మనిషి ధర్మనిరతి ఆధారపడి వుంటుంది.

అర్థకామ పురుషార్థాలను ధర్మమార్గాలలో అనుసరిస్తే మనిషి శరీరానికీ మనసుకే కాదు సమాజానికీ శ్రేయస్కరం. శాంతి దాయకం!

ధర్మానికి చిహ్నం చక్రం. జాతీయ జెండా మధ్యలో వుండే ధర్మచక్రం భారతీయులకు ధర్మబోధ చేసే నిత్యగీత!

అర్థం

మనిషి ధనాన్ని సంపాదించాలి. అది జీవిక కోసం భార్యాసుతుల పోషణకోసం గృహస్థాశ్రమ ధర్మాలు నిర్వర్తించడం కోసమే అయివుండాలి.

'వేద మూల మిదం జ్ఞానమ్
భార్యా మూల మిదం గృహమ్
కృషి మూల మిదం ధాన్యం,
ధన మూల మిదం జగత్' అన్నారు.

ఏ యుగంలోనైనా బతుకు బండికి ఇంధనం ధనమే. ఉత్తమ పురుషుడు జీవితాంతం ధనం సంపాదిస్తూనే వుండాలి. దానిలో కొంత భాగం సేవాధార్మిక కార్యక్రమాలకు వినియోగిస్తూండాలి.

అలాగని చెప్పి అధర్మ పద్ధతుల్లో అవినీతి మార్గాల్లో ధనాన్ని సంపాదించ కూడదు. అది అశాంతికీ ఆందోళనకీ అపరాధ భావనకీ భయాలకీ కారణమవుతుంది.

కేవలం ధనార్జనే ముఖ్య మనుకోవడం సరియైంది కాదు. మనిషి ధనాన్ని సంపాదించాల్సిందే కాని ధనానికి బానిస కాకూడదు. డబ్బు కోసం గడ్డి తినకూదు. అడ్డదార్లు తొక్కరాదు.

'ఉన్న దానితో సంతృప్తి చెందక అన్యుల ధనం కోసం అవినీతి అక్రమ మార్గాలు అనుసరించి దారుణ మారణ హెూమాలకు పాల్పడుతూ పోరాటాలకు కుటిల యత్నాలకు తలపడితే అటువంటి వారి వంశం నిలబడదు. ధర్మ మార్గంలో సంపాదించిన అర్థమే శ్రేయస్సును శుభాన్ని కలిగిస్తుంది. అక్రమార్జన వలన అనర్థమే మిగులుతుంది.'

ఇది రాయబార సమయంలో కృష్ణుడు చెప్పిన పరమార్థం! సర్వ కాలాల్లోనూ శిరోధార్యం!!

కామం

'**ఆహార సధర్మణోహి కామః**' అన్నాడు వాత్స్యాయనుడు.

మనిషికి ఆహారం ఎంత అవసరమో కామమూ అంతే. ఆహార నిద్రా మైథునాలు సహజావసరాలు.

కామగుణాన్ని తప్పుగానో అణచుకోవాల్సిందిగానో భావించరాదు. చతుర్విధ పురుషార్థాలనూ మనిషి ఆచరించాల్సిందే. అవి లేకుంటే జీవితమే లేదు.

'**కామ్యతే సర్వే తితి కామం**' – అందరి చేత అభిలషింపబడేది కామం. స్త్రీ పురుషలలో కలిగే సంభోగాభిలాష కామమే.

కామాన్ని అసహ్యించు కోవడమంటే జన్మనిచ్చిన వారిని అవమానించడమే. కామ గుణం లేకపోతే మనిషికి సంతానమే వుండదు. జన్మే లేకపోతే ఇక ధర్మానికీ అర్థానికీ తావే వుండదు.

అందుకని కామ అవసరాన్ని ధర్మమార్గంలో తీర్చుకోవాలి. అక్రమ సంబంధాలు పెట్టు కోకూడదు. అతి కాముకత్వం కూడదు. కామానికి దాసులై సంచరించేవారు అన్ని విధాలా నాశనమవుతారు.

సంతృప్తి కరమైన లైంగిక సుఖం వల్ల శారీరకంగానే గాక మానసికంగానూ తాజాదనం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒత్తిళ్ళు దూరమవుతాయి. ప్రశాంతత చిక్కుతుంది.

మోక్షం

మోక్షప్రాప్తికి మొదటి మూడు పురుషార్థాలూ సహకరిస్తాయి.

మోక్షమంటే ముక్తి. మరణం, జన్మ రాహిత్యం. కష్టాలనుండి దుఃఖాలనుండి విముక్తి.

'సచ్చిదానందుడైన బ్రహ్మలో ఐక్యమై తనస్థితిలో తాను నిలిచి ఉండటం'– అంటారు.

భౌతిక కోరికలు త్యజించి 'నిర్వాణ' స్థితికి చేరితేనే ముక్తి సాధ్యమంటారు.

బతకడమెలాగో బతకడమెందుకో భారతీయులకు ధర్మ శాస్త్రాలు బోధించాయి. మోక్ష భావన ప్రపంచంలోని ఇతర జాతుల్లో కన్పించదు.

కర్మయోగ, జ్ఞానయోగ, రాజయోగ, భక్తి యోగలు–మోక్షానికి మార్గాలంటారు.

మోక్షంలో శాంతి, విదేహ్, కైవల్య, స్వర్గం వున్నాయంటారు.

మోక్షసాధన

వ్యాసమహర్షి సూచించిన మోక్షసాధనా మార్గాలు.

- తల్లిదండ్రుల్ని గౌరవించి పోషించాలి.
- భార్యా భర్తలు ఒకరికొకరు విశ్వసనీయంగా ఉండాలి.
- సర్వప్రాణికోటిని ప్రేమించగల సహృదయం ఉండాలి.
- మిత్రద్రోహం, బంధుద్రోహం, ఆశ్రితులకు అన్యాయం చేయరాదు.
- నిత్యం భగవదారాధన చేస్తూ నిష్కామంగా జీవించాలి.

నిరంతర సాధన

ధర్మార్థ కామాలు సాధించడానికి నిరంతరం కృషి చేస్తూనే వుండాలి.

వీటిని సాధించడం సులభం కాదు. ఉపాయాలు కావాలి.

అవి మూడు రకాలు.

అనుష్ఠానం (ఆచరించుట)

అవబోధం (తెలుసుకొనుట)

సంప్రతి పత్తి (ఫలితాన్ని అనుభవించుట)

ధర్మార్థకామాలు మూడూ ఒకే సారి సమకూడితే మొదట ధర్మాన్ని, తర్వాత అర్థాన్ని, ఆఖర్న కామాన్ని స్వీకరించాలి.

అంటే కామం కంటే అర్థం, అర్థం కన్నా ధర్మం గొప్పది.

చివరిగా గీతావాక్యం – 'జీవిత రథాన్ని విషయమార్గంలో నడపడం బంధం. దైవమార్గంలో నడపటం మోక్షం!'

47

సంసారం

సంసారం సాగరం లాంటిది.

అది అనంతం. ఆటుపోట్లకు నిలయం.

సాగర గర్భంలో అద్భుత నిధులున్నాయి.

సంసారంలో ఆనందపు గనులున్నాయి.

సంసారమంటే కాపురం. భౌతిక జీవితం. జనన మరణాల పరంపర. విషయ భ్రాంతి!

కాళ్ళు తడవకుండా సముద్రం దాట వచ్చునేమో గాని కళ్ళు తడవకుండా సంసారాన్ని ఈద లేరు!

సంసారం కత్తి మీద సాము. అసిధారా వ్రతం!

సంసారసాగరం

'జన్మదుఃఖం జరాదఃఖం జరాదుఃఖం పునఃపునః

సంసార సాగరం దుఃఖం తస్తాత్ జాగ్రత జాగ్రత!' – అన్నారు శంకరాచార్యులు.

మనిషి తల్లి గర్భంనుంచి భౌతిక ప్రపంచంలో పడగానే కేర్ కేర్ మని శోకిస్తాడు. అలా శోకించకపోతే ఆ శిశువు ఆరోగ్యస్థితి బాగోనట్టు భావిస్తారు.

భూమి మీదపడే వరకూ శిశువుకు పూర్వ జన్మ స్మృతి ఉంటుందిట. ఈ ప్రపంచంలో మళ్ళీ పడ్డానే అని ఆ క్షణంలో పూర్వ జన్మ స్మృతి కలిగి వున్న శిశువు శోకిస్తుందిట. ఆ తర్వాత పూర్వజన్మ స్పృహ కోల్పోయి మాయలో పడిపోతుందిట శిశువు. ఇది తత్వవేత్తల భావన.

రోగాలు, ముసలితనంతో శరీరం కృశిస్తూండగా బాధ పడుతూ మరణిస్తాడు మనిషి. జరా మరణాలూ బాధలూ దుఃఖాలూ లేని మోక్షం కోసం భగవదారాధన చెయ్యాలంటారు జ్ఞానులు!

సంసార చక్రం

బాల్యంలోనే సన్యాసాశ్రమం స్వీకరించారు శంకరాచార్యులు.

జనన మరణ సంసార చక్రంలో నన్ను పడవేయ వద్దు – అంటూ లక్ష్మీనరసింహ స్వామిని ఈ విధంగా మొర బెట్టుకున్నారు.

'సంసార రూపమతి ఘోర మగాథ మూలం
సంప్రాప్య దుఃఖ శర సర్ప సమ కలస్య..

'ఈ సంసారం ఒక దిగుడు బావి. అది భయంకరమైన అగాథం. ఇందులో ప్రవేశించి సహస్ర విధాలైన దుఃఖరూప సర్పాల వల్ల వ్యాకులుడనయ్యాను. దీనుడ నయ్యాను. విషగ్రస్తుడనైన నాకు ఓ లక్ష్మీనరసింహా! నీ చేయూత నీయుము!'

మహోగ్రరూపం

ఉగ్ర భీకర మూర్తి శ్రీ నరసింహస్వామి. అలాంటి ఆయన దగ్గరకి ప్రహ్లాదుడు నిర్భయంగా వెళ్ళాడు. వినమ్రుడై మొక్కాడు.

నీ ఉగ్ర రూపం కన్నా సంసారం మహోగ్రమైందంటూ ప్రార్థించాడు!

'త్ర స్తో స్మ్యహం కృపణ వత్సల దుస్సహోగ్ర
సంసార చక్ర కదనాత గ్రనతాం ప్రణీతః'

'ఓ దీనవత్సలా! నేను ఈ సంసార భీకర మహోగ్ర చక్రాన్ని చూచి భయపడుతున్నాను. ఈ లోకం లోని స్వార్థపూరిత క్రూర మానవ మృగాలను చూచి భయపడుతున్నాను. ఇది నా దుష్కర్మ ఫలం. నీపాద సన్నిధికి నన్నెన్నడు చేర్చుకుంటావో!'

భయానకమైంది

సంసారం పైకి కన్పించేంత చిన్నది కాదు. సామాన్యమైంది కాదు. దాని లోతు తెలుసుకోవడం మహాత్ములకే సాధ్యం కాలేదు.

అడుగడుగునా సమస్యలుంటాయి. బాధలుంటాయి. దుఃఖాలుంటాయి. భయాలుంటాయి. సుడిగుండాలుంటాయి.

స్వార్థం వుంటుంది. దోపిడి వుంటుంది. హింస వుంటుంది. అరాచకం వుంటుంది. ప్రకృతి విలయమూ వుంటుంది.

కొన్ని భర్త ప్రవర్తన వల్ల వస్తాయి. కొన్ని భార్య వల్ల మరి కొన్ని సంతానం వల్ల కలుగుతాయి. బంధుమిత్రుల వల్ల సామాజిక పరిస్థితుల్ల వల్ల వస్తాయి. ప్రకృతి నియమాల వల్లా సంభవిస్తాయి.

స్వార్థం, ఈర్ష్య, అసూయ, అత్యాశ, చోరబుద్ధి, రోగాలు, ప్రమాదాలు, శత్రువులు, మరణాలు – వేటి వల్ల నైనా రావొచ్చు. ఒకే సారి అనేక వాటి వల్లా కలగవచ్చు.

వాటి బారిన పడకుండా భార్య భర్తలు ప్రయత్నించాలి. అయినా వస్తాయి. ప్రియమైన తల్లిదండ్రులు సోదరులు మిత్రులు రాలిపోతూంటారు. దూరమవుతూంటారు. ఈతి బాధలు బాధిస్తూంటాయి. దుఃఖితుల్ని చేస్తాయి.

అయినా తట్టుకోవాలి. నిలబడాలి. నిబ్బరంతో ప్రయాణం కొన సాగిస్తూనే వుండాలి!

తామరాకు మీది నీటి బొట్టు

తామరాకు మీది నీటి బొట్టు ఆకుకి అంటుకోదు. తనేమీ కోల్పోదు. అటూ ఇటూ ముత్యంలా దొర్లుతూంటుంది.

మనిషి కూడా సంసారం జీవితంలో అంటీ ముట్టనట్టుగా వ్యవహరించాలనీ పరమాత్మ మీదే మనస్సు లగ్నం చేయాలంటారు వేదాంతులు.

అది మహాత్ములకు మాత్రమే సాధ్యమైన విషయం.

అయినప్పటికీ భవబంధాలు అశాశ్వతమన్న జ్ఞానం కలిగివుండటం అవసరం.

ఈ డబ్బు హోదా సంపద అధికారం సుఖం బంధాలు బంధువులు – ఏదీ ఎవరూ శాశ్వతం కాదు.

అన్నీ పోతాయి. అన్నీ నశిస్తాయి. ముందు వెనుకల్లోనే తేడా. అంతే!

పుట్టినప్పుడు మనిషి ఎలా అయితే ఒట్టి చేతుల్తో వచ్చాడో పోయేటప్పుడూ అలాగే పోతాడు. ఎర్రని ఏగానీని కూడా వెంట తీసుకెళ్ళలేదు!

గీతలో కృష్ణుడు చెప్పిన పరమార్థం ఇదే – "అన్నీ నేనే. అంతా నేనే. నువ్వు కేవలం నిమిత్త మాత్రుడివి! నువ్వు సృష్టించిందీ లేదు నాశనం చేసిందీలేదు! ఏదేదో నువ్వు చేశాననుకుంటున్నదంతా ఓ భ్రమ!"

ఈ సత్యాన్ని జీర్ణించుకోవాలి. 'పరోపకారార్థం ఇదం శరీరం' అనుకున్నప్పుడు ఆలోచన మారుతుంది. నడవడిక మారుతుంది. బుద్ధి మారుతుంది. కర్మా మారుతుంది!

ధర్మార్థకామమోక్షాలు

సుఖ సంసార జీవనానికి ధర్మం ఉండాలి. డబ్బు కావాలి. కామం తీరాలి. ఇవన్నీ ధర్మబద్ధంగా చేస్తూ నాలుగో పురుషార్థమైన మోక్షలబ్ధికి ప్రయత్నించాలి.

జన్మరాహిత్యానికి ఈ జన్మని ఉపయోగించుకోవాలంటారు జ్ఞానులు.

ఏదో రకంగా దానధర్మాలు చేస్తే చాలదు. ఎలావోలా డబ్బు సంపాదిస్తే కుదరదు. ఎలాగో ఒకలా కామాన్ని తీర్చుకుంటే సరిపోదు.

అవన్నీ ధర్మబద్ధంగా నీతిబద్ధంగా చట్టబద్ధంగా చెయ్యాలి.

అలాచేస్తే చాలా సమస్యల్నుంచి బాధల్నుంచి టెన్షన్లనుంచి ఆందోళనలనుంచి అశాంతి నుంచి విముక్తి లభిస్తుంది. అది మోక్షగామిని చేస్తుంది.

ఈతి బాధలూ కష్టాలూ కన్నీళ్ళూ లేని అద్భుత స్థితే కదా మోక్షమంటే!

కోరికలూ అలవాట్లూ

ప్రతివారికీ కోరికలుంటాయి. ఆశలుంటాయి. అలవాట్లుంటాయి.

అవి మంచివి మితి మీరనివి విపరీతమైనవి కాకపోతే ఆ వ్యక్తీ అతడి సంసారం ఆనందంగా వుంటాయి. ఉన్నతంగా వుంటాయి. ఉజ్వలంగా ప్రకాశిస్తాయి.

దురలవాట్లు దుర్మార్గపు ఆలోచనలు విపరీతమైన కోరికలు మనిషిని పతనం చేస్తాయి. కష్టాలకొలిమిలోకి నెట్టుతాయి. అతడి సంసారాన్ని అల్లకల్లోలం చేస్తాయి.

ఒక మహారాజు పుత్రిక మరో మహారాజు కోడలు అయిన సీత బంగారు లేడి కోసం ఆశపడింది. ఫలితంగా అష్టకష్టాలు పడాల్సివచ్చింది.

మహాశివభక్తుడు పరిపాలనాదక్షుడు పరాక్రమవంతుడూ అయిన రావణుడు పరస్త్రీ వ్యామోహం అనే ఒకే ఒక్క బలహీనత వల్ల సర్వనాశనం అయ్యాడు. తనవారినీ ఆహుతి చేశాడు.

లాటరీ, పేకాట, గుర్రప్పందాలు, వ్యభిచారం, లంచాల స్వీకరణ వగైరా అలవాట్లున్న వారు వాటిని వదులుకోవాలి.

బంగారం, కారు, బంగాళా, తోటలు-అంటూ కోరికల లిస్టు పెంచుకుంటూ పోకుండా తమ స్థాయికి తగ్గ కోరికలు కోరుకోవాలి. తీర్చుకోడానికి ప్రయత్నించాలి. కోరికల కళ్ళేలు వదిలితే అవి గుర్రాలై దౌడుతీస్తాయి. వాటి డెక్కల క్రింద నలిగిపోవాల్సి రావచ్చు!

సంసారం సజావుగా సాగాలంటే ఇంట్లో ప్రశాంతత నిలవాలంటే ఇంట్లోని వారంతా మితమైన కోర్కెల్తో తృప్తితో బ్రతకటం నేర్చుకోవాలి.

శీలమే ప్రధానం

శీలం అంటే సత్ప్రవర్తన. ఋజువర్తన. సత్కర్మల నాచరించుట.

మంచి పని చేస్తే ఫలితమూ మంచిగా వుంటుంది.

విత్తనాన్ని బట్టే మొక్క వుంటుంది. మర్రివిత్తనం నాటితే మర్రి మొక్కే పుడుతుంది. వేప మొక్క పుట్టదు.

ఆలుమగల చేష్ఠలు కామక్రోధమదమాత్సర్యాలకు లోబడకుండా వుండాలి. ధర్మాచరణ చెయ్యాలి. సత్క్రియలు నిర్వహించాలి.

భర్త అవినీతి మార్గాన డబ్బు సంపాదించి తెస్తున్నాడు. ఆ సంగతి భార్యాబిడ్డలకు తెలుసు. అయినా వారించ లేదు. ఆ డబ్బుతో ఇల్లు కట్టారు. నగలు కొన్నారు. ఆస్తులు కూడబెట్టారు. గొప్పగా ఫోజులు కొట్టారు. కాని లోలోపల భయంగానే వుంది. ఆందోళనగానే వుంది. నిద్రలో వులిక్కిపడుతూనే వున్నారు.

ఒక రోజున భయపడినంతా జరిగింది. అతడు పట్టుబడ్డాడు. అక్రమసొమ్మును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. సంసారం వీధిన పడింది. ఇంటిల్లపాదికీ కష్టాలే. సమస్యలే. అప్రతిష్టే.

అతడు జైల్లో విచారిస్తున్నాడు. వీరు జైలు బయట అలమటిస్తున్నారు.

అలాంటి పరిస్థితిని ఎవరూ కోరుకోకూడదు. ఉన్నదాంతో తృప్తిగా సుఖశాంతుల్తో బ్రతకాలి. అందుకు సత్ప్రవర్తన తప్పనిసరి.

స్త్రీ గౌరవం

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతాః।
యత్రై తాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః॥'

'ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు విలసిల్లుతారు. సకలసంపదలు నెలకొని వుంటాయి. ఎక్కడ స్త్రీలు అగౌరపరచబడతారో అవమానింపబడతారో అక్కడ జరిగే ప్రతిపనీ వ్యర్థమవుతుంది. ఆ సమాజం (సంసారం) అభివృద్ధిలోకి రాదు' అంటాడు మనువు.

స్త్రీ దుఃఖం కులనాశిని. ఆమె సంతోషం సర్వ ప్రగతికి రాచబాట.

భర్త భార్యని తనలో సమానంగా చూడాలి. గౌరవించాలి. ఆనందంగా వుండేట్లు చూడాలి. అప్పుడా సంసారం కళకళలాడుతుంది!

చుక్కాని స్త్రీ

సంసార నావ ఒడిదుడుకుల పాలవ్వకుండా చక్కగా నడపగల శక్తి స్త్రీ స్వంతం.

లోతైన పరిశీలన, నిజాయితీ, సంతానం మీద అపరిమితప్రేమ, కుటుంబంలో తాదాత్మ్యత, ఎలాంటి క్లిష్ట పరిస్థితులకైనా దీటుగా స్పందించడం, అవసరాన్ని బట్టి ఆలనాపాలనా – సంప్రదాయంగా మహిళకు పుట్టుకతోనే అబ్బిన లక్షణాలు.

సంక్షోభ సమయంలో అవన్నీ ఆమె బలాలుగా మారతాయి.

పురుషులకన్నా మహిళలు జాగ్రత్తపరులు. చక్కని శ్రోతలు. అందువల్లే ఉత్తమ నాయకులు కాగలరు. అందుకే స్త్రీ పొత్తిళ్ళలోనే ప్రపంచం సురక్షితంగా వుంటుందంటారు.

అథర్వవేదం ఆమెని 'సామ్రాజ్ఞి' అని సంభోదించటమే గాక 'వర్షము కలిగించు సంద్రము నదులకు సామ్రాట్టు అయిన రీతి పతి ఇంట సామ్రాజ్ఞివై ఉండుము' అన్నది!

సంసారబంధం

సంసారం సాగరమే కాదు ప్రేమ సుధాపూరం నవజీవన సారం.

రోగం, శోకం, మరణం, సమస్యలేని ఇల్లు వుండదు.

రోగం రాకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. రోగనిరోధక శక్తి పెంపొందించుకోవాలి.

శోకం కలిగి నప్పుడు తట్టుకోవాలి. పంచుకోవాలి. గుండె దిటవు చేసుకుని ముందుకు సాగాలి.

మరణం సంభవిస్తుంది. ఆత్మీయులు దూరమవుతారు. నిభాయించుకోవాలి

రెక్కలు రాగానే పిల్లలు ఎగిరిపోతారు.

రోగాలు ఆర్థిక బాధలు చుట్టుముడతాయి. భరించరాని దుఃఖం కలుగుతుంది. అయినా భరించాలి. యాత్ర కొనసాగించాలి.

ఉద్యోగంలో వ్యాపారంలో సమస్యలొస్తాయి. పరాజయాలెదురవుతాయి. ఉద్యోగం పోవచ్చు. వ్యాపారం దివాలా తీయవచ్చు. ఎలాంటి విషయస్థితైనా ఎదురవవచ్చు. ఉద్వేగంతో వూగిపోకూడదు. దుందుడుకు చర్యలకు పాల్పడకూడదు. భార్యాభర్తలిద్దరూ కలిసి చర్చించు కోవాలి. పరిష్కరించుకోవాలి. పరస్పర సహకారంతో సమన్వయంతో వ్యవహరించాలి. కష్టనష్టాల్ని అధిగమించాలి.

జీవన సాఫల్యతకై తపించాలి. అహరహం కృషి చేయాలి. కష్ట సుఖాలు కలిమిలేములు కలిసి పంచుకోవాలి. ఓర్పునేర్పు ధైర్యాలతో సంసార సాగరాన్ని ఈదాలి.

దాని మీదే వారి సంసారబంధ బలం ఆధారపడి వుంది.

ఆ బంధం ఎంతగట్టిగా వుంటే అంత ఆనందం,శాంతి,సుఖం,సంతోషం ఆ ఇంట వెల్లివిరుస్తాయి.

కళకళలాడే సంసారమే కదా స్వర్గధామం!

48

సుమంగళి



హిందూ సమాజంలో వివాహిత స్త్రీకి విశిష్ఠస్థానం ఉంది. ప్రత్యేక గౌరవముంది. పూజ్య భావముంది.

ప్రపంచంలోని మరే జాతిలోనూ లేని విధంగా వివాహితని గుర్తించడానికి ప్రత్యేకమైన అలంకారాలున్నాయి.

మంగళసూత్రం, కడియాలు, నల్లపూసలు, చుట్లు, మట్టెలు, పిల్లాణులూ, నుదుట సింధూరం వగైరాల ద్వారా గుర్తించవచ్చు.


పర సతిని మాతృభావనతో చూడాలి గౌరవించాలంటుంది హిందూ సంస్కృతి. అందుకని అలాంటి కొండ గుర్తుల్ని ఏర్పాటు చేసి ఉండొచ్చు.

ఏమైనా పైన పేర్కొన్న అలంకారాలతో ప్రతి ముత్తైదువా లక్ష్మీదేవిలా కళకళ లాడుతూంటుంది.

పుణ్యస్త్రీ లేక పునిస్త్రీ

భర్తగల స్త్రీని పుణ్యస్త్రీ అంటారు. ఐదురకాల అలంకారాలుంటాయి గనుక 'ఐదువ' అని కూడా అంటారు.

పసుపు, కుంకుమ, తాళి లేదా సింధూరం, గాజులు, మట్టెలు ఈ అయిదూ పుణ్యస్త్రీ అలంకారాలు.



తాళి, మట్టెలు తప్ప మిగతావి ఆడవారంతా ధరిస్తారు. పెళ్లయ్యాకే ఆ రెండూ లభిస్తాయి. అప్పుడే ముత్తైదువ అవుతుంది స్త్రీ.

లోకంలోని స్త్రీలంతా 'దేవీ' స్వరూపిణులే. సుమంగళికి పసుపుకుంకుమ ఇవ్వడం ద్వారా దేవీ ఆరాధన చేసిన పుణ్యఫలం లభిస్తుందంటారు. అందుకనే పునిస్త్రీలకు అన్ని శుభకార్యాల్లోనూ పసుపుకుంకుమలు రవికెలగుడ్డ పెడ్తూంటారు.

ప్రత్యక్ష దైవం

హిందూ స్త్రీకి పతియే ప్రత్యక్షదైవం. పురుషుడికి పత్నియే అష్టైశ్వర్యలక్ష్మి.

ఒకరికొకరు తోడు నీడ.

రాముడు అరణ్యవాసానికెళ్తూ సీతని అయోధ్యలోనే వుండి పొమ్మనగా ఆమె ఏమన్నదో చూడండి.

'న పితా నత్మజో నత్మాన మాత న సఖీజనః

ఇహ ప్రీత్య చ నారీణాం పతిరేకో గతిస్సదా'

ఇహలోకంలోగాని పరలోకంలోగాని స్త్రీలకు తండ్రిగాని తనయుడుగాని తల్లిగాని చెలులుగాని పొందదగిన వారు కాదు. కేవలం పతి మాత్రమే ప్రాప్యనీయం!

పూజలూ వ్రతాలూ

స్త్రీలెన్నో పూజలూ వ్రతాలూ చేస్తుంటారు. ప్రత్యేకంగా శ్రావణ శుక్రవారాలూ వరలక్ష్మి వ్రతాలూ చేస్తారు. ఎన్నో నోములు నోస్తారు.

వాటన్నిటి లక్ష్యం ఒకటే. భర్త క్షేమంగా సుఖంగా సంతోషంగా నూరేళ్ళు వర్ధిల్లాలని.

అతడు బావుంటే తనూ బావుంటుంది. అతళ్ళోని సగం ఆమె కదా!

భర్త తర్వాతే సంతానం గురించి ప్రార్థిస్తుంది.

భర్త క్షేమంలో తన క్షేమం చూసుకునేంతగా భారతస్త్రీ పతితో మమేమకమవుతుంది!

పంచప్రాణాలు

వివాహప్రక్రియతో భర్త పంచప్రాణాలూ భార్యదేహంలోనే ప్రతిష్ఠించబడతాయంటారు.

వధువు యొక్క మెడ, పాపిడి, నుదురు, మణికట్టు, కాలిరెండో వేలులో భర్త పంచ ప్రాణాలుంటాయని నమ్మకం.

వివాహమయ్యాక పాపిటలో ధరించే సింధూరం భర్త తొలిప్రాణం.

పసుపుతో కూడిన కుంకుమతో నుదిటిపై పెట్టుకునే బొట్టు రెండో ప్రాణం.

వధువు మెడలో వరుడు కట్టే బంగారపు లేదా పసుము కొమ్ముతో కూడిన తాళి మూడో ప్రాణం.

మణికట్టు మీద ధరించే మట్టిగాజులు నాలుగో ప్రాణం.

కాలి రెండో వేలుకి పెట్టుకునే వెండి మట్టెలు భర్త ఐదోప్రాణం.

పసుపు

'ముత్యమంత పసుపు ముఖమంత ఛాయ...' అన్నారు.

పసుపు చక్కని సౌందర్య సాధనం. మేని ఛాయను మెరుగు పరుస్తుంది. కాంతివంతం చేస్తుంది.

పసుపులేని వంటగది, పూజామందిరం ఉండవు.

పసుపు సూక్ష్మజీవుల్ని నాశనం చేస్తుంది. రక్తాన్ని శుద్ధిచేసే గుణముంది గనుకే కూరల్లో పసుపును విరివిగా ఉపయోగిస్తారు.

జలుబు, బ్రాంకైటిస్, ఆస్త్మాలాంటి రుగ్మతల నుండి ఉపశమనం కలిగించే ఔషధం పసుపు.

కుంకుమ

మంగళప్రదమైంది కుంకుమ.

కనుబొమల మధ్య జ్ఞాననేత్రం ఉంటుంది. దానిమీద ధరించే కుంకుమ బొట్టు జ్ఞానాన్ని వికసింపజేస్తుంది.

శక్తికీ తీక్షణతకీ మారుపేరు బొట్టు. దుష్టబుద్ధులకదో హెచ్చరిక.

నుదుటి బొట్టుతో బాటు పాపిటలో సిందూరం ధరిస్తారు. భర్త పట్ల వారికి గల అనురాగానికి చిహ్నంగా వివాహబంధానికి స్త్రీ లిచ్చే గౌరవంగా భావిస్తారు.

గాజులు

స్త్రీ చేతికి రంగురంగుల మట్టిగాజులు ఓ అలంకారం. గాజుల సవ్వడలూ రంగుల కాంతులూ మనసుని మురిపిస్తాయి.

ముంజేతి నాడుల మీద ఒత్తిడి తెస్తూ నియంత్రిస్తుంటాయి.

పెళ్లి కూతుర్ని చేసేప్పుడు, సీమంతంలోనూ బోల్డన్ని గాజుల్ని ధరింపజేస్తారు. ముత్తైదువలకీ పంచుతారు.

పాతివ్రత్యం

పతితోనే తన బ్రతుకుని ముడివేసుకుని పండించుకోవాలని చూస్తుంది ప్రతిస్త్రీ.

చావైనా బ్రతుకైనా పతితోనే అని భావించిన సావిత్రి యముడ్ని సైతం ఓడించ గలిగింది. మనో వాక్కాయ కర్మలచే ఏ స్త్రీ భర్తను తప్ప వేరొకరిని కోరదో ఆమె పతివ్రత అన్నాడు మనువు.

సత్ప్రవర్తన, నీతి నియమాలతో జీవించడం పాతివ్రత్య లక్షణాలు. ఇవి స్త్రీలకే కాదు పురుషులకీ వర్తిస్తాయి.

వితంతువు

భర్త చనిపోయిన స్త్రీ బొట్టు కాటుక పెట్టుకోవడం మానేస్తుంది. భర్త లేనప్పుడు ఈ అలంకరణలు అనవసరమని భావిస్తుంది.

పెళ్లిని భర్తని కుటుంబాన్ని అమితంగా ప్రేమిస్తుంది స్త్రీ. అందుకే పంచమాంగల్యాలైన పసుపు, కుంకుమ, తాళి, గాజులు, మట్టెలు త్యజిస్తుంది. అది ఐహికమైన ప్రలోభాలకు లోనుకాకుండా నివారించడానికే అంటారు కొందరు.

వితంతువు ఎవరినైనా దత్తత తీసుకుంటే వారిని భర్త సంతానంగానే భావిస్తుంది హిందూధర్మం.

మారిన స్థితిగతులు

భర్త తోడిదే భార్య జీవితం అన్నది సత్యమే అయినా భర్త లేకపోతే భార్యకు బ్రతుకే లేదనడం సరికాదు.

'సతి' కే కాదు వితంతు రూపానికీ కాలం చెల్లింది.

భర్త చనిపోయినంత మాత్రాన పసుపు కుంకాలకీ గాజులకీ పూలకీ దూరమవ్వాల్సిన పనిలేదు. అతడి గుర్తులుగా వాటిని ధరించవచ్చు. తాళినీ మట్టెల్నీ తీసేస్తేచాలు.

భర్త దూరమైనా కుటుంబానికీ సంతానానికీ ఆమె దూరం కాదు. గనుక ఆ అలంకారాలని తీసెయ్యాల్సిన పనిలేదు. అంతేకాదు. భర్త మిగిల్చిన బాధ్యతల్ని ఆమె నిర్వర్తించాల్సి వుంది.

భర్త మరణం ఆమె జీవితానికో 'కామా' తప్ప 'ఫుల్‌స్టాప్' కాదు.

ఆమె తన జీవితం కొనసాగించాలి. వీలైతే పునర్వివాహం చేసుకోవాలి. భర్త చేదోడు కడదాకా కావాలన్నది గుర్తుంచుకోవాలి!

సుమంగళి

హిందూ సంస్కృతిలో అక్షింతల్ని పూర్ణత్వానికి పవిత్రతకూ చిహ్నాలుగా భావిస్తారు.

సిందూర దానంలో సిందూరానికి కొన్ని అక్షతలు కలుపుతారు.

ఎరుపు తెలుపు శక్తి, శివలకు ప్రతీకలు.

ఎర్రటి సిందూరంలో తెల్లని అక్షింతలు కలపడం – చరమైన స్త్రీ, స్థిరమైన పురుష శక్తుల కలయికకు గుర్తు.

ఇలా కలపటాన్నే సుమంగళి అంటారు.

సిందూరాన్ని పెట్టే సమయంలో పురోహితుడు చదివేమంత్రం

'ఓం సుమంగళీరియమ్ వధూరిమాన్ సౌర్ణేత్ పస్యాత్

సౌభాగ్య మస్యేయ దత్వాయ అధస్టాన యూ పరేతన'

'సౌభాగ్య చిహ్నాలన్నీ ఉన్న కొత్త పెళ్లి కూతురు ఇక్కడుంది. మీరంతా వచ్చి దీవించండి. పరిపూర్ణమైన సుదీర్ఘమైన వైవాహిక జీవితం ఆమెకు సొంతం కావాలని మీరంతా ఆశీర్వదించండి.'

అప్పుడు అక్షింతలు చల్లి ఆశీర్వదిస్తారు.

అదృష్టం వరించాలనీ దైవం అభివృద్ధి కలిగించాలనీ ఆకాంక్షిస్తూ '**ఓం సౌభాగ్య మతయే... ఓం శుభమ్ భవతీ**' అంటూ పురోహితుడితో బాటు వల్లిస్తారు.

49

కుటుంబం

వ్యష్ఠిగా గాక సమిష్టిగా బ్రతికించేది కుటుంబం.

ఒక వ్యక్తికి మానసికంగా కావాల్సిన మద్దత్తునిస్తుంది. భయాన్ని పారద్రోలి భద్రత చేకూరుస్తుంది. ఆదరణనీ అనురాగాన్నీ పంచుతుంది. శారీరక మానసిక శక్తికీ వికాసానికీ తోడ్పడుతుంది.

అదే కుటుంబం!

కుటుంబమంటే మనిషి బతుకు లోగిలి.

మొదట మనిషి కుటుంబ జీవి. తర్వాతే సంఘజీవి.

కుటుంబమంటే మనల్ని సృష్టించిన వాళ్ళూ మనం సృష్టించిన వాళ్ళూ కలిసి ఉండటమే.

పురుషుడు స్త్రీని పెళ్లాడితే, స్త్రీ 'కుటుంబాన్ని' వివాహమాడుతుంది.

ఇటుకల్తో సిమెంటుతో కట్టేది ఇల్లు. బంధాలతో బంధుత్వాలతో నిర్మించేది కుటుంబం!

కుటుంబ వ్యవస్థ

కుటుంబ చరిత్ర చాలా పురాతనమైంది. వెయ్యేళ్ళ పూర్వం నుంచే కుటుంబం వ్యవస్థ ఉంది. రామాయణ మహాభారతాల్లో కూడా పలు విధాల్లో కన్పిస్తుంది.

ప్రపంచంలో ఎన్నో విప్లవాలు వచ్చాయి. మహారాజ్యాలు కూలాయి. ఎన్నో సంస్కృతులు అంతరించాయి. కాని కుటుంబ వ్యవస్థ కట్టు దిట్టంగా నిలిచిపోయింది.

పదకొండో శతాబ్దం నుంచి కొనసాగుతున్న సామాజికసంస్థల్లో కుటుంబ వ్యవస్థ కీలకమైంది.



నాటికీ నేటికీ కుటుంబపు రూపురేఖల్లో ఎన్నో మార్పులొచ్చినప్పటికీ స్వభావంలో మాత్రం మార్పులేదు.

కుటుంబం లేని సమాజాన్ని ఊహించలేం.

కుటుంబాన్ని 'విశ్వజనీనమైన మౌలిక సామాజిక వ్యవస్థ' అని సామాజిక శాస్త్రవేత్తలు వర్ణించారు.

మే 15న ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. కుటుంబ ఔన్నత్యాన్ని చాటడానికే కాదు కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకోవాలన్న ఉద్బోధావుంది.

చిత్రమేమిటంటే మనలోని కొందరు పాశ్చాత్యుల ఒంటరి పోకడల, స్వసుఖాల వంక వెర్రిగా చూస్తున్నారు! పాశ్చాత్యులేమో భారతీయ కుటుంబ వ్యవస్థ వంక ఆశగా ఆరాధనగా చూస్తున్నారు!

కుటుంబ పుట్టుక

వ్యక్తిగత ఆస్తే కుటుంబ పుట్టుకకు మూలం.

తను సంపాదించిన ఆస్తి యావత్తూ తన రక్తం పంచుకుపుట్టిన సంతానానికే చెందాలన్న బలమైన కాంక్ష కుటుంబ వ్యవస్థకి దారి తీసింది.

అదిగో అప్పుడే 'నా స్త్రీ' అన్న భావన హక్కుగా మారింది. స్త్రీని స్వంత ఆస్తిగా పరిగణించడం మొదలైంది.

భర్త /తండ్రి ఇంటి యజమాని అయ్యాడు. పితృస్వామ్యం ఆరంభమైంది. తండ్రిని బట్టి పిల్లలు గుర్తించబడ్డారు.

ఆ గుర్తింపు సాఫీగా జరగడానికి వీలుగా స్త్రీ పురుష శారీరక లైంగిక సంబంధాలను నియమ నిబంధనల చట్రంలో ఇమిడ్చారు.

ఆయా కాలాల్లో ఆయా సమాజాలు అంగీకరించిన సంబంధాలు సక్రమమూ, అంగీకరించ బడనివి అక్రమమూ అయ్యాయి!

సమాజపు యూనిట్

కుటుంబం సమాజం యొక్క ఒక యూనిట్.

ప్రేమ 'బంధం' తో రక్త సంబంధీకుల్ని ఒకింట్లో కట్టేసి ఉంచడమే కుటుంబం.

ఇంట్లోని వారిని కలిపి ఉంచుతుంది. కలిసి కట్టు భావన కలిగిస్తుంది. ఒకరంటే ఒకరికి ప్రేమాభిమానాలు, కన్సర్న్ ఉండేలా చేస్తుంది. అందరికోసం అందరు అన్పింపజేస్తుంది. ఇంట్లోవారి సుఖంకోసం ఉన్నతి కోసం శ్రమపడేలా స్వసుఖత్యాగం చేసేలా తపించేలా చేస్తుంది కుటుంబం.

సామాజిక విలువలు పాటించేదీ సమాజోద్ధరణకు కృషి చేసేదీ కుటుంబమే. కుటుంబం మీదే సమాజపు నిర్మాణం ఆధారపడి ఉంది.

మతం, సంప్రదాయం, ఆచారాలు, సంస్కృతి, రక్షణ – కుటుంబం వల్లే కుటుంబం ద్వారానే మనగలుగుతున్నాయి.

ప్రార్థన, పూజ, వ్రతాలు, తీర్థయాత్రలు – ఇంటిల్లపాదీ కలిసి చేసేది అంతా సుఖశాంతులతో వర్ధిల్లాలనే. పరస్పర ప్రేమాభిమానాలతో కుటుంబం శాంతి నిలయంగా మారాలనే.

మోక్షానికి మార్గాలు కుటుంబంలోనే కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడంలోనే గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణలోనే ఉన్నాయి!

రెండు కుటుంబాలు

ప్రతి వ్యక్తీ కూడా రెండు రకాల కుటుంబాలలో సభ్యుడుగా ఉంటాడు.

తను, తన తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు – ఇది అనుస్థాపిత కుటుంబం.

తను, తన భార్య లేక భర్త, సంతానం – జన్మ ప్రాప్త కుటుంబం.

కుటుంబం అనగా సమాజం అంగీకరించిన విధంగా లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకున్న స్త్రీ పురుషులు వారి సంతతి అనొచ్చు.

వాణిజ్య ప్రకటనల సైతం వ్యక్తుల్నిగాక కుటుంబాలని టార్గెట్ చేసుకుని సాగటం కుటుంబ ఔన్నత్యాన్ని గ్లోబలైజేషన్ కాలంలో కూడా – చాటి చెప్పడమే!

ఆత్మ స్త్రీయే

కుటుంబం యొక్క ఆత్మ స్త్రీయే.

వస్త్రం నేసేటప్పుడు మగ్గంలోని కండీ ఎలాగైతే అటు ఇటు తిరిగి బట్టనేతకు సహకరిస్తుందో సరిగ్గా అలాంటి పాత్రనే కుటుంబంలో స్త్రీ ధరిస్తుంది.

అందుకనే భారతీయ సమాజం స్త్రీకి ప్రత్యేకస్థానం ఇచ్చింది. పూజితురాల్ని చేసింది.

సప్త సుగుణాలతో కుటుంబం తద్వారా సమాజ ఉన్నతికి తనను తాను అంకితం చేసుకుని స్వార్థరహితంగా అవిశ్రాంతిగా కృషి చేస్తుందామె.

ఆమెలో కీర్తి (ప్రకాశం), శ్రీ (సంపదలు), వాక్కు (పొందికగా మాట్లాడటం) స్మృతి(ధర్మాచరణ), మేధ (విజ్ఞానం), ధృతి (భూదేవంతటి ఓర్పు), క్షమ (తప్పుల్ని క్షమించగల ఔదార్యం) అనే సప్త సుగుణాలున్నాయి.

అందుకే **'గృహిణీ గృహ ముచ్యతే'** అన్నారు. ఇల్లు అంటే ఇల్లాలే అని అర్థం!

ఉమ్మడి కుటుంబం

ఒకనాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతయ్యలు, మామ్మలు, అన్నదమ్ములు, వారి భార్యలు, పిల్లలు – పెద్ద సంఖ్యలో ఉండేవారు.

పెద్దాయన కుటుంబ పెద్దగా ఉండేవాడు. అతడి మాటే వేదవాక్కు.

ఆయన సలహా సంప్రదింపులతో వ్యవహారాలూ వ్యవసాయమూ నడిచేవి. నలుగురూ నాలుగు రకాల బాధ్యతలు పంచుకునేవారు.

ఒకరే అధిక బరువు మోయడం, సంపాదనా భారం ఒకరిద్దరి మీద పడటం ఉండేవి కావు. దానివల్ల వ్యక్తిగత ఒత్తిళ్ళూ టెన్షన్లూ లేకుండా ఉండేవి. ఒకరికి నలుగురు అన్నట్టుగా సాగేది కుటుంబ వ్యవహారం.

ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు, దెబ్బతిన్న వ్యవసాయం, ఇరుకైన మనస్తత్వాలు, క్షీణించిన సంబంధాలు, సోమరితనం, నగరాలకు వలస, ఉద్యోగవ్యాపారాలు, కన్స్యూమరిజ మనస్తత్వం – ఉమ్మడి వ్యవస్థను ముక్కలు చేశాయి.

మారిన కుటుంబ పరిధి

ఒకప్పటి కుటుంబంలో నాన్నమ్మ, తాతయ్య, వారి కొడుకులూ కోడళ్ళూ, కొడుకుల సంతానం ఉండేవారు.

డబ్బు సంబంధాలు, ఆస్తి తగాదాలు, వారసత్వ హక్కులు, వలసలు ఆ ఉమ్మడి కుటుంబాలని మాయం చేశాయి. చిన్న కుటుంబానికి – మైక్రో ఫామిలీకి దారి తీశాయి.

ఇందులో తాత, కొడుకు, మనవడు – మూడు తరాలకే స్థానం. అంటే కొడుకు యొక్క అన్నదమ్ములకు చోటులేదన్నమాట. తాత పెద్ద కొడుకు దగ్గరే సామాన్యంగా ఉండేవాడు.

ఇప్పుడదీ మారిపోయింది. ఈనాటి న్యూక్లియస్ కుటుంబాల్లో అమ్మ నాన్న వారి పిల్లలు మాత్రమే ఉంటున్నారు. వేరే వారికి అందులో చోటులేదు. తాత మామ్మలు పల్లెల్లోనో వృద్ధాశ్రమాల్లోనో ఉండాల్సిందే.

మారిన ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగపు వలసలు, మెటీరియలిస్టిక్ ట్రెండ్ ఈ మార్పుకి ముఖ్యకారణాలు.

కుటుంబ ప్రాముఖ్యత

వ్యక్తి, కుటుంబం, సమాజం – ఒక దాని నుంచి మరొక దానిని విడదీయ లేము.

అందువల్లే కుటుంబ సైజు తగ్గినా బాధ్యతలు మారినా కుటుంబ ప్రాముఖ్యత తగ్గలేదు.

రాజకీయ ఆర్థిక సాంఘిక మార్పులు సైతం కుటుంబ వ్యవస్థని కూల్చలేకపోయాయి.

కుటుంబంలో స్త్రీల అణచివేత, ఊపిరాడని తనం ఉన్నాయి. స్వేచ్ఛా జీవనంపై ఆంక్షలూ ఉన్నాయి. అవి మారాయి. వాటిమీద కుటుంబ సభ్యుల దృక్పథమూ మారింది. కుటుంబ సభ్యుల పాత్రల స్వరూప స్వభావాలూ మారాయి.

స్థూలంగా కుటుంబం మారలేదు. చెక్కు చెదరలేదు. మరింత బలపడిందని చెప్పాలి.

ఎంచేతంటే కుటుంబం మనిషి ఉనికికి కేంద్రం. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది కుటుంబమే.

పోషణకి రక్షణకి సహకారానికి సహాయానికి ఎదుగుదలకి సుఖసంతోషాలకి కుటుంబం అవసరం.

చక్కని విలువల మీద బాధ్యతల మీద నీతిసూత్రాల మీద నిర్మించబడిన మహాసౌధం కుటుంబం.

సమాజ నిర్మాణానికీ దేశ ఉన్నతికీ కుటుంబమే ఆయువు పట్టు!

భవభూతి ఉవాచ

మంచి కుటుంబం గురించి మహాకవి భవభూతి **"అద్వైతం సుఖ దుఃఖయో..."** పద్యంలో చెప్పింది సర్వదా శిరోధార్యం.

'సుఖదుఃఖాలను సమంగా భరించాలి. కలిమి లేములందు కలసి సాగాలి. మనశ్శాంతితో ఉండాలి. ముసలి తనంలోనూ ప్రేమ తరగకూడదు. కాలం గడిచేకొద్దీ స్నేహభావం స్థిరపడాలి. అందరికీ భద్రత ఉండాలి!'

ఇంతకంటే మనిషి కోరుకునేది ఏముంటుంది?!

కుటుంబ అవసరం

కుటుంబమంటే మనిషి చుట్టూతా అల్లుకున్న బంధాలూ అనుబంధాలే.

సామాజిక జీవనంలో దేశాభివృద్ధిలో కుటుంబం ఓ 'యూనిట్'కి నిర్వచనం. అంటే కుటుంబ వ్యవస్థను బట్టే సామాజిక వ్యవస్థ, దానిని బట్టే దేశ ఉనికి ప్రపంచానికి వెల్లడవుతూంటాయి.

మనిషి అనుబంధాలకు నెలవుగా నిలిచే గూడు కుటుంబం.

అతడికి ఆనందం కలిగినప్పుడు దాన్ని ఇతరులతో పంచుకోవాలని తపించినప్పుడు గుర్తు కొచ్చేది కుటుంబమే.

సమస్త ప్రపంచం నిలదీసి ప్రశ్నించినప్పుడు నిరాశానిస్పృహలు తరిమినప్పుడు అక్కున చేర్చుకుని సేద తీర్చేది ఆ కుటుంబమే.

విజయాల్లో తేలిపోకుండా అపజయాల్లో కుంగిపోకుండా బ్యాలెన్స్ చేస్తుంది.

సుఖ సంతోషాలనే కాదు కష్టాలనీ కన్నీళ్ళనీ పంచుకోడానికి కుటుంబం పెద్ద అండగా నిలుస్తుంది. పెద్ద మనస్సుతో ఆదరిస్తుంది. ప్రోత్సహిస్తుంది. తప్పుల్నీ తప్పటడుగుల్నీ క్షమిస్తుంది. సంస్కరిస్తుంది. జయాలు సాధించేందుకు వెన్ను తడుతుంది.

అమితాబ్ బచ్చన్‌కు ప్రమాదం జరిగినప్పుడు, రేఖ వ్యవహారంలో, ఎబిసిఎల్ నష్టాలపాలైనప్పుడు – అతడి కుటుంబం రక్షగా నిలబడింది. జయాబచ్చన్ రాజ్యసభ వ్యవహారాంలోనూ కుటుంబం అదే రకమైన సపోర్టు ఇచ్చింది.!

అభయహస్తం

పెళ్లంటే ఒంటరితనానికీ నిరాశా నిస్పృహలకు బాధలకు వీడ్కోలు చెప్పి అర్థవంతమైన సంతోషకరమైన మానవసంబంధానికి బాటలు వేసే సామాజిక ఏర్పాటు.

పెళ్లి యొక్క కార్యక్షేత్రం కుటుంబమే.

శిశువు పుడుతూనే తల్లి, తండ్రి, అన్న, అక్క, తాతయ్య, మామ్మ, పిన్ని, బాబాయి, అత్తయ్య, మావయ్య – ఇలా ఎన్నో బంధాలు ఒక్కసారిగా సంక్రమిస్తాయి. నువ్వు ఒంటరివి కాదు నీ కోసం మేమున్నా మన్న భరోసా కల్గిస్తాయి.

పసిపాపల నుంచి పండు ముదుసలి వరకూ ప్రతివారూ తమ అవసరం కోసం భద్రతకోసం అనురాగం కోసం కుటుంబం మీదే ఆధారపడతారు. కుటుంబపు మద్దత్తు ఉంటే భయాలుండవు. టెన్షన్లుండవు. ఏకాకి భావన ఉండదు. విచారమూ ఉండదు.

అలాంటి కుటుంబానికి గుండెకాయ తల్లి. మూలస్తంభం తండ్రి.

వారిచుట్టూ అల్లుకున్నదే కుటుంబం!

ఆర్థిక సంబంధాలు

'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే'అన్నాడు మార్క్స్ మహనీయుడు.

ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న మార్కెట్ ఎకానమీ పద్ధతుల వల్ల ఇవాళ రేపు కుటుంబం డబ్బు చుట్టూ తిరుగుతోంది.

కుటుంబంలోని కొడుకులు ముసలితనంలోని తల్లిదండ్రుల్ని దగ్గరుండి చూసుకోవాలి. వారి అవసాన దశ ఆనందంగా ప్రశాంతంగా గడిచేలా చూడాలి. ఇది హిందూ సాంప్రదాయ బోధన.

కానిప్పుడు డాలర్ల వ్యామోహంలో తల్లిదండ్రులే పిల్లల్ని విదేశాలకు తరలిస్తున్నారు.

ఆ పిల్లలు తల్లిదండ్రుల్ని వృద్ధుల శరణాలయాలకు అప్పగిస్తున్నారు!

గృహశోభ

'జాయాః పుత్రాః సమన సో భవన్తు'

గృహంలోని దంపతులు, పుత్రులు, బంధుజనులు ప్రీతికరమైన మనస్సు కలవారై ఉండాలి. అదే గృహానికి శోభనిస్తుందని అథర్వణవేదంలో పేర్కొన్నారు.

శరీరం మనస్సు ఆనందంతో పరవశించాలంటే కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి.

ఇల్లు నందనవనంగా మారినా నరకతుల్యమైనా గృహంలోని సభ్యుల పరస్పర అనుబంధ సహకారాలే కారణం!

అనుబంధాల ప్రభావం

సత్సంబంధాలు మానసిక శారీరక ఆరోగ్యాలకు ఎంతో అవసరం. అనుబంధాలు లేకపోతే స్త్రీలకు రోగనిరోధక శక్తి తగ్గుతుంది. పురుషుల రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బ తింటుంది.

ఒంటరితనం – నిద్రలేమి, డిప్రెషన్, నిస్పృహలకు లోను చేసేంత ప్రమాదకారి!

కాలిఫోర్నియాలో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం పటిష్ఠమైన సామాజిక బంధాలున్న వారు త్వరగా మృత్యువుకు గురయ్యే అవకాశాలు తక్కువట. అందరికీ దూరంగా బ్రతికే వారే త్వరగా చనిపోతున్నారట!

సామాజిక సంబంధాలు లేకపోవడం ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తోందని మిచిగాన్ యూనివర్శిటీకి చెందిన సోషియాలజిస్టుల అధ్యయనం వెల్లడిస్తోంది.

కుటుంబం విచ్ఛిత్తి వ్యక్తుల్లో ఒత్తిడి, అభద్రతా భావం పెంచుతుంది. మానసికాందోళనతో అశాంతితో కొట్టుమిట్టాడేలా చేస్తుంది.

స్థిరమైన భద్రత గల అనుబంధం ప్రాథమికంగా మనిషికి అవసరమని సైకాలజిస్టులు చెబుతున్నారు. ఒకర్తో ఒకరు కమ్యూనికేషన్‌లో ఉండటం, ప్రేమ వ్యక్తీకరణ, కౌగిలింత, ప్రతి స్పర్శ, గుండె చప్పుడు – మరింత దగ్గర చేస్తుంది. భరోసా ఇస్తుంది.

శిశువుకి తల్లి స్పర్శే కొండంత భద్రతనిస్తుంది. అదిగో ఆ క్షణం నుంచే మొదలువుతుంది. భద్రతకోసం జీవి ఆరాటం!

పిల్లలకు అనుబంధపు రుచి చూపిస్తుంది. అవగాహన పెంచుతుంది. ప్రేమానురాగాల్ని పెంపొందిస్తుంది. అభద్రతా భావాన్ని దూరం చేస్తుంది. ఆత్మన్యూనతా భావాన్ని దరిజేరనివ్వదు.

ఏకత్వమే లక్ష్యం

శివుడి కుటుంబాన్ని పరిశీలించండి.

శంకరుడు సర్పాలనూ కపాలాలనూ ధరిస్తాడు. బూడిద పూసుకుంటాడు.

పార్వతి సుందరాభరణాలను ధరిస్తుంది.

గణపతి పొడవైన తొండంతో వికృత రూపంతో ఉంటాడు.

కుమారస్వామి చక్కని రూపవంతుడు.

వారి వాహనాలు – వృషభం, సింహం, మూషికం, నెమలి – పరస్పర విరుద్ధ స్వభావం కలవి.

అయినా శివ పరివారంలో ఏకత్వముంది.

అలాగే కుటుంబంలో వేరు వేరు స్వభావాల వారు అయినప్పటికీ అంతా కలిసి ఉండాలి. తమతమ అభిమానాలూ సుఖభోగాలూ త్యాగం చేసి కుటుంబంలోని ఇతరుల హితాన్నీ సుఖాన్నీ కాపాడుతూండాలి. పరస్పర ప్రేమతో ఏకత్వాన్ని కలిగి ఉండాలి.

వేదోక్తి

'సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవచ
యస్మిన్నేవ కులే నిత్యం కళ్యాణం తత్ర వైధ్రువమ్'

ఏ కుటుంబంలో భార్యా వల్ల భర్త, భర్త వల్ల భార్య ప్రసన్నతను పొందుతారో ఆ కుటుంబంలో సంపదలన్నీ స్థిరంగా వుంటాయి – అని మనుస్మృతి చెబుతోంది.

అథర్వవేదం ఇంకో అడుగు ముందుకు వేసి ఏం చెబుతోందో చూడండి –

'అనువ్రతుః పితుః పుత్రో
మాత్రా భవతు సం మనాః
జాయా పత్యేమధుమతీం
వాచం వదతు శాన్తినామ్'

'కుటుంబం ఒక పూలగుత్తి లాంటిది. పూల గుత్తిలోని పూలన్నీ కలిసి సమిష్టి సౌందర్యాన్ని ప్రదర్శించినట్లే కుటుంబంలోని వారంతా ఏక మనస్కులై వ్యవహరించినపుడు ఆ కుటుంబ గౌరవం ఇనుమడిస్తుంది'

అనగా గృహంలోని సభ్యులంతా తమ ధర్మాలను విధులను సక్రమంగా నిర్వహించి సుఖశాంతులు పొందాలి.

సింగిల్ పేరెంట్ కాన్సెప్ట్

వెర్రితలలు వేస్తున్న కొత్త కుటుంబ విధానం ఇది.

కుటుంబంలోని ఊపిరాడనితనం నుంచి బయటపడి అధిక స్వేచ్ఛ ఆశిస్తూ అన్వేషిస్తూ కుటుంబపరిధి దాటుతున్నారు.

తండ్రి లేక తల్లి ఎవరో ఒకరే ఉంటారు. తల్లి ఉంటే తండ్రి ఎవరో తెలీదు. తండ్రి ఉంటే తల్లి ఉందో లేదో కూడా తెలీదు.

పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంతో పెళ్లి అనే బంధం లేకుండానే పిల్లల్ని కంటున్నారు. పిల్లల పోషణ 'జంట' బాధ్యతగా గాక ఒంటరి బాధ్యతగా భావిస్తున్నారు.

రక్షణ గల కుటుంబ వ్యవస్థ ముఖ్యమో లేక ఎలాంటి హద్దూ అదుపూ లేని అభద్రతా పూర్వక వ్యక్తి జీవితం ముఖ్యమో సింగిల్ పేరెంట్స్ ఆలోచించుకోవాలి.

తల్లి ప్రేమ తండ్రి సంరక్షణా రెండూ పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు ఎంతో అవసరం.

ఏది లోపించినా దాని ప్రభావం పిల్లల మీద తీవ్రంగా ఉంటుంది.

వ్యక్తుల సమూహమే కుటుంబం. కుటుంబాల సమాహారమే సమాజం. సమాజం పురోగమించాలంటే కుటుంబ వాతావరణం కలుషితం కాకూడదు.

నెట్‌వర్కింగ్

కుటుంబ వ్యవస్థ ఓ అద్భుత నెట్‌వర్కింగ్ అని చెప్పవచ్చు.

దగ్గరి సంబంధికుల మధ్యగల 'సంబంధం' అపూర్వమైనది. అవిభాజ్యమైనది. అవసరమయితే అవయవదానం చేసి రెండోవారి బ్రతుకుల్ని వెలిగించవచ్చు. ఆ రకంగా ఒకర్లో ఒకరు ఇమిడిపోవచ్చు.

ప్రముఖ హాస్యనటుడు ఏవీయస్ కు ఆయన కుమార్తె కాలేయదానమిచ్చి పునర్జన్మ ప్రసాదించింది. ఇలాటివి ఎన్నెన్నో!

సమష్టి స్వామ్యం

కుటుంబంలో అణచివేతకు తావులేదు. ఊపిరాడని తనానికి స్థానం లేదు.

కుటుంబ సభ్యులంతా బలీయమైన సంబంధం కలిగి ఉండాలి. జీవితకాలం స్నేహంగా ఉండాలి. నిజాయితీగా ఉండాలి. పరస్పర గౌరవంతో వర్ధిల్లాలి తప్ప మరొకరి స్వేచ్ఛని హరించకూడదు.

వ్యక్తుల వికాసానికి ఉన్నతికి తోడ్పడే విధంగా కుటుంబం రూపు దిద్దుకోవాలి.

అందుకని కుటుంబాన్ని ప్రజాస్వామ్యీకరించుకోవాలి. స్త్రీ పురుషులిద్దరూ సమాన హక్కులూ బాధ్యతలూ కలిగి ఉండాలి.

సమష్టి స్వామ్యాన్ని కుటుంబం జీవన విధానంగా మార్చుకోవాలి.

అదే కుటుంబ వ్యవస్థని సుసంపన్నమూ సుదృఢమూ చేస్తుంది!

50

ఆరోగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం.

మిగతా భాగ్యాలు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు. కాని ఆరోగ్యం కోల్పోతే తిరిగి సాధించడం చాలా కష్టం.

జీవితం సుఖసంతోషాలతో నిండి ఉండాలంటే ఆరోగ్యం కలిగి ఉండాలి. ఆరోగ్యం లేనిదే ఎన్ని సంపదలున్నా వ్యర్థమే.

కంటినిండా నిద్ర, వేళకు భోజనం, క్రమం తప్పని వ్యాయామం – ఇదే ఆరోగ్య సూత్రం.

ప్రపంచంలో ముగ్గురే మంచి డాక్టర్లున్నారు. వారు ఆహారం, ప్రశాంతత, ఆనందం!

క్రమశిక్షణ ఉండాలి

జీవన పద్ధతులు అడ్డదిడ్డంగా ఉండకూడదు. ఒక పద్ధతి ప్రకారం ఒక నియమానికి లోబడి ఉండాలి.

ఇష్టం వచ్చినట్లు తినడం, అర్థరాత్రి దాకా మేల్కోవడం, బారెడు పొద్దెక్కేక లేవటం, ఆలస్యంగా పనికెళ్ళడం, ఎక్కడెక్కడో తిరగటం, ఏదేదో తినడం – వగైరాలు చేయకూడదు.

ఆహారం, నిద్ర, విశ్రాంతి, వ్యాయామం అన్నిట్లో సమతుల్యత పాటిస్తేనే ఒక క్రమశిక్షణ అలవర్చుకుంటేనే ఆరోగ్యం చక్కగా ఉంటుంది.

ఆహారం

మాంసాహారం కన్నా శాకాహారం ఉత్తమమైంది. దానివల్ల సత్త్వగుణం అధికమవతుంది. మాంసభోజనం వల్ల తమోగుణం వృద్ధి అవుతుంది.

వేళకు భోజనం చెయ్యడమే ఆరోగ్యానికి తారకమంత్రం.

పనివేళ లేమైనా షిఫ్టుల్లో పనిచేసినా గంటలకొద్దీ పని చేసినా సరే సమయానికి భోంచెయ్యడం తప్పనిసరి.

భోజనంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండేట్లు చూసుకోవడం ఆరోగ్యకరం. మసాలాలు, నూనెలు తగ్గించడం అవసరం.

భోజనానికీ భోజనానికీ మధ్య ఎక్కువ విరామం ఇవ్వొద్దు. దానివల్ల ఎసిడిటీ, ఛాతిలో మంట, అజీర్తి కలగవచ్చు.

ఉదయపు అల్పాహారం నూనె లేనిది లేక తక్కువ నూనె ఉండేదిగా చూసుకోవాలి.

మొలకెత్తిన పెసలు గోధుమలు మినుములు కందులు వగైరా విత్తనాలు రోజూ తీసుకోవాలి. వాటిలో పోషక పదార్థాలెక్కువ ఉన్నాయి. ప్రొటీన్లు, విటమిన్ సి తో బాటు పలురకాలు విటమిన్లు ఒకేసారి అందిస్తాయి.

కొవ్వు పదార్థాలు ఎంత తక్కువ తింటే అంత మంచిది. ఆకుకూరలు రక్తపోటు, కొలెస్టరాల్‌లను నియంత్రించి రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి.

కాఫీ, టీ తగ్గించాలి. పూర్తిగా మానెయ్యగలిగితే మరీ మంచిది.

నీరు

నీరు సమృద్ధిగా తాగాలి. ఒకేసారి ఎక్కువ త్రాగకుండా విడత విడతలుగా నీరు త్రాగాలి. శరీరంలో నీటి నిల్వలు అధికంగా ఉండటం ఎంతో అవసరం.

రోజుకి మూడు నాలుగు లీటర్లకి తక్కువ గాకుండా నీరు త్రాగాలి.

కూల్‌డ్రింక్స్ కన్నా కొబ్బరినీరు, పండ్లరసాలు మంచివి. మామూలు టీ కన్నా లెమన్ టీ మంచిది.

పండ్లు

ఏ కాలంలో వచ్చే పండ్లు ఆ కాలంలో తినడం ఎంతో ఆరోగ్యకరం.

సీతాఫలం తింటే కడుపులోని నులిపురుగులు నశిస్తాయి. బెల్లపు చెరకురసం వేడిని తగ్గించి శరీర బలాన్నీ వీర్యవృద్ధినీ పెంచుతుంది. మామిడిపళ్ళు చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తాయి. పుష్టి కలిగిస్తాయి.

నేరేడు జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ద్రాక్ష వేడినీ శక్తినీ ఇవ్వటమేగాక ఉబ్బస నిర్మూలనకు తోడ్పడుతుంది. తొక్కతో ఆపిల్ తింటే విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది.

అరటిపండులో ప్రొటీన్లు విటమిన్లు ఖనిజాలున్నాయి. దానిమ్మ గుండె జబ్బులు నోటి వ్యాధులు గొంతు వ్యాధులు రానివ్వదు. వెలగ గొంతు శుభ్రపరుస్తుంది. ఉబ్బసం, దగ్గు తగ్గిస్తుంది.

రేగు పండు మలబద్ధకాన్ని పోగొడుతుంది. ఖర్జూరం శరీరానికి మెరుపు గుండెకు మేలు చేస్తుంది.

నారింజ గుండెకు మంచి చేస్తుంది. బాదం శరీరానికి నునుపు, శుక్రవృద్ధి కలిగిస్తుంది. నరాల బలహీనత పోగొడుతుంది. ఉసిరి మలబద్ధకాన్ని పోగొట్టడమేగాక ఆకలినీ మగతనాన్నీ పెంచుతుంది.

రోజుకో పండు తింటే చాలు అనారోగ్యం దరిదాపుల్లోకి రాదు!

వేప – తులసి

ప్రతి ఇంటి పెరట్లోనూ వేపచెట్టు, తులసి మొక్క ఉండి తీరాలన్నారు పెద్దలు.

వేపగాలికి సూక్ష్మజీవుల్ని నశింపజేసే శక్తి ఉంది. వేపనూనె, కాయలు మలేరియా రానివ్వవు. వాటి వల్ల మూత్ర సంబంధ వ్యాధులు తగ్గుతాయి.

రోజూ తులసి మొక్కకి నీళ్ళు పోసి పూజించడానిక్కారణం తులసి అంటువ్యాధుల్ని ప్రబలనివ్వదు. రోజూ ఉదయమే రెండు తులసి ఆకులు నమిలితే చాలు కఫాన్ని దూరం చేస్తుంది. గుండె జబ్బులు రావు. స్థూలకాయాన్నీ తగ్గిస్తుంది.

చనిపోయినప్పుడు తులసితీర్థం గొంతులో పోస్తారు. ఎంచేతంటే కఫంతో ప్రాణం పోయే పరిస్థితుంటే తులసి పోయగానే కఫం తొలగి ప్రాణాపాయం తప్పవచ్చని ఆశ!

శుచీ శుభ్రత

మన ఆరోగ్యానికి బాహ్య రక్షకభటులు శుచీ శుభ్రతలే.

శుభ్రత పాటించాలి. రోజుకు రెండుసార్లు స్నానం చెయ్యాలి. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. లెట్రిన్‌కి వెళ్ళినప్పుడల్లా చేతుల్ని సబ్బుతో లేదా డెటాల్తో కడుక్కోవాలి. బయట్నించి ఇంట్లోకి రాగానే కాళ్ళు కడుక్కోవాలి.

ఆహారం తిన్నప్పుడల్లా నోరు శుభ్రం చేసుకోవాలి.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి ముందు ముగ్గుతో ముగ్గులు వేయడం, గడపలకు పసుపు రాయడం సూక్ష్మక్రిములు లోపలికి రాకుండా నిరోధించడానికే.

గాలి నీరు దోమలు వగైరాల ద్వారా ఎన్నో సూక్ష్మజీవులు రోగక్రిములు మన శరీరాల్లో ప్రవేశించి అనారోగ్యం కలిగిస్తుంటాయి. వాటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

బయటి ఆహారం తీసుకునే ముందు పరిసరాలు శుచీశుభ్రతా పరిశీలించాలి. రోడ్‌సైడ్ బళ్ళలోని ఛాట్, సమోసా, ఐస్‌క్రీం, జంక్ ఫుడ్, నూడుల్స్ వగైరాలు తినవద్దు.

పెద్ద హోటల్స్‌లో సైతం మిగిలిపోయిన పదార్థాలని నిల్వచేసి మర్నాడు వడ్డిస్తూంటారు. అవి ముఖ్యంగా మాంసాహారాలు అనారోగ్యానికి కారణమవుతాయి. ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదముంది జాగ్రత్త!

వ్యసనాలు

ధ్రొగతాగుట, మద్యం సేవించుట, జరదా గుట్కా నములుట – ఆరోగ్యానికి గొడ్డలిపెట్టు. వాటిని దూరంగా ఉంచకపోతే స్లో పాయిజన్లా మీ ఆరోగ్యాన్ని కలుషితం చేస్తాయి. విషపూరితం చేసి వికటాట్టహాసం చేస్తాయి.

వాటిని మీరు మ్రింగినందుకు మిమ్మల్నవి మ్రింగేస్తాయి!

పొగ లంగ్ క్యాన్సర్‌కీ నోటి కాన్సర్‌కీ కారణమవుతుంది. మీకే కాదు మీ ప్రక్కనున్నవారికీ కాన్సర్ వచ్చే ప్రమాదముంది. అందుకే పబ్లిక్ ప్లేసుల్లో పొగ త్రాగటం నిషేధించబడింది.

ఆల్కహాల్ మనస్సుని ఉత్తేజ పరుస్తుందని భ్రమిస్తారు. కానది కేంద్ర నాడీ మండలాన్ని దెబ్బతీస్తుంది. మెదడు, వెన్నెముకల పనితీరుని తగ్గిస్తుంది. మందమతుల్ని చేస్తుంది.

మద్యం మిగతా పదార్థాలలా జీర్ణమయ్యాక రక్తంలో కలవదు. సరాసరి రక్తంలో కలిసిపోతుంది జాగ్రత్త!

అక్రమ లైంగిక సంబంధాలూ వ్యభిచారిణులతో సంబంధాలూ పెట్టుకోవద్దు. అవి సుఖవ్యాధుల్నే కాదు ఎయిడ్స్‌లాంటి భయంకర ప్రాణాంతక రోగాల పాలు జెయ్యవచ్చు. బీ కేర్‌ఫుల్!

అనీమియా

రక్తంలో ఐరన్ (ఇనుము) తక్కువగా ఉండటమే అనీమియా.

మనదేశంలో అత్యధిక శాతం స్త్రీలూ మూడేళ్ళలోపు పిల్లలూ అనీమియాతో బాధపడుతున్నారు.

ఐరన్ లోపంవల్ల అధిక రక్త స్రావం, నీరసం, తగ్గిన రోగ నిరోధక శక్తితో బాధపడుతున్నారు. స్త్రీలకు మగవారికన్నా అధికంగా ఐరన్ కావాలి.

ఇది నివారించదగ్గ రోగమే. సరైన పోషకాహారం తీసుకుంటే చాలు స్త్రీలు ఆరోగ్యవంతులుగా ఉండగల్గుతారు.

అనీమియా రాకుండా ఐరన్ ఎక్కువగా ఉండే బెల్లం, ఆకుకూరలు, ఎండు ఖర్జూర పళ్ళు, మాంసం, చేపలు తినాలి. వీటిని సి విటమిన్ గల పండ్లతో బాటు తింటే ఐరన్ అబ్జార్పషన్ అధికంగా ఉంటుంది

ఐరన్ సమృద్ధిగా అందాలంటే బాదం, ఎండబెట్టిన ఆప్రికాట్ రోజూ తింటే చక్కని ఫలితం కన్పిస్తుంది.

నడక

వాహనానికి సర్వీసింగ్ ఎలాగో మనిషికి వ్యాయామం అలాగ.

ఉదయమే క్రమం తప్పకుండా నడవటం ఆరోగ్యానికెంతో మంచిది. ఊరికే నడవటం కాదు చెమటపట్టేట్టు వేగంగా నడవాలి.

వయస్సుతో సంబంధం లేకుండా స్త్రీ పురుషులందరూ చేయదగ్గ వ్యాయామం ఇది. సమయం తప్ప మరే ఖర్చూ లేనిది. నడక కోసం ఉదయమే లేస్తారు గనుక నిద్ర సమయం తగ్గుతుంది గాని అదనపు సమయం ఖర్చయినట్టు కాదు.

రోజూ రెండు మూడు మైళ్ళ దూరం ప్రశాంత ప్రకృతిలోకి నడుస్తూ వెళ్ళడం వల్ల శక్తి పెరుగుతుంది. మానసికోత్సాహం రెట్టింపవుతుంది. అలసట, ఒత్తిడి తగ్గుతాయి. ఉత్తేజం కలుగుతుంది. శరీరంతోబాటు మనస్సు ఆహ్లాదమవుతుంది.

బద్ధకించకుండా రోజూ నడవటం అలవాటు చేసుకోవాలి. నడుస్తూ కబుర్లు చెప్పుకోవద్దు. అంతకంతకూ నడిచే దూరం పెంచుకోగలిగితే మంచిది.

గుండె, రక్తప్రసరణ చక్కగా ఉంటాయి. ఎముకలు గట్టి పడతాయి. ఊదర ఒళ్ళు తగ్గి సన్నబడతారు. శరీరం దృఢమవుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

నడకతో బాటు జాగింగ్, ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌కి ప్రాధాన్యత పెరిగింది. వ్యాయామ ప్రాముఖ్యతనంతా గుర్తిస్తున్నారు.

కొన్ని అవయవాల ఆరోగ్యం మెరుగవడానిగ్గాక అన్ని అవయవాలూ ఆరోగ్యంగా ఉండటానికి చక్కని టానిక్ – నడక!

యోగ

యోగ పుట్టింది మనదేశంలోనే. యోగ ఒక శాస్త్ర బద్ధమైన జీవన విధానం.

యోగ మనిషి జీవితంలోని ప్రతి పార్శ్వానికీ సంబంధించింది. శారీరక మానసిక భావయుక్త ఆధ్యాత్మిక విలువల్ని పెంపొందిస్తుంది.

యోగ అంటే కలయిక – జీవాత్మ పరమాత్మతతో కలవడం.

యోగ అంటే మాటలకీ చేసే పనులకీ సక్రమ సంధానం.

యోగలో రాజయోగ, జ్ఞానయోగ, భక్తియోగ, మంత్రయోగ వగైరా ఎన్నో విభాగాలున్నాయి.

కాని ప్రస్తుతం యోగ ఒక ఫిట్‌నెస్ కార్యక్రమంగా పేర్గాంచింది. నిత్యం ఎదుర్కొనే స్ట్రెస్‌కి సమాధానం యోగలో లభిస్తోంది.

యోగాసనాల వల్ల శరీరకణాల్లో పేరుకొన్న వివిధ రకాల టాక్సిన్స్ వ్యర్థ పదార్థాలు బయటకు పంపబడతాయి. ప్రాణాయామాలు, రిలాక్సేషన్ విధానాలు మానసిక స్ట్రెస్ తగ్గిస్తాయి.

వివిధ ఐటి, సాఫ్ట్‌వేర్, మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఉద్యోగులకోసం యోగ క్లాసులు ఏర్పాటు చెయ్యడం స్ట్రెస్ తగ్గించడానికే. టార్గెట్ల ఒత్తిడినీ ఆందోళననీ తట్టుకోడానికే. మానసికస్థైర్యం చేకూర్చడానికే.

యోగ వల్ల శరరంలో ఒక సమతుల్యత కలుగుతుంది. దానివల్ల అనేక శారీరక మానసిక వ్యాధులు నయమవుతున్నాయి.

ఆస్త్మా, డయాబెటిస్, అల్సర్, బ్లడ్‌ప్రెషర్, కీళ్ళ నొప్పులు, జీర్ణాశయవ్యాధులు, కేన్సర్, గుండె జబ్బులు, సోరియాసిస్‌లాంటి చర్మవ్యాధులు, అధిక బరువు చాలా వరకు నివారించబడుతున్నాయి.

మానసికారోగ్యం

శారీరక మానసిక ఆరోగ్యాలు రెండు ఉంటేనే సంపూర్ణారోగ్యం లభిస్తుంది.

మనస్సుని ప్రశాంతంగా ఉంచుకోడానికి ప్రయత్నించాలి.

కోపం, ఆవేశం, అసూయ, ప్రలోభం, అత్యాశ మానసిక ఆరోగ్యాన్ని పాడుజేస్తాయి. ఒత్తిళ్ళూ ఆందోళనలూ బీపీ పెంచి నిద్రలేమి కలిగిస్తాయి.

డిప్రెషన్, యాంగ్జయిటీ న్యూరోసిస్, హిస్టీరియా, ఫోబియాలాంటి మానసిక జబ్బుల్ని తెచ్చిపెడతాయి.

పూజలు ధ్యానాలు చెయ్యాలి. ఉన్నదానికి తృప్తిపడుతూనే మరింత ఉన్నత స్థితికి ఎదగడానికి ప్రయత్నించాలి.

కుటుంబ సంబంధాలు బాగుండాలి. ఇంట్లో శాంతి సుఖాలు ప్రతిష్టించుకోవాలి.

భార్యాభర్తలిద్దరూ సంపూర్ణంగా లైంగికానందం పొందాలి. ఎలాంటి ఇన్హిబిషన్లూ అసంతృప్తులూ జడత్వాలూ శాడిజాలూ ఉండకూడదు.

ధన సంపాదన గురించి ఆరోగ్యాన్ని పాడుచేసుకోకూడదు. అనారోగ్య వంతుడయ్యాక బోల్డు ధనం ఉన్నా అనుభవించే యోగం ఉండదు!

కష్టాలను ఇబ్బందులను చిర్నవ్వుతో అధిగమించాలి. మనోధైర్యాన్ని సడలనివ్వకూడదు. ప్రతి చిన్న విషయంలోనూ సంతోషానందాలను చూడాలి. సంధ్యావందనాలు జపతపాలు పూజలు ప్రార్థనలూ చెయ్యాలి.

ఆరోగ్యకరమైన ఆలోచనలతో నియమ నిష్ఠలతో భగవద్యానంతో మానసికారోగ్యాన్ని సంరక్షించుకోవాలి.

ధ్యానం

ఆత్మసాక్షాత్కారం పొందటానికి మనస్సు నడిపే విధానమే ధ్యానం.

మనస్సును మన ఆధీనంలోకి తెచ్చుకొనే గొప్ప ప్రకియ ధ్యానం. మనస్సును శక్తిమంతం చేసుకోడానికి ధ్యానమే మార్గం.

పతంజలి అష్టాంగ యోగంలో ధ్యానం ఏడవమెట్టు.

ధ్యానం చేయడానికి ధ్యానాసనంలో కూర్చోవాలి. పద్మాసనం, వీరాసనం, స్వస్తికాసనం, వజ్రాసనం, సుఖాసనం – ఏదైనాసరే.

కాని రోజూ ఒకేచోట ఒకే సమయంలో చెయ్యాలి. తూర్పుదిశలో కూర్చోవాలి.

వెన్నెముక నిటారుగా ఉంచి కళ్ళు మూసుకోవాలి.

ఆలోచనల్ని కేంద్రీకరించానికి కొందరు ప్రాణధారణ అంటే శ్వాస గమనిక చేస్తారు.

కొందరు సాకారం – ఏదైనా ఆకారాన్ని దేవుని ప్రతిమను మనస్సులో పెట్టుకుని చేస్తారు.

ధ్యానం ముగించే ముందు నెమ్మదిగా కళ్ళు తెరవాలి. అరచేతులకు రాపిడి కల్గించి కళ్ళకు అద్దు కోవాలి.

ధ్యానం వల్ల నాడిరేటు తగ్గుతుంది. ఒత్తిడి వల్ల కలిగే దుష్ఫలితాలను ఎదుర్కోగలరు. ప్రశాంతత అనుభవంలోకి వస్తుంది. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, ఒత్తిళ్ళు, ఆందోళనలు, అలజడులకు ధ్యానం దివ్యౌషధం!

ఉపవాసం

వారానికో రోజు ఉపవాసముండటం మంచిది. శరీరతత్వాన్ని క్రమపరచడమే గాక శరీరాన్ని శుద్ధిచేస్తుంది. రక్తంలో సీరం లిపిడ్‌ల కాన్సెంట్రేషన్ తగ్గి స్థూలకాయాన్ని నివారిస్తుంది. బరువు తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ మెరుగవుతుంది.

ఉపవాసం పేరుతో అధిక ఉపాహారం తినకుండా పండ్లరసాలు మాత్రం తీసుకోవడం ఉత్తమం.

నిద్ర

చక్కని ఆరోగ్యానికి కమ్మని నిద్ర కావాలి.

శ్రమపడినందున శరీరం ఆలసిపోతుంది. దానికి విశ్రాంతి అవసరం. శరీరాంగాలు శక్తిని కోల్పోతాయి. అవి పుంజుకునేందుకు శక్తిని ప్రోది చేసుకోవాలి. మనస్సుకి ప్రశాంతత చేకూర్చే సేదదీర్చే సమయం కావాలి.

ఇవన్నీ నిద్ర ద్వారానే నిద్ర వల్లనే సాధ్యం!

మనిషికి సగటున రోజుకి ఏడుగంటలు నిద్ర అవసరమని నిపుణుల అభిప్రాయం.

సరిగ్గా నిద్రపోలేక పోవటం అనారోగ్య చిహ్నం. అజీర్తి, ఆందోళన, భయాలు ఉన్నవారికి నిద్ర దరిజేరదు.

'అలుక యెత్తినవానికి, అర్థ చింతనునకు, ఆతురునకు కామగోచరాత్మునకు నిద్రవచ్చునె' అన్నారు తిక్కన మహాభారతంలో.

నిద్ర లేకపోతే అలసట, ఆయాసం, పగటి నిద్రలకు దారితీస్తాయి.

నిద్రపోవుటకు రాత్రుళ్ళు అనుకూలం. ప్రకృతి ప్రశాంతంగా ఉంటుంది గనుక హాయిగా నిద్రపోగల్గుతారు.

రాత్రుళ్ళు పని చేసే వారు పగలెంతసేపు పడుకున్నా వారి ఆరోగ్యంలో మార్పులొస్తాయి. బద్ధకంగా నిరుత్సాహంగా బడలికగా ఉంటుంది.

వాటిని అధిగమించడానికి గదిలో ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. నిద్రాభంగం కలిగించే శబ్దాలు వినబడకుండా జాగ్రత్తపడాలి.

నిద్రలేమితో బాధపడేవారు రోజూ వ్యాయామం చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. వారు పగలు నిద్రపోకూడదు. రాత్రి భోజనానికీ నిద్రకీ మధ్య రెండు గంటల వ్యవధి ఉండాలి. రాత్రి ఆహారంలో నూనె, మసాలాలు తక్కువ వుండేలా చూచుకోవాలి. వేడినీళ్ళ స్నానం, వేడిపాలు నిద్రకు మంచి ఉపకరణాలు.

పడుకునే ముందు పుస్తక పఠనం చేస్తే కళ్ళను అలసేట్లు చేసి త్వరగా నిద్రపుచ్చుతుంది.

చక్కని ఆకలి, కమ్మని నిద్ర వున్నంత కాలం మీ ఆరోగ్యానికి ఢోకాలేనట్టే!

ఆరోగ్య సంపద

మన ఆరోగ్యంలో సగం ఘనత మనకీశరీరాన్నిచ్చిన తల్లిదండ్రులకే చెందుతుంది.

తల్లిదండ్రులు సంపూర్ణ ఆరోగ్యవంతులైతే వారి సంతానమూ ఆరోగ్యసంపదతో కళకళ లాడుతుంది.

అంచేత అక్రమ లైంగిక సంబంధాలు, వ్యభిచారం లాటివి వారి ఆరోగ్యాన్నే కాక తరువాతి తరాన్నీ కలుషితం చేయగలవుజాగ్రత్త!

ఏకపత్నీ / ఏకపతి వ్రతం ఆచరిస్తే వారి సంతానమూ 'క్షేమంగా' ఉంటుంది.

మరో సంగతి. ఆరోగ్యవంతులే అవయవదానం చేయడానికి అర్హులు.

మత విశ్వాసం

పెరిగే క్రమంలో కొన్ని విశ్వాసాలు ఏర్పడతాయి. ప్రపంచం మొత్తం మీద భక్తి లేదా ఏదో ఒక మతవిశ్వాసం లేని మనిషి ఉండడు.

'మనిషిలో ధైర్యాన్ని పెంచి పిరికితనాన్ని పారద్రోలేదే మతం. మానసిక బలాన్ని పెంచి బలహీనతను తొలగించేదే మతం. మనిషిలో మంచిని పెంచి చెడుని త్రుంచేదే మతం' – అన్నారు వివేకానంద.

మతం మనిషిని సన్మార్గ వర్తనుడ్ని చేస్తుంది. ఆలోచనలను శుద్ధి చేస్తుంది.

శారీరక మానసిక ఆరోగ్యాలకు అపూర్వ రక్షాకవచం మత విశ్వాసం!

51

ఆనందం

'శుభం' 'శుభమస్తు' 'కళ్యాణమస్తు' 'మంగళమగు గాక' 'సుఖీభవ' 'సుఖసంతోషాలతో నూరేళ్ళు వర్థిల్లండి' 'మీ ఇల్లు పాడిపంటల్తో సుఖసంతోషాలతో తులతూగాలి"

ఇవన్నీ పెద్దలు పిన్నలకిచ్చే ఆశీర్వాదాలు.

అవన్నీ కూడా ఆనందానికి పర్యాయపదాలే.

అంతకు మునుపు వారు సుఖంగా సంతోషంగా లేరని కాదు. వుండే వుంటారు. ఇక పై కూడా అలాగే వుండాలి. ఎప్పటికీ ఆనందంగా వుండాలన్నది పెద్దల ఆకాంక్ష.

సుఖసంతోషాలే మనిషి జీవన లక్ష్యం.

జీవితాంతం అవి కలిగి వుండాలన్నదే ప్రతివారి తాపత్రయం.

మరణానంతరం ఆనందపు అత్యద్భుత స్థితియైన మోక్షం పొందటమే మానవుడి నాలుగో పురుషార్థం.

ఆనందం అంటే ?

శరీరానికి లభించే సంతృప్తి ఇంద్రియసుఖం.

తనో తనవారో గెలిచినప్పుడో సాధించినప్పుడో లభించే మానసిక సంతృప్తి సంతోషం.

వాటికి భిన్నమైనది ఆనందం.

ఆనందం ఆహ్లాద మనస్సుకు ప్రతిబింబం.

మనస్సులో మల్లెల మాలలూగినట్లు శరీరంలోని అణువణువు పరవశించినట్టు, కాళ్ళు గాలిలో తేలిపోతున్నట్టు, గుండె లోతుల్లోంచి చిత్రమైన భావన తన్నుకొస్తున్నట్టు – అన్పించే ఒక భావావేశం. ఉద్వేగం!

ఆనందం ఓ అద్భుత రసానుభూతి.

మనిషి తపన, పరుగు, దేవుళ్ళాట ఆనందం కోసమే. సుఖం కోసమే!

మనస్సును రంజింప జేసే భావనే ఆనందం. ఆనందమంటే సుఖం. సుఖమంటే శుభం. శుభమంటే మంగళం, మంగళమంటే క్షేమం. క్షేమమంటే కళ్యాణం. కళ్యాణమంటే ఒక యోగం. యోగమంటే కైవల్యం. కైవల్యమంటే మోక్షం.

మోక్షమంటే పరమాద్భుతమైన శాశ్వతమైన ఆనందస్థితి.

అందుకే ఆనందో బ్రహ్మ – ఆనందమే బ్రహ్మస్వరూపం అన్నారు!

అష్టాంగ యోగం

దుఃఖాన్ని ఎదుర్కోవడానికి బుద్ధుడు ఉపదేశించిన ఎనిమిది మార్గాలే అష్టాంగ యోగం.

దుఃఖం లేక పోవటం ఆనందానికి తొలిమెట్టు గనుక అవేమిటో తెలుసుకుందాం.

సమ్యక్ దృష్టి	:	సరియైన సహేతుకమైన ఆలోచనా విధానం కలిగి వుండటం.
సమ్యక్ సంకల్పం	:	ఉన్నతమైన విలువలు గల ఆశయాలు కలిగి వుండటం
సమ్యక్ వాక్కు	:	కపటం, మాయలేకుండా సత్యాన్ని మాట్లాడటం
సమ్యక్ కర్మ	:	శాంతియుతమైన, స్వచ్ఛమైన ప్రవర్తనతో మెలగటం
సమ్యక్ జీవనం	:	అహింస, దయ, మానవత్వాలతో జీవించడం
సమ్యక్ కృషి	:	సరియైన సచేతనమైన పనులు చేస్తూ జీవించడం
సమ్యక్ స్మృతి	:	జీవిత పరిశీలన చేస్తూ అవగాహనతో ఆలోచించడం
సమ్యక్ సమాధి	:	పైన పేర్కొన్న ఏడింటినీ పట్టుదలతో ఆచరించడం

స్వార్థచింతన, ప్రతిఫలాపేక్ష, దురాశాపూరిత ఆలోచనలు – విడనాడినట్లైతే దుఃఖ నివారణ సాధ్యమన్నాడు బుద్ధుడు.

విభిన్న దృక్పథం

సుఖం గురించి ఆనందం గురించి ఒక్కొక్కరి దృక్పథం ఒక్కో విధంగా వుంటుంది. అది వారి వారి స్వభావాల మీదా పరిపక్వత మీదా నమ్మకాలమీదా ఆధారపడివుంటుంది.

మనుచరిత్ర లోని ఈ సంభాషణ చూస్తే ఆ వైరుధ్యం అర్థమవుతుంది.

"ఇంద్రియ తపన చల్లారి శారీరక సుఖానుభూతితో మనిషి సేదతీరితే అదే బ్రహ్మానందం" అని వరూధుని అంటే ప్రవరాఖ్యుడేమన్నాడో చూడండి.

"సుఖమూ ఆనందమూ రెండింటి మధ్య చాలా తేడా ఉంది. తుచ్ఛమైన ఇంద్రియ సుఖాలను స్వచ్ఛమైన ఆత్మగతమైన ఆనందంతో పోల్చిచూడటం చాలా తప్పు"

సుఖానుభూతి శరీరానికి సంబంధించినది.

సంతోషం మానసికమైంది.

ఆనందం మనిషి చైతన్యానికి చెందింది. పదిమందికి సంతోషాన్నిచ్చే ఒక అద్భుత విజయాన్ని సాధించినప్పుడు మనిషికి కలిగే అపురూప భావనే ఆనందం!

గొప్ప టానిక్

మనిషికి ఉత్సాహాన్నీ ఉత్తేజాన్నీ ఇచ్చే టానిక్ ఆనందం. హేపీనెస్.

అడుగడుగునా ప్రతి చిన్న సాధనకీ గెలుపుకీ ఇంద్రియాల స్పందనకీ అనుభూతికీ సంతోష పడతాం. హేపీగా ఫీలవుతాం.

డబ్బు సంపాదించినా కోరిక తీరినా ప్రమోషన్ వచ్చినా పెళ్లైనా ప్రశంస లభించినా ప్రేమ ఫలించినా బిడ్డ పుట్టినా లాటరీ తగిల్నా శృంగారానుభూతి పొందినా ఆస్తులు కొన్నా ఇతరులకు సాయపడినా పూజలూ వ్రతాలూ చేసినా ధర్మ కార్యాలు చేసినా ఆనందపడతాం. పొంగి పోతాం.

ప్రకృతి దృశ్యం చూసినా చక్కని సంగీతం విన్నా సినిమా చూసినా జీవిత భాగస్వామితో కబుర్లు చెప్పినా పిల్లలతో ఆడినా మంచి పుస్తకం చదివినా టీమ్ ఇండియా గెలిచినా సమాజంలో గుర్తింపు లభించినా ఏదైనా సాధించినా – ఆనందమే, సుఖానుభూతే!

ఇన్ని రకాలుగా సంతోష పడుతున్నా తృప్తి వుండదు.

ఇంకా ఇంకా సంతోషం కావాలని తాపత్రయ పడుతూనే వుంటాడు మనిషి.

అదొక తీరని దాహం!

ఆంగ్ల సూక్తి

'ఓ గంటసేపు సంతోషంగా వుండాలంటే మనసుకు నచ్చిన ఆహారం తీసుకోవాలి. ఓ మూడు గంటలు సంతోషంగా వుండాలంటే ఏదైనా సినిమా చూడాలి. ఒకరోజంతా సంతోషంగా గడపాలంటే విహారయాత్రకు వెళ్ళాలి. వారం రోజులు సంతోషంగా వుండాలంటే ఓ వైజ్ఞానికి యాత్రకు వెళ్ళాలి. ఒక నెలరోజులు సంతోషంగా వుండాలంటే పెళ్లిచేసుకోవాలి. కానీ జీవితమంతా సంతోషంగా వుండాలంటే చేస్తున్న పనిని ప్రేమించాలి!'

పండుగలు

మన దేశంలో వున్నన్ని పండుగలు ప్రపంచంలోని మరే దేశంలోనూ లేవు. హైందవ పండుగలే గాక మరెన్నో పండుగలున్నాయి.

పుట్టినప్పట్నుంచి కడదాకా మనం జరిపే షోడశ సంస్కారాల్లోని 15 సంస్కారాలు ఉప సంస్కారాలూ ప్రతీదీ ఓ వేడుకగా శుభకార్యంగా జరిపిస్తాం. అవీ మనకు పండుగలే.

పండుగంటే ఒక సెలబ్రేషన్. ఆనందాన్ని పంచుకుంటూ పెంచుకోవడం. ప్రతి పండగా శుభవేడుకే. ఆనందసందర్భమే.

ఇంటిని పచ్చని తోరణాలతో అలంకరించడం, బంధుమిత్రులు రావడం, కుటుంబ సభ్యులంతా కలవడం, నవ్వుతూ తుళ్ళుతూ సంబరంగా గడపడం. కొత్త బట్టలు, పిండివంటలు, తలంట్లు, కలిసి భోంచెయ్యడం, వినోదించడం – ఓహ్ పండగంటే పండగే మరి!

అలాంటివి జరుపుకోగల మహత్తర అవకాశం లభించడం భారతీయుల పూర్వజన్మ సుకృతమే.

పండుగల వల్ల అనుబంధాలు ఆత్మీయత పెరుగుతాయి. సంతృప్తి పెరుగుతుంది. సంపూర్ణభావం కలుగుతుంది.

పది మందితో కలసి పంచుకున్న ఆనందం మనశ్శరీరాలను ఆనంద డోలికల్లో వూగిస్తుంది!

ఆర్ట్ ఆఫ్ లివింగ్

భారతీయ సంస్కృతీ సంప్రదాయాల గురించి తెలీని ఆధునికుల కోసం శ్రీ శ్రీ రవిశంకర్ తదితరులు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అంటూ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉన్నత వర్గం వారూ ప్రముఖ వ్యాపారులూ ఉద్యోగులూ వారి కుటుంబాలూ వీటికి హాజరవుతున్నారు. ఆదిరిస్తున్నారు.

జీవనాన్ని ఒక కళగా తీర్చి దిద్దుకుంటూ ఆనందాన్ని జుర్రు కోవడమెలాగో బోధిస్తూంటారు.

'అందరూ కోరుకునేదీ తాపత్రయ పడేదీ ఒక్కటే. ఆనందం. తాత్కాలిక ఆనందానికి ముగింపు వుండదు. ఇంకా కావాలనే దిశగా ప్రయాణిస్తాం. శాశ్వత ఆనందమంటే నువ్వేమిటో అదే. ఉపనిషత్తులు సమాధి స్థితిలోని ఆనందం మిగతా ఆనందాల కన్నా కోటి రెట్లు ఎక్కువంటాయి" అంటారు రవిశంకర్.

యోగ గురు భరత్ ఠాకూర్ ఏమంటున్నారో చూడండి –

'భౌతిక సంతోషాలు, భావావేశాల తృప్తి ఆనందానికి మూలకారణాలు'

'బాహ్య అంతర అవసరాలు తృప్తి పడాలి. మనిషి కాలాన్ని దాటటం లేదు. కాలమే మనిషిని దాటేస్తోందని గుర్తించడం ముఖ్యం. ప్రతిసెకనూ మనిషి కొంత చనిపోతున్నాడు. ఇది గ్రహిస్తే చాలు మృత్యు భయముండదు. ఆనందమేవుంటుంది.'

'ఆనందం కోసం ప్రయత్నించలేం. దానంతటదే సంభవిస్తుంది. అది భౌతిక శారీరక సాంఘిక ఆధ్యాత్మిక ఉన్నతుల సమ్మేళనం!'

ఆనందపు లోగిలి

M TV Net works International పద్నాలుగు దేశాల్లో ఒక సర్వే నిర్వహించారు. దాని ప్రకారం ప్రపంచంలోని అన్ని దేశాల్లోని యువకుల కంటే మన దేశపు యువత ఎక్కువ ఆనందంగా వుందిట.

చిన్నవాటికి సైతం సంతోషపడటం, ప్రతిదాన్లోనూ మంచిని మాత్రమే చూడటం, మతవిశ్వాసాలు కలిగి వుండటం అందుక్కారణాలుగా భారతీయ యువకులు పేర్కొన్నారు.

చిత్రమేమిటంటే అధిక ధనవంతులైన జపనీయులు అత్యల్ప సంతోషులని వెల్లడయ్యింది!

రాజకీయపార్టీల ధోరణి

ప్రపంచంలోని వివిధ రాజకీయ పక్షాల మీద కూడా 'సుఖ' ప్రభావం పడబోతోంది.

ఒకప్పుడు కూడు గూడు గుడ్డ ఇస్తామని ప్రజలకు వాగ్దానం చేశారు. తర్వాత సంపాదనావకాశాలు పెంచుతామన్నారు. పిమ్మట జాతీయాదాయం జాతీయసంపద సగటు ఆదాయం సగటు అభివృద్ధి సాధిస్తామన్నారు.

ఇకపై సీన్ మారనుంది.

జాతీయానందం పెంచుతాం, ముఖ్యమైనవి ఉచితంగా ఇస్తాం, అంతా సుఖంగా జీవించేట్లు చూస్తాం – అన్నవి వారి ఎజెండా కానున్నది!

ఆశావహ దృక్పథం

మనిషి దృక్పథాన్ని బట్టి ఆనందముంటుంది. ఒకరికి ఆనందం కలిగించింది మరొకరికి అనాసక్తం కావొచ్చు.

పాజిటివ్ థింకింగ్ అలవర్చు కోవాలి. నిరాశావాదులుగా నిత్య శంకితులుగా వుండకూడదు. వ్యతిరేక భావనలొద్దు. కోపం, అసూయ, దురాశ వద్దు.

అంతా మంచే శుభమే జరుగుతుందని విశ్వసించాలి.లభించిందే ప్రాప్తం అనుకోవాలి. దానికే సంతోష పడాలి. భవిష్యత్తు ఇంకా అనుకూలిస్తుందని ఆశించాలి. గ్రహాలు నక్షత్రాలు పంచభూతాలు ముక్కోటి దేవతలు అన్నీ అంతా చల్లగా చూస్తారన్న విశ్వాసంతో ఉండాలి.

వారంతామెచ్చే ప్రసన్నమయ్యే పనుల్నే చెయ్యాలి. ఫలితం బాగుండే పదిమందికీ ఉపయోగపడే కార్యాలే చెయ్యాలి.

అప్పుడిహ ఆనందం చిందులేస్తూ వస్తుంది మీ చెంతకు!

మత విశ్వాసాలు

మతం మనిషిని సన్మార్గ వర్తనుడివి కమ్మంటుంది. జనహితం కోరడమే కాదు అందుకు నీ వంతు ధర్మం నిర్వర్తించమంటుంది.

మతవిశ్వాసాలు కలిగి వుండటం, దేవాలయలకూ తీర్థయాత్రలకూ వెళ్ళడం ధ్యానం దానం చెయ్యడం– అభిలషణీయం.

ప్రపంచాన్ని నడిపే ఒక మహాశక్తి వుందని విశ్వసించడం, శిష్టుల్ని రక్షిస్తుందని సుఖశాంతుల్నీ మోక్షాన్నీ ప్రసాదిస్తుందని నమ్మడం – వాంఛనీయం. శ్రేయస్కరం!

అప్పుడు మనస్సు దూది పింజ అవుతుంది. చెట్టులో పుట్టలో రాతిలో రప్పలో కొత్త అర్థం కొత్త భావం కన్పిస్తుంది. ఏదో తెలీని భరోసా గుండెల్నిండా పరచుకుంటుంది.

జగమంతా కాంతి మయం ఆనందమయం ప్రేమమయం అన్న భావన ఊపేస్తుంది.

ఎంతో హేపీగా వుంటుంది. హేపీనెస్‌ని అందరికీ పంచాలన్పిస్తుంది. గో ఎహెడ్! ముందుకి సాగిపోండి!

మనిషికి కావాల్సినవి

మనిషి చాలా చాలా కోరుకుంటాడు. అతడికి ఎన్నెన్నో కావాలి.

డబ్బు, ప్రేమ, పెళ్లి, సెక్స్, కుటుంబం, సంతానం, వినోదం, కళలు, గుర్తింపు, పొగడ్త, కీర్తి, అధికారం – అన్నీ కావాలి.

జీవితాంతం వాటి కోసమే అవి సాధించడానికే ఇంకా ఇంకా వృద్ధి చేసుకోడానికే శ్రమిస్తాడు, తపిస్తాడు. ఆరాట పడతాడు. పోరాటాలూ చేస్తాడు.

అవన్నీ లభిస్తే ఏం జరుగుతుంది?

అవన్నీ కోరుకునేది దేని గురించి?

సుఖంగా వుండటానికి. సుఖంగా బ్రతకడానికి.

అంటే ఆనందం సిర్ఫ్ ఆనందం కోసమే!

మనిషి లక్ష్యం ఆనంద పానమే! అది వుంటే చాలు అది లభిస్తే చాలు మరేమీ అక్కర్లేదు.

నిజంగా అక్కర్లేదా?

వూహూ కావాలి. ఇంకా కావాలి. ఇంకా ఇంకా ఆనందం కావాలి. దోసిళ్ళతో త్రాగాలి. అందుకోసం పరుగు...పరుగు.... అలసి పోయేవరకూ!

సుఖం కావాలి

డబ్బు, అధికారం, శృంగారం, విజయం – అంతులేని ఆనందాన్నిస్తాయని భావిస్తారు.

అది భ్రమ. పాక్షిక సత్యం. అవి కొంతే ఇస్తాయి. కొంత సేపే ఇస్తాయి.

సుఖం అందరికీ కావాల్సిందే. ఎప్పుడూ కావాలన్నదే మనిషి కోరిక.

రుచికరమైన భోజనం, చక్కని వస్త్రభూషణాలు,విశాలమైన భవనం - ఇవన్నీ పొందటానికి డబ్బు కావాలి.

అందమైన భార్య/భర్త, చక్కని సంతానం, ఇంచక్కని కుటుంబం, శృంగారానుభవం - ఇవన్నీ అందుకోవడానికి వివాహం కావాలి.

అహం తృప్తి పడటానికి, అధికులమని ఫీలవడానికి, గౌరవం మర్యాద పొందటానికి - ఇవన్నీ సాధించడానికి ఔన్నత్యమో అధికారమో కావాలి.

కొన్ని సాధించడానికి, అభినందింపబడటానికి, కీర్తింపబడటానికి ఇవన్నీ జరగటానికి విజయమూ కావాలి.

ఇవన్నీ కోరికలే. అవి అనంతం. ఒకటి తీరేక ఒకటి రావు. ఒకేసారి అనేకం పుడతాయి.

అవి తీరితేనే సుఖమూ సంతోషమూ. అందునిమిత్తం చక్కని ప్రవర్తన, ఆశా దృక్పథం, మంచిఅలవాట్లు, సద్బుద్ధి, సత్కార్యాలు చేసే గుణం కలిగివుండాలి. ప్రేమించడం దయ చూపడం, అనుబంధాల్ని పెంపోందించుకోవడం, ఆపన్నుల్ని ఆదుకోవడం, చక్కని లక్ష్యాలు కలిగి వుండటం - చెయ్యాలి.

బాధించే జ్ఞాపకాలు గుర్తు చేసుకోకూడదు. అపురూప అనుభూతుల్ని నెమరువేసు కుంటూ వుండాలి.

అప్పుడు తెలుస్తాయి ఆనందానికి వున్న రంగులూ ప్రతిబింబాలూ!

సంతృప్తి ఉండాలి

సంతోషానికి మూలం తృప్తి.

తృప్తి లోనే ఆనందం వుంది.

కాని ఆనందం వేరు తృప్తి వేరు.

సంపాదన, పేరు, ప్రతిష్ఠ వగైరాలన్నీ సంతోషాన్నిస్తాయిగాని తృప్తినిస్తాయని చెప్పలేం. సంతోషం పంచేంద్రియాలకు సంబంధించినది. తృప్తి మనస్సుకు సంబంధించింది.

లభించిన జీవితాన్ని, పరిస్థితుల్ని, అవకాశాల్ని యథాతథంగా అంగీకరించాలి. మెరుగు పరుచు కోడానికి ప్రయత్నించాలి. కృంగి పోకూదు. నిరాశా నిస్పృహలు దరిజేరనిస్తే అవి సుఖాన్ని హరిస్తాయి.

భయాల్ని కలిగించే అనుమానాల్ని రేకెత్తించే ఆందోళన కలిగించే నిద్రలేమిని కలుగుజేసే ఆరోగ్యాన్ని పాడు జేసే భయాల్ని సృష్టించే పనులు చెయ్యవద్దు. అలాంటి కార్యాలు దుఃఖహేతువులవుతాయి.

సంతోషం డబ్బులో లేదు. డబ్బు మొదట ఆనందాన్నిస్తుంది. ఆ తర్వాత ధన దాహం పెరుగుతుంది. ఇంకా ఇంకా సంపాదించాలన్న యావ మనిషినెక్కడికో తీసుకువెళ్తుంది. శాంతిని ఆనందాన్ని దూరం చేస్తుంది.

అలాటి స్థితి రాకూడదంటే సాధించిన దానికి సంపాదించినదానికి తృప్తిపడాలి.

సంతోషం సగం బలమైతే సంతృప్తి సంపూర్ణ బలం!

ఆనందమార్గం

డబ్బు, విజయం, కుటుంబ సహకారం, శృంగారం, వినోదం, స్నేహితులు, ఉద్వేగాల తృప్తి, ప్రేమ, ఆరోగ్యం, కరుణ, ధ్యానం –ఇవి ఆనంద మార్గాలు.

ఆనందం ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ఒక్కో విధంగా కలుగుతుంది. ఎవర్నుంచి దేనినుంచి ఎప్పుడు ఎలా ఎందుకు కలుగుతుందో తెలుసుకుని ఎవరికెలా ఆనందమన్పిస్తే అలా ఆనందాన్ని పొందాలి.

జీవితంలోని ఆనందమంతా ప్రేమించడంలో ప్రేమించబడటంలో వుంది. ప్రేమించి లాలించి సేద దీర్చే కుటుంబజీవనంలో వుంది. కరుణలో వుంది దయలో వుంది. సేవ చెయ్యడంలో వుంది. క్షమించడంలోనూ వుంది. ధర్మ బద్ధమైన రీతిలో ధర్మార్థకామాలను సాధించడంలో వుంది.

పుస్తకాలు సంగీతం కుటుంబం స్నేహితులు మీ ఆనందాన్ని విస్తృత పరుస్తాయి.

సాహిత్యం, చిత్రలేఖనం, నటన, సంగీతం, గానం, నృత్యం – లాంటి కళలు మనస్సులో ఆనందామృతాన్ని వర్షింపజేస్తాయి. వాటి మీద – కనీసం ఏదో ఒక కళ మీద అభిరుచి పెంచుకోవాలి. ప్రతిభ పెంచుకోవాలి. గుర్తింపు కోసం కృషి చెయ్యాలి. అప్పుడు కురిసే ప్రశంసల వర్షంలో ఆనందతాండవం చెయ్యొచ్చు.

ప్రేమించిన వారి ముఖాల మీద ఆనందపుకాంతి చూడటం గొప్ప అనుభూతి. సేవందుకున్న వారి కళ్లల్లో ప్రతిఫలించే అభిమానం కృతజ్ఞత ఆనందం చూడటం మహా ఆనందకరం.

ఆనందంగా వున్న వారే ఇతరుల్ని సంతోషపెట్టగలరు.

పదుగురి ఆనందం కోసం పాటు పడేవారే అధిక ఆనందం పొందగలరు.

సర్వేజనా సుఖినోభవంతు!

స్వర్గం

స్వర్గం దేవలోకం. ఆనందలోకం. సుఖం లభించే ప్రదేశం.

పుణ్యాత్ములకు స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందంటారు.

అక్కడి వారు అమృతం త్రాగి అమరులవుతారు. వారికి ఆకలి వుండదు. అంచేత సంపాదించాల్సిన పని వుండదు. అంటే శ్రమ వుండదు. కష్టం వుండదు. వృద్ధాప్యం వుండదు. మరణం లేదు గనుక మృత్యుభయమూ వుండదు. కోరికలూ వుండవు.

మరేం వుంటుంది?

ఆనందం!

మనస్సుని మంత్రించి మైమరపించి ఆనందడోలికల్లో ఊగించి ఊరించి తేలించే అసమాన అపురూప అనుభూతి!

ఎప్పటికీ అదే స్థితిలో వుండాలంటే మళ్ళీ జన్మించ కూడదు.

దుఃఖం, రోగాలు, ముసలితనంలో శరీరం కృశిస్తోంటే పడే బాధలు, ఆందోళనలు, వేదనా భరిత మరణం – ఏవీ మళ్ళీ అనుభవించాల్సి రాకూడదు.

అంటే జన్మరాహిత్యం లభించాలి.

అదే మోక్షం!

మోక్షమంటే కష్టాలనుండి కోరికల్నుండి చావునుండి విముక్తి.

అదే మహాసంతోషం. ఉత్కృష్టమైన ఆనందం. బ్రహ్మానందం. ఆనంద స్వరూపం. పరమానందం!

52

కుటుంబ కలహాలు

సముద్రానికి ఆటుపోట్లెంత సహజమో వైవాహిక జీవితంలో ఒడిదుడుకులూ అంతే సహజం.

పూర్వ పరిచయంలేని ఇద్దరు వ్యక్తులు 'పెళ్లి' తో ఏకమవుతారు.

ఇద్దరూ విభిన్న పరిస్థితుల్లో పెరిగినవారు. విద్య, అలవాట్లు, ఆశలు, ఆశయాలు, వ్యక్తిత్వం – అన్నింటా విభిన్నత వుంటుంది.

అయినా వారిద్దరూ ఒకే కప్పు కింద కాపురం చెయ్యాలి. ఎడ్జస్టవ్వాలి.

వారి మధ్య ఎంతో కొంత ఘర్షణ అనివార్యమవుతుంది.

పెళ్లైన కొత్తలో పొడసూపని విభేదాలు కాపురం పెట్టేక తలెత్తుతాయి. తలెగరేస్తాయి.

వాటినిద్దరూ సహృదయంతో అర్థం చేసుకుని మంచీ చెడూ విశ్లేషించుకుని పరిష్కరించుకోవాలి.

అలా చేస్తే గోటితో పోతాయి. అలాకాక వాటిని ముదరనిస్తే కలహంగా మారుతుంది. అప్పుడు గొడ్డలి అవసరమవ్వొచ్చు!

అవగాహన ప్రధానం

భార్యాభర్తల మధ్య చక్కని అవగాహన వుండాలి. అవతలివారు చేప్పేది వినకుండా తెలుసుకోకుండా ఏకపక్ష అభిప్రాయానికి రాకూడదు.

ఒకర్నొకరు అర్థంచేసుకోవాలి. కనీసం అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి.

సవాళ్ళను సమస్యలను ఎదుర్కొని పుటంపెట్టిన బంగారంలా భార్యాభర్తలు శోభను సంతరించుకోవాలి.

వివాహం జీవితాంతబంధం అన్నది గుర్తుంచుకుని అగ్ని పరీక్షలకు తట్టుకుని కాపురాలను సరిదిద్దు కోవాలి.

వివాహబంధాన్ని పదిలంగా నిలబెట్టుకోవడం భాగస్వాములిద్దరి బాధ్యత. లౌకిక అంశాలన్నిటినీ సామరస్యంగా పరిష్కరించుకుని ఆ బంధాన్ని పటిష్ఠపరచుకోవాలి.

ప్రతి నిమిషం కలిసుంటారు గనుక మూడ్సునీ టెంపర్‌మెంటునీ కంట్రోలు చేసుకోవాలి. సహనం, క్షమలతో 'ఆయిలింగ్' చేస్తూండాలి.

ఒకరి సుఖసౌఖ్యాలు మరొకర్తో ముడిపడి వున్నాయని గ్రహించి అభిప్రాయ భేదాలని సున్నితంగా పరిష్కరించుకోవాలి. అవసరమైతే ఒకరు తగ్గాలి. ఒకడుగు వెనక్కేయాలి. చిన్నచిన్న త్యాగాలకీ సిద్ధపడాలి. ఒకరి సాహచర్యం ఒకరికి కావాలని బలంగా కోరుకోవాలి.

అప్పుడు సమస్యలూ విభేదాలూ దూది పింజల్లా తేలిపోతాయి.

ఏ ఇద్దరి స్వభావాలు అభిరుచులు అభిప్రాయాలు ఒక్క తీరుగా ఉండకపోవడం ప్రకృతి రీతి. అది గ్రహిస్తే చాలు సర్దుబాటు తేలికవుతుంది. అప్పుడు పెళ్లి నూరేళ్ళ పంట అవుతుంది.

కలహించు కోవద్దు

కలహం అహం వల్ల వస్తుంది. మితిమీరిన స్వార్థం వల్ల వస్తుంది.

'నేనే గ్రేట్' 'నేనే కరక్ట్' 'నామాటే నెగ్గాలి'– అనుకోవద్దు.

'నా ఇష్టం' 'నేనిలాగే చేస్తాను' 'నా సొమ్ము నా ఇష్టం'– అనొద్దు.

పెళ్లయ్యాక ప్రతీదీ ఇద్దరిదీ అవుతుంది. 'మా' కి తప్ప 'నా' కి స్థానం లేదు. ఆ సంగతి గుర్తుంచుకుని ప్రవర్తించాలి.

ఆధిక్యభావన రానీయరాదు. ఒకర్నొకరు విమర్శించుకో కూడదు. ప్రతి దానికీ పట్టు విడుపులుండాలి.

బలహీనతల్ని అంగీకరించాలి. బలాన్ని గౌరవించాలి. విచక్షణ,లోకజ్ఞానం ఉపయోగించాలి.

పరస్పర విశ్వాసంతో గౌరవంతో సద్భావనతో వ్యవహరిస్తే కలహానికి తావే వుండదు.

కలసి మాట్లాడు కోవడం, కలసి ఆలోచించడం, కలసి భోంచేయడం వల్ల కలహాలకి ఊపిరందదు!

ఒకరు కోప్పడతే ఆవేశంతో రెచ్చిపోతోంటే మౌనంగా గదిలోంచి లేదా ఎదుటినుంచి నిష్క్రమించాలి. దాంతో ఆవేశం తగ్గుతుంది. ఆలోచన రగుల్తుంది. రాజీ ప్రవేశిస్తుంది. శాంతి చిగురిస్తుంది.

భర్త లోటు పాట్లని ఎలా అయితే సరిదిద్దాలని భార్య అనుకుంటుందో సరిగ్గా అలాగే భార్య విషయంలో భర్తా అనుకుంటాడు. అంచేత అవతలి వారిని మార్చాలనిగాక అవతలివారి కనుకూలంగా తను మారాలని ఆలోచిస్తే ఘర్షణే వుండదు.

డబ్బు జబ్బు!

సంసారంలో ఎక్కువగా డబ్బు సంబంధిత గొడవలే వస్తుంటాయి.

కట్నకానుకలు పెట్టుపోతలు గురించి దెప్పుళ్ళూ కోపాలూ పట్టింపులూ కలహానికి అగ్ని రాజేస్తాయి.

దురలవాట్లకి డబ్బు తగలెయ్యడం, ఇంటి అవసరాలు పట్టించు కోకపోవడం, దుబారా ఖర్చు చెయ్యడం, గొప్పలకు పోవడం స్థాయిని మించి ప్రవర్తించడం – వగైరాలు గొడవలకి కారణమవుతాయి.

చాలని సంపాదన, పెరిగిన ఖర్చులు, ఆర్థిక ఇబ్బందులు అశాంతి పాలు జేస్తాయి. ఆవేశాన్ని రగిలిస్తాయి. నిస్పృహతో పరుషంగా మాట్లాడిస్తాయి.

డబ్బు విషయంలో దాపరికాలు లేకుండా వ్యవహరిస్తే చాలా వరకు డబ్బు గొడవలు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఆదాయ వ్యయాల గురించి ఇద్దరూ చర్చించుకుని ఒక అభిప్రాయానికి రావాలి. దాన్ని అమలు చెయ్యాలి. ఆదాయం పెంచుకనే మార్గాలు వెదకాలి. ఆర్థికంగా కుటుంబం మరింత ఉన్నత స్థానానికెదిగేలా ఇద్దరూ కృషి చెయ్యాలి. కోరికల్నీ ఆశల్నీ అదుపులో వుంచుకోవాలి.

అలా చేస్తే ఆర్థిక సమస్యలూ తగ్గుతాయి. ఉన్నంతలో సుఖంగా తృప్తిగా జీవించ గలుగుతారు.

శృంగార సమస్యలు

శృంగారజీవితాన్ని చక్కగా పరిపూర్ణంగా అనుభవిస్తున్న దంపతుల మధ్య చక్కని సామరస్యత వుంటుంది.

అది కలహాలని రానివ్వదు.

ఎలాంటి అలక అయినా ఒక ముద్దుతో మాయమవుతుంది.

శారీరక సంబంధం మానసికంగా దగ్గర చేస్తుంది. చక్కని సమన్వయం కుదురుస్తుంది. సమానత్వపు విలువ చాటుతుంది.

దంపతులు శృంగారాన్ని సంపూర్ణంగా ఆస్వాదించడానికి తద్వారా తమ బంధాన్ని పటిష్ట పరచుకోడానికి ప్రయత్నించాలి.

కొన్నిసార్లు సెక్స్‌లో విఫలత,శృంగారమంటే విముఖత – కలహాలకి దారి తీయవచ్చు. వాటిని అధిగమించడానికి కృషి చేయాలి.అవసరమైతే సిగ్గు పడకుండా డాక్టర్లనీ కౌన్సిలర్లనీ సంప్రదించాలి. అపోహలతో అనుమానాలతో సిగ్గుతో తమలోతామే కృంగిపోతూ రెండోవారికి చెప్పకుండా దాస్తే వారిలో నిరాశ, అసహనం పెరుగుతాయనీ అనుమానం కలుగుతుందనీ గుర్తించాలి.

అది అశాంతికీ చిటపటలకీ ఆపైన బిగ్గరగా అరవడానికీ చులకనచేసి మాట్లాడటానికీ హీనంగా చూడటానికీ దారితీస్తుంది. ఫలితం కలహం!

కెరీర్ ఉమన్

స్త్రీ కెరీర్‌కి అధిక ప్రాధాన్యత నిస్తోంది. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోటానికి కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోడానికి విపరీతంగా కృషి చేస్తోంది.

ఫలితంగా సంప్రదాయ 'గృహిణి' పాత్రను ఇదివరకటిలా పోషించలేక పోతోంది. సంసారం కోసం అధిక సమయాన్ని కేటాయించలేక పోతోంది. తనూ ఉద్యోగపు ఒత్తిళ్ళకు లోనవుతోంది.

ఈ సంగతి ఆమె భర్త గ్రహించాలి. ఆమె మూడ్స్‌ని గుర్తించాలి. ఆమె తన బాధ్యతలని సక్రమంగా నిర్వర్తించాడానిగ్గాను ఇంటి బాధ్యతల్ని పిల్లల సంరక్షణని కొంత తనూ స్వీకరించాలి. ఆమె కష్టాన్ని శ్రమని గౌరవించాలి.

మిగతా గృహిణుల్తో పోల్చి దెప్ప కూడదు. 'ఆడపని' నేను చెయ్యనంటూ భీష్మించకూడదు. ఆమె ఎదుగుదల చూసి ఈర్ష్య పడకూడదు. ఆమె డ్యూటీ సమయాలూ బాధ్యతలూ తెలుసుకుని సహకరించాలి తప్ప నాకెందుకునుకోకూడదు. ఎక్కువ తక్కువ అభిప్రాయం రానివ్వకూడదు. న్యూనత ఫీలవ్వకూడదు.

లేకపోతే అపార్థాలూ అనుమానాలూ పోట్లాటలూ తప్పవు!

స్త్రీ కూడా కుటుంబజీవనానికి అడ్డం కాని విధంగా తన వ్యక్తిత్వాన్నీ స్వేచ్ఛనీ కెరీర్నీ మలచుకోవాలి!

దంపతులు ప్రత్యర్థులు కాదు

దంపతులు స్నేహితుల్తప్ప ప్రత్యర్థులు కాదు. ఒకరికొకరు సహకరించు కోవాలి సంప్రదించు కోవాలి తప్ప విమర్శలకు, దెప్పుళ్ళకు దిగకూడదు.

ప్రత్యర్థులుగా శత్రువులుగా మారకూడదు.

'ఇలా చెయ్యట్లేదు' 'అలాచేశావు' 'అర్థంచేసుకోవు' 'పట్టించుకోవు' 'లెక్కచేయరు' – అంటూ పంతాలకీ బెదిరింపులకీ పోకూడదు. నిబంధనలు విధించ కూడదు.

వాదనలూ చర్చలూ ఒకరి అభిప్రాయం ఒకరు తెలుసు కునేందుకుపయోగించాలి గాని గాయపర్చడానికి కాదు. వికృతానందం పొందడానిక్కాదు.

వాదనల్లో పదే పదే పాత అంశాలు ప్రస్థావించకూడదు.

చర్చతో సమస్య పరిష్కారమవ్వాలి తప్ప పీటముడి పడకూడదు.

ఒకరు తగ్గటం లేదా రాజీపడటం చేసి సయోధ్య కోసం ప్రయత్నించాలి తప్ప సవాళ్ళు ప్రతి సవాళ్ళు చేస్తూ రెచ్చి పోకూడదు. నోరు పారేసుకోవడం, బిగ్గరగా అరవడం, ఏడ్వడం తగదు.

ఇది తమ సంసారం అన్నది గుర్తుంచుకుని అందులోంచి ఉద్భవించే సమస్యల్ని సామర స్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి.

ఇద్దరు వ్యక్తిత్వాల మేలు కలయికే సంసార బంధాన్ని పటిష్ఠం చేస్తుందని మరువరాదు.

కోపమే శత్రువు

తన కోపమే తన శత్రువు అన్నారు. కోపం వుంటే చాలు ఇంకే విరోధాలూ అక్కర్లేదు.

కోరికలు తీరనప్పుడు సహనం నశించినప్పుడు కోపం వస్తుంది. కోపం వస్తే వివేకం నశిస్తుంది. దాంతో మనస్సు అదుపు తప్పుతుంది. మాట్లాడే భాష మర్యాద ముసుగు తీసేసుకుంటుంది.

తిట్లు దెప్పుళ్ళు హెచ్చరికలు హింసాపూరిత చేష్టలు!

కోపాన్ని నియంత్రించు కోగలిగితే ఇంట్లో అశాంతి వుండదు. భార్యభర్తల మధ్య అగాధం ఏర్పడదు.

క్రోధాన్ని జయించడానికి ప్రయత్నించాలి. ఒకటి నుంచి పది అంకెలు లెక్కపెట్ట వచ్చు. ఎదుటి వారి నుంచి దూరంగా వెళ్ళ వచ్చు. వివేకానందుడిలా బావిలోంచి

నీరు తోడుకొని స్నానం చెయ్యవచ్చు. రాధాకృష్ణన్‌లా గమ్మున కూచోవడంగాని ఏకాంత ప్రదేశాని కెళ్ళి పరమాత్మను ధ్యానించడం గాని చెయ్యవచ్చు.

కనబడని శత్రువైన కోపాన్ని సంసారంలో కనబడకుండా చేసుకోవాలి.

పిల్లల ముందు జాగ్రత్త

భార్యాభర్తల గొడవలు పిల్లలకు తెలీనివ్వకూడదు.

వారి ముందు అరచుకోవడం, గొడవపట్టం, ఆ కోపాన్ని పిల్లల మీద ప్రదర్శించడం చేయవద్దు.

అవి ఆ చిన్నారి మనసుల మీద వ్యతిరేక ముద్ర వేస్తాయి. బాధ కలిగిస్తాయి. ఒకరి మీద సానుభూతినీ మరొకరి మీద ద్వేషాన్నీ కలిగిస్తాయి.

ఆలుమగల మధ్య వచ్చే కీచులాటలు, కలహాలు పిల్లలను భయ భ్రాంతుల్ని చేస్తాయి. అభద్రతకు గురిచేస్తాయి.

ఇదెంత మాత్రం మంచిది కాదు. వారి భవితకు గుదిబండ కావచ్చు సుమా.

ఈ సంగతి గ్రహించి కలహాలు రాకుండా జాగ్రత్త పడాలి. తప్పని సరైనప్పుడు తాత్కాలిక విరమణ పాటించి పిల్లల ఎదుట బయట పడకుండా చూసుకోవాలి.

ఆ గేప్ మీలో పునరాలోచన పశ్చాత్తాపం కలిగించవచ్చు. సమస్య తేలికవ్వొచ్చు. ఆవేశం, కోపోద్రేకం తగ్గవచ్చు. పరిష్కారం సులభంకానూ వచ్చు.

తల్లిదండ్రుల నీడన ప్రేమపూరిత వాతావరణంలో పెరిగితేనే పిల్లలకి మంచి భవిష్యత్తు వుంటుంది!

వివాహేతర సంబంధాలు

పరస్త్రీ సంబంధమో పరాయి పురుషుడి ప్రమేయమో కుటుంబంలోకి ప్రవేశిస్తే అది కల్లోలంలో పడేయడం ఖాయం.

చాల వరకు కుటుంబ కలహాలకి కారణం వివాహేతర సంబంధాలే.

భార్యగాని భర్తగాని వివాహ బంధానికీ పెళ్లినాటి ప్రమాణాలకీ కట్టుబడివుండాలి. పరస్పరం విశ్వాస పాత్రంగా వుండాలి. వ్యవహరించాలి.

అక్రమ సంబంధాల కోసం అర్రులు చాచకూడదు. జీవిత భాగస్వామిని వంచించకూడదు.

తన సరదాలు ఆనందాలు మోహాలు అన్నీ తన భార్య/భర్త తోనే తీర్చుకోవాలి. తమ కెలా వుంటే బాగుంటుందో చెప్పి మార్చు కోవాలి. అంతే తప్ప 'పర' కోసం పరుగెట్ట కూడదు. క్షణికానందం కోసం శాశ్వత విలువలకి నీళ్ళొదల వద్దు.

అది కలహాలకి వివాహవిచ్ఛిత్తికి దారి తీస్తుంది.

ఫలితం అనుభవించేది దంపతుల కన్నా అధికంగా వారి ప్రియ సంతానమే!

వివాహ బంధంలోని ప్రేమే అనుబంధమే ఆనందమే శాశ్వతమైన సత్యాలు!

కుటుంబ సహకారం

విభేదాలు భార్యా భర్తలు పరిష్కరించు కోలేనంత పెద్దవైనప్పుడు కుటుంబవ్యవస్థ ఆసరా తీసుకోవాలి. తల్లిదండ్రుల్తో అత్తమామల్తో తమకన్నా పెద్దవారైన సోదరుల్తో సంప్రదించాలి. సలహాలు తీసుకోవాలి.

వారు అనుభవ శాలులు, లోకజ్ఞానం అధికంగా గలవారు గనుక పెద్ద మనస్సుతో వ్యవహరిస్తారు. మీ ఇద్దరి క్షేమం కోరి మీ మధ్య సంధి కుదురుస్తారు.

వారి మాటకి బోధకి కట్టుబడితే చాలు మీ వైవాహిక జీవితం గోదావరి మీద పడవ ప్రయాణంలా సాగిపోతుంది.

అవసరమైతే మీ స్నేహితుల సహకారమూ తీసుకోవచ్చు.

అలా చేసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. ఇద్దరికీ స్నేహితులైన వారినే సంప్రదించాలి. వూరికే ఇంటి గుట్టు రట్టు చేయకూడదు. అది మరిన్ని తగవులకు దారి తీయవచ్చు జాగ్రత్త!

కలహ భోజనులు

నారదుడికి కలహమే భోజనమట. ఆయన్ది జగత్కల్యాణ దృష్టి అన్నది వేరే సంగతి.

ఆ తరహా వాళ్ళు మన చుట్టు ప్రక్కల చాలా మంది వుంటారు. సానుభూతి చూపుతూ విషయాన్ని రాబడతారు. చిన్న విషయానికి రంగులు పూసి బూతద్దంలో చూపిస్తారు.

కాపురం కూలబోతోందంటూ ఎగదోస్తారు.

వారి మాయలో పడకూడదు. సానుభూతితో వినేవారంతా శ్రేయోభిలాషుల కాదు. అసూయతో ప్రవర్తించే వారుంటారు. అవతలి వారు బాధ పడుతుంటే చూసి సంతోషించే శాడిస్టులూ వుంటారు.

అందుకే క్లోజ్ ఫ్రెండ్స్‌తో తప్ప ఎవర్తో బడితే వారితో తమ విభేదాల గురించి భార్యా భర్తలు చర్చించకూడదు.

ఇతరుల అతి, అనవసర జోక్యం వల్ల నష్టపోయేది దంపతులేనని గ్రహించి అలాంటి పరిస్థితి రాకుండా ముందే జాగ్రత్త పడటం ఉత్తమం!

సరదాలు సరదాకే

కొందరికి కొన్ని సరదారాలుంటాయి.

సినిమాలు చూడటం, నాటకాలు వేయడం కావచ్చు. సాహిత్య కృషి చేయడం, సంగీత కచేరీల కెళ్ళడం, ఆటలాడ్డం, పాటలు పాడ్డం, పుస్తక పఠనం, అల్లికలు కుట్లూ – ఇలా ఎన్నోరకాల హాబీలు, సరదాలు.

అందరూ అవి ఇష్టపడాలని లేదు.

ఒకరి హాబీ మరొకరికి డబ్బు దండుగ పని అన్పించొచ్చు.

ఒకరి సరదా మరొకరికి దుబారాగా టైంవేస్ట్‌గా అన్పించొచ్చు.

ఏం కలిసొస్తుందని ప్రశ్నించి నొప్పించడం తగదు. హాబీలు ఆనందాన్నీ తృప్తినీ ఇస్తాయి. అది గమనించి ప్రోత్సాహించాలి. ప్రతిభ వుంటే ప్రవృత్తే వృత్తిగా మారొచ్చు. ఎంతో సంపాదించనూ వచ్చు.

అంచేత వాటిని తీసి పారెయ్యొద్దు. వారిని చిన్న చూపు చూడవద్దు.

చిరు సంతోషాలే చిరుమువ్వల సవ్వడై మనస్సుల్ని మురిపిస్తుంది.

ఆ చిన్ని చిన్ని ఆనందాలని దూరం చెయ్యడానికి ప్రయత్నించొద్దు. వాటిని మెచ్చుకుంటే చాలు మీ మీద అభిమానం రెట్టింపవుతుంది. కటువుగా విమర్శిస్తే మనస్సు నొచ్చుకుంటుంది. మథన పడతారు. అశాంతితో అలమటిస్తారు. దురభిప్రాయం పెంచుకుంటారు. అది ఎవరికీ శ్రేయస్కరం కాదు!

అత్తింటిని తృణీకరించవద్దు

భార్యకి అత్తిల్లు కాని భర్తకి పుట్టిల్లు.

తల్లిదండ్రులు వేరేగా లేక వేరే చోట ఉన్నప్పుడు వారి అలనా పాలనా చూడటం ఆర్థిక సాయమందించడం కొడుకుగా అతడి బాధ్యత.

అందుకామె సహకరించాల్సివుంది. కాని అంతా అలా వ్యవహరించరు.

'మిగతా కొడుకులు చూడొచ్చుగా మీరే ఎందుకు చూడాలి!' 'వాళ్ళు తెలివాగా తప్పుకుని మీ నెత్తిన బరువు పెడుతున్నారు' 'వందో రెండొందల్తోనో సర్దుకోక నెలనెలా అంత పంపడానికిక్కడ డబ్బు చెట్లున్నాయా!' 'వాళ్ళ బరువంతా మీరొక్కరే మోస్తానంటే నేనొప్పుకోను' 'నా పిల్లల నోళ్ళు కొట్టి ఎవరికో దోచిపెడ్తా నంటారేంటి' – ఇలాంటి డైలాగులు బాధనీ కోపాన్నీ కలిగిస్తాయి. మాటా మాటా పెరిగి చిలికి చిలికి గాలివాన వుతుంది.

తల్లిదండ్రుల మీది అతడి ప్రేమాభిమానాలనీ అతడి బాధ్యతల్నీ అర్థం చేసుకోవాలి. మీరు వృద్ధులయ్యాక మీలాగే మీ కోడలు మాట్లాడితే మీ కెలా అన్పిస్తుందో ఒక్కసారి ఎవరికి వారు ఆలోచించుకోవాలి.

మీ ఆర్థిక పరిస్థితినీ అవసరాలనీ దృష్టిలో వుంచుకుని మీ అత్తింటి వారికి సాయం చెయ్యమని చెప్పండి. మీ మీద అభిమానం పెరుగుతుంది. మీరాశించి నట్టు జాగ్రత్తగానూ వుంటారు. ఇక కలహానికి తావేం వుంటుంది ?!

మరో సంగతి. భార్యా భర్తల మధ్య తలెత్తిన విభేదాల్లోకి తల్లి దండ్రుల ప్రస్తావన తేవద్దు. వారి లోపాలు ఎత్తి చూపుతూ వ్యాఖ్యలు చెయ్యడం వల్ల అగ్నికి ఆజ్యం పోసినట్లవుతుంది పరిస్థితి దిగజారుతుంది జాగ్రత్త!

తప్పటడుగులు

దాంపత్యబంధానికి భాగస్వాములిద్దరూ కట్టు బడివుండాలి. తను కోరుకున్నట్టే అవతలి వారూ కోరుకుంటారని గుర్తిస్తే చాలు సగం సమస్యలు పరిష్కారమవుతాయి.

నమ్మకం పునాది మీదే కాపురాలు నిలుస్తాయి. ఆ నమ్మకం కోల్పోయేట్లు ఎవరూ ప్రవర్తించకూడదు. నమ్మకం ఉన్నచోట అభద్రత వుండదు. అనుమానం వుండదు. రహస్యాలుండవు.

అయినప్పటికీ కొన్ని తప్పులు జరుగుతాయి. వాటిని ఒప్పుకుని నమ్మకాన్ని పునరుద్ధరించు కోవాలి. మీ పశ్చాత్తాపం మీలో వచ్చిన పరివర్తన రెండో వారికి అర్థమవ్వాలి. అర్థమయ్యేట్లుండాలి. మీ ప్రవర్తన, నమ్మకం 'చెడ్డవారి'ని కూడా ఆలోచింపజేస్తుంది. మార్పు తెస్తుంది.

కోపంతో మాట తూలినా విచక్షణ కోల్పోకూడదు. సంయనంతో చక్కదిద్దుకోవాలి వయస్సు ఆకర్షణలూ వ్యామోహాలూ ఎంతో కాలం వుండవని గుర్తుంచుకోవాలి.

దారిలో పడేవరకూ తప్పటడుగులే తప్పటడుగులు!

కమ్యూనికేషన్ గేప్ వద్దు

ఆలుమగల మధ్య గొడవలకి కారణం వారి మధ్య సరియైన కమ్యూనికేషన్ లేకపోవడమే. సరైన భావ వ్యక్తీకరణ చక్కని అవగాహనకీ సద్భావనకీ బాట వేస్తుంది.

అవతలి వారు చెప్పింది ఓపిగ్గా వినాలి. అసహనంతో ప్రెజుడిస్‌తో అడ్డు తగల కూడదు. తర్కం వేసుకోకూడదు. ఇద్దరికీ నచ్చే పరిష్కారం కోసం కృషి చెయ్యాలి తప్ప రెచ్చి పోకూడదు.

ఇద్దరి మధ్యా అవగాహన, సయోధ్య వున్నప్పుడు కమ్యూనికేషన్ అద్భుత ఫలితాల నిస్తుంది. లేకపోతే అపార్థాలు పెరిగి టెన్షన్లు పుట్టి గొడవలకి బీజం వేస్తాయి.

అనవసర పోట్లాటకీ ఆర్గ్యుమెంట్లకీ అవకాశం ఇవ్వొద్దు. ప్రతీదీ బూతద్దంలో చూసి స్పందించొద్దు.

ఈ సందర్భంగా వారు గుర్తించాల్సిన మరో ముఖ్య విషయం ఏమిటంటే ఎవరూ సంపూర్ణులు కారు. ప్రతివారికీ కొన్ని బుల్లి లోపాలు చిన్న బలహీనతలు డ్రా బాక్స్ వుంటాయి. ప్రేమిస్తున్నప్పుడు వాటినీ అంగీకరించి సర్దుకు పోక తప్పదు.

మెల్లగా నచ్చ చెప్పి మార్చడానికి యత్నించ వచ్చు గాని అదేదో కొంపమునిగే వ్యవహార మన్నట్టు వీధికెక్కి రాద్ధాంతం చేస్తే పరిస్థితి వికటించే ప్రమాదముంది.

అసహనాలు అవిశ్వాసాలు ప్రేమ రాహిత్యం పెరిగితే భార్యా భర్తల సంబంధం అనురాగ రహితమై మొక్కుబడి బంధమైపోతుంది!

బాధ్యతారాహిత్యం

పెళ్లిచేసుకుంటే చాలదు దాని ద్వారా సంక్రమించే బాధ్యతల్నీ స్వీకరించాలి. పెళ్లి వల్ల వచ్చే సుఖాలు కావాలి మిగతావి అక్కర్లేదంటే కుదరదు.

కొందరు భర్తలు లేక భార్యలు బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తారు.

గృహనిర్వహణని పట్టించుకోక పోవడం, సరైన వృత్తి చేబట్టకపోవడం, భార్యని / భర్తని నిర్లక్ష్యం చెయ్యడం, సంపాదించిన సొమ్ము ఇంట్లో ఇవ్వకపోవడం, పిల్లల్ని పట్టించుకోకపోవడం, వ్యసనాల బారిన పటడం, దూర ప్రదేశంలో ఒంటరిగా ఎక్కువ కాలం వుండటం, స్వసుఖం స్వకీర్తి కోసం వెంపర్లాడటం – వగైరాలు దాంపత్య బంధాన్ని బలహీనపరుస్తాయి. కలతలకూ కలహాలకూ కారణమవుతాయి.

వీటిని ఆదిలోనే గ్రహించి సరిదిద్దుకోవాలి.

ముదరనిస్తే వివాహ విచ్ఛిత్తికి దారి తీసే ప్రమాదముంది.

గృహహింస

మారిన ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీ పాత్ర ఎంతో మారింది. ఆమె ఇప్పుడు అనేకరంగాల్లో పురుషుడితో సమానంగా పోటీ పడుతోంది. ఆర్థిక స్వేచ్ఛతో దూసుకుపోతోంది.

ఆ మార్పుని గ్రహించక జీర్ణించుకోలేక కొందరు మూర్ఖులుగా శాడిస్టులుగా అణచివేత దారులుగా కొండొకచో నేరస్తులుగా మారుతున్నారు.

పుట్టింటి నుంచి ఇంకా కట్నం తెమ్మనో, వస్తువాహనాలు పట్రమ్మనో, శీలాన్ని అనుమానించో, పురుషాహంకారంతోనో, అణగద్రొక్కటమే మగతనమన్న దురభిప్రాయంతోనో స్త్రీలని హింసిస్తున్నారు. వేధిస్తున్నారు. కష్ట పెడుతున్నారు.

'కలకంఠి కంట కన్నీ రొలికిన ఆ ఇంట సిరి తానుండ నొల్లదని' గుర్తు పెట్టుకోవాలి.

భౌతికంగా మౌఖికంగా లైంగికంగా మానసికంగా ఆర్థికంగా మహిళను వేధించినా బెదిరించినా గృహహింసలో భాగమవుతుంది. కఠిన శిక్షార్హమవుతుంది.

ఆలుమగల బంధం మధ్యకి అనురాగాన్నీ విశ్వాసాన్నీ ఆనందాన్నీ తీసుకురావాలి తప్ప నేరాల్నీ శిక్షల్నీ కాదు!

ఇద్దరూ విజేతలు కావాలి

భార్యభర్త లిరువురూ వివాహబంధంతో ఒకటయ్యారనీ కలకాలం కలిసి సాగాలనీ బాగా గుర్తు పెట్టకోవాలి.

ఏ వ్యక్తీ పరిపూర్ణులు కారు. భాగస్వామిని లోపాలతో సహా స్వీకరించినప్పుడే ఆ జీవిత కాలపు భాగస్వామ్యం నిలుస్తుంది. అందుకోసం ఒకర్నొకరు అర్థం చేసుకోవాలి. ఎక్కువ తక్కువ భావనల్ని రానివ్వకూడదు. మనస్సు విప్పి మాట్లాడు కోవాలి. పరస్పరం ప్రశంసించుకోవాలి.

భార్య భర్తని అనుమాన దృష్టితో చూడకూడదు. పనుల్లో పడి భర్తని ఉపేక్షించకూడదు. వెక్కిరించడం దెప్పటం చేయరాదు.

భర్త భార్య మాటలకీ సూచనలకీ విలువివ్వాలి. అనుమానించకూడదు. అహంకారం అధికారం ప్రదర్శించ రాదు.

తమ మాటే నెగ్గాలనే పట్టుదల ఇద్దరికీ వుండకూడదు.

చదువు, తెలివి, ప్రతిభ ఎందుకూ కొరగాకుండా పోతున్నాయన్న నిరాశానిస్పృహలు రెండోవారిలో కలక్కుండా చూడాలి. అవి రాణించేందుకు సాయపాడలి. ప్రోత్సహించాల్తప్ప కించ పరచకూడదు. తీసి పారెయ్య రాదు. 'ఇంటి పని చేస్తే చాల్లే' అని ఈసడించకూడదు.

సమస్యలు అభిప్రాయభేదాలు లాంటి అడ్డంకులెన్నో వస్తాయి.

వాటిని ఇద్దరూ కలిసికట్టుగా నేర్పుతో ఆత్మవిశ్వాసంతో అధిగమించాలి. వివేకంతో విజ్ఞతతో పరిష్కారాలు కనుగొనాలి. అంతే తప్ప పోట్లాటకి దిగకూడదు. తెగేదాకా లాగకూడదు. కలహాలను గృహవిచ్ఛిత్తికి దారితీసేంత పెద్దది కానివ్వకూడదు.

"కెరీర్, ఆరోగ్యం, ఆర్థిక వ్యవహారాలు... వీటిని సమన్వయ పరుచుకుంటూనే కుటుంబం, వివాహబంధాలకు ప్రాధాన్యతనివ్వాలి. ఆ సమతుల్యం సాధించినప్పుడు వైవాహిక జీవితం ప్రశాంతంగా సాగిపోతుంది" అంటారు ప్రముఖ రచయిత్రి శోభా డే.

సంసారంలో గెలుపు ఓటములుండవు.

హాయిగా సంసారం సాగితే ఇద్దరూ విజేతలవుతారు. లేదా ఇద్దరూ ఓడి నట్టే!

53

విడాకులు

నూరేళ్ళు కలసి బ్రతకాలని ఆశిస్తూ పెళ్లిలో వధూవరులు ఏడడుగులు వేస్తారు.

ఒక్కోసారి వారి జీవన ప్రయాణం ఒడిదుడుకులకు లోనై మధ్యలోనే ఆగి పోతుంది. అర్థాంతరంగా ముగిసిపోతుంది.

అందుకు ప్రధాన కారణం భార్యాభర్తల ప్రవర్తన. రెండోది పరిస్థితుల ప్రభావం.

అతి నాగరికత, అతి సంపద, అతి స్వేచ్ఛ కుటుంబ విచ్ఛిత్తికి ప్రధాన కారణాలవుతున్నాయి.

ప్రేమ రెండు వైపులా ప్రవహించాలి. అలాగాక ఒకవైపే వన్‌వేగా ప్రవహిస్తే దాంపత్యం పండదు. మనస్పర్థలు, అవేశాలు, అహంకారాలు, అవమానాలు, హింస, వేరుగా వుండటం – వగైరా సంభవిస్తాయి.

వారి మధ్య ఏర్పడిన అగాథం పూడ్చలేనిదైనప్పుడు వివాహబంధం తెగిపోక తప్పదు!

కలవడానికి మూడు ముళ్ళూ ఏడు అడుగులూ కావాలిగాని విడిపోవడానికి ఒక కాగితమూ రెండు సంతకాలూ చాలు!

పాశ్చాత్య సంస్కృతి

పాశ్చాత్య సమాజంలో పెళ్లి షరతులతో కూడిన ఒక ఒప్పందం.

కలిసుంటే మంచిదే. విడిపోతే ఎవరు ఎవరికి ఏమివ్వాలన్నది ముందే అగ్రిమెంటు చేసుకుంటారు. పెళ్లి వ్యాపారబంధం అయ్యిందన్నమాట.

అంచేత ఇద్దరి మనస్సుల్లో మొదట్నుంచీ కూడా ఎప్పుడు కావలిస్తే అప్పుడు విడిపోగలమన్న భావన అంతర్గతంగా వుంటుంది.

దానివల్ల పెళ్లి వారి దృష్టిలో ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో 'ప్రయత్నించి చూసే' కార్యక్రమం అవుతుంది.

వారి బంధానికి ఎంత చిన్న దెబ్బ తగిలినా సరే సహించరు. సంజోతకన్నా విడాకులకే పరుగులు తీస్తారు.

వారికి విడాకులు సామాన్య విషయం. విడాకులకు పెద్ద కారణాలూ అవసరంలేదు!

ప్రముఖనటి ఎలిజబెత్ టేలర్ నటనలోనే గాక పెళ్లి చేసుకోవటం, విడాకులు ఇవ్వటం, విడాకులు ఇచ్చిన మొగుణ్ణే మళ్ళీ పెళ్లి చేసుకోవడం వంటి పనుల్లో రికార్డు సృష్టించిన సంగతి వినే ఉంటారు!

ధర్మ సంస్కారం

హిందూ వివాహం ఒక ధర్మ సంస్కారం.

ఆ సంబంధం సర్వదా అవిచ్ఛిన్నంగా వుంటుందనే విశ్వాసం, భరోసా, నిశ్చింత, నమ్మకం భార్యాభర్తలిద్దరిలోనూ బలంగా నాటుకుని వుంటాయి.

జన్మ జన్మల బంధంగా భావించడమే కాదు అలా వుండాలని పూజలూ వ్రతాలూ చేస్తారు. పెద్దలు దీవిస్తారు. సమాజం ఆకాంక్షిస్తుంది.

ఒకవేళ అభిప్రాయభేదాలు, తగవులు వచ్చినా అవెక్కువ సేపు వుండవు.

త్యాగం, క్షమ, సహనం, పశ్చాత్తాపం – ఇద్దర్నీ వెంటనే సంస్కరిస్తుంది.

సంబంధాన్ని గాయపరిచే ఆవేశం, కోపం, అపనమ్మకం, అసహనం, అవిశ్వాసం వల్ల అధిక నష్టం జరక్కుండా అవి రక్షిస్తాయి. కుటుంబమూ రక్షాకవచంగా నిలుస్తుంది. సమాజం వారికి వెన్నుదన్నుగా వుంటుంది.

'ఇంటి'ని నిలపాలని మావిడాకుల్ని పచ్చగా వుంచాలని చేసే ప్రయాత్నాలు చాలా వరకూ సక్సెస్ అవడం హిందూ సంస్కృతి ప్రత్యేకత.

భార్యాభర్తల విధులు

హిందూ వివాహ చట్టం భార్యా భర్తలకు కొన్ని విధుల్ని నిర్దేశించింది. కొన్ని బాధ్యతల్ని సంక్రమింపజేసింది.

అవేమిటంటే –

- భర్త తన భార్యని పోషించాలి. కూడు గూడు గుడ్డ ఇవ్వాలి. రక్షించాలి.
- భార్య తన భర్తకు విధేయంగా వుండాలి. ప్రేమగా చూడాలి. పరపురుషడితో సంపర్కం పెట్టుకోకూడదు.

- ✦ భర్త భార్యని ప్రేమగా చూసుకోవాలి. కష్టాలలో తోడుగా వుండాలి.
- ✦ భార్య తన ఆర్యోగానికి సఖ్యతకి భంగం కలగనంత వరకు భర్తని తనతో సంభోగం జరపనివ్వాలి. తను సుఖపడుతూ అతడ్ని సుఖపెట్టాలి.

పెళ్లి స్వర్గద్వారాలు తెరవదు

పెళ్లి చేసుకుంటే స్వర్గం చేతికందుతుందని భ్రమపడవద్దు.

స్వప్నాలన్నీ పెళ్లితో సత్యాలై పోతాయని ఊహలల్లుకోవద్దు.

పెళ్లవగానే జీవిత భాగస్వామిని పూర్తిగా మీ ఇష్టం వచ్చిన రీతికి మార్చగలమని కలలు కనొద్దు.

పెళ్లిలో సుఖం వుంది. ఆనందం వుంది. అనుభూతి వుంది.

నిజమే.

కాని బాధలున్నాయి. బాధ్యతలున్నాయి. ఒంటరి తనం వుంది. ఘర్షణ వుంది. కన్నీళ్ళున్నాయి. కలతలూ వున్నాయి.

అది గ్రహించక అవాస్తవిక కోరికల్తో అధిక ఆశల్తో కాల్పనిక ప్రపంచంలో విహరిస్తే నేల విడిచి సాము చేస్తే నిరాశ తప్పదు. నిస్పృహ తప్పదు. డిప్రెషన్ తప్పదు. విభేదాలూ విడాకులూ తప్పవు.

అవతలి వారు తనతో ఎలా వుండాలో ప్రవర్తించాలో అని ఊహించుకుంటే చాలదు. వారితో తనెలా వుంటానన్న ఆలోచన చెయ్యాలి. అప్పుడే అర్థం చేసుకోవడం పెరిగి అపార్థం తగ్గుతుంది.

ఇద్దరూ కలసి జీవితాన్ని ఎదుర్కోవడమే ఒకర్నొకరు ప్రోత్సాహించుకోవడమే పెళ్లి.

పెళ్లిలో ఎవరికీ పూర్తి స్వేచ్ఛ వుండదు. అవతలివారి కోసం కొన్ని త్యాగాలు తప్పనిసరి.

వైవాహికానందం సంపూర్ణంగా గ్రోలడానికి వివాహబంధం పటిష్ఠంగా వుండటానికి కృషి, ఓర్పు, సహనం, అవగాహన, అనుకంప, అర్థం చేసుకోగల మనస్తత్వం– వీటిన్నిటీ మించి ఎలాంటి తప్పులైనా క్షమించగలిగేంత ప్రేమ వుండాలి.

ప్రేమ ఆవిరైనప్పుడు దాంపత్యబంధం బీటలు వారుతుంది!

మ్యారేజ్ కౌన్సిలర్స్

విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన భార్యాభర్తలు వెంటనే పాలునీళ్ళలా కలిసి పోతారని ఆశించడం అత్యాశే అవుతుంది.

వారి వ్యక్తిత్వాలూ అహాలూ అలవాట్లూ దృక్పథలూ – ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు సృష్టిస్తాయి.

అందం, ఆకర్షణ, మోహం తగ్గి వాస్తవం కఠినంగా కొరుకుడు పడనిదిగా ప్రత్యక్ష మవుతుంది.

వారి మధ్య అంతరం అంతకంతకూ పెద్దదిగాకుండా ఇరువైపుల పెద్దలూ నచ్చ చెబుతారు. రాజీ చేస్తారు. చాలా మంది సర్దుకుపోతారు.

అహం అధికంగా కలవారు మంకుపట్టు పట్టేవారు తాము అధికులమని విశ్వసించే వారు తమ మాటే చెల్లాలనుకునేవారు అంత త్వరగా దారిలోకి రారు. పెద్దల మాట విన్పించుకోరు. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్ళంటారు.

వారికి మ్యారేజ్ కౌన్సిలర్స్ ద్వారా కౌన్సిలింగ్ చేయించాలి.

హైదరాబాద్ విద్యానగర్లోని ఆంధ్రమహిళా సభ ప్రాంగణంలో న్యాయసలహా విభాగముంది. వివాహసంబంధ విషయాలపై న్యాయసలహాలూ సూచనలూ ఇస్తారు. లీగల్ నోటీసు ఇస్తారు. ఎలాంటి చార్జీలూ వసూలు చెయ్యరు. సమస్యా పరిష్కారానికి వారిని సంప్రదించి సహాయం పొందవచ్చు. వారి ఫోన్ నెం. 27617801.

ఇరువర్గాలతో మాట్లాడి సమస్య మూలమేమిటో తెలుసుకుంటారు. వారి సైకాలజీని బట్టి తగిన విధంగా నచ్చచెబుతారు. రాగల పరిణామాలు వివరిస్తారు. ఎవరికెలా చెప్పాలో అలా చెబుతారు. సంజోతకి ప్రయత్నిస్తారు.

పాశ్చాత్య దేశాల్లో వివాహంలో సమస్య వస్తే విడిపోవడానికి మొగ్గు చూపుతారు.

మన వారు ఎలాగైనా ఆ బంధాన్ని కొనసాగించడానికే చూస్తారు. వివిధ స్థాయిలలో ప్రయత్నిస్తారు. ఎమోషనల్గా ఫిలయ్యేలా చేస్తారు.

అప్పటికీ వారు సంజోతకు నిరాకరిస్తే వివాహ రద్దుకు దరఖాస్తు చేసుకోవడం మినహా మరో దారి లేదు.

కొత్త సవాళ్ళు

సాఫ్ట్‌వేర్ కంపెనీలు యమ్మెన్సీలు పెద్ద పెద్ద సంస్థలు – కేంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ పెద్ద ఎత్తున రిక్రూట్‌మెంట్ చేసుకుంటున్నాయి.

కాలేజీ విద్య పూర్తైన మర్నాడే గొప్ప జీతంతో ఆయా కంపెనీల్లో ఉద్యోగులౌతున్నారు. ఊహించనంత జీతం – అదీ తమ తల్లిదండ్రులు పాతికేళ్ళ సర్వీసులో అందుకోనంత సొమ్ము మొదటి నెలలోనే తీసుకుంటున్నారు.

ఎన్నో సౌకర్యాలు, ఒక్కసారే ప్రముఖ హోదా, బాధ్యతలు –వారిని మరిపిస్తున్నాయి. కారు, ఇల్లు, బ్రాండెడ్ దుస్తులు, వీకెండ్స్‌లో షికార్లు, పార్టీలు మురిపిస్తున్నాయి.

అలాగని వారి జీవితాలు సాఫీగా సాగటంలేదు. భావోద్వేగపరమైన సమస్యలు తలెత్తు తున్నాయి. మానసికంగా అలసి పోవడం వల్ల శృంగారం పై ఆసక్తి సన్నగిల్లుతోంది. శృంగార సామర్థ్యమూ తగ్గుతోంది.

పని ఒత్తిడి, అహం, భార్యాభర్తలు ఎక్కువ సేపు – ముఖ్యంగా రాత్రుళ్లు విడివిడిగా ఉండటం, సహోద్యోగులతో సాన్నిహిత్యం –వారిపై ప్రభావం చూపుతున్నాయి.

కంపెనీలు వారికి లక్ష్యాలని నిర్దేశిస్తూ అవి అందుకోడానికి నిరంతరం నిశితంగా పరిశీలిస్తూ ఒత్తిడి తెస్తూంటాయి. దీని వల్ల శారీరక మానసిక ఆర్యోగ్యం దెబ్బతింటుంది.

మారిన ఈ పరిస్థితుల వల్ల ఐటి, ఐటి ఆధారిత రంగాల్లో విడాకులు కోరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

ఈ పరిస్థితిని ముందే నివారించడానికి యోగ, జిమ్స్, విశ్రాంతి, ధ్యానం వగైరాల మీద శ్రద్ధ పెట్టాలి. భార్యా భర్తలు తమకు లభించిన సమయాన్ని కలిసి గడుపుతూ తమ బంధ దృఢత్వానికి కృషి చేసుకోవడం తప్పనిసరి!

విడాకులకు దారితీసే కారణాలు

భార్యాభర్త లిద్దరూగాని ఏ ఒక్కరుగాని సయోధ్య కుదుర్చుకోడానికి ఇష్టపడకపోతే విడాకులు తీసుకోవచ్చు.

సాధారణంగా వివాహేతర సంబంధాలు, దూరప్రాంతాల్లో విడిగా నివసించాల్సి రావడం, అహంకారం, మొండితనం, మూర్ఖత్వం, వరకట్నపు వేధింపులు, సంతానం కలగకపోవడం, నపుంసకత్వం, వ్యసనాలు, కెరీర్ ప్రాధాన్యతపు, ఆకర్షణ తగ్గటం లేదా మరొకరి ఆకర్షణలో పడటం, సుపీరియారిటీ కాంప్లెక్స్, గృహహింస, దీర్ఘవ్యాధులు – విడాకులకు దారి తీసే ముఖ్య కారణాలు.

ఆస్తి ఆశించి లేదా మోజుపడి పెళ్లి చేసుకోవడం, విభిన్న విశ్వాసాలు, సాంస్కృతిక విభేదాలు,అసంతృప్తి మరికొన్ని కారణాలు.

విడాకులు ప్రోత్సహించ దగ్గవి కాకపోయినప్పటికీ మరి గత్యంతరం లేనప్పుడు విడిపోవడమే ఇద్దరికీ మంచిదని భావించినప్పుడు విడిపోయి ఎవరి బ్రతుకు వారు బ్రతకడమే మంచిది.

భార్యా భర్తలు విడాకులు తీసుకోవచ్చుగాని తల్లిదండ్రులు పిల్లలతో తీసుకోకూడదు. సంతాన బాధ్యతని నిర్లక్ష్యం చెయ్యకూడదు.

పిల్లల పోషణభారం ఇద్దరిదీనూ. అది నెరవేర్చడం వారి విధి. చక్కని భవితనివ్వడం వారి బాధ్యత – నైతికంగానే కాదు చట్టరీత్యా కూడా!

దాంపత్యజీవన పునరుద్ధరణ హక్కు

హిందూ వివాహ చట్ట ప్రకారం వివాహితులకు దాంపత్య జీవన పునరుద్ధరణ హక్కు వుంది.

సహేతుకమైన కారాణాలు లేకుండా భర్త భార్యతో, భార్య భర్తతో కలసి కాపురం చెయ్యకుండా విడిగా వెళ్ళిపోతే రెండవవారు తమ దాంపత్య జీవన హక్కుల పరిరక్షణకు కోర్టులో దరఖాస్తు చేసుకోవచ్చు.

భర్త విదేశాల్లో ఉద్యోగం చేస్తూ భార్యని తన దగ్గరకు తీసుకెళ్ళడానికి నిరాకరిస్తే భార్య తన దాంపత్య జీవనాన్ని పునరుద్ధరించమంటూ కోర్టు వారిని అర్థించవచ్చు.

భార్య అలిగి పుట్టింటికెళ్ళిపోయి తిరిగి రావడానికి ఇష్టపడక పోయినట్టయితే భర్త దాంపత్య జీవన పునరుద్దరుణ హక్కు కోసం పిటిషన్ దాఖలు చేయవచ్చు.

హక్కుల పునరుద్ధరణకు మినహాయింపులు

చట్ట ప్రకారం కొన్ని కొన్ని ప్రత్యేక పరిస్థితులలో దాంపత్య జీవన హక్కుల పునరుద్ధరణ కుదరదు.

ఆ కారాణాలేమిటంటే–

- ✦ భర్త ఆదాయాన్ని మించి భార్య ఖర్చు చేయుట
- ✦ ఇద్దరూ చెరోచోట ఉద్యోగాలు చేస్తున్నప్పుడు ఉద్యోగం వదులు కోడానికి భార్య సిద్ధపడక పోవుట.
- ✦ భార్యకి/భర్తకి అక్రమ సంబంధం వుందని రెండో వారు ఆరోపించుట
- ✦ కారణం లేకుండా సంభోగానికి నిరాకరించుట.

- ✦ మాంసాహారం తినమని మద్యం సేవించమని చెడుపనులు చేయమని భర్త భార్యని బలవంత పెట్టుట
- ✦ భార్య భర్త లిద్దరూ విడివిడిగా వుండటానికి ఒప్పందం చేసుకొనుట
- ✦ భార్యని భర్త చిరకాలంగా వదిలి వేయుట మొదలైనవి.

మొదట వేర్పాటు తర్వాత విడాకులు

హిందూ వివాహ చట్ట ప్రకారం న్యాయస్థానం నేరుగా విడాకుల్ని మంజూరు చేయదు. వివాహాన్ని రద్దు చేయదు.

సహేతుకమైన కారాణాలున్నాయిని విశ్వసిస్తే మొదట Judicial separation అనగా 'కోర్టు ఆదేశానుసారం విడిగా వుండుట' కు అనుమతిస్తుంది.

ఈ విడిగా వుండే కాలంలో భార్యా భర్తలు తమ తప్పుల్ని తెలుసుకుని పశ్చాత్తాపపడి రీకన్సైల్ అవుతారని ఆశ. అంటే ఆవేశంతో విడాకులు కోరిన దంపతులు పునరా లోచించుకుని పర్యవసానాన్ని గుర్తించి రాజీపడటానికి మరో అవకాశం కల్పించడ మన్నమాట.

కోర్టు అనుమతితో విడివిడిగా వుంటున్నప్పుడు ఒకరు చనిపోతే వారి వారసత్వపు హక్కులకు ఎలాంటి ఇబ్బందీ కలగదు. కలిసి వుంటే ఎలాంటి హక్కులుంటాయో అవన్నీ వుంటాయన్న మాట. అదే విడాకులు మంజూరైన తర్వాత చనిపోతే వారికి వారసత్వ హక్కు సంక్రమించదు.

వేర్పాటు డిక్రీ పొందాక కూడా ఏడాదిలోగా మనస్సు మార్చుకుని రాజీపడి మళ్ళీ దాంపత్యజీవితం కొనసాగించవచ్చు.

కాని విడాకులు తీసుకున్నాక అంటే వివాహం రద్దయ్యాక తిరిగి కాపురం చెయ్యడం కుదరదు. మళ్ళీ కలిసుండాలంటే మళ్ళీ వివాహం చేసుకోవాల్సిందే.

చెల్లని వివాహాలు

కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల వివాహం జరిగినప్పటికీ ఆ వివాహం చెల్లదని చెబుతూ వివాహపు రద్దు కోసం చట్టప్రకారం పిటీషన్ దాఖలు చేసే అవకాశముంది.

అలాంటి పరిస్థితులకు కారాణాలు :

- భర్త నపుంసకత్వంవల్ల లేదా భార్య జడత్వంవల్ల సంభోగం జరగడానికి వీల్లేక పోయినట్లైతే అనగా గర్భాధానం జరగనందున వివాహ లక్ష్యం నేరవేరక పోవడం వల్ల.
- పిచ్చి, ఉన్మాదం లాంటి రోగాలుంటే
- బల ప్రయోగం ద్వారా గాని బెదిరించి గాని మోసం చేసి గాని పెళ్లి చేసుకుంటే
- వివాహం నాటికే భార్య మరోకరి ద్వారా గర్భవతి ఐ వుంటే

విడాకులకు కారణాలు

హిందూ వివాహ చట్టం అమల్లోకి రాకముందు గాని వచ్చిన తర్వాత గాని జరిగిన వివాహాల్లో సహేతుకమైన కారాణాలున్నట్లయితే విడాకులడిక్రీ ద్వారా వివాహ బంధాన్ని రద్దు చేసుకోవచ్చు.

భార్యాభర్తల్లో ఎవరైనా సరే విడాకుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

విడాకులు మంజూరు చేసేందుకు కారణాలు:

- వివాహేతర సంబంధం కలిగి వుండుట.
- మరో మతం తీసుకోవడం వల్ల హిందువుగా వుండకపోవుట.
- మూడేళ్ళకు పైబడి ఉన్మాదం. పిచ్చి లాంటివి వుండటం.
- మూడేళ్ళకు తక్కువ కాకుండా కుష్ఠులాంటి నివారణ సాధ్యం కాని రోగాలుండుట
- సన్యసించడం
- ఏడేళ్ళు పైబడి బ్రతికివున్నట్టు సమాచారం లేకపోవడం
- రెండేళ్ళుగా లైంగిక కార్యంలో పాల్గొనక పోవటం
- కోర్టు ఇచ్చిన దాంపత్య జీవన పునరుద్ధరణ హక్కును రెండేళ్ళు ఆపైన పాటించక పోవడం మొదలైనవి.

పై కారణాలతో బాటు మరికొన్ని కారణాల వల్ల కూడా భార్య విడాకులు కోరవచ్చు.

అవి –

- పెళ్లికి ముందే భర్త మరో పెళ్లి చేసుకునుంటే ఆ భార్య బ్రతికుంటే
- పెళ్లయ్యాక భర్త మానభంగం కేసులో దోషి అయితే, స్వలింగ సంపర్కం, జంతు సంపర్కం పెట్టుకున్నట్లయితే

- తనకి 15 ఏళ్ల లోపే పెళ్లి జరిగితే, ఆ పెళ్లిని ఆమె 18 ఏళ్ల లోపే నిరాకరిస్తే (పెళ్లయ్యాక భర్తతో సంభోగంలో పాల్గొన్నా పాల్గొనక పోయినా)

కొన్ని షరతులు

పెళ్లైన మూడేళ్ళలోపు విడాకుల పిటిషన్ స్వీకరించరు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రం స్వీకరించడం జరుగుతుంది.

సంతానం యొక్క మేలు కోరి పై షరతు విధించడం జరిగింది. ఆ లోపుగా భార్యా భర్తలు సంధి కుదుర్చుకుంటే రాజీ పడితే పిల్లలకు మేలు జరుగుతుందని ఆశ.

ఇద్దరూ విడాకులు కోరితే

భార్యాభర్తలిద్దరూ కూడా కోరినట్లయితే ఈ క్రింది పరిస్థితుల్లో విడాకులు మంజూరు చేయవచ్చు.

- ఒక ఏడాది లేక అంత కన్నా ఎక్కువ కాలం భార్యా భర్త లిద్దరూ విడిగా వుంటున్నామనీ కలసి జీవించే అవకాశం లేదనీ కోరినట్లయితే
- ఇద్దరూ కలసి వేసిన పిటీషన్‌ను 6 నెలల తర్వాతా 18 నెలల లోపలా విత్‌డ్రా చేసుకోనట్లయితే

మనోవర్తి

భార్యా భర్తల్లో ఎవరైనా విడాకులు కోరితే రెండో వారు తమని తాము పోషించుకోలేని స్థితిలో వుంటే వారి పోషణ నిమిత్తం ఇవ్వాల్సిన సొమ్ముని మనోవర్తి లేదా భరణం అంటారు.

విడాకుల కేసు కోర్టులో వున్నప్పుడు తాత్కాలిక భృతి మంజూరయ్యాక శాశ్వత మనోవర్తి పొందవచ్చు.

అవతలి వారి ఆర్థిక పరిస్థితిని బట్టి నెలకు ఇంత లేదా మూడు నెలలకు ఇంత ఇవ్వాలని కోర్టు నిర్ణయిస్తుంది. సాధారణంగా భర్త ఆదాయంలో ఐదో వంతుని మనోవర్తిగా నిర్ణయిస్తారు.

జీవితాంతం ఇవ్వాల్సిన మనోవర్తి భర్త విదేశంలో వుంటున్నప్పటికీ చెల్లించమని కోర్టు ఆదేశించవచ్చు.

పిల్లల సంగతి

భార్యాభర్తలు విడాకులు పొందితే వారి మైనర్ పిల్లల సంరక్షణ బాధ్యతను వారిలో ఒకరికి కోర్టు అప్పగిస్తుంది. బాలికను తల్లికీ బాలుడ్ని తండ్రికీ ఇవ్వాలన్న రూలు లేదు.

ఎవరి దగ్గరుంటే వారికి క్షేమమన్నదే గాక పిల్లల వయస్సునూ అభిప్రాయాలను కూడా పరిగణించి ఎవరి దగ్గరుండాలన్నది కోర్టు నిర్ణయిస్తుంది. వారి ఖర్చులు ఎవరు భరించాలో నిర్దేశిస్తుంది.

పిల్లలు ఎవరి దగ్గరున్నా రెండో వారు వారానికో పదిహేను రోజులకో వెళ్ళి వారిని చూచే హక్కు రెండో వారికి వుంటుంది.

మళ్లీ పెళ్లి

విడాకుల డిక్రీ మంజూరయ్యాక ఇద్దరూ వేరే వివాహాలు చేసుకోవచ్చు. కాని అప్పీలు చేసుకునే గడువు దాటేక లేదా అప్పీలు చేసుకునే హక్కులేనట్లయితేనే చేసుకోవాలి.

ఒకవేళ అప్పీలు చేసినట్లయితే ఆ కేసు కొట్టి వేశాక గాని పునర్వివాహం చేసుకోకూడదు.

పునర్నిర్మాణం

విడాకులు తీసుకన్నంతనే అంతా అయిపోయిందనుకోకూడదు.

మరోదారి లేక విడిపోయినప్పుడు కుంగి పోవాల్సిన పనిలేదు.

వివాహం ప్రేమాభిమనాల ఇల్లే గాని పంజరం కాదు.

విడిపోతే జీవితం పడిపోయినట్లేనని భావించి బాధ పడకూడదు.

మళ్ళీ కొత్తగా ఒక్కో ఇటుకా చేర్చి కొత్త భవంతిని నిర్మించుకోవాలి. చదువు/కెరిర్ కొనసాగించాలి. దృష్టిని అవసరమైతే మరో దాని మీదకు మరో రంగం లేదా హాబీ మీదకు మళ్ళించాలి.

కమలహాసన్ మొదటి భార్య వాణీ గణపతి, బోనీకపూర్ తొలి భార్య మోనాకపూర్, డింపుల్ కపాడియా, నీలం కొఠారి వగైరాలు విడాకులు తీసుకున్నప్పటికీ తమ తమ ఇష్టరంగాల్లో దూసుకుపోతున్న సంగతి గుర్తుచేసుకోవాలి. మనస్థైర్యాన్ని కూడదీసుకోవాలి.

స్థిమిత పడ్డాక మళ్ళీ పెళ్లి చేసుకోవాలి. కడ శ్వాస వరకూ తోడు అవసరమే. బ్రతుకు సంపూర్ణతని సంతరించుకోవాలంటే జోడీ తప్పనిసరి!

54

మాతృత్వం



సృష్టించడం దేవుడికీ తల్లికీ మాత్రమే సాధ్యం.

ఏ జాతిలో నైనా ఏ భాషలో నైనా ఏ ప్రాంతంలో నైనా అమ్మ అమ్మే. ఆమెకి సాటి మరొకరు లేరు. ఉండరు.

మూర్తీభవించిన అమృతత్వం అమ్మ.

భూమ్మీదకు రాగానే పసి బిడ్డ చూసే తొలి చూపు అమ్మది. తొలిసారి పొందే స్పర్శానుభూతి అమ్మది. తొలిసారిగా గుర్తించే రూపం అమ్మది. తొలిసారి శిశువు పలికే మాట అమ్మ. తొలి మాట చెప్పేది అమ్మతో. తొలి ఆట ఆడేది అమ్మతో. తొలి అడుగువేసేది అమ్మ చేయూతతో. తొలి పరుగు పెట్టేది అమ్మ ప్రోత్సాహంతో.

అన్నిటికీ అమ్మే బాసట. ఆధారం.

అలాంటి అమ్మతనం పొందటం స్త్రీకి దేవుడిచ్చిన అపురూప వరం. అద్భుత అనుభూతుల అపూర్వ సమ్మేళనం మాతృత్వం!

సృష్టిలో తీయనిది

సృష్టిలో తీయనివి రెండే. ఒకటి మాతృత్వం. రెండు స్నేహం.

బిడ్డని ప్రసవించడానికి తల్లిపడే 'నరక యాతన' యావత్తూ బిడ్డని తన పేగుతో పుట్టిన బిడ్డని చూసిన మరుక్షణం 'హుష్ కాకి' అయిపోతుంది.

అప్పుడామె పెదవులపై కదలాడే విజయదరహాసం, మోహంలో ప్రతిఫలించే అద్భుతానందం, ఆ ఆనందపు కొనల్లో తళుక్కున మెరిసి మాయమయ్యే గర్వాతిశయం, ఆమె మనస్సు పొందే అనిర్వచనీయమైన మధురానుభూతి – మాటల్లో వర్ణించ లేనివి. అమ్మలకే స్వంతమైనవి!

"అ....మా...." అంటూ బిడ్డ పిలిచే తొలిపలుకు వినీ వినగానే పరవశించి మయూరిలా నర్తించని మాతృమూర్తి భూమ్మీదే వుండదు!

మాతృదేవో భవ!

మొదటి నమస్కారం తల్లికి చెయ్యాలి. తర్వాతే తండ్రికీ గురువుకీ.

తండ్రి కుటుంబానికి శిరస్సు అయితే తల్లి హృదయమే.

'కుపుత్రో జాయేత క్వచి దపి కుమాతా నభవతి' అన్నారు శంకారాచార్యులు.

చెడ్డకొడుకు పుట్టవచ్చుగాని చెడ్డతల్లి వుండదని అర్థం.

సర్వసంగ పరిత్యాగులు సైతం తల్లికి అంత్యక్రియలు చెయ్యొచ్చని స్వయంగా తనతల్లి ఆర్యాంబకు చేసి లోకానికి చాటిన మహానుభావులు శంకరాచార్యులు.

అమ్మ ఔన్నత్యానికి అమోఘమైన స్థానానికి ఇంతకంటే ఉదాహరణ అనవసరం!

దేవుడి ప్రతినిధి

భగవంతుడు ప్రతి ఇంట్లోనూ ఉండటం సాధ్యం గాక తన బదులు తల్లిని సృజించాడంటారు.

ఇది భావన కావచ్చు. కాని పచ్చి నిజం.

తను తిన్నా తినక పోయినా బిడ్డ ఆకలి తీర్చగల క్షీరభాండాలు కలిగిన అద్భుతమూర్తి.

బిడ్డ తన గుండెల్ని తన్నుతూ కేరింతలు కొడుతూంటే పొంగిపోతుంది. పెద్దయ్యాక అదే బిడ్డ గుండెల్ని ముక్కలు చేసి దూరంగా వెళ్ళిపోయినా అతడి క్షేమాన్నే కాంక్షిస్తుంది.

తన ఆయుష్షుని కూడా పోసుకుని నూరేళ్ళు చల్లగా వర్థిల్లమని దీవిస్తుంది.

ఇంతటి మహోన్నతమూర్తిని భగవంతుడి అవతారంలాగాక ఇంకెలా భావించగలం!

సృష్టికి మూలం

స్త్రీని ప్రకృతితో పోలుస్తారు.

ప్రకృతి నిత్యం. తల్లి నిత్యం. ఆమె ద్వారా సృష్టి నిత్యం.

మానవ మనుగడకి ఆధారం అమ్మ. ఆమె వల్లే సృష్టి నిరాఘాటంగా నిరంతరంగా సాగుతోంది.

బిడ్డకి జన్మనే కాదు బ్రతుకునూ ఇస్తోంది తల్లి!

బిడ్డకు ఆహ్వానం

బిడ్డకు జన్మనివ్వడానికి వివాహిత స్త్రీ తొందర పడకూడదు.

పెళ్లవ్వగానే రెండు మూడేళ్ళు ఫ్రీ బర్డ్స్‌లా భార్యాభర్తలు విహరించాలి. ఆలోగా ఎలాంటి బంధాలూ తలకెత్తుకోకూడదు.

అప్పుడే దాంపత్య మాధుర్యాన్ని సంపూర్తిగా జుర్రుకోగల్గుతారు.

కెరీర్ ఉన్నతంగా తీర్చిదిద్దుకోడానికి అదే తగిన సమయం కూడానూ.

వాటి తర్వాత మాతృత్వానికి సిద్ధ పడాలి.

శారీరకంగా మానసికంగా ఆర్థికంగా సర్వసన్నద్ధమైనప్పుడే బిడ్డను తమ జీవితాల్లోకి ఆహ్వానించాలి. వాటి ప్రభావం గర్భంలోని బిడ్డమీద ప్రబలంగా వుంటుందని గుర్తుంచుకోవాలి.

భార్యాభర్త లిద్దరూ మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాకే మూడో మెంబర్ని కోరుకోవాలి. అదనపు ఖర్చులు భరించడానికి బిడ్డకు చక్కని భవిష్యత్తు నివ్వడానికి ఆర్థిక ఏర్పాట్లు చేసుకోవాలి. ఆర్థిక ప్రణాళిక వేసుకోవాలి.

గర్భధారణ

స్త్రీ పురుషుల సంభోగ సమయంలో పురుషుడికి వీర్యస్కలనం అవుతుంది. వీర్యంలో లక్షలాది వీర్యకణాలుంటాయి. అవి యోని మార్గంద్వారా అండవాహికలోకి ప్రవేశిస్తాయి. ఒకే ఒక్క వీర్యకణం అండంతో కలిసి ఫలదీకరణ చెందుతుంది. అదే గర్భం ఏర్పడటం.

స్త్రీ బహిష్టు తర్వాత 14వ రోజున అండం విడుదలవుతుంది. అది కేవలం 24 గంటలు మాత్రమే జీవించి వుంటుంది. ఆ సమయంలో వీర్యకణం అండంతో కలిస్తేనే గర్భం ధరించడం జరుగుతుంది.

అండం విడుదల రోజుని ఖచ్చింతంగా చెప్పడం కష్టం. ఋతుస్రావం మొదలైన రోజు నుండి 12 నుంచి 16వ రోజు దాకా ఎప్పుడైనా అండం విడుదలవ్వొచ్చు. అందుకే ఆ సమాయానికి అటో 2 రోజులు ఇటో 2 రోజులు కలిపి ఆ 9 రోజుల్నీ ఫెర్టైల్ పెరీడ్ అంటారు. ఆ సమయంలో కలిస్తే గర్భం రావాడానికి అవకాశమెక్కువగా ఉంటుంది.

గర్భం ధరించ లేకపోవడానికి కారణాలు

కొందరు స్త్రీలు పెళ్లై ఎన్నేళ్ళైనా గర్భం ధరించరు. అందుకు స్త్రీలును నిందించడం సరికాదు. లోపం స్త్రీలలో ఉండొచ్చు పురుషుల్లోనూ ఉండొచ్చు.

పురుషుల్లో తగినంత ఆరోగ్యవంతమైన వీర్యం ఉత్పత్తి కాకపోవడం, సపుంసకత్వం, సుఖవ్యాధులు కారణాలు.

స్త్రీలలో అండం సక్రమంగా విడుదల కాకపోవడం. గర్భాశయ లోపం, ఫెలోపియన్ ట్యూబ్స్ మూసుకు పోవడం, సుఖవ్యాధులు వగైరాలు కారణాలు.

ఈ కారణాలు వల్ల గర్భం రాక పోవచ్చు.

ఇద్దరూ డాక్టర్ని సంప్రదించి వైద్యసాయం పొందితే సంతానవంతులయ్యే అవకాశం మెండుగా వుంటుంది.

ఆరోగ్యంగా ఉండాలి

కాబోయే తల్లి శారీరక మానసిక ఆరోగ్యాలు బాగుండాలి. వాటి ప్రభావం గర్భస్త శిశువు మీద ఎక్కువగా వుంటుంది.

ఆమె ఆనందంగా ఆరోగ్యంగా వుంటే బిడ్డ పెరుగుదల సక్రమంగా వుంటుంది.

ఆందోళనకు ఆవేదనకు గురైతే వాటి దుష్ప్రభావం బిడ్డ మీద పడి తీరుతుంది.

అందుకే నెల తప్పినప్పట్నుంచి బిడ్డకు జన్మనిచ్చే వరకూ ఆమె ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అనవసర ఆందోళనలకు దూరంగా వుండాలి.

అందుకామె భర్త ఇతర కుటుంబ సభ్యులూ సహకరించాలి. ఉత్సాహంగా ఉంచటానికి, అనవసర భయాలకు లోను కాకుండా ఉండటానికీ తోడ్పడాలి.

త్యాగజీవి

ప్రసవం జరిగినప్పుడు తల్లి శరీరం నుండి దాదాపు ఆరు పౌనుల బరువున్న శిశువు బయటి కొస్తుంది. దానితో బాటు రెండు పౌనుల మాయసంచి, పౌను రక్తం వస్తాయి. అంటే దాదాపు తొమ్మిది పౌనులు తల్లి శరీరం నుండి వస్తాయి.

అంటే తల్లి శరీరం నుండి ఒక ఖండం బయటి కొచ్చినట్టే.

అంతే గాక రోజూ తన రక్తాన్ని ఖర్చు చేసి పాల రూపంలో బిడ్డకు ఆహారాన్నిస్తుంది.

ప్రతి మాతృమూర్తికీ శిరస్సు వంచి పాదాభివందనం చెయ్యాలి!

తల్లిపాలు

బిడ్డకి తల్లి ఇచ్చే రెడీమేడ్ ఆహారం-సంపూర్ణాహారం - పాలు.

నిజం చెప్పాలంటే సృష్టిలో ఉచితంగా కష్టపడకుండా లభించేది తల్లి పాలు ఒక్కటే.

మొదట స్రవించే పాలు లేత పసుపు రంగులో వుంటాయి. అందులో ఎన్నో ఔషధగుణాలున్నాయి. బిడ్డకి కొన్ని రకాల రోగాలు రాకుండా యాంటి బయోటిక్‌గా ఉపయోగిస్తాయి.

ఇక పాలను మించిన పౌష్ఠికాహారం లేదు. బిడ్డ రోజు రోజుకీ చక్కగా ఎదుగుతుందంటే దానిక్కారణం తల్లి పాలే.

స్తన ఆకృతి, బిగి కోల్పోతామని భావించి కొందరు స్తన్యం పట్టడం లేదు. అది తల్లీబిడ్డలు ఇద్దరి ఆరోగ్యాలకీ మంచిది కాదు. బిడ్డ కొన్ని రకాల జబ్బులకు గురవ్వొచ్చు. తల్లికి రొమ్ము కాన్సర్ రావొచ్చు.

అంచేత అందం కోసం ప్రాకులాడక ప్రకృతి ధర్మాన్ని నిర్వర్తించడం ఇద్దరికీ క్షేమదాయకం!

పరిపూర్ణత

మాతృత్వం వల్ల స్త్రీకి సంపూర్ణత్వం వస్తుంది.

ఆమెలో ఒక నిండుతనం, ప్రత్యేక ఆకర్షణ, కళ్ళలో తృప్తి, చేష్టల్లో పరిణతి వస్తాయి. మాటలో నడకలో చేతలో చేష్టలో ఆలోచనలో అనుకంపలో గణనీయమైన మార్పు వస్తుంది.

అంత దాకా చెంగున దూకే జలపాతమైతే ఇప్పుడు నిండుగా ప్రవహించే నది.

పెళ్లితో పెద్దరికం వస్తే మాతృత్వంతో సంపూర్ణత సిద్ధిస్తుంది. జన్మ ధన్యమైందన్న భావన ఆమె అణువణువులో తొణికిసలాడుతుంది.

'మాతృత్వం నా ముఖానికి మరింత పరిపూర్ణత్వాన్ని అందించింది. వినడానికి విడ్డూరంగా ఉన్నా తల్లయిన తర్వాత నా అందం ఇనుమడించింది' హాలీవుడ్ నటి ఏంజెలీనా జోలీ పబ్లిగ్గా చెప్పిన మాటలివి!

భద్రత – భరోసా

తల్లి గర్భంలోంచి బయటకు రాగానే బిడ్డ పొందే తొలి స్పర్శ తల్లిదే. ఆ స్పర్శే బిడ్డకు కొండంత భరోసా. భద్రత!

ఆమె శిశువుని అక్కున చేర్చుకోగానే భయం పోతుంది. నోటికి స్తనం అందించి మేను నిమిరేసరికి వారిలో భద్రతావలయం ఏర్పడుతుంది.

బిడ్డ పుట్టిన కొన్ని గంటల్లోనే తల్లి గొంతు గుర్తుపడతారు. దానికి ముందే తల్లి స్పర్శ గుర్తిస్తారు. రెండు మూడు రోజుల్లో తల్లి శరీరవాసననీ నెల రోజుల్లో తల్లి ముఖాన్నీ గుర్తిస్తారు. తల్లి కనబడకపోతే ఏడుస్తారు.

తల్లి ఇచ్చే భద్రత తీర్చే అవసరాలు చేసే సేవల నుండి బిడ్డలో ప్రేమ పుట్టుకొస్తుంది.

అంటే మనిషి–ఆ మాటకొస్తే ప్రతి జీవీ ప్రేమించే మొట్ట మొదటి వ్యక్తి తల్లే!

ఆది గురువు

మనిషికి తొలి గురువు తల్లే.

'ఉంగా ఉంగా' నుంచి మొదలయ్యే ఈ ప్రస్థానం బిడ్డ ఉన్నతంగా ఎదిగేవరకూ కొనసాగుతుంది.

బిడ్డ ప్రతి దశలోనూ చేదోడుగా సపోర్టుగా నిలుస్తుంది. ఆడిస్తుంది. పాడిస్తుంది. మంచి చెడు చెబుతుంది. అక్షరాలు దిద్దిస్తుంది. పాఠాలు వివరిస్తుంది. టిఫిన్ బాక్సు సిద్ధం చేస్తుంది. స్కూలు కబుర్లూ స్నేహితుల కబుర్లూ వింటుంది. ప్రతిభని మెచ్చుకుంటుంది. ప్రోత్సహిస్తుంది. నిరుత్సాహాన్ని పారద్రోలుతుంది. ఉన్నత దశకు చేరేందుకు ఉన్నతుడిగా

మారేందుకు అహరహం తపిస్తుంది. కృషి చేస్తుంది. తండ్రి కోప్పడితే రక్షిస్తుంది. ఏదోలా శ్రమించి పొదుపు చేసి పై చదువులు చదివేందుకు వెన్నుదన్నుగా నిలుస్తుంది.

బిడ్డ సుదూర తీరాలకు కోరుకున్నంత ఎత్తుకు ఎగిరి పోవడానికి రెక్కలిచ్చేది తల్లే!

భవిష్యత్ నిర్మాత

'మాతా నిర్మాతా భవతి' సంతానాన్ని పెంచి పోషించి మంచి పౌరులుగా తీర్చిదిద్దటం వల్ల మాత నిర్మాతగా ప్రసిద్ధి పొందింది.

'మాతృమాన్ పితృమాన్ ఆచార్యమాన్ పురుషో వేద' అన్నారు. పిల్లలు జ్ఞానవంతులు కావడంలో తల్లి, తండ్రి, గురువు కీలకపాత్ర వహించినా ఆ ముగ్గురిలో తల్లి నుంచి లభించే జ్ఞానమే ఉత్తమమైనదని శతపథ బ్రాహ్మణం వ్యాఖ్యానించింది.

పది మంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, నూరుగురు ఆచార్యులకంటే ఒక తండ్రి, వేయిమంది తండ్రులకంటే ఒక తల్లి అధికంగా గౌరవింపదగిందని మనుస్మృతి పేర్కొంది!

అమ్మ బిడ్డలకు బంగారు భవిష్యత్ ప్రదాయిని! ఆమె ఋణం తీర్చుకోవాలంటే ఆమెకి అమ్మగా జన్మించాల్సిందే!

అమ్మ చిరంజీవి

'మాతృత్వంలోనే వుంది ఆడజన్మ సార్థకం' అన్నారు మహాకవి నారాయణ రెడ్డి.

"నేనిలా వుండటానికి ఇకపై ఉండ బోవటానికీ అన్నిటికీ కారణం నా మాతృమూర్తే" అన్నారు లింకన్.

సూర్యుడు వెలుగునీ చంద్రుడు వెన్నెల్నీ ఇచ్చినంత కాలం పంచభూతాల సాక్షిగా తల్లి బిడ్డలకు జన్మనిస్తూనే వుంటుంది. అమృతానికి మరో పేరైన ప్రేమని పంచిస్తూనేవుంటుంది.

మానవజాతికి అమరత్వాన్ని ప్రసాదిస్తుంది అమ్మ.

ఆమె చిరంజీవి!

55

గర్భిణులు

తొలిసారిగా గర్భందాల్చిన స్త్రీ వింత కాంతితో వెలిగి పోతూంటుంది. గర్వంతో కూడిన చిరునగవు ఆమె పెదాల మీద నర్తిస్తూంటుంది. కళ్ళల్లో మెరుపులు కురుస్తుంటాయి.

ఆమె చూపులో మాటలో నడకలో ప్రవర్తనలో ఏదో విజయ భావన మరేదో సంతృప్తి తాలూకు ఛాయ ఇంకేదో ఘనకార్యం సాధించబోతున్నానన్న ఫీలింగ్ తొణికిస లాడుతూంటాయి.

ఆమె సర్వాంగాల్లోనే కాదు శరీరంలోని ప్రతి అణువులో కూడా ఏదో మార్పు! మరేదో గగుర్పాటు! ఇంకేదో ఆనందం!

మాతృత్వం ఒక వరం

ఆడజన్మను సార్థకం చేసేది మాతృత్వమే.

నెల తప్పిందని తెలిస్తే చాలు ఆ దంపతుల్లోనేకాదు వారి తల్లిదండ్రుల్లో బంధువుల్లో స్నేహితుల్లో సంతోషం వెల్లువెత్తుతుంది. అభినందనల వాన కురుస్తుంది.

తల్లి కాబోవటం ఒక వరం గనుకే ఆ సంబరం! ఆ అనుభూతి!

తల్లి అవడమంటే తమ ప్రేమ పంటకి జన్మనివ్వడమేకాదు వంశాన్ని నిలపడం కూడా.

'మెడ నిండేక ఒడి నిండదా' అంటారు. నిండాలనే ప్రతి స్త్రీ కోరుకుంటుంది. అంతకు మించిన పెద్ద కోరిక పెద్ద వరం సాక్షాత్తు భగవంతుడే ప్రత్యక్షమై అడిగినా ఆమె కోరదు!

వైద్య పరీక్షలు అవసరం

నెల తప్పినప్పట్నుంచీ తరచూ వైద్య పరీక్షలు చేయించు కోవాలి. ఏమైనా సమస్యలుంటే సకాలంలో గుర్తించి నివారించడానికి వీలవుతుంది.

తల్లీ బిడ్డా క్షేమంగా వుండటానికి తగిన సూచనలూ సలహాలూ లభిస్తాయి. వైద్యసాయం వారికన్ని విధాలా శ్రీరామ రక్ష అవుతుంది.

ఏడో నెల వచ్చేవరకూ నెలకోసారి, ఆ తర్వాత పదిహేను రోజులకోసారి, చివరినెలలో వారానికోసారి వైద్య పరీక్షలు తప్పని సరి.

పరీక్ష చేసిన ప్రతిసారీ గర్భిణి బరువు, బీపీ చూస్తారు. రక్త,మూత్రపరీక్షలు చేస్తారు. అల్ట్రాసౌండ్ స్కాన్ సాధారణంగా మూడు సార్లు, సమస్యాపూరిత గర్భమైతే అవసరం మేరకు చేస్తారు.

ముందు జాగ్రత్తలు

ఎత్తు, బరువు, బీపీతో బాటు గుండె, రక్తనాళాలు, పెల్విస్‌లో సమస్యలేమైనా వున్నాయేమో తెలుసుకోవడం అవసరం.

వక్షోజాల్లో గడ్డలు తగిలితే అశ్రద్ధ చెయ్యకూడదు. వెంటనే డాక్టర్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. అవి కాన్సర్‌కు దారి తీసే ప్రమాదమూ ఉంది.

గర్భాశయంలో లోపాలు, గర్భాశయ ద్వారం వదులుగా వుండటం, అండాశయంలో సమస్యలు, ఫెలోపియన్ ట్యూబుల్లో ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలు, లైంగిక వ్యాధులు - వంటివి త్వరగా గుర్తించగలిగతే మంచిది. సమస్యల తీవ్రతను వైద్యులు తగ్గించగల్గుతారు.

వేవిళ్ళ బాధ

గర్భం దాల్చిన తొలిమాసాల్లో అధికశాతం స్త్రీలలో వికారంగా కన్పించడం, ఏమీ తినాలన్పించకపోవడం, తింటే వాంతి అవుతుందన్పించడం - వుంటుంది.

ఉదయంపూటే ఇవి ఎక్కువగా అన్పిస్తాయి.

వీటిని వేవిళ్లు లేదా మార్నింగ్ సిక్‌నెస్ అంటారు.

కొందరికి ఈ బాధ 1 లేక 2 నెలలుంటే మరి కొందరికి 4-5 నెలల వరకూ వుంటుంది.

వేవిళ్ల బాధ తక్కువగా వుంటే మందులవసరం లేదు. అధికంగా వుంటే డాక్టర్ సూచించిన మందులు వాడాలి.

నీరసం రాకుండా గ్లూకోజ్, పండ్లరసాలు, లేత కొబ్బరినీళ్ళు త్రాగటం మంచిది.

ఆరోగ్య రక్షణ

గర్భిణులు తమ ఆరోగ్య రక్షణకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలి. బిడ్డ ఎదుగుదల, ఆరోగ్యం తల్లి ఆరోగ్యం మీదే ఆధారపడి వుంటాయి.

పోషకాహారాన్ని తీసుకోవాలి. ముఖ్యంగా ఐరన్, కాల్షియం అధికంగా గల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఎక్కువగా భుజించాలి.

తక్కువ స్థాయిలోనే అయినా వ్యాయామం చేస్తూండాలి.

మద్యం సేవించ కూడదు. ధూమపానానికి దూరంగా వుండాలి. డాక్టర్ సూచించని మందులేవీ ఉపయోగించరాదు. కొన్ని రకాల డ్రగ్స్, మితిమీరిన మెడిసిన్ల వాడకం బిడ్డమీద దుష్ప్రభావం చూపించవచ్చు. జాగ్రత్త అవసరం.

లేటు వయసు గర్భిణులు

35 ఏళ్ళ వయస్సు దాటేక గర్భం దాల్చిన వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

డౌన్స్ సిండ్రోమ్‌తో బాధపడే పిల్లలు పుట్టవచ్చు. అబార్షన్ అవ్వొచ్చు. బిడ్డ పెరుగుదల సవ్యంగా వుండక పోవచ్చు. ప్రసవం కష్టం కావచ్చు.

తల్లికి మధుమేహం, అధిక రక్తపోటు వుంటే మరిన్ని కాంప్లికేషన్స్ రావచ్చు.

అంచేత వీరికి డాక్టర్ల నిరంతర పర్యవేక్షణ అవసరం. తగిన జాగ్రత్తలూ వైద్యసాయమూ తప్పనిసరి.

గర్భిణీ ధర్మములు

పెద్దలు చెప్పిన మాటల్ని అవలోకిద్దాం-

గర్భిణులు పర్వతాలు, మేడలు ఎక్కరాదు. చెరువు దగ్గర వటవృక్షం క్రింద కూర్చోరాదు. దిగంబరురాలై స్నానం చెయ్యకూడదు. సంధ్యాసమయాల్లో భోజనం చేయరాదు. గోళ్ళు కొరుకుట, ఆకులు తుంచుట చేయరాదు. మాంస భక్షణ మానివేయాలి. 4,6,8 మాసములందు ప్రయాణం చేయరాదు. ఆభరణాలు ధరించాలి. భగవన్నామ జపం చెయ్యాలి. నవ్వుతూ వుండాలి. శోకించరాదు.

పురుషుడు ఏడవ మాసము నుండి మైథునము, క్షౌరము చేయించుకొనుట, సముద్రస్నానం, చెట్లు నరకుట, యాత్రలు చేయుట, శవాన్ని తాకుట, శ్రాద్ధ భోజనం చేయుట, వివాహాదికార్యాలు చేయుట పనికిరాదు.

గర్భిణి ఏ వస్తువు కోరితే ఆ వస్తువు తెచ్చివ్వాలి.

పద్మపురాణంలో కశ్యప అదితి చెప్పిన జాగ్రత్తలు –

“గర్భవతి నది యందు స్నానము చేయరాదు. పాడుపడిన గృహంలో నివశించరాదు. పురుగులు దొలిచి గుట్టగా వేసిన మట్టి మొదలగు వానిపై కూర్చుండరాదు. మానసిక అశాంతికి దూరంగా ఉండవలెను. గోళ్ళతో గాని బొగ్గుతోగాని నేలపై గీయరాదు. ఎల్లప్పుడు నిద్రపోరాదు. శ్రమకరమైన పనులు విడిచి పెట్టవలెను. మాటిమాటికి తలగోకుకొనుట, జుట్టు విరియబోసుకొని యుండుట, ఉత్తర దిక్కుగా తలనిడి పరుండుట, ఒళ్ళు విరుచుకొనుట, తడి కాళ్ళతో నుండుట, అమంగళకరవాక్కులను పల్కుట, అధికముగా నవ్వుట, బొగ్గు బూడిదలను మాటి మాటికీ స్పృశించుట మొదలగునవి చేయరాదు”

బేబీ మూన్

గర్భం ధరించాక వెళ్ళే హనీమూన్‌ని బేబీమూన్ అంటారు.

పూర్వం గర్భం ధరించేక మొక్కులు తీర్చుకునే నెపం మీద ప్రసవం సురక్షితం కావాలని ప్రార్థించడానికి పుణ్యక్షేత్రాలకు దంపతుల్ని పంపేవారు.

దాన్నే ఇప్పుడు బేబీ మూన్ అంటున్నారు.

వేవిళ్ళ బాధ వుంటుంది గనుక నాలుగో నెల నిండేకే వెళ్ళాలి.ఏడో నెల వచ్చేక వెళ్ళకూడదు. ఆ మధ్యకాలమే ప్రయాణాలకు అనుకూలం. అలాగని ఎత్తెక్కాల్సిన ప్రాంతాలకు వెళ్ళకూడదు.

దంపతులకు మళ్ళీ ఇలాంటి ఏకాంతం లభించదు. మళ్ళీ ఇంత సన్నిహితంగా వుండటమూ కుదరకపోవచ్చు. బిడ్డ ఆలనాపాలనా ముద్దూ ముచ్చటా వారి స్వేచ్ఛకి తీయని సంకెల వేస్తుంది.

అదీగాక ఆ సమయంలో గర్భిణి ఎంత హాయిగా ప్రశాంతంగా సంతోషంగా వుంటే అంత మంచిది. భార్యాభర్తల అనురాగం ద్విగుణీకృతమయ్యే కాలమూ ఇదే.

అంచేత ఆ సమయంలో నాలుగైదు రోజుల టూర్ వేసుకుని పచ్చని ప్రకృతి ఒడిలో ఆలుమగలు సేద దీరటం వారికీ పుట్టబోయే బిడ్డకూ ఎంతో మంచిది.

కొందరు ఆపరేటర్లు ‘బేబీ మూన్ పాకేజ్’ లంటూ ప్రత్యేక టూర్స్‌ని ఏర్పాటు చేస్తున్నారు.

విదేశాల్లో ఇలా వెళ్ళటం చాలా ఎక్కువ.

సీమంతం



తొలిసారి గర్భం ధరించగానే సీమంతం అనే వేడుకను చేస్తారు.

సీమంతం షోడశ సంస్కారాల్లో ఒకటి. దుష్టశక్తుల నుంచి పుట్టబోయే బిడ్డకు రక్షణ కలుగుతుందని సీమంతం చెయ్యాలన్నారు.

గర్భధారణయ్యాక 4, 6, 8 మాసాలలో సీమంత సంస్కారం జరిపిస్తారు. దీని వల్ల గర్భిణి మనస్సు సంతుష్టమవుతుంది. గర్భస్థ శిశువు యొక్క మానసిక శక్తులు వికసించడానికి తోడ్పడుతుంది.

బంధుమిత్రుల్ని పిలిచి వేడుకగా చేసే ఈ కార్యక్రమానికి ముత్తైదువులంతా వస్తారు. పసుపు కుంకుమలిస్తారు. పూలు,గాజులు ధరింపజేస్తారు.

పది కాలాల బాటు పచ్చగా సుమంగళిగా బిడ్డాపాపల్తో తులతూగమని ఆశీర్వదిస్తారు.

మాతృత్వాన్ని గౌరవించడానికి కాబోయే మాతృమూర్తిని అభినందించడానికి జరిపే శుభవేడుక ఇది.

ఈ సందర్భంగా ఆమెకి తొడిగే గాజులు నాడుల మీద ఒత్తిడి తెస్తాయి. నియంత్రిస్తాయి. సుఖప్రసవానికి తోడ్పడతాయి.

ప్రసవం సులువుగా అవుతుందో లేదో, ప్రాణహాని జరుగుతుందేమోనన్న భయాల్ని సీమంతం పారద్రోలుతుంది.

బ్రతుకు పండించుకున్నావన్న అభినందనలకి మనసు ఉప్పొంగుతుంది. బిడ్డ తాలూకు మధురోహలు మదిలో మొలకెత్తి మురిపిస్తాయి.

రంగుల గాజులూ వస్త్రాలూ దీవెనలూ ఆమెకి ఆనందాన్నీ ఆహ్లాదాన్నీ కలిగిస్తాయి. బిడ్డ సక్రమ ఎదుగుదలకి అవెంతో అవసరం.

తల్లి కాబోతున్నందుకు గర్వపడుతుంది.

భర్త మురిపాలకు మురిసి పోతుంది.

తమ ప్రేమఫలం రూపు దాల్చబోతున్నందుకు జన్మ ధన్యత పొందినట్టు భావిస్తుంది!

సమస్యాపూరిత గర్భాలు

ముప్పై ఏళ్ళు దాటిన స్త్రీ గర్భం ధరించడం, ఎనీమియా వుండటం, గర్భంలో ఇద్దరు లేక ఎక్కువ శిశువులుండటం, యాంటెపార్టం హెమరేజ్, ఎక్లంప్సియా, హృద్రోగులు వగైరా కేసుల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నిరంతర వైద్యపర్యవేక్షణ తప్పనిసరి.

తల్లీ బిడ్డా క్షేమంగా వుండాలంటే అల్ట్రా సౌండ్ స్కాన్‌లూ, ఎలక్ట్రానిక్ మానిటరింగ్‌లు వైద్యుల సలహాతో తరచూ చేయించుకోవాలి.

ఆహార జాగ్రత్తలతో బాటు విశ్రాంతి అత్యవసరం.

తలెత్తే ప్రమాదాలు

తల్లి తక్కువ బరువుంటే బిడ్డ ఎదుగుదల తక్కువగా వుంటుంది.

అధిక బరువు వుంటే బిడ్డ బరువు పెరిగి కాన్పు కష్టమవ్వొచ్చు.

కొందరి కాళ్ళు చేతులు మొహం వాస్తాయి. తగిన జాగ్రత్తలు పాటించాలి. వైద్యుల్ని సంప్రదించి మందులు తీసుకోవాలి. లేకపోతే బీపీ పెరిగి ప్రీ ఎక్లాంప్సియా వ్యాధి రావచ్చు.

రక్త హీనత, గుండె జబ్బులు, జాండీస్, ఆస్తమా – ఇతర శ్వాసకోశ సంబంధ వ్యాధులు, థైరాయిడ్ లోపాలు – బయటపడితే వెంటనే తగిన పరీక్షలు చేయించుకోవాలి. చికిత్స చేయించుకోవాలి. అశ్రద్ధ ప్రమాదానికి దారి తీయవచ్చు.

సాధారణ సమస్యలు

ఎక్కువ మంది గర్భిణులు ఎదుర్కొనే సమస్య రక్తహీనత.

అంచేత రక్తంలో హేమోగ్లోబిన్ శాతం, బ్లడ్ షుగర్ స్థాయి తెలుసుకోడానికి పరీక్షలు చేయించుకోవాలి. మూత్రపరీక్షలూ తప్పని సరి.

యూరిన్ ఇన్ఫెక్షన్స్ రాకుండా జాగ్రత్త వహించాలి.

డయాబెటిస్ వున్నవారు మరిన్ని ఆహార నియమాలు పాటించాలి. షుగర్ పెరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డయాబెటిస్ శిశు మరణానికి కారణమయ్యే ప్రమాదముంది జాగ్రత్త!

హైపటిటిస్ బి, హెచ్ ఐ వి, ఎయిడ్స్ కొన్ని రకాల లైంగిక వ్యాధులు సంక్రమిస్తే తల్లీ బిడ్డ లిద్దరికీ ప్రమాదం సంభవించవచ్చు. ముందుగానే అవి సంక్రమించకుండా జాగ్రత్త పడాలి. అయినా సంక్రమిస్తే నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందాలి.

మానసిక ప్రశాంతత

గర్భిణి ఎంత ప్రశాంత చిత్తంతో ఆహ్లాదంగా ఆనందంగా వుంటే గర్భస్థ శిశువుకి అంత మంచి జరుగుతుంది. బిడ్డ సక్రమ ఎదుగుదలకు తోడ్పడుతుంది.

ఆమె ఎలాంటి ఒత్తిళ్ళకూ భయాందోళనలకూ దిగులుకూ గురి కాకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యుల మీద వుంది. ముఖ్యంగా భర్త ఆమె ప్రక్కన ఉండి మానసిక ధైర్యం చేకూర్చాలి. బహుమతులిచ్చి సంతోషపర్చాలి.

బోసినవ్వుల శిశువు ఫోటోల్ని గోడలకు తగిలించుకోవాలి. పుట్టబోయే బిడ్డ గురించి తీయని కలలు కనడం మనసునెంతో ఆహ్లాద పరుస్తుంది.

వీలుకుదిర్తే 'బేబీ మూన్' కోసం భార్యాభర్తలు ప్రశాంత ప్రదేశాల్ని సరదాగా చుట్టి రావచ్చు. యోగా, మెడిటేషన్ చేస్తే మంచి ఫలితాన్ని పొందవచ్చు.

పుంసవనం

గర్భధారణయ్యాక గర్భస్థ శిశువుకి చేసే సంస్కారం పుంసవనం. దీనివల్ల గర్భం పవిత్రమవుతుందని నమ్మిక. 'పురుష జన్మ కలుగుగాక' అని దీని అభిప్రాయం.

ప్రథమ గర్భమైతే మూడవ మాసమున, ద్వితీయ గర్భమైనచో 4వ మాసంలో చేస్తారు. నాలుగు నెలల వరకు పురుష స్త్రీ చిహ్నాములు ఏర్పడవు. గనుక ఆలోగా చెయ్యాలంటారు.

సీమంతపురోజున కూడా దీనిని చెయ్యవచ్చు.

పితౄణ విమోచనార్థం పురుష సంతతిని కోరుతూ దీనిని చేస్తారు. స్త్రీ సంతతి కలిగినా వారి ద్వారా మహోత్తమ పురుషులు జన్మిస్తారని ఆశాభావం.

ఈ సందర్భంగా చేయించే ఓషధీసేవనం వల్ల గర్భశుద్ధి అవుతుందని నమ్మకం.

బిడ్డ ఎదుగుదల

తల్లి గర్భంలోని శిశువు క్రమక్రమంగా పెరుగుతుంది.

మొదటి నెల పూర్తయ్యేసరికి గుండె కొట్టుకోవడం ప్రారంభమవుతుంది. కళ్ళు, ముక్కు, ఆహారనాళం, చేతులు, కాళ్ళు రూపుదిద్దుకోవటం మొదలవుతుంది.

రెండో నెలాంతానికి ముఖాకృతి ఏర్పడుతుంది. మెదడు. ఎదుగుతుంది.

మూడో నెలకి ప్లసంటా ఏర్పడుతుంది. లింగనిర్ధారణవుతుంది. ఎముకలు ఏర్పడు తూంటాయి. గుండెకి నాలుగు గదులేర్పడతాయి. కిడ్నీ పనిచేస్తుంది. ఈ దశలో బిడ్డపొడవు సుమారు మూడున్నర అంగుళాలూ బరువు పద్నాలుగు గ్రాముల వరకూ వుంటుంది.

నాలుగో నెలయ్యేసరికి ఆడ/మగ అన్నది స్పష్టంగా తెలుస్తుంది. తల నిటారుగా అవుతుంది. క్రింది భాగం బాగా ఎదుగుతుంది. కన్ను, చెవి, ముక్కు ఏర్పడతాయి. స్టెతస్కోప్‌తో గుండె కొట్టుకోవడం వినవచ్చు. శిశువు బరువు సుమారు 110గ్రా. లుంటుంది.

అయిదో నెలకి శిశువు అమ్నియాటిక్ ఫ్లూయిడ్‌ని త్రాగుతుంది. కదలిక తెలుస్తుంది. బరువు సుమారు 320 గ్రా.

ఆరవ నెలకి చర్మం ఎర్రగా ముడతలుబడి వుంటుంది. శరీరాంగాలన్నీ తయారయ్యి వుంటాయి. బరువు సుమారు 630 గ్రా. ఈ దశలో డెలివరీ అయితే ఇడ్డ బ్రతికే అవకాశం తక్కువ.

ఏడవ నెల పూర్తయ్యే సరికి శిశువు 15 అంగుళాల పొడవవుతుంది. సుమారు 1000గ్రా. బరువుటుంది. చేతి గోళ్ళు ఏర్పడతాయి. కళ్ళు కొంచెంగా తెరచుకుంటాయి. కనురెప్ప లేర్పడతాయి. ఈ స్టేజిలో డెలివరీ అయితే బిడ్డ బ్రతికే ఛాన్స్ ఎక్కువగా వుంటుంది.

ఎనిమిదో నెలాంతానికి కళ్ళు తెరుచుకుంటాయి. కాలిగోళ్ళు ఏర్పడతాయి. శుక్లకోశం క్రిందకు జారుతుంది. బరువు సుమారు 1700గ్రా.

తొమ్మిదో నెల పూర్తయ్యే సరికి చర్మం పింక్ రంగులోకి మారుతుంది. ముడతలు తక్కువుంటాయి. గోళ్లు గట్టిబడతాయి. బరువు 2500గ్రా. నుండి క్రమంగా 3400గ్రా. వరకు పెరుగుతుంది. శిశువు సంపూర్ణంగా తయారవుతుంది.

ప్రసవ సమయం

ప్రసవ సమయాన్ని ముందుగానే అంచనా వేయవచ్చు. దీనినే EDD (ఎక్స్‌పెక్టెడ్ డేటాఫ్ డెలివరీ) అంటారు.

ఆఖరి సారి ఋతుస్రావం అయిన మొదటి రోజుకి తొమ్మిది నెలల ఏడు రోజుల్ని కలిపితే వచ్చే తేదీయే EDD. ఆ రోజున లేదా 2,3 రోజులు అటు ఇటుగా ప్రసవం జరుగుతుంది.

తల్లి పాలు అమృతమే

బిడ్డకి స్తన్యమివ్వగలగటం ఓ అపూర్వ వరం. చిత్రవిచిత్ర అనుభూతుల సమ్మేళనం.

ప్రతి తల్లీ కూడా బిడ్డకి పాలివ్వాలి. తల్లి పాలని మించింది లేదు. నాలుగైదు నెలల వరకూ బిడ్డకు పాలు తప్ప మరే ఆహారం అవసరం లేదు.

ప్రథమంగా ప్రసవించే పాలల్లో రోగనిరోధక శక్తినిచ్చే ఔషధాలున్నాయి. అందుకే అప్పుడు పాలు పచ్చగా వుంటాయి. బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన సమస్తమూ పాలలో వున్నాయి. అందుకే పాలని సంపూర్ణాహారం అంటారు.

తాజాగా స్వచ్ఛంగా రెడీమేడ్‌గా సరైన టెంపరేచర్తో లభించే ఆహారం పాలు.

తల్లిపాలు తాగిన బిడ్డ చక్కగా చురుగ్గా తెలివిగా ఎదుగుతుంది.

ఏడాది దాకా అమ్మపాలు తాగి పెరిగిన పిల్లల ప్రజ్ఞాస్థాయి ఇతరులకంటే ఎక్కువగా ఉందని ఒక అధ్యయనంలో తేలింది. ఆలోచించడం, నేర్చుకోవడం, గుర్తుంచుకోవడంలో వీరు ముందంజలో ఉన్నారట.

అందం కోల్పోతామన్న దురభిప్రాయాలతో పాలివ్వక పోవడం సరికాదు. అలాటి వారికి వక్షోజ కాన్సర్ వచ్చే అవకాశాలెక్కువంటున్నారు డాక్టర్లు.

తల్లీ బిడ్డల అనుబంధాన్ని శాశ్వతం చేసే ఈ అపూర్వ అవకాశాన్ని ఏ తల్లీ వదులుకో కూడదు. బిడ్డ అమృత పానానికి ఏ తల్లీ అడ్డు పడకూడదు!

బిడ్డ ఆరోగ్య రక్షణ

బిడ్డ ఆరోగ్యం గురించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

కొన్ని రకాల రోగాల బారిన పడకుండా టీకాలు వేయించాలి. పోలియో డ్రాప్స్ వేయించాలి. బిసిజి ఇంజెక్షన్లు ఇప్పించాలి. హెపటిటిస్ బి వగైరా వాక్సిన్లు వేయించాలి.

వీటిని అశ్రద్ధ చేస్తే పెద్ద మూల్యమే చెల్లించాల్సి రావచ్చు జాగ్రత్త!

జాతకర్మ

తల్లి కడుపులోనున్న శిశువు తల్లి తినే ఆహారాన్ని తాను కూడా స్వీకరిస్తుంది. గనుక దాని దోషమును పోగొట్టుకొనుటకు జాతకర్మ అను సంస్కారం చేస్తారు.

బొడ్డు కోయుటకు పూర్వమే దీనిని చేయాలి.

బొడ్డుతాడు భద్రపరచండి

కార్డ్ బ్లడ్ బ్యాంకులు అంటే శిశువుల బొడ్డుతాడును భద్రంగా నిల్వ వుంచే అవకాశాలొచ్చాయి. వాటి నుండి సేకరించే స్టెమ్ సెల్స్ ఎన్నో ప్రాణాంతక వ్యాధుల్నుండి రక్షిస్తాయి.

రక్తానికి రక్త కణాలకూ సికిల్ సెల్ ఎనీమియా, ల్యుకేమియా, వ్యాధి నిరోధక వ్యవస్థా లోపాలు, మెటబాలిక్ డిజార్డర్లు, గుండె లివర్ జబ్బులు – స్టెమ్ సెల్స్ ద్వారా చికిత్స చేసి అద్భుత ఫలితాలు సాధించనున్నారు.

సో – బిడ్డ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నేడే జాగ్రత్త తీసుకోవడం అవసరం!

56

నాన్నారు

అమ్మ మహోన్నతమైంది. అందులో సందేహంలేదు. అలాగని నాన్న తక్కువ కాదు. నాన్న కూడా గ్రేటే.

ఎవరూ కీర్తించని హీరో నాన్న!

అమ్మ తొమ్మిది నెలలపాటు కడుపులో మోస్తుంది. నాన్న ఇరవై ఏళ్ళపాటు గుండెలమీద పెట్టుకుంటాడు.

తల్లి జన్మనిస్తే ఆ జన్మకో అర్థం ఆధరువు కల్పిస్తాడు నాన్న.

నాన్న ఓ పర్వతం. మూలధాతువు. విజ్ఞానఖని!

పితృదేవో భవ!

పద్మ పురాణంలో **'సర్వ దేవ మయః పితా'** అన్నారు. తండ్రి సర్వ దేవతా స్వరూపమే. అందుకే తల్లిదండ్రులను ఆదర సత్కారాలతో సేవించాలి.

తల్లిదండ్రులకు శ్రద్ధతో అభివాదం చేసే సంతానానికి అక్షయమైన సుఖాలు లభిస్తాయి.

'పితాధర్మః పితా స్వర్గః
పితాహి పరమం తపః
పితరి ప్రీతి మాపన్నేః
సర్వా ప్రియంతి దేవతాః'

మహాభారతంలోని ఈ శ్లోకార్థం – 'తండ్రిని సేవించడమే ధర్మం. తండ్రిని సర్వవిధాల సుఖింప చేయడమే స్వర్గం. ధర్మవర్తనుడైన తండ్రి ఆదేశాలను అనుసరించడమే సర్వశ్రేష్ఠమైన తపస్సు. తండ్రిని ప్రసన్నంగా ఉంచితే సమస్త దేవతలు ప్రసన్నులౌతారు.'

అమ్మతనంలో కొంత

ముందరి తరంలో తండ్రికీ సంతానానికీ మధ్య గంభీరత, భయం, భక్తి, గౌరవం అధికంగా వుండేవి. తండ్రినేం అడగాలన్నా తల్లి ద్వారానే అడిగేవారు.

ఇప్పుడు పిల్లలకి తల్లి కన్నా తండ్రి దగ్గరి స్నేహితుడు.

ఇదివరకు పిల్లల్నెత్తుకుని బజారుకో సినిమాకో వచ్చే స్త్రీలు కన్పించేవారు. ఇప్పుడు పిల్లలు నాన్న భుజం మీద నిశ్చింతగా నిద్రపోతూ ముందెళ్తోంటే అమ్మ అనుసరిస్తోంది. అల్లరి చేస్తే నాన్నకి చెబుతాననే అమ్మల బెదిరింపుల కాలం ఎప్పుడోపోయింది!

పిల్లలకి సీసాపాలు పట్టడం దగ్గర్నుంచి చిచ్చుకొట్టి నిద్రపుచ్చడం వరకూ, ఒళ్ళో కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దించడం నుంచి గుండెల మీద కూర్చోబెట్టుకుని ఆడించడం వరకూ అన్నీ నాన్నే చేస్తున్నాడు.

మీ గారాబంతో పిల్లల్ని చెడగొట్టేస్తున్నారని తల్లులు ముద్దుగా విసుక్కుంటున్న కాలం ఇది!

పిల్లలు కూడా తమ కబుర్లని కలల్ని నాన్నతో పంచుకోడానికి ఉత్సాహపడు తున్నారంటే వారి మధ్య పెరిగిన చనువుకి ఇంత కంటే ఉదాహరణేం కావాలి?!

పిల్లల అవసరాలకే ప్రాధాన్యత

పిల్లల అవసరాలు తీర్చడానికే పెద్ద పీటవేస్తున్నాడు నేటి తండ్రి.

పిల్లల పుస్తకాలకీ ఫీజులకీ ఆహారానికీ కేటాయించాకే మిగతా బడ్జెట్ రూపొందిస్తున్నాడు. వారి సంతోషంకోసం వికాసంకోసం అవసరమైతే న్యూస్ పేపర్ కొనడం, సినిమాలకెళ్ళడం లాంటి చిన్న చిన్న ఖర్చుల్ని సైతం తగ్గించేసుకుంటున్నాడు.

ఉద్యోగి అయితే ఓవర్ టైమ్ చేస్తున్నాడు. వ్యాపారి అయితే రేయింబవళ్ళు శ్రమిస్తున్నాడు. సంతానానికి ఇంచక్కని భవిష్యత్తు నివ్వడానికి అక్షరాలా చెమటోడుస్తున్నాడు. వారికే లోటూ రాకుండా కంటికి రెప్పలా మారుతున్నాడు.

'పుత్రాః విద్యానాం పారంగమయి తవ్యాః' – పుత్రులను సర్వ విద్యాపారంగతుల్ని చేసి సన్మార్గంలో నడిపేవాడే తండ్రి అన్నారు.

రిక్షాతొక్కేవాడు కూడా పిల్లల్ని కాన్వెంటులో చదివిస్తున్నాడు. చిరుద్యోగి కూడా పిల్లల్ని ఇంజినీర్లని చేస్తున్నాడు.

తండ్రి సంతానాన్ని పాలించి పోషిస్తాడు గనుకే మనువు తండ్రిని ప్రజాపతిగా (చక్రవర్తిగా) అభివర్ణించాడు!

స్ఫూర్తి నాన్నదే

నాన్న చిటికెన వేలు పట్టుకుని చిట్టి పొట్టి అడుగులేస్తారు పిల్లలు.

క్రమశిక్షణ, గౌరవం, లక్ష్యం సాధించాలన్న తపన నాన్న నుంచే పొందుతారు.

నాన్న సాధించలేకపోయిన కోరికలూ ఆశయాలూ పిల్లలకు లక్ష్యాలవుతాయి. తన ఆశయసాధనకు పిల్లల్ని సాధనంగా మలచుకోవాలని తండ్రి చూస్తాడు. ప్రతిభని సంతరించుకుని నాన్న కళ్ళల్లో 'గొప్ప'ని 'గర్వాన్ని' చూడాలని పిల్లలు 'పరుగులు' పెడుతున్నారు.

అలాగని తన తీరని కలల్ని పిల్లల మీద రుద్దాలని ఏకపక్షంగా ప్రవర్తించటమూ లేదు. పిల్లల అభిరుచుల్నీ అభీష్టాన్నీ మన్నిస్తున్నారు.

మొత్తానికి వారు తన కన్నా చాలాచాలా ఉన్నతులైతే చాలు సంతోషంగా జీవించే స్థాయికెదిగితే చాలని భావిస్తున్నారు. ఆ భావాన్నే నూరిపోస్తున్నారు.

వారి ప్రతి అడుగులోనూ అండగా వుంటున్నారు. తమ కెరీర్‌ని ప్రక్కనబెట్టి అయినా సరే పిల్లల అభ్యున్నతకి అనుక్షణం తపిస్తున్నారు. ప్రోత్సాహిస్తున్నారు. స్ఫూర్తి దాయకమవుతున్నారు!

ఆత్మవిశ్వాసానికి మూలస్తంభం

పిల్లల్లో ఆత్మవిశ్వాసం, భద్రతాభావం పెరిగేది తండ్రి వల్లనే. తండ్రి దగ్గరగా అందుబాటులో వుండే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పాలు అధికంగా వుంటుందని సైకాలజిస్టుల అభిప్రాయం.

నిజాయితీ, నిబద్ధత, విశ్వాసం, అభిమానం వగైరా నైతిక విలువల్ని పిల్లలు తండ్రి నుంచే నేర్చుకుంటారు.

నాన్న అండ వుందన్న భరోసా పిల్లలకు కొండంత అండనిస్తుంది. నిర్భయంగా దూసుకుపోయేలా చేస్తుంది. ఎంత ఖర్చుతో కూడుకున్న చదువులైనా చదివిస్తారు. ఎంత ఎత్తులకైనా ఎక్కిస్తారు. ఈ విశ్వాసమే పిల్లల్లో ఏదో సాధించాలన్న తపనకి పునాది వేస్తోంది. ప్రేరణ అవుతోంది.

నాన్న చెప్పే సైన్సు కబుర్లు, తీర్చే అనుమానాలు, చదివించే విజ్ఞానదాయక పుస్తకాలు, నేర్పే అలవాట్లు పిల్లల్లో సానుకూల దృక్పథం కలిగిస్తుంది. జ్ఞానతృష్ణ పెంచుతుంది.

ఉన్నతస్థాయికెగబ్రాకడానికి మార్గం సుగమం అవుతుంది!

బహుపాత్రాభినయం

తల్లిదండ్రుల కోసం సోదరుల కోసం భార్యకోసం సంతానం కోసం మేనల్లుడి కోసం మేనకోడలి కోసం జీవితాంతం తపిస్తాడు 'నాన్న'. తన కోసం కన్నా తన వారి కోసం జీవిస్తాడు.

చరమాంకంలో తనని ఆదరిస్తారని సుఖపెడతారని కాదు. అది తన ధర్మబాధ్యతగా భావించి నిర్వర్తిస్తున్నాడంతే.

పిల్లల ఉజ్వల భవితే సుఖసంతోషాలే నాన్న గమ్యం. సంతానపు వికాసంలో ఉన్నతిలో సంతోషంలో తన ఆనందాన్నీ తృప్తినీ చూసుకుంటాడు.

ఇంటియజమానిగా సంపాదనాపరుడిగా బాంధవుడిగా అనేకపాత్రల్ని సమర్థ వంతంగా పోషిస్తూ కుటుంబ లక్ష్యంగా సాగిపోయే అవిశ్రాంత బాటసారి నాన్న!

ఐడియల్ 'హి'

మగపిల్లలు తమ కాబోయే భార్య తల్లిలా ప్రేమాభిమానాలతో ఆదరంగా చూసేదిగా వుండాలని భావిస్తారు.

ఆడపిల్లలు తండ్రిలో ఐడియల్ మేన్‌ని చూస్తారు. తనక్కాబోయే భర్త తండ్రిలా ప్రేమించాలి. ప్రోత్సహించాలి. సహకరించాలి. ప్రక్కన ధృఢంగా నిలబడాలి. నేనున్నానన్న భరోసా భద్రత కలిగించాలి – అని ఆశిస్తారు.

అంతేకాదు. తండ్రితో పెరిగిన సాన్నిహిత్యం, గాఢానుబంధం అమ్మాయిల్లో ఆత్మ విశ్వాసం నింపింది. కార్యదక్షత పెంచింది. సవాళ్ళని అధిగమించగల దృఢత్వాన్నిచ్చింది. పోటీకి భయపడని తత్వాన్ని నేర్పింది. విజేతలుగా తీర్చిదిద్దింది.

నేడు ఐటీ సంస్థల్లో బహుళజాతి వ్యాపార సంస్థల్లో ఆర్థిక సంస్థల్లో దూసుకుపోతున్న యువతులే దీనికి నిదర్శనం.

నెహ్రూ జైలునుండి రాసిన ఉత్తరాలే ఇందిరని మేధావిగా తీర్చిదిద్దటానికి తోడ్పడ్డాయి. నేటి పురంధరేశ్వరి విజయాలకు ఎన్టీఆరే స్ఫూర్తి!

ప్రపంచాన్ని చూపే కళ్ళు

పిల్లలకు చుట్టూవున్న ప్రపంచాన్నీ ప్రపంచ ధోరణినీ చూపించే కళ్ళు పరిచయం చేసే కళ్ళు నాన్నవే.

కష్టం నష్టం మంచీ చెడూ బరువూ బాధ్యతా పరువూ ప్రతిష్ఠా – అన్నీ కూడా మొదట నాన్న కళ్ళతోనే చూస్తారు. రెక్కలొచ్చి టపటపా కొట్టుకునేప్పుడూ నాన్న వంక చేయూత కోసం చూస్తారు.

చదువు, ఆటలు, లలితకళలు, స్నేహాలు, కెరీర్, పెళ్లి – అన్నిటా మొదటి కౌన్సిలర్ మరియు గైడ్ నాన్నే.

నాన్న భుజాల మీంచి ప్రపంచాన్ని గమనించిన పిల్లలే మూర్తీభవించిన ఆత్మవిశ్వాసంతో సంపూర్ణవ్యక్తిత్వంతో రాణిస్తున్నారు! రాణిస్తారు!!

పెళ్లి చేసేది నాన్నే

కొడుకుగాని కూతురుగాని ఉద్యోగ/వ్యాపారంలో స్థిరపడగానే పెళ్లిచేసి ఆశీర్వదిస్తాడు నాన్న.

పిల్లలకు తెలీదు గాని వారికి పెళ్లీడు రాకముందునుంచే సరియైన జోడీకోసం ఆయన కళ్ళు వెదకటం మొదలుపెడతాయి.

తమ పిల్లలకు ఎలాంటి వారు జీవిత భాగస్వామిగా లభిస్తే బావుంటుందోనన్న ఆలోచనలు క్రమక్రమంగా పెరిగి రూపుదిద్దుకుంటాయి. అలాంటి అల్లుడు లేదా కోడలు కోసం ఎన్ని రకాలుగా అన్వేషిస్తాడో ఎన్ని రకాలుగా పరీక్షిస్తాడో అతడికి మాత్రమే తెలుసు.

అప్పో సప్పో చేసి శక్తినంతా కూడదీసుకుని పెళ్లిచేయడమే కాదు వారు సుఖంగా వుండటానికి కానుకలిస్తాడు. సాయసంపదలందిస్తాడు. సంతానవంతులు కావాలని ప్రార్థిస్తాడు.

నాన్న నిజంగా గ్రేట్!

నిర్మాణాత్మక శక్తి

వేగంగా మారుతున్న నేటికాలంలో క్షణక్షణం మారుతున్న పరిస్థితులూ ప్రభావాల నుంచి తన పిల్లల్ని కాపాడుతున్నాడు.

ఆశావాద దృక్పథాన్ని అలవర్చి వెన్నుతట్టి విజయాలవైపు నడిపిస్తున్నాడు.

పిల్లలకు చక్కని క్రమశిక్షణ నేర్పుతున్నాడు. వారి మనోభావాలని గౌరవిస్తూనే ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాడు. లక్ష్యసాధనని ఒక తపస్సుగా భావించేలా పురిగొల్పుతున్నాడు.

పిల్లల్లో ధైర్యం, నమ్మకం, ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరం, ఆత్మ స్థైర్యం కలిగిస్తూ ఒక నిర్మాణాత్మక శక్తిగా పనిచేస్తున్నాడు నాన్న.

నాన్న వంశాన్ని తరాలుగా ముందుకు సాగించే జన్యువిశేషాలైన ఆయన సంతానం ఆయన్ని గౌరవించాలి. తద్వారా తమ సంతానం తమని తలచి గర్వించేలా ప్రవర్తించాలి!

57

సంతానం



పెళ్లిచేసుకోడానికి గల ముఖ్య కారణాల్లో ఒకటి పితృూణం తీర్చుకోవడం. అది సంతానం వల్లే తీరుతుంది.

కన్యాదాత కన్యని దానమిచ్చేది ఆమె ద్వారా సంతానం పొందటానికే. అది జరిగినప్పుడే కన్యాదానం సఫలమవుతుంది.

"నాభార్య ఎంతోమంచిది. నాకోసం ఇద్దరు పిల్లల్ని ప్రసవించింది. మా బయోకా తెగలో పిల్లలే మాకు ఆస్తి పాస్తులు. నేను మరణించిన తరువాత మా తెగలో నా పేరుని నిలిపేది పిల్లలే" అన్నాడు సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లోని బయోకా తెగ పిగ్మీలకు చెందిన ఓ భర్త.

సంసార సుఖానికి అంతిమ లక్ష్యం సంతానమే!

చాణక్య సూక్తులు

'పుత్రే గుణవతి కుటుమ్బినః స్వర్గంః'– పుత్రుడు గుణవంతుడైతే గృహస్థునికది స్వర్గమే.

'దుర్గ తేర్యః పితరౌ రక్షతి సుపుత్రాః' – తల్లిదండ్రుల్ని దుర్గతి పాలవకుండా రక్షించేవాడు పుత్రుడు.

'నా నపత్యస్య స్వర్గః' – సంతానం లేనివారికి స్వర్గం లేదు.

'యా ప్రసూతే భార్యా' – పిల్లల్ని కన్నదే భార్య.

'నపుత్ర సంప్పర్శాల్ పరం సుఖమ్' – పుత్రస్పర్శను మించిన సుఖం లేదు.

చాణక్యుడు చెప్పిన బంగారం లాంటి వాక్యాలివి!

సత్సంతానం

తల్లిదండ్రుల మనో ప్రవృత్తుల ననుసరించి సంతానము యొక్క మనస్సు, శరీర మేర్పడుతుంటాయి.

ఆదర్శ సంతానం కలగాలంటే భార్యభర్తలు ఉత్తములై ఉండాలి. పరస్పర ప్రేమావగాహనలుండాలి. ఉన్నత భావాలూ అలవాట్లూ ప్రవర్తనా కలిగివుండాలి.

వారి పెంపకం, శిక్షణ, చదువు, సంస్కారం – అన్నీ కూడా క్రమశిక్షణకు నైతికవిలువలకు లోబడి వుండాలి.

పిల్లలు చూచి నేర్చుకునేది ఎక్కువ. తల్లిదండ్రుల ప్రేమ, నడత, మాటలు, అలవాట్లు, ప్రవర్తన – అన్నీ వారికి నేర్చుకునే అంశాలే.

పిల్లలు దుష్టులైతే ఆ పాపంలో కొంత తల్లిదండ్రులదే. వారి శిక్షాలోపం వల్లే సంస్కార లోపం వల్లే అలా తయారయ్యారన్నమాట.

అసూయ, అత్యాశలు దూరంగా వుంచిపెంచితే పిల్లలు ఉత్తములవుతారు.

'The way your offspring turnout is the truest reflection of your achievements' అంటారు అమితాబ్ బచ్చన్.

జీన్స్ ప్రభావం

పిల్లలకు తల్లి తరఫు, తండ్రి తరపు పూర్వుల జీన్స్ సంక్రమిస్తాయి.

వారి లక్షణాలే కాదు కొన్ని దీర్ఘ వ్యాధులూ వస్తాయి.

మేనరికం లాంటి రక్తసంబంధీకుల మధ్య జరిగిన పెళ్లిళ్ళ ద్వారా జన్మించిన పిల్లలకు అంగవైకల్యం, కొన్ని రకాల జబ్బులు అనువంశికంగా వస్తూంటాయి. అంచేతే ఆ వివాహాలు మంచివి కావంటారు శాస్త్రజ్ఞులు.

అయినప్పటికీ అలాటి పెళ్లిళ్ళు జరుగుతూనే వున్నాయి.

గనుక తమవల్ల సంతానానికి శిక్షపడకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

ఆరోగ్యం ముఖ్యం

పుట్టే బిడ్డ యొక్క బరువు, ఆరోగ్యం తల్లిదండ్రుల ఆరోగ్యం మీద ఆధారపడి వుంటుంది.

వారు ఆరోగ్యవంతులైతే సంతానామూ కళకళ లాడుతుంది.

ముఖ్యంగా బిడ్డ గర్భంలో వున్నప్పుడు తల్లి పోషకాహారం తీసుకోవాలి. ఐరన్, కాల్షియం, విటమిన్లు గల ఆహారపదార్థాలు ఎక్కువగా తినాలి.

మానసికాందోళనలకూ ఆవేశాలకూ ఆవేదనలకూ దూరంగా వుండాలి.

అప్పుడే శిశువు ఎలాంటి అవలక్షణాలూ లేకుండా ఆరోగ్యంగా పుడతాడు.

పుట్టిన ఘడియలు

బిడ్డ పుట్టిన తేది, సమయం నోట్ చేసుకోవాలి.

కొందరు తిథి వార నక్షత్రాలు సైతం రాసుకుని జాతకచక్రం వేయిస్తూంటారు. ఆ బిడ్డ భవిష్యత్తు ఏమిటో ఆ చక్రం ద్వారా తెలుసుకోవాలన్నది వారి ఆశ! ఆరాటం!

కొన్నిసార్లు పుట్టిన ఘడియలు మంచివి కావంటారు. కొన్ని గ్రహాలస్థితి అనుకూలంగా లేదని 'శాంతి' చేయిస్తుంటారు.

నూనెలో బిడ్డ మొహాన్ని మొదట చూశాకే తర్వాత బిడ్డని చూడాలంటారు. ఇది తండ్రికే వర్తిస్తుంది తప్ప తల్లికి కాదని గమనించాలి.

బిడ్డకీ సమీప బంధువులకీ ఎలాంటి గ్రహదోషమూ తగలకూడదని చిన్న శాంతి కర్మకాండ చేస్తారు.

బిడ్డ భవిష్యత్తు దివ్యంగా వుండాలన్న ఆరాటానికి నిదర్శనమిది.

అది అవసరమా కాదా అన్న తర్కానికి తావులేదు!

కుటుంబ నియంత్రణ

మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అన్నారు.

సంతానానికి మంచి భవిష్యత్తునివ్వాలంటే వారిమీద అధిక శ్రద్ధ చూపించాలంటే, క్వాలిటీ లైఫ్ ఇవ్వాలంటే కుటుంబాన్ని నియంత్రించుకోక తప్పదు.

తల్లి ఆరోగ్యం బాగుంటుంది. కెరీర్ మీద దృష్టిపెట్టగలుగుతుంది.

చిన్నకుటుంబం సుఖసంతోషాల నిలయమవుతుంది. తక్కువమంది సభ్యులవడం వల్ల వారి మధ్య ప్రేమాభిమానాలబంధం దృఢమవుతుంది. క్లోజ్‌నెస్ పెరుగుతుంది.

అంచేత ఒకరిద్దరు పిల్లల్తో సంతానానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి.

వ్యక్తి దృష్ట్యా సమాజం దృష్ట్యా దేశం దృష్ట్యా అది అవసరం.

బిడ్డకీ బిడ్డకీ మధ్య తగినంత గేప్ వుండేలా ప్లాన్ చేసుకోవాలి.

మగపిల్లలా ఆడపిల్లలా అని చూడాల్సిన కాలం కాదిది. ఎవరైనా ఒకటే. రెక్కలు రాగానే మరోగూటికి ఆడపిల్ల వెళ్తే మరో చోటుకి మగపిల్లాడు వెళ్తాడు.

ముదిమిలో ప్రేమాభిమానాలు ఇద్దరూ పంచుతున్నారు. ఆస్తికీ అప్పుకీ బాధ్యతలకీ ఇద్దరూ వారసులే కదా!

కుటుంబ నియంత్రణ పాపమో భోగలాలసో కాదు ఒక శారీరక ఆర్థిక సామాజిక అవసరం!

ఇద్దరైతే ముద్దు

సంతానం పరిమితమైతే ఇంటిల్లపాదికీ అపరిమితానందం కలుగుతుంది.

కొందరు ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఉద్యోగ బాధ్యతల దృష్ట్యా ఒక సంతానానికే పరిమితమవుతున్నారు.

కాని ఇద్దరు పిల్లలుండటం శ్రేయస్కరం. ఒకరికొకరు తోడుగా అండగావుంటారు. భద్రతా భావం పెరుగుతుంది. సోదరప్రేమ లభిస్తుంది. ధైర్యం ఉత్సాహం పెరుగుతాయి. కలిసి ఆడుకోడానికి సంతోషం పంచుకోడానికి పోటీ పడటానికి ఉపయోగపడ్తుంది.

ఒక్కరే సంతానమైతే ఒంటరితనం బాధిస్తుంది. తమలో తాము ముడుచుకు పోతారు. ఇంట్రావర్ట్‌గా మారతారు. ఇతరుల్తో త్వరగా సర్దుకుపోలేరు. కలవలేరు.

ఎట్టిపరిస్థితుల్లోనూ ముగ్గుర్ని మించిన సంతానం వద్దే వద్దు.

ఆడది ఆపత్కాలంలో కూడా నాలుగవ సంతానం కోరరాదనీ అలాకోరే స్త్రీ స్వైరిణి అనీ, అయిదవ సంతానాన్ని కోరే స్త్రీ బంధకి అనీ పాండురాజు కుంతితో చెబుతాడు.

ప్రస్తుత ఆర్థిక సామాజిక స్తితిగతులూ దాన్నే సమర్థిస్తున్నాయి!

తండ్రి ఆత్మయే పుత్రుడు

తండ్రి యొక్క సర్వకార్యాలకూ ప్రతినిధిగా పుత్రుడ్ని పేర్కొంటారు.

తండ్రి ఆస్తిపాస్తులే కాదు బాధ్యతలు కూడా తండ్రి మరణానంతరం పుత్రుడికి వారసత్వంగా లభిస్తాయి. తండ్రి స్థానంలో పనిచేయాల్సి వుంటుంది.

అమ్మనేకాదు తాతయ్యని నాన్నమ్మని మేనత్తని మేనల్లుడ్ని మేనకోడల్ని తమ్ముళ్ళని చెల్లెళ్ళల్ని ఆదరించాల్సిన గురుతర బాధ్యత అతడి మీదే వుంటుంది.

అందువల్లనే తండ్రి ఆత్మయే పుత్రుడంటారు.

ఇక్కడ ఆత్మ అనే మాట శరీర వాచకం. శరీరం నుంచి శరీరం పుడుతుంది. కనుక కుటుంబవ్యవహారాల్లో సామాజిక సంబంధాల్లో పుత్రుడు తండ్రికి ప్రతినిధి అవుతాడు.

ఆడపిల్ల ఆదిలక్ష్మే

'ఆడపిల్లా?! అని పెదవి విరవవద్దు. చిన్నచూపు చూడవద్దు.

ఆడపిల్ల 'గుండెల మీది కుంపటి' అన్నది పాతమాట.

ఇప్పుడు మగపిల్లాడికన్నా ఆడపిల్లే నయమంటున్నారు. జీవితాంతం అభిమానంగా చూసేది తల్లిదండ్రుల కోసం కలవరించేది కూతురే.

"మా నాన్నగారి పట్ల మా సిస్టర్స్ చూపే ఆప్యాయత, అనురాగం చూస్తుంటే ముచ్చటేస్తుంటుంది. మా కన్నా బాగా ఎక్కువగా పేరెంట్స్ మీద శ్రద్ధ చూపిస్తారు వాళ్ళు. కూతురు పుట్టాలని గట్టిగాకోరుకున్నాను. ఆడపిల్లని దత్తత తీసుకోవాలనే ఆలోచన కూడా ఉంది" అన్నారు అక్కినేని నాగార్జున.

ఆడపిల్లని శ్రీలక్ష్మి అవతారంగా భావించాలి. ఆమె వున్న ఇంట్లో సర్వశుభాలూ తిష్టవేస్తాయి.

చదువులో సంపాదనలో సైతం ఆడపిల్లలు మగవారిని మించిపోతున్న సంగతి గమనార్హం!

అదీగాక చాలా రాష్ట్రాల్లో మహిళల జనాభా తక్కువగా వున్నట్టు గణాంక వివరాలు తెలియజేస్తున్నాయి. హైదరాబాదులోనే 1000మంది మగవారికి మహిళల సంఖ్య 933 మాత్రమే.

మున్ముందు ఆడవారికి కొరతవచ్చే ప్రమాదముంది. ఆడపిల్లలంటే చిన్నచూపు, వివక్ష, ఆడపిల్ల అని తెలీగానే గర్భస్రావాలకి పాల్పడటం- స్త్రీల సంఖ్య తగ్గటానికి కారణమంటున్నారు.

ఈ పద్ధతి మారకపోతే స్త్రీ పురుష నిష్పత్తిలో సమతుల్యం కొరవడి కొత్త సమస్యలు ఎదురుకావచ్చు!

పుత్రోత్సాహం



పిల్లలు పుట్టగానే తల్లిదండ్రులు అపరిమిత ఆనందానుభూతులకు లోనవుతారు. సంతోషంతో పొంగిపోతారు.

కాని నిజమైన పుత్రోత్సాహం అప్పుడు కలగదు.

వారు పెరిగి పెద్దవారై చదువుకుని ప్రయోజకులైనప్పుడే కలుగుతుంది. పదిమందీ వారిని మెచ్చుకున్నప్పుడు అది తారస్థాయికి చేరుకుంటుంది.

ఈ సంగతి దృష్టిలో వుంచుకుని పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సివుంది. అలాగని తమ అభిప్రాయాలని బలవంతంగా వారిమీద రుద్దటం, గిరిగీసి అందులోనే వుండాలని శాసించడం, ఆంక్షలు అతిక్రమిస్తే దండించడం చెయ్యకూడదు.

వారి అవగాహన పెంచుతూ వారి ఆలోచనల్ని పసిగడుతూ వారి అభిరుచుల మేరకు మళ్ళిస్తూ గమ్యం చేరేందుకు తోడ్పడాలి.

వంశవృక్షం

వంశవృక్షాన్ని శాఖోపశాఖలుగా విస్తరింప జేసేది సంతానమే.

మనుషులు పోవచ్చు. ఆస్తులూ అంతస్తులూ పోవచ్చు. కాని వంశవృక్షం నిలిచి వుంటుంది. నిరాటంకంగా కొనసాగుతుంది.

సంతానం కలిగినప్పుడే జీవితం సఫలమవుతుంది. జీవనఫలం సంతానమే.

'అపుత్రస్య గతిర్నాస్తి' 'పున్నామనరకం నుంచి తప్పించువాడు పుత్రుడే' అని చెప్పడానిక్కారణం అదే.

అందుకే మెడ నిండగానే ఒడి నిండాలని పడతులు తపిస్తారు. వంశాన్ని నిలిపే వారసుల కోసం ఆరాటపడతారు.

జీవనమాధుర్యం సంతానం ద్వారానే అనుభవైక వేద్యం!

పిల్లలు పుట్టకపోతే

పెళ్లయ్యాక పిల్లలు పుట్ట లేదంటే దానికి స్త్రీగాని పురుషుడు గాని లేదా ఇద్దరూ గాని కారణం కావచ్చు.

వైద్య నిర్ధారణ గాకుండా సంతాన లేమికి స్త్రీయే కారణమని నిందించడం తగదు.

స్త్రీలలో ఋతుచక్రం సరిగ్గా వుంటే చాలు సంతానవంతులవుతారు. అరుదుగా మాత్రమే గర్భాశయలోపాలు గర్భధారణకి అడ్డుపడతాయి. చికిత్స ద్వారా వాటిని సరిచేయించుకోవచ్చు.

ఆరోగ్యమైన వీర్యం ఉత్పత్తి కాకపోవడం లేదా వీర్యం కౌంట్ తక్కువగా వుండటం, నపుంసకత్వం, కొన్ని రకాల సుఖరోగాలు పురుషుడి తరపు కారణాలు.

అనువజ్ఞులూ స్పెషలిస్టులూ అయిన డాక్టర్లని సంప్రదిస్తే చక్కని ఫలితం వుంటుంది. కృత్రిమ గర్భదారణ పద్ధతులూ విజయమవుతున్నాయి.

మోసపు ప్రకటనలు చూసి మాయడాక్టర్ల వలలో పడకుండా జాగ్రత్తవహించాలి!

స్త్రీ అధిక వయస్సూ ఓ కారణమే

స్త్రీలలో వయస్సు పైబడే కొద్దీ సంతానవతి అయ్యే అవకాశాలు సన్నగిల్లుతూంటాయి.

గర్భాశయంలోని రక్తనాళాలు వయస్సు పెరిగే కొద్దీ కుంచించుకుపోతాయి. గనుక రక్తప్రసరణా తగ్గుతుంది.

35 ఏళ్ళ వయస్సులో గర్భవతి అయితే డౌన్స్ సిండ్రోమ్‌తో బాధ పడే శిశువు పుట్ట వచ్చు. ఇంకా ఆలస్యమయ్యే కొద్ది అబార్షన్లు పెరగవచ్చు. గర్భస్థ శిశువు పెరుగుదల సైతం సక్రమంగా వుండకపోవచ్చు. ప్రసవం కష్టమూ కావచ్చు

తల్లి వయస్సు మరీ ఎక్కువైతే బిడ్డకూ ప్రమాదమే. ఆమె కుండే మధుమేహం, అధిక రక్తపోటు వల్ల అనర్థాలు కలిగే అవకాశముంది.

దత్తత స్వీకారం

పిల్లలు కలగని వారికి తమ వంశాన్ని కొనసాగించడానికి, తమ తదనంతరం ధార్మికమైన బాధ్యతలు నెరవేర్చడానికి హిందూకుటుంబాల్లో వున్న ఒక ఏర్పాటు దత్తత స్వీకారం.

ఇతరుల బిడ్డని లేదా అనాథని తమ బిడ్డగా స్వీకరించడమే దత్తత. దీన్ని ధర్మ శాస్త్రాలు అనుమతించాయి. చట్టమూ గుర్తించింది.

దత్తత స్వీకారానికి కొన్ని నియమాలూ షరతులూ వున్నాయి. చట్టం నిర్దేశించిన వాటిని అనుసరించకతప్పదు.

మేజరు అయిన హిందూ స్త్రీపురుషులెవరైనా దత్తత తీసుకోవచ్చు. పెళ్లైతే రెండోవారి అనుమతి అవసరం.

దత్తత వెళ్ళడానికి హిందువై వుండాలి. 15 ఏళ్ళు దాటకూడదు. పెళ్లైవుండ కూడదు. అంతకు ముందు దత్తత వెళ్లి వుండకూడదు.

దత్తతిచ్చే అధికారం తల్లిదండ్రులకే వుంది. తండ్రిలేకపోతే తల్లి ఇవ్వవచ్చు. ఇద్దరూ లేకపోతే కోర్టు అనుమతితో సంరక్షకులు ఇవ్వవచ్చు.

సంతానం లేనివారు అనాథల్ని దత్తత తీసుకుని వారికి చక్కని జీవితాన్నివ్వడం అభిలషణీయం. పుణ్యదాయకం!

సంతాన బాధ్యత

బాధల్లో కష్టాల్లో గుర్తొచ్చేది 'అమ్మా' శబ్దమే. చిన్న దెబ్బ తగిలినా నోటి వెంట అప్రయత్నంగా వెలువడే అక్షరాలు అవే.

సంతానం తల్లి ఋణం ఎప్పటికీ తీర్చుకోలేరు. వారెన్ని చేసినా వారికి జన్మనిచ్చేప్పుడు ఆమె పెట్టే ఒక్క 'కేక' కి సరిరావు.

అందుకే **'మాతా భవతు సంమనాః'** అన్నది అథర్వవేదం. అంటే తల్లిని సంతోష పెట్టడమే సంతాన ప్రథమధర్మం.

పుట్టుక నుంచి మరణం వరకు అన్ని సుఖ దుఃఖాలలో మొదటగా తలచుకునేది తల్లినే. అప్రయత్నంగా జరిగిపోయే ప్రకృతి చర్య అది.

తల్లి లోకానికి ప్రత్యక్ష దేవత అయితే బిడ్డకి జన్మదాత.

తల్లినీ ఆమెతోబాటు తండ్రినీ సంతోషపెట్టం పిల్లల బాధ్యత. వారిపిల్లల్నుంచి వారేం ఆశిస్తారో అవన్నీ తమ తల్లి దండ్రులకు చెయ్యడం వారి కర్తవ్యం!

తల్లిదండ్రుల ప్రేమ

పిల్లల్ని భయంతో కాదు ప్రేమతో పెంచాలి. మరీ కఠినంగా వుంటే బానిస మనస్తత్వం అలవడుతుంది. వెన్నెముక వుండదు. వ్యక్తిత్వం పెరగదు.

సంతాన విషయంలో తల్లిదండ్రుల ప్రేమ ఎప్పుడూ హెచ్చవేయబడుతుంది కాని భాగించబడదు.

వికృత సంతానం

దాంపత్య ధర్మాన్ని నిష్ఠగా కొనసాగించే వారికి రక్షణ ఉంది. భద్రత ఉంది. శాంతి ఉంది.

పవిత్ర వైవాహిక జీవన ఫలమే సంతానం. అలాంటి సంతానానికి ఎలాంటి విజ్ఞాన ప్రావీణ్యాలు శక్తి సామర్థ్యాలు సమకూరతాయో మహాభారతం వివరించింది.

వికృత పద్ధతుల ద్వారా పొందిన కృతిమ సంతానపు వికార చేష్ఠలూ వినాశకర పద్ధతుల గురించీ మహాభారతం పేర్కొంది.

కృత్రిమ సంతానమైన గాంధారీ పుత్రులు, సగరులు, దుష్టద్యుమ్నుడు, ద్రోణుడు తదితరులంతా కూడా దుర్మార్గపు మరణాన్నే పొందారు!

కృత్రిమ సంతానం సమాజ కళ్యాణ హేతువు కాదు గనుకే భారతయుద్ధం ముగిసేవరకు వారిలో ఎవరూ మిగలలేదు!

పిల్లలు బంధనాలే

సంతానం ఒక బంధం. ఒక బాధ్యత. ఒక దిక్సూచి. ఒక లక్ష్యం. ఒక స్వార్థం!

వారి పాలన పోషణ ముఖ్యమవుతుంది గనుక తల్లిదండ్రుల ఆశయాలకు వారు ఒక రకమైన బంధనాలే.

ఒక్కోసారి ముఖ్యంగా రాజకీయాల్లో వ్యాపారాల్లో 'సన్‌స్ట్రోక్' ఇచ్చేదీ వారే.

తాము నమ్మిన సిద్ధాంతాల నుంచి లక్ష్యాల నుంచి ప్రక్కకి తొలగటం కొందరికి ఇష్టం ఉండదు. అలాటి వారే ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, ప్రకాశ్ కారత్. వారు పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ పాటించారు.

వారి నిస్వార్థ ప్రజాసేవా కాంక్ష, నిబద్ధత అమోఘం!



58

నామకరణం



శిశువు జన్మించేక చేసే తొలి సంస్కారం నామకరణం.

నామకరణమంటే పేరుపెట్టడం.

కొత్త ప్రాణికి పేరు ద్వారానే ఒక గుర్తింపు, ఒక ఉనికి, ఒక ప్రత్యేకత ఏర్పడతాయి.

గోత్రం తల్లిదండ్రులదే అయినా నామం మాత్రం బిడ్డకి ప్రత్యేకమైంది. స్వతంత్రమైంది. విశిష్టతను చేకూర్చేది.

'వ్యవహారహేతువు, శుభావహమైనది, కీర్తి కారకము అగు నామకర్మ ప్రశస్తమైనది' అన్నారు బృహస్పతి.

పేరు ప్రఖ్యాతులు

పెద్దలు చిన్నవారిని దీవిస్తూ 'మంచిపేరు తెచ్చుకోవాలి' అంటూ దీవిస్తారు. దానర్థం అతడి పేరు ప్రఖ్యాతి చెందాలి. పదిమందికీ తెలియాలి. కీర్తింపబడాలి – అని!

అలా జరిగేట్టు వారు కృషిచేయాలి. ప్రముఖులు కావాలి.

ప్రపంచంలోని సకల కార్యాలూ మనిషి పేరుమీదే జరుగుతాయి. అందుకే పేరు భాగ్యాన్నీ శుభాన్నీ కలగజేస్తుందని నమ్ముతారు.

కీర్తి సంపదలకు నామమే ముఖ్యకారణం. ఆజన్మాంతం అన్ని రకాల లోక వ్యవహారాలకూ నామమే వ్యవహరింపబడుతుంది.

సంకల్పం చెప్పేప్పుడు గోత్రంతో బాటు నామాన్ని కూడా ఉచ్చరిస్తారు.

నామకరణోత్సవం



శిశువు జన్మించిన 10వ రోజు లగాయితు 22వ రోజు లోపు సరి దినములందు నామకరణం చేయుట శుభం. ఎక్కువగా 12వరోజున చేస్తూంటారు.

పురోహితుడి ఆధ్యర్యంలో పూజచేసి పెద్దల చేత ఆశీర్వాదాలిప్పిస్తారు. పితృదేవతల కృపకోసం అర్థిస్తారు.

బిడ్డని తండ్రి ఒడిలో పడుకోబెట్టి అతడిచేత బిడ్డ కుడిచెవిలో తమలపాకు కొన వుంచి మరీ నామాన్ని ఉచ్చరింపజేస్తారు. బియ్యంలో పేరు రాయింపిస్తారు.

తర్వాత అంతా బిడ్డనోటిని తీపి చేయడానికి తేనె రుచి చూపిస్తారు. బిడ్డని ముద్దాడి పేరుతో పిలిచి ఆశీర్వదిస్తూ అక్షింతలు వేస్తారు.

నామ నిర్ణయం

ఏం పేరు పెట్టడమా అని బిడ్డపుట్టక ముందునుంచే తల్లిదండ్రులు ఆలోచిస్తూంటారు. మగపిల్లాడు పుడితే ఫలానా ఫలానా పేరు పెడదాం, ఆడపిల్ల జన్మిస్తే ఫలానా ఫలానా పేరుపెడదాం అనుకుని కొన్ని పేర్లు సెలక్టు చేసుకుంటారు.

తీరా నామకరణం చేసే సమయాన ఇంటిల్లపాదీ తర్జన భర్జన పడతారు. పెద్దల పేరు పెట్టాలని ఒకరు, దేవుళ్ళ పేరు పెట్టాలని ఒకరు, ప్రముఖుల పేరు పెట్టాలని మరొకరు, కొత్తరకపు మోడ్రన్ నేమ్ పెట్టాలని ఇంకొకరు, అదేమీ కాదు నక్షత్రానుసారం పెట్టాల్సిందే అని మరొకరు చెబుతారు.

అందరి ఆపేక్షలు ఆశలు తీరుస్తూ పేరుని నిర్ణయించడం కష్టతరమేగాని ఆనందాయకం.

మగపిల్లవాడికి సరిసంఖ్య అక్షరాలతోనూ ఆడపిల్లకు బేసిసంఖ్య అక్షరాలతోనూ పేరు పెట్టాలంటారు.

నక్షత్రాన్ని బట్టి పేర్లు

జన్మించిన సమయంలోని నక్షత్రాన్ని బట్టి నామకరణం చేయటం శుభస్కరమంటారు. ఏయే నక్షత్రాలలో పుడితే వారిపేరు ఏయే అక్షరాలతో మొదలవ్వాలన్నారో చూద్దాం.

అశ్విని	:	చూ, చే, చో, ల
భరణి	:	లీ, లూ, లే, లో
కృత్తిక	:	అ, ఈ, ఊ, ఏ
రోహిణి	:	ఓ, వా, వి, వీ
మృగశిర	:	వే, వె, కా, కి
ఆరుద్ర	:	కూ, కు, జ్ఞా, ఛా
పునర్వసు	:	కే, కో, హా, హీ
పుష్యమి	:	హు, హే, హో, దా
ఆశ్లేష	:	డి, డు, డే, డో
మఖ	:	మా, మి, ము, మే
పుబ్బ	:	మో, టా, టి, టు

ఉత్తర	:	టే, టో, పా, పి
హస్త	:	పూ, ష, షా, ఠా
చిత్త	:	పే, పో, రా, రి
స్వాతి	:	రు, రే, రో, త
విశాఖ	:	తీ, తూ, తే, తో
అనూరాధ	:	నా, నీ, నూ, నె
జ్యేష్ఠ	:	నో, య, యా, యు
మూల	:	యే, యో, భా, భీ
పూర్వాషాడ	:	బు, దా, బా, డా
ఉత్తరాషాడ	:	బే, బో, జా, జీ
శ్రవణం	:	జూ,జే, జో, ఖ
ధనిష్ట	:	గా, గీ, గు, గే
శతభిషం	:	గో, సా, సే, సూ
పూర్వా బాధ్ర	:	సే, సో, ద, ది
ఉత్తరా బాధ్ర	:	దు, శ్య, ఝు, థా
రేవతి	:	దే, దో, చా, చి

ఇవి మగపిల్లలకీ ఆడపిల్లలకీ కూడా సమానంగా వర్తిస్తాయి.

జన్మనక్షత్రాన్ని బట్టే పేరు పెట్టాలనేం లేదు. పెడితే శుభం జరుగుతుందని ఒక నమ్మకం. ఒక ఆశావహ దృక్పధం. అలా పెట్టకపోయినా ప్రముఖులైన వారెందరో వున్నారు. వుంటారు!

పెద్దల పేర్లు

పిల్లలకు తాత మామ్మల పేర్లు పెట్టటం సంప్రదాయం. అంటే తాత పేరు మనవడికి మామ్మ పేరు మనవరాలికి పెడుతూంటారు.

తండ్రి తరపు తాతామామ్మలే గాక తల్లి తరపు తాతామామ్మల పేర్లు లేదా ఇరువురి పేర్లూ కలిసొచ్చేలా పెడుతూంటారు.

పెద్దలయెడ తమకి గల గౌరవాభిమానాల్ని ఈ రకంగా చాటు కొంటారు కొందరు. పిల్లల పేర్ల ద్వారా పెద్దల్ని గుర్తుచేసుకుంటూ వుంటారు.

అలా పెట్టినప్పుడు పెద్దల్ని పేరుపెట్టి పిలవకూడదు గనుక ముద్దు పేరుతో పిలుస్తూంటారు.

దేవుళ్ళ పేర్లు

ఇప్పట్లో తగ్గిందిగాని ఇదివరకెక్కువగా దేవుళ్ళ దేవతల పేర్లు పిల్లలకి పెట్టేవారు.

వేంకటేశ్వరస్వామి దయవల్ల పుట్టారనో కనకదుర్గమ్మ ఆశీస్సుల వల్ల నెలతప్పిందనో సత్యన్నారాయణ స్వామి కరుణవల్ల గర్భం ధరించిందనో ఆయా పేర్లు పెట్టేవారు.

కొందరు కులదైవం పేరు ఇష్టదైవం పేరు పెట్టడం కద్దు.

పిల్లల పేర్ల రూపేణ పదే పదే భగవన్నామస్మరణ చేసినట్టువుతుందని పూర్వుల భావన!

బ్రతుకంతా పాపాలు చేసిన ఓ పెద్దమనిషి చనిపోయే ముందు కొడుకు నారాయణ కోసం 'నారాయణ నారాయణ' అని కలవరించాట్ట. తనకు తెలీకుండానే శ్రీమన్నారాయణుడి పేరు ఉచ్ఛరించాడన్నమాట. కేవలం నామస్మరణ పుణ్యం వల్లే స్వర్గానికెళ్ళాడని పురాణాల్లో ఓ కథ వుంది!

ప్రముఖుల పేర్లు

స్వాతంత్రం వచ్చిన కొత్తలో పుట్టిన వారికి దేశనాయకుల పేర్లు పెట్టడం జరిగింది. ఇప్పటికీ గాంధీ, నెహ్రూ, ఇందిర, అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్‌ల పేర్లు పెడుతున్న వారెందరో వున్నారు.

ఆయా నాయకుల మీద పిల్లల తల్లిదండ్రులకు గల ఆరాధనా భావానికి ప్రతీక అది.

అలాగే వివిధరంగాల్లో ప్రఖ్యాతిగాంచిన వారిపేర్లు, శాస్త్రవేత్తల పేర్లు, ఆటగాళ్ళ పేర్లు, సినీనటుల పేర్లు పెట్టేవారూ వున్నారు.

ఎవరి అభిమానం వారిది!

ప్రత్యేకత గల పేర్లు

ఇప్పటి తల్లిదండ్రులు విభిన్నమైన నూతనమైన పేర్లు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

పేర్లలానే తమ పిల్లలూ ప్రత్యేకతని ప్రాముఖ్యతని సంతరించుకోవాలని ఆకాంక్షి స్తున్నారు.

రకరకాల పేర్లు, విభిన్న భాషల్లోని పేర్లు, నవలల్లోని పేర్లు, చిత్రమైన కాంబినేషన్లలోని పేర్లు – ఎంతో తరచి చూసి ఆలోచించి తపించి మరీ పెడుతున్నారు.

పేరులో ఏముందని షేక్స్పియర్ అని వుండొచ్చుగాక. కాని పేరు లోనే పెన్నిధి వుందని జనం విశ్వాసం.

ప్రాణ్ మంచి పేరే. కాని హిందీ సినిమాల్లో విలన్‌గా ప్రాణ్ పాపులరయ్యాక ఉత్తరాదిలో ఎవ్వరూ కూడా తమ పిల్లలకి ఆ పేరు పెట్టే సాహసం చెయ్యలేదుట!

పేరెలా వుండాలి?

పేరుపెట్టే ముందు సంప్రదాయాన్ని చూడండి. ఆధునికంగా ఆలోచించండి. నక్షత్రాలని పరిశీలించండి. గ్రహాలని చుట్టెయ్యండి. సంఖ్యాశాస్త్రాన్ని సంప్రదించండి. ఏమైనా చెయ్యండి. కాని పేరుని ఫైనలైజ్ చేసే ముందు ఈ క్రింది విషయాలని గుర్తుపెట్టుకోండి.

రెండు లేక నాలుగు అక్షరాలు కలిగి ఉండాలన్నారు వసిష్ఠుడు.

పేరు చిన్నదిగా వుండాలి. ఉచ్ఛరించడానికి అనువుగా వుండాలి. వినడానికి శ్రావ్యంగా వుండాలి. ఆశావాదం నిండి వుండాలి. పవిత్రంగా వుండాలి. శుభం కోరేదిగా ఉండాలి.

నక్షత్ర, వృక్ష, నదీ, పర్వత, పక్షి, సర్ప, సేవకా నామములు, భీషణ నామములు – ఆడపిల్లలకు పనికిరావన్నాడు మనువు. కాని రోహిణి, రేవతి, గంగ, తులసి, మాలతి నామాలకు మినహాయింపు గలదంటారు.

ఆనందం, విజయం, ఐశ్వర్యం సూచకాలైన నామాలు శుభప్రదం అన్నదీ దృష్టిలో పెట్టుకోండి.

ఇంట్లోని పెద్దవారి సలహాలూ సూచనలూ తీసుకోండి.

ముద్దుపేరు పెట్టేట్టయితే అది ముద్దుగా ముచ్చటగా వుండేట్టు శ్రద్ధ తీసుకోండి. పెద్దయ్యాక పిల్లలు చిన్నబోయేలా వుండకూడదా పిలుపు.

ఒక సినిమాలో 'పందు' అని ఉడికించిన సంగతో సారి గుర్తుచేసుకోండి.

మీరు పెట్టే పేరు మీ పిల్లలకూ తద్వారా మీకూ మీ పెద్దలకూ కీర్తిప్రతిష్ఠలు చేకూరు స్తుందని ఆశిద్దాం!

59

బాల్యం - వేడుకలు



బాల్యం అందమైన దశ. ఆనందకరమైన భాగం.

దాన్ని మరింత ఆనందపరిచేదిగా మరపురానిదిగా మలచాలి.

జీవితాంతం వెన్నాడే మధుర స్మృతుల పెన్నిధిని బాలబాలికలకు అందివ్వాలి.

దేవుడికి కూడా బాల్యమంటే ఎంతో ప్రీతి. అందుకే ప్రతి అవతారంలోనూ తన బాల్యాన్ని అందంగా తీర్చిదిద్దుకున్నాడు. కృష్ణావతారంలో ఇద్దరమ్మల అనురాగపాలు గ్రోలితే రామావతారంలో ముగ్గురమ్మల మురిపాలు జుర్రుకున్నాడు!

వేడుకలు

భారతీయ సంప్రదాయంలో వ్యక్తి జీవితంలో వచ్చే ప్రతి ముఖ్యమైన మార్పుకీ ఓ ప్రత్యేకత వుంది. ఓ ఉత్సవం వుంది.

వివాహిత గర్భం ధరిస్తే సీమంతం, బిడ్డ పుట్టేక బారసాల, నామకరణం, బోర్లపడితే బొబ్బట్లు పంచడం, కూర్చుంటే కుడుములు వండటం, నవ్వులకి నువ్వుండలనివ్వడం, పాకుతుంటే పాయసం పెట్టడం, గడపదాటితే గారెలు వండటం – ప్రతి మలుపునీ ఓ వేడుకగా చేస్తారు, చూస్తారు.

బిడ్డ ఎదిగే క్రమంలో చేసే ప్రతీదీ కూడా పిల్లలకీ తల్లి దండ్రులకీ కూడా మధురానుభూతుల్ని పంచుతుంది. మరపురాని జ్ఞాపకాల్ని పదిలం చేస్తుంది!

బారసాల

పుట్టిన పిల్లలకు పేరు పెట్టడం కోసం చేసే శుభకార్యమే బారసాల.

సాధారణంగా 12వ రోజున జరిపే ఈ కార్యంలో మూడు ఉపకార్యాలున్నాయి.

సంతానానికి ఆయుర్దాయం, సంపద కలగటానికి గ్రహదోషం (ఉన్నట్లయితే) నివారణకు ప్రత్యేక 'గ్రహశాంతి' పూజ చేయిస్తారు.

నామకరణం చేసి ఆశీర్వదిస్తారు.



నమ్మకం వున్నవారు బిడ్డజాతక చక్రం వేయించి భవిష్యత్తు ఎలా వుంటుందో తెలుసుకోగోర్తారు.

ఆ బిడ్డ పుట్టేక చేసే తొలి శుభకార్యం గనుక బంధుమిత్రుల్ని పిలిచి వేడుకగాచేస్తారు.

డోలారోహణం

బిడ్డ జన్మించిన మొదటి నెలలోగాని మూడవ లేక అయిదవనెలలో గాని ఉయ్యాల తొట్టెలో వేస్తారు. దానినే డోలారోహణం అంటారు.

కొందరు దీనికి కూడా ముహూర్తం పెట్టిస్తారు. ఎక్కువగా మంచి తిథి చూసి వృద్ధముత్తైదువు చేత శిశువుని ఉయ్యాలలో పరుండబెట్టి ఊపుతారు.



ఇరుగు పొరుగు అమ్మలక్కలంతా వచ్చి ఈ వేడుకలో పాల్గొనటమే గాక శ్రావ్యంగా పాటలు పాడతారు.

ముఖ్యంగా, 'జో అచ్యుతానంద జోజో ముకుందా..' అంటూ అన్నమయ్య కీర్తనని సుమధురంగా ఆలపిస్తారు.

పిల్లలకి బొమ్మలూ పెద్దలకు శనగలూ గిఫ్టులూ పంచుతారు.

ముత్తైదువుల దీవెనలంది శిశువు దినదిన ప్రవర్ధమానమవుతాడు.

అన్నప్రాశన

శిశువుకి చేసే మరో సంస్కారం ఇది.

ఇంతదాకా తల్లిపాలు మాత్రమే త్రాగిన బిడ్డకు తొలిసారిగా వండినటువంటి ఘనాహారాన్ని తినిపించడమే అన్నప్రాశన.

ఇది నిజంగా ఆనందకర ఘట్టం గనుక వేడుకగా సంప్రదాయబద్ధంగా చేస్తూంటారు.

మగపిల్లలకు ఆరవ మాసం మొదలు సరిమాసములలో అనగా 6-8-10-12 మాసాల్లో అన్నప్రాశన చేస్తారు. ఆడబిడ్డలకు అయిదవ మాసం మొదలు బేసి మాసములలో అనగా 5-7-9-11 మాసాల్లో చేస్తారు.



పగటి పూట పూర్వాహ్నమందు చేయించాలన్నారు పండితులు.

దీనిక్కూడా శుభముహూర్తం చూడటం జరుగుతుంది.

ఆవు పాలతో పాయసాన్ని వండి వెండి గిన్నెలో పెట్టుకుని బంగారు ఉంగరం సాయంతో పెద్దలచేత-ముఖ్యంగా తాత లేక మామ్మ చేత మొదటి అన్నపు మెతుకు బిడ్డకు పెట్టిస్తారు.

తర్వాత తల్లిదండ్రులూ మిగతా వారూ అన్నం ముట్టిస్తారు.

శిశువుకు ఘనాహారాన్ని ప్రథమంగా పెద్దల చేత పెట్టించడం దాన్నో వేడుకగా నిర్వహించడం హిందూ సంస్కృతి ప్రత్యేకత.

ఈ వేడుకలోనే నూతనవస్త్రములు, ఆయుధాలు, పుస్తకాలు, కలం, బంగారం, వెండి, డబ్బు, పండ్లు, పూలు, సుగంధద్రవ్యాలు శిశువు ముందు వుంచి వాటిని తీసుకోమని ప్రోత్సహిస్తారు.

బిడ్డ దేన్ని ఇష్టపడి స్పృశిస్తాడో అతడి జీవనవృత్తి దానితో ముడివడుతుందని ఒక విశ్వాసం!



చూడాకర్మ

పుట్టు వెంట్రుకలు తీయుటమే కేశఖండనం. దీనినే చౌలం లేదా చూడాకర్మ లేక చూడా కరణము అంటారు. చూడ అంటే శిఖ. ఇది కూడా షోడశ సంస్కారాల్లో ఒకటి.

పిల్లవానికి బలము, ఆయుష్షు, వర్చస్సు వృద్ధి పొందుటకు దీనిని చేస్తారు. దీనివలన పితృకర్మయందధికారం కల్గుతుందంటారు.

పురుష శిశువుకు సరినెలల యందు, స్త్రీ శిశువుకు బేసి నెలల యందు చేస్తారు. మొదటి సంవత్సరంలోగాని లేదా మూడవ సంవత్సరంలోగాని చెయ్యాలి.

సాధారణంగా అయిదవ నెలలో గాని ఆరవనెలలోగాని కేశఖండనం జరుపుతారు. శిశువు భూమిమీద కూర్చునే వయస్సు గనుక అప్పుడు అనుకూలంగా వుంటుంది.



పుట్టినప్పటి జుట్టుని తీసివేయిస్తే మరింత చక్కని జుట్టు వస్తుంది. అది నల్లగా ఒత్తుగా ఉంటుంది.

దీనిని కూడా మంచి ముహూర్త మందు పూర్వాహ్ణము నందు జరిపిస్తారు. పుణ్యక్షేత్రాలలో చేయించడం ఆచారంగా వస్తోంది.

కేశమూలములు తండ్రి, కేశాగ్రములు తల్లి కాబట్టి చౌలంచేత ఆయుష్షు వృద్ధి అవుతుందంటారు.

కర్ణవేధ

చెవులు కుట్టించుటే కర్ణవేధ. ఇదీ ఓ సంస్కారమే.

కొన్ని రకాల శారీరక రోగాలను రానివ్వదని బాల బాలికలకు చెవులు కుట్టించడం చేస్తూంటారు.


'రోగాదుల నుండి రక్షకై, భూషణ నిమిత్తమై బాలకుని కర్ణములను కుట్టవలెను' అంటుంది సుశ్రుతము.

ప్రస్తుతం ఆడపిల్లలకు మాత్రమే తప్పనిసరిగా చేయిస్తున్నారు.

శిశువు పుట్టిన 12 లేక 16వ రోజున గాని, 6-7-8 మాసములందు గాని చేస్తారు. పగటిపూట మంచి మూహూర్తం చూసి కర్ణవేధ కంసాలి చేత చేయిస్తారు.

అలంకారములపై గల మక్కువ తీర్చడమూ ఓ కారణమే!

అక్షరాభ్యాసం



మొట్ట మొదటిసారి పిల్లలతో అక్షరాలు దిద్దించడమే అక్షరాభ్యాసం. దీనినే 'విద్యారంభం' అని కూడా అంటారు.

విద్య యొక్క విలువ తెలిసిన జాతి గనుక దీనిని కూడా వేడుకగా నిర్వహిస్తారు.

విద్య మనిషిని సంస్కరిస్తుంది. పరివర్తన కలిగిస్తుంది. విజ్ఞానవంతుడ్ని జేస్తుంది. ఉన్నతుడిగా ఎదిగిస్తుంది. అదే సమయంలో జీవికనూ కల్పిస్తుంది.

పూర్వం శిక్షణ నిమిత్తం గురువు ఆశ్రమానికి పంపేవారు. బిడ్డ బాధ్యత గురువుకప్పగించేవారు. రాముడు, కృష్ణుడు అలావెళ్ళి విద్యనభ్యసించిన వారే.

ఇప్పుడా పరంపరని కొనసాగిస్తూ గురువుని ఇంటికి పిలిపించి పిల్లల్ని అప్ప గిస్తున్నారు.



వినాయకుడ్నీ సరస్వతీదేవినీ పూజించాక గురువు బిడ్డ చేత బియ్యంలో **'ఓమ్ నమః శివాయః'** అని రాయింపించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుడతారు.

దీనికి కూడా శుభముహూర్తం చూడటం జరుగుతుంది.

కొందరు బాసర శ్రీ జ్ఞానసరస్వతీ మందిరంలో ఈ వేడుక నిర్వహిస్తూంటారు. తల్లి సరస్వతి ఆశీస్సులు పుష్కలంగా లభిస్తాయని వారి విశ్వాసం.

జన్మాష్టమి వేడుక



శ్రీకృష్ణ జన్మాష్టమికి చిన్నారి బాలబాలికలను బాల కృష్ణుడిగా రాధగా అలంకరించి ఆనందించటం ఒక వేడుక.

ఈ సందర్భంగా పట్నాల్లో బాలకృష్ణ వేషధారులకు పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.

విదేశాల్లోని భారతీయులు సైతం స్థానిక దేవాలయాల్లో జన్మాష్టమి వేడుకల్లో పిల్లల చేత ప్రదర్శన లిప్పిస్తున్నారు.

కృష్ణాష్టమి రోజున వీధి గుమ్మం బయటి నుంచి ఇంట్లోకి పిల్లల అడుగు ముద్ర ఆకారంలో ముద్ర వేస్తారు. ఆ అడుగుల్లో తమ పిల్లల చేత అడుగులు వేయించి బాలకృష్ణుడు తమ ఇంటికి వచ్చినట్టుగా భావించి మురిసిపోతారు.

దైవంతో సమానమైన పిల్లల్ని దైవరూపంలో (అలంకరణలో) చూసుకుని అపూర్వానుభూతికి లోనవడం ఈ వేడుక విశేషం.

ఓణీలు వేయించడం

యౌవనం తొంగి చూసేవేళ ఆడపిల్ల శరీరంలో ఎన్నో మార్పులొస్తాయి.

వాటి కనుగుణంగా వస్త్రాలు ధరించాల్సి వుంటుంది.

ఆ సందర్భాన్ని కూడా ఒక వేడుకలా చేస్తూంటారు. దాన్నే ఓణీలు వేయించడం లేదా పైట వేయించడం అంటారు.

సాధారణంగా ఈ కార్యక్రమాన్ని మేనమావ ఇంట జరిపిస్తారు. తల్లి పుట్టింటిని పిల్లలు మరచిపోకుండా వుండటము, మేనకోడలి ఆలనా పాలనా చూడటంలో మేనమావల పాత్రని గుర్తుచేయడమూ దీని ఉద్దేశం.

బంధుమిత్రుల్ని పిలిచి తమ స్థాయికి తగ్గట్టు ఇంట్లోనో ఫంక్షన్ హాల్ లోనో చేస్తూంటారు.

అమ్మాయి చేత మేనమావలు కొన్న కొత్త పట్టు పరికిణీ పట్టు ఓణీ ధరింపజేస్తారు. గౌరీపూజ చేశాక ప్రత్యేక ఆసనం మీద కూర్చోబెట్టి అందరిచేతా ఆశీస్సులిప్పిస్తారు.

పండ్లూ తాంబూలాలూ గిఫ్టులూ ఇస్తారు. భోజన ఏర్పాట్లు తప్పనిసరి.

ధోవతి ధారణ

ఆడపిల్లలకి పైట వేయించినట్టే మగ పిల్లలకి ధోవతి కట్టించడం కొత్తగా మొదలైన పద్ధతి.

ఇది కూడా మేనమావ ఇంట గాని మేనమావ ఆధ్వర్యంలో గాని జరిపిస్తున్నారు. కుర్చీలో కూర్చోబెట్టి ఆశీస్సులిప్పిస్తున్నారు.

ఆడసంతానం లేనివారు ఈ వేడుక చేసి ఆ లోటుని తీర్చుకుంటున్నారు.

పుష్పవతి

అమ్మాయిలో ఋతుచక్రం మొదలైనప్పుడు అంటే తొలిసారిగా బహిష్టు అయినప్పుడు వేడుకగా ఓ కార్యం నిర్వర్తించడం అనాదిగా వస్తున్న ఆచారం.



రజస్వల అయ్యిందంటే పురుష సంగమానికి శారీరకంగా సంసిద్ధమైనట్టు పూర్వపు లెఖ్ఖ.

ఆ కాలంలో బాల్య వివాహాలు చేసేవారు గనుక పుష్పవతి అయ్యిందని అత్తింటికి కబురు పంపి వారిని ఆహ్వానించి మరీ ఈ కార్యక్రమం జరిపేవారు.

ఇప్పుడలాటి అవసరం అభిప్రాయం లేకపోయినా ఫంక్షన్ చేస్తున్నారు.

సాధారణంగా 7,9,11 రోజున అయిదుగురు పేరంటాళ్ళని పిలిచి వేడుకగా చేస్తారు. రజస్వలాశుద్ధి చేయిస్తారు. మేనమామలు తెచ్చిన నూతనవస్త్రాలని స్నానాంతరం ధరింపజేస్తారు. అక్షింతలేసి ఆశీర్వదిస్తారు ముత్తైదువలూ పెద్దలూ.

బంధు మిత్రుల్ని పిలవడం, వారు బహుమతుల్విడం, తిరిగి వారికి గిఫ్టులూ తాంబూలాలూ ఇవ్వడం, విందు ఇవ్వడం –పెళ్లిలానే ఘనంగా చేస్తున్నారు.

ఇది ఫలానా వారమ్మాయి పెళ్లికెదిగిందని పదిమందికీ తెలియజేయడాని కుపయోగ పడ్తోంది. ఉత్తరోత్తరా పెళ్లి సంబంధాల అన్వేషణకు సాయపడ్తుంది.

ఉపనయనం

ఉపనయనమంటే వడుగుచేయుట. ఇది పదహారు సంస్కారాల్లో ఒకటి.

జననం మొదలు 5-6-7-8 సం.లలో గాని 9-10-11 సంవత్సరాలలోగాని ఉపనయనం జరిపించాలి.

8వ ఏట బ్రాహ్మణులకు, 11వ ఏట క్షత్రియులకు, 12వ సంవత్సరమున వైశ్యులకు ఉపనయనం విద్యుక్తధర్మమని నారదవచనం.

ఇప్పట్లో ఆ పట్టింపు తగ్గింది. వివాహానికి ముందు రోజునగాని, పెళ్లిరోజు ఉదయాన గాని ఉపనయనం జరిపించి స్నాతకవ్రతం జరుపుకొని వివాహానికి సన్నద్ధమవుతున్నారు.

మూడు పోగుల యజ్ఞోపవీతం సత్యం, తేజస్సు, పవిత్రతలకు చిహ్నం.

యజ్ఞార్థమైన ఉపవీతం గనుక దీనికి యజ్ఞోపవీత మనిపేరు.

ఉపనయనంకు శుభలగ్నం నిర్ణయిస్తారు. ఉపనయనము కానిదే బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు వివాహార్హత లభించదు.

ఎడమవైపు భుజము పై భాగం నుండి హృదయం మీదుగా ముడివున్న భాగం కుడివైపు నడుము ప్రదేశమునకు వచ్చునట్లు ధరించాలి.

యజ్ఞోపవీతాన్ని ధరించడమంటే ఒక దీక్షను స్వీకరించడమే.

వేదాధ్యయనానికి బ్రహ్మసాధనకు ప్రతిజ్ఞా చిహ్నం జందెం.

ఈ కార్యక్రమంలో భిక్షాటన కూడా ఒక భాగం. భిక్షమెత్తి అయినా సరే వేదశాస్త్ర విద్యాభ్యాసం చెయ్యాలన్న ఉద్బోధ వుంది.

జంధ్యధారణ లేని కులాల్లో సైతం పెళ్లిసమయంలో ఆచమనంచేసి పోక చెక్కని వేళ్ళతో పైకి విసిరింపజేస్తారు.

ఉపనయనం అంటే చేరదీయటం. తండ్రి తన కొడుకుని శుభసమయంలో దగ్గరకు చేరదీసి బ్రహ్మచర్యవ్రత నిర్వహణ కాలంలో చేయాల్సిన విధులనీ నియమాలనీ మంత్ర సంస్కారపూర్వకంగా ఉపదేశించడమే ఉపనయనం.

వటువు తల్లి గర్భవతిగా (6 మాసములు దాటినతర్వాత) వుండగా ఉపనయనం చేయకూడదు. అలాగే వటువు మాత, పిత, మాతామహులు, పితామహులు చనిపోయిన సంవత్సరం కూడా చేయరాదు.

ఉపనయన సంస్కారం జరిపిన నాడే వేదారంభ సంస్కారమూ చేస్తున్నారు. గాయత్రీ మంత్రం మొదలు నాలుగు వేదాల అధ్యయనానికి అవసరమైన నియమాలు నేర్పడమే వేదారంభం!

పుట్టిన రోజు



పిల్లల పుట్టిన రోజుల్ని ఇవాళరేపు అంతా ఎంతో వేడుకగా చేస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పిల్లల మీద తమకుగల ప్రేమని బహిరంగంగా వ్యక్తపరుస్తున్నారు.

ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. కాని ఇతరులకన్నా భిన్నంగా చెయ్యడంలోనే ప్రత్యేకత వుంటుంది. అభిరుచి బయటపడుతుంది.

కొందరు బర్త్‌డేలను హోటల్స్‌లో ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్నారు. అది పెద్దల వ్యవహారమవుతోంది తప్ప పిల్లల పండుగగా వుండట్లేదు.

పిల్లల బర్త్‌డేని పిల్లలు వేడుక గానే చెయ్యాలి.

పిల్లల స్నేహితుల్నీ చుట్టుప్రక్కలి వారి పిల్లల్నీ బంధుమిత్రులు పిల్లల్నీ పిలవాలి.

వారికి రంగురంగుల టోపీలూ బుడగలూ వగైరా వగైరాలిచ్చి ఆనందపర్చాలి. వారి మధ్య స్నేహబంధం పెంచాలి. అంతా ఆనందంగా ఉత్సాహంగా వుండేలా కార్యక్రమాన్ని రూపొందించాలి.

బర్త్‌డే కేక్ కట్ చేయించాలి. కాని పాశ్చాత్య పద్ధతిలో కొవ్వొత్తుల్ని వెలిగించి ఆర్పించవద్దు. దీపాలార్పడం మన సంస్కృతి కాదు. పండుగ నాడు దీపాలార్పడం

సముచితమూ కాదు. తమసోమా జ్యోతిర్గమయ అన్నారు. చీకటి నుండి వెలుగు వైపు నడవాలి.

అంచేత కేకు మధ్యలో ఒక పెద్ద కొవ్వొత్తి వుంచి దాన్ని మాత్రం వెలుగుతూనే వుండ నివ్వండి. వెలుగుల్ని వెదజల్లనివ్వండి.

అదయ్యాక పిల్లల ప్రతిభాపాటవాలు వెల్లడి చేసే కార్యక్రమం చేబట్టొచ్చు.

పాటలు పాడించండి. డాన్స్ చేయించండి. మిమిక్రీ చేయగలిగితే చేయించండి. పెయింటింగ్స్ వేస్తే వాటిని గోడలకి అలంకరించి అందరికీ చూపించండి. కప్పులు మెడల్స్ ఇతర బహుమతులూ వస్తే వాటినీ ప్రదర్శించండి.

వాటి వల్ల వచ్చే ప్రశంసలు పిల్లలకు స్ఫూర్తి దాయకమవుతాయి. మిగతా పిల్లలకు ఆదర్శమవుతాయి.

అలాగే వచ్చిన పిల్లలకు డాన్స్ లేక పాటల పోటీల్లాంటివి నిర్వహించి బహుమతులివ్వ వచ్చు.

బర్త్ డే నాడు ఇచ్చే విందుకన్నా ఇలా చేస్తే పిల్లలంతా ఎంతో ఎంజాయ్‌చేస్తారు. మీ పిల్లలకది మరపురాని అనభూతి అవుతుంది. మిగతా పిల్లలు ఆయా పిల్లల బర్త్‌డేని మరచి పోరు. పైగా ఆసక్తిగా ఎదురు చూస్తారు.

కౌమారం

బాల్యానికి తరువాతా, యౌవనానికి ముందూ ఉండే దశ కౌమారం.

మూడో ఏట నుండి పదమూడో సంవత్సరం వరకూ ఉన్న ప్రాయం.

ఈ దశలో పిల్లలకు అమ్మానాన్నల తోడిదే లోకం. బడికి వెళ్ళినా వారి మీద తల్లిదండ్రుల ఇతర కుటుంబ సభ్యుల ప్రభావమే హెచ్చు. ఉపాధ్యాయుల మాట వేదవాక్కు. తల్లి ఒడిలో గారాలుపోతూంటారింకా. ప్రతిదానికీ అమ్మ మీదే ఆధారపడతారు.

ధవళ వర్ణమంత స్వచ్ఛమైన మనస్సు గల వికసిస్తున్న పూబాలల మీద కుటుంబ ప్రభావం స్కూలు పరిసరాల ప్రభావం సంస్కృతి ప్రభావం బలంగా ఉంటుంది.

ఇప్పుడే వేరూనిన మొక్కను రెండుచేతులడ్డు పెట్టి కాపు గాయాలి. స్వాభావిక ఎరువు వెయ్యాలి. చీడపట్టకుండా చూడాలి. అప్పుడిహ ఆ మొక్క ఏపుగా పెరిగి ఫల, పుష్పభరిత వృక్షమై తీరుతుంది!

60

పిల్లల పెంపకం

తల్లి పక్షి ఎక్కడెక్కడ్నుంచో ఆహారం సేకరించి ముక్కున పట్టుకుని తెస్తుంది. గూడులో వున్న బిడ్డ నోట్లో ముక్కలుగా చేసిపెట్టి తినిపిస్తుంది. రెక్కల తడి ఆరగానే రెక్కలిప్పుకోవడం మెల్లగా ఎగరటం నేర్పుతుంది.

కోడి పిల్లల్ని వెంటేసుకుని తిరగటం, ఆహారం చూపించడం, హాని జరక్కుండా రెక్కల మాటున కాపాడటం మనం చూస్తూంటాం.

స్వశక్తితో ఆహారాన్ని సంపాదించుకునేంత వరకూ సంతానాన్ని పెంచడం పోషించడం సృష్టిలోనే వుంది.

విజ్ఞానవంతుడూ నాగరికుడూ అయిన మనిషి ఆహార సంపాదనకే కాదు సత్ప్రవర్తన, నీతి నియమాలు, సంప్రదాయం, పరోపకారగుణం వగైరాలు నేర్పాలి. విద్యనీ విజ్ఞానాన్నీ పెంపొందించాలి. వివేకాన్ని ఇవ్వాలి.

చేపల్ని వండుకు తినడమెలాగో చెబితే చాలదు చేపల్ని పట్టడమూ నేర్పాలి!

పెద్దల మాట

'రాజ వత్సంచ వర్షాణి దశ వర్షాణి దాసవత్।
ప్రాప్తేతు షోడశే వర్షే పుత్రం మిత్రవ దాచరేత్॥'

సంతానాన్ని అయిదో ఏడు వచ్చే వరకూ రాజులాగా పెంచాలి. అంటే రాజుగారి శాసనం అమలు జరిగినట్లుగా బిడ్డ ఏం కోరితే అదివ్వాలి.

ఆరో ఏట నుంచి పదహారో ఏడు వచ్చేవరకూ దాసుల్లా పెంచాలి. దాసుడు ఆజ్ఞల్ని ఎలా శిరసావహిస్తాడో, ఎంత వినయ భయ భక్తుల్తో మెలుగుతాడో, వాదాలు ఇష్టాలు జోలికి పోకుండా యజమాని మాట ఎలా పాటిస్తాడో అలాగ వాళ్ళుండాలి. అంటే సేవకుళ్ళా చూడాలి. పెంచాలి. క్రమశిక్షణ నేర్పాలి.

పదహారో ఏడు రాగానే సంతానాన్ని స్నేహితులుగా భావించడం మొదలుపెట్టాలి. ఆ వయసు నుంచి రాజుగా గౌరవించడమూ దాసుడిగా చూడటమూ తప్పే.

కేవలం మిత్రుడిగా చూడాలి. సహకరించాలి. చర్చించాలి. అభిప్రాయాలు తెలుసుకోవాలి. మంచిచెడులు విశ్లేషించి వివరించాలి. గైడెన్సు ఇవ్వాలి. వారి ఆలోచనలను గౌరవించాలి. నిర్ణయాధికారం వారికే కట్టబెట్టాలి.

బంధుగణం

బిడ్డ ఈ లోకంలోకి ఒంటరిగానే వస్తాడు.

కాని వస్తూ వస్తూనే ఎంతోమంది బంధువుల్ని పోగేసుకుంటాడు.

తల్లిదండ్రులు తాతలు మామ్మలు మావయ్యలు అత్తయ్యలు బాబాయిలు పిన్నిలు అన్నలు అక్కలు – ఎందరో!

వారందరితో బంధుత్వం వాడికి ఆయాచితంగా లభించిన వరం.

భూమ్మీద పడీపడగానే బిడ్డలో పోలికలు వెదుకుతూ వ్యాఖ్యానాలు చేసి మురిసిపోయేది వారే.

బిడ్డ క్షేమాన్ని కాంక్షిస్తూ అరచేతులడ్డుపెట్టి మరీకాపు కాసేదీ వారే

బిడ్డ సక్రమ పెరుగుదలకు ఎదుగుదలకు తగిన బాధ్యతలు తీసుకుని చక్కని శిల్పంగా చెక్కడం వారి ఉమ్మడి బాధ్యత! కర్తవ్యం!

పల్లెకుపోదాం వేళ్ళను చూదాం

పట్నవాసులు తమ పిల్లలకు పల్లెటూరిని పరిచయం చెయ్యాలి. మన 'వేళ్ళు' అక్కడే ఉన్న సంగతి వారికి తెలియజెయ్యాలి.

శలవుల్లో అమ్మమ్మ ఇంటికో నానమ్మ ఇంటికో లేక ఇతర బంధువులిళ్ళకో తీసుకెళ్ళాలి.

పచ్చని పైర్లు, తోటలు, వెన్నెల్లో ఆటలు, జానపద పాటలు, పైరగాలి పరవళ్ళు, పశువుల మీద సవారీలు, కాలువలో ఈతలు, కోతి కొమ్మచ్చి ఆటలు, బొమ్మల పెళ్లిళ్ళు – వగైరా వగైరా చూపించి కనువిందుచెయ్యాలి.

పల్లె సౌందర్యం, అక్కడి మనుషులు, వారి భాష, జీవన విధానం, రకరకాల వృత్తులు, తాగునీటి కోసం పడుతున్న పాట్లు, వారి ఇబ్బందులు, అక్కడి వారి ఆదరాభిమానాలు,

బంధుప్రీతి – అన్నీ అన్నీ చూపించాలి. వినూత్న అనుభవాల్లో అనుభూతుల్లో మునిగి తేలనివ్వాలి.

ఆ క్రొత్త ప్రపంచం వారి మనోద్వారాలను తెరుస్తుంది. ఊహలకు క్రొంగొత్త రెక్కలిస్తుంది. వారి కలల జగత్తు శోభాయమానమవుతుంది.

మట్టి వాసన తెలుస్తుంది. మంచిమమతలకు భావోద్వేగాలకు బీజం పడుతుంది!

ప్రముఖుల భాషణ

జి.డి. బిర్లా తన మనువడు ఆదిత్య బిర్లా (ప్రోక్టర్ అండ్ గాంబుల్ CEO) ఎమ్.ఐ.టిలో చదవడాని కెళ్తున్నప్పుడు చెప్పిన మాటలు ఈ నాటికీ శిరోధార్యమే.

"శాకాహారమే తిను. డ్రింకు చెయ్యొద్దు. పొగ త్రాగవద్దు. పెందలకడే నిద్రలే. గదిలోంచి బయటికెళ్ళేప్పుడు లైటు తీసెయ్యి. చక్కని అలవాట్లు అలవర్చుకో. రోజూ వాకింగుకి వెళ్ళు. కుటుంబంతో టచ్‌లో వుండు. సోమరితనం వద్దు. దుర్వ్యయం చేయవద్దు. తొందరగానే పెళ్లి చేసుకో"

ప్రముఖ వైద్యులు డాక్టర్ కాకర్ల సుబ్బారావు గారేమంటున్నారో చూడండి.

"నేను అమెరికాలో వివిధ యూనివర్శిటీల్లో పనిచేశాను. అక్కడికీ ఇక్కడికీ ప్రధాన తేడా ఒకటుంది. ఇక్కడ పిల్లల తల్లిదండ్రులు పిల్లల వ్యక్తిత్వాన్ని ఎదగనివ్వడం లేదు. ప్రతీదీ తమ కిష్టమొచ్చిన రీతిలో పిల్లల మీద రుద్దుతున్నారు. ఇది తప్పు కదా. పిల్లల వ్యక్తిత్వంలో తల దూర్చకుండా స్వేచ్ఛనిచ్చి పెంచాలి."

విద్య విజ్ఞానం

విద్య ఆవశ్యకత తెలీని వారెవరూ లేరు. మూడో ఏటనే బిడ్డని స్కూల్లో చేర్చేస్తున్నారు.

ఎంతటి పేదవారైనా సరే పిల్లలకు మంచి చదువుని తద్వారా మంచి భవిష్యత్తుని ఇవ్వాలని తాపత్రయ పడుతున్నారు.

ఇంగ్లీషు మీడియమా తెలుగు మీడియమా అని చూడొద్దు. మాతృభాషలో బోధిస్తే తేలిగ్గానూ క్షుణ్ణంగానూ అర్థమవుతుంది. ఇంగ్లీషులో బోధిస్తే మొదట కష్టమన్పించినా తర్వాత అర్థమవుతుంది. పిల్లలకు గ్రహణ శక్తి అధికం.

ప్రస్తుత గ్లోబల్ విలేజ్ నేపథ్యంలో ఇంగ్లీషు ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.

అంచేత చిన్నప్పట్నుంచీ మాతృభాష, ఇంగ్లీషు – రెండూ నేర్పించడం అవసరం.

ప్రకృతి గురించి పరిసరాల గురించి పరికరాల గురించి ఎన్నో ఎన్నెన్నో అనుమానా లొస్తూంటాయి. అవన్నీ వెంటనే ప్రశ్నలుగా గుప్పిస్తారు.


వాటిని తీసి పారేయొద్దు. వారిని చిన్న బుచ్చొద్దు.

ప్రశ్న వారి పరిశీలనకు తపనకు జిజ్ఞాసకు గీటురాయి.

వాటిని ప్రోత్సహించండి. వారి కర్థమయ్యేట్లు వివరించండి. వాటికి సంబంధించిన పుస్తకాలను కొనివ్వండి. వారి విజ్ఞాన దాహాన్ని మరింత పెంచండి!

ఆటపాటలూ ముద్దే

పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుతూనే వుండాలని కొందరు పేరెంట్స్ ఆశిస్తూంటారు.



అది సరైన దృక్పథం కాదు.

చదువుతో బాటు ఆటపాటలూ ముఖ్యమే. ఆటవిడుపూ ముఖ్యమే. వాటిల్లో రాణించడమూ అవసరమే.

గవాస్కర్, సచిన్‌టెండుల్కర్, విశ్వనాథన్ ఆనంద్, కోనేరు హంపి, సానియా మీర్జా – ఆటల ద్వారానే అంతర్జాతీయ ఖ్యాతి గడించారు.

పైగా ఆటలు ఆరోగ్యానికెంతో అవసరం. పిల్లల శరీరపు ఎదుగుదలకి, రక్తప్రసరణ బాగా జరగడానికి, నాడీమండల వ్యవస్థ చక్కగా పని చెయ్యడానికి ఉపకరిస్తాయి.

లలితకళల్ని ప్రోత్సహించండి

అనుకరించటంలో ప్రథములు పిల్లలు.

టీవీలో డాన్సులు చూసి డాన్సేస్తారు. పాటలు విని పాడతారు. నటిస్తారు. బొమ్మలేస్తారు. మట్టితో కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. సంగీత వాయిద్యాల మీద శ్రద్ధ చూపుతారు.

పిల్లల ఆసక్తినీ అభిరుచినీ గమనించి ప్రోత్సహించాలి. కావల్సినవి సమకూర్చాలి. అవసరమైన శిక్షణ ఇప్పించాలి. ఆయా రంగాల్లోని ప్రముఖుల గూర్చి చెప్పాలి. ఫోటోలు చూపించాలి. వారి వర్క్స్ పరిచయం చేయాలి.

చదువుతో బాటు లలిత కళల్లోనూ కృషి చేసేందుకు తోడ్పడాలి. వారిలోని సృజనాత్మ శక్తికి ఊపిరులూదాలి.

టైంవేస్టు పనులుంటూ నిందించడం, కూటికీ గుడ్డకీ రావంటూ హేళన చెయ్యడం మంచిదికాదు. అది పసివాళ్ళ మనసుల్ని గాయపరుస్తుంది. రెక్కల్ని కత్తిరిస్తుంది.

కళ దైవదత్తం అంటారు. అది అబ్బటం ఓ వరం.

కళ మనిషిని చైతన్యవంతుల్ని చేస్తుంది. ఊరిస్తుంది. ఉత్సాహపరుస్తుంది. క్రొంగొత్త ఊహలకు ప్రాణం పోస్తుంది. ప్రతిసృష్టి చేయిస్తుంది. ప్రశంసలిప్పించి పరమానంద భరితుల్ని చేస్తుంది!

అంతేకాదు. వారా కళల్లో రాణించి ఉన్నత స్థాయి కెదుగుతారేమో ఎవరు చెప్పగలరు?

వారిలో ఎన్టీ ఆర్, ఏయన్నార్, చిరంజీవి, రజనీకాంత్, ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం, యమ్. ఎఫ్. హుస్సేన్, బిస్మిల్లాఖాన్, చౌరాసియా, పండిట్ రవిశంకర్, శ్రీశ్రీ, నారాయణ రెడ్డి, బాపు, చంద్ర–ఎవరున్నారో ఎందరున్నారో!

సాయి దేవ హర్ష ఎనిమిది సంవత్సరాల వయస్సులో అన్నిరకాల పాటలూ పాడి ప్రముఖుల ప్రజల మెప్పులంది ఓ టీవీ ఛానల్ నిర్వహించిన పోటీలో 'లిటిల్ ఛాంపియన్'గా ఎన్నికయ్యాడు!

ట్యూషన్లు వద్దు

తల్లిదండ్రులు తమ తమ వ్యాపకాలలో బిజీగా వుండి చదివించడానికీ హోంవర్కు చేయించడానికీ ట్యూషన్లు పెట్టిస్తారు.

అది మంచి పద్ధతి కాదు.

తల్లి లేక తండ్రి రోజుకో గంటసేపు తీరిక చేసుకుని పిల్లల చదువుని పర్యవేక్షించాలి. వారికర్థం కానిది వివరించాలి. రోజు వారీ హోంవర్కుని పూర్తి చేయించాలి.

ఆ పనిని ట్యూటర్‌కి అప్పగిస్తే మెకానికల్‌గా చెప్పుకు పోయి చేతులు దులిపేసు కుంటారు. ఎక్కువ మంది విద్యార్థులుంటారు గనుక ప్రత్యేక శ్రద్ధ చూపనూ లేరు.

తమ పిల్లలకోసం ప్రత్యేకంగా ట్యూటర్ని నియమించినా 'పాఠం' 'వర్కు' పూర్తిచేయిస్తారు తప్ప విద్యార్థి ప్రతిభని పెంచలేరు. ఆసక్తిని భయం మ్రింగేస్తుంది.

పిల్లల తెలివితేటల్ని గుర్తించడానికీ లోటు పాట్లు సరిచెయ్యడానికీ తీర్చిదిద్దటానికీ తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు ఆ బాధ్యతని స్వీకరించాలి. అప్పుడే వారి ప్రతిభ వికసిస్తుంది. చక్కని ఫలితాలు లభిస్తాయి.

పిల్లల గది

పిల్లలకోసం ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించ గలిగితే మంచిది.

ఆహ్లాదకరమైన రంగుల్తో చక్కని ప్రకృతి చిత్రాలతో రకరకాల బొమ్మల్తో ఫొటోల్తో అలంకరించాలి. పిల్లలకవసరమైనవన్నీ ఒక పద్ధతిలో అందుబాటులో అమర్చాలి.

వారెంతో ఆనందంగా గడపడానికి ఇండోర్ గేమ్స్ ఆడుకోడానికి కొండొకచో డాన్సులు చేసుకోడానికి ఆ గదిని వారికిచ్చేయాలి.

తీసినవన్నీ మళ్ళీ యథాస్థానంలో వుంచడం క్రమపద్ధతిలో సర్దుకోవడం అలవాటు చెయ్యాలి.

పిల్లలకు అన్ని విధాలా స్ఫూర్తిదాయకంగా వుండేలా ఆ గదిని అలంకరించాలి!

సంస్కృతిసంప్రదాయాలు

పిల్లలకు మన సంస్కృతినీ సంప్రదాయాల్నీ పరిచయం చెయ్యాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

రెండు చేతులు జోడించి దణ్ణం పెట్టడం, సాష్టాంగ నమస్కారం చెయ్యడం, బొట్టుపెట్టుకోవడం, తలస్నానం చేసి పూజచెయ్యడం–వగైరాలన్నీ ప్రతివారూ తల్లి ద్వారానే తెలుసుకుంటారు. తెలుసుకోవాలి. సంస్కృతి పరిరక్షకులు స్త్రీలే.

పెద్దల పట్ల చూపాల్సిన గౌరవమర్యాదలు, వినయ సంభాషణ, అణుకువ, దైవభక్తి–తండ్రి నేర్పాలి.

రామాయణ మహాభారత గాథల్ని చిన్నప్పట్నుంచే పిల్లలకు బోధించాలి. అవి వారి ఆలోచనల్ని ఊహల్ని విస్తృత పరచడమే గాక అనేక ఆదర్శాలను చూడగలుగుతారు. వాటి ప్రభావం పిల్లల మీద చాలా వుంటుంది. అవి కేవలం కథలు కాదు. మనిషి జీవితం జీవనం ఎలా తీర్చిదిద్దుకోవాలో చెప్పే పంచమవేదాలు!

ఇక ఇంట్లో చేసే పూజలు వ్రతాలు, ధార్మిక చర్చలు, పండగలు, వృద్ధుల బోధనలు, ప్రశాంత వాతావరణం– పిల్లలపై అధిక ప్రభావం చూపిస్తాయి. అంచేత అవన్నీ సక్రమంగా ఆదర్శప్రాయంగా వుండేలా జాగ్రత్త అవసరం.

పోటీ అవసరమే

పిల్లలు చదువుల్లో ఆటల్లో పాటల్లో మిగతా పిల్లల్తో పోటీ పడాల్సిందే.

'స్పర్థయా వర్ధతే విద్య' అన్నారు

మంచి ర్యాంక్ తెచ్చుకోడానికి మరింతగా కృషి చెయ్యాల్సిందే. అందుకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిందే.

ఇది పోటీ ప్రపంచం. అత్యంత ప్రతిభ, నైపుణ్యం, లక్ష్యశుద్ధి గలవారే విజయులవుతారు.

విలువిద్య నేర్చుకునేప్పుడు అర్జునుడు ప్రదర్శించిన గురి, గురువు లేకుండానే స్వయం కృషితో రాణించిన ఏకలవ్యుడి దీక్ష పిల్లలకు ఉండాలి.

అలా అని చెప్పి తోటి విద్యార్థుల్ని శత్రువులుగా చూడకూడదు. వారితో స్నేహంగానే వుండాలి. కాని వారి తెలివి తేటల్తో పోటీ పడాలి. చదువు విద్వేషాన్నీ అసూయనీ రగల్చకూడదు. ఈ విషయం మీద తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

ఆహార విహారాలు

తల్లిదండ్రులు పిల్లల కోసం తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించాలి. చదువు సంధ్యలు పర్యవేక్షించడానికే కాదు వారిలో ప్రేమభావాన్ని పెంచేందుకూ బంధం బలపడేలా చేసేందుకూ కావాలి.

పిల్లలతో కబుర్లు చెప్పాలి. స్కూలు విశేషాలు తెలుసుకోవాలి. కలిసి భోంచెయ్యాలి. ఇష్టాయిష్టాలూ అభిరుచులూ తెలుసుకోవాలి. చక్కని అలవాట్లు నేర్పాలి.

సినిమాలకీ షికార్లకీ శుభకార్యాలకీ బంధువుల ఇళ్ళకీ తీసుకెళ్ళాలి.

వారి అవగాహనా పరిధి విస్తృతమవడానికి అవకాశాలు కల్పించాలి.

బంధుప్రేమ, కుటుంబ నేపథ్యం, అనురాగాలు, ఆప్యాయతలు, ధర్మాలు, పూర్వుల మంచి చెడ్డలు – అన్నీ అవగతమయ్యేట్లు చూడాలి.

అప్పుడే పిల్లలు తల్లిదండ్రుల ఆశలకు తగ్గట్టు పరమానందం చవిచూసే స్థాయికి ఎదగ గలుగుతారు!

జాతిపితే కాని...

గాంధీజీ జాతి పితే. కాని ఉత్తమ తండ్రి కాలేకపోయారు.

తన పిల్లలకు చక్కని విద్య చెప్పించలేకపోయారు. పెళ్లి చేసుకుంటానన్నందుకు పెద్ద కొడుకు హరిలాల్‌ని వదిలేశారు. పెద్దన్నకు డబ్బిచ్చాడని చిన్నకొడుకును వదిలేశారు.

హరిలాల్ తండ్రి మీది కోపంతో పత్రికల కెక్కాడు. తండ్రిని విమర్శించాడు. ఇస్లాం మతం స్వీకరించాడు. వ్యభిచారి త్రాగుబోతు అయి 1948లో మరణించాడు.

'మనుషులు మంచి వాళ్ళైనంత మాత్రాన వారి పిల్లలు అలా అవ్వాలని లేదు' అంటారు గాంధీజీ.

ఆ తండ్రీ కొడుకుల మధ్య ఏర్పడిన కమ్యూనికేషన్ గేప్, అహం, మూర్ఖపు పట్టుదల, పిల్లల మీద శ్రద్ధ పెట్టలేకపోవడం, పిల్లలకు సరైన గైడెన్స్ లభించకపోవడం – వీటన్నిటికి తోడు ఎటూ చెప్పలేని స్థితిలో ఉండిపోయిన తల్లి పాత్ర – అవన్నీ ఒక్కసారి ఆలోచించడం తర్కించుకోవడం ఈనాటి ప్రతి తల్లికీ తండ్రికీ అత్యవసరం!

మార్పు సహజం

తరాలు మారే కొద్దీ పిల్లల్లో మార్పు సహజమే. కాలానుగుణమైన మార్పుల్ని అర్థం చేసుకోవాలి. 'మా చిన్నప్పుడు ఇలా ఉండే వాళ్ళం కాదు' అనుకోవడం సరికాదు. మీ బాల్యంలోని పరిస్థితులకీ నేటి పరిస్థితులకీ పొంతనే లేదు.

వారి అభిరుచులకూ మీ అభిప్రాయలకూ బోల్డంత తేడా ఉంటుంది.

ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతితో వారిమీద ప్రపంచ ధోరణుల ప్రభావం అత్యధికంగా ఉంటోంది.

సంగీతం పెద్ద వాల్యూం పెట్టుకుని వినడం, డాన్సులు చెయ్యడం, రకరకాల ఫాషన్ దుస్తులు ధరించడం, బేకరీలకీ ఐస్‌క్రీం పార్లర్లకీ వెళ్ళడం, సినిమాలకీ న్యూ ఇయర్ ఫంక్షన్లకీ వెళ్ళడం, ఫ్రెండ్స్ డే అంటూ ఖరీదైన గిఫ్టు లివ్వడం – ఇలా ఎన్నో చేస్తూంటారు.

వారి స్థితినీ వారి మీది ప్రభావవాలనీ అర్థం చేసుకోవాలి. వారి ట్రెండ్‌నీ ఆలోచనా ధోరణినీ పట్టుకోడానికి ప్రయత్నించాలి.

ప్రీచింగ్స్ వారికి నచ్చట్లేదు. తమదైన శైలితో ప్రవర్తించాలని చూస్తున్నారు. స్వేచ్ఛగా ఎదగాలనుకుంటున్నారు. అమ్మ కూచిలా నాన్నకు కార్బన్ కాపీలా ఉండాలనుకోవట్లేదు. ఏదైనా చేయగలనను కొంటున్నారు. అదీ – టీన్స్ సైకాలజీ !

వారిలో వస్తోన్న ఆ మార్పుల్ని గ్రహించాలి అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. సరైన బాటలో నడవడానికి సహకరించాలి.

పిల్లలను కళ్ళు మూసుకుని తిట్టడం విమర్శించడం గాక సహృదయంతో ప్రవర్తించాలి. పెడ ధోరణలు కన్పిస్తే మాత్రం కఠినంగా మారాలి. లేకపోతే లెట్‌దెమ్ ఎంజాయ్!

తండ్రికి/తల్లికి కొడుకు/కూతురు గా ఉండటం చాలా తేలిక. కొడుకు/కూతురికి తండ్రిగా/తల్లిగా ఉండటం చాలా చాలా కష్టం. ఈ సత్యాన్నెన్నడూ మరువరాదు!



61

పిల్లల చదువుసంధ్యలు



'మొన్న మొన్న మన వాకట్లో జుట్టు విరబోసుకుని గొట్టికాయ లాడిన నేమాని వారి కుఱ్ఱాడు మునసబు అయిపోయాడు' అని 'కన్యాశుల్కం'లో వెంకమ్మ ఆశ్చర్యబోతుంది.

కాలంలాగే వయసూ మారుతూ పెరుగుతూంటుంది.

పిల్లలు చకచకా బాల్యాన్ని దాటి యౌవనంలోకి అడుగుపెట్టేస్తారు.

వారికి విద్యాబుద్ధులు నేర్పితే చాలదు సరైన 'ట్రాక్' మీదకి ఎక్కించి అటు జీవితంలో ఇటు కెరీర్లో ఉన్నత స్థాయి చేరుకునేందుకు తల్లిదండ్రులే కృషి చెయ్యాలి.

ఫలానావారి సంతానమని పదిమందీ మెచ్చుకునేలా తీర్చిదిద్దాలి!

తరగని ఆస్తి

సంతానానికి వారసత్వంగా ఇళ్ళు, భూములు, బంగారం, షేర్లు, బాండ్లు ఇవ్వాలని చూస్తారంతా.

వాటికన్నా విలువైన వారసత్వ సంపద – వ్యకిత్త్వం, సంస్కారం, విద్య, విజ్ఞానం, సంస్కృతి.

పిల్లలకు భౌతిక ఆస్తులివ్వకపోయినా ఫర్లేదుగాని చక్కని వ్యక్తిత్వం అలవర్చాలి. ఉత్తమ విద్య ఇవ్వాలి. ఉన్నత సంస్కారం కలిగించాలి. ఇవి ఉంటే చాలు ఆస్తులూ అంతస్తులూ అవే నడచివస్తాయి పిల్లల కాళ్ళ దగ్గరకు!

తల్లిదండ్రులు తమ తమ ఆర్థిక స్థితిగతులు అనుకూలించక పోయినా సరే వారి అవసరాలను తగ్గించుకునో అలవాట్లు మార్చుకునో అధికశ్రమపడో సుఖాలు త్యాగం చేసో – పిల్లల్ని మాత్రం విద్యావంతుల్ని చెయ్యాలి.

ఉన్నత చదువులు చెప్పించే స్తోమతు లేదని దిగాలు పడవద్దు. కనీసం హైస్కూలు చదువు పూర్తి చేయించ గలిగితే చాలు. వారు ఫుల్ టైం లేదా పార్ట్ టైం జాబ్ చేస్తూనే చదువుకోగలరు. దూర విద్య ద్వారా డిగ్రీలూ పీజీలూ చేసి అగ్రస్థాయికి ఎదగ గల అవకాశాలు నేడు పుష్కలంగా ఉన్నాయి.

మీరు చేయాల్సిందల్లా మొక్కని వేరూన నివ్వండి. రెండు చేతుల్తో కాపు కాయండి చాలు.

ఆ తర్వాత ఆ చిన్ని మొక్కే మ్రానవుతుంది. నీడనీ పండ్లనీ ఇస్తుంది!

మాంటిస్సోరీ విద్య

పిల్లల్ని మొదట నర్సరీలో చేర్చేప్పుడు అది మాంటిస్సోరీ తరహా విద్యావిధానాన్ని అమలు చేస్తున్న స్కూలు అయ్యేట్లు చూడాలి.

ఆ పద్ధతిలో లెక్కలు, సైన్సు వంటి వాటిని బొమ్మల్తో ఆటపాటల్తో నేర్పుతారు. ఆసక్తి కలిగిస్తూ అలరిస్తూ బోధిస్తారు.

చైనాలో పుట్టిన ABACUS కూడా ఇప్పుడు స్కూళ్ళలో ప్రవేశపెట్టారు. ఇది నాలుగు నుండి పన్నెండేళ్ళలోపు పిల్లల్లో అర్థమెటిక్ స్కిల్సు పెంచుతుంది. కూడిక తీసివేతల్లాంటివి వేగంగా కరక్టుగా పెన్నూ కాగితం అక్కర్లేకుండానే చేసేలా నేర్పుతాయి. కాలక్యులేటర్ కన్నా వేగంగా చెయ్యగలరంటే అతిశయోక్తికాదు.

జ్ఞాపకశక్తి పెంచే 'మేపింగ్'లాంటివి ఏకాగ్రతనీ ఊహాశక్తినీ వృద్ధి చేస్తాయి.

వేదిక్ మేథమెటిక్స్ పిల్లలకు మహా అద్భుత వరమని చెప్పాలి.

ఇవన్నీ నేర్పే ప్రైమరీ స్కూల్లో లేదా ప్లే స్కూల్లో మీ పిల్లల్ని చేర్చండి.

విద్యాలయ ఎన్నిక

హైస్కూలు స్థాయిలోనే గణితం, సైన్సు వగైరాల కాన్సెప్ట్ బోధించడం జరుగుతుంది. వాటి బేసిక్స్ - పునాదులు క్షుణ్ణంగా నేర్చుకుంటేనే తర్వాత్తర్వాత వాటి మీద చక్కని భవంతి నిర్మించుకోగల్గుతారు.

అంచేత చక్కని విద్యాసంస్థని ఎన్నిక చెయ్యడం అతి ముఖ్యం.

అధిక ఫీజులు వసూలు చేస్తోందని చెప్పి అది గొప్ప స్కూలు అనుకోవద్దు. స్థానిక స్కూలైనా ఇంటర్నేషనల్ స్కూలైనా వసతుల్లో పైపై ఆడంబరాల్లో తేడా ఉంటోంది తప్ప బోధించేది ఒక్కటే.

చాలా స్కూళ్ళలో అనుభవంలేని టీచర్లతో చెప్పిస్తారు. గుడ్డిగా భట్టీ పట్టిస్తారు. ఒత్తిడికి గురిచేస్తారు. బోల్డంత హోంవర్కు ఇస్తారు. మార్కుల సాధనే ముఖ్యమన్న భ్రాంతిలో పడేసి పరుగులు పెట్టిస్తారు.

అలాటి స్కూలుని ఎన్నుకోవద్దు. మీరెన్నుకున్న స్కూల్లో క్లాసుకి 25-30 మించి విద్యార్థులుండకూడదు. అనుభవమూ అర్హత గల ఉపాధ్యాయులుండాలి. పాఠాలు అర్థమయ్యేలా విశ్లేషణాత్మకంగా చెప్పాలి. విషయ పరిజ్ఞానాన్ని కలిగించాలి. పిల్లలు తమంత తాము సమస్యల్ని ఛేదించగలిగేలా తీర్చిదిద్దాలి.

అదే సమయంలో సృజనాత్మకత పెంచాలి. ఇంకా ఇంకా నేర్చుకోవాలి తెలుసుకోవాలన్న తపన రగిలించాలి.

ఆధునిక బోధనా సౌకర్యాలుండాలి. పిల్లల పరిపూర్ణ వికాసానికి తోడ్పడాలి.

చదువుతోబాటు ఆటలు, పాటలు, వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాస రచన, యోగ లాంటివి ప్రోత్సహించాలి. నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి.

అలాంటి ఆల్‌రౌండ్ డెవలప్‌మెంటుకి అవకాశమున్న స్కూల్లోనే చేర్పించాలి.

ఉత్తమ గురువులు

చాలా స్కూళ్ళలో ఇంటర్ ఫెయిలైన వారు కూడా గురువు అవతార మెత్తేస్తున్నారు. తక్కువ జీతాలిస్తారు గనుక అలాటి వారి తోనే ఎక్కువ స్కూళ్ళు నడిపేస్తున్నారు.

గురువంటే ఒక మహత్తరమూర్తి. గురుతర బాధ్యత గల శక్తి.

గురువు పిల్లల సైకాలజీని అర్థం చేసుకోవాలి. వారిలో దాగున్న ప్రతిభను వెలికితీయాలి. సానబెట్టాలి. ప్రోత్సహించాలి.

టాపిక్‌ని సంగ్రహంగా గాక సమగ్రంగా బోధించాలి. ప్రాక్టికల్ అప్లికేషన్స్‌తో చెప్పాలి. విషయలోతుల్లోకి వెళ్ళాలి. మెళుకువలు నేర్పాలి.

విసుక్కోవడం, కసరడం, కొట్టడం, 'నీ ముఖానికిది చాల్లే' అని ఈసడించడం చెయ్యకూడదు. నిరుత్సాహ పరచకూడదు.

ఆత్మవిశ్వాసంతో పిల్లలు లక్ష్యంవైపు అడుగులేసేలా చెయ్యగల సత్తా సామర్థ్యం ఉండాలి.

ఆత్మీయంగా బోధిస్తూ అభయమిస్తూ భవిష్యత్తు నీదేనంటూ ఉత్సాహపరిచేవారే అసలైన గురువులు.

అలాంటి గురువులు స్కూల్లో కనీసం ఇద్దరైనా ఉన్నారో లేదో తెలుసుకోవడం అవసరం.

ఈతరం విద్యార్థులు చాలామంది శ్రీ చుక్కా రామయ్యగారిని 'గురుబ్రహ్మ'గా భావిస్తున్న సంగతి ఈ సందర్భంగా గమనార్హం!

పిల్లలు చదవాల్సిన తీరు

పిల్లలు సిలబస్ కనుగుణంగా టెక్స్ట్‌బుక్‌ని బాగా అధ్యయనం చెయ్యాలి.

అంతటితో ఆగక టాపిక్ సంబంధిత రిఫరెన్స్ పుస్తకాలని తిరగెయ్యాలి. హారిజాంటల్ గ్రోత్ అతి ముఖ్యం అంటారు చుక్కా రామయ్యగారు.

ఏ రోజు చెప్పిన పాఠాన్ని ఆ రోజు క్రమం తప్పకుండా చదవాలి.

చదువుకోడానికి, హోం వర్కు చెయ్యడానికి, ఆడుకోడానికి, టీవీ చూడటం లేదా వీడియో గేమ్స్ ఆడుకోడానికి నిర్ణీత వేళలు కేటాయించు కోవాలి. ఇందుకు తల్లిదండ్రులు తోడ్పడాలి.

ఏదైనా విషయం అర్థం గాకపోతే క్లాసులో టీచర్ని అడిగి వివరణ పొందటం మంచి పద్ధతి. లేదా మిత్రుల్తో చర్చించాలి. అప్పుడూ తృప్తి కలగకపోతే తల్లిదండ్రుల్నో అన్న అక్కల్నో అడిగి సందేహనివృత్తి చేసుకోవాలి.

ప్రతీదీ అర్థం చేసుకుంటూనే ముందుకు సాగాలి తప్ప భట్టీయే బెటర్ అనుకోకూడదు. మార్కుల కన్నా విషయపరిజ్ఞానం ముఖ్యమన్నది గుర్తుంచుకోవాలి.

జవాబులు రాసే పద్ధతి చక్కగా ఉండాలి. ఉదాహరణలతో వివరణాత్మకంగా ఇవ్వాలి.

ఆటల్నీ కళల్నీ వినోదాన్నీ అశ్రద్ధ చెయ్యకూడదు. అలాగని అవే లోకంగానూ ఉండకూడదు.

ఉన్నత విద్యకు, ఫలానా కావాలన్న లక్ష్యానికి, ఫలానా రంగంలో కెరీర్‌కు తగిన విధంగా అంచనాలు వేసుకోవాలి. దాని కనుగుణంగా ఆచరణాత్మక ప్రణాళిక తయారు చేసుకోవాలి.

ఇందుకు తల్లిదండ్రుల సహకారం, మార్గదర్శకత్వం తీసుకోవాలి.

పిల్లలు జ్ఞాపకశక్తి పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి. స్వయం కృషిని విశ్వసించాలి. చక్కని నడవడిక, వ్యక్తిత్వం అలవర్చుకుంటే మీరెన్నుకున్న రంగంలో విజయం మీదే!

తల్లితండ్రుల పాత్ర

పిల్లలకు చదువు సంధ్యలు చెప్పించడంలో తల్లిదండ్రుల పాత్ర అమోఘమైంది. నిజానికి తల్లిదండ్రులే ప్రథమ గురువులు.

మంచి స్కూల్లో చేర్పిస్తే చాలదు. పిల్లలెలా చదువుతున్నారో పర్యవేక్షిస్తూండాలి. అనుమాన నివృత్తికి హోంవర్కు పూర్తి చెయ్యడానికి తోడ్పడాలి.

స్కూలు సమావేశాలకీ వార్షికోత్సవాలకీ పేరెంట్స్ మీటింగులకీ స్పోర్ట్స్ మీట్‌లకి తప్పని సరిగా వెళ్ళాలి. మీ పిల్లల మంచి చెడులు లోటుపాట్లు తెలుసుకుని సరిదిద్దటానికి కృషి చెయ్యాలి.

ఉపాధ్యాయులతో చర్చించి వారి గైడెన్స్ తీసుకుంటూ వుండాలి. పిల్లలు స్కూల్లో ఎత్తి చూపలేని లోటుపాట్లని మీరు టీచర్ల తోనూ ప్రిన్సిపాల్‌తోనూ చెప్పి తగిన చర్య తీసుకునేట్టు చూడాలి.

గ్రూపులు కోర్సులు ఎన్నుకునేప్పుడు అధిక శ్రద్ధ తీసుకోవాలి.

మీ కోరికల్నీ ఆశల్నీ పిల్లల మీద రుద్ద వద్దు. అధిక సంపాదన గల ప్రొఫెషనల్ కోర్సుల్నే ఎన్నుకోమని ఒత్తిడి తేవద్దు.

కొందరు తండ్రులు తమ కుమారుడ్ని తమకు 'మారుడు'గా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తారు. అది చాలా తప్పు.

పిల్లల అభిప్రాయాలు తెలుసుకోవాలి. ఆసక్తులు గమనించాలి. వారికే కోర్సు సరిపోతుందో చూడాలి. అవసరమైతే ఉపాధ్యాయుల్నీ స్నేహితుల్నీ ఆయా రంగాల్లోని నిష్ణాతుల్నీ సంప్రదించ వచ్చు.

కొందరు పిల్లలు తమ స్నేహితులు చేరుతున్నారు గనుక తామూ అందులో చేరతామని పట్టుబడతారు. అది సరిపోతుందని మీరు భావిస్తే సరే, లేకపోతే అదెందుకు సరిపోదో వివరించాలి. చర్చించి సరైన నిర్ణయం తీసుకునేందుకు పురిగొల్పాలి.

తుది నిర్ణయం తీసుకునే ముందు మీ ఆర్థిక పరిస్థితినీ సమీక్షించుకోవాలి.

పిల్లలు ఏ కోర్సులో చేరినా ఏ రంగంలో ప్రవేశించినా అందులో రాణించాలి. విజేత కావాలి.

అందుకు తగిన సాధన సంపత్తి సమకూర్చాల్సింది తల్లి దండ్రులే.

తల్లిదండ్రులు ధనుస్సు అయితే పిల్లలు బాణాలు!

హాస్టల్ చదువులు

హైస్కూలు చదువు పూర్తయ్యే వరకూ ఇంట్లోనే ఉంచుకుని చదివించడం ఉత్తమం.

కొందరు చిన్నప్పుడే పిల్లల్ని రెసిడెన్షియల్ స్కూళ్ళలో వేసేస్తూంటారు. తమకి తీరిక, ఓపిక లేవు గనుక స్కూలు వారైతే అన్నీ చూసుకుంటారనీ శ్రద్ధగా చదివిస్తారనీ భావిస్తారు.

అలాటి వారు ఒక్క సంగతి గుర్తు పెట్టుకోవాలి.

తల్లిదండ్రులిద్దరూ గాని కనీసం ఒకరైనా గాని కొంత తీరిక చేసుకోగలిగితే చాలు పిల్లలు చక్కగా చదువుతారు. చనువుంటుంది గనుక ప్రతి అనుమానం వ్యక్తపరుస్తారు. ప్రశ్నిస్తారు. ఉత్సాహపడతారు. మంచి అలవాట్లు నేర్చుకుంటారు. మీ ప్రేమాభిమానాలతో ఉత్తములుగా తయారవుతారు.

స్కూల్లో వ్యక్తం చెయ్యలేనివి మీతో చెప్పుకుంటారు. తమ ఘనతలూ ఘనకార్యాలూ మీతో పంచుకుంటారు. తెలీనివి తెలుసుకుంటారు. ఉత్తేజితులవుతారు.

ఒంటరితనం, అభద్రత ఫీలవురు. మీతో అనుబంధమూ పెరుగుతుంది.

అదే హాస్టల్లో చేర్చినట్టయితే పరిస్థితి విభిన్నంగా ఉంటుంది

ఎందరో పిల్లలుంటారు. ఎన్నో మనస్తత్వాల వాళ్ళు, విభిన్న నేపథ్యాల వాళ్ళు ఉంటారు.

వారందర్నీ ఒకే గాట కట్టి మూకుమ్మడిగా చూస్తారు తప్ప వ్యక్తిగత శ్రద్ధ సాధ్యం కాదు. ప్రత్యేక శ్రద్ధ అసలే ఉండదు.

పిల్లలు ఒంటరితనంతో బాధపడతారు. బెంగపెట్టుకుంటారు. లోలోన దిగులు పడతారు.

ఒక్కోసారి ఆసక్తి కోల్పోవచ్చు. డిప్రెషన్‌కు లోనవ్వొచ్చు. అభద్రతా భావం పెరిగి ఇంట్రావర్ట్‌గా మారవచ్చు. కలిసి ఉండలేని తత్వం అలవడొచ్చు. వ్యసనాల బారిన పడొచ్చు.

ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరేప్పటికి వారి అవగాహన, సర్కిల్, ప్రపంచం విశాలమవుతాయి. మెచ్యూరిటీ వస్తుంది. అప్పుడు వారు రెక్కలు విప్పి పక్షిలా వినువీథుల్లో విహరించాలని ఉవ్విళ్ళూరతారు.

అప్పుడు ఇంటి కన్నా హాస్టల్ బెస్ట్ కావచ్చు కాని చిన్న వయస్సులో మాత్రం కాదు!

విద్యాఋణాలు

ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబిఏ, ఎంసిఏ, నర్సింగ్, ఫిజియోథెరఫి, బీఫార్మాసీ మొదలైన ఉన్నత విద్యలు అభ్యసించడానికి ఖర్చు ఎక్కువవుతుంది. విదేశాల్లో చదివించాలనుకుంటే మరింత ఎక్కువ డబ్బు అవసరమవుతుంది.

పిల్లలు మెరిట్ స్టూడెంట్స్ అయినప్పుడు ఆర్థిక సామర్థ్యం లేనంతమాత్రాన చదువు ఆపాల్సిన పని లేదు. అలాటి వారికి దాదాపు అన్ని బ్యాంకులూ విద్యాఋణాలిస్తున్నాయి.

నాలుగన్నర లక్షల ఋణం వరకూ ఎలాంటి ఆస్తినీ హామీ ఇవ్వాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులు వ్యక్తిగత పూచీ ఇస్తే చాలు. కాలేజీ ఫీజు, హాస్టల్ ఖర్చు, పుస్తకాల ఖరీదుల్లో 80-90 శాతం ఋణంగా ఇస్తారు.

చదువు పూర్తైన ఆరు నెలల తర్వాత ఆ ఋణాన్ని సుమారు 60 నెలసరి వాయిదాల్లో తీర్చాల్సి ఉంటుంది. విద్యార్థి తన జీతం ద్వారా తీర్చినట్లయితే ఇన్‌కమ్ టాక్స్‌లో కొంత మినహాయింపు లభిస్తుంది.

కొన్ని సమయాల్లో మాత్రం ఋణం మీది వడ్డీని నెలనెలా చెల్లించాలని కొన్ని బ్యాంకులు షరతు విధిస్తున్నాయి.

చదువు లక్ష్యం

విద్యార్జన ఒక దీక్ష. ఒక తపస్సు.

మనశ్శరీరాలను కేంద్రీకరించి ఆర్జించాల్సిన సంపద.

ఎవరూ దొంగిలించలేనిదీ సర్వత్రా గౌరవం లభింపజేసేదీ విద్యే.

'శీల నిర్మాణం గావించి మనిషిని ఉన్నత స్థితికి తీసుకువెళ్ళేదే నిజమైన విద్య' అన్న వివేకానందుడి వాక్కులు సదాస్మరణీయం.

క్రమ శిక్షణతో ప్రణాళికా బద్ధంగా చదివితే ఉన్నత విద్యా లక్ష్యాన్నేకాదు చక్కని కెరీర్‌నీ ఏర్పరచుకోవచ్చు.

'క్యాచ్ దెమ్ యంగ్' అంటూ ఉద్యోగ యజమానులు కాలేజీలకు వచ్చి క్యాంపస్ సెలక్షన్స్ చేస్తున్నారు. అధిక జీతాలని ఆఫర్ చేస్తున్నారు. మెరిట్ అయితే చాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే చాలు, ఛాలెంజింగ్స్‌ని ఎదుర్కోగల సత్తా ఉంటే చాలు, లీడర్‌షిప్ క్వాలిటీస్ ఉంటే చాలు వారి పంట పండినట్టే.

మీ కలల్ని సాకారం చెయ్యగలశక్తి, వారి ఆశల్ని పండించుకోగల యుక్తి విద్యలోనే విజ్ఞానంలోనే ఉన్నాయి.

సంపూర్ణ వ్యక్తిత్వవికాసం గలవారే ఎన్నుకున్న రంగంలో ఉజ్వలంగా ప్రకాశిస్తారు.

మహోన్నత వ్యక్తిత్వంతో ఆత్మ విశ్వాసంతో శక్తి సామర్థ్యాలతో సంపూర్ణులుగా ఎదుగుతారు. జీవిత నౌకను సైతం స్వతంత్రంగా సాఫీగా నడుపుకుపోగల్గుతారు.

మీకు పుత్రోత్సాహాన్ని కలిగిస్తారు. యశస్సునూ తెచ్చిపెడతారు.

62

తల్లిదండ్రుల బాధ్యత

అమృతం త్రాగిన వాళ్ళు దేవతలు. అమృతాన్ని కన్నబిడ్డలకు పంచేవాళ్ళు తల్లిదండ్రులు.

ప్రేమామృతాన్ని పంచివ్వడమే కాదు పిల్లల్ని తీర్చిదిద్దేదీ వారే.

పిల్లల విజయంలోగాని వైఫల్యంలోగాని సగం బాధ్యత తల్లిదండ్రులదే.

పిల్లలు చక్కని శిలలాంటివాళ్ళు. దాన్ని చెక్కి మలచి అందమైన శిల్పంగా రూపొందించాల్సిన కర్తవ్యం తల్లిదండ్రుల మీదే ఉంది.

అమ్మే తొలిఫ్రెండ్

పిల్లలకు తల్లితో ఎక్కువ చనువు వుంటుంది. ఆమెకి ఎన్ని పనులున్నా సరే మొదట వారి ఆలనా పాలనా చూస్తుంది.

వారు చెప్పే స్కూలు విశేషాలు శ్రద్ధగా వింటుంది. ప్రశంసిస్తుంది. వారి చదువునీ లలిత కళాభిలాషనీ ప్రోత్సహిస్తుంది. వారి చిరు విజయాల్ని బంధుమిత్రులకి ఘనకార్యాలుగా వర్ణించి చెబుతుంది.

అంతటితో ఆగితే చాలదు.

అమ్మ పిల్లలకు మంచి బుద్ధులు అలవాట్లు నేర్పాలి. తప్పుల్నీ లోపాల్నీ నొప్పించకుండా చెప్పాలి. అదే సమయంలో 'తోటకూరనాడే...' సామెతనీ మర్చిపోకూడదు.

పురాణ కథలూ నీతి కథలూ చెప్పాలి. పూజా పునస్కారాలు నేర్పాలి. సంస్కృతీ విశేషాలు వివరించాలి. దైవభక్తి నేర్పాలి. ఇవన్నీ వారి మీదెంతో ప్రభావం చూపిస్తాయని గుర్తుంచుకోవాలి.

చదువు ఆటలు పాటలు స్నేహాలు – ఒక పద్ధతిలో సాగేందుకు కృషి చెయ్యాలి. అతిగారాబం చెయ్యొద్దు – అవసరమైతే చెవి మెలెయ్యడానికి వెనుకాడకూడదు.

పిల్లలతో ప్రేమగా స్నేహంగా ఉంటూనే చక్కని నడవడిక నేర్పాల్సిన బాధ్యత తల్లిదే.

తండ్రే రోల్ మోడల్

ఆడ పిల్లలకు గాని మగ పిల్లలకు గాని తండ్రే మొదటి ఆదర్శ వ్యక్తి.

అతడి వ్యవహారశైలి, తల్లితో ప్రవర్తన, సమాజంలోని గుర్తింపు, ఉద్యోగం లేక వ్యాపారంలో రాణింపు – వగైరాలన్నీ నిశితంగా గమనిస్తారు. అనుకరించాలని చూస్తారు.

పిల్లల పెంపకంలో తండ్రుల వ్యక్తిత్వ ప్రభావం తీవ్రంగా పని చేస్తుందని మానసిక శాస్త్ర వేత్తల అభిప్రాయం.

తండ్రి పిల్లల్తో ప్రేమగా ఆత్మీయంగా వ్యవహరించాలి. అది వారు సహజరీతిలో పెరిగేందుకు తోడ్పడుతుంది. తమ అభిప్రాయాల్నీ ఉద్వేగాల్నీ సహజంగా వ్యక్తం చెయ్య గలుగుతారు. ఆత్మ విశ్వాసాన్ని సంతరించుకుని లక్ష్యసాధన దిశగా అడుగులేస్తారు.

తండ్రి నియంతలా వ్యవహరిస్తే గద్దించడం దండించడం చేస్తే పిల్లలు ఆవేశ పరులవుతారు. భయాందోళనకు అభద్రతకులోనవుతారు. విధ్వంసక ప్రవృత్తిని అలవర్చుకుంటారు.

పిల్లలతో సఖ్యంగా ఉంటూనే క్రమశిక్షణతో పెంచాలి. వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలి.

ఆహ్లాదకర వాతావరణం

ఇంట్లో చక్కని వాతావరణం ఉండాలి.

నేలలో పాతిన మొక్కకి గాలి వెలుతురు నీరు పుష్కలంగా లభిస్తే ఏపుగా ఆరోగ్యంగా పెరుగుతుంది.

పిల్లలూ అంతే.

ఇంట్లో తల్లిదండ్రుల మధ్య ప్రేమ, అవగాహన, ఓర్పు, నేర్పు ఉంటే పిల్లలు మురిసిపోతారు. ఆనందంతో కేరింతలు కొడతారు. భద్రతతో భరోసాతో ప్రేమాభి మానాలతో ఎదుగుతారు.

దంపతులు కీచులాడుకొంటూంటే తిట్టుకొంటూంటే అగౌరవంగా అమర్యాదగా ప్రవర్తిస్తూంటే పిల్లలు చిన్నబోతారు. వారి మనస్సు చివుక్కుమంటుంది. బాధ కలుగుతుంది. అందులోంచి ద్వేషం పుడుతుంది. భయం, అభద్రత, అవిధేయత పెరుగుతాయి.

ఇంట్లోని అశాంతి, అనారోగ్య వాతావరణం వారి చిన్నారి మనస్సుల్ని కలుషితం చేస్తాయి. పెడధోరణులు ప్రవేశించి చెడు మార్గం పట్టిస్తాయి.

అంచేత తల్లిదండ్రులు చక్కని అలవాట్లు కలిగివుండాలి. ప్రేమాభిమానాలతో కాపురం చెయ్యాలి. పిల్లల్ని యువరాజు/రాణిలా పెంచాలి.

వివక్ష తగదు

మగ, ఆడ పిల్లల మధ్య వివక్ష చూపించొద్దు. ఇద్దరూ మీ సంతానమే. ఇద్దరూ సమానమే.

పుత్రుడు పున్నామ నరకం నుంచి రక్షించవచ్చు గాక. పుత్రిక మరో ఇంటి దీపంగా మారవచ్చు గాక.

అయినా ఏ విషయంలోనూ తేడా చూపించకూడదు. ప్రేమ పంచడంలో చదివించడంలో ఖర్చు విషయంలో ఎలాంటి పక్షపాతం చూపించొద్దు. మీకు చిన్నదిగా అన్పించింది వారికి పెద్దదిగా తోచవచ్చు. బాధించవచ్చు. న్యూనత పర్చవచ్చు.

చట్టప్రకారం వారసత్వ హక్కులే కాదు వృద్ధ తల్లిదండ్రుల్ని చూడాల్సిన బాధ్యత ఇద్దరి మీదా సమానంగా ఉంది.

కొడుకు పెళ్లాం వచ్చావరకే కొడుకు. ఆ తర్వాత కోడలి మొగడు.

కూతురు మాత్రం ఎప్పటికీ కూతురే.

కొడుకు తలకొరివి పెట్టవచ్చు. కాని మీరు చనిపోతే మీమీద పడి బావురుమని ఏడ్చేది కూతురేనని గుర్తుంచుకోండి!

మంచి చెప్పండి చెడువద్దు

మీ పిల్లల విజయాల గురించి గొప్పగా పది మందికీ చెప్పండి. అది వారికి స్ఫూర్తిదాయక మవుతుంది. ఇంకా ఇంకా సాధించాలన్న తృష్ణ పెరుగుతుంది.

అల్లరి ఎక్కువైనా, క్లాసులు ఎగ్గొడుతున్నా, మార్కులు తగ్గినా, ఫెయిలైనా, చెడు స్నేహాలు పట్టినా – నలుగురికీ చెప్పి అల్లరి చెయ్యొద్దు. అలాటివి ఇతరుల ముందు చర్చించవద్దు. ఘోరం జరిగిపోయినట్టు వాపోవద్దు.

దాని వల్ల మంచికన్నా కీడే ఎక్కువ జరుగుతుంది.

పిల్లలది అవమానాన్ని జీర్ణించుకోలేని లేత మనస్తత్వం. అహం, అభిమానం దెబ్బతింటే రెబల్ మనస్తత్వంతో రెచ్చిపోయే ప్రమాదముంది. మీ పట్ల వ్యతిరేక భావం ఏర్పరచుకోవచ్చు. దూరంగా జరగవచ్చు. చెడు స్నేహాలు పట్టవచ్చు.

పిల్లలకు సరైన పద్ధతిలో సహజమైన రీతిలో నచ్చ చెప్పండి. తప్పు తెలుసుకునేలా వ్యవహరించండి. అవసరమైతే కోప్పడండి. మీరూ ఆ వయస్సులో అలా చేశారేమో, వయస్సూ జ్ఞానం పెరిగాక దారిలోపడ్డారేమో గుర్తుతెచ్చుకోండి.

చిన్నదానికి పెద్ద రాద్ధాంతం చేసి వారి చిన్నారి మనస్సుని గాయపర్చకండి. పెద్ద మనస్సుతో ఓపిగ్గా నచ్చచెప్పి దారిలో పడేట్టు చెయ్యండి.

ఒంటరితనమూ నేర్పాలి

పిల్లలకు ఒంటరిగా ఉండటం, తమ పనులు తాము చక్కబెట్టుకోవడం అలవాటు చెయ్యాలి.

అనారోగ్యం, మరణం వగైరాలప్పుడు ఒంటరిగా వదలాల్సిరావచ్చు. హాస్టల్లో ఉ ండి చదువుకోవాల్సి రావచ్చు. విదేశాలకెళ్ళాల్సి రావచ్చు.

అందుగ్గాను ముందుగానే జాగ్రత్తలు చెప్పాలి. భయపడవద్దని బోధించాలి. ఇంట్లో ఒంటరిగా వదిలి ప్రక్కింటి కెళ్ళి వారి మీదో కన్ను వెయ్యాలి. ప్రక్కగదిలో పరుండబెట్టాలి. అపరిచితులు వస్తే తలుపు తీయకూడదనీ చెప్పాలి.

ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఏం చేశారో సమయాన్నెలా గడిపారో అడిగి తెలుసుకోవాలి. మరింత బాగా సమయాన్నెలా సద్వినియోగం చేసుకోవచ్చో వివరించాలి.

వారి పనులు వారు స్వయంగా చేసుకోవటం నేర్పాలి. దుస్తులు ధరించడం, పుస్తకాల బ్యాగ్ సర్దుకోవటం, హోం వర్క్ చేసుకోవడం, ప్రణాళికా బద్ధంగా చదువుకోవటం, ఆటలకీ, టీవీ చూడటానికీ టైము కేటాయించుకోవడం – వగైరా అలవాటు చెయ్యాలి. వారి వ్యక్తిత్వాన్ని చక్కగా తీర్చిదిద్దాలి.

ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరిగేలా అభద్రతకు లోను కానివ్వకుండా పిరికితనం పెరక్కుండా చూడాలి. అవసరమైతే ఎవర్నైనా తోడు ఉంచడం, ఆంజనేయస్వామి ఫొటోని తలగడ క్రింద పెట్టడం చెయ్యాలి.

ప్రశంసలే టానిక్కులు

ప్రశంసలు పన్నీటి జల్లుల్లాంటివి. ఆహ్లాదపరుస్తాయి. అందలమెక్కిస్తాయి. మీరిచ్చే ప్రశంసలే బహుమతులే వారికి అవార్డులూ రివార్డులూ.

పిల్లలు చదువులో ఉద్యోగంలో వెలుగొందాలంటే వారికి మీ ప్రశంసలు కావాలి. ప్రోత్సాహం కావాలి. మీకు వెన్ను దన్నుగా మేమున్నామన్న నమ్మకాన్ని కలిగించాలి.

అది వారికి భద్రత చేకూరుస్తుంది. ఇనుమడించిన ఉత్సాహంతో ఆత్మవిశ్వాసంతో విజయపథం పట్టగలరు.

ఆ తర్వాత వారెన్ని ఎత్తులకు ఎదుగుతారో ఎన్ని తారాలోకాలు చుట్టి వస్తారో మీ ఊహకి కూడా అందదు!

తల్లీకూతుళ్ళది ప్రత్యేకబంధం

తనకన్నా అధికంగా సుఖాన్నీ వైభోగాన్నీ కూతురు అనుభవించాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. కలలుకంటుంది.

ఇదేగాక తల్లీకూతుళ్ళ అనుబంధంలో మరో అంశం కూడా ఉంది.

కూతురికి సెక్స్ గురించి చెప్పడానికి తల్లులు ఇబ్బంది పడుతూంటారు. వారు అడిగితేనే చెబుతూంటారని ఒక సర్వేలో వెల్లడైంది.

బహిష్టు నుంచి గర్భధారణ వరకూ, ప్రసవం నుంచి పాలివ్వడం వరకూ ఆడపిల్లలకు తల్లే చెప్పాలి. తగిన సమయంలో తగిన విధంగా చెప్పాలి. ఇబ్బంది అన్పిస్తే స్నేహితురాలి సాయం తీసుకోవచ్చు. సంబంధిత పుస్తకాలు కొనివ్వొచ్చు.

ఏమైనా ఆడపిల్లలకు సెక్స్ విజ్ఞానాన్ని అందించి అనవసరభయాలూ అపోహలూ తొలగించాల్సిన బాధ్యత తల్లిదే.

స్నేహాలు ప్రోత్సహించాలి

తన ఈడు పిల్లలతో స్నేహాన్ని ప్రోత్సహించండి.

నలుగుర్తో కలవడం, ఆడుకోవడం, పోటీపడటం – చెయ్యనివ్వండి. పిల్లలు చురుగ్గా సంతోషంగా ఉండటమేకాదు టీమ్‌వర్క్ అలవడుతుంది. అర్థం చేసుకునే గుణం అబ్బుతుంది.

స్నేహితుల అలవాట్లు అభిరుచుల ప్రభావంతో తామూ బాగా చదువుకోవచ్చు. వివిధ కళల్లో ప్రవేశించనూవచ్చు.

అదే సమయంలో చెడు స్నేహాలు పట్టకుండా వారితో పోట్లాడకుండా అసూయ పడకుండా జాగ్రత్తపడాలి. స్పోర్టివ్ స్పిరిట్, కాంపిటీటివ్ మనస్తత్వం అలవర్చాలి. బాగా మార్కులు తెచ్చుకుంటున్న పిల్లల్తో పోల్చి మీ పిల్లల్ని కించపరచవద్దు. తూలనాడవద్దు. అలా ఎందుకు జరిగిందో తెలుసుకుని 'కరెక్షన్' కి పూనుకోవాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ స్నేహితుల ముందు పిల్లల్ని అవమానించొద్దు. ఆ స్నేహితుల్నీ తూలనాడవద్దు.

వారిని నొప్పిస్తే తమనే అవమానించినట్టు భావించి నొచ్చుకుంటారు.

పోలీసింగ్ చెయ్యవద్దు

పిల్లల్ని పోలీసుల్లా అనుమాన దృష్టితో చూడొద్దు.

వారిని – ముఖ్యంగా ఆడపిల్లల్ని అనుమానించొద్దు. ఆంక్షలు విధించవద్దు. ఇలా చెయ్యి, అలా నడువు, వీరితో తిరక్కు, వారితో వెళ్ళొద్దు – అంటూ కట్టడి చెయ్యొద్దు.

పిల్లల ఉత్తరాలు, డైరీలు, ఈ మెయిల్స్ చదవ వద్దు. సెల్‌ఫోన్లో నెంబర్లు చెక్ చేయొద్దు. వారి గురించి వారి స్నేహితుల ద్వారా ఆరా తీయవద్దు. ఆలస్యమైతే నేరస్తుల్లా నిలబెట్టి నిలదీయవద్దు.

వారి సున్నిత మనస్తత్వాన్ని ఆత్మాభిమాన్ని అర్థం చేసుకోవాలి.

తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే సూచనలిస్తూనే ఫ్రెండ్లీగా మువ్ అవ్వాలి తప్ప పోలీసింగ్ చెయ్యవద్దు. అవి వారిమీద వ్యతిరేక ముద్రవేస్తాయి!

ఆర్థికపరిస్థితి వివరించాలి

పిల్లలు ఎన్నో ఆశించవచ్చు. మరెన్నో కోరవచ్చు.

మీ శక్తి పరిధిలో వుంటే తీర్చండి. లేదా పరిస్థితి, అవసరం, ఖర్చు గురించి వివరించి చెప్పండి.

పిల్లలు గొప్పింటి తమ స్నేహితుల్లా గొప్పగా ఉండాలని ఆశపడ్తారు. వారికి మీ ఆర్థిక పరిస్థితి అర్థమయ్యేలా వివరించండి. వారి కోసం ఉన్నంతలో మీరెంత చేస్తున్నారో వారి భవిష్యత్ అవసరాల కోసం మీరు చేస్తున్న పొదుపు ప్రణాళికలేమిటో తెలియజెప్పండి.

అది వారిని నేల మీద నడిపిస్తుంది. అత్యాశకి అసంతృప్తికి గురికానివ్వదు. అసహనంతో కోపంతో మండేలా చెయ్యనివ్వదు. మీ మీద ప్రేమాభిమానాలు పెంచుతుంది.

భవిష్యత్తులో అవన్నీ సాధించాలన్న తపన, పట్టుదల వారిలో వేరూనతాయి.

కళల్ని ప్రోత్సహించండి

కొందరు పాఠ్య పుస్తకాలు తప్ప మరి దేని జోలికీ పోనివ్వరు. మరేదీ చదవనివ్వరు. చెయ్యనివ్వరు.

అది సరికాదు. పిల్లల్ని ఆకర్షించే కథల పుస్తకాలు చదవనివ్వండి. ఫాంటసీ లోకానుభూతిని ఆస్వాదించనివ్వండి.

విజ్ఞానదాయక పుస్తకాలను కొనివ్వండి. టీవీలో డిస్కవరీ ఛానల్ చూడనివ్వండి. వారి మానసిక వికాసానికి ఐక్యూ పెరగటానికి వారి ప్రపంచం విస్తృతమవడానికి తోడ్పడండి.

పిల్లల్లో పాటలు పాడటం, నాట్యం చెయ్యడం, చిత్రలేఖనం, సంగీతం, నటన, రచన – వగైరా కళల్ని పెంపొందించండి. అవి వారిని మృదు మనస్కుల్ని చేస్తుంది. అంతులేని ఆనందాన్నిస్తుంది. భవిష్యత్తులో అదే వారి వృత్తీ కావొచ్చేమో.

ప్రవృత్తి మనిషిని సేదదీరుస్తుంది. సంతృప్తిపరుస్తుంది. పదిమందిలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. కీర్తి కనకం చేకూరుస్తుంది!

అంధప్రేమ వద్దు

పిల్లల్ని అపరిమితంగా ప్రేమించండి.

కాని ఆ ప్రేమ వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేదిగా ఉండాలి తప్ప చెడగొట్టేది కాకూడదు

వారిలోని మంచి లక్షణాలను ప్రేమించండి. ప్రోత్సహించండి.

అంతే తప్ప గుడ్డిప్రేమతో చెడుని మంచిగా చూడొద్దు. సపోర్టు చెయ్యొద్దు. తప్పుని నేరాన్ని వేలెత్తి చూపడానికి వెనుదీయవద్దు.

ధృతరాష్ట్రుడు కొడుకుల మీద గల అపారప్రేమతో గుడ్డివాడయ్యాడు. అతడి అంధప్రేమ మొత్తం అతడి వంశాన్నే బలిగొంది.

ఈ సందర్భంగా కొడుకులు తల్లిదండ్రుల పదవుల్ని, అధికారాల్ని, వ్యాపారాల్ని దుర్వినియోగం చేసి 'సన్ స్ట్రోక్' ఇచ్చిన/ఇస్తున్న వారిని గుర్తు చేసుకోవటం అవసరం.

పిల్లల చెడు పనుల్ని చెడు అలవాట్లని చెడు లక్షణాలని చెడు ప్రవర్తనని ఖండించాలి తప్ప వెనకేసుకు రాకూడదు. మీ సపోర్టు లభించిందని తెలియగానే వారు మరింత రెచ్చిపోతారు. ఆపైన చెయ్యి దాటిపోతారు.

మొక్కై వంగనిది మ్రానయ్యాక వంగదు!

తోటకూర దొంగిలించినప్పుడే జాగ్రత్తపడితే ఉరిదాకా వచ్చేదే కాదుకదా!

అశ్రద్ధ కూడదు!

డబ్బు సంపాదనలో పడి పిల్లల్ని పట్టించుకోకపోవడం, అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు.

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైనా సరే ఎంత బిజీగా ఉన్నా సరే పిల్లల కోసం కొంత సమయం కేటాయించక తప్పదు.

పిల్లల్ని ఆయాల బంధువుల దయాదాక్షిణ్యాల మీద పూర్తిగా వదిలెయ్యడం క్షేమంకాదు. సినిమాలకీ షికార్లకీ బంధుమిత్రుల శుభకార్యాలకీ తీసుకెళ్ళడం ద్వారా విజ్ఞాన వినోదాలందిస్తూ అనుబంధాల విలువ చాటి చెప్పాలి.

సంతానాన్ని మించిన ఆస్తిపాస్తులుండవు. నిజానికి వారే మీ ఆస్తి. మీ ప్రేమ. మీ బాధ్యత మీ భవిష్యత్తు.

వారి ప్రశ్నలకి విసుక్కోకుండా సందేహనివృత్తి చేస్తూ జ్ఞానతృష్ణ పెరిగేందుకు తోడ్పడాలి.

వారి ఆలనాపాలనా చూడటానికి, కబుర్లూ కలలూ వినడానికి, చదువులో కెరీర్లో గైడ్ చెయ్యడానికి, ప్రతిభని ప్రశంసించడానికి తద్వారా వారి బహుముఖ అభివృద్ధికి మీ పాత్ర చాలా ముఖ్యం. వాటి ప్రభావ ప్రాముఖ్యత దృష్ట్యా మీరా పాత్రని సవ్యంగా పోషిస్తేనే 'గుడ్ డాడీ' 'గుడ్ మమ్మీ' అవుతారు.

మీ ఆశయాల్ని రుద్ద వద్దు

కొంతమంది తల్లిదండ్రులు తాము సాధించలేని వాటిని పిల్లల ద్వారా సాధించాలని చూస్తారు. తమ కలల్ని పిల్లల ద్వారా నెరవేర్చుకోవాలని ప్రయత్నిస్తారు.

అది సరైన దృక్పథం కాదు.

మీ అభిప్రాయాలూ ఆశలూ చెప్పవచ్చు. కాని రుద్దకూడదు.

పిల్లల ఇష్టాఇష్టాలు ఆశలు కలలు తెలుసుకోవాలి. తదనుగుణంగా కార్యసాధనకు ప్రణాళిక వెయ్యాలి.

అంతే తప్ప ఇంజినీరు, డాక్టరు తప్ప మరే వృత్తీ లేనట్టు ఎంసెట్‌లో ర్యాంక్ రాకపోతే బ్రతుకే లేనట్టు ప్రవర్తించకూడదు. మానసిక ఒత్తిడి తేకూడదు.

వారిలో ఆశావహ దృక్పథం కలిగించాలి. ఇంజినీరింగ్ మెడిసిన్ వృత్తులేగాక మరెన్నో వృత్తులున్నాయి. రంగాలున్నాయి. వారి వారి అభిరుచి ఆసక్తి మేరకు వాటిల్లో రాణిస్తూ ప్రపంచ ఖ్యాతి గడిస్తున్న వారెందరో ఉన్నారు.

వారి గురించి చెప్పి ప్రోత్సహించాలి. వారెన్నుకున్న మార్గంలో రంగంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు చేయూతనివ్వాలి.

నైతికవర్తనా ముఖ్యమే

తల్లిదండ్రులు ప్రథమ ఉపాధ్యాయులు. సరైన విధంగా సరైనవి భోదించాలి. ఆత్మ విశ్వాసంతో సరైన మార్గంలో నడిచేలా చూడాలి.

తమని చూచి బంధుప్రేమ, నీతి, నిజాయితీ, పనిమీద శ్రద్ధ, దైవభక్తి, స్నేహభావం అలవర్చుకునేలా తల్లిదండ్రులు ప్రవర్తించాలి.

భాషని, అలవాట్లని, ప్రవర్తనా తీరుని – పిల్లలు అనుకరించాలని చూస్తారు. గనుక అందుకు తగినట్టుగా హుందాగా వారుండాలి.

మంచి అలవాట్లు నేర్పడమే కాదు మత విశ్వాసాలని కూడా అలవాటు చెయ్యాలి. దేవుడి ముందు రెండు చేతులు జోడించి నమస్కరించటం నుంచి ఆ శిక్షణ మొదలవ్వాలి.

ప్రతి మతం మానవాళి ఉన్నతినే కోరుతుంది. సౌహార్ద్రభావం పెంచుకోమని పరోపకారం చెయ్యమని అందరి సుఖం కోసం కృషి చేయమని బోధిస్తుంది.

అవి అలవడితే చాలు మనిషి మహోత్తముడవుతాడు!

మూఢనమ్మకాలొద్దు

పిల్లలకి సత్ప్రవర్తన నేర్పాలి. హేతువాద దృక్పథాన్ని అలవరచుకునేట్టు ప్రోత్సహించాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ మూఢనమ్మకాలు నేర్పొద్దు. ప్రశ్నించడం తార్కికంగా ఆలోచించడం నేర్పాలి. ప్రతిదానికీ వారం, వర్జ్యం, అదృష్ట అంకెలు, లక్కీ పెన్ను, అచ్చొచ్చిన డ్రెస్సు – వగైరా నమ్మకాలని దూరంగా ఉంచేట్లు చూడండి.

కొందరు పిల్లలు అబద్ధాలాడుతూంటారు. మంచి అభిప్రాయం కలిగేందుకు, కొన్ని వాస్తవాలు దాచేందుకు నమ్మేలా చెబుతూంటారు. చదువు, హోంవర్కు, కాలేజీకి వెళ్ళటం, ఖర్చు – వగైరాల్లో మెప్పుకోసమో బుట్టలో వేసేందుకో ప్రయత్నిస్తుంటారు.

వారి మాట నమ్మినట్టు నటిస్తూనే 'చెక్' చెయ్యడం అవసరం. లేకపోతే పిల్లలు దారి తప్పే ప్రమాదముంది!

హెచ్చరిక

దుర్మార్గులుగా పుట్టినవారి కన్నా పెంపకంలో చేటు వల్ల చెడిపోయినవారే సమాజంలో అధికం.

గుణనిధి చెడిపోవడానికి అతడి తల్లే కారణం. అతి గారాబం చేసి వాణ్ణి చెడగొట్టింది.

అలాంటి పరిస్థితి రానివ్వకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

పిల్లల ఉన్నతిలో తల్లిదండ్రుల వంతు సగమే ఉండొచ్చుగాని వారి పతనంలో పూర్తిగా ఉంటుంది!

63

సంతాన కర్తవ్యం

తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తారు. వారి బోసి నవ్వులకు మురిసిపోతారు. వారికి చిన్నకష్టం కూడా కలక్కుండా మెత్తని పక్క వేస్తారు. కంటి నిండా నిద్రపోకుండా బిడ్డకు కంటిరెప్పగా మారతారు.

తమ సుఖాలని చిన్ని చిన్ని సంతోషాలని సైతం వదులుకుని పైసా పైసా కూడబెడతారు. బిడ్డ చదువుకి అభివృద్ధికి చెమటని డబ్బుగా మార్చి మెట్లు నిర్మిస్తారు.

బిడ్డ కెలాంటి కష్టం రాకుండా మరెలాంటి నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా అనుక్షణం వెన్నంటి ఉంటారు. ప్రోత్సహిస్తారు. ఉన్నత స్థాయికి చేరిన బిడ్డల్ని చూసి జలజలా ఆనంద భాష్పాలు రాలుస్తారు.

వారి ప్రేమకూ త్యాగానికీ ప్రతీకలైన పిల్లలు వారి ఆస్తిపాస్తుల్ని పంచుకున్నా లేకున్నా వారిని ఆదరించాలి. గౌరవించాలి. వారి ప్రతిష్ఠ ఇనుమడించేలా ప్రవర్తించాలి. వారి ప్రశాంత జీవనానికి ఏర్పాట్లు చెయ్యాలి.

అది సంతానపు కనీసం బాధ్యత! కర్తవ్యం!

రాముడే ఆదర్శం

శరీరం తల్లిదండ్రుల నుంచి సంక్రమించింది. అంటే పిల్లల శరీరం వారిది కాదు తల్లిదండ్రులది. ఆ జ్ఞానం వారెప్పుడూ కలిగి ఉండాలి. అందుకనుగుణంగా ప్రవర్తించాలి.

పుత్రుడు తీర్థ వ్రత భజన స్మరణాది శుభకార్యాలేం చేసినా వాటిని తల్లిదండ్రులకే అర్పణ చేయాలన్నాడు మనువు.

తండ్రి సుఖసంతోషాలకోసం ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయాడు భీష్ముడు.

తెల్లవారితే పట్టాభిషేకం. కాని తండ్రి ఆజ్ఞాపాలన కోసం అడవులకెళ్ళాడు

శ్రీరాముడు. 'నేనెందుకెళ్ళాలి? వెళ్ళను' అని ధిక్కరించి ఉంటే నానా కష్టాలూ పడక్కర్లేకపోయేది. రాజభోగాలు అనుభవించేవాడు.

కానలా చెయ్యలేదు. పితృవాక్యపరిపాలన కోసం రాజ్యం, వైభవం, అధికారం, సుఖం, త్యాగం చేశాడు.

"తండ్రి మాట ప్రకారం నేను అగ్నిలో ప్రవేశించగలను. విష భక్షణం కూడా చేయగలను. సముద్రంలో కూడా దూకగలను. కాని నేను తండ్రి ఆజ్ఞ మీరజాలను" అంటాడు రాముడు వాల్మీకి రామాయణంలో.

అందుకే రాముడు మర్యాదా పురుషోత్తముడయ్యాడు!

పితృదేవతలు

దేవతల తరువాతి స్థానం పితృదేవతలదే.

'పితృ' అంటే మాతాపితలిద్దరూనూ. వారిస్థానం దేవతలతో సమానం.

'మాతృదేవో భవ! పితృదేవో భవ!' అన్నారు.

ఈ ప్రపంచంలో తల్లిదండ్రులే తొలి దైవాలు. వారివల్లనే మనకు ఈ శరీరం లభించింది. శరీర లాభానికి మనం ప్రయత్నిస్తాం తప్ప శరీరదాతల్ని గుర్తుంచుకోం.

దేవకీ వసుదేవుల్ని చెరవిడిపించేక కృష్ణుడు, "పద్నాలుగు ఏళ్ళపాటు మీ శుశ్రూష చేయలేని దౌర్భాగ్యుడ్ని నేను. ధర్మార్థకామమోక్షాలను సాధించడానికి ఉపకరించే ఈ శరీరం మీరు ప్రసాదించిందే. తల్లిదండ్రుల ఋణం తీర్చుకోడానికి నూరేళ్ళ ఆయుష్షుసైతం చాలదు" అంటాడు.

హిందూజాతి పితృభక్తికి ఇది ఉత్కృష్టమైన ఉదాహరణ!

మాతృవందనం

'యం మాతా పితరౌ క్లేశం సహేతే సంభవేన్నృణామ్

నతస్య నిష్కృతిః శక్యాకర్తుం వర్ష శతై రపి' అన్నది మనుస్మృతి.

సంతానాన్ని నిర్మించడంలో తల్లిదండ్రులు పడే వేదనకు కష్టానికి సహనానికి మనం ఎన్ని వందల సంవత్సరాలు సేవ చేసినా వారి ఋణం తీర్చుకోలేం.

మాతృమూర్తి దయార్ద్ర హృదయాన్ని దేనితోనూ పోల్చలేము. అందుకే ఉపనిషత్తులు తల్లికి దేవతా తుల్యమైన స్థానాన్నిచ్చాయి.

'అనువ్రతః పితుః పుత్రో మాతా భవతు సంమనాః' – తండ్రి ఆజ్ఞను శిరసా వహించడంతో బాటు తల్లి మనస్సును సుఖపెట్టడం పుత్రుని కర్తవ్యమని వేదం నొక్కి చెబుతోంది.

అలాంటి తల్లిని హింసించి వేధించి బాధించే సంతానం వ్యర్థం, నిష్ప్రయోజనం అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి!

"తల్లిని గాఢంగా ప్రేమించే వ్యక్తి జీవితాంతం విజేత మనస్తత్వంతో ఉంటాడు. ఆ మనస్తత్వమే అనేకసార్లు అతడి విజయానికి కారణమవుతుంది" అంటాడు ఫ్రాయిడ్.

పూజ్య స్థానం

జన్మకారకులూ పోషకులూ అయిన తల్లిదండ్రులపట్ల ఆదరభావం కలిగి ఉండాలి. అది విద్యుక్తధర్మమంటుంది హిందూ సంస్కృతి.

కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రులది పూజ్యస్థానం. వారి పాదాలు తాకి నమస్కరించటం మన సంప్రదాయం. వారి ముందు మోకరిల్లడమంటే భగవంతుడికి తన భక్తిని తెలిపినట్లే!

వారి జీవితాంతం వారికెలాటి బాధ కష్టం కలక్కుండా వారి బాగోగులు చూస్తూ సేవించడం పిల్లల కర్తవ్యం.

వారి మరణానంతరం ప్రతి ఏటా వారిని స్మరిస్తూ, పిండప్రదాన తర్పణాదులు చెయ్యాలి. శ్రాద్ధ కర్మల్ని నిర్వర్తించాలి. జన్మనిచ్చిన వారినే కాదు వారికి జన్మనిచ్చిన వారినీ మరువరాదు. పూర్వుల రక్తం పంచుకున్నందుకు వారికీ విధంగా కృతజ్ఞత ప్రకటించాలి.

పితౄణం నుంచి ముక్తి పొందటానికి పితరులకు సద్గతి కల్పించడానికి శ్రాద్ధ తర్పణాలు చేయాలి. తమ తర్వాత పిండ ప్రదానం చెయ్యడానికి సంతానానికి జన్మనివ్వాలి. లేకపోతే పితౄణం నుంచి విముక్తుడు కాడు.

ఎంతదూరదృష్టి! ఎంత ప్రేమచింతన! ఎంత వినయం!

ఇదే హిందూ సంస్కృతి యొక్క గొప్పతనం!

తీరనిదీ ఋణం

తల్లిదండ్రులు సంతానం కోసం పడ్డ కష్టాలఋణం కొడుకు మీద ఉంటుంది. ఆ ఋణాన్ని కొడుకెప్పుడూ తీర్చలేడు.

తల్లి నవమాసాలు మోసి కని పెంచి కొడుకుకెంత సేవ చేసిందో అంత సేవ కొడుకు చేయలేడు.

ఎవరైనా తమ విశ్వాసాన్ని ప్రకటించాల్సి వచ్చినప్పుడు, 'నా చర్మం ఒలిచి మీకు చెప్పులు కుట్టిస్తాను' అంటారు. వారికా చర్మం ఇచ్చింది తల్లే కదా!

బిడ్డకు ఆహారవస్త్రాదులు ఇచ్చి విద్యావినయాలు నేర్పి సమాజంలో అతడికో యోగ్యత కల్పిస్తాడు తండ్రి. అతడి ఋణం తీర్చడం సంతానానికి సాధ్యంకాదు.

బిడ్డ తన జీవితమంతా సేవచేసినా అతడ్ని కనేప్పుడు తల్లి పెట్టే ఒక్క కేకకి సరిరాదు!

సేవే ధన్యమార్గం

మాతాపితల సేవ యొక్క తాత్పర్యం కృతజ్ఞతలోనే ఉంది.

వారిని సేవించడం ద్వారా సుఖపెట్టడం ద్వారా ఋణాన్ని గాకపోయినా వడ్డీని తీర్చుకోగల్గుతారు. వారు సంతోషాన్ని పొందేట్లు చెయ్యడం వల్లనే వారికి కృతజ్ఞత చూపినట్టవుతుంది.

వారు తమకేం చేశారు ఎంత చేశారు అంటూ లెక్కలు వెయ్యకూడదు. తమ కర్తవ్యాన్ని నిభాయించడమే పిల్లల బాధ్యత వీరు వారికేం చేశారూ చేస్తున్నారూ అని మాత్రమే ఆలోచించాలి.

తల్లిదండ్రులు పిల్లలకు మంచిశిక్షణ మంచి జీవితం ఇవ్వకపోతే అందుకు దోషులు వాళ్ళు. వారి దోషాన్నెంచడం పుత్రుడికి తగదు.

ఆస్తిపాస్తుల్ని పొందాలనే మిషతో ఆశతో తల్లిదండ్రుల సేవచేసే వారు నిజానికి ధనానికే సేవ చేస్తున్నట్టు లెఖ్ఖ!

ఒక్కటి మాత్రం మరువ కూడదు.

అమ్మ పాదాల దగ్గర ఉంటుంది స్వర్గం. అమ్మ తృప్తి పడితేనే స్వర్గాన్ని సమీపించగలరు. స్వర్గ ద్వారాల్లాంటి వాడు తండ్రి. అతడు సంతుష్టుడైతేనే ఆ ద్వారాలు తెరుచుకుంటాయి. అప్పుడే సంతానానికి స్వర్గం దక్కేది!

అన్నీ అమర్చి ఇవ్వాలి

పిల్లల్ని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకెళ్ళడానికి ప్రతి తల్లీ తండ్రీ తమ శాయశక్తులా ప్రయత్నిస్తారు – కృషి చేస్తారు.

కొన్ని మినహాయింపులుండొచ్చు. అలా అని వారిని సందేహించటం తగదు. వారి వారి సాంఘిక ఆర్థిక దృక్కోణాల నుంచి విశ్లేషించాల్సి ఉంటుంది.

చదువు, ఉద్యోగం, పెళ్లి, ఆస్తులు – అన్నీ బంగారు పళ్లెంలో పెట్టి తల్లిదండ్రులందించాలని సంతానం ఆశించడం తగదు.

వారు చెయ్యగలిగింది వారి శక్తి మేరకు చేస్తారు. కొంతదూరం నడిపిస్తారు. ఆపై ప్రయాణం పిల్లలే చెయ్యాలి.

ఇంటి ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోతే పనిచేస్తూనే చదువుకునే మార్గాలు చూసుకోవాలి. అనుభవంతోబాటు అర్హతలూ పెంచుకోడానికి కృషి చెయ్యాలి.

అవసరమైతే తల్లిదండ్రులకి సాయపడ్తూనే తమ భవితకు సోపానాలు నిర్మించుకోవాల్తప్ప వారిని నిందించకూడదు. చులకనగా పనికిరాని వాళ్ళుగా చూడకూడదు.

మీ తండ్రి మీకిచ్చిన దానికన్నా అధికంగా రేపు మీరు మీ పిల్లలకి ఇవ్వగలరో లేదో ఒక్కసారి గుండెల మీద చేయి పెట్టుకుని ఆలోచించండి. సమాధానం మీకే లభిస్తుంది!

మాతామహులు

కొడుకుతో బాటు కూతురు కూడా తల్లిదండ్రుల ఆస్తుల్లో సమాన హక్కుదార్లని చట్టం నిర్దేశిస్తోంది. వారి అప్పులకే కాదు బాధ్యతలకీ బాధ్యులే.

కొడుకు తన తండ్రినీ తల్లినీ పోషించినట్టుగానే కూతురు కూడా చెయ్యాలి. పెళ్లై మరో ఇంటి కెళ్ళినాసరే.

సంతానం కలిగితే కన్యాదానం సఫలమవుతుంది. అప్పుడామె తల్లిదండ్రులకు ఆమె మీద అధికారం వస్తుంది. అంచేత గోత్రం ఒకటిగాకపోయినా దౌహిత్రుడు (కూతురి కొడుకు) తన అమ్మమ్మకీ తాతయ్యకీ శ్రాద్ధతర్పణాదులు చెయ్యగలగుతున్నాడు.

కొడుకుతో సరిసమానంగా ఆస్తిహక్కు కూతురికి కల్పించిన ఈ రోజుల్లో ఆమె చేత సేవ చేయించుకునే అధికారం ఆమె తల్లిదండ్రులకీ ఉంది!

రక్త సంబంధికులు

తల్లిదండ్రుల్నే కాదు రక్త సంబంధికుల బాగోగులు సైతం చూడాల్సి ఉంటుంది.

'అన్న' అంటే తండ్రి అని అర్థం. తండ్రి తర్వాత తండ్రి అంతటివాడు. కుటుంబానికి ప్రథమ రక్షకుడు.

అంచేత తమ్ముళ్ళ చెల్లెళ్ళ బాధ్యత స్వీకరించాలి.

ఇది అక్కకీ వర్తిస్తుంది.

తమ్ముడు లేక చెల్లెలికి పెద్దవారికున్నంత బాధ్యత లేకపోయినా అక్క అన్న అంటే అభిమానముండాలి. కృతజ్ఞత ఉండాలి. వారు తమకోసం చేసిన మేలుని మరచిపోకూడదు.

తల్లిదండ్రుల పట్ల ఎలాంటి ఆదరణ ఆప్యాయత చూపాలో పెద్ద సోదరుల మీద అలాంటివే చూపాలి. అలాగే చూడాలి!

రాబోవు తరం దూతలు

'కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు' అంటూనే 'కొంతమంది యువకులు రాబోవుతరం దూతలు' అన్నారు మహాకవి శ్రీశ్రీ.

నేటి యువతంతా అలా ఉండాలి. అలా ఎదగాలి.

సమాజంలోని కుళ్ళు చూసి సహించలేనితనం, అవినీతి అంటే ఆగ్రహించేతనం, ఏదో చెయ్యాలన్న తపనతో రగిలేతనం, ఏమైనా సాధించగలమన్న ధీమాగలతనం – ఇవన్నీ నేటి సంతానంలో మిళితమై ఉన్నాయి.

'నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష' అనుకోకుండా పదుగురి మేలుకోసం కృషిచెయ్యాలి. చీకటిని తిడుతూ కూర్చోకుండా ప్రయత్నమనే చిరుదీపం వెలిగించాలి.

రాజకీయాలు అస్పృశ్యాలుకావు. వాటిల్లోనూ ప్రవేశించాలి. వాటికి కొత్త అర్థం చెప్పాలి. సమాజంలోని అట్టడుగు వర్గాలకు సైతం తిండి గుడ్డ గూడు సమృద్ధిగా లభించేలా మార్పుతేవాలి. తేగలరు!

మదర్స్ డే అంటూ మే 14న, ఫాదర్స్ డే అంటూ జూన్ 17న – ఆ రెండ్రోజులు మాత్రమే తల్లిదండ్రుల్ని తలచుకోవడం హేయం. మీ జీవితం మొత్తం క్షణక్షణం మీ పేరెంట్స్ శ్వాసల్తో ఆశల్తో చుట్టేయబడి ఉందని గుర్తుంచుకోవాలి.

వారిని జీవితాంతం ఆదరించాలి.

మదర్స్ డే, ఫాదర్స్ డే నాడు సమాజంలోని అభాగ్య తల్లిదండ్రులకు ఏదైనా చెయ్యండి. కనీసం వృద్ధ శరణాలయానికి వెళ్ళి వాళ్ళ కళ్ళల్లో మెరుపులు కురిపించండి. సమాజ ఋణం తీర్చుకోడానికి శ్రీకారం చుట్టండి!

'నాస్తి మాతృ సమః సఖానాస్తి పితృ నమో గురుః' అన్నారు.

తల్లితో సమానమైన మిత్రులుగాని తండ్రితో సమానమైన గురువుగాని లేరు!

వేమన వేదం

"తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు
పుట్టనేమి వాడు భువిని గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా
విశ్వదాభిరామ వినురవేమ!"

ఇది భాష్యం అవసరంలేని భావవాహిని!

పుత్రులలో రకాలు

'పనుపక చేయుచు రధికులు
పనిచిన మధ్యములు వొందు వరుతురు తండ్రుల్
పని చెప్పి కోరి పనిచిన
ననిశము మారాడు పుత్రులధములు తండ్రీ'

భాగవతం పుత్రుల్ని మూడు రకాలుగా విభజించింది.

తండ్రి చెప్పకుండానే ఆయన మనస్సెరిగి ఆయనకు కావలసిన పనులు చేసి పెట్టేవారు ఉత్తములు. తండ్రి చెప్పిన పనిని మాత్రమే నెరవేర్చేవారు మధ్యములు. తండ్రి చెప్పినప్పటికీ ఆ మాటలను పెడచెవిన బెట్టి ఆ పనుల్ని చేయ తిరస్కరించే వారు అధములు!

వృద్ధావస్థలో

జీవితపు చరమాంకంలో అడుగుపెట్టిన తల్లిదండ్రుల్ని ప్రేమపూర్వకంగా ఆదరించాలి.

ఎంత బిజీగా వున్నా సరే వారితో కొంత సమయం గడపాలి. వారు చెప్పేది చాదస్తంగా అన్పించినా ఓపిగ్గా వినాలి. మీ వాదనని సూచన ప్రాయంగా మంద్రస్థాయిలో వినిపించాలి తప్ప విసుక్కోవద్దు. అగౌరపర్చవద్దు. తూలనాడవద్దు.

కొత్త నిర్ణయాలు తీసుకునేప్పుడు వారికి వివరించాలి. వారి ప్రతి స్పందన కోసం తగిన సమయమివ్వాలి. వారి సూచన నచ్చనిచో తగిన జాగ్రత్తలు తీసుకుంటామని సున్నితంగా చెప్పాలి. భరోసా ఇవ్వాలి.

వారి ఆరాటం తాపత్రయం అన్నీ మీ బాగుకోసమే మీ క్షేమం కోసమే అన్నది మరువరాదు.

సంస్కృతిపరిరక్షణ

పూర్వ తరాలనుంచి రక్తదేహాలే కాదు ఆస్తిపాస్తులే కాదు ధర్మ పరంపర కూడా మనకి లభిస్తోంది. అది అపురూపమైన సంపద.

ధనానికన్నా మిన్నగా ఈ ధర్మాన్ని అందించడం తల్లిదండ్రుల విధి. దాన్ని అందుకుని ఆచరించి మళ్ళీ మన సంతానానికందివ్వడం మన కర్తవ్యం!

పిల్లలు ఎదగటం, పెళ్ళి చెయ్యడం, పిల్లల్ని కనడం, వారిని పెంచడం – చక్రం తిరుగుతూనే ఉంటుంది.

తరతరాల సంస్కృతిని పాటించాలి. కాలానుగుణ మార్పుల్తో అనుసరించాలి. తర్వాతి తరానికి అందివ్వాలి. ఇది నిరంతరం సాగాల్సిన ప్రక్రియ.

వేదాల సారాన్ని ధర్మశాస్త్రాల దృక్పథాన్ని జీర్ణించుకోవాలి.

సమాజ కళ్యాణానికి మీ పాత్ర మీరు పరిపూర్ణంగా పోషించాలి.

ధర్మో రక్షతి రక్షతః

64

యుక్త వయస్సు

బాల్య కౌమార దశలు దాటి యౌవనంలోకి అడుగు పెడుతున్న సంతానాన్ని చూస్తుంటే తల్లిదండ్రులకి ఆనందం, ఆశ్చర్యం, గర్వం ఒకేసారి ముప్పేటగా కలుగుతాయి.

పదేళ్ళ వయస్సు నుంచి పిల్లల్లో శారీరక మానసిక మార్పులు వేగాన్ని సంతరించు కుంటాయి. తల్లిదండ్రులతోడిదే లోకం అన్న భావన నుంచి మెల్ల మెల్లగా బయటపడతారు.

స్నేహితుల్తో తోటివయస్సు వారితో అనుబంధం పెంచుకుంటారు. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న జిజ్ఞాస, ఆసక్తి పెరుగుతాయి.

ప్రవర్తనలో ఆలోచనల్లో విజ్ఞానంలో చాలా పెద్ద మార్పు వస్తుంది.

యుక్తాయుక్త విచక్షణ జ్ఞానంతో సంపూర్ణ ఆరోగ్యంతో విజ్ఞాన సంపదతో నవ యువతీ యువకులుగా తయారవుతారు!

టీనేజ్

థర్టీన్ నుంచి నైన్‌టీన్ వరకు గల దశని టీనేజ్ అంటారు.

పదమూడేళ్ళకి యౌవనంలో అడుగుపెట్టి పందొమ్మిదేళ్ళకి యౌవన వికాసంతో మిలమిల మెరుస్తారు.

ఎన్నో శారీరక మార్పులొస్తాయి. అవి పిల్లల్ని ఆనందపరుస్తాయి. అదే సమయంలో ఇబ్బందీ పెడతాయి.

ఆడపిల్లలు రజస్వల అవుతారు. వక్షోజాల పెరుగుదల, స్వరంలో మార్పు, పొడవు పెరగటం, ఒళ్ళు రావటం – ఉంటుంది. మైనపు ముద్దను మలిచినట్టు తీరైన ఆకృతి సంతరించుకుంటారు.

మగపిల్లల్లో మీసాలు రావడం, గొంతు మారడం, ఛాతి పెరగటం, ఒడ్డూ పొడవూ పెరగటం, మొటిమలు రావటం – జరుగుతుంది.

ఇద్దరికీ అందం అలంకరణ మీద శ్రద్ధ పెరుగుతుంది.

మానసికంగానూ పెనుమార్పులొస్తాయి. తల్లిదండ్రుల మీద ఆధారపడటం తగ్గుతుంది. వారు చెప్పిందల్లా గుడ్డిగా చెయ్యడానికి ఇష్టపడరు. స్వతంత్రంగా ఆలోచించటం మొదలు పెడతారు. స్వయం నిర్ణయం తీసుకోవాలని చూస్తారు. స్నేహితులకీ వారి మాటలకీ అధిక విలువ ఇస్తారు.

కొత్త అలవాట్లు నేర్చుకుంటారు. కొత్త అభిరుచులు పెంచుకుంటారు.

పెద్దవారిమయ్యామన్న ఫీలింగు బలపడుతుంది. అలా గుర్తింపబడాలని ఆశిస్తారు. చిన్నవారిగా చూస్తే నామోషీగా అవమానంగా భావిస్తారు. ఉక్రోషపడతారు.

సంధి దశ

హైస్కూలులో ఉన్నంతవరకూ పిల్లలు బుద్ధిగా ఉంటారు. చదువు, స్కూలు, ఆటలు, హోంవర్కు, అడపాదడపా సినిమాలు, టీవీ తప్ప మరేం పట్టవు.

బుద్ధిగా యూనిఫాం ధరించి ఒక్కరోజూ బద్ధకించకుండా స్కూలుకెళతారు. టీచరు మాటల్ని వేదవాక్కుగా భావిస్తారు.

టెన్త్ పాసయ్యి ఇంటర్మీడియట్‌లో ప్రవేశిస్తేచాలు వారు అమాంతం మారిపోతారు. అది మార్పుకాదు పరిణామం. స్కూలు దశ వేరు. కాలేజీ దశవేరు. రెంటికీ పొంతన లేనంతగా మారిపోతారు.

సినిమాల్లో చూపే కాలేజీ సన్నివేశాలు చిన్నారుల బుర్రల్ని కొంత కలుషితం చేస్తున్నాయి. కాలేజీల్లో 'అలాగే ఉంటారు కామోసు!' అన్న భ్రమలో మునిగి తేలతారు.

పైగా ఒక్కసారే రెక్కలొచ్చినట్టు స్వేచ్ఛాజీవులమైనట్టు ఫీలవుతారు. కొత్త స్నేహితులు కొత్త వాతావరణం కొత్త అలవాట్లు బరువుగా ఉండే పాకెట్‌మనీ వారిని తిన్నగా ఉండనివ్వవు. కదిపి కుదుపుతాయి. ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

కొందరు ఐఐటి, ఎంసెట్, సిఏ, మరోటీ మరోటీ అంటూ సీరియస్‌గా మారి స్టడీస్‌లో కూరుకుపోతారు. మరి కొందరు కాలేజీకి డుమ్మాకొట్టి బేకరీల్లో సినిమాల్లో

బస్టాండుల్లో కాలక్షేపం చేస్తారు. ఇంట్లో మాత్రం బుద్ధిమంతుల్లా ప్రవర్తిస్తారు. ఎలాంటి అనుమానం రానివ్వరు.

కాలేజి గేటు ముందు డ్రాప్ చేసినా సరే పేరెంట్స్ అటు మలుపు తిరగ్గానే ఇట్నించిటు జంప్ చేసే విద్యార్థులెందరో ఉన్నారు.

ఇంటర్మీడియట్ దశలో వివిధ దుష్ప్రభావాలకి లోను కాని వారికిహ తిరుగుండదు. దూసుకుపోతారు. ఆ ప్రభావాల శ్లేష్మంలో పడ్డవారు గిరికీలు కొడుతూ ఎటూ గాకుండా పోతారు.

తల్లిదండ్రులు అత్యధిక శ్రద్ధ తీసుకోవాల్సింది ఈ సంధి దశలోనే. పిల్లలకి అనుమానం రాకుండా నిఘావేసి ట్రాక్ తప్పకుండా చూడటం అత్యవసరం!

కలలు కనండి

బంగారు వర్ణపు కలలు కనే వయస్సిది.

'కలలు కనండి. వాటిని నిజం చేసుకోండి' అన్నారు అబ్దుల్ కలాం. కలలు కనక పోవడం నేరం అని కూడా అన్నారు.

జీవితం గురించి లక్ష్యాల గురించి ఆశయాల గురించి భవిష్యత్తు గురించి తీయని కలలు కనండి. కాని కలల్లో విహరిస్తూనే వుండొద్దు. వాటిని నిజం చేసుకోవాలి. విజయాన్ని చేజిక్కించుకోవాలి.

విజయం తేలిగ్గా రాదు కదా. అందుకు కష్టపడాలి. కృషి చెయ్యాలి. శ్రమించాలి. లక్ష్యం మీద దృష్టి నిలిపి సాధన చెయ్యాలి.

తల్లిదండ్రుల గురువుల స్నేహితుల పెద్దల సలహాలను వినాలి. ఆచరించాలి.

మనస్సుని ప్రక్కదారి పట్టనివ్వకూడదు. కళ్ళకు గంతలు కట్టబడిన గుర్రంలా మనస్సుకి గంతలు కట్టుకుని లక్ష్యం వైపు పరుగుపెట్టాలి.

మనసావాచా కర్మణా ప్రయత్నిస్తే చాలు మీ లక్ష్యం మీ చేతికంది తీరుతుంది. మీరు విజయులై తీరతారు.

కృషి పట్టుదల దీక్ష లేనట్లయితే మీ కలలు పగటి కలలుగా మిగిలిపోవడం ఖాయం!

కీలక దశ

పిల్లల జీవితాలని పెద్ద మలుపు తిప్పే గొప్పదశ యౌవనదశ. అత్యంత ప్రమాద కరమైన దశ కూడా ఇదే.

ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు – నెలకొనేది ఇప్పుడే.

సత్ప్రవర్తన, చక్కని అలవాట్లు నేర్చుకునేదీ దురలవాట్లకు లోబడేదీ ఈ వయస్సులోనే.

ఇంటి నుంచి బయటపడి విశాల ప్రపంచంలో అడుగుపెడతారు. విప్పారిత నేత్రాలతో చుట్టూ పరికిస్తారు. ఆనందపడతారు. అబ్బురపడతారు. ఏవేవో సాధించాలన్న తపనకి లోనవుతారు.

పక్షుల్లా స్వేచ్ఛగా ఎగిరిపోవాలని ఆశిస్తారు. అందరూ తమని పొగడాలని అన్నిటా గెలవాలని ఉవ్విళ్ళూరతారు. ఉత్సాహం ఉరకలేసే దశ ఇది.

విద్యని ఔపోసన పడతారు. ఎన్నో పుస్తకాలు చదువుతారు. ఎన్నో రకాలు కోచింగులు తీసుకుంటారు. జ్ఞానపానం చేసే దశ.

అన్యాయాల్ని అక్రమాల్ని సహించి వూరుకోరు. ఎదురుతిరుగుతారు. నెత్తురు మండే దశ.

స్నేహితుల ప్రభావంలో తేలిగ్గా పడిపోతారు. గాజుముక్కల్ని చూసి వజ్రాలని భ్రమిస్తారు. ఆవేశం అధికమై అడవులు పట్టుకుపోతారు. ఆత్మాహుతికీ సిద్ధపడతారు.

లేదా దురలవాట్లకి లోనై ఈజీ మనీ కోసం వెంపర్లాడతారు. చదువుమాని పోకిరీలుగా దొంగలుగా మారతారు. సంక్లిష్ట దశ!

వైఫల్యం తట్టుకోలేరు

యుక్త వయస్సులో పిల్లలు చాలా సెన్సిటివ్‌గా వుంటారు. చిన్నపాటి అపజయాన్ని కూడా తట్టుకోలేరు.

చదువులో కాదు ఆటల్లో కాదు – ఎందులోనైనా సరే ఓటమి వారిని కుదిపేస్తుంది.

చిన్నపాటి ఎదురుదెబ్బకి కూడా కృంగిపోతారు. సిగ్గుతో మొహం చాటేస్తారు. అవమానం అవహేళన అపనింద అపజయం భరించలేరు. బాధతో సుళ్ళు తిరుగుతారు.

సరిగ్గా తినరు, నిద్రపోరు. నలుగుర్తో కలవరు. ముఖం చాటేస్తారు. కోపం చిరాకు పరాకు లెక్కువవుతాయి. తామెందుకూ పనికిరానివారమని డీలా పడతారు. ఆత్మహత్య ప్రయత్నాలూ చేస్తారు లేదా ఇంట్లోంచి పారిపోతారు.

వారి ఆదుర్దాను ఆందోళనను తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. ప్రేమతో ఆదరణతో ధైర్యం చెప్పాలి. నడిచే క్రమంలో తప్పటడుగులు తప్పవని నచ్చచెప్పి మళ్ళీ మునుపటి

స్థితికి తీసుకురావాలి. డిప్రెషన్లోంచి బయటపడేసి ఆశావహ దృక్పథం కల్గించాలి. ఆత్మహత్య పాపమని చావు పరిష్కారం కాదని నచ్చచెప్పాలి.

ఆపోజిట్ సెక్స్‌తో స్నేహం

యౌవన దశలో ఆపోజిట్ సెక్స్ మీద ఆసక్తి పెంచుకోవడం, కుతూహలంగా చూడటం, స్నేహం చెయ్యాలని ఉబలాటపడటం సహజ పరిణామం.

అబ్బాయిలు అమ్మాయిల్ని దొంగచూపులు చూస్తారు. వారి కబుర్లన్నీ వీరి చుట్టూనే తిరుగుతూంటాయి.

అమ్మాయిలూ తక్కువకాదు. క్రీగంట చూస్తూనే అమాయకత్వం నటిస్తూనే అబ్బాయిల స్నేహానికి ఆసక్తి చూపుతారు.

పార్టీలకూ పిక్నిక్కులకూ టూర్లకూ ఇద్దరు ఎవర్రెడీ.

చేతులు తాకించడం, ప్రకప్రక్కన కూర్చోడం, ఏరా ఒరే అన్నంత చనువుగా మాట్లాట్టం, బైక్ ఎక్కడం. క్లాసులకు డుమ్మా కొట్టి కలిసి మ్యాటీ్న కెళ్ళడం, బేకరీల్లో కాఫీ షాపుల్లో ఆడామగా గుంపులుగా వెళ్ళి కబుర్లాట్టం – చాలా మంది టీన్స్ లక్షణాలు!

అందమూ సమస్యే

యౌవనంలో ఉన్న యువతీ యువకులు అప్పుడే వికసించిన పుష్పాల్లా అందంగా ఆకర్షణీయంగా ఉంటారు. వింత శోభతో వెలిగిపోతారు.

అయినా గాని అమ్మాయిలూ అబ్బాయిలూ మరింత అందంగా కన్పించాలని తాపత్రయ పడతారు. రకరకాల సౌందర్య సాధనాలు వాడతారు. ఆకర్షించే ఫాషన్ దుస్తులు ధరిస్తారు.

అబ్బాయిలకన్నా అమ్మాయిలు సౌందర్యానికి అధిక ప్రాముఖ్యతనిస్తారు. ఏ కారణం వల్లనైనా శరీరాంగాలు సరిగ్గా పెరగకపోతే ఇతరుల్తో పోల్చుకుని కృంగిపోతారు.

అందంగా లేకపోతే మగపిల్లలు తమవంక చూడరేమో స్నేహంగా ఉండరేమో బాడ్ కామెంట్స్ చేస్తారేమోనని భయపడ్తారు. దాంతో అధిక చొరవ ప్రదర్శిస్తారు. తమలోని ఇతర ప్లస్ పాయింట్లు గుర్తించాలని ఆశపడ్తారు.

అందం అభిలషణీయమేగాని శారీరక సౌందర్యం కన్నా మానసిక సౌందర్యం మిన్న అని గమనించడం అవసరం. అందంగా లేరని డిప్రెషన్‌కి లోనవ్వకుండా ఆ లోటుని ప్రతిభతో విజయాలతో అధిగమించాలి.

క్రేజీ థింగ్స్

మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన యూత్‌కు సంబంధించిన ప్రతి సరుకూ వారికే కావాలి. ప్రతి ఫాషన్ వస్తువూ వారే కొనాలి. ప్రతి గేమ్ వారే ఆడాలి. కొత్త సినిమా మొదటి రోజునే చూడాలి.

ఇవాళ కెమేరా గల సెల్‌తో తిరుగుతారు. రేపు ఐపాడ్‌తో దర్శనమిస్తారు.

మెలొడి సాంగ్స్ కావాలి. ఫాస్ట్ బీటూ కావాలి.

అమితాబ్ బచ్చన్‌ని ఆరాధిస్తారు. మహేష్‌బాబంటే పడిఛస్తారు.

విద్యాబాలన్‌ని లైక్ చేస్తారు. ఇలియానాని వర్షిప్ చేస్తారు.

పూతరేకులూ కావాలి పిజ్జాలూ కావాలి.

సినిమా తారలన్నా క్రికెట్ వీరులన్నా పాప్ సింగర్సన్నా వీరాభిమానం. వారి ఫోటోలు పెద్ద సైజులో వీరి గది గోడల మీద దర్శనమిస్తాయి.

ఆటలాడకపోయినా క్రికెట్‌ని పిచ్చిగా చూస్తారు. ఆనందిస్తారు.

ఫోన్‌లో ఎంతసేపు మాట్లాడతారో ఏం మాట్లాడతారో వారికే తెలీదు. ప్రతీదీ వారికే కావాలి. వారికి అనవసరమైందేదీ ఈ భూమ్మీద ఉండదు!

ఇహ ఫాషన్లంటే వెర్రిప్రేమ. అదెన్ని రకాలో చెప్పలేం!

రియల్లీ క్రేజీ యూత్!

కాలేజీ రొమాన్స్

సినిమాల ప్రభావం యువతరం మీద అధికంగా ఉంది.

యౌవనం ఉరకలెత్తే వయస్సులో కాలేజీకి వస్తారు. వయస్సు ఆకర్షణకి ప్రేమ అని పేరు పెట్టుకుంటారు. జంట షికార్లు, సినిమాలు, ఫోన్లు, డిస్కోలు, పబ్‌లు, గిఫ్ట్‌లు – అబ్బో ఓ వెలుగు వెలుగుతారు.

అదృష్టానికీ ఆనందానికీ తామే ఏకైక వారసులమనుకుంటారు.

తర్వాత 'సారీ పెళ్లి ఉద్దేశం లేదు' 'ఎంజాయ్ అండ్ లీవిట్ యార్' 'మావాళ్ళు ఒప్పుకోరు మర్చిపో' 'మనం జస్ట్ ఫ్రెండ్సం' లాంటి డైలాగ్స్!

కొందరు ఆ డైలాగ్సు కూడా లేకుండా సడన్‌గా అదృశ్యమైపోతారు.

అతికొద్ది మాత్రం సాహసం చేసైనాసరే ప్రేమ దక్కించుకోవాలనుకుంటారు.

పారిపోతారు. పెళ్లి చేసుకుంటారు. వాస్తవం తాలూకు ఒక దెబ్బ తగిలేసరికి దిమ్మ తిరుగుతుంది. వెనకడుగు వేయలేక అయిన వాళ్ళకి ముఖం చూపలేని స్థితి. పలాయనమైనా చిత్తగిస్తారు అఘాయిత్యానికైనా తలపడతారు.

ప్రెషర్స్‌డేలు, ఫ్రెండ్‌షిప్ డేలు, స్టడీ టూర్స్, పిక్నిక్‌లు, యాన్నివర్సరీలు... కలిసి మసిలే అవకాశాలెన్నో! మూడు నాలుగేళ్ళ బాటు ఒకేచోట చదివేప్పుడు అబ్బాయిలు అమ్మాయిల మధ్య 'ఆకర్షణ' 'క్రష్' 'ఇష్టం' 'ఆరాధన' 'ప్రేమ' లాటివి సహజం. కాని వాటిల్లో సీరియస్‌నెస్ ఉండదు.

కారణం - ఒత్తిడి, పోటీ, లక్ష్యసాధన, భయం, సంస్కృతి!

వయస్సు చాలదు

నిజానికి కాలేజీ దశ ప్రేమించే వయస్సుకాదు. ప్రేమని అర్థం చేసుకోలేరు. ప్రేమంటే పెద్ద బాధ్యత. మరొకరి మీద ఆధారపడి చదువుకుంటున్న వారు ఆ బరువుని మోయలేరు.

యువత పసి ప్రేమలకూ పప్పీప్రేమలకూ దూరంగా ఉండాలి. చదువు ఉద్యోగం ఉపాధి మీద దృష్టిపెట్టాలి. ఆర్థిక భద్రత చేకూర్చుకోవాలి. అంతదాకా పెళ్లి జోలికి పోకూడదు.

ఒకవేళ ప్రేమ భావన నిజంగా కుదిపేస్తే జీవితంలో స్థిరపడే వరకూ వేచి ఉండగలగాలి. ఆలోగా భవిష్యత్ సౌధ నిర్మాణం మీద సర్వశక్తులూ కేంద్రీకరించాలి.

స్నేహం ప్రేమ ముసుగులో శారీరక వాంఛలు తీర్చుకోజూసే వారెక్కువగా ఉంటారు. ప్రేమిస్తున్నప్పుడు సెక్స్‌లో తప్పేముందనుకుంటారు. పర్యవసానం ప్రమాదకరంగా మారొచ్చు. విడిపోతే బ్లాక్ మెయిలింగుకీ హత్యలకీ దారితీయవచ్చు.

వివాహానికి ముందు సెక్స్ సంబంధం విపత్కర పరిస్థితికి దారి తీస్తుంది. అలాటి సంబంధాన్ని మన సమాజం సంస్కృతీ హర్షించవు! జాగ్రత్త!

మార్గదర్శకత్వం

ఎదుగుతున్న పిల్లల చుట్టూ గిరిగీసి అందులోనే ఉండాలని తల్లిదండ్రులు శాసించకూడదు. వారిలో ఉండే తిరుగుబాటు మనస్తత్వం వల్ల ఎదురు తిరుగుతారు.

వారాశించే గైడెన్స్ ఇస్తూనే సరైన దారిలో నడిచేలా చూడాలి. చిన్న చిన్న పనులప్పగిస్తే వారిలో కార్యదక్షత పెరుగుతుంది. సరిగ్గా చెయ్యలేకపోతే విమర్శించకుండా ఇంకా బాగా ఎలా చెయ్యొచ్చో వివరించాలి. అంతే తప్ప హేళన చెయ్యొద్దు. బాధించవద్దు.

పిల్లలకి పెద్దల మాటలూ అభిప్రాయాలూ నమ్మకాలూ విలువలూ ఒక ట్రాష్‌లా బూజు పట్టినవిగా అన్పిస్తాయి. నేటి పెద్దలూ ఒకప్పుడు అలాటి దశలో వున్న వారే గనుక వారినీ వారిలో వచ్చే మార్పుల్నీ సహృదయంతో అర్థం చేసుకోవాలి.

సామాజిక మార్పుల్ని ప్రథమంగా ఆహ్వానించేది యువతే. వేగంగా మారుతున్న సాంకేతిక ప్రగతిని అంది పుచ్చుకునేదీ వారే.

వారి ఆలోచన్లు అలవాట్లు కొన్ని క్రేజీ పనులు – కొంత చిత్రంగా స్పీడుగా పిచ్చిగా మూర్ఖంగా అన్పించినా భరించాలి.

చదువుని నిర్లక్ష్యం చెయ్యనంతవరకు చెడు అలవాట్లు నేర్చుకోనంతవరకూ వారి స్వేచ్ఛకి అడ్డు రాకూడదు.

పిల్లల మీద అధిక ఒత్తిడి తెస్తే పరిస్థితి వికటించవచ్చు. వారి స్నేహితులుగా, సైకాలజిస్టులుగా, సెక్స్ కౌన్సిలర్లగా, కెరీర్ అడ్వైజర్లుగా మారితేనే వారికి మార్గదర్శకులు కాగలరు! వారు మీ గైడెన్స్‌ని ట్రూ స్పిరిట్‌తో స్వీకరించగలరు!

బంగారు భవిత

'యౌవనంబు భోగంబుల కెల్ల నాస్వదంబు...' అన్నారో పూర్వకవి.

వయస్సు పొంగులో ఉన్నప్పుడే మనిషిలో ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. ఉత్సాహం ఉరకలేస్తుంది. ఎంతక్లిష్ట కార్యాన్నయినా సవాలుగా తీసుకుని పరిష్కారించాలనే పట్టుదల ఉంటుంది.

అన్యాయాల్ని సహించలేరు. మోసాన్ని భరించలేరు. మాయామర్మం ఉండకూడదంటారు. ఋజువర్తనాన్ని కోరతారు.

ఆ భావోద్వేగాల్ని సరైన విధంగా వెంటిలేట్ చెయ్యాలి. ఛానలైజ్ చేసుకోవాలి. సంయమనం పాటించాలి. ఊరికే ఆవేశపడటం రెచ్చిపోవడం గాక ఓర్పుతో వ్యవహరించాలి. మార్పు ఒక్కరి వల్లో ఒక్కరోజు లోనో రాదని అదొక నిరంతర యజ్ఞం ద్వారానే సంభవమని గ్రహించాలి.

విద్యని అశ్రద్ధ చెయ్యకూడదు. సత్ప్రవర్తన నేర్చుకోవాలి. సంస్కారవంతంగా వ్యవహరించాలి. ఉత్తమ లక్షణాలు అలవర్చుకోవాలి. ఆటపాటల్లో కౌశలం ప్రదర్శించాలి. కళల్లో ప్రవేశించాలి.

ఇవాళ వేసే ప్రతి అడుగు యొక్క ప్రభావం భవిష్యత్తు మీద ఉంటుంది.

చెడు తిరుగుళ్ళు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి. నేరమస్తత్వాన్ని మొగ్గలోనే త్రుంచెయ్యాలి. అడ్డదార్లు అక్రమమార్గాలు తొక్కితే జైలుగోడల మధ్య బంగారు బతుకు శిథిలమయ్యే ప్రమాదముంది.

విజ్ఞానం వ్యక్తిత్వం సామర్థ్యం – ఎంత వృద్ధి చేసుకుంటే మీ భవిష్యత్తు అంత ఉ జ్వలంగా ఉంటుంది.

మంచి పుస్తకాలు చదవాలి. లలిత కళల మీద అభిరుచి పెంచుకోవాలి. ముఖ్యంగా స్నేహితుల్ని సంపాదించుకోవాలి.

మీ మీద మీ కుటుంబం, సమాజం, దేశం యొక్క భవిత ఆధారపడివుంది. లక్ష్యం ఉ న్నత మైందైతే చాలదు దానిని సాధించే మార్గమూ ఉన్నతంగా ఉండాలన్న గాంధీజీ పలుకులు శిరోధార్యం కావాలి!

ఇంజనీరింగ్ మెడిసినే గాక ఎన్నో ప్రొఫెషనల్ కోర్సులు, మేనేజ్‌మెంట్ కోర్సులు ఎన్నో ఎన్నో ఉన్నాయి. మీ ఆసక్తినీ పెద్దల సలహానీ కలబోసి కెరీర్ ఎన్నుకోవాలి!

యువతరంగం

పాశ్చాత్య దేశాల్లో వారికంటే మన యువత భిన్నమైందని చెప్పాలి.

అభివృద్ధి చెందాలి, సంపాదించాలి – అనే ఆలోచన, తపన, తాపత్రయం, పట్టుదల వీరిలో ఎక్కువ.

సినిమాలు పబ్‌లు డిస్కోలు అంటూ తిరిగి రిలాక్స్ అవుతున్నా మూలాల్ని మరవటం లేదు. లక్ష్యాన్ని నిర్లక్ష్యం చెయ్యట్లేదు.

సంస్కృతిని కుటుంబ సంబంధాలని ఆధ్యాత్మిక భావనల్ని గౌరవిస్తున్నారు.

చిన్న వయస్సులో పెద్ద పెద్ద జీతాలు సంపాదిస్తోన్న సాఫ్ట్‌వేర్ నిపుణుల్ని చూడండి. శ్రద్ధగా డ్యూటీ చేస్తున్నారు. విదేశీయుల ప్రశంసలందుకుంటున్నారు. వీకెండ్స్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. యోగాపట్ల ఆకర్షితులవుతున్నారు. గురు రవిశంకర్, బాబా రామ్‌దేవ్, మాత అమృతానందమయి వంటివారి బోధనలు వింటున్నారు. అనాథ శరణాలయాలకు విరివిగా విరాళిలిస్తున్నారు.

అంటే రిలాక్సేషన్‌ని మానసిక ప్రశాంతతని సంతృప్తిని కోరుకుంటున్నారు.

సాఫ్ట్‌వేర్, మాన్యుఫాక్చరింగ్, మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, మార్కెటింగ్, మీడియా – ఒకటేమిటి అన్ని రంగాల్లోనూ దూసుకుపోతోంది యువత.

ఉవ్వెత్తున ఎగిసిపడుతోన్న యువతరంగానికి హేట్సాఫ్!

సంక్లిష్ట దశ

20 ఏళ్ళ నుండి 35 సం. వరకు గల దశ మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైంది. కీలకమైంది. భవిష్యత్తుని నిర్దేశించే ప్రాయం!

విద్య పూర్తవుతుంది. ఉన్నత విద్య సైతం ముగించి వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడటానికి ప్రయత్నిస్తారు. కృతకృత్యులవుతారు.

వివాహం అవుతుంది. తోడు లభిస్తుంది. కుటుంబం ఏర్పడుతుంది. సంతానమూ కలుగుతుంది.

వృత్తిజ్ఞానం, శక్తి, సామర్థ్యం, ఆరోగ్యం, ఉత్సాహం, ఆశావాదం, ఆత్మవిశ్వాసం – తారస్థాయిలో ఉంటాయి. వయస్సు పరుగు పెట్టిస్తుంది.

స్వేచ్ఛగా స్వతంత్రంగా ప్రవర్తిస్తారు. సమస్యల్ని అవలీలగా ఛేదిస్తారు.

చకచకా అందలాల్ని అధిరోహిస్తారు.

చదువు ఉద్యోగం పెళ్లి – జీవితానికి మూలధాతువులు. వీటి గురించి ఈ వయస్సులో అధిక ఆందోళన, ఒత్తిడి, విఫల భయం ఎదుర్కొంటారు. దీన్నే క్వార్టర్ లైఫ్ క్రైసిస్ అంటారు.

ఇది దాటి ఆ మూడింట్లో విజయులైతే జీవితంలో స్థిరపడినట్టే!

కొందరు మాత్రం సరైన విద్య పొందక ఎటూ రాణించలేక ఎందులోనూ స్థిరపడలేకుండా ఉంటారు. ఆవేశం, ఉద్రేకం, కసితో రగిలిపోతారు. దారి తప్పుతారు. ఇసుకలో పోసిన పన్నీరవుతారు.

ఇంకొందరు 'షార్ట్‌కట్స్' వైపు మరలుతారు. ఈజీమనీ కోసం అత్యాశ పడతారు. దొంగతనాలు, మోసాలు మొదలైన నేరప్రవృత్తి అలవర్చుకుంటారు. తమ జీవితాల్నీ తమవారి జీవితాల్నీ అభద్రతకు లోను చేస్తారు.

యువత నిర్వీర్యంగాకుండా చూడాలి. ఉత్తేజిత శక్తిగా మార్చాలి. సామాజిక స్రవంతిలో మమేకం చెయ్యాలి.

ఈ బాధ్యత తల్లిదండ్రులది. కుటుంబానిది. సమాజానిది. దేశానిది!

65

నడి వయస్సు

మధ్యందిన మార్తాండుడు ఎంత శక్తి, తీక్షణత, వేడి, వెలుగు కలిగి ఉంటాడో అంతటి తేజోవంతమైన దశ నడి వయస్సు.

ముప్ఫై ఐదేళ్ళు పైబడి యాభయ్యేళ్ళలోపు వారంతా ఈ కేటగిరీలోకే వస్తారు.

ఈ పదిహేనేళ్ళే మనిషి జీవితంలో ఉచ్ఛదశ.

బాల్య యౌవనాలను దాటేసి వివాహితులై జీవితంలో స్థిరపడే సరికి నడివయస్సు మొదలవుతుంది. మనిషి యొక్క అన్ని రకాల గ్రాఫ్‌లూ పైపైకి దూసుకుపోతాయి.

ఆరోహణ పర్వం ఆరంభమవుతుంది.

ఒక స్థాయికి దూసుకు పోయేక అలసట మొదలవుతుంది. శక్తి సన్నగిల్లుతుంది. దాంతో ఆరోహణ అంతమై అవరోహణ ప్రారంభమవుతుంది. నడివయస్సు ముగుస్తుంది. వృద్ధాప్యం తలుపు తడుతుంది!

వైవాహిక జీవితం

నల్లేరు మీద బండి నడకలా సాగుతూంటుంది వైవాహిక జీవితం.

పెళ్లై అయిదారేళ్ళు దాటి ఉంటాయి గనుక భార్యాభర్తలిద్దరూ ఒకరి గురించొకరికి పూర్తిగా తెలుస్తుంది.

పెళ్లైన కొత్తలో ఇబ్బంది పెట్టిన అభిప్రాయభేదాలు, ఇష్టాయిష్టాలు, అలవాట్లు, ఇగోలు, ఆధిక్యతా ప్రదర్శనలు వగైరాలన్నీ సర్దుకుంటాయి. పాలు నీళ్ళలా కలిసిపోతారు. కలసి ఆలోచించడం కలిసి ఆచరించడం మొదలవుతుంది.

ఉడుకూ వేగం ఆవేశం తగ్గు ముఖం పడతాయి. అంచేత సంసారంలో తేడాపాడాలొస్తే వెంటనే సర్దుకుపోతారు. పరిష్కరించుకుని తేలిక పడిపోతూంటారు.

దాంపత్య సుఖాన్ని తృప్తిగా అనుభవిస్తూ పిల్లల్ని కంటూ వారిని పెంచి పెద్ద చేస్తూ ఇంటిని దిద్దుకుంటూ ఉంటారు.

పిల్లల ఆరోగ్య సమస్యలు కొన్ని సందర్భాలలో ఆర్థిక ఇబ్బందులు తప్ప మరేమీ ఉండవు.

వారి ఆలోచనల్లో ప్రవర్తనల్లో నిర్ణయల్లో పరిణతి ఉంటుంది.

కుటుంబ జీవనం

తల్లిదండ్రులు వృద్ధులవుతారు గనుక వారి ద్వారా సమస్యలు రావు. అత్తరికం, ఆడబడుచు మూతి విరపులు వెలిసిపోతాయి.

వీరి ఆదరణ పై ముసలివాళ్ళుంటారు. పెత్తనం వీరిదే గనుక వీరి మాటే చెల్లుతుంది.

పిల్లల కోసం ఎక్కువ సమయం ఎక్కువ ఆదాయం వినియోగిస్తారు. వారిని పెంచటమే లక్ష్యమైపోతుంది.

స్వంత ఇల్లు ఏర్పరచుకుని సంబరంగా గృహప్రవేశం చేస్తారు.

మా ఇల్లు మా పిల్లలు – అనే అనుబంధంతో కుటుంబం కళకళలాడుతూంటుంది.

ఆర్థిక పరిస్థితి

ఉద్యోగంగాని వ్యాపారంగాని వ్యవసాయంగాని – ఏదైనా ఒక స్థిర ఆదాయం ఏర్పడి ఉంటుంది.

రెండు చేతులా సంపాదించేంత స్థాయిలో స్టామినాతో ఉంటారు. కెరీర్ కోసం సంపాదన కోసం రేయింబగుళ్ళు శ్రమపడటానికి వెనుకాడరు.

పొదుపు చేస్తారు. వివిధ ఆస్తుల మీద పెట్టుబడి పెడతారు.

పిల్లలకు చక్కని విద్య అందేట్లు చర్య తీసుకుంటారు. ఇంట్లోకి కావాల్సినవి కొంటూ అందర్నీ ఆనందపరుస్తారు.

పిల్లలు పెద్ద వారయ్యే సరికి ఖర్చులు పెరుగుతాయి. అయినా ఇబ్బంది పడాల్సిన అవసరముండదు. ఆదాయమూ గణనీయంగా పెరుగుతూంటుంది.

భద్రత చేకూరుతుంది

ఎప్పుడైతే ఆర్థిక స్థిరత్వం చేకూరిందో కుటుంబం వెన్నుదన్నుగా ఉందో ఆలుమగలిద్దరూ కూడా సంపూర్ణ భద్రత ఫీలవుతారు.

కొందరు మాత్రం నిరుద్యోగులుగా ఉంటారు. ఎలాంటి ఉపాధీ కల్పించుకోలేకపోతారు. చంచలంగా వ్యవహరిస్తారు. వారు మాత్రం అభద్రతతో కొట్టు మిట్టాడతారు.

అలాటివారు ఫాల్స్ ప్రెస్టేజ్‌కి స్వస్తి చెప్పాలి. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అలవర్చుకోవాలి. అర్హతలకి తగిన ఉపాధి దొరక్కపోవచ్చు. కాని అందుబాటులోఉన్న వనరుల్ని ఉపయోగించుకుంటే స్వయం ఉపాధి కల్పించుకోవటం కష్టంకాదు. పట్టుదల ఉంటే చాలు త్వరితంగా జీవితంలో స్థిరపడి పోతారు.

బ్యాంకులూ ప్రభుత్వమూ ఎన్నెన్నో పథకాల ద్వారా చేయూతనిస్తున్న సంగతి తెలుసుకోవాలి. వినియోగించుకోవాలి.

పిల్లలు పుట్టేప్పటికి ప్రతివారూ ఆర్థిక స్థిరత్వం, చక్కని సంపాదన కలిగి ఉండటం అనివార్యం.

విజయ పరంపర

శక్తివంచన లేకుండా పని చేస్తారు. అధిక శ్రమకి సిద్ధపడతారు. చురుగ్గా సవ్యంగా పనులు చక్కబెడతారు. నిజాయితీగా వ్యవహరిస్తారు. కష్టించి పనిచేసి పైకి రావాలని విశ్వసిస్తారు. ఆరోగ్యమూ వారికి చేదోడుగా ఉంటుంది.

ఈ సుగుణాలు ఉద్యోగంలో గాని వ్యాపారంలోగాని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళి తీర్తాయి.

ప్రమోషన్లొచ్చి చక చకా మెట్లెక్కేస్తారు.

వ్యాపారులు విస్తరణ పథకాలు చేబడతారు.

ఇంకా ఇంకా ఎదగాలి, సాధించాలి – అంటూ విజయం ఇచ్చిన ఉత్తేజంతో దూసుకుపోతారు.

అదే సమయంలో అడ్డదారుల్లో అవినీతి మార్గాల్లో సంపాదించాలనుకోవద్దు. పన్నులు ఎగ్గొట్టాలని చూడొద్దు. నీతినీ నిజాయితీని నమ్ముకున్నప్పుడే మీది ఆనందకర విజయం, భయం ఆందోళన లేని విజయం అవుతుంది!

వైఫల్యాలూ ఉంటాయి

అందరికీ విజాయాలే దక్కవు. వైఫల్యాలూ పలకరిస్తాయి.

ఉద్యోగంలో గుర్తింపు రాదు. జాబ్‌శాటిస్‌ఫాక్షన్ ఉండదు. తృప్తికరమైన జీతమూ లభించదు.

వ్యాపారంలో రాణించరు. భాగస్తులు మోసం చేస్తారు. లేదా అనుభవహీనత శాపమవతుంది. నష్టాలపాలవుతారు.

అలాటప్పుడు నిరాశా నిస్పృహలకి లోనవుతారు. అసంతృప్తితో వ్యసనాల బారిన పడతారు. ఆత్మహత్యాయత్నాలు చేస్తారు.

ఇటువంటి పరిస్థితుల్లో ఏర్పడే మానసిక ఆందోళనను 'మిడ్‌లైఫ్ క్రైసిస్' అంటారు.

వారినీ వారి మానసిక స్థితినీ కుటుంబం అర్థం చేసుకోవాలి. ఆదరించాలి. అక్కున చేర్చుకోవాలి.

కొత్త ఆశల్ని రేపాలి. ధైర్యం చెప్పాలి. ఊతమివ్వాలి.

అవసరమైతే ఉద్యోగం లేక వ్యాపారం మార్చుకోవాలి. కొత్త అవకాశాలను వెదుక్కోవాలి. క్రొంగొత్త పథకాలు చేబట్టాలి. శ్రేయోభిలాషుల సలహా సహకారాలు స్వీకరించాలి.

అనుభవం, నేర్పు, సమర్థత ఉంటాయి గనుక తేలిగ్గానే అందుకు పోగలుగుతారు. ఆశించినంత స్థాయిలో గాకపోయినా చాలావరకు సక్సెస్ కాగలరు.

బాధ్యతల మయం

నడి వయస్సు యావత్తూ బాధ్యతలతో నిండి ఉంటుంది. దానికి ముందూ తర్వాత బాధ్యతలుండవని కాదు. ఈ దశలో వాటి గాఢత హెచ్చు.

వార్ధక్యంలో ప్రవేశించిన తల్లిదండ్రులకు కొండంత అండగా ఉండాలి. వారికి ఏ లోటూ రాకుండా చూసుకోవాలి. ప్రేమగా ఆదరించాలి. వారు తరచూ అనారోగ్యం పాలవుతూంటారు గనుక ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుంది.

పిల్లల చదువుసంధ్యలు ముఖ్యబాధ్యత. వారికి చక్కని విద్యాబుద్ధులు నేర్పించాలి. ఉన్నత విద్య చెప్పించాలి. చదువులెంతో ఖరీదైన ఈ రోజుల్లో అది ఎంతో బరువైన బాధ్యత.

అయినా ఏ తండ్రీ కూడా వెనుకంజ వెయ్యట్లేదు. అప్పోసప్పో చేసి అవసరమైతే ఆస్తి అమ్మి అయినా సరే ప్రొఫెషనల్ విద్యని అందిస్తున్నారు. విదేశాలకు పంపిస్తున్నారు.

ఆడపిల్ల, మగపిల్లాడు అన్న భేద భావం చూపకుండా ఇద్దర్నీ సమాన దృష్టితో చదివించడం ఈ తరం పేరెంట్స్ యొక్క గొప్పతనమే.

చదువయ్యాక ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడే వరకూ తల్లిదండ్రులకు టెన్షనే.

ఆ తర్వాత పెళ్లి బాధ్యత.

తగిన వధువు లేక వరుని ఎంపిక చెయ్యడం శ్రమతో కూడుకున్న పని. చిన్న తప్పు లేక అశ్రద్ధ కనబర్చినా దాని ప్రభావం పిల్లల భవిష్యత్తు మీద పడుతుంది. అందుకని ఆచితూచి అన్నీ పరీక్షించి సంబంధం నిశ్చయించాలి. నాలుగక్షింతలు వేశాకే 'హమ్మయ్య' అని నిట్టూరుస్తారు.

కట్న కానుకలకూ పెళ్లిఖర్చులకూ చాలా సమకూర్చాల్సి వస్తుంది. వెనుక ఆస్తులుంటే ఫరవాలేదుగాని లేనప్పుడు పెళ్లి అప్పుల్నుంచి బయటపడటానికి చాలా టైమ్ పడుతుంది!

వ్యసనాలకి దూరం

కుటుంబ బరువు బాధ్యతలు భుజాన పడతాయి. ఇంటికి యజమాని అవుతారు. పెద్దలా వ్యవహరించక తప్పనిసరి పరిస్థితి. అంచేత ఈ వయస్సులో ఎక్కువగా వ్యవసనాలకి దూరంగా ఉంటారు. అది అనివార్యం.

లేకపోతే వారి ఆర్థిక పరిస్థితి తల్లక్రిందులవ్వొచ్చు. పిల్లల మీద వ్యసనాల ప్రభావం పడొచ్చు. ఇంట్లో అశాంతికి దారితీయవచ్చు. సమాజంలో పరువు మర్యాదలు కోల్పోవలసి రావచ్చు.

అంచేత దుర్వ్యసనాలకు దూరంగా జరిగి తీరాలి. అంతేకాదు. కోపం, అసూయ, అత్యాశ, పగలాంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత క్షేమం! సుఖం!

కొందరు అత్యాశకు పోతారు. ఒక్కసారే అధిక డబ్బు సంపాదించాలని చూస్తారు. కుటుంబం కోసమే అని చెప్పి తమని తాము మోసం చేసుకుంటారు. పేకాట, గుర్రప్పందాలు, లాటరీలు – నమ్మి వాటి చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. కడకి ఇల్లూ ఒళ్ళూ గుల్ల చేసుకుంటారు.

అలాంటి దయనీయ స్థితిలో పడకుండా విజ్ఞతతో దూరదృష్టితో వ్యవహరించాలి.

టెన్షన్లు వద్దు

డబ్బు సంపాదించాల్సిందే. అందుకు శ్రమపడాల్సిందే.

అలాగని మితి మీరిన ఒత్తిళ్ళకు లోను కాకూడదు.

ఉద్యోగులకు టార్గెట్లు పెడతారు. ఇంక్రిమెంట్ల ప్రమోషన్ల తాయిలాలు చూపిస్తారు. పని భారం పెంచుతారు. ఒత్తిడీ అధికం చేస్తారు. పిచ్చిగా పరుగెత్తేలా చేస్తారు.

యజమానుల 'లాభాల క్రీడ' లో పడకూడదు. బ్రతుకుకీ బ్రతుకు తెరువుకీ మధ్య విభజన రేఖ గీసుకోవాలి.

బ్రతుకు తెరువు కావల ఎంతో బ్రతుకుంది. అది అశాంతిమయం కాకూడదు. కుటుంబ సంబంధాలని దెబ్బతీయ నివ్వకూడదు. అనుబంధాలనీ అనుభూతుల్నీ చక్కగా కాపాడుకుంటేనే జీవితం ఆనందమయమవుతుంది.

వ్యాపారంలో ఉన్నవారు కూడా అదే లోకమన్నట్టు ఉండకూడదు. దాని కెంత స్థానం, ఎంత సమయం ఇవ్వాలో అంతే ఇవ్వాలి. అదే జీవితం అనుకుంటే చాలా నష్టపోవాల్సి వస్తుంది. ఎన్నో అమూల్య క్షణాల్ని కోల్పోవాల్సి ఉంటుంది.

డబ్బు వేటలో పరుగుపెట్టి పెట్టి అలిసేక లేక రిటైరయ్యాక వెనుదిరిగి చూస్తే – ఎన్ని విలువైన మధురమైన అనుభవాలూ అనుభూతులూ మిస్సయ్యారో గ్రహించి 'అయ్యో' అని రోధిస్తారు. నైరాశ్యంతో కృంగిపోతారు.

అప్పుడిహ ఎవరూ ఏమి చెయ్యలేరు. కాలచక్రం వెనక్కి తిరగదు!

పొదుపు ఆవశ్యకత

ఉన్నత విద్య, పెళ్ళి, తీవ్ర అనారోగ్యం, ఉద్యోగం పోవుట, వ్యాపారంలో నష్టపోవుట – లాంటివెన్నో ఉపద్రవాలు రావచ్చు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోడానికి పొదుపు చాలా అవసరం.

భౌతిక సుఖాల కోసం భేషజాల కోసం 'అనవసర' 'మితిమీరి' ఖర్చులకు పోకూడదు. ఆదాయంలో సుమారు 20% నుండి 30% భవిష్యత్ అవసరాలకోసం పొదుపు చెయ్యడం తప్పనిసరి. అప్పుడే జీవితం ఒడిదుడుకుల్లేకుండా సాగిపోతుంది.

రేపటి కోసం

అన్ని రకాల ఉద్యోగాలకీ పెన్షన్ సౌకర్యం ఉండదు. వ్యాపారులకూ ఇతరులకూ ఉండదు.

రిటైర్ అయిన మరుక్షణం నుంచి జీతం ఆగిపోతుందని గుర్తుంచుకోవాలి.

అంచేత వారు వృద్ధాప్యం గురించి ముందు నుంచే కొంత శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలు ఆదరించొచ్చు. అలా అని వారి మీద పూర్తిగా ఆధారపడే స్థితి విద్యావంతులైన నేటి తల్లిదండ్రుల తెచ్చుకోకూడదు.

తగిన ఆర్థిక స్తోమతు, చక్కని ఆదాయం ఉంటుంది గనుక కొంచెం ముందు చూపు ప్రదర్శిస్తే చాలు ఎవరి దయా దాక్షిణ్యం అక్కర్లేకుండా గౌరవంగా హుందాగా బ్రతకొచ్చు.

సంపాదన బాగున్నప్పుడే వివిద ఇన్సూరెన్సు కంపెనీల వారి పెన్షన్ స్కీముల్లో చేరాలి. నెలనెలా లేదా ప్రతి ఆర్నెల్లకీ కొంత జమ చేస్తూ పోతే చాలు రిటైరయ్యాక లేక వృద్ధాప్యంలో నెలనెలా పెన్షన్ అందుకోవచ్చు.

అలాగే ఆదాయం తెచ్చే కొన్ని స్థిరాస్తుల మీద మదుపు చెయ్యాలి. ఆర్థిక భద్రతని చేకూరుస్తూ ఆదాయం తెచ్చిపెడుతూంటాయి.

వృద్ధాప్యం చీకూ చింతా లేకుండా గడవడానికి తగిన ఏర్పాట్లు ముందే చేసుకుంటే జీవితం ప్రశాంతంగా ముగిసిపోతుంది!

సంతృప్తికర స్థాయి

అన్ని రకాలుగానూ సంతృప్తికర స్థాయిని అందుకునేది నడివయస్సులోనే.

ప్రాథమిక అవసరాలు తీరతాయి. ఎమోషనల్ అవసరాలు తృప్తిపడతాయి. జీవిత భాగస్వామి, ఇల్లు, సంపాదన – అన్నీ అమరుతాయి.

పెద్దరికం వస్తుంది. స్వతంత్రంగా వ్యవహరిస్తారు. మార్పు కనుగుణగా మారగల్గుతారు. శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఇంట్లో ఆఫీసులో పిల్లల్తో ఎలాంటి సమస్యలొచ్చినా పరిష్కంచగల మెచ్యూరిటీ వస్తుంది.

సామాజిక సంబంధాలూ బాగుంటాయి.

బంధుమిత్రుల ఇళ్ళకి శుభాశుభాలకి వెళ్ళటం రావటం, సపోర్టుగా నిలవడం, గైడెన్స్ ఇవ్వడం జరుగుతుంది.

సేవా కార్యక్రమాలు చేబట్టడానికి ప్రయత్నిస్తారు. రక్తదానంలాంటివి నిస్సంకోచంగా చేసేస్తారు.

పూజలు చేస్తారు. గుళ్ళూ గోపురాలూ సందర్శిస్తారు.

తమకోసం కన్నా పిల్లలకోసం పిల్లల ఆరోగ్యం కోసం విద్యకోసం ఉన్నతి కోసం ఎక్కువగా మొక్కుకుంటారు. ప్రార్థిస్తారు.

ఇంటా బయటా సత్సంబంధాలతో సంతోషంగా ఉంటారు – సంతృప్తి కలిగి ఉంటారు.

శారీరక మార్పులు

సన్నసన్నగా శారీరక మార్పులూ ఆరోగ్య సమస్యలూ మొదలవుతాయి.

శ్రమలేని ఉద్యోగాల్లో ఉన్నవారు తగిన శ్రద్ధ తీసుకోకపోతే వ్యాయామం చెయ్యకపోతే అధిక బరువుకు లోనవుతారు. పొట్టమీద పిరుదుల్లో అధిక కొవ్వు చేరుతుంది.

ఆహారం, మానసిక పరిస్థితి, నిద్ర, విశ్రాంతి, ఒత్తిడి, అలవాట్ల ప్రభావం జీర్ణక్రియ మీద ఉంటుంది. చర్మం ముడతలు పడుతుంది. తేమ తగ్గి కాంతి కోల్పోయి పొడిబారుతుంది.

టెన్షన్లు నిద్రలేమి కలిగిస్తాయి. లైంగిక పటుత్వాన్నీ ఆసక్తినీ దెబ్బతీస్తాయి.

వయస్సు తెచ్చే మార్పుల్ని అంగీకరించాలి. ఊరికే ఆందోళన పడకూడదు.

జుట్టు ఊడిపోవడం, కీళ్ళ నొప్పులు, స్త్రీలలో రక్తలేమి, గుండె జబ్బులు – వచ్చే ప్రమాదం వుంది.

తగిన వ్యాయామం చేస్తూ మానసికంగా ఆందోళనారహితంగా వుంటూ క్రమశిక్షణ గల జీవితాన్ని సాగించగలిగితే వీటిని చాలా వరకు నివారించవచ్చు.

అధికులం అనుకోవద్దు

ఎన్నో ఎత్తులకు ఎదుగుతారు. ఎంతో సంపాదిస్తారు. కీర్తి ప్రతిష్ఠ లార్జిస్తారు.

అయినా సరే మీలో అధిక్య భావన రానీ కూడదు. సుపీరియారిటీ కాంప్లెక్సుకు లోను కాకూడదు.

బంధుమిత్రులకు దూరమవ్వొద్దు. వారెప్పటికీ మీ శ్రేయభిలాషులూ హితైషులూ అని మర్చిపోకూడదు.

సామాజిక బంధాలనీ బాధ్యతల్నీ మత కార్యకలాపాల్నీ ధార్మికకార్యాల్నీ నిర్లక్ష్యం చెయ్యవద్దు. పదిమందితో కలవడం పదుగురి కార్యక్రమంలో పాల్గొనడం ఓ గొప్ప అనుభవం. ఆనంద సందర్భం!

ఢిల్లీకి రాజైనా ఓ తల్లికి బిడ్డే.

మీరెంత గొప్పవారైనా అండపిండ బ్రహ్మాండంలో మీరో పిపీలికం. ఓ పరమాణువు!

ఆ సంగతి విస్మరించొద్దు.

'నేను శాసనకర్తని! దేవుడ్ని!' అనుకోవడం మూర్ఖత్వం.

మీరెంత అల్పులో మీ ఉనికి ఎంత అల్పమో వార్ధక్యంలో తెలుస్తుంది.

ఆ జ్ఞానాన్ని ముందే పొందమని తమ స్థానం తెలుసుకుని ప్రవర్తించమని ఉద్బోధిస్తుంది హిందూ ధర్మం!

66

ధన సంపాదన



ఇది వరకన్నా ఎక్కువగా ఇప్పుడు మానవ సంబంధాలని డబ్బు శాసిస్తోంది.

చరిత్రలో రాజులు పన్నుల్ని విధించి ఖజానా నింపేవారు. అందులో కొంత ధనాన్ని ప్రతి సంవత్సరం పేదలకు పంచిన దాఖలాలున్నాయి. బౌద్ధమత విస్తరణతో త్యాగ భావం మరింత అధికమైంది.

పండితుల్ని పోషించడం, అగ్రహారాలివ్వడం, దేవాలయలు కట్టించడం, సత్రాలు నిర్మించడం, చెరువులు తవ్వించడం లాంటి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేబట్టడమూ జరిగింది.

కానిప్పుడు మనిషికి ధనదాహం అధికమైందని చెప్పాలి. డబ్బు సంపాదన తప్ప మరో పని మరో లక్ష్యం లేనట్టు వ్యవహరిస్తున్నారు.

డబ్బు కోసం అవినీతి పరులుగా దొంగలుగా మోసగాళ్ళుగా విద్రోహులుగా హంతకులుగా మారుతున్నారు.

డబ్బు కళ్ళబడితే చాలు కళ్ళు మూసుకోపోతున్నాయంటే అతిశయోక్తి కాదు!

అర్థ శౌచం

అర్థమంటే డబ్బు. ధనం. సంపద. వస్తువులు.

శౌచమంటే శుద్ధి. నీతి. పవిత్రత. నిర్మలత్వం. మురికి లేకుండుట.

'అర్థశౌచమే నిజమైన శౌచం' అంటుంది మనుస్మృతి.

ధనానికి మూడు దశలున్నాయి - ఆర్జన (సంపాదించుట) వినియోగం (ఉపయోగించుట), సంచయం (పోగుజేయుట/దాచుకొనుట).

ఈ మూడూ కూడా శుద్ధిగా వుండాలి. పవిత్రంగా వుండాలి.

ఎంత సంపాదించామని గాక ఎలా సంపాదించామన్నదే ప్రధానమంటుంది ధర్మం. ధర్మార్జనే చెయ్యాలి. అవినీతి సంపాదన, అక్రమ సంపాదన కూడదు.

అక్రమార్జన దొంగ తనమే అవుతుంది. దానికి నిలకడ వుండదు. అన్యాయార్జనని దేవుడికీ దేవాలయాలకీ ఇస్తే పాపప్రక్షాళన మవుతుందని కొందరు భావిస్తారు. అది సరికాదు. పైగా దోషం అవుతుంది. పూజాద్రవ్యాల్లానే దేవుడికి సమర్పించే ప్రతీదీ శుచిగా శుభ్రంగా పవిత్రంగా వుండాలి. అది డబ్బుకీ వర్తిస్తుంది. పాపిష్ఠి సొమ్ము పుణ్యాన్నివ్వదు. సుఖాన్నివ్వదు. ఆత్మశాంతి నివ్వదు.

ధన వినియోగాన్ని కూడా సక్రమంగా చెయ్యాలి. నీతి పనులకు మంచి కార్యాలకు వినియోగించాలి. జీవనానికి, వివిధ బాధ్యతల నిర్వహణకు, ధర్మకార్యాలకు ఉపయోగించాలి అధర్మ కోరికలకు పాపకార్యాలకు ఖర్చు పెట్టకూడదు.

సంపాదించిన సొమ్ములో కొంత దాచుకోవాలి. భవిష్యత్ అవసరాలకు అది తప్పని సరి. దానిని కూడా నీతి వంతమైన పద్ధతుల్లోనే చెయ్యాలి. అధిక రాబడికాశపడి దొంగ వ్యాపారాల్లో గాని వ్యవహారాల్లోగాని మదుపు చెయ్యకూడదు.

కర్మసాక్షులు

అవినీతి పరులు మోసగాళ్ళు దొంగలు తమనెవరూ గమనించడం లేదనుకుంటారు. తేలిగ్గా తప్పించుకోగలమని భావిస్తారు. దొరికితేనే దొంగ కదా అని ధైర్యం చెప్పుకుంటారు.

సర్వకర్మలకూ ప్రథమ సాక్షి అంతరంగమే! దాని నుంచెవరూ తప్పించు కోజాలరు.

భాగవంతలోని ఈ శ్లోకం పరిశీలించండి -

'సూర్యోగ్నిః ఖం మరుద్దేవః
సోమః సన్ధ్యా హనీ దిశః
కంకుః స్వయం ధర్మంః ఇతి
హ్యేతే ద్వై హ్యస్య సాక్షిణః'

అంతరంగంలోని అంతర్యామితో బాటు సూర్యుడు, అగ్ని, ఆకాశం,వాయువు, చంద్రుడు, సంధ్యలు, దిక్కులు, జలాలు, ధర్మం - ఇవి మానవుడి కర్మలకు సాక్షులు.

వాటి కళ్ళు కప్పడం ఎవరికీ సాధ్యం కాదు. వాటి ఫలాలు నరక లోకంలో కాదు

నరలోకంలోనే అనుభవించాలి. వేసిన విత్తనం చెట్టవడానికి కాలం పట్టినట్టే పాపఫలం అనుభవించడానికి కొంత సమయం పడుతుంది. మొత్తానికి ఇక్కడే అనుభవించక తప్పదు!

అర్థ శౌచాన్ని పాటిస్తే హాయిగా జీవించొచ్చు. ప్రశాంతంగా మరణించొచ్చు!

ధన మహాత్మ్యం

'ధన మూల మిదం జగత్' – డబ్బు చుట్టూ ఈ ప్రపంచం ప్రదక్షిణ చేస్తోంది. డబ్బుంటే కొండమీది కోతిని కూడా దించవచ్చు.

డబ్బుంటే చాలు కొన లేనిది లేదు. అనుభవించ లేనిది లేదు.

సుఖాలు, సౌకర్యాలు, విలాసాలు, వినోదాలు, గొప్పలు, గర్వాలు, పదవులు, పల్లకీలు, సన్మానాలు – అన్నీ డబ్బున్నవాడికి సేవ చేస్తాయి.

'మనిషికి ఉన్నది పుష్టి గొడ్డుకు తిన్నది పుష్టి' అన్నారు.

ఆస్తులు సమాజంలో హోదానిస్తాయి. గౌరవాన్నిస్తాయి. పరువు ప్రతిష్ఠలిస్తాయి. ఆర్థిక భద్రతనిస్తాయి. బంధుమిత్రుల్ని దగ్గర చేస్తాయి. వారసులకీ ఆర్థిక పుష్టి కల్పిస్తాయి.

'అర్థోహి యౌవనం పుంసాం తద భావశ్చ వార్ధకమ్' – మానవులకు ధనమే యవ్వనం. ధనం లేకపోవడమే ముసలితనం అంటుంది కథాసరిత్సాగరం!

ధన దృక్పథం

విద్య, వ్యాపారం, కళ, ఉద్యోగం – ఏదైనా సరే – దాని లక్ష్యం ధన సంపాదనే అయ్యింది.

ఎంతెక్కువ కాసులు కురిపిస్తే అంత గొప్ప వృత్తి అయ్యింది.

విద్యకీ సంపాదనకీ విడదీయలేని లంకె పడింది.

పిల్లల ఇష్టాయిష్టాలతో పనిలేదు. ఖర్చెంతైనా లక్ష్యం లేదు. లక్షలు కుమ్మరించైనా సరే మేనేజ్‌మెంటు కోటాలో సైతం సీట్లు కొనడానికి సిద్ధం.

కాని ఆ చదువులు చదివితే ఎక్కువ జీతం రావాలి. ఎక్కువెక్కువ సంపాదించగలగాలి.

ఏ కోర్సులో ఏ వృత్తిలో చేరితే ఎక్కువ డబ్బు సంపాదించే అవకాశముందో అందులోనే చేరుస్తున్నారు.

అవినీతి మయమైనా సరే మోసాల నిలయమైనా సరే కాంట్రాక్టులు, రాజకీయాలు, వ్యాపారాలు – ఏదైనా రెడీయే.

క్విక్‌గా డబ్బు సంపాదించాలంతే.

అడ్డదార్లు తొక్కడానికి విదేశాలకు వలసబోవడానికి విలువలు వదులుకోడానికి ఎవర్ రెడీ!

కొత్త కొలబద్ధలు

అభిమానం ఆత్మీయతల్ని సైతం కొలిచే కొత్త కొలమానం వచ్చింది.

దాని పేరు డబ్బు మీటరు.

ఎంత డబ్బు పంపిస్తున్నారు, ఎన్ని బహుమానాలిస్తున్నారు, ఎన్నెన్ని వస్తువులిస్తున్నారు – ఇదే ముఖ్యం. వీటిని బట్టే 'రీడింగు' 'రేటింగు' వుంటుంది.

విదేశాల్లో వున్న సంతానం తిరిగి రాకూడదు. అక్కడుంటేనే తల్లిదండ్రులకి గొప్ప. గర్వం. డబ్బు పంపిస్తూంటే చాలు ఎంత ఎడబాటైనా భరిస్తారు. వారికి డాలర్లలో దేవుడు కన్పిస్తాడు!

శుభకార్యాలకు వచ్చారా ఆనందం పంచుకున్నారా అన్నది ముఖ్యం కానే కాదు. రాక పోయినా ఫర్లేదు గిఫ్ట్‌లు పంపిస్తే చాలు! ఎంత ఖరీదైనవి పంపితే అంత అభిమానమున్నట్టు!

ధన దాహం

కొంత సొమ్ముంటే అవసరాలు తీరతాయి. మరికొంత ఉంటే సౌకర్యాలు సమకూరతాయి. ఇంకొంత వుంటే విలాసాలు వచ్చి వాలతాయి. ఇంకెంతో వుంటే ఆస్తులు చేరతాయి.

డబ్బు ఒక స్థాయి వరకూ సుఖ జీవనానికి అవసరమే. భవిష్యత్ అవసరాలకూ అవసరమే. దానిక్కూడా సరిపడేంత సమకూరేక డబ్బు పరుగులు అవసరమా అన్నది ఆలోచించాలి.

ఎంచేతంటే డబ్బు సంపాదన ఎప్పటికీ తీరని దాహం కాకూడదు.

డబ్బు నెయ్యిలాంటిది. దాహమేస్తే నీరు త్రాగాలి. ఖరీదైనదని నెయ్యి త్రాగితే దాహం రెట్టింపవుతుంది.

అందుకే ధన సంపాదన ఒక వ్యసనం అన్నారు పెద్దలు. అందులో పడికొట్టుకు పోయేవాడు మంచిచెడులు నీతినియమాలు బంధాలు బంధుత్వాలు అన్నీ మర్చి పోతాడు.

ఇంకా ఇంకా సంపాదించడం, ఆస్తులు కూడబెట్టడం, ఐశ్వర్యం పెంచుకోవడం - ఇరవైనాలుగ్గంటలూ అదే దాహం! అదే యావ! అదే తపన! అదే తాపత్రయం!

తృప్తి లేని మనిషికి సుఖశాంతులుండవు. అది గ్రహించే నాటికి చాలా చాలా కోల్పోవలసి వుంటుంది!

డబ్బు అవసరమే

డబ్బుని తక్కువగా అంచనా వెయ్యకూడదు. డబ్బు లేకుండా ఏదీ జరగదు. బొడ్డుతాడు కోయడం దగ్గర్నుంచి కాటిలో కట్టె కాలే వరకూ డబ్బు అవసరమే.

డబ్బు లేనివాడు డుబ్బుకు కొరగాడు.

తిండి, బట్ట, ఇల్లు, చదువు, ఆరోగ్యం - అన్నిటికీ డబ్బు కావాలి.

మనిషిని నడిపే ఇంధనం ధనమే. దాన్ని సంపాదించి తీరాల్సిందే.

కాని విలువలు కొలవడానికి మనిషి తయారు చేసుకొన్న డబ్బు మనిషిని శాసించే స్థాయికి ఎదగనివ్వకూడదు. మనిషి డబ్బుకి బానిస కాకూడదు.

సంపాదనయావలో పడి ఒత్తిడి పెంచుకుంటూ పోకూడదు. అపురూప ఆనందాలకూ అనుభూతులకూ దూరం కాకూడదు.

జీవితంలో ఎంత డబ్బు సంపాదించామనే దానికన్నా ఉన్న డబ్బుతో ఎంత ఆనందంగా జీవించగలుగుతున్నామన్నది ఆలోచించాలి.

డబ్బు కొంత తృప్తి నివ్వొచ్చు. కాని మనశ్శాంతికీ అసలు శిసలు సుఖసంతోషాలు జుర్రుకోడానికీ డబ్బు కాదు ఆత్మతృప్తి ఉండాలి.

ఆనందమే ముఖ్యంగా భావించి డబ్బు సంపాదనకి రెండో స్థానం ఇచ్చే వారు ఎక్కువ సంతోషంగా జీవిస్తారు!

అధిక డబ్బు

అవసరాన్ని మించిన డబ్బు మనిషిని వక్రమార్గంలో ఆలోచింపజేస్తుంది. తేలిగ్గా వచ్చే డబ్బు విలువ కోల్పోవటమేగాక అవినీతిని పెంచుతుంది. నైతిక విలువల్ని తెరవెనక్కి పంపి ధనం ధగద్ధగలు ప్రదర్శిస్తుంది.

భోగలాలస పెరుగుతుంది.

ఆస్తుల వాటాలకోసం అయినవారి ఒత్తిడి, పంపకాల్లో విభేదాలు, గొడవలు, కోర్టుకేసులు మొదలవుతాయి.

ఆదాయ పన్నుశాఖ వారి దృష్టిలో పడతామేమో, రెయిడింగ్ జరిగితే అభాసు పాలవుతామేమో అన్న ఆందోళన తిన్నగా వుండనివ్వదు. నిద్ర పోనివ్వదు. దాన్ని జోకొట్టే నెపం మీద మత్తులో జోగాల్సి వస్తుంది!

సంపాదనా మార్గాలు

ధన సంపాదనకి ఎన్నో మార్గాలున్నాయి. ఉద్యోగం, వ్యాపారం, కళలు, స్వయం ఉపాధి, రోజువారి కూలిపని, క్రీడలు వగైరా.

నీతితో నిజాయితీగా చేసే ఏ పని అయినా ఏ శ్రమ అయినా గౌరవార్హమైనదే. శ్రమించడం హీనంగా భావించడం తగదు. డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ని గుర్తించాలి.

ఎవరు ఏపని చేసినా నిబద్ధతతో చెయ్యాలి.

ఉద్యోగులు సమయాలని పాటించడం, ఆయాపనుల్ని ఎంత బాగా చెయ్యాగలరో అంత బాగా చెయ్యడం, క్రమపద్ధతిలో క్రమశిక్షణతో పని చెయ్యడం, నైపుణ్యాన్ని పెంచుకోవడం, అధికార్ల మెప్పు లభించేలా పని పూర్తి చెయ్యడం – చెయ్యాలి.

అలాగని వర్క్‌హాలిక్‌గా మారకూడదు. డిపార్ట్‌మెంటు పరీక్షలు రాయాలి. క్వాలిఫికేషన్ పెంచే డిగ్రీలను కరస్పాండెన్స్ ద్వారా చదవాలి. ప్రమోషన్లు చేజిక్కించుకోవాలి. తద్వారా సంపాదన పెంచుకోవాల్తప్ప అవినీతి మార్గాలు తొక్కకూడదు.

వ్యాపారాలు క్రొంగొత్త ఐడియాలతో రిస్కుకి భయ పడకుండా కొంత సాహసం చెయ్యాలి. క్వాలిటీతో కాంప్రమైజ్ కాకూడదు. మోసాలకు తావివ్వరాదు. అన్ని రకాల వనరుల్నీ పూర్తిగా వినియోగించుకుంటూ వ్యాపారాన్ని పెంచుకోవాలి. ఉత్తమ నాణ్యతలు పాటించాలి.

కొనుగోలుదార్ల తృప్తిలోనే మీ లాభం, మీ విజయం దాగి ఉన్నాయి.

భాగస్తులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. ఉద్యోగుల పని సామర్థ్యం పెరిగేలా చూడాలి. వారికి అదనపు సౌకర్యాలు కల్పించాలి. స్వయంగా అన్నీ పర్యవేక్షిస్తూ సమర్థ యజయానిగా పేర్గాంచాలి.

అడ్డదార్లు తొక్కడం మంచిది కాదు. పన్నులు సవ్యంగా చెల్లించాలి. అవి ఫ్యూచర్ షాక్స్ అని గుర్తుంచుకోవాలి. టెన్షన్లు తగ్గించుకోకపోతే హార్ట్ ఎటాక్స్ రావొచ్చు. నీతిగా వ్యాపారం చేస్తూ కంటి నిండా నిద్ర పోవాలి.

కళాకారులు, క్రీడాకారులు, తమ తమ ప్రతిభని నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ మెరుగు పరచుకుంటూ వుండాలి. కొత్తనీరు వస్తూనే వుంటుంది. వారి ధాటికి తట్టుకుని

నిలబడాలంటే మీ ప్రతిభాపాటవాలు నిత్య నూతనం కావాలి. కాలానుగుణంగా మారాలి. ఇంకా ఇంకా నైపుణ్యాన్ని పెంచుకోవాలి. అప్పుడే మీ కళకూ ఆటకూ డిమాండ్ పెరుగుతుంది. కాసుల్ని కురిపిస్తుంది.

ప్రపంచీకరణ ప్రభావం

ప్రపంచం ఒక కుగ్రామమై పోయింది. M.N.C లు ప్రతి దేశంలోకి ప్రతి పట్టణంలోకి విస్తరిస్తున్నాయి. దేశాల ఎల్లల్ని అంతర్జాతీయ వ్యాపారం చెరిపేస్తోంది.

ఉద్యోగార్థం ప్రపంచంలోని ఏ మూలకైనా వెళ్ళిపోతున్నారు. ఐటి పుణ్యమా అని ఇక్కడే వుండి విదేశీ పనుల్ని చక్కబెడుతున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఉద్యోగాలు పెరిగాయి. అవకాశాలు పెరిగాయి. జీతాలు చాలా బాగా పెరిగాయి. ఒత్తిడీ అదే స్థాయిలో పెరిగింది.

తల్లిదండ్రులు రిటైరయ్యేప్పటి జీతం కన్నా ఎక్కువగా మొదటి నెలలోనే డ్రా చేస్తున్నారు వారి అబ్బాయిలూ అమ్మాయిలూ.

చిన్నవయస్సులో పెద్ద జీతాలు. డబ్బు విలువ తెలిసేలోగానే జేబు నిండా డబ్బు.

వీకెండ్స్‌లో పబ్స్, షాపింగ్, రెస్టారెంట్స్, మల్టీప్లెక్సెస్– ఎన్నో సరదాలు తీర్చే మార్గాలు.

భారీ జీతంతో బాటు పనీ బాధ్యతా భారీగా పెరిగాయి. టార్గెట్స్ తరముతోంటే ఒత్తిడికి లోనవుతూ పరుగు పెట్టాల్సి వస్తోంది. మానవ సంబంధాల మీదే కాదు వైవాహిక బంధాల మీదా దాని ప్రభావం కన్పిస్తోంది. సెల్‌ఫోన్లు లాప్‌టాప్‌లూ పడక గదిలోకి ప్రవేశిస్తున్నాయి!

వ్యాపారస్తులు కూడా పోటీని తట్టుకోడానికి లాభాలు పెంచుకోడానికి అధికాధికంగా శ్రమిస్తున్నారు. వారికి కాసింత విశ్రాంతి దొరికేది విమాన ప్రయాణాల్లోనే అంటే అతిశయోక్తి కాదు.

బాగా డబ్బు సంపాదిస్తే జీవితంలో సమస్యలన్నీ తీరి పోతాయనీ స్వర్గం అరచేతికి అందుతుందనీ భావించడం ఓ భ్రమ.

డబ్బు కన్నా విలువైంది జీవితం.

జీవిత సాఫల్యత డబ్బులో లేదు సంతృప్త జీవితంలో వుంది! కుటుంబం జీవనంలో వుంది! ధర్మాచరణలో వుంది!

67

డబ్బు దాచుకునే మార్గాలు

డబ్బు సంపాదిస్తే చాలదు. దానిని సరైన పద్ధతిలో దాచుకోవాలి. డబ్బు డబ్బుని సంపాందించేట్లు మదుపు (Investment) అనగా పెట్టుబడి పెట్టాలి.

డబ్బుని దొంగల బారి నుండి రక్షించుకోవాలి. ఆదాయపు పన్ను పోటు తగ్గించుకునే మార్గాలు చూడాలి.

పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత విషయాలన్నీ తెలుసుకుంటే లాభాలు పండించు కోవచ్చు.

దాచుకున్న డబ్బు అధిక ఆదాయాన్నిస్తే లేక విలువ అధికమైతే అది ఉత్తమమైన మదుపు/పెట్టుబడి అవుతుంది.

పొదుపు ఒక అవసరం

డబ్బు పొదుపు చెయ్యడానికి వేలూ లక్షలూ వుండక్కర్లేదు. ఎవరి స్థాయిని బట్టి వారు పొదుపు చేసుకోవచ్చు. అది తప్పనిసరి అవసరం అని భావించి ఆచరించక తప్పదు.

పిల్లల చదువు, పెళ్లి, ఇల్లు కట్టడం వగైరాలకి అధిక మొత్తంలో డబ్బు అవసర మవుతుంది. అవేగాక ఊహించని విపత్తులు ఎదురవ్వొచ్చు. అనారోగ్యం పాలబడొచ్చు. ఇక వృద్ధాప్యంలో ఆర్థిక ఆసరా కావాల్సిందే కదా.

అంచేత ప్రతి వారూ తమ ఆదాయంలోంచి 20 నుండి 30 శాతం ఒక క్రమ పద్ధతిలో పొదుపు చెయ్యాలి. కొన్నేళ్ళకదే పెద్ద మొత్తమవుతుంది. చిన్న చిన్న నీటి బిందువుల కలయికతోనే కదా సింధువయ్యింది!

బ్యాంకుల్లోగాని, పోస్టాఫీసుల్లో గాని పొదుపు ఖాతాలు తెరవవచ్చు. కొంత వడ్డీ లభిస్తుంది. అవసరమైనప్పుడు తీసుకోవచ్చు. కొంత మొత్తమైనప్పుడు మరొక దాని మీద మదుపు చేయవచ్చు. అప్పుడది మరింత పెరిగే అవకాశం వుంటుంది.

సినీజనమే ఆదర్శం

సినిమాలన్నా సినిమా వాళ్ళన్నా మనకి తెగపిచ్చి.

అంచేత 'పొదుపు' 'మదుపు' కి వారినే ఉదాహరణగా తీసుకుని పరిశీలిద్దాం.

లక్షలు కోట్లు పారితోషికం తీసుకునే వారిలో సినిమా వారిదే అగ్రస్థానం. ఇప్పుడే కాదు గతంలోనూ అంతే.

అప్పట్లో నటీనటులూ టెక్నీషియన్లూ అధిక మొత్తాల్లోనే సంపాదించే వారు. కొద్దిమంది మాత్రం స్థలాల మీద పొలాల మీద పరిశ్రమల మీద స్టుడియోల మీద మదుపు చేశారు. వాళ్ళ పనిప్పుడు మహారాజులాగా వుంది.

కొందరికి పొదుపు మదుపు తెలీలేదు. ఎప్పటికీ అలాగే సంపాదిస్తూ వుంటామన్న భ్రమలో వుండి వుండొచ్చు. ఏమైనా డబ్బుని ఛానలైజ్ చేసుకోలేక పోయారు. వారిలో నిన్నటి తరం పెద్ద నటులెందరో వున్నారు.

వారిప్పుడు ఆర్థిక ఇబ్బందుల్తో సతమతమవుతున్నారు. స్వంతగూడు లేక దయనీయంగా బ్రతుకుతున్నారు. నిజంగా ఎంతటి విషాదం!

ఇప్పటి తారలూ టెక్నీషియన్లూ చాలా తెలివైన వారు. డబ్బు విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సరైన మార్గాల్లో పెట్టుబడి పెడుతున్నారు. ఆస్తుల్ని మరింతగా పెంచుకుంటున్నారు.

ప్రస్తుత ఉజ్వల జీవితమే భవిష్యత్తులోనూ అనుభవించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మనీని మేనేజ్ చేసుకుంటున్నారు.

ఎవరి స్థితికి తగ్గట్టు వారు అనుసరించాల్సిన పంథా ఇదే!

ఫిక్సెడ్ డిపాజిట్లు

ఒక్కోసారి ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు రావచ్చు. బోనస్, పంటసొమ్ము, ఎరియర్స్, లాభం, షేర్ల అమ్మకం, పొలాలు లేక స్తలాల అమ్మకం వగైరాల ద్వారా గాని లేదా పొదుపు చేసిన చిన్న మొత్తాలే పెద్ద మొత్తం అయినప్పుడు గాని ఫిక్సెడ్ డిపాజిట్లో దాచుకోవచ్చు.

బ్యాంకుల్లో గాని పోస్టాఫీసులోగాని నిర్ణీత కాలానికి డబ్బు మదుపు చెయ్యవచ్చు. అసలూ వడ్డీకి పూర్తి భద్రత వుంటుంది. అవసరమైతే దాని మీద 90% వరకూ అప్పు

తీసుకొవచ్చు. వడ్డీ అధికంగా లభిస్తుంది. మరీ అత్యవసరమైతే ఫిక్సెడ్ డిపాజిట్‌ని రద్దు చేసుకుని పూర్తి సోమ్మునీ కొంత వడ్డీనీ తీసుకోవచ్చు.

ఇది అన్ని విధాలా సురక్షితమైన పూర్తి లిక్విడిటీ గల మదుపు మార్గం.

బంగారం

బంగారు నగలంటే ఇష్టపడని స్త్రీ వుండదు. నిజం చెప్పాలంటే బంగారం కొనడం లేదా నగలు చేయించడం పూర్వకాలపు మదుపు పద్ధతి.

ఇప్పటి క్కూడా అది చక్కని ఇన్వెస్ట్‌మెంటే.

బంగారం ఎప్పటికీ బంగారమే. దానికెక్కడా తిరుగులేదు. ప్రపంచంలో ఎక్కడైనా సరే ఎప్పుడైనా సరే దాన్ని డబ్బుగా మార్చు కోవచ్చు.

బంగారం మీద మదుపు చెయ్యడాన్ని ద్రవ్యోల్బణం నుంచి రక్షణ పొందటానికి అనువైనదిగా భావిస్తారు.

బంగారం విలువ అంతర్జాతీయ విఫణిలోని డాలర్ విలువ మీద ఆధారపడి వుంటుంది. ప్రపంచాన్ని శాసిస్తున్నది డాలర్ గనుక బంగారం విలువ దారుణంగా పడిపోయే ప్రమాదం వుండదు.

పైగా నగలు స్త్రీలకు అలంకారం. తృప్తినీ గర్వాన్నీ ఆనందాన్నీ కలిగిస్తూ హోదాకీ ఆర్థిక సుస్థిరతకీ, సామాజిక గౌరవానికీ చిహ్నంగా వుంటున్నాయి.

అత్యవసర సమయాల్లో నగలు తాకట్టుపెట్టి ఋణం తీసుకోవచ్చు. తేలిగ్గానూ అమ్ముకోవచ్చు.

బంగారం మీద నెలసరి ఆదాయమంటూ ఏమీ రాదు. అమ్మినప్పుడు అధిక ధర వుంటే వచ్చే లాభమే రాబడి.

తిరిగి అమ్మేప్పుడు తరుగు, రాళ్ళ ఖరీదు కోల్పోవలసి వుంటుంది. స్వచ్ఛత విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ బాధ లేకుండా ఇప్పుడు బ్యాంకులు కూడా 5 గ్రా. 10 గ్రా. 20 గ్రా. 50 గ్రా. ల బంగారు నాణేల్ని విక్రయిస్తున్నాయి. ప్యూరిటీకి గ్యారంటీ ఇస్తున్నాయి.

నగలుగా ధరించాలనుకోని వారు ఆ బంగారు నాణేల్లో డబ్బు మదుపు చెయ్యవచ్చు. ఎలాంటి తరుగూ లేకుండా అవసరమైనప్పుడు అమ్ముకోవచ్చు లేదా తర్వాతెప్పుడో నగలు చేయించు కోనూవచ్చు.

చిట్‌ఫండ్‌లు

చిట్‌లు గురించి తెలీని వారుండరు.

ప్రతి చిట్‌లోనూ కొందరు సభ్యులుంటారు – 20 లేక 25 మంది. వారంతా కట్టే సొమ్ముని వేలం ద్వారా ప్రతి నెలా ఒకరికిస్తారు. లాభాన్ని అందరికీ సమంగా అదే నెలలో పంచుతారు.

ఇందులో బ్యాంకులో కన్నా అధికంగా రాబడి వుంటుంది. మరో సుగుణమేమిటంటే అవసరమైనప్పుడు పాడుకుని ఒకేసారి పెద్ద మొత్తాన్ని చేజిక్కించుకోవచ్చు. దాన్ని పెద్ద అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. నెలనెలా చీటీ సొమ్ము కడుతూంటే చాలు ప్రత్యేకంగా విడిగా తీర్చక్కర్లేదు.

ఇది మంచి పొదుపు పద్ధతే కాని రక్షణ తక్కువ. రిజిస్టర్డ్ చిట్ ఫండ్‌లు చాలా వరకూ సురక్షితం. అలాటివీ నష్టాలొచ్చాయని చెప్పి బోర్డు తిప్పేసిన సందర్భాలెన్నో వున్నాయి.

ఇక ఇళ్ళ దగ్గర మహిళలు నిర్వహించే ప్రైవేటు చిట్‌ల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఏ క్షణాన్నైనా దివాలా తీసేయొచ్చు. మాయమైపోవచ్చు. తస్మాత్ జాగ్రత్త!

షేర్లూ బాండ్లూ

రోజూ టీవీలో పేపర్లలో షేర్ మార్కెట్ తీరుతెన్నులూ షేర్ల ధరల ఉత్థాన పతనాలూ విశ్లేషిస్తూంటారు.

షేర్ అంటే పబ్లిక్ కంపెనీలో 'వాటా' అన్నమాట. పెద్ద పెద్ద కంపెనీలకు అధిక పెట్టుబడి అవసరం గనుక జనానికి వాటాలు విక్రయించి తద్వారా దానిని సమీకరించుకుంటూ వుంటారు.

ఈ షేర్లని స్టాక్ ఎక్చేంజిలో ట్రేడింగ్ కోసం నమోదుచేస్తారు.

కంపెనీల ఫలితాలు ఆర్డర్లు భవిష్యత్ ప్రణాళికలూ అంచనాలూ ఆధారంగా షేర్ల రేట్లు పెరుగుతూంటాయి. తరుగుతూంటాయి.

రెలియన్స్, ఇన్ఫోసిస్, విప్రో, టిస్కో, స్టేట్‌బ్యాంక్ లాంటి కంపెనీల్లో వేలు పెట్టుబడిగా పెట్టిన వాళ్ళెందరో లక్షాధికార్లు కోటీశ్వరులూ అయ్యారు. అంత భారీగా నష్టపోయిన వారూ ఉన్నారు.

డబ్బుని షేర్లలో పెట్టుబడి పెట్టడం మంచిదే. కాని రిస్కు ఎక్కువ. ఆటుపోటు లెక్కువ.

ఆర్థిక విషయాలు కంపెనీల వ్యవహారాలు భవిష్యత్తు అంచనాలు ప్రభావిత అంశాలు లోటు పాట్లు తెలిసిన వారు వీటిల్లో మదుపు చెయ్యవచ్చు.

షేర్లు ఎప్పుడు కావలిస్తే అప్పుడు అమ్ముకోవచ్చు. కొనుక్కోవచ్చు, ఒకే రోజు ఒకే కంపెనీకి చెందిన షేర్లు కొని అమ్మి, అమ్మి కొని వ్యాపారం చేసే వారూ వున్నారు.

మార్కెట్ తీరు తెన్నుల్ని పరిశీలించ లేని వారు మ్యూట్యువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. బ్యాంకు వడ్డీ కన్నా అధికంగా రాబడి వచ్చే అవకాశముంది.

అన్ని ఫండ్సూ ఒకే తీరున వుండవు. మంచి డివిడెండ్ చరిత్ర గల వాటిని ఎన్నుకుని మదుపు చేయవచ్చు.

పొలాలు తోటలు

వ్యవసాయదారులకీ వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారికీ భూమి మీద ఆపేక్ష అధికంగా వుంటుంది.

అంచేత వారెక్కువగా పొలాలూ పండ్ల తోటలూ కొనుగోలు చేస్తూంటారు.

ఇది మంచి ఇన్వెస్ట్‌మెంటే. చక్కని ఆదాయం వస్తుంది. వాటి విలువా పెరుగుతుంది. పైగా వ్యవసాయంమీద వచ్చే ఆదాయానికి ఆదాయపు పన్ను లేదు.

కాని మీరు స్వయంగా వ్యవసాయం చేయనప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించడం అవసరం. ఎవరికైనా కౌలుకిస్తే పంట సవ్యంగా ఇవ్వొచ్చు ఇవ్వక పోవచ్చు. అవసరార్థం అమ్ముకుందామంటే కౌలుదారుడు పొలంలోంచి తప్పుకోననే ప్రమాదముంది.

ప్రభుత్వం కూడా లీజు (కౌలు) దారుడికి కొన్ని హక్కులు కల్పించింది. మీరు అమ్మదలిస్తే మొదట అతడికే అమ్మాలి. వాయిదాల్లో చెల్లించే అవకాశమూ ఇవ్వాల్సుంటుంది.

ఆ సాధక బాధకాలన్నీ తెలుసుకున్నాకే పొలాలూ తోటలూ కొనాలి. కాని ఇవి అమ్మడానికి కొంత టైము పడుతుందన్నదీ గుర్తుంచుకోవాలి.

ఇళ్ళు - ఇంటి స్తలాలు

జనాభా పెరుగుతోన్న కొద్దీ ఇళ్ళకు డిమాండ్ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. పట్నాల్లో ఇది మరీ ఎక్కువగా వుంది.

స్వంత గూడు ఏర్పరచు కోవాలనుకునే వారూ అద్దెలొస్తాయని ఆశించే వారూ విలువ పెరుగుతుందని భావించే వారూ ఇళ్ళు కొంటున్నారు. ఇండిపెండెంట్ ఇల్లు కొనలేని వారు ఫ్లాట్, ఎపార్ట్‌మెంట్ కొంటున్నారు.

మరికొందరు ఇంటి స్తలాలు కొంటున్నారు.

ఇల్లు లేదా ఎపార్ట్‌మెంట్, ఇంటి స్తలం కొనడానికి బ్యాంకులు విరివిగా ఋణాలిస్తున్నాయి.

ప్రతీవారికీ స్వంత ఇల్లు ఓ కల గనుక ఇల్లు లేదా ఫ్లాట్ లేదా ఎపార్టమెంట్ మీద పెట్టుబడి పెట్టవచ్చు. స్వయంగా కాపురముంటే అద్దె మిగుల్తుంది. లేదా అద్దె వస్తుంది. విలువా పెరుగుతుంది. అప్పుని 15- 20-25 ఏళ్ళల్లో నెల సరి వాయిదాల్లో తీర్చవచ్చు గనుక పెద్ద బరువన్పించదు.

ఇళ్ళ విలువ తగ్గ వచ్చు గాని ఇళ్ళ స్తలాల విలువ తగ్గే అవకాశం లేదు. ఎంచేతంటే భూమి నెవరూ సాగదీయ లేరు. భూమి అవసరం మాత్రం వేగంగా పెరుగుతూనే వుంటుంది. విలువని మించి 'పెరిగిన' రియల్ ఎస్టేట్ ప్రస్తుతం నిజస్థాయికి దిగివస్తోంది. ఎప్పటికైనా దాని విలువ దానిదే.

అంచేత పెట్టుబడి బాగా పెరగాలంటే ఇంటి స్తలాలు కొనడం ఉత్తమం. కొనే ముందు లీగల్‌గా అన్ని రకాల డాక్యుమెంట్లూ వున్నాయో లేదో తనఖా లేమైనా వున్నాయో తెలుసుకోవాలి. వాస్తూ చూడాలి.

ఫోర్జరీ డాక్యుమెంట్లూ దొంగ హక్కుదారులూ ఆక్రమణదార్లూ ఉంటారు జాగ్రత్త!

డబ్బు అత్యవసరమైప్పుడు వీటి మీద అప్పు తీసుకోవచ్చు. అమ్మాలనుకుంటే మాత్రం కొంత టైము పడుతుంది.

అప్పిచ్చువాడు

అప్పు ఇవ్వడం కొందరికి వృత్తి మరికొందరికి ప్రవృత్తి.

ముఖ్యంగా ఉద్యోగులూ వ్యాపారులూ అప్పులు చేస్తూ నెలవారీ రోజువారీ వాయిదాల్లో చెల్లిస్తూంటారు. అవసరానికి డబ్బు అప్పిస్తే చాలు వడ్డీ ఎంతన్నదీ చూడరు.

వడ్డీ వ్యాపారం లాభదాయకమే.

నగలు, వాహనాలు, ఇళ్ళు, స్థలాలు మొదలైనవి హామీ పెట్టుకుని అప్పులిస్తే ఫరవాలేదు. అసలుకీ ఎంతో కొంత వడ్డీకీ ఢోకా వుండదు.

కేవలం నోటి మాట మీదో ఋణ పత్రం మీదో అప్పు ఇస్తే తిరిగి వసూలు చేసుకోడానికి చాలా ఇబ్బంది పడాల్సి రావచ్చు.

ఒక్కోసారి పూర్తిగా నష్ట పోవాల్సి వస్తుంది.

అప్పు వసూలు చేసేప్పుడు కరుగ్గా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది. నిష్ఠూరాలూ శాపనార్థాలూ తప్పవు. వాటికి తట్టుకో గలవారే ఇందులోకి దిగాలి.

దిగేముందు 'కాబూలీవాలా' అన్న మాటనీ రూపాన్నీ ప్రవర్తననీ గుర్తు తెచ్చుకుని మీరా తరహాకి మారగలరో లేదో అంచనా వేసుకోవాలి.

ఆర్ట్ చిత్రాలు

కాలం గడిచే కొద్దీ ప్రముఖ చిత్రకారులు వేసిన పెయింటింగ్స్ విలువ భారీగా పెరుగుతూంటుంది. అరుదూ అపురూపమూ అయినవైతే వాటి ఖరీదు అంచనా వెయ్యలేనంత వుంటుంది.

పికాసో నుంచి యమ్మెఫ్ హుస్సేన్ దాకా ఎందరో ప్రఖ్యాత చిత్రకారుల చిత్రాలకి అత్యధిక డిమాండ్ వుంటోంది. ఒక్కోదాని ధర కోట్లలో వుంటుందంటే అతిశయోక్తి కాదు.

అందుకనే ఆర్ట్‌చిత్రాల మీద పెట్టుబడి పెట్టడం మొదలైంది. తర్వాత్తర్వాత అధికధర తెచ్చి పెడతాయని విశ్వసిస్తున్నారు.

ప్రముఖుల చిత్రాలు ఇంటికి అలంకారం. హోదాకి చిహ్నం. కీర్తి కారణం. చక్కని మదుపు.

అలాఅని అందరి చిత్రాలూ కోట్లు పలకవు. అది దృష్టిలో వుంచుకుని, చక్కని ఆర్ట్ చిత్రాల మీద పెట్టుబడి పెట్టవచ్చు. డూప్లికేట్లు ఉంటాయి జాగ్రత్త!

యాంటిక్స్

పురాతన వస్తువుల్ని యాంటిక్స్ అంటారు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ కదా. నిన్నటి అపురూప కళాఖండాలు, వస్తువులు, ప్రముఖులు ఉపయోగించిన సామాగ్రి వగైరాలన్నమాట.

అంతర్జాతీయ మార్కెట్లో వీటికి చాలా క్రేజ్ వుంది.

వేలంలో వీటిని కైవసం చేసుకోవడం గొప్పగా స్టేటస్ సింబల్‌గా భావిస్తారు కోటీశ్వరులు.

శివాజీ ఖడ్గాన్ని అనేక కోట్లరూపాయలకు విజయ్ మాల్యా వేలంలో కొన్న సంగతి వినేవుంటారు.

అందువల్ల యాంటిక్స్ కొని దాచడం అనేది ప్రపంచ వ్యాప్తంగా వున్న ఒక మదుపు మార్గం.

కొనే ముందు అవెంత పురాతనమైనవో ప్రత్యేకత లేమిటో ఆసక్తికర అంశాలేమిటో పరిశీలించాలి. వాటి మీదే భవిష్యత్తులో వాటి ధర ఆధారపడి వుంటుంది.

మనీ మేనేజ్‌మెంట్

సంపాదించిన డబ్బుని ఖర్చు చేసేప్పుడూ పెట్టుబడి పెట్టేప్పుడూ ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి.

అనవసర ఖర్చు చెయ్యడమే కాదు అవసర ఖర్చు చెయ్యక పోవడమూ తప్పే.

పిసినారిలా గాక ఇంటిల్లపాదీ సంతోషించేలా భార్యా భర్తలిద్దరూ కలిసి మనీని మేనేజ్ చేసుకోవాలి.

అవసరాలతో బాటు పొదుపుకీ కొంత కేటాయించుకోవాలి. దాన్ని వివిధ మార్గాల్లో తెలివిగా పెట్టుబడి పెట్టాలి.

కొంత దాకా మీరు డబ్బుని సంపాదిస్తే చాలు ఆ తర్వాత ఆ డబ్బే మీకు మరింత డబ్బుని సంపాదించి పెడుతుంది.

అన్ని పెట్టుబళ్ళూ ఒకే రకంవి కావు. ఒకే రకం రాబడిని ఇవ్వవు. ఒకే రకపు రక్షణనీ లిక్విడిటీనీ కలిగి వుండవు.

అన్ని రకాల గుడ్లనీ ఒకే బుట్టలో పెట్టకూడదు.

తెలివిగా వివిధ మార్గాల్లో మదుపు చెయ్యాలి.

అత్యవసరమైనప్పుడు తక్షణం కేష్ అయ్యేవాటిల్లో కొంత పెట్టుబడి పెట్టాలి. అంటే బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్స్ వగైరా.

రిస్కు ఎక్కువైనా లాభం అధికంగా వుండే అవకాశ ముంది గనుక కొంత షేర్లలో మదుపు చేయవచ్చు.

ఇల్లు తప్పనిసరి. తక్కువ వడ్డీకి బ్యాంకు అప్పు లభిస్తోంది. గనుక స్వంత ఇల్లు అమర్చుకోవాలి.

ఆడవారి ఆనందం కోసం కొంత బంగారం మీద పెట్టక తప్పదు. మీకది హోదానీ గర్వాన్నీ ఇస్తుంది. అవసరానికి ఆదుకుంటుంది.

ఆపైన ఇంటి స్తలాల మీద పెట్టుబడి పెట్టొచ్చు. మీ పెట్టుబడిని అనేక రెట్లు పెంచుతుంది.

మీ మీ రంగాలకు సంబంధించిన ఉపరంగాలూ వ్యాపారాలూ వుంటే వాటి గురించిన పరిజ్ఞానం మీకు పూర్తిగా వుంటే అందులోనూ పెట్టుబడి పెట్టవచ్చు.

అంటే మొత్తం పెట్టుబడిని లిక్విడిటీని బట్టీ స్వల్పదీర్ఘ కాలాల్ని బట్టీ, రిస్కుని బట్టీ, భవిష్యత్ అవసరాలని బట్టీ పెట్టుబడి పెట్టాలి.

అన్నీ సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్లే చూస్తే ఫలితం అధికంగా వుండదు. కొంత రిస్క్ తీసుకోక తప్పదు. అధిక రిస్క్‌గల వాటిల్లోనే అత్యధిక లాభాలుంటాయి. పెట్టుబడిలో కొంతైనా రిస్కీ ప్రాజెక్టుల్లో ఇన్వెస్ట్ చెయ్యడం అభిలషణీయం!

మరో ముఖ్యసంగతి

డబ్బుని తెలివిగా పెట్టుబడి పెట్టి కూర్చుంటే చాలదు. వాటి తాలూకు సర్టిఫికేట్లను, దస్తావేజుల్ని భద్రంగా జాగ్రత్త పరచాలి.

వాటి వివరాలూ మెచ్యూరిటీ తేదీలూ రాసుకుని ఒక ఫైలులో వుంచుకుంటే అవసరమైనప్పుడు చూసుకోవచ్చు.

ఏవి ఎక్కడ దాచిందీ కుటుంబ సభ్యులకు చెప్పాలి. స్థలాలు పొలాలు వగైరాలు వారికి చూపించాలి. మీరెంత ముందుచూపుతో వ్యవహరించిందీ ఇంటిల్లపాదికీ తెలియడం అవసరం.

దాని వల్ల మదుపుగురించి వారికొక అవగాహన వస్తుంది. మీమీద గౌరవం పెరుగుతుంది. మీ ద్వారా సంక్రమించబోయే ఆస్తిపాస్తులను దృష్టిలో వుంచుకుని వారు చక్కగా ప్లాన్ చేసుకోడానికీ తోడ్పడుతుంది.

68

ఇల్లు



కూడు గూడు గుడ్డ – ఈ మూడూ మనిషి ప్రాథమికావసరాలు

ఇల్లు తలదాచుకునే ఒక గూడు మాత్రమే కాదు. కుటుంబ జీవనానికి ఒక ఆలయం. బాధల్ని భయాల్ని కష్టాల్ని కన్నీళ్ళని మరిపించే సేదదీర్చే ఒక స్థానం. ఆనందానికి అనుబంధాలకి నిలయం. మనశ్శరీరాల్ని ఆహ్లాదపరిచే ప్రశాంత ప్రదేశం.

గృహం గృహస్థుని ఆశ్రమం. గృహస్థధర్మ నిర్వహణా కేంద్రం.

ఇంటికి పునాది ఇటుకలూ సిమెంటూ కాదు అనురాగాలూ ఆత్మీయతలే!

ఇల్లు ఓ భౌతిక విజయం. ఇంటి వల్ల హోదా, స్టేటస్, సామాజిక గౌరవం పెరుగుతాయి. ఓ శాశ్వత చిరునామా లభిస్తుంది!

ఇల్లు ఓ అవసరం

పెళ్లవగానే ఓ ఇంటి వాడయ్యాడంటారు. అంటే ఇల్లు అతడి కేరాఫ్ ఎడ్రస్సు అయ్యిందన్నమాట. గృహస్థాశ్రమంలో ప్రవేశించాడని అర్థం.

పెళ్లయ్యాక ఆర్థికంగా స్థిరపడ్డాక ప్రతివారూ తమకంటూ ఒక గూడుని స్వంత ఇంటిని ఏర్పరచుకోవాలని చూస్తారు. తపిస్తారు. పెళ్లికాకుండా ఇల్లు నిర్మించు కోకూడదని కాదు. పెళ్లయ్యాక ఇంటి అవసరం ఎక్కువ వుంటుంది. ఇల్లాలి ఫోర్సు దాన్ని అధికం చేస్తుంది. గనుక వారి ఆలోచనలు ఇంటి మీదకి మళ్ళుతాయి. 'ఇంటికల' నెరవేరేందుకు వివిధ మార్గాలు అన్వేషిస్తారు.

ఉద్యోగరీత్యా ఒకే ప్రాంతంలో స్థిరంగా వుండేవారు త్వరగా ఇంటి స్వప్నాన్ని సాకారం చేసుకుంటున్నారు. ఊళ్ళు పట్టుకు తిరిగే వారు ఈ విషయంలో కొంచెం వెనకబడే వున్నారని చెప్పాలి. ఈ పరిస్థితి ఇప్పుడు మారుతోంది. రిటైరయ్యాక సెటిలవ్వాలనుకున్న చోట ఇల్లు ఏర్పరచుకుంటున్నారు. ఆలోగా అద్దెకిస్తున్నారు.

ఉన్నత వర్గాల వారికి ఇళ్ళకొరత వుండదు. క్రింది తరగతి వారు చిన్నగూడులోనో అద్దింట్లోనో సర్దుకు పోతున్నారు. బడుగువర్గాల వారికి ప్రభుత్వమూ గృహాలు నిర్మించి ఇస్తోంది. ఇహ మధ్య తరగతి వారికి మాత్రమే ఇల్లు ఓ స్వప్నంగా మారి ఊరిస్తోంది. ఆ కలని నిజం చేసుకోవాలన్న తాపత్రయం వుంటే చాలు అందుకెన్నో మార్గాలున్నాయి.

ఇల్లు ప్రశాంతంగా జీవించడానికే కాదు ప్రశాంతంగా మరణించడానికీ అవసరమే. అద్దింట్లో వుంటే అవసానదశలో అనారోగ్యంతో బాధ పడితే ఇంటివారు ఇబ్బంది పెట్టవచ్చు. ఇంట్లో చనిపోకూడదని చనిపోతే ఇల్లు 'మైల' పెట్టాల్సొస్తుందని చనిపోక ముందే బయట 'పెట్టెయ్యమని' ఆంక్ష విధించవచ్చు.

స్వంత ఇల్లు వుంటే కడ ప్రయాణం ప్రశాంతంగా సాగిపోతుంది!

వేదంలో గృహప్రశంస

అథర్వవేదంలో ఇంటి గురించి ఏమన్నారో చూడండి.

'గృహమా! నీవు దేవివి. వాస్తు పత్నివి. ధాన్యపోషకవు. తొలుత నిన్ను దేవతలు నిర్మించినారు. నీవు గడ్డిని కప్పుకున్నదానవు. మంచి మనసున్న దానవు. నీలో నివసించు మాకు పుత్రసహిత ధనము కలిగించుము'

'గృహమా! నీలో ఉండువారు ఆర్తులు కారాదు. నీలో వసించు మేము పుత్ర పౌత్రులతో సంపన్నులమై శతశరత్తులు జీవింతుముగాక!'

ఇల్లు మంచి పెట్టుబడి

ఇంటి మీద రాబడి వుండదు గనుక దాని మీద ఎంత పెట్టుబడి పెట్టినా దండుగే అనే వారు పూర్వం. తెలివి తక్కువ వాడు ఇల్లు కడతాడు తెలివైన వాడందులో అద్దెకుంటాడనీ అన్నారు.

ఇళ్ళకి డిమాండ్ పెరగటంతో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

ఇంటి మీద అద్దె బాగా వస్తోంది. వ్యాపార అవసరాలకిస్తే మరింత ఎక్కువ లభిస్తోంది. విలువ కూడా రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా భూమి విలువలో పెరుగుదల అధికంగా వుండటంతో ఇంటి విలువ వేగంగా వృద్ధి పొందుతోంది.

పెట్టిన పెట్టుబడి కళ్ళెదుట కన్పిస్తుంది. అంచేతే వీటిని 'రియల్ ఎస్టేట్' అంటారు. అవసరమైతే తాకట్టు పెట్టి అప్పు తీసుకోవచ్చు. అత్యవసర పరిస్థితిలో అమ్ముకోవచ్చు.

అప్రిసియేషన్ – అనగా ఆస్తి విలువలో పెరుగుదల అత్యధికంగా వుంటోంది. రాబడీ బాగానే వుంటోంది. గనుక ఇంటి మీద పెట్టుబడి పెట్టవచ్చు. అది సురక్షితం. లాభదాయకం!

గృహఋణాలు

డబ్బు మూట వుంటేనే ఇల్లు – అనే దానికి కాలం చెల్లింది.

ఆదాయం వుంటే చాలు ఇంటి కోసం అప్పివ్వడానికి బ్యాంకులూ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలూ పోటీ పడుతున్నాయి. తక్కువ వడ్డీకి అప్పు లభిస్తోంది.

10 నుంచి 20 సంవత్సరాల వరకూ అప్పుతీర్చడానికి నెలసరి వాయిదాలు నిర్ణయిస్తున్నారు. కొంత అద్దె వస్తుంది గనుక పెద్దగా భారం ఫీలవకుండానే అప్పు తీర్చుకోవచ్చు. కొన్ని చోట్ల ఋణకిస్తుకు సరిపోయేంత అద్దె లభిస్తోంది కూడా!

ఇంటి స్థలానికీ ఇల్లు కట్టుకోడానికీ లేదా ఇల్లు, ఫ్లాట్, అపార్ట్‌మెంట్, డూప్లెక్స్ హౌస్ – కొనడానికీ అప్పు ఇస్తున్నారు. కొన్ని బ్యాంకులు ఇంటి ఫర్నిచర్‌కి కూడా ఇంటితో బాటు అప్పిస్తున్నాయి.

మీ ఆర్థిక పరిస్థితిని బట్టి మీకనుకూలమైన బడ్జెట్‌లో రేంజ్‌లో కొనుగోలు చేయవచ్చు. స్వంత ఇంటి కలని నెరవేర్చుకోవచ్చు.

ఊరికి కాస్త దూరంగా వెళ్ళినట్లయితే తక్కువ రేటుకి స్థలాలూ ఇళ్ళూ లభిస్తాయి. ఊరు విస్తరించగానే అదీ ఊరిలో భాగమైపోతుంది కదా!

ఇల్లు కట్టిచూడు

'ఇల్లు కట్టిచూడు పెళ్లి చేసి చూడు' అన్నారు. ఆ రెండిట్లో సాధక బాధకా లెక్కువ. సమాజంలోని అన్ని వర్గాలతోనూ పని బడుతుంది. ఏది లేకపోయినా కొరతే అవుతుంది. రెండిట్లోనూ అంచనాలు తారుమారవుతాయి!

అలా అని కట్టినవో పాతవో కొనే కన్నా కొత్తగా నిర్మించుకోవడం మంచిది. మీక్కావల్సినట్టు మీ అవసరాలకీ అభిరుచులకీ తగ్గట్టు కట్టుకోవచ్చు.



స్వంతంగా కట్టుకున్నప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువే అవ్వొచ్చు. క్వాలిటీ వస్తువుల్ని వాడటం వల్ల అలా జరుగుతుంది. అంటే ఖర్చు పెరిగినా ఆ మేరకు క్వాలిటీ కనిపిస్తుంది.

ఇంటి నిర్మాణాన్ని కాంట్రాక్టు కిచ్చినట్టయితే అతడు లాభానికే ఆ పని చేస్తున్నాడు గనుక ప్రతిదాన్లో మిగుల్చుకోవాలని చూస్తాడు. నాసిరకంవి కొన్నైనా వాడి తీరతాడు – మీరెంతెక్కువకి మాట్లాడుకున్నా సరే!

వస్తు సామాగ్రిని మీరు సమకూరుస్తూ లేబర్ వరకూ మేస్త్రికి లేబర్ కాంట్రాక్టు ఇవ్వటం కొంత వరకూ మంచిది. అనవసరపు తలనొప్పులు తగ్గుతాయి గనుక నాణ్యత మీద శ్రద్ధ పెట్టవచ్చు.

కట్టిన కొత్త ఇళ్ళు లేక అపార్ట్‌మెంట్ లేదా పాత ఇళ్ళు కొనదలిస్తే మొదట సివిల్ ఇంజినీరుకి చూపించాలి. నిర్మాణపునాణ్యత ఎలా వుందో తెలుసుకున్నాకే బేరానికి కూర్చోవాలి. మార్పు చేర్పులకవకాశం వుందో లేదో, వుంటే అదనంగా ఎంత ఖర్చవుతుందో లెక్క వేసుకోవాలి.

స్కూటర్ మరియు కారు పార్కింగ్ విషయాల్లో అశ్రద్ధ కూడదు. ఇవాళ గాక పోయినా రేపవి తప్పనిసరి అవసరాలు!

దంపతులు స్వయంగా శంకుస్థాపన చేసిన ఇంట్లో జీవించ గలగటం అరుదుగా అభించే ఓ అద్భుత వరం!

వాస్తు పాటించండి

వాస్తు నిజమా అబద్ధమా అన్న తర్కం వద్దు. వాస్తుని పాటించండి.

వాస్తులో వాస్తవం లేక పోలేదు.

గాలి వెలుతురు పుష్కళంగా లభించేలా సూత్రాలేర్పరచింది వాస్తు. మంచి నీరు ఎటురావాలో, మురుగు నీరు ఎటు వెళ్ళాలో, లెట్రిన్ కుండీలు ఎక్కడుంటే ఇబ్బంది వుండదో, వంట ఏ ప్రక్కన చేసుకుంటే అనుకూలమో అన్నీ వివరిస్తుంది.

మీ కిష్టమున్నా లేక పోయినా వాస్తుని పాటించండి. అలాగని తమకి తాము బిరుదులు తగిలించుకున్న పండితుల్నిగాక స్థూలంగా వాస్తుని వివరించే వారిని గాని గ్రంథాలని గాని సంప్రదించండి.

మీకు నమ్మకం లేక పోయినా మీ ఇంట్లోకి అద్దెకు రావాలనుకున్నవారికి వాస్తు మీద నమ్మకం వుండొచ్చు. వాస్తు ప్రకారం నిర్మిస్తే ఆ ఇంట్లో సుఖంగా వుండగలమన్న ధీమా వారికీ కలుగుతుంది కదా.

మరీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇల్లు అమ్మాల్సి రావచ్చు. ఎక్కువగా అప్పుల పాలయ్యో ఆర్థిక ఇబ్బందుల వల్లో ఇల్లు అమ్ముతారు గనుక ఇంటి వాస్తు గురించి కొనదల్చుకున్నవారు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. వాస్తు బాగుండనట్టయితే వెనకడుగేస్తారు. లేదా మార్పులకి ఖర్చవుతుందంటూ తక్కువ రేటుకి బేరమాడతారు.

ఇదే వాస్తు బాగున్నట్టయితే ఎక్కువ మంది కొనుగోలుదార్లు ఆసక్తి చూపుతారు.

ఈశాన్యపు ఇళ్ళూ స్థలాలూ హాట్ కేక్స్‌లా అమ్ముడవడం గమనించే వుంటారు. వాస్తు బాగున్న ఇళ్లు స్థలాలు కొనడానికి పోటీ పడతారు. పోటీ వున్నప్పుడు అధిక విలువ వస్తుంది. అంటే వాస్తు వల్ల ప్రయోజనం చేకూరినట్టే కదా!

అనుకూలంగా గదులు

పడక గది పూర్తిగా వ్యక్తిగతమైంది. దంపతులకి ఆ గదిలో ఆగదితో వుండే అనుబంధం చాలా బలమైంది. అందుకు తగినట్టుగా ఎటాచ్డ్ బాత్‌రూంతో ప్రైవసీ వుండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. లేతరంగులు వేయించాలి. బెడ్ పరుపు దిండ్లు సుఖనిద్రకనుకూలంగా వుండాలి. ఆ పైన అలంకరణా, ఏసీలాంటి సౌకర్యాలూ మీ ఇష్టం.

పిల్లలకి ప్రత్యేక గది వుండాలి. పడుకోడానికి స్వేచ్ఛగా తిరగాటానికి ఇండోర్ గేమ్స్ ఆడుకోడానికి అనువుగా వుండాలి. పుస్తకాలకీ బట్టలకీ షెల్ఫ్‌లుండాలి. సీలింగ్ రేడియంతో చంద్రుడూ నక్షత్రాలు మెరిసేలా ఏర్పాటు చేస్తే పిల్లలు ఆనందిస్తారు. కాట్స్ గదిని ఆక్రమించ కుండా ఒకదానిమీద ఒకటి వుండే కాట్స్ సెట్ బెటర్. ఎమర్జెన్సీ బెల్‌ని ఏర్పాటు చెయ్యడం మరువకూడదు.

హాలు అతిథులు కూర్చోడానికీ టీవీ చూడటానికీ అనుకూలంగా వుండేట్లు కాస్త పెద్దదిగా ఏర్పాటు చేసుకోవాలి. సోఫాలూ దివాన్ గోడలకు చిత్రాలు పెయింటింగ్స్ తల్లిదండ్రుల ఫొటోలు షోకేస్‌లో బొమ్మలు – మీ శక్త్యానుసారం అలంకరించుకోండి. హాలులో ఎక్కువ సమయం గడుపుతారు గనుక కంటికీ మనస్సుకీ హాయిగా వుండేట్లు చూసుకోవాలి.

వంటగదిని అస్సలు నిర్లక్ష్యం చెయ్యొద్దు. వెంటిలేషన్ బాగుండాలి. పొగ బయటి కెళ్ళడానికి ఎగ్జాస్ట్‌ఫాన్ కన్నా చిమ్నీలు బెటర్. ప్లాట్‌ఫాం ఇల్లాలు ఎత్తుకు సరిపోయేట్టు ఉండేలా చూసుకోవాలి. వంట సామాన్లు, గ్యాస్ సిలెండర్, పప్పులూ ఉప్పులూ దాచుకోడానికనువుగా ప్లాన్ చెయ్యండి. వంటింటి శుభ్రత మీద మీ ఆరోగ్యం ఆధారడి వుంటుందని గుర్తుంచుకోండి.

ఇంటి గురించి శ్రద్ధ

ఇంటి రక్షణ విషయంలో జాగ్రత్త వహించాలి. తాళంవేసి పొరుగూరు వెళ్ళినా దొంగలు చొరబడని విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు ముందే చేసుకోవాలి.

కాలింగ్ బెల్ మ్రోగగానే గబుక్కు నెళ్ళి తలుపు తీయకూడదు. ముఖ్యంగా ఈ విషయంలో పిల్లలకు తగిన తర్ఫీదు నివ్వాలి. వచ్చిందెవరో తెలుసుకున్నాక గాని తెరవకూడదు. మీ ఇల్లు ఊరికి కాస్త దూరంగా ఐసోలేటెడ్‌గా వుండి వుంటే ద్వారానికి ఐరన్ డోర్ అదనంగా ఏర్పాటు చేసుకోవాలి. తలుపు తీసినా ఐరన్ డోర్ తెరవకుండా మాట్లాడి పంపించెయ్యొచ్చు.

ఇంటినీ ఇంట్లోని ఫర్నిచర్నీ టీవీ, ఫ్రిజ్, ఏసీ లాంటి సామాగ్రినీ పూర్తిగా ఇన్సూర్ చేయించాలి. డొమెస్టిక్ ఇన్స్యూరెన్స్ పాలసీ తీసుకోవడం బెటర్. ప్రీమియం తక్కువగా వుంటుంది. అధిక భద్రత లభిస్తుంది.

ఇంట్లో విలువైన వస్తువుల్నీ డాక్యుమెంట్లనీ ఉంచుకోవద్దు. బ్యాంకు లాకర్లో దాచుకోవాలి. లాకర్ అద్దె ఎక్కువగా వుండదు.

ఏడాది కాలంగా ఉపయోగించని ఏ వస్తువునీ ఇంట్లో వుంచు కోవద్దు. పాత దుస్తుల్నీ పాత వస్తువుల్నీ పాడైన వస్తువుల్నీ పేదలకు పంచండి. పనికి రాని వస్తువుల్తో ఇంటిని నింపుకుని అసౌకర్యానికి గురికావద్దు.

ఇరుగుపొరుగుతో సఖ్యత

మీది ఇండిపెండెంటు హౌస్ అయినా అపార్ట్‌మెంట్ అయినా ఇరుగు పొరుగుల్తో కాలనీ సంఘంతో లేక అపార్ట్‌మెంట్ కమిటీతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలి.

మీరు వారికి సహాయపడండి. వారు మీకు సహాయపడతారు. చేయిచేయి కలిపితే అపార్ట్‌మెంట్స్‌ని లేదా కాలనీని బాగు చేసుకోవచ్చు. పార్కు, ఆటస్తలం, జిమ్‌లాంటివి ఏర్పాటు చేసుకోవచ్చు. పండుగలకీ పబ్బాలకీ కలవవచ్చు. వనభోజనాలు, రాత్రి గస్తీ లాంటివి ఏర్పాటు చేసుకోవచ్చు.

వృద్ధులకు ఊరుకి దూరంగా వుండే స్వంతంత్ర ఇళ్ళ కన్నా అపార్ట్‌మెంట్లు మెరుగు. ఉమ్మడి సౌకర్యాలు, రక్షణ, చేదోడువాదోడు లభిస్తాయి. తోటి వృద్ధుల్తో కలిసి హాయిగా కాలక్షేపం చేయగలుగుతారు.

ముదిమిలో పెన్షన్

స్వంత ఇల్లు వృద్ధాప్యంలో పెద్ద అండగా వుంటుంది.

వృద్ధుల కోసం బ్యాంకులు ఈ మధ్యే ప్రారంభించిన కొత్త స్కీము వల్ల ఇది సాధ్యమవుతోంది.

బ్యాంకులు ఇంటిని 'రివర్స్ మార్ట్‌గేజ్' (సంప్రదాయ తనఖాకి భిన్నమైంది) పెట్టుకుని వృద్ధులకు అప్పు ఇస్తున్నారు.

60 ఏళ్ళు దాటిన వారికి వారు నివసిస్తోన్న ఇంటి మీద మాత్రమే అప్పు ఇస్తారు. ఇంటి విలువని బట్టీ భార్యాభర్తల వయస్సుని బట్టీ ఋణ మొత్తాన్ని నిర్ణయిస్తారు.

ఋణాన్ని పెన్షన్ లాగా నెల నెలా కొంత సొమ్ము చొప్పున ఇస్తూంటారు. వారు బ్రతికినంత కాలం అలా ఇస్తారు. ఆదాయం లేని వారికిది బంగారు అవకాశమే.

ఈ అప్పు గాని వడ్డీ గాని తీర్చనక్కర్లేదు. వారు చనిపోయాక ఇల్లు అమ్మి అప్పు వడ్డీ రాబట్టుకుంటారు. మిగిలిన సొమ్ముని వారసులకిస్తారు.

ఒకవేళ మీరు గాని మీ పిల్లలు/వారసులు గాని అప్పు తీర్చాలనుకుంటే నిరభ్యంతరంగా తీర్చేసుకోవచ్చు. ఇంటిని విడిపించుకోవచ్చు.

ఈ ఋణాలు కేవలం నివాస ముంటున్న ఇల్లు/ఫ్లాట్/అపార్ట్‌మెంట్ ల మీద మాత్రమే ఇస్తున్నారు.

సో–ఇల్లు మీ వృద్ధాప్యం హాయిగా గడిచేందుకు పెన్షన్ సౌకర్యాన్ని సైతం ఏర్పాటు చేస్తోంది.

సంతానం కన్నా మిన్నగా ఇల్లు – నీడనీ ఆశ్రయాన్నీ భరోసానీ భద్రతనీ పోషణనీ ఇస్తోందన్న మాట!

ఇల్లే స్వర్గం

ఇంటిని స్వర్గంగా మార్చు కోవచ్చు. నరకంగానూ మార్చు కోవచ్చు. అంతా మీ చేతుల్లోవుంది.

చిన్నదైనా సరే చక్కని ఇల్లు కట్టుకోండి. చిన్న గార్డెన్ వీలు కాకపోతే కొన్ని చెట్లు ముఖ్యంగా వేప, మామిడి, కొబ్బరి పెంచండి. ఇంట్లో ఆహ్లాద వాతావరణం కల్పించండి.

కోపాలు చికాకులు అనుమానాలు సాధింపులు – లేకుండా రాకుండా జాగ్రత్తపడండి. ఇంట్లో అడుగు పెడుతూనే రిలీఫ్ ఫీలయ్యేలా ఎప్పుడెప్పుడు ఇంటి కెళ్దామా అని ఆత్రపడేలా వుండాలి మీ ఇల్లూ మీ ఇంట్లో వాళ్ళూ.

అలాంటి వాతావరణాన్ని సృష్టించాల్సింది మీరే. అది మీకే సాధ్యం.

మీ ఇంట్లో నవ్వులూ సంగీతపు అలలూ శాంతి మువ్వల సవ్వడులూ ప్రతిధ్వనించాలంటే మీరు గృహస్థధర్మాలను తు.చ. తప్పక పాటించి తీరాలి!

69

వృద్ధాప్యం

జీవితపు మొదటి సగంలో అందం, ఆకర్షణ గ్లామర్, ఉత్సాహం, ఆరోగ్యం, శక్తి, గుర్తింపు, పోటీతత్వం వగైరాలుంటాయి.

వాటిని చూసి పొంగి పోతారు. గర్విస్తారు. వాటినింకా ఇంకా ఇనుమడింప జేసుకోవాలని కృషి చేస్తారు.

ఎప్పటికీ అలాగే వుంటామన్న భ్రమలో వుంటారు.

కాని వయస్సు పశ్చిమాద్రికి తిరుగుతుంది.

రెండో సగంలో ప్రవేశిస్తారు. మొదటి సగంలో గర్వానందాలని కలుగజేసినవన్నీ క్రమంగా తగ్గిపోతాయి. తగ్గుముఖం పడతాయి.

అస్తమించే సూర్యుడు ఉదయించే సూర్యుడంతటి శక్తి కలవాడు కాదని అర్థమవుతుంది.

వృద్ధాప్యం అనివార్యం. రాజు అయినా పేద అయినా ఆ దశ అనుభవించాల్సిందే. దాని గురించి దిగలుపట్టం భయంపట్టం దుఃఖించడం అవివేకం!

ముందుచూపు ఉండాలి

'వర్షార్థ మష్టా ప్రయతేత మాసాన్, నిశార్ధ మర్థందిన సేయతేత

వార్థక్య హేతో ర్వయసా నవేన, పరత్ర హేతో రిహ జన్మవాచ'

వర్షాకాలపు నాలుగు నెలల కోసం మిగిలిన నెలల్లోను, రాత్రి కోసం పగటి పూట, ముసలితనం కోసం యౌవనం లోను, పరం కోసం ఈ జన్మ లోను – కావలసిన ప్రయత్నాలు చేసుకోవాలి.

వృద్ధాప్యం వస్తుందని ముందే తెలుసు. అప్పటి పరిస్థితి అవసరాలు ముందే వూహించి తగిన సన్నాహాలు ముందు నుంచే చేసుకోవాలి. అంతేకాదు మానసికంగా ఆ దశను తట్టుకోవడానికి సంసిద్ధమూ కావాలి.

చేతులు కాలేక ఆకులు పట్టుకోవద్దు. ముసలితనంలో అయిన వాళ్ళు ఆదరించలేదని నిందించకుండా ముందే జాగ్రత్త పడటం మంచిది. కొడుకులూ కూతుళ్ళూ పోషించరనీ నిర్లక్ష్యం చేస్తారనీ కాదు. వారి మీద సైతం ఆధార పడాల్సి రాని స్థితిని ముందుగానే ఏర్పాటు చేసుకోవడం వాంఛనీయం.

ఆర్థికరీత్యా ఆరోగ్యరీత్యా డిపెండెంట్‌గాక ఇండిపెండెంట్‌గా వుండగలగాలి!

బాధ్యతల్ని పూర్తి చేసుకోవాలి

యాభయ్యేళ్ళు దాటిన వారంతా వృద్ధుల క్రిందే లెక్క.

అంచేత యాభయ్యో గంట మ్రోగేసరికి 'మూట ముల్లె' సర్దుకోవడం ప్రారంభించాలి.

పిల్లలు పెళ్ళి కెదిగి వుంటారు గనుక వారికి పెళ్లిళ్ళు చెయ్యాలి. వారినో ఇంటి వారిని చేస్తే గాని తల్లిదండ్రుల బాధ్యత పూర్తవదు.

తమ వివాహంతో మొదలైన 'అసలు జీవితం' తాలూకు అసలు బాధ్యత పిల్లల వివాహంతో గాని ముగియదన్నమాట.

వివాహం నుంచి వివాహాల వరకూ గల ప్రయాణమే మనిషి జీవితం అంటే అతిశయోక్తి కాబోదు!

కాని ఆలస్యంగా పెళ్లైతే మాత్రం పిల్లలింకా ఉన్నత విద్యల్ని అభ్యసిస్తూంటారు. అటువంటప్పుడు అది పూర్తయ్యి ఉద్యోగంలో స్థిర పడేవరకూ వేచి వుండక తప్పదు.

అంతదాకా పరుగు తప్పదు. శ్రమ తప్పదు. టెన్షనూ తప్పదు!

పిల్లలు సెటిలయ్యాకే పెద్దలకు నిశ్చింత. విశ్రాంతి.

అంచేత ఎంత త్వరగా ముఖ్య బాధ్యతల్నుంచి విముక్తమవ్వగలిగితే అంత మంచిది. అప్పుడిహ సంతోషంగా రిటైర్మెంట్ కోసం ఎదురు చూడవచ్చు!

ఆరోగ్య జాగ్రత్తలు

వయస్సు పైబడే కొద్దీ శరీరంలో బిగి సడలుతుంది. పట్టు కోల్పోతారు

చత్వారం పెరుగుతుంది. బీపీ, షుగర్ వచ్చే అవకాశాలెక్కువ. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. రోగాలు తేలిగ్గా వస్తాయి కష్టంగా వెళ్తాయి.

వృద్ధాప్యం కష్టతరమే. అనారోగ్యం, బలహీనత, చేతనారాహిత్యం – ఎన్నో సమస్యలు. అయినా ప్రకృతి సహజమైన వృద్ధాప్యాన్ని ఎదుర్కోక తప్పదు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటూ చక్కని ఆహారపు అలవాట్లతో తగిన వ్యాయమంతో ముందుకు సాగాలి. మనస్సుని ప్రశాంతంగా ఆధ్యాత్మిక చింతనతో ఉంచుకోవాలి.

మితాహారం, ఉదయపు నడక, మధ్యాహ్నపు కునుకు, రాత్రి నిద్ర తగ్గుదల, ఆధ్యాత్మిక చింతన – తప్పవు!

యోగా చేస్తే బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలు తగ్గుతాయి. ఆరోగ్య రక్షణకు మేలైంది. ఇంట్లోనే చేసుకో గలిగింది యోగ.

ఊహించని వైద్య ఖర్చుల నుండి రక్షణ పొందటానికి గాను మెడిక్లెయిమ్ పోలసీ తీసుకోవడం మరువవద్దు.

రిటైర్మెంట్

ఉద్యోగులైతే 58 లేదా 60 ఏళ్ళకు రిటైరవుతారు. వ్యాపారులకు రిటైర్మెంట్ అంటూ ఉండదు. అయినప్పటికీ వారు కూడా 'యాక్టివ్ బిజినెస్' నుంచి రిటైర్‌మెంట్ తీసుకుని సలహాలకీ సూపర్ విజన్‌కీ పరిమితమవ్వడం శ్రేయస్కరం.

ఉద్యోగం చేస్తున్నంత కాలం ఆఫీసు, ఫైల్సు, రూల్సు తప్ప మరో లోకం ఉండదు. సహోద్యోగుల్లోనే ఎక్కువ మంది మిత్రులుంటారు. రోజులో ఎక్కువ సమయం ఆఫీసులోనే గడుపుతారు.

అలాటిది రిటైర్ అయ్యేసరికి ఒక్కసారిగా డీలాపడిపోతారు. అధికారం, హోదా, గౌరవం, సర్కిల్– అన్నీ పోయే సరికి ఏదో శూన్యం మరేదో స్తబ్దత ఆవరించినట్టై పోతారు. ఒక్కసారిగా పదేళ్ళు పైబడినట్టుగా అయిపోతారు. నిరాశ పడతారు. ఎందుకూ పనికిరానివారమా – అన్న భావం వివశుల్ని చేస్తూంటుంది. బ్రతుకు రసహీనంగా కన్పిస్తుంది.

అంతలా కృంగి పోవాల్సిన పనిలేదు. ఉద్యోగం నుంచి మాత్రమే రిటైరయ్యారని గుర్తుంచుకోవాలి. చెయ్యాలంటే ఎన్ని పనులైనా చెయ్యొచ్చు. ఎన్ని కార్యాలైనా నిర్వహించవచ్చు. అనుభవానికి పెద్ద పీట వేసే సంస్థలూ ఉన్నాయి.

కాని ఆర్థిక అవసరాల ఒత్తిడి వుంటే తప్ప మరో ఉద్యోగంలో చేరడం అనవసరం. అక్కడ జూనియర్ అవుతారు గనుక మునుపటి స్థాయిలో గౌరవమర్యాదలు లభించకపోతే

ఖిన్నులవుతారు. కొత్త వాతావరణంలో ఇమడడానికి కొత్తగా గుర్తింపు తెచ్చు కోడానికి స్ట్రగుల్ అవాల్సొస్తుంది, జాగ్రత్త!

ఇష్టంగా మలచుకోండి

రిటైర్మెంట్‌తో అంతా అయిపోయిందని వాపోకుండా కొత్త దశకి అది నాందిగా భావించాలి.

బాధ్యతలు తీరి పోయాయి. మోయాల్సిన బరువుల్లేవు. సంతృప్తిగా పదవీ విరమణ చేశారు. పెన్షన్ లేదా అద్దె లేదా సేవింగ్స్ మీద వడ్డీ వస్తుంది. అధికాదాయం కోసం తాపత్రయ పడాల్సిన అవసరం లేదు.

అంచేత మిగతా జీవితాన్ని తమకిష్టమైన రీతిలో మలచుకోవాలి.

తమలో దాగివున్న లలితకళల్ని బయటికి తీసి పదును పెట్టొచ్చు. మీ అనుభవజ్ఞానం తోడవడంవల్ల అందులో కొత్త శిఖరాలధిరోహించవచ్చు కూడా.

రాజకీయాల్లో ప్రవేశించవచ్చు. సేవాకార్యక్రమాలు చేబట్టవచ్చు. వివిధ శరణాలయాలకు చేయూత నివ్వవచ్చు. ధార్మిక కార్యక్రమాలలో ఆధ్యాత్మిక కార్యక్రమలలో పాల్గొనవచ్చు. జీవిత చరిత్ర రాసుకోవచ్చు.

ఎలా ఉంటే ఆనందంగా ఉల్లాసంగా వుంటుందో ఏం చేస్తే ఆహ్లాదంగా అన్పిస్తుందో అలా చేయండి. జీవితాన్ని పూర్తిగా జీవన సహచరి/సహచరుడితో అనుభవించండి.

అనివార్యమైన వృద్ధాప్యాన్ని అందంగా అపురూపంగా అమూల్యంగా మలచుకునే వీలుంది. అది తమ చేతుల్లోనే ఉంది!

అభద్రత సహజం

భవిష్యత్తు గురించి జీవిత భాగస్వామి గురించి కొంత అభద్రత ఉంటుంది. ఆందోళన వుంటుంది. రోగ భయమూ భయపెడ్తూంటుంది.

ఆర్థిక స్థిరత్వం లేనివారికి అది రెట్టింపవుతుంది. సంతానం యొక్క దయాదాక్షిణ్యం మీద ఆధారపడాల్సి వస్తుంది.

విద్య, స్థిర సంపాదనా లేని గత తరం కన్నా భిన్నమైనదీ తరం. విభిన్న అవకాశాలూ వున్నాయి. గనుక ముందే మేల్కోవడం జాగ్రత్తపడటం తప్పనిసరి!

ఇన్నేళ్ళు భార్యా భర్తా చేయి చేయి పట్టుకుని కలిసి నడిచి ఇంతదూరం వచ్చారు. ఇకపై ఏమవుతుందో ఎవరు ముందు చేయి వదిలేస్తారో – అన్న భయాందోళన ఉంటుంది. ఆపైన ఒంటరితనం ఆగమ్యగోచరమైన భవిష్యత్తు భయభ్రాంతుల్ని చేస్తూంటాయి.

అయినా ఒకరికొకరు ధైర్యం చెప్పుకోవాలి. మనస్సుని చెదరనివ్వకూడదు. భార్యాభర్తలు శారీరక ఆకర్షణతో గాక మానసిక బంధంతో చేరువయ్యే సమయమిదే!

'భార్యాం భాగ్య పరిక్షయే' – భర్త వయస్సు పెరిగాక ఆదాయం ఆరోగ్యం తగ్గాక పూర్వం లానే ఏ భార్య తన భర్తని ఆదరిస్తుందో ఆమెని నిజమైన భార్యగా లెక్కించాలిట. ఇది భర్తకీ వర్తిస్తుంది.

ఆధునిక వైద్య సదుపాయాల వల్ల వయస్సు పెరిగినా మనస్సు పదేళ్ళు వెనక్కి వెళ్ళినట్టు వుంటోందన్నారీ మధ్య ఓ సర్వేలో వృద్ధులు.

అందుకే 'వయసుతో పని ఏముంది మనసులోనే అంతా ఉంది' అన్నారో సినీకవి.

మనస్సుని ఉల్లాసంగా ఉంచుకుంటే చాలు భవిష్యత్తు ఇంద్రధనుస్సు రంగుల్ని పులముకుంటుంది!

దినచర్య మారాలి

భార్యాభర్తలిద్దరూ కూడా మార్నింగ్ వాక్‌కి వెళ్ళాలి. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తోటి వృద్ధుల్ని కలుస్తూ ఉదయాన్ని సంతోషభరితం చేసుకోవాలి.

తోట పని చెయ్యవచ్చు. తోట లేకపోతే ప్రభుత్వ స్థలాల్లో రోడ్డు కిరుప్రక్కలా మొక్కలు పాతి వాటి సంరక్షణ చూడవచ్చు. సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గోవచ్చు.

గ్రంథాలయాలకీ సాహిత్య గోష్ఠులకీ నాటక ప్రదర్శనలకీ వెళ్ళవచ్చు.

దేవాలయాలకీ తీర్థయాత్రలకీ తిరగవచ్చు. ఆధ్యాత్మికోపన్యాసాలు వినవచ్చు. ఇవ్వవచ్చు.

అనాథశరణాలయం వృద్ధాశ్రమం వగైరాలకెళ్ళి చేయగల్గిన సాయం చెయ్యొచ్చు. సాటి వయస్సు వారితో గడపవచ్చు.

ఇంట్లోకి కావాల్సిన కాయగూరలవీ కొని తేవచ్చు. అది నామోషీగా భావించొద్దు.

మనవల్ని స్కూలుకి తీసుకెళ్ళడం, పార్కుకి తీసుకెళ్ళడం చెయ్యవచ్చు. హోం వర్కు చేయించొచ్చు. చిన్ననాటి కబుర్లూ కథలూ చెప్పవచ్చు. పురాణ కథలు వినిపించొచ్చు.

అలా అని పిల్లల పెంపకంలో క్రమశిక్షణలో అతిగా జోక్యం చేసుకోకూడదు. అది వారి తల్లిదండ్రులకి వదిలెయ్యాలి. వారి దృక్పథానుసారం వారు పెంచుతారు. కాల మార్పుని గౌరవించాల్సిందే.

పైవన్నీ దంపతులిద్దరూ జంటగా ఒకరికొకరు ఆసరాగా నిర్వర్తించాలి!

నలుగురు కావాలి!

ప్రతి మనిషీ జీవితంలో కనీసం నలుగుర్ని సంపాదించు కోవాలంటారు – అంతిమ యాత్ర కుపయోగిస్తారని!

కాని వార్ధక్యంలో పది మందైనా కావాలి. ఇంకా ఎక్కువ మందిని సంపాదించుకోగలిగితే పెద్ద అదృష్టమే అవుతుంది.

కడకి తనూ తన జీవిత నేస్తం – ఇద్దరే మిగుల్తారు. మిగతా పక్షులన్నీ ఎగిరిపోతాయి. తమతో బాటు తామిద్దర్నీ చల్లగా చూచే 'గూడు' కూడా ఉంటుంది సుమా!

భరించరానంత ఒంటరితనం, ఏమీ చెయ్యలేకపోతున్నామన్న బాధ, అంతా దూరమయ్యారన్న వేదన, చీటికీ మాటికీ దాడి చేసే రోగాలు – వీటితో సతమతమవడం తేలికకాదు.

ఏదో వ్యాపకమో ప్రవృత్తో కల్పించుకుంటే ఫర్లేదు. లేకపోతే అది భరించరాని స్థితి అవుతుంది.

అటువంటప్పుడు చుట్టూ పదిమంది ఉంటే బలంగా ఉంటుంది. సందడిగా ఉంటుంది.

ధైర్యంగా ఉంటుంది. అనుభవాలని అభిప్రాయాలని పంచుకోవచ్చు. అంతా కలిసి సమాజ సేవ చేయవచ్చు.

నలుగుర్తో నారాయణ!

మెనోపాజ్

స్త్రీలు మెనోపాజ్ దశకు – అంటే బహిష్టులు ఆగిపోయే స్థితికి చేరుకుంటారు.

దానికి ముందూ తర్వాత కూడా హార్మోనుల సమతుల్యత లోపించి అనేక శారీరక మానసిక ఇబ్బందులు గురవుతారు.

శరీరం పొడిబారుతుంది. ఎముకలు బలహీనమవుతాయి. దద్దుర్లు, దురదలు రావచ్చు. అనీజీనెస్, చికాకు, కోపం పెరుగుతాయి. లైంగిక కోరికలు తగ్గిపోతాయి.

డాక్టర్‌ని సంప్రదించి తగిన విటమిన్, కాల్షియం టాబ్లెట్లు వాడాలి. ఈ దశలో వాడటానికి ప్రత్యేకమైన టాబ్లెట్స్ వస్తున్నాయి. అవి అనేక ఇబ్బందులు అధిగమించేలా చేస్తున్నాయి.

భర్త, ఇతర కుటుంబ సభ్యుల సహకారం వారికి చాలా అవసరం.

వీలునామా

ఆస్తి పాస్తుల్ని వారసులికి పంచి ఇవ్వాలి. కలతల్ని నివారించాలి. కలహాలకి కోర్టు కేసులకి ఉద్వాసన పలకాలి.

ఏ కారణం చేతనైనా పంచకపోతే పంచడానికిష్టం లేకపోతే వీలునామా రాయాలి.

అది తమ మరణానంతరమే అమలులో కొస్తుంది. రిజిష్టర్ చేసినప్పటికీ ఎప్పుడైనా ఎన్ని సార్లైనా దాన్ని మార్చే హక్కు వారికి ఉంటుంది.

అనుబంధాలు

ఉన్నతమైన కుటుంబ విలువలకు నెలవు మనదేశం. అనుబంధాలకూ ఆప్యాయ తలకూ అధిక ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి మనది.

పిల్లల ఉద్యోగ వ్యవహారరీత్యా దూర తీరాలకు వెళ్తున్నప్పటికీ తల్లిదండ్రుల్ని మర్చిపోవటం లేదు. ఆర్థిక ఆసరా ఏర్పాటు చేస్తున్నారు. ఫోన్లలో పలకరిస్తున్నారు. ఇంటర్నెట్లో కన్పిస్తున్నారు. ఆరోగ్యక్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నారు.

శుభకార్యాలకూ పండగలకూ కలుస్తున్నారు. కుటుంబ బాధ్యతల్ని మరచిపోలేదని చాటి చెబుతున్నారు.

సంతానం కొండంత అండగా ఉంటుంది. నిశ్చింతగా ఉండండి. మీ పెంపకాన్ని విశ్వసించండి!

అతి జోక్యం కూడదు

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. పెళ్లిళ్ళయ్యాయి. వారి బాధ్యతలూ కర్తవ్యాలూ వారికి తెలుసు.

కొన్ని కార్యాలకు వారు కొత్త కావచ్చు. ఒకప్పుడు మీరూ అంతేగా. మీలాగే వారూ అలవాటుపడతారు. మీకంటే నైపుణ్యంతో చక్కబెట్టవచ్చుకూడా.

యువత ఆలోచనలకు వడీ వేగం హెచ్చు. సాంకేతిక ప్రతిభ వారికి అదనపు బలం.

అంచేత పిల్లల ఉద్యోగవ్యాపారాల్లో వ్యవహారాల్లో అనవసర జోక్యం చేసుకోవడం అనవసరం. సలహాలకీ సూచనలకీ పరిమితమవడం శ్రేయస్కరం.

వారి జీవితాలని శాసించాలని చూడొద్దు. ఉద్యోగం/వ్యాపారంలో ఎదగలేదు, ఇంటి నిర్వహణ తెలీదు, పెళ్లాం మాటే వింటున్నావు, పిల్లల్ని పెంచడం చేతకాదు – వగైరా మాటలతో నిందించొద్దు. నొప్పించొద్దు.

మీ పరిధిలో మీరుండటం ఇరువురికీ మంచిది!

స్థిత ప్రజ్ఞత్వం

'దుఃఖేష్వ నుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః।

నీతరాగ భయక్రోధః స్థిత ధీర్మని రుచ్యతే॥'

దుఃఖాలు కలిగినప్పుడు కృంగిపోక, సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోక, రెండిటినీ సమబుద్ధితో అధిగమించి అనురాగం, భయం, కోపం వంటి ఉద్రేకాలను విడిచి పెట్టే ధీరుడే స్థిత ప్రజ్ఞుడు. స్థిత ప్రజ్ఞత్వం మహాత్ములకే సాధ్యం. అయినా ప్రయత్నిస్తే కొంతైనా సంతరించుకోవచ్చు!

వృద్ధాశ్రమాలు

సంతానంతో కలిసి ఉండలేకపోతున్న వృద్ధులకు వరం లాంటివి వృద్ధాశ్రమాలు. ఒంటరితనం బాధించదు. ఆలనాపాలనా చూసేవారు, ఆదుకునే వారు, వైద్యసదుపాయం కల్పించే వారు, కాలక్షేపం చేసేవారు – అంతా ఉంటారు. అన్ని సౌకర్యాలూ ఉంటాయి.

కొన్ని ఆశ్రమాలు పేదలకు ఉచిత సేవ చేస్తున్నాయి. వృద్ధాప్యపు ఫించన్లు అందేట్లు చేస్తున్నాయి. ఆర్థికంగా బాగున్న వారికోసం ఎన్నో సౌకర్యాలతో ప్రత్యేక గదులు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్థికంగా బాగున్న రిటైరైన వారికోసం ప్రత్యేకంగా 'రిటైర్మెంట్ హోమ్స్' వచ్చాయి. కేవలం రిటైరైన వారికోసమే వారిని దృష్టిలో ఉంచుకునే నిర్మించబడ్డ గృహ సముదాయాలన్నమాట.

ఆదరణ, భద్రత, సహకారం, ఆరోగ్యం, వైద్య సదుపాయం, వినోదపు ఏర్పాట్లు – వీటి ప్రత్యేకత.

చివరి అంకాన్ని అందంగా ఆనందంగా అన్యోన్యంగా మలచుకోడానికి అనువైన ప్రదేశాలీ ఆశ్రమాలూ రిటైర్మెంట్ హోమ్సూ!

పరివర్తన

వృద్ధాప్యం శాపంకాదు. మనల్ని మనం తెలుసుకునే ఒక అపూర్వ అవకాశం.

పుట్టింది మొదలు ఇంత దాకా చేసిన సమస్త పనుల్నీ సంఘటనల్నీ సమీక్షించుకునే అవకాశం చిక్కుతుంది. చేసిన తప్పులు చెయ్యని పాపాలు చేసిన మేళ్ళు చెయ్యాలనుకున్నా చెయ్యని పనులు – అన్నీ కళ్ళ ముందు కదుల్తాయి.

ఇలా చేసి ఉండాల్సింది, అలా ప్రవర్తించకుండా ఉండాల్సింది – అంటూ మంచి చెడులు బేరీజు వేసుకుంటారు. పశ్చాత్తాప పడతారు. ఆనందిస్తారు. బాధపడతారు. తృప్తి అనుభవిస్తారు.

రకరకాల భావోద్వేగాలు! కన్నీరు! పన్నీరు!

జీవితమంటే ఏమిటో గృహస్థ ధర్మమంటే ఏమిటో అనుభవంలోకొస్తుంది. నాలుగు జీవితగమ్యాలైన ధర్మార్థకామ మోక్షాల స్వరూప స్వభావాల గురించి అవగాహన కలుగుతుంది. ఇంకేదో ఇంకెంతో తెలుసుకోవాలన్పిస్తుంది.

వేదసారం బోధపడ్తుంది. ఏది సత్యమైందో తెలుస్తుంది.

సృష్టికర్త అమోఘలీల కనుల ముందు లీలా మాత్రంగా ఆవిష్కృతమవుతుంది.

కొత్త వెలుగు మనశ్శరీరాల్ని ఆక్రమిస్తుంది!

70

షష్టిపూర్తి

మనిషి జీవితంలో అరవయ్యవ సంవత్సరానికి చాలా ప్రాధాన్యత ఉంది.

వ్యావహారిక జీవితం నుంచి తప్పుకుంటారు. క్రియా శీలక స్థానం నుంచి పదవీ విరమణ చేస్తారు.

సంతానం పూర్తిస్థాయి వ్యక్తులుగా శక్తులుగా ఎదుగుతారు. కుటుంబ నిర్వహణా బాధ్యతలు స్వీకరిస్తారు. దాంతో వృద్ధతరపు స్థానం 'పూజ్య' స్థానానికి మారుతుంది.

పూజ్య అంటే పూజనీయమైనది. శూన్యమైనది!

అలాంటి సంధి దశను ఒక వేడుకగా జరిపించడమే షష్టిపూర్తి.

దీర్ఘ జీవితాన్ని ప్రసాదించిన దేవతలకు కృతజ్ఞత తెల్పడమేగాక మిగిలిన కాలం ఉత్సాహంగా జీవించడానిక్కావలసిన ఉత్తేజాన్నివ్వడానికే ఈ ఉత్సవం!

ఎప్పుడు చెయ్యాలి?

60 సంవత్సరాల ఆయువు పూర్తైన పిదప మరల 60 సంవత్సరాల ఆయువు ప్రసాదించమని భగవంతుడ్ని ప్రార్థిస్తూ చేసే ఉత్సవమే షష్టిపూర్తి మహోత్సవం.

దంపతులిద్దరికీ 60 ఏళ్ళు నిండక్కర్లేదనీ గృహయజమాని భర్త గనుక ఆయనకి అరవై నిండితే ఇద్దరికీ కలిపి షష్టిపూర్తి చెయ్యవచ్చని పెద్దల అభిప్రాయం.

60 నిండేక గాక అరవయ్యో సంవత్సరంలోనే చేసే శాంతి యజ్ఞమే షష్టిపూర్తి అని కొందరి భావన. అది సరికాదు.

తెలుగు సంవత్సరాల అరవై – ప్రభవ నుంచి అక్షయ వరకు. అదొక చక్రం. 60 పూర్తయ్యాక మరో చక్రం మొదలవుతుంది. పునఃప్రారంభమన్నమాట. అందుకే 60 పూర్తయ్యాక చేసుకోవడమే కరక్టు.

పుట్టిన అదే సంవత్సరం, అదే తిథి నాడు లేదా ఆనాటి నక్షత్రం నాడు చేసుకోవాలి. తిథి నక్షత్రాలు తెలీకపోతే ఆ నెలలోని పూర్ణిమ నాడు చేసుకోవచ్చు. నెల తెలీనట్లయితే ఉగాది లేక విజయదశమికి చేసుకోవచ్చు.

ఎవరు చెయ్యాలి?

సంతానంగాని, బంధుమిత్రులుగాని చేయవచ్చు.

ఇంట్లోగాని దేవాలయంలో గాని షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించవచ్చు.

ధర్మాత్ములను, విద్వాంసులను, శ్రీమంతులను, లోకోపకార కార్యములందు త్రికరణశుద్ధిగా పాల్గొను ప్రతిష్ఠిత పురుషులను, తల్లిదండ్రులను వారికి 60 ఏళ్ళు నిండిన సందర్భంలో సత్కరించడమే షష్టిపూర్తి ఉత్సవ లక్ష్యం.

వివాహ విజయం

వైవాహిక జీవితం ఆనందకరంగా ఉంటే చాలు మిగతా అన్ని రంగాలలో విఫలమైనా అతడు సక్సెస్‌ఫుల్ మాన్ అయినట్టే.

వివాహ విజయం సరైన జోడీని ఎన్నుకోవడం మీద కాదు సరైన జోడీగా ఉండటం మీద ఆధారపడి ఉంటుంది.

ఒక జంట ఏళ్ళుగా కలిసి ఉన్నారంటే వాళ్ళకి సమస్య సృష్టి లేకుండా కలిసుండే 'కళ' బాగా తెలుసుకున్నారన్నమాటే.

డబ్బు కీర్తి అధికారాలు ప్రేమకు సాటిరావు. నిజమైన ప్రేమ ఒకర్నొకరికి కట్టిపడేస్తుంది. ఒకరికోసం ఒకరు బ్రతికేలా చేస్తుంది. ఇరు జీవితాల్నీ పండిస్తుంది.

అలాటి దంపతుల్ని అరవయ్యవ ఏట సత్కరించటమే షష్టిపూర్తి ఉద్దేశం. తద్వారా మిగతా వారు వారిని ఆదర్శంగా స్వీకరిస్తారన్న ఆశాభావమూ ఉంది. వివాహబంధపు ఔన్నత్యాన్ని చాటడమూ ఉంది!

జీవిత సాఫల్యం

ఒకటీ రెండూ పదీ ఇరవై కాదు అరవై సంవత్సరాల దాకా సుఖంగా జీవించారు. గృహస్థాశ్రమ ధర్మాలు పాటించారు. సంతానాన్ని వృద్ధిలోకి తీసుకొచ్చారు.

ఇంటా బయటా ఎన్నో బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించారు.

వృత్తిలో ప్రవృత్తిలో ఎన్నో శిఖరాలధిరోహించారు.

అన్ని రకాలగానూ తృప్తికర జీవితాన్ని ప్రయోజనకర జీవితాన్ని గడిపారు.

పూర్ణ స్త్రీ పురుషులయ్యారు.

అలాటి ధన్యజీవుల్ని అభినందించి తీరాలి. అందుకు చేసిన ఒక ఏర్పటే షష్టిపూర్తి.

ఇందులో మరో సందేశం కూడా ఉంది.

ఇన్నేళ్ళూ మీరు మీకోసం మీ రక్తాన్ని పంచుకు పుట్టినవారి కోసం మీ బంధుమిత్రులు కోసం ఆర్తుల కోసం ఎన్నో చేసి ఉంటారు. సంతోషమే. ఇకనుంచి మీ సేవ, శ్రమ, ధనం – సమస్తం సమాజ కళ్యాణానికి ఉపయోగించాలి – అన్న ఉద్బోధ ఉంది.

ఇంతదాకా చేసిన కర్మల వల్ల మీ జీవితం సార్థకమైంది. ఇక చేయబోయే కర్మల వల్ల మీ జన్మసార్థకం కావాలన్న ఆకాంక్ష ఉంది!

షష్టిపూర్తి ఉత్సవం



గణపతి పూజ చేశాక కలశం చుట్టూ అరవై కలశాలు పెట్టిస్తారు. జీవించిన ఒక్కో సంవత్సరానికీ ఒక్కో కలశమన్న మాట. ఆయా సంవత్సరాల పేర్లనీ దేవతలనీ పూజిస్తూ కలశాలని పెట్టిస్తారు.

మంత్రములతో దీర్ఘాయువు కొరకు పరమేశ్వరుని ఉపస్థానం చేయిస్తారు.

పరమేశ్వర ఉపస్థానంలో మొదటి మంత్రం.

"ఓం త్ర్యమ్బకం యజమాహే సుగన్ధిం పుష్టి వర్ధనమ్ ।

ఉర్వారు కమి వ బన్ధ నాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్॥

అర్థం :– పరమ యశస్వి సుమార్గమునందు ప్రేరకుడు, శరీర బలమును వృద్ధిపరచువాడు, జ్ఞానము, బలము, క్రియ – ఈ మూండింటిని ప్రకాశ వంతము

చేయునట్టి పరమాత్ముని స్తుతి ప్రార్థన ఉపాసన మేము చేయుదుము. అతని కృపచే ఖర్జూరపండు పరిపక్వమై సరియగు సమయమున తీగనుండి వేరగునట్లు మృత్యుబంధాల నుండి మమ్ములను తొలగించి అమృత తత్వాన్ని మోక్షానందాన్ని మాకు కలిగించుగాక! కాని పూర్ణాయువును వదులకుందుము గాక!

ఈ అరవై సంవత్సరాలూ పంచభూతాలు, ప్రాణులు, పరమాత్మ చక్కగా చూసినందునే కరుణించినందునే సుఖంగా జీవించగలిగామని కృతజ్ఞతలు చెబుతారు. సంపూర్ణాయుష్షు ఇమ్మని కోరుతూ పుణ్యకర్మలు ఆచరిస్తానని వాగ్దానం చేస్తారు.

సత్కారాలు

షష్టిపూర్తి దంపతులకు కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు, మునిమనవలు, ముని మనవరాళ్ళు – అంతా గౌరవాభివందనం చేస్తారు. సాష్టాంగప్రమాణం చేస్తారు. నూతన వస్త్రాలు బహూకరించి సత్కరిస్తారు. వారి ఆశీస్సులు గైకొంటారు.

వారు కూడా వేదపండితుల్ని సన్మానిస్తారు. విరివిగా దానధర్మాలు చేస్తారు. అందరికీ తాంబూలం పండ్లూ ఇస్తారు.

అతిథులకు భోజన ఏర్పాట్లు చేస్తారు.

జీవిత పరమార్థం

షష్టిపూర్తి సంపూర్ణ జీవితానికి ఒక గుర్తింపు. అరవై ఏళ్ళు తృప్తిగా జీవించారు. ఐహిక సుఖాలన్నీ పొందారు. పిల్లా పాపల్తో సిరిసంపదల్తో సుఖంగా ఉన్న మీ వారందర్నీ ఆ స్థితిలో చూడగల ఆయుష్షు మీకుండటం మీ అదృష్టం. ఇది పరమేశ్వరుని కృప.

ఆ దశ పూర్తయ్యింది. అక్కడ మీ పాత్ర ముగిసింది.

ఇక పై వానప్రస్థానానికి మళ్ళాల్సిఉంటుంది.

ఇంకో అరవైఏళ్ళ ఆయుష్షు ప్రసాదించమని కోరారు.

ఎంత దక్కుతుందో తెలీదు. దక్కిందాన్ని మాత్రం వృథా చెయ్యకూడదు.

పుణ్య కర్మలు చేస్తూ మోక్ష సాధన వైపు అడుగువెయ్యాలి.

జన్మని సార్థకం చేసుకోవాలి.

అదే జీవిత పరమార్థం!

71

వానప్రస్థం

ఆశ్రమాలు అనగా జీవన దశలు నాలుగు - బ్రహ్మచర్య, గార్హస్థ్య వానప్రస్థ సన్యాసాలు.

బ్రహ్మచర్య అంటే బ్రహ్మచర్యం. ఇది పెళ్లితో అంతమవుతుంది.

గార్హస్థ్య మంటే గృహస్థాశ్రమం. పెళ్లితో మొదలవుతుంది.

వానప్రస్థం ముదిమిలో స్వీకరించాల్సిన జీవనవిధానం.

సన్యాసమంటే కామకర్మలను విడిచిపెట్టడం. ప్రాపంచిక సంబంధాన్ని పూర్తిగా పరిత్యజించడం. ఇది ప్రస్తుతకాలంలో కుదిరేపనికాదు. సర్వసంగ పరిత్యాగులమని చెప్పుకునేవారు ధనకీర్తిలోభాలకు వసులై ప్రవర్తించడం గమనించే ఉంటారు.

అంచేతే సన్యాసం పాటించడం కష్టం గనుకే కలియుగంలో సన్యాస స్వీకారం నిషిద్ధమైంది.

ప్రతి ఆశ్రమానికీ 25 సంవత్సరాలుగా నిర్ణయించారు. అంటే 50 సంవత్సరాలు దాటేక వానప్రస్థమన్నమాట.

కాని మనిషి సగటు ఆయుర్దాయం పెరిగింది. ఆరోగ్య సదుపాయమూ ఉంది. పదవీ విరమణ వయస్సు 60 సం. సగటు వివాహ వయస్సు 30 సం. అయ్యింది. గనుక అరవై తర్వాత వానప్రస్థం స్వీకరించడం ప్రస్తుతకాలానికి సరిపడుతుంది.

వృద్ధాప్యం భిన్నమైంది.

వృద్ధాప్యం వేరు. వానప్రస్థాశ్రమ ప్రవేశం వేరు.

వయస్సు మీద పడగానే ప్రతివారికీ వృద్ధాప్యం వస్తుంది.

శరీరంలో శక్తిలో మనస్సులో ఆలోచనల్లో మార్పు వస్తుంది అంత మాత్రాన అతడి బాధ్యతలు తీరినట్టు కాదు. కోరికలు తగ్గినట్టూ కాదు.

వృద్ధాప్యం ఒక వయస్సు తాలూకు దశను మాత్రమే సూచిస్తుంది.

వృద్ధులంతా వానప్రస్థంలో ప్రవేశించలేరు. కాని వానప్రస్థంలో ప్రవేశించిన వారంతా వృద్ధులే అవుతారు.

అన్నీ అనుభవించి అన్నీ చవిచూచి అన్ని రకాల సుఖదుఃఖాలకూ అనుభూతులకూ లోనైన వారికి మాత్రమే వానప్రస్థం సాధ్యమవుతుంది.

వానప్రస్థాశ్రమం

వృద్ధాప్యంలో ఇల్లు విడిచి ఆశ్రమంలో ఆధ్యాత్మిక చింతనతో కాలం గడపడమే వాన ప్రస్థాశ్రమం.

వైరాగ్య భావనలతో ఆధ్యాత్మిక చింతనతో వానప్రస్థులవుతారు గనుక వానప్రస్థమయ్యింది.

వనాలు నదీసంగమ ప్రాంతాలు పర్వతాలు వానప్రస్థానికి అనువైన ప్రదేశాలన్నారు.

జ్యేష్ఠ పుత్రునికి పుత్రుడు కలగ్గానే గృహభారాన్ని బాధ్యతల్ని పుత్రునికప్పగించి భార్యా సమేతంగా వనాలకు వెళ్ళాలి. నియత జీవితం గడుపుతూ ఆధ్యాత్మిక సాధన చేస్తూ ఆత్మ సాక్షాత్కారానికి యత్నించాలి. ఇంద్రియాల్ని జయించాలి.

ఇదే వానప్రస్థంలో ఆచరించాల్సిన విధి.

మనిషి కోరికలు ఏదో ఒక రోజుకు ఆగిపోవాలి. ఆనాటి నుంచి కొత్త మార్గంలో ప్రయాణం సాగించాలి.

ఎంత వయస్సు వచ్చినా 'నేనే అధిపతిని. నా వారసులు నా కిందే పని చేయాలి. నామాటే వినాలి' అంటూ నియంతలా వ్యవహరించకూడదు. వ్యవహరిస్తే చివరి రోజుల్లో జీవితం దుర్భరమవుతుంది. ఒంటరితనమే మిగుల్తుంది!

పూర్వకాలంలో

'గృహస్థుడికి ఎప్పుడు జుట్టు నెరసి ముఖాన ముడతలు పడి ఎప్పుడు మనవడు కలుగుతాడో అప్పుడు గృహస్థాశ్రమం వీడి వానప్రస్థాశ్రమానికై అరణ్యానికిపోవాలి' అని శలవిచ్చాడు మనువు.

రాజభోగాల్లో తులతూగిన వారు సైతం చివరి రోజుల్లో వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించారు.

పాండురాజు, ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు, సంజయుడు, కుంతి అలా స్వీకరించిన వారే.

రాజ్యం రాజభోగం వదలి బంధుజనానికి దూరంగా వెళ్లారు.

ప్రేమద్వేషాలు ప్రదర్శించ వీలుకానంత దూరం వెళ్ళారు.

మనసుని ఇహలోక సుఖలాలస నుంచి కోరికల్నుంచి అవన్నీ తృణప్రాయమనే భావన వైపు మళ్ళించారు.

అది ఎవరూ లేని రాని అరణ్య ప్రదేశంలోనే సాధ్యపడుతుంది. అనుబంధాలు ఆశలు చొరబడని ప్రాంతం కదా. అందుకని వానప్రస్థాశ్రమ స్వీకరణకు అక్కడికెళ్ళేవారు.

ఒకరకమైన రిటైర్మెంట్

58 లేక 60 ఏళ్ళు నిండేక ఉద్యోగులు పదవీ విరమణ చేస్తారు.

ఆ ఉత్తర క్షణం నుంచి వారికి ఆయా కార్యాలయాల పదవులతో అధికారంతో బరువు బాధ్యతలతో ఎలాంటి సంబంధమూ ఉండదు.

వారి సీట్లోకి మరొకరొస్తారు. తన అభీష్టానుసారం నిర్వహిస్తారు. ప్రవర్తిస్తారు. కొత్త అధికారి చెప్పినట్టు అంతా నడచిపోతుంది. అతడు చేసిందే శాసనం చెప్పిందే వేదం అవుతుంది.

జీవితంలో కూడా అలాంటి రిటైర్మెంట్ తీసుకోవడమే వానప్రస్థం.

కొడుకులకీ, కూతుళ్ళకీ, మనవళ్ళకీ గృహ వ్యాపార వ్యవసాయాల తాలూకు సమస్త బాధ్యతలూ లావాదేవీలూ, వ్యవహారాలూ అప్పజెప్పాలి.

వారెలా చేస్తోరో ఏం చేస్తారో అన్న భయమక్కర్లేదు. వారు వారి పద్ధతిలో చేస్తారు. కాలానుగుణ మార్పులు తెస్తారు. తప్పులు దొర్లితే దిద్దుకుంటారు. ఒకప్పుడు వ్యవహారాలకి తామూ కొత్తే కదా. తర్వాత తామూ రాటుదేలినట్లే వాళ్ళూ అనుభవజ్ఞులవుతారు!

నాణేనికి రెండో వైపు

జీవితపునాణేనికి ఒక వైపున బొమ్మ మరో వైపున బొరుసు ఉంటుంది.

ఒక ప్రక్కన వయస్సు, అందం, ఆకర్షణ, ఉత్సాహం, ఉత్తేజం, శక్తి, సామర్థ్యం, ఆరోగ్యం ఉంటాయి. ప్రతిదీ పచ్చగా ఆశావహంగా కన్పిస్తాయి. ఏదైనా సాధించగలం ఏమైనా చెయ్యగలం అన్పిస్తుంది. ఈ ప్రపంచమంతా నాదే అన్పిస్తుంది.

మరో ప్రక్కన తగ్గిన అందం, కరిగిన ఆకర్షణ, పెరిగిన వయస్సు, దిగజారిన ఆరోగ్యం, ఉత్సాహలేమి, నిరాశా దృక్పథం, శక్తిహీనత ఉండి క్రిందికి దిగలాగుతూంటాయి.

బొమ్మ ఉదయకాల సూర్యుడైతే బొరుసు అస్తాద్రి చేరిన సూర్యుడు.

ఒకటి ఉషోదయం. రెండోది ఉషాంతం!

తృప్తి అవసరం!

కోరికలు అనంతం. కోరికలు ఒకదాని తర్వాత ఒకటి నూతి నీళ్ళలా ఊరుతూనే ఉంటాయి.

ఒక ఇల్లు కొనాలనుకుంటారు. కొన్నాక ఇంకోటి మరోటి అంటూ తాపత్రయపడతారు. ఒక కారు ఒక ఫ్యాక్టరీ ఒక కంపెనీతో సంతృప్తిపడరు. ఇంకా ఇంకా కావాలి. దక్కకపోతే అశాంతి. నిరాశ! మనస్సు మీద అదుపు నియంత్రణ లేకపోతే సుఖం ఉండదు. మనశ్శాంతి ఉండదు.

కోరికలు పెరిగే కొద్దీ నిరాశా నిస్పృహలు పెరుగుతూంటాయి. మనిషి సుఖంగా నిశ్చింతగా ఉండలేడు. ఆరోగ్యంగానూ ఉండలేడు.

మనిషికి కావాల్సిందీ కోరుకోవాల్సిందీ తృప్తి.

జీవితంలో తృప్తి లేని ధనవంతుడు మానసికంగా నిరుపేద. తృప్తి నిండిన జీవితం నిండు కుండలా తొణకదు.

'ఇంక చాలు' అన్న సంతృప్తికర దశకు చేరుకోవడమే వానప్రస్థం!

తోడు వీడొద్దు

మీతో కలిసి జీవితాంతం నడుస్తానని ప్రమాణం చేసి మీతో కలిసిపోయారు మీ జీవిత భాగస్వామి.

ఇప్పుడిహ ఇద్దరూ ఏక నదియైన గంగ, యమున. ఎవరు గంగ ఎవరు యమున అని చెప్పలేనంతగా విడదీయరానంతగా కలసిపోయారు.

కడదాకా అలాగే ఉండాలి. అలాగే ప్రహించాలి.

పొరబాటున కూడా రెండోవారి చెయ్యి వదలొద్దు. వారిని అశ్రద్ధ చెయ్యొద్దు. ఆఖరి శ్వాసవరకూ ఒకరి విశ్వాసం మరొకరి శ్వాస కావాలి!

కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు మనుమరాండ్రు విడిపోవచ్చు. దూరంగా వెళ్ళిపోవచ్చు.

అయినా మీ బంధం సడలకూడదు. మరింత దృఢమవ్వాలి.

ఇది వరకన్నా ఇప్పుడే రెండోవారి తోడు ఎక్కువ అవసరం.

మీ ఆరోగ్యం మీ వయస్సు మీ శక్తి మీ సామర్థ్యం మీ ఆస్తి మీ సంపాదనతో నిమిత్తం లేకుండా మిమ్మల్ని మిమ్మల్నిగా ప్రేమిస్తూ మిమ్మల్ని తనలోని ఒక భాగంగా గుర్తించి అభిమానించే తోడూనీడా మీ జీవిత సహచరే.

ఆధ్యాత్మిక చింతనలోనూ మోక్ష సాధనలోనూ మీరు విడిపోకూడదు.

మృత్యువు తప్ప మరేదీ విడదీయ లేనంత బలంగా మీ బంధం ఉంటే మీ కోసం స్వర్గం భూమ్మీదకు దిగి వచ్చినట్టే. లేకపోతే మీ బ్రతుకు నరకమే!

దృక్పథం మారాలి

వానప్రస్థంలో ప్రవేశించే ముందు ప్రతివారూ మారాలి. వారి దృష్టి మారాలి. దృక్పథమూ మారాలి.

ఆడంబర జీవితం వద్దు. గొప్పలు వద్దు. భేషజాలు వద్దు. ఆభరణాలూ అపూర్వ వస్త్రాలూ వద్దు. మోహాలూ వ్యామోహాలూ వద్దే వద్దు.

సామాన్యంగా ఉండాలి. సామాన్యుల్లా ఉండాలి. శాకాహారం అరగించాలి. భోగలాలస వైపు ఇంద్రియ సుఖాలవైపు కన్నెత్తి చూడకూడదు.

జీవికకు అవసరమైన కనీస ఆదాయం లభిస్తే చాలనుకోవాలి. పెన్షన్ వస్తే సరేసరి. లేకపోతే అద్దె లేక ఫిక్సెడ్ డిపాజిట్ మీది వడ్డీ లేక పిల్లలు చేసిన ఏర్పాటు ఏదైనా కాని నెలనెలా కొంత డబ్బు లభిస్తే దానితోనే సర్దుకుపోవాలి.

సంతోషంగా ప్రశాంతంగా తృప్తిగా జీవించాలి.

ఎలాంటి టెన్షన్లు భయాలు ఆశలు నిరాశలు లేకుండా జీవించాలి. ఆధ్యాత్మిక చింతన పెంచుకోవాలి. ధార్మిక కార్యాలు చెయ్యాలి. పదిమందికి సాయపడటంలో గల పరమానందాన్ని జుర్రుకోవాలి.

పరోపకారార్థం ఇదం శరీరం – అనుకుంటే చాలు గుండెలు పట్టనంత బ్రహ్మానందం అనుభవైకవేద్యం అవుతుంది!

గతించిన వైభవం

'సమ్మీలనే నమనయోః నహికించిదసి'

వైభవాన్ని చూసుకొని సంబరపడుతున్నావు. ఈ వైభవోపేతమైన జీవనం క్షణ భంగురం. కన్ను మూసేక ఇవేవీ ఉండవు. మరణించాక వాటితో నీకేమీ సంబంధముండదు.

భోగభాగ్యాలు సిరిసంపదలు మురిపించేవే గాని ముక్తి మార్గం చూపించేవి కావు. ధనమోహం ఉన్నవారికి దైవ మహిమ తెలీదు.

ప్రతివ్యక్తీ తనకు కావలసినంత వరకే సంపదలు ఉంచుకోవాలి. మిగిలిన ధనం పరోపకారం కోసం వినియోగించాలి.

గతంలో చేసినా చెయ్యకపోయినా వానప్రస్థంలో దాన ధర్మాలు చేసి తీరాలి. ఇప్పుడు చెయ్యలేపోతే చెయ్యడానికింక అవకాశం లభించదు. ఇది ఆఖరి అవకాశం!

మృత్యుభయం

వయస్సు పైబడే కొద్దీ మృత్యుభయం రోగభయం పీడిస్తుంటాయి.

జీవితమంతా సంపాదిస్తూనే గడిపారు. సంపాదించడానికే బ్రతికినట్టు బ్రతికారు.

సంపాదించిన డబ్బుతో తృప్తిపడాలి. ఇక పుణ్య సంపాదనకు పూనుకోవాలి.

ఆసుపత్రులకూ శరణాలయాలకూ త్రాగునీటి సౌకర్యానికీ విద్యాలయాలకూ దానాలు చెయ్యండి. పోషించండి. శాశ్వత భవనాలు నిర్మించండి. లేక ఒక కాలనీనో గ్రామాన్నో దత్తత తీసుకుని అభివృద్ధి చెయ్యండి.

అప్పుడు మనస్సు తృప్తితో సంబరంతో పొంగిపోతుంది. నిజమైన ఆనందమేమిటో తెలిసొస్తుంది.

దేవాలయాలకెళ్తే ఆధ్యాత్మిక పుస్తకాలు చదివితే మృత్యుభయం తగ్గుముఖం పట్టడమే కాదు ఎదుర్కొనే ధైర్యం వచ్చి తీరుతుంది!

కోరికలు తగ్గించుకోవాలి

'కోరికలే దుఃఖానికి మూలకారణం' అన్నాడు బుద్ధుడు.

అనంతమైన కోరికలు కలిగి ఉండటమే రాక్షసత్వం. తన గురించి తప్ప ఇతరులను పట్టించుకోనిది రాక్షసమనస్తత్వం.

మెల్లగా భౌతిక ప్రపంచం నుంచి కోరికల్నుంచి బంధువ్యామోహాల నుంచి దూరమవటం – దూరంగా జరగటమే వానప్రస్థం.

అలా చెయ్యటం వల్ల మీ సంతానానికి అధికారం వస్తుంది. ఆస్తులు పంచిస్తారు గనుక కలతలు కలహాలు ఉండవు. పైగా యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. వృద్ధులు వానప్రస్థం స్వీకరించాలనడం వెనుక ఆ కారణమూ ఉండి ఉంటుంది.

ఎల్లప్పుడూ గార్హ్యస్థంలోనే ఉండి భౌతిక భోగాల కోసం వెంపర్లాడాలనుకోవటం తగదు. సాధ్యమూ కాదు.

మనిషి అనుభవసారమూ ఆలోచనల పరిణతీ వానప్రస్థంలోకి దారి తీయించాలి!

రసమయం చేసుకోండి

జీవితాన్ని క్షణక్షణం ఉత్తేజపరచండి. ఒంటరిగా ఫీలవ్వొద్దు. జీవితం రసహీనంగా మారిపోయిందని భావించవద్దు.

ఇదివరకటి గౌరవ మర్యాదలు ఆప్యాయతలు విశ్వాసాలు లభించట్లేదనుకోవద్దు. వాటిని ఆశించని స్థాయికి మీరు చేరుకోవాలి.

ఎవరికీ అక్కర్లేదని గాని ఈ ప్రపంచానికి తాము అవసరం లేదని గాని తలపోయవద్దు.

భగవత్సృష్టిలోని ప్రతి ప్రాణికీ ప్రతి వస్తువుకీ అవసరం ఉంది. విలువ వుంది. ప్రయోజనమూ ఉంది.

అనుభవ పాఠాలు

కోరిన వారికి అనుభవాన్ని పంచండి. సలహాలివ్వండి. పిల్లలతో అనుబంధం పెంచుకోండి. జ్ఞానాన్ని అందివ్వండి. మీలోని కళకు పదునుపెట్టండి. స్వీయ కథని రాయండి. సంగీత సముద్రంలో మునిగి తేలండి.

వివిధ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోండి. పేదలకు అనాథలకు అభాగ్యులకు చేతనైనంత చేయగలిగినంత సాయం చెయ్యండి. సమాజోద్ధరణకు కృషి చేయండి. ఇతరుల కన్నీరు తుడవడానికి ప్రయత్నించండి.

మీ ప్రాంతపు అవసరాలు, ఇబ్బందులు, లోటుపాట్లు, సమస్యలు తెలుసుకుని పరిష్కారార్థం ఆయా శాఖల దృష్టికి తీసుకువెళ్ళండి. వృద్ధాప్యపు పెన్షన్లు, వితంతు పెన్షన్లు,

రేషన్ కార్డులు పొందడానికి తోడ్పడండి. మీ ఏరియాలో జరుగుతోన్న అభివృద్ధి పనుల్నీ ఖర్చునీ పరిశీలించండి. మెరుగైన సేవకు సూచనలివ్వండి.

కుటుంబ కలహాలు, వివాహ సమస్యలు, చదువులు/కెరీర్ కౌన్సలింగ్ చేపట్టండి. ఓటరుగా నమోదు చేయించండి. ఓటు హక్కు విలువను, మంచి పౌరుల లక్షణాల గురించి ప్రచారం చేయండి.

ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా తోడ్పడండి. మొక్కలు నాటండి. రక్త నేత్ర దానాల ఆవశ్యకత వివరించండి. వివిధ సేవాసంస్థలతో కలిసి పనిచేయండి.

పూజలు చేయండి. భజనలు చేయండి. భగవంతుడి మీద భారంవేసి నిశ్చింతంగా నిద్రపోండి.

ప్రపంచం ఆనందసీమగా నందనవనంగా మారిపోయి కలలో మనస్సులో ప్రత్యక్షమవుతుంది!

ఒక సంస్కారం

'పిల్లల పెళ్లిళ్ళు చేసేసి కృష్ణా రామా అనుకుంటూ గడిపేస్తాను' అనేవారు పూర్వం. దానర్థం వానప్రస్థాశ్రమం స్వీకరిస్తామనే.

అందరూ తప్పనిసరిగా స్వీకరించాలా అంటే చెప్పడం కష్టం. అది వారి వారి మానసిక పరిపక్వత మీద జీవిత దృక్పథం మీద ఆధ్యాత్మిక సంపన్నత మీద ఆధారపడి ఉంటుంది.

షోడశ సంస్కారాల్లో వానప్రస్థం ఒకటి. ఈ సంస్కారం అవసరమే అంటాయి హిందూ శాస్త్రాలు.

ఆ సంస్కారాన్ని పొందటం అంత తేలిక కాదు. ప్రాపంచిక సంబంధాలను కోరికల్ని ఇంద్రియాల్ని జయించాలి. భవవదనుగ్రహం లేక మోక్షం తప్ప మరేదీ కోరుకోవాల్సింది లేదనే స్థాయికి చేరుకోవాలి.

అది అందరికీ సాధ్యం కాదు. అలాగని వూరుకోకూడదు. ఎంత వీలైతే అంత ఇహ లోకపు సుఖాలు భోగలాలస తగ్గించుకుని పరచింతన పరలోక చింతన పెంచుకోగల్గితే మృత్యు భయం ఉండదు. ప్రశాంతత, పరమానందం కడ దాకా తోడుంటాయి!

72

జీవన యాత్ర

జీవితం అంటే ఏమిటి?

జీవిత చరమాంకంలో వేసుకునే ప్రశ్న ఇది. అంతదాకా ఆ ఆలోచనే రానివ్వదు జీవనవేగం.

ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే 'ఇంతకాలమయ్యిందా? అప్పుడే నాకింత వయస్సు వచ్చేసిందా' అని ఆశ్చర్యం వేస్తుంది.

ఎంచేతంటే పెళ్లైనా కొడుకులూ కూతుళ్ళూ తల్లిదండ్రుల కళ్ళకి చిన్నపిల్లల్లానే కన్పిస్తారు. మరోరకంగా చెప్పాలంటే తాము వృద్ధులమై పోయామని అంగీకరించ డానికెవరూ సిద్ధపడరు.

చూస్తూండగానే చేతివేళ్ళ సందుల్లోంచి జారిపోతుంది జీవితం!

అయినప్పటికీ ప్రపంచంలో బతకడమెలాగో బతకడమెందుకో తెలిసినవారు భారతీయులు మాత్రమే!

నాలుగు దశలు

మనిషి జీవితంలోని నాలుగు దశల్లో ఏయే కర్తవ్యాలను నిర్వహించాలో ఈ శ్లోకంలో చెప్పారు.

'శైశవే భ్యస్త విద్యానాం
యౌవనే విషయైషిణాం
వార్ధక్యే ముని వృత్తీనాం
యోగే నాంతే తనుజ్యతామ్'

జీవితంలోని మొదటి భాగాన్ని లోకజ్ఞాన సంపాదనకు వెచ్చించాలి. రెండోదశలో ఆ జ్ఞానం ద్వారా జీవికను ఏర్పరుచుకోవాలి. గృహస్థుగా సామాజిక బాధ్యతల్ని నిర్వర్తించాలి.

మూడోదశలో కోరికలను జయిస్తూ వచ్చి నాలుగోదశకు అవసరమైన యోగ్యతను సాధించాలి. నాలుగో భాగంలో మనిషి మోక్షాన్ని సాధించే దిశగా ప్రయాణించి సాధించాలి.

ఈ రకంగా జీవితంలో అన్నింటికీ ప్రాధాన్యానిచ్చారు పూర్వీకులు. విద్యకీ అర్థకామాలకే గాక తత్వజ్ఞానానికీ ప్రాముఖ్యత నివ్వడమే జీవితం!

బుద్బుద ప్రాయం

జీవితం నీటి బుడగలాంటిది. ఏ క్షణంలోనైనా పేలిపోవచ్చు.

అది నలభై ఏళ్ళా డబ్బై ఏళ్ళా అన్నది కాదు ఏ వయస్సులోనైనా అర్ధాంతరంగా ముగిసిపోవచ్చు. 70,80 ఏళ్ళ సంపూర్ణ జీవితం గడిపేక అంతమవ్వనూవచ్చు.

'కన్ను తెరిస్తే జననం

కన్ను మూస్తే మరణం

రెప్పపాటే కదా జీవితం!' అన్నాడు అలిసెట్టి ప్రభాకర్.

పైన పేర్కొన్నట్టు ఆ 'రెప్పపాటు' కాలం ఎంతైనా కావచ్చు.

ఆ కొద్ది సమయంలోనే చక్కదిద్దుకోవాలి. చక్కబెట్టుకోవాలి. చక్కగా బ్రతికి శలవు పుచ్చుకోవాలి!

పుట్టడం పెరగటం చదువుకోవడం సంపాదించడానికి ఆరాటపడటం పెళ్లి పిల్లలు వృద్ధాప్యం – వీటి నడుమ ప్రేమలు వ్యామోహాలు కక్షలు అనుబంధాలు ఆశలు నిరాశలు – ఇదే కాదు జీవితమంటే.

పరిమితుల్ని ఛేదించుకోవాలి. తమ పరిధిని విస్తరించుకోవాలి. తమని తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అందుకు ప్రయత్నించే వారికే జీవితం అర్థమవుతుంది. అర్థవంతంగా కన్పిస్తుంది.

అర్థవంతమైన జీవితమంటే బతుకు గమనంలో ఎదురయ్యే ఆటు పోట్లను సుఖదుఃఖాలను ఆవేశకావేషాలను ఆనంద విచారాలను కన్నీటినీ పన్నీటినీ సరిసమానంగా భార్యాభర్తలు పంచుకోవడమే. సీతారాములు చేసిందదే!

సంస్కారం

మనిషి యొక్క ఆత్మ, శరీరం ఉత్తమమవడానికి షోడశ (16) సంస్కారాలు మంత్రయుక్తంగా చెయ్యడం వైదిక సంప్రదాయం.

వీటి వల్ల జన్మాంతర దోషాలు తొలగి మానవ జీవిత లక్ష్యమైన మోక్ష ప్రాప్తి సిద్ధిస్తుందని శాస్త్రవచనం.

గర్భాధానం, పుంసవనం, జాతకర్మ, నామకరణం, నిష్క్రమణం, అన్న ప్రాశనం, చూడా కర్మ, కర్ణవేధ, ఉపనయనం, వేదారంభం, సమావర్తనం, వివాహం, సీమంతోన్నయనం, వానప్రస్థం, కేశాంతం, అంత్యేష్ఠి – ఈ పదహారూ షోడశ సంస్కారాలు.

ఇవి ప్రధానమైన సంస్కారాలు. ఇవిగాక కొన్ని ఉపసంస్కారాలూ వున్నాయి.

వేదోషనిషత్తుల ప్రకారం శరీరం అయిదు అంశాలుగా విభజితమైంది.

అన్నమయ కోశం, ప్రాణమయ కోశం, మనోమయ కోశం, బుద్ధి మయ కోశం, ఆనందమయ కోశం – శరీరంలోని ఈ అయిదు అంశాలు షోడశ సంస్కారాల వల్ల సక్రమమైన రీతిలో చలిస్తాయనేది శాస్త్ర వచనం.

పితౄణం తీర్చుకునేందుకు పుత్రులు చేసే సంస్కారం అంత్యేష్ఠి. ఇది ఆఖరుది.

ఉత్తమసంతాన ప్రాప్తికి బీజం నాటడం నుండి శవ సంస్కారం వరకూ ప్రతీదీ ప్రతి దశలోనూ మనిషిని సంస్కరించడం–అంటే చక్కరచడం, సరిదిద్దడం, సరియైన మార్గాన నడిచేలా చెయ్యడం వీటి లక్ష్యం.

వ్యక్తి నిర్మాణానికి శీల నిర్మాణానికి సంస్కారం ప్రధానం.

'స్వస్తి పంథా మను చరేతు సూర్యాచంద్ర మసాలివ'

మానవులు సూర్యచంద్రులవలె ఉన్నత మార్గంలో నడవాలి.

గతి తప్పకుండా అవి చరిస్తున్నట్టే మనిషి సన్మార్గంలో నడవాలి.

సంస్కారం మానవ జీవితాన్ని ఉజ్వలం చేస్తుంది.

సంస్కారుల సంసారం త్రివేణీ సంగమం. ముక్తిదాయకం!

సుఖ దుఃఖాలు

జీవితం సుఖదుఃఖాల సమ్మేళనం.

ఈతిబాధల్నుంచెవరూ తప్పించుకోలేరు.

ఆర్థిక శారీరక మానసిక సమస్యలు – ఏ స్థాయివారికైనా ఏస్థితి వారికైనా వారివారి స్థాయి స్థితులకు తగినట్టు ఉంటాయి. కొందరు తేలిగ్గా బయటపడతారు. మరికొందరు తేలిక చేసుకుంటారు. ఇంకొందరు భూతద్దంలో చూసి బెంబేలు పడతారు.

సుఖం కూడా చూసే దృష్టిని బట్టి స్థాయీ భేదం కలిగి ఉంటుంది.

సుఖం వెంట దుఃఖం దుఃఖం వెంట సుఖం - చీకటి వెలుగుల్లానే - అదో చక్రభ్రమణం!

సంతోషం కలిగినప్పుడు నా అంతటి వాడు లేడని పొంగిపోకూడదు. బాధ వేదన కలిగినప్పుడు అంతా అయిపోయిందని కుంగిపోకూడదు.

రెండిటిన్నీ సమభావంతో చూడకపోయినా చూడలేకపోయినా రేపు మంచి జరుగుతుందన్న ఆశావహదృక్పథంతో ముందుకుసాగిపోవాలి.

ఆశానిరాశలు

ఆశలు సముద్ర కెరటాల్లాటివి. ఒకదానివెంట ఒకటి పుట్టుకొస్తూనే ఉంటాయి.

పెద్ద చదువు చదవాలని, చక్కని ఉద్యోగం రావాలని, వ్యాపారంలో స్థిరపడాలని, అందమైన భార్య/భర్త లభించాలని, ప్రమోషన్లు/లాభం రావాలని, ఇంచక్కని పిల్లలు పుట్టాలని, వాళ్లు చదువుల్లో ప్రథములు కావాలని, వాళ్ళు ఉన్నత విద్య అభ్యసించాలని, గొప్ప జీతగాళ్ళు కావాలని, పెళ్లిళ్ళవ్వాలని, వారికి సంతానం కలగాలని, మనవలతో ఆడుకోవాలని, వారి ఎదుగుదల చూడాలని, వారి పెళ్లిళ్ళు తిలకించాలని...!

ఆశలన్నీ తీరవు. కొన్ని తీరతాయి. కొన్ని కొంతవరకే తీరతాయి. మరికొన్ని అసలే తీరవు.

అటువంటప్పుడు అంతులేని నిరాశ ఆవరిస్తుంది. నిస్పృహ లోబరుచుకుంటుంది. ఓటమి భావన కృంగదీస్తుంది. ఫలితం డిప్రెషన్!

దానిలోంచి త్వరగా తేరుకోగలగాలి. జరిగిందాన్నొక్కసారి సమీక్షించుకోవాలి. శక్తి సామర్థ్యాలు కూడదీసుకోవాలి. ఎలాగైనా విజయాన్ని స్వంతం చేసుకోవాల్తప్ప విఫల భావనతో పలాయనం చిత్తగించకూడదు.

జీవితమంటే ఏడుస్తూ పుట్టి ఏడిపిస్తూ పోవడం కాదు.

అది ఒక ఛాలెంజ్. స్వీకరించక తప్పదు! ఎదుర్కోకా తప్పదు!!

ధన వ్యామోహం

జీవనానికి డబ్బు అవసరమే. దాన్ని సంపాదించాల్సిందే. అందుకు శ్రమించాల్సిందే.

కాని డబ్బుని విపరీతంగా సంపాదించాలనుకోవటం, తరతరాలకీ సరిపడా ఆస్తుల్ని కూడబెట్టాలనుకోవడం సరికాదు.

అది దుఃఖహేతువవుతుంది.

'అర్థానా మార్జనే దుఃఖం ఆర్జితా నాంచ రక్షణే
నాశే దుఃఖం వ్యయే దుఃఖం ధిగర్థం దుఃఖభాజనమ్'

డబ్బు కూడ బెట్టడంలో దుఃఖం వుంది. కూడబెట్టింది రక్షించుకోవడంలో మరింత దుఃఖం వుంది. అది పోయినా ఖర్చయినా దుఃఖమే కలుగుతుంది.

ఇన్ని రకాల దుఃఖాలకు కారణమైన ధనం మీద మనిషికి వ్యామోహం అనవసరం.

డబ్బును దానం చెయ్యాలి. అనుభవించాలి. ఇతరుల కోసం వినియోగించాలి. లేకపోతే నాశనం అయిపోతుంది. నిలబడదు.

ధనదాహంతో ఇంకా ఇంకా సంపాదించడానికి అత్యధికంగా శ్రమిస్తూ ఒత్తిళ్ళకూ ఆందోళనలకూ లోనవుతూ అశాంతితో అలమటిస్తూనే పరుగులు పెడుతూ నిద్రకీ ప్రశాంతతకీ దూరమైన ధనికుల్ని పరిశీలించండి.

వారేం బావుకుంటున్నారో ఎంత అమూల్యమైనవి పోగొట్టుకుంటున్నారో కడకేం వెంట తీసుకెళ్తారో వారి ఆస్తిపాస్తులు తర్వాతేమవుతాయో ఆలోచిస్తే చాలు సర్వం బోధపడుతుంది. దాహం తీరాలంటే నెయ్యి కాదు నీరు తాగాలని అర్థమవుతుంది!

నిధి చాల సుఖమా

'నిధి చాల సుఖమా రాముని సన్నిది సుఖమా' అని ప్రశ్నిస్తారు త్యాగయ్య.

ఎక్కువ సంపాదించిన వారు ఎక్కువ ఆనందంగా వుంటారని ఎక్కువ సుఖపడతారని భావించడం ఒక భ్రమ.

డబ్బు వల్ల విలాసవంతమైన జీవితాన్ని గడప వచ్చుగాని ఆనందంగా జీవించడానికి అది కొంత వరకే తోడ్పడుతుంది.

'సర్వత్ర సంపదస్తస్య సంతుష్టం యస్య మానసమ్' అన్నారు మనః సంతుష్టి ఉన్నవారికి ప్రతిచోటా సంపదలే!

అందుకే బిల్‌గేట్స్, ఇన్ఫొసిస్ నారాయణమూర్తి తదితర మహా ధనికులంతా సేవాకార్యాల వైపు దృష్టి మళ్ళించారు.

పదిమందికి సాయపడటంలో వందమంది కన్నీళ్ళు తుడవడంలో అసలైన ఆత్మానందం, ఆత్మతృప్తీ వున్నాయని గ్రహిస్తున్నారు.

వేదాలు చెప్పే నీతి సూత్రం అదే.

సర్వేజనా సుఖినో భవంతు!

భౌతిక సుఖలాలస

భౌతిక సుఖాల కోసం వెంపర్లాడకుండా ఆత్మానందం కోసం కృషి చేయాలంటుంది హిందూ సంస్కృతి. ఎంత ధనవంతుడైనా సరే 'లవణమన్నమే' తింటాడని బోధిస్తుంది.

ఈ విషయం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. బాహ్య వ్యామోహాలకి లోనుకాకూడదు. ఆడంబర జీవితానికి అర్రులు చాచకూడదు. నేల విడిచి సాము చెయ్యకూడదు. దుబారా ఖర్చు వద్దు. తృప్తి, నిరాడంబరత అలవర్చుకోవాలి. అప్పుడే జీవతం సుఖప్రదం శాంతియుతం అవుతుంది.

అమెరికాని అతలాకుతలం చేస్తున్న ఆర్థికమాంద్యానికి కారణాలు – ప్రజల భౌతిక సుఖవాంఛ, బ్యాంకుల అత్యాశానూ!

అధికార గణాంకాల ప్రకారం గత శతాబ్దంలో అమెరికా వృద్ధిరేటు 2.7% మాత్రమే. కాని ఈ పదేళ్ళలో అమెరికా వినియోగదారులు దాదాపు మూడు లక్షల కోట్ల డాలర్ల మేరకు ఋణాలు తీసుకుని ఖర్చుచేశారు. ఆదాయాభివృద్ధికీ వినియోగానికీ పొంతనలేకుండా పోయింది.

ప్రజలూ సంస్థలూ అడ్డూ అదుపు లేకుండా ఋణాలు తీసుకుని ఖర్చుచేస్తూ గొప్పవృద్ధి సాధిస్తున్నట్టు 'బూమ్' సృష్టించారు. అధిక వడ్డీకి ఆశపడి అక్కడి బ్యాంకులూ ఆర్థిక సంస్థలూ రియల్ ఎస్టేట్ తనఖా మీద లేదా తగిన సెక్యూరిటీ లేకుండా పిలిచి మరీ అప్పులిచ్చాయి.

వృద్ధిరేటు నిజంగా పెరగనందున ఋణాలు తీర్చలేక అమెరికన్లు కుదేలయ్యారు. రియల్ ఎస్టేట్ పడిపోయింది. సెక్యూరిటీ విలువలు దారుణంగా పడిపోయేసరికి ఋణాలు వసూలు చేసుకోలేక బ్యాంకుల చతికిలబడ్డాయి.

ఆర్థికంగా మహాశక్తి అనుకున్న అమెరికా మాంద్యపు సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది.

వాపుని బలుపు అనుకుంటే వ్యక్తికైనా దేశానికైనా ఇలాంటి పరిస్థితే వస్తుంది.

భౌతిక సంపదల పునాదులపై నిలబడి అహంకరిస్తున్న మీరు పరాభవం పాలయ్యేసందర్భం వస్తుందని నూరేళ్ళక్రితమే అమెరికా వాసుల్ని హెచ్చరించారు స్వామి వివేకానంద. సుఖాలు సౌకర్యాలే పరమావధి కాదని ఆ రోజే హితవు పలికారా దార్శనికుడు.

మన దేశం మీద ఆర్థిక మాంద్యపు ప్రభావం తక్కువగా ఉండటానికి 'పొదుపు' 'సంతృప్తి' 'నిరాడంబరత' 'పరిమితకోర్కెలు' 'సాత్విక జీవనం' 'ఆధ్యాత్మిక చింతన' నేర్పిన హిందూ సంస్కృతే కారణం!

ఇగోయిజం వద్దు

చిత్ర విచిత్ర అనుభవాల పరంపర మనిషి జీవితం!

అంచెలంచెలుగా సాగే జీవన యాత్రలో కష్టాలు సుఖాలు అనివార్యం. మనిషికి ఎదురయ్యే సంఘటనల్లో ఏది వరమో ఏది శాపమో తెలియజెప్పేది కాలం మాత్రమే.

అంతా నావల్లే అయింది/అవుతోంది - అనుకోకూడదు. నేనే గ్రేట్ - అని విర్రవీగరాదు. విజయాన్ని తలకెక్కించుకోకూడదు.

'ఇగో' డామినేట్ చేసే పరిస్థితి రాకూడదు.

అదే జరిగితే 'దేవుడికన్నా నేనే గొప్పవాడ్ని' అనుకుంటారు. పిమ్మట 'నేనే దేవుడ్ని' అంటారు.

ఇది 'అహం బ్రహ్మాస్మి' కాదు.

శిరస్సు మీద అహం చేసే విన్యాసం!

ఒక్కసారి గీతోపదేశం గుర్తుచేసుకుంటే చాలు అన్నీ కుదుట పడతాయి. మనిషి స్థాయి స్థానం అర్థమవుతాయి.

అండ పిండ బ్రహ్మాండంలో మనిషి ఓ పిపీలికం. భగవంతుడికి సాష్ఠంగా నమస్కారం చేసేదీ పెద్దలకు పాదాభివందనం చేసేదీ ఈ సత్యం గ్రహించడానికే. అహం తగ్గించుకోడానికే!

బుద్ధి కర్మానుసారిణి

మనది కర్మభూమి. కర్మలని ఆచిరించే భూమి.

కర్మలంటే యజ్ఞయాగాది పుణ్యకర్మలని అర్థం. ఇవి ప్రపంచంలో మరెక్కడా చేయరు.

సర్వమానవాళి శ్రేయస్సుకోరి కర్మలాచరించడం సామాన్య విషయం కాదు.

అటువంటి ఈ భూమి మీద చెడుకర్మలు చేసేవారు అప్పుడూ వున్నారు. ఇప్పుడూ వున్నారు. ఎప్పుడూ ఉంటారు.

వారు చేసే పనుల్ని బట్టే వారి బుద్ధి వుంటుంది.

దుష్కర్మలు చేసేవారి బుద్ధి వికటిస్తుంది. విపరీతాలకు దారితీస్తుంది.

యజ్ఞయాగాలే కాదు పదిమంది క్షేమంకోరి చేసే ప్రతీపనీ సత్కర్మే. పుణ్యకార్యమే. వారి బుద్ధి దానధర్మాలు చెయ్యాలని, పరోపకారం చెయ్యాలని తపిస్తుంది.

దుష్టకర్మలు చేసే వారి బుద్ధి వారిని మరింత బురదలోకి లాగుతుంది. పతనావస్థకి దిగజారుస్తుంది. తమతో బాటు నమ్ముకున్న వారినీ నట్టేట ముంచుతుంది!

అక్షరాలా రాజభోగాలనుభవించిన 'సత్యం' రాజు జైలులో కటిక నేల మీద పరుండాల్సిరావడం స్వయంకృతాపరాధమే కదా!

అరిషడ్వర్గాలు

కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు ఆరూ అరిషడ్వర్గాలు.

విషయాన్ని చూసినా విన్నా ఆలోచించినా దానిపై కలిగే కోరికే కామం.

అది పొందలేనప్పుడు కలిగేది క్రోధం.

విషయాన్ని ఎలాగైనా సాధించాలనే బలవత్తరమైన వాంఛ లేదా తన దగ్గరే వుంచేసుకోవాలన్న అత్యాశ (పిసినారితనం) – లోభం.

ధర్మం అధర్మంగా తబ్బిబ్బు అయ్యే బుద్ధి ఒక రకమైన మాయ –మోహం.

తనను అధికంగా భావించుకోవడం దురహంకారం–మదం.

పరులకు తాపం కలిగించాలని కోరుకోవడం, ఓర్వలేనితనం, అసూయ –మాత్సర్యం.

ఈ ఆరూ మనిషి మోక్ష సాధనను నిరోధించే పరమ శత్రువులు.

మనిషి మొదట వీటిని జయించాలి. లోబరుచుకోవాలి. అదుపులో వుంచుకోవాలి.

'త్రివిధం నరక స్యేదం ద్వారం నాశన మాత్మనః

కామః క్రోధ స్తథా లోభస్త స్మాదే తత్త్రయం త్య జేత్'

'కామక్రోధలోభాలు మూడూ నరక ద్వారాలు. ఆత్మవినాశన హేతువులు. వివేకవంతులు వీటిని వదిలిపెట్టి తీరాలి' అన్నాడు విదురుడు.

'మదమాత్సర్య కామలోభమోహములకు దాసుడనై మోసబోతిని' అని పశ్చాత్తాపపడ్డాడు త్యాగయ్య!

గుణాలే పాశములు

సత్యనిష్ఠ, దాన గుణం, ఓర్పు, ధైర్యం కలిగివుండటం, అలసత్వం, అసూయ లేకుండా వుండటం - ఈ ఆరూ సద్గుణాలు. వీటిని వదలకుండా వుంటే జీవితం సుఖమయ మవుతుంది.

సద్గుణాలైనా దుర్గుణాలైనా వాటికి మూలగుణాలు మూడు. అవి సత్వ రజో తమో గుణాలు.

'సత్వం నిర్మలత్వాత్ ప్రకాశకమ్' సత్వగుణం స్వచ్ఛమైంది. అంచేత ప్రకాశాన్ని కలిగిస్తుంది.

'రజో రాగాత్మకం విద్ధి' రజోగుణం శబ్ద స్పర్శరూప రస గంధాలనే విషయాలపట్ల కోరిక కలిగిస్తుంది.

'తమస్త్వ జ్ఞానజం విద్ధి' తమోగుణం అజ్ఞానం వల్ల పుట్టి మానవుడ్ని మోహంలో పడేస్తుంది.

సత్వగుణ మంటే మంచితనం, పవిత్రత, శాంత స్వభావం కలిగి వుండటం. ఏ మనిషీ సంపూర్ణ సత్వగుణ సంపన్నుడు కాడు. త్రిగుణ సమ్మిళితమే మనిషి. కాకపోతే మూడింటి శాతాల్లో తేడావుంటుంది. సత్వగుణాన్ని అధికాధికం చేసుకోవాలి మనిషి.

తమో గుణం కలవారు రజోగుణమనే ఒక మెట్టు ఎక్కడానికి ప్రయత్నించాలి. రజోగుణం కలవారు సత్వగుణాన్ని పొందటానికి కృషి చేయాలి.

విశ్వామిత్రడు తపస్సు ద్వారా ఇలాంటి కృషి చేసి 'బ్రహ్మర్షి' అయ్యాడు.

తపస్సు సాధారణ వ్యక్తులు చెయ్యలేరు గనుక వారు మహాత్ములను ఆశ్రయించడం, సజ్జన సాంగత్యం, దేవాలయాలకు నియమంగా వెళ్ళటం, సద్గ్రంథాలు చదవడం, సత్కర్మలు చెయ్యడం- చెయ్యాలి.

ఇలా ఎవరు తమజీవితాలను క్రమబద్ధంగా నియంత్రించుకుంటారో వారే పుణ్యమూర్తులు. వారి సత్కర్మల ఫలమే పుణ్య సిద్ధి!

బంధువులు

'సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాతా దయా సఖాశాన్తిః

పత్నీ క్షమా పుత్రః షడేతే మను బాంధవాః'

మనిషికి నిజమైన బంధువులు ఆరుగురే అంటాడీ శ్లోకంలో చాణక్యుడు.

సత్యమే తల్లి. ఏప్రాణికైనా జన్మను ప్రసాదించేది తల్లే. ఆమే సత్య స్వరూపం.

జ్ఞానమే తండ్రి. పెంపకం, విద్య, పురోగతికి మూలం తండ్రే.

ధర్మం సోదరునిలా అండగా నిలిచి అభివృద్ధికి తోడ్పడుతుంది.

దయ మిత్రునిలా మంచి చెడులను బోధిస్తుంది.

శాంతి భార్య లాంటివి. శాంతి వున్న వారికి ఏలోటూ వుండదు.

ఓర్పు పుత్రుని వంటిది. పుత్రుడు నరకం లేకుండా చేస్తాడు. ఓర్పు జీవితాన్ని స్వర్గ తుల్యం చేస్తుంది.

ఈ బంధువుల్ని కలిగివున్నవాడే ఐశ్వర్యవంతుడు!

విజయసాధన

'ఒకటి కొని రెంటి నిశ్చల యుక్తి జేర్చి
మూటి నాల్గింట గడు వశ్యములుగ జేసి
యేనిటిని గెల్చి యారింటి నెరిగి యేడు
విడిచి వర్తించు వాడు వివేక ధనుడు'

మనిషి ఎలా ప్రర్తించాలో ఈ పద్యంలో విదురుడు చెప్పాడు.

మొదట తన బుద్ధితో చేయదగిన దేమిటో చేయకూడని దేమిటో నిశ్చయించుకోవాలి. తర్వాత తన శత్రువులు మిత్రులు తటస్థుల గురించి అవగాహన చేసుకోవాలి. అనంతరం సామదానభేద దండోపాయాలతో ప్రవర్తించడం నేర్చుకోవాలి.

పంచేంద్రియాలను జయించాలి. షడ్గుణాలను అవగతంచేసుకోవాలి. సప్తవ్యసనాలను విడిచి పెట్టాలి.

అలా చేస్తే మనిషి విజయుడవుతాడు!

విశ్వమూర్తి మీద విశ్వాసం

ఈ మహా విశ్వస్వరూపం ఓ నిగూఢ రహస్యం – ఎంతకూ అంతుబట్టని అగాధ సదృశం!

గ్రహాల గమనం నుంచి ప్రాణుల ఆకలిదప్పులు తీరడం వరకూ ఎన్నో చిత్రాలు! మరెన్నో విచిత్రాలు!

అవి శోధించడానికి మనిషి పరిశోధనలు చేస్తూనే ఉన్నాడు. చేసిన కొద్దీ అన్వేషిస్తున్న కొద్దీ మరిన్ని సవాళ్ళు ఎదురవుతున్నాయి తప్ప విశ్వవ్యాప్త శక్తి ఆనుపానులు తెలుసుకోలేక పోతున్నాడు.

ఈ చరాచర జగత్తుకు మూలాధారమైన మహత్తర శక్తేదో వుంది.

అది దేవుడు కావచ్చు.

దేవుడే అనుకుంటే ఆయన దుష్ట శిక్షణ చేస్తాడని విశ్వసిస్తే చాలు మనిషికెంతో ధైర్యం చిక్కుతుంది. భరోసా లభిస్తుంది. భద్రతా భావం కలుగుతుంది.

ధీమాగా ముందుకు సాగిపోతాడు.

అమెరికా ప్రెసిడెంటు ఒబామా వెంట ఎప్పుడూ ఆంజనేయస్వామి డాలర్ ఉంటుందిట. ఇండోనేషియాలో పెరుగుతున్నప్పుడు దాన్ని ఎవరో ఇచ్చారట. హనుమంతుని రూపాన్ని తాకితే కొత్త శక్తి వచ్చినట్టుగా ఉంటుందంటాడు బరాక్ ఒబామా!

జీవన యానం

మనిషి జీవన ప్రయాణం లక్ష్యంతో కూడిన నదీ ప్రవాహం సాగాలి. ఉప్పెనలా వరదలా ఉండకూడదు. నదీ ప్రవాహానికి దిశ లక్ష్యం స్పష్టంగా ఉంటాయి. వరదకు ఉండవు.

ఊయలకీ స్మశానానికీ మధ్య మనిషి చేయాల్సిన సత్కార్యాలు చాలా ఉన్నాయి. అవి నిర్వర్తించాలి.

బతుకు తెరువు కోసం రకరకాల వృత్తులు చేబడతాం. అంతమాత్రాన మనుషులం కాకుండా పోము. గనుక మనిషితనాన్ని ఎన్నడూ కోల్పోకూడదు.

పాపపుణ్య భావన కలిగివుండాలి. అవి సత్కర్మలు చేసేలా పురిగొల్పడానికే. మనిషి చేష్టలను నియంత్రించి సన్మార్గ వర్తనుడ్ని చెయ్యడానికే.

పాపభీతి పాపకార్యాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తుంది. భయపెడుతుంది. హెచ్చరిస్తుంది.

తామారాకు మీది నీటి బొట్టులా ప్రవర్తించాలి. కనీసం వానప్రస్థంలో అలా బ్రతకాలి. చివరిదశలో కొన్నేళ్ళైనా స్వార్థం విడిచి పరహితార్థం బ్రతకటం నిజంగా ఎంత గొప్పభావన! ఆదర్శం!

ప్రపంచంలోని ఏ జాతిలోనూ వానప్రస్థంలాంటి అద్భుత స్థితిలేదు! అసలలాటి భావనే లేదు!

సఫల జీవితం

జీవితాన్ని దారిపొడవునా సంపన్నం చేసుకోవాలి. ప్రేమతో అభిమానంలో అనురాగంతో అనుబంధాలతో పరహిత భావనల్తో నింపుకోవాలి.

వివాహం ద్వారా సంక్రమించిన హక్కుల్ని సద్వినియోగం చేసుకోవాలి. బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించాలి.

గృహం శయ్య వస్త్రం స్త్రీ ఆభరణం పుష్పం గంధం తాంబూలం - అనే అష్ట విధభోగాలు అనుభవంలోకి వస్తేనే మనిషి జీవితం తృప్తిగా సాగుతుందన్నారు పెద్దలు. ఈ సంగతి గుర్తుంచుకుని చక్కగా తీర్చిదిద్దుకోవాలి.

అరిషడ్వర్గాలని అదుపులో ఉంచుకుని ఋణత్రయం తీర్చుకుని గృహస్థ ధర్మాలను నిర్వర్తించాలి. తద్వారా జీవితాన్ని సఫలం చేసుకోవాలి. సంతోషాన్ని శాంతిని తనచుట్టూ ఉన్నవారికి కూడా పంచిపెడుతూ జీవించినప్పుడే అర్థం పరమార్థం ఏర్పడతాయి.

ఏదోలా బ్రతికేసెయ్యడం జీవిత లక్ష్యం కారాదు. పుట్టలోని చెదల్లా పుట్టి గిట్టడమూ కూడదు. పశుపక్షులకు భిన్నంగా బ్రతకాలి. ఉత్కృష్టమైన మానవజన్మ ఎత్తినందుకు దానిని సార్థకం చేసుకోవాలి.

రెప్పపాటులో ముగిసిపోయే జీవితానికి ప్రయోజనం ఉండాలి. పరమార్థమూ ఉండాలి. అప్పుడే జీవితం సఫలమవుతుంది. లేకపోతే నిరర్థకమైనట్టే.

జీవనసాఫల్యత లభించాలంటే ధనం ఉన్నప్పుడే దానం చెయ్యాలి. శక్తి ఉన్నప్పుడే సత్కర్మలు చెయ్యాలి. నిస్వార్థ సేవ దైవ ప్రీతిని కలిగిస్తుంది. మానవసేవే మాధవసేవ!

దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఏ క్షణంలోనైనా మృత్యువు పలకరించవచ్చు. జీవితం అశాశ్వతమైనదని మరువరాదు. ఆయుష్షు, ఆరోగ్యం, శక్తి, సంపద, ఉన్నప్పుడే సత్కార్యాలు చేయాలి. మంచి కార్యాలను వెనువెంటనే చేయాలి. ఆలస్యం చేయవద్దు. వాయిదా వేయవద్దు.

"ఇతరుల కొరకు జీవించే వారే నిజంగా జీవించేవారు, మిగిలినవారు మృతప్రాయులే!" అన్నారు స్వామి వివేకానంద.

జీవిత లక్ష్యం కేవలం జీవించడమే కాదు ఉన్నతంగా జీవించడం!

దాన ధర్మాలు

శిబి, దధీచి, బలి, కర్ణుడు ఆదిగా గలవారు దానం యొక్క విశిష్టతను చాటి చెప్పారు.

విషమపరిస్థితిల్లో, ఉన్నప్పటికీ కర్ణుడు బంగారు, పన్ను పీకి దానం చేశాడు. శిబి తన శరీరాన్నే కోసి ఇచ్చాడు. 'పరోపకారార్థ మిదం శరీరమ్' అని నమ్మిన వారిదే తృప్తి ఆనందం కీర్తి మోక్షం!

సంపాదించిన దాన్ని అనుభవిస్తే చాలదు. కొంతైనా దానం చెయ్యాలి. ధర్మ కార్యాలకు సాయపడాలి. దీనులకు తోడ్పడాలి.

పరహితం కోరే వాడే ఉత్తముడు. మానవసేవే మాధవసేవ అని గుర్తించిన వాడే మహోన్నతుడు.

తన ధనాన్ని, సుఖాన్ని, ఆనందాన్ని పదిమందికి పంచడంలోనే మానవజన్మ సార్థకత వుంది.

'దేవో దానాచ్ వా' – దానం చేసేవారు దేవతలన్నారు మహర్షి యాస్కుడు.

'ఓం శతహస్త సమాహర సహస్ర హస్త సం కిర।

కృతస్య కార్యస్య చేహ స్ఫాతిం సమావహం॥'

ఈ అథర్వవేదశ్లోకం ఏమంటుందంటే "రెండు చేతులుగల నీవు వంద చేతులవాడవై ధనాన్ని సంపాదించు. వేయి చేతుల వాడవై త్యాగం చేయి. నీ సత్కర్మ ఫలమును బాగుగా పొంది అనుభవించు."

ఇది 'వేదవాక్కు'. అవశ్యం ఆచరణీయం!

ప్రార్థనీయం

మనిషి భగవంతుడ్ని ప్రార్థించాలి. ధనదాన్యాలూ ఆయురారోగ్యాలూ ఇమ్మని కోరడానిక్కాదు.

'అనాయాసేన మరణం

వినా దైన్యేన జీవనం।

దేహాంతే తవ సాయుజ్యం

దేహి మే పార్వతీపతే॥'

ఎటువంటి యాతనా పడకుండా చాలా సులభంగా మరణించాలి. ఎలాంటి దీనావస్థకూ దురవస్థకూ లోనుకాకుండా గౌరవప్రదంగా జీవించాలి. మరణానంతరం పరమేశ్వరునిలో ఐక్యం కావాలి.

ఈ మూడు వరాలనూ ప్రసాదించమని ప్రతివారూ ప్రార్థించాలి!

తరచి చూస్తే ఈ నాలుగు మాటల్లోనే భారతీయ ఆధ్యాత్మిక దృక్పథం తేట తెల్ల మవుతుంది!

జీవనవేదం

జీవితమంటే ఉత్సాహంగా, ఆనందంగా జీవించడమే. ప్రతి మనిషీ నవ్వుతూ ప్రసన్నంగా వుండేందుకు కావలసిన సానుకూల పరిస్థితులను తెలుసుకోవాలి. సమకూర్చు కోవాలి.

వేదాధ్యయనం, ప్రసన్నత, శాంతం, తృప్తి, ఆనందం, ఇంద్రియ నిగ్రహాలతో జీవించాలి.

మానవ జీవితానికి రెండే అంచులు – పుట్టుక, చావు. ఈ వంతెన మీద చేసే కొద్ది పాటి ప్రయాణమే జీవితం.

మనిషి చావును ఇతరులు గుర్తించాలి. అంటే సత్ప్రయోజనం కోసమే అతడి జీవితం అంతం కావాలి.

తనకోసమే జీవించేవాడు ఎంత బాగా బతుకుతున్నా అది బతికినట్టుకాదు. చచ్చినట్టే. తనకోసం తాను ఎవరైతే జీవించరో వారు చనిపోయినా బతికినట్టే!

కర్తవ్యాన్నే తప్ప కర్మ త్యాగాన్ని భారతీయ వాఙ్మయం బోధించదు. జీవితం నుంచి పారిపోవడాన్ని సమర్థించదు.

మెలకువ రానంత వరకు స్వప్నం ఎలా అయితే వాస్తవమో పారమార్థిక జ్ఞానం కలిగేంత వరకూ ఈ ప్రపంచమూ వాస్తవమే అంటుంది భారతీయ తత్వ చింతన.

మనిషికి లభించిన సమయం చాలా తక్కువ. కనుక సోమరితనం విడిచి పెట్టమంటుంది.

'ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్ని బోధిత'

'మేలుకోండి. జాగరూకులు కండి. ప్రస్తుతం మీకు లభించిన మానవ జన్మ ఎంత అమూల్యమైందో అర్థం చేసుకోండి. సద్వినియోగం చేసుకోండి' అంటుంది కఠోపనిషత్తు.

'విశ్వదానీం సుమనసః స్యామ' ఉత్సాహంగా జీవించడమే జీవితం అంటోంది ఋగ్వేదం.

సుదీర్ఘమైన ఆయువుతో జీవితాన్ని సాగిస్తూ నృత్య హాస ఆనంద ప్రసన్నతలతో జీవించాలి. సంస్కృతి సంప్రదాయం సంస్కారాలకు అనుకూలంగా మనిషి జీవనయాత్ర సాగాలి!

73

మహాభినిష్క్రమణ

పుట్టుక వున్న ప్రతిదానికీ చావు ఉంటుంది.

ధనవంతులైనా పేదవారైనా మంచి వారైనా చెడ్డ వారైనా మహాత్ములైనా కిరాతకులైనా సెలవంటూ ఈ లోకాన్ని వదలి వెళ్ళాల్సిందే.

యక్షుడు "మానవుడు దేనికి ఎక్కువ భయంపడతాడు? దేని గురించి ఎక్కువ దిగుల పడతాడు?" అని ప్రశ్నించగా ధర్మరాజు ఇచ్చిన సమాధానం "మృత్యువు గురించి భయపడతాడు. వార్ధక్యం గురించి దిగులు పడతాడు !"

దిగులుపడినా వార్ధక్యం వస్తుంది. భయపడినా మృత్యువు వచ్చి తలుపు తడుతుంది. అది సృష్టి ధర్మం!

ఈ ప్రపంచమనే నాటకరంగంలో అంతా పాత్రధారులే. తమ తమ పాత్రల్ని చెయ్యగలిగినంత బాగా చెయ్యాలి. పూర్తికాగానే వెళ్ళిపోవాలి. ఇది అర్థం చేసుకుంటే దిగులే ఉండదు. ఉండేదంతా ఆనందమే!

కాలాన్ని సద్వినియోగం చేసుకుని చిరునగవుతో మహాభినిష్క్రమణకు సిద్ధమయ్యే వారే ధన్యులు!

ఎవరూ అతీతులు కాదు

పుట్టుట గిట్టుట కొరకే.

"జాతస్య హి ధృవో మృత్యుః"

పుట్టిన వారికి చావు తప్పదు. మరణాన్ని వాయిదా వెయ్యలేరు. వ్యతిరేకించలేరు. దాక్కోనూలేరు.

మరణాన్ని తప్పించుకోలేరు. ప్రేమామృతం తనివి తీరా తాగినాసరే అది తప్పదు!

చనిపోవడం తథ్యం గనుక దాని గురించి గాకుండా ఎప్పుడు, ఎలా అన్నదే ఆలోచించాలి.

చావు అంటే అంతా ఉంటారు. అన్నీ ఉంటాయి – అతడు లేక ఆమె తప్ప!

అనివార్యమైన మరణం గురించి దిగులు పట్టం భయపట్టం శోకించడం అనవసరం! వ్యర్థం!

నిజానికి మనిషి బతికి ఉన్నంతకాలం వారి దరికిరాదు మరణం. అది వచ్చేసరికి వారు ఉండనే ఉండరు!

జీవించడం, మరణించడం – ఇవి రెండు కాదు. ఒకటే జీవితం, పెరిగి పెరిగి చివరకు మృత్యు రూపంలో వికసిస్తుందంతే!

మరణం కాలానుగుణంగా సంభవించే పరిణామం. అందుకనే చనిపోయినప్పుడు 'కాల ధర్మం' చెందారనేది!

పశ్చాత్తాప పడాలి

అవసాన దశలో తప్పులు నేరాలు పాపాలు దారుణమైన అశాంతికి గురిచేస్తాయి. ఆందోళన పెడతాయి. భగవంతుడెలాంటి శిక్ష విధిస్తాడనోనన్న భీతి కుదిపేస్తుంది.

చేసిన పాపాలకు పశ్చాత్తాప పడాలి. ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

దిద్దుకోగల అవకాశం ఉంటే వినియోగించుకోవాలి.

పోయేటప్పుడు పట్టుకు పోయేదేమీ ఉండదు. ఎన్ని కోట్లు సంపాదించినా చిల్లిగవ్వ కూడా తీసుకెళ్ళలేరు. ఎంత ప్రేమ ఉన్నా ఒక్కరూ మనతో రారు.

ఒంటరిగా వచ్చాం. ఒంటరిగానే వెళ్తాం.

ఈలోకంలో కొచ్చేప్పుడు శరీరమైనా ఉంది. పోయేప్పుడు అది కూడా వదలి వెళ్ళాల్సిందే.

ఏ మాత్రం వీలున్నా చేసిన తప్పులు కొన్నైనా దిద్దుకుంటే కొంతైనా మనశ్శాంతి దక్కుతుంది.

చనిపోయాక తిట్టుకునే వారి సంఖ్య శాపనార్థలు పెట్టే వారి సంఖ్య కొంతైనా తరుగుతుంది!

అదే సమయంలో అద్భుత క్షమాగుణం ప్రదర్శించాలి. అన్యాయం అధర్మం చేసిన వారిని నిండు మనస్సుతో క్షమించాలి. ఎవరి పాపం వారు అనుభవించక తప్పదనుకోవాలి. మనస్సులోంచి ద్వేషభావాన్ని తుడిచెయ్యాలి.

దైవస్మరణ

ఇన్నేళ్ళూ ఎలాగడిపినా నాస్తికులుగా మసలినా చివరి దశలో మాత్రం దేవుడుంటే బావుడ్నన్పిస్తుంది.

ఆ తర్వాత దేవుడున్నాడన్న విశ్వాసమూ కుదురుతుంది.

ప్రశాంత మరణం అనుగ్రహిస్తే బావుణ్ణు వైతరిణిని దాటిస్తే బావుడ్ను - అనీ అన్పిస్తుంది. ఆ ఉత్తరక్షణాన భక్తిభావం పొంగి పొర్లుతుంది.

ఆ దశ కన్నా ముందే దైవ స్మరణ ప్రారంభించాలి. భగవద్గీత పఠించాలి. లేదా వినాలి. ప్రాపంచిక చింతన వదలి ఆధ్యాత్మిక చింతనలోనే గడపాలి. అలాచేస్తే మృత్యు భయం తగ్గి తీరుతుంది.

మానసిక బలం పెరుగుతుంది. మనస్సు ప్రశాంత కాసారమవుతుంది.

దేవుడు చల్లగా చూస్తాడన్న కోరిక, తృప్తి మనిషి పాలిట శ్రీరామరక్ష అవుతుంది.

జన్మ రాహిత్యమే కోరుకుంటారో మళ్ళీ మనిషిగా పుట్టాలనే కోరుకుటారో అది వారి వారి ఇష్టం!

పునరపి జననం

ఆత్మకి చావు లేదంటారు.

ఒక చొక్కా విడిచి మరోచొక్కా ధరించినట్టు ఆత్మ దేహాల్ని మారుస్తూంటుందంటారు.

పునరపి జననం పునరపి మరణం.

పుట్టుట చనిపోవుట మళ్ళీ పుట్టుట మళ్ళీ చనిపోవుట - ఇదో చక్రభ్రమణం. తిరుగుతూనే ఉంటుంది.

ఆ మాటల్లో ఎంత నిజముందో తెలీదు. కాని మళ్ళీ పుడతా మంటే ఏదో ఆశ, మరేదో ఆనందం, ఇంకేదో భరోసా కలుగుతాయి.

'చనిపోయినా ఫర్లేదు మళ్ళీ పుట్టేస్తాంగా' అన్న భావం ఎంతో తృప్తినిస్తుంది. మరణానికి దాసోహమయ్యే ధైర్యాన్నిస్తుంది.

అందుకే పెద్దలు పునర్జన్మ ఉందని చెబుతూంటారేమో మరి!

వంశ వృక్షం

ఒక్కటి మాత్రం నిజం.

చనిపోయినా కాని కొడుకుల్లో మనుమల్లో ముని మనుమల్లో బ్రతికేవుంటాడు మనిషి.

వారి రక్తం తరతరాలుగా కొనసాగుతుంది.

బహుశా అందుకే ఆత్మకి మరణం లేదన్నారేమో!

వారిచ్చే ఆస్తి పాస్తులు వారసత్వంగా తర్వాతి తర్వాతి తరాలకు సంక్రమిస్తుందో లేదో గాని వారి జీన్స్ మాత్రం సంక్రమిస్తాయి.

మనిషి ఉనికి ఎప్పటికీ అతడి వంశ వృక్షంలో భద్రం.

ఆ రకంగా మనిషి ఎప్పటికీ చిరంజీవే!

ధన్యజీవి మానవుడు

మనిషిగా పుట్టడం ఓ గొప్ప వరం. మానవజన్మ సర్వోత్కృష్టమైంది.

అలాంటి జన్మ లభించింది.

తల్లి, తండ్రి, భార్య లేక భర్త, తోబుట్టువులు, సంతానం, స్నేహితులు, హితులు,



బంధువులు, అభిమానులు – ఎందరిదో ప్రేమ పొందాడు.

అమృతం కన్నా మిన్న యైన ప్రేమలో మునిగితేలాడు. అలాంటి ప్రేమనే పంచాడు.

మనిషిగానే గాక కూతురు లేక కొడుకు, భార్య లేక భర్త, తల్లి లేక తండ్రి మామ్మ లేక తాత, తదితర పాత్రల్ని చక్కగా పోషించాడు. కుటుంబ బరువు బాధ్యతలు మోశాడు. కర్తవ్యాన్ని నిర్వహించాడు.

ఫలానా వారి కొడుకులం/కూతుళ్ళం/మనవలం – అని అతడి/ఆమె పేరు చెప్పుకుని గర్వించే వారసులున్నారు.

ఇంతకంటే ఎవరికీ కోరుకోవాల్సిందేమీ వుండదు.

అంచేత ఈ భూమ్మీది అదృష్టవంతుడు ముమ్మాటికీ మనిషే!

'కర్మణ్యే వాధికారస్తే' అన్నారు గీతలో.

కర్మ మీదే మనిషికధికారం ఉంది. ఫలం మీద లేదు. అయినా కర్మ నిర్వర్తిస్తూండాల్సిందే!

మానసికంగా సిద్ధంకండి

"ఈ ప్రపంచంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయ ఏమిటి?" అనే ప్రశ్నకు ధర్మరాజు మహాభారతంలో ఇచ్చిన సమాధానం–" ప్రతిరోజూ ప్రతిక్షణమూ తనకళ్ళముందే ఇంతమంది మనుషులు మరణిస్తూండటం చూస్తూ కూడా తనకు మాత్రం ఎప్పటికీ మరణం రాదని మనిషి భ్రమపడుతూ ఉండటం అన్నింటికన్నా ఆశ్చర్యకరమైంది!"

మనిషి ఎప్పుడూ చావుకు సిద్ధపడి ఉండాలి. ఎందుకంటే మనిషి పుట్టినప్పుడే అతని చావు కూడా పుడుతుంది. అతను నిద్రిస్తున్నా మెలకువగా ఉన్నా అతన్ని వెన్నంటే ఉంటుంది మృత్యువు.

పండిన ఆకు రాలిపోవటం ప్రకృతి సూత్రం.

మొత్తం దేహం శిథిలమై పనికి రాకుండా పోయినప్పుడు ఆ దేహాన్ని విడిచిపెట్టక తప్పదు. అది ప్రకృతి ధర్మం!

అంతిమ ఏర్పాట్లు

అంతిమ ఏర్పాట్లు కూడా చేసుకోవచ్చు. ఎవరికీ భారం కాకూడదనుకోవడం తప్పుకాదు.

అంత్యక్రియల కోసం కొంత డబ్బు అట్టే పెట్టాలి. ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ సమస్యా కలక్కుండా జాగ్రత్త తీసుకోవాలి.

మంచివాడ్ని మరణమందు చూడమన్నారు. ఎవరెలాంటివారో మరణం చెబుతుందని అర్థం. మంచిగా బ్రతికే ఉండి ఉంటారు గనుక సునాయాస మరణమే లభిస్తుంది. ధైర్యంగా ఉండొచ్చు.

మనిషి చనిపోయిన తరువాత అతని శరీరానికి (శవానికి) చేసే అంతిమ సంస్కారం అంత్యేష్టి. దాని తర్వాత శరీరానికి చేసే మరో సంస్కారం ఏదీ లేదు.

అందుకోసం పుత్రుడు లేక మనవడు దగ్గరుండేలా లేక సమాయాని కొచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

శోకం బాధ మరణం లేని ఇల్లు ఉండదన్న బుద్ధుడి మాటలొక్కసారి గుర్తుచేసుకోవాలి. అయిన వాళ్ళకి గుర్తు చెయ్యాలి.

మరణించిన వారి గురించి శోకించక్కర్లేదు. సృష్టి ధర్మాన్ననుసరించి కాలధర్మం ఉంటుంది.

మరోసంగతి. **మరణాంతాని వైరాణి** – అన్నారు. మరణ సమయంలో మానవడు తన పాత పగలను విద్వేషాలను విస్మరించి విసర్జించి మంచి మనస్సుతో ఈ లోకాన్ని వదలి వెళ్తాడు. వెళ్ళాలి!

అవయవదానం

చనిపోయాక కూడా బ్రతికుండే అద్భుత అవకాశమొకటి ఉంది.

అది అవయవదానం.

కళ్ళను దానం చెయ్యొచ్చు. ముందే అనుమతి ఇచ్చినా ఇవ్వకపోయినా చనిపోయిన 6-8 గం.లోపు ఫోన్ నెం. 1919 కి లేదా 040-23544504 కి తెలియపరిస్తే స్వచ్ఛంద సంస్థల డాక్టర్లొచ్చి తీసుకెళ్తారు. ఇద్దరు అభాగ్యులకు దృష్టి ప్రసాదిస్తారు.

నేత్రదానమిస్తే మొత్తం కళ్ళను పెరికించి వేయరు. నల్లగుడ్డుపై నుండే కార్నియా మాత్రమే తీసుకుంటారు. బీపీ, సుగర్ ఉన్నా, కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నా సరే నేత్రదానం చేయొచ్చు.

శరీరంతో బాటు కళ్ళూ కాలి బూడిదయ్యే బదులు ఇద్దరికి చూపు ప్రసాదించడం ఆ రకంగా చనిపోయాక కూడా మరొకరి కళ్ళల్లో కాంతి అవ్వగలగటం మహా అదృష్టం!

తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ కోమాలో ఉంటే, లేదా బ్రెయిన్ డెడ్ కేసుల్లో నేత్రాలు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె దానంచేయవచ్చు! ఇందుకు బంధువులు చొరవతీసుకోవాల్సివుంది.

ఈ లోకాన్నుంచి నిష్క్రమిస్తూ నలుగురికి జీవితాన్నివ్వగలగడం శరీరానికీ, జన్మకీ ధన్యత చేకూర్చుకోవడమే!

మహాభినిష్క్రమణ

'ఇక ఏడు రోజులే బతుకుతావు' అన్నప్పుడు పరీక్షిత్తు బెంగతో ఏడుస్తూ కూర్చోలేదు. కంసుడిలా ప్రాణ భయంతో ఏడిపిస్తూనూ కూర్చోలేదు.

భాగవత శ్రవణం ద్వారా చనిపోతానన్న స్థితి నుంచి తాను శరీరాన్ని విడిచి పెడ్తున్నానన్న స్థితికి చేరాడు.

మరణం సమీపించిన వ్యక్తి శరీరాన్ని విడిచేప్పుడు ఎట్లాంటి భావముంటే అట్లాంటి గతే కలుగుతుందంటుంది శాస్త్రం.

అందుకే మరణావస్థలో ఉన్న వ్యక్తి చుట్టూ చేరి బంధువులు భగవన్నామస్మరణ చేయాలంటారు. మరణ సమయంలో భగవంతుని భజిస్తే 'సద్గతి' కలుగుతుందని పెద్దల ఉవాచ.

జీవుడు శరీరం నుంచి ప్రాణాలతో వెళ్ళిన తరువాత శరీరాన్ని శాస్త్ర విధిననుసరించి దహనం చేయాలి. అంతిమ సమయంలో 'ఓం' స్మరించాలని వేదం చెబుతోంది.

'ఓం' అంటే రక్షకుడని అర్థం. 'ఓం' నామాన్ని స్మరించడం వలన శరీరంలోని ప్రాణాలకు ఊర్ధ్వగతి కలుగుతుందని ఋషి వాక్కు.

మృతశరీరాన్ని దహనం చేసినప్పుడు అది దేహంలోని మూల తత్వాలు – పంచభూతాలు – పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశంలో కలిసిపోతాయి. ఇది మరణ ధర్మం!

అంచేత –

ఈ ప్రపంచం నుంచి మౌనంగా సెలవు తీసుకోవాలి. తలవంచుకుని నిష్క్రమించాలి. తృప్త మనస్సుతో కన్ను మూయాలి!

'తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ'



సింహప్రసాద్

వీరి పూర్తి పేరు చెలంకూరి వరహ నరసింహ ప్రసాద్. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలోని మల్లవరం వీరి స్వగ్రామం. మత్స్యపురి, నరసాపురంలలో విద్యాభ్యాసం చేసారు.

ఇండియన్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తూ 2001లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులోని 'శ్రీశ్రీ అకాడమి' డైరెక్టర్‌గా, 'శ్రీశ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్' ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు

వీరివి 42 నవలలు, 182 కథలు, మూడు నాటికలు, 10 కవితలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. 17 నవలలు సీరియల్స్‌గా వచ్చాయి. కొన్ని కథలు కన్నడంలోకి అనువదింపబడ్డాయి.

వీరి కథా సంపుటాలు 'వేళ్ళు' (1996), 'బోన్సాయ్ మనుషులు' (2007) ప్రముఖుల, పత్రికల ప్రశంసలందుకున్నాయి.

పదకొండు కథలకు, ఒక నాటికకు, రెండు కవితలకు బహుమతులు అందుకున్నారు

అంతేగాక వీరి నవలలు 'కూలిబతుకు' 'పుడమితల్లికి పురిటినొప్పులు' 'స్వేచ్ఛా ప్రస్థానం' విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారి నవలల పోటీలోను, 'అసురగణం' 'నైవేద్యం' స్వాతి అనిల్ అవార్డుల్నీ, 'దబ్బు' ఆంధ్రజ్యోతి నవలా ప్రియదర్శినిలోనూ, 'ఆడబొమ్మ' జ్యోతి మాసపత్రికలోనూ, 'మిస్ స్వర్ణహంస' 'నువ్వో సగం నేనో సగం' 'అఖి' స్వాతి సపరివారపత్రిక నవలల పోటీలోనూ బహుమతులు గెలుచుకున్నాయి.

వీరి నవల 'వెలుగులతీరం'కు విశ్వసాహితి-శ్రీ త్యాగరాయగానసభ (హైదరాబాద్) వారి 2009 ఉగాది పురస్కారం లభించింది.

శ్రీశ్రీ, శరత్‌బాబు, రా.వి.శాస్త్రి, రంగనాయకమ్మ వీరి అభిమాన రచయితలు.

Simha Prasad's

Encyclopedia of Hindu Marriage and Life

వివాహవేదం

వివాహం జీవితానికి కర్త కర్మ క్రియ !

నిజానికి మనిషి జీవితం యావత్తూ వివాహం చుట్టూతే తిరుగుతుంది. వివాహ ప్రాముఖ్యత, వివాహ మంత్రాల అర్థాలు, ఆంక్షలు, ఆకాంక్షలు, ప్రమాణాలు, వివాహకాండలోని వివిధ అంశాలు, ప్రత్యేకతలు - అన్నీ అంతా ఆవిష్కరించిన వివాహ విశ్వరూపం ఈ వివాహవేదం!

దాంపత్యం సప్తవర్ణశోభితం!

ఆనందదాయక వైవాహిక జీవితానికి, దాంపత్య జీవితాన్ని సవ్యంగా సమగ్రంగా అవగాహన చేసుకోడానికి, రసవంతంగా మాధుర్యభరితంగా తీర్చిదిద్దుకోడానికి, చైతన్యవంతం మరియు ఆహ్లాదకరంగా మలచుకోడానికి చక్కని దిక్సూచి ఈ దాంపత్యవేదం!

జీవితం షడ్రుచుల సమ్మేళనం!

ధర్మబద్ధమైన అర్థకామాలను సాధిస్తూ గృహస్థధర్మాలు నిర్వహిస్తూ భౌతిక భోగాల వ్యామోహంలో కొట్టుకుపోకుండా హిందూ దృక్పథాన్ని తాత్వికచింతనని అర్థం చేసుకుని జీవితాన్ని అర్థవంతంగా మలచుకోడానికి, జీవన వికాసానికి, జీవిత సాఫల్య సాధనకి కరదీపిక ఈ జీవనవేదం!

వివాహం, దాంపత్యం, కుటుంబం, జీవితం - ఈ నాలుగు స్తంభాల మీద ప్రముఖ రచయిత సింహప్రసాద్ నిర్మించిన అపురూప సౌధం ఈ గ్రంథం!

ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకనేస్తం !

ప్రతి ఇంటా ఉండాల్సిన గ్రంథరాజం !!

శ్రీశ్రీ ప్రచురణలు, హైదరాబాద్